శ్రీపాద రాజం శరణం ప్రపద్యే...

"శ్రీపాద శ్రీ వల్లభ లీలా వైభవం" అనే ఈ గ్రంధం శ్రీపాదులవారు తమ 16వ యేట సన్యాసదీక్ష తీసుకుని పీఠికాపురము నుండి బయలుదేరి వివిధ తీర్థాలను దర్శించి చివరకు కురువపురము చేరినప్పటినుండి మొదలు గురు ద్వాదశి రోజు కృష్ణానదిలో నిర్ధారితం చెందువరకు మరియు చెందిన తరువాత (క్రీ .శ 1337- క్రీ .శ 1350) వారి లీలలు ఈ గ్రంధంలో గ్రందస్థం చెయ్యబడ్డాయి.

సంపూర్ణ శ్రీపాద శ్రీ వల్లభ చరితామృతం శ్రీపాద శ్రీ వల్లభుల బాల్య లీలలను ఎక్కువగా వివరిస్తే, ఈ "శ్రీపాద శ్రీ వల్లభ లీలా వైభవం" శ్రీపాద శ్రీ వల్లభుల యతి లీలలను వివరిస్తుంది. ప్రతీ శ్రీపాద శ్రీ వల్లభుల భక్తుడూ చదివితీరవలసిన అరుదైన గ్రంధమిది.

# శ్రీపాద శ్రీవల్లభ లీలా వైభవము



జై గురుదత్తా శ్రీ గురుదత్తా

# శ్రీపాద శ్రీవల్లభ లీలా వైభవము

**(శ్రీ వల్లభాపుర (కురువపుర) క్షేత్ర మాహాత్మ్యము)**

**"దిగంబరా - దిగంబరా - శ్రీపాదవల్లభ దిగంబరా"**

ఓం గం గణేశాయ నమః, ఓం సరస్వత్యై నమః, శ్రీ గురుభ్యో నమః,

శ్రీ గురుదత్తాత్రేయాయ నమః, శ్రీపాద శ్రీవల్లభాయ నమః

## ప్రథమాధ్యాయం

## ప్రార్థన

హే! గణనాయకా! సంకల్ప సిద్ధికొరకు నీ పాదముల చెంత శిరసు నుంచి మ్రొక్కుచున్న నా మస్తిష్కము నందు సద్గురు లీలలను కీర్తించుటకు కావలసిన బుద్ధిశక్తిని ప్రసాదించు స్వామీ! తండ్రీ! మూలాధార క్షేత్ర నిలయుడవని నిన్ను కీర్తించి యోగులు నీ దివ్యశక్తిని ప్రాప్తింప జేసుకొనియున్నారు. విద్యలన్నింటికీ ఆద్యుడవు నీవే! జ్ఞానస్వరూపా! నీ స్వరూపుడే అయిన జగద్గురు శ్రీ దత్తాత్రేయుని ప్రథమావతారుని లీలలను కీర్తించు భాగ్యమును కలిగించి నా జన్మ తరింపజేయుము. తద్వారా లోకకల్యాణ కార్యము కావించుము. హే! శూర్పకర్ణా! మా మొరలాలించి మమ్ము కృతార్థులను గావింప నీ చరణారవిందములకు సహస్ర ప్రణామములు సమర్పించుచున్నాను.

అమ్మా! వాణీ! వీణాపాణి! చైతన్యత్వము నొందని జడమనసును నీ దివ్య చైతన్యముతో మేల్కొలుపుటకై చేత వీణను ధరించి నాదమును వినిపించుచు మాలో సకల తలంపులకు కారణభూతురాలవై యున్నావు. నీ అనుగ్రహము కలిగిన వ్యక్తి విద్వాంసుడనిపించుకొనుచున్నాడు. అంతర్గతంగా నీ దివ్యశక్తియే వ్యక్తియందు ప్రకాశించుచున్నది. కీర్తి ప్రతిష్ఠలను కలిగించుచున్నది. నీ ప్రభావ మెఱుగుటకు నిన్ను ఉపాసించి, ఎందరో కీర్తిప్రతిష్ఠలను వర్జించి, సమస్తము నీ కృపయని భావించి ముక్తిని కరతలామలక మొనర్చుకొన్నారు. కోరిన వారికి కొంగు బంగారైన ఓ! జగన్మాతా! శ్రీ దత్తావతారులలో ప్రథముడైన శ్రీపాదశ్రీవల్లభుల లీలామృతధారల పట్టి గ్రంథస్థ మొనర్చుటకు కావలసిన వాక్కును, శక్తి, యుక్తులను ప్రసాదించుము తల్లీ! నీ పాదపద్మములకు వేవేల నమస్కారములు! చేకొనుమమ్మా!

హే! పాండురంగా! పండరీనాధా! హే! నారాయణా! శేషశయనా! నిన్ను నమ్మి శరణుపొందిన జీవుల నుద్ధరించుటలో దక్షుడవు. “హరి” యను రెండక్షరములు - హరియించును పాతకములు” అనునార్యోక్తి ఎన్నడూ వృధాపోలేదు. ఆశ్రితుని పాప ప్రక్షాళన మొనరించి ఉత్తమగతులు కల్పించుటకై నీవు కొన్నిసార్లు నిందలను మోసెదవు. నీ సృష్టిలోని సకల జీవులయందు కరుణనే నిరంతరము ప్రసరించెదవు. వారివారి కర్మానుసారము వారు గ్రహించగలుగుదురు. ఎన్ని బాధలైనా, కష్టాలైనా సహించి, నీ కృపకై నిలిచి ప్రార్థించువారిని అపార ప్రేమతో ఆదుకొని రక్షించి అక్కున జేర్చుకొందువు. శ్రీహరీ! దత్తా! శరణు! శరణు! నీ కరుణాపూరిత దృష్టిని మాపై ప్రసరింపజేసి కృతయుగాన దత్తుడవై జన్మించి, ఈ కలియుగాన దత్తాత్రేయ ప్రథమావతారముగా, శ్రీపాద శ్రీవల్లభులుగా అవతరించి నా బోధలు, లీలలను భక్తుల కందించు ఈ ప్రయత్నమును సఫలము చేయుటకై నీకు కైమోడ్చి వందన శతంబులర్పించుచున్నాను.

శివశంకరా! గౌరీదేవీ! ఆదిదంపతులైన మీ పాదాబ్జములకు శతసహస్రాధిక వందనములు. మీ శక్తి సంపన్నత్వమును భువిపైన నిల్పి, కొలిచేవారికి కోరికల నిచ్చు కల్పతరువులుగా ప్రసన్నులై అనేక క్షేత్రములందు మీ ప్రభావమును ప్రకటించుచున్నారు. సర్వత్రవ్యాపించి యున్న మీ దివ్యత్వము అనేక క్షేత్రములందు విశేష ప్రతిభతో ప్రకాశించుచున్నది. మీ అపార కరుణారసము నాపై వర్షించి శ్రీపాదలీలామృతములో మిళితమై సర్వులకు అందించబడునుగాక!

జగద్గురో! శ్రీ దత్తాత్రేయస్వామీ! నీ లీలలమోఘములు! నీవు సులభ దుర్లభుడవని కీర్తించబడుచున్నావు. అంతేకాదు. నీవు “భక్త కీర్తి వివర్ధనుడవు” అని బిరుదు ధరించినావు. నీకు దత్తమైనవారికి నీవు దత్తమై నీ శక్తియుక్తులను వారికి సంక్రమింపజేసెదవు అని నీ స్వరూపులైన సద్గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామి విశలానందులు అనేక మారులు ప్రవచించియున్నారు. నీకు దత్తమగుట యను ప్రక్రియలోని ఆంతర్యము తెలియని అసమర్థులము. మా లోపములను సవరించి నీవే దత్తము చేసుకొనుము మమ్ము దేవదేవా! నీ ప్రథమావతారుడైన శ్రీపాద శ్రీవల్లభుని దర్బారు ప్రదేశమును నీవే స్వయంగా మాకు చూపించి, ఈ పుణ్యభూమిపై నివాస మేర్పరచుకొనుమని బోధించి మమ్ము పునీతులను చేసితివి! కృష్ణాతీరవిహారా! అనఘాసమేతా! శ్రీపాదలీలా వర్ణనమునందు తోడ్పడి లోకకల్యాణ కారణమైన ఈ గ్రంథ రచనను రసనిష్యందిగా చేసి, తరింపజేయ ప్రార్థించి, నిన్ను శరణుబొంది నమస్కరించుచున్నాను. అనుగ్రహించుము దేవా!

ఓ! శ్రీపాదశ్రీవల్లభస్వామీ! శ్రీ గురు నరసింహసరస్వతి యతిరాయా! ఓ! మాణిక్యప్రభు

మహారాజా! ఓ! అక్కలకోటస్వామి సమర్థా! శ్రీ శిరిడి సాయిబాబా! ఓ వాసుదేవానందసరస్వతి స్వామీ! ఓ! బ్రహ్మానంద సరస్వతిస్వామీ! హే! గజానన మహారాజా! తాజుద్దీన్‌బాబా! శ్రీశంకర మహారాజా! ఓ! శ్రీధరస్వామి మహారాజా! ఓ! దత్తావతార గురువులారా! శ్రీ కురువపురము, శ్రీ క్షేత్ర శ్రీవల్లభాపురములందు దివ్య విభూతులను వర్షింపజేయు ప్రథమ దత్తావతారుని లీలావర్ణనమును గ్రంథస్థ మొనర్చు పుణ్యకార్యమునందు తోడ్పడుదని తమ పాదారవిందముల చెంత మోకరిల్లుచున్నదానను.

శ్రీ దత్త సంప్రదాయములో స్థానము కల్పించుటకు అనుమతిని ప్రసాదించిన మూలపురుషులకున్నూ, పరబ్రహ్మ గురువులైన శ్రీశ్రీశ్రీ సర్వేశ్వరానంద సరస్వతిస్వామి వారికి, పరమేష్ఠి గురువులైన శ్రీశ్రీశ్రీ నిత్యానంద సరస్వతిస్వామి వారికి, పరమగురువులైన శ్రీశ్రీశ్రీ నిరంజనానంద సరస్వతి స్వామి వారికి, సన్యాస దీక్షను ప్రసాదించి, తమ శ్రీ గురుచరణము లందించి నిరంతరము కంటికి రెప్పవలె కాపాడుచున్న సమర్థ సద్గురువులు ప.ప. శ్రీశ్రీశ్రీ స్వామి విఠలానంద సరస్వతి మహరాజ్ వారలకున్నూ కోటికోటి ప్రణామములు సమర్పించుకొనుచున్నాను.

విశ్వశాంతి, సమాజశ్రేయస్సు, సర్వజనహితములే ధ్యేయముగా సంచరించు శ్రీ దత్తమూర్తియొక్క ప్రథమావతారుని లీలలను సద్గురు ప్రబోధితములైన వానిని సేకరించి, ఒక చోటికి చేర్చి! తోటివారందరికీ అందించుటకై చేయు ఈ ప్రయత్నమునకు దత్త పరంపరలోని గురువులందరు దయజూపి సహకరించి ఆశీర్వదించవలసినదిగా మనసారా ప్రార్థిస్తున్నాను.

జ్ఞానమార్గ ప్రబోధంతో కలియుగ మానవులకు సర్వదా తోడ్పడుటకు సంసిద్ధముగానుండు మహర్షులారా! వాల్మీకి వ్యాసాది మహాపురుషులారా! సమస్త సాధుసత్తములారా! పురాణ పురుషులారా! మీ అందరి పాద పద్మాలకు నా ప్రణామములు. కలి ప్రభావము నుండి తప్పించుకొనుటకై తమరుచూపిన గురుభక్తి, సేవామార్గమును సర్వులకూ విశదమగు రీతిగా ఈ గ్రంథములోని వాక్యములను సత్యమొనర్చుటకై మీ ఆశీస్సులు కోరుచున్నాను.

జన్మనిచ్చిన జనని శ్రీమతిరాజ్యలక్ష్మి, జనకుడు శ్రీఆలూరు నాగభూషణరావు పంతులుగారలు, మరియు భర్తగారైన శ్రీఉప్పులూరు భాస్కరశర్మగారలు పైలోకాల నుండి ఆశీర్వదించగలందులకై వారికి పాదాభివందనములు మనసారా సమర్పించుకొనుచున్నాను.

## ప్రతివ్యక్తికీ మార్గదర్శకుడు సద్గురువే!

ప్రతి మానవునికీ ధర్మమార్గంలో ప్రయాణించడానికి మార్గదర్శకుల సహాయం తప్పక కావలసినదే! అనుభవజ్ఞులైన మార్గదర్శకుల ద్వారా సాగించే జీవితం ఒడుదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోతుంది. అన్నిరకాల వృత్తుల వారికీ వారివారి వృత్తులలో నేర్పరితనము చేకూరాలంటే ఆయా వృత్తులలో ఉన్న నిపుణుల ప్రబోధము, సహకారము అవసరము. అలాగే ఉత్తమ సాధనలు సలిపి ఆధ్యాత్మిక జీవనము పొందాలనుకొనువారికి కూడ తప్పనిసరిగా ఆ మార్గములో నిపుణులైన ఉత్తమ గురువుల యొక్కయూ, సాధకుల యొక్కయూ ప్రబోధములు, మార్గదర్శనం చేయించే సమర్థుల సాంగత్యము అవసరమై యున్నది. శిష్యునికి అనుకూలమైన మార్గాన్ని నిర్దేశించి సద్గురువు అతనిని ఆత్మవిద్యలో నిష్ణాతునిగా చేస్తాడు.

ధర్మమార్గ ప్రవర్తకులందరూ గురువులే! అందులో సద్గురువు సమర్థుడని కీర్తించబడినాడు. సద్గురువు తననాశ్రయించిన శిష్యుని సకలబాధ్యతలు వహించి ఉన్నతునిగా చేయుటయే లక్ష్యముగా స్వీకరించును. ఆ లక్ష్యసాధనలో గురువు ఎంత శ్రమకైనా ఓర్చుకొంటాడు. శిష్యులను ఎట్టి కఠిన పరీక్షలకైనా గురిచేస్తాడు. కఠినాతి కఠినమైన శిక్షలను విధిస్తారు. కానీ వారిపైన జాలి, కరుణ తప్ప ఇతరభావమేమీ ఉండదు.

ఉదాహరణకు ఒక మేకును గోడకు కొట్టి అవసరానికి ఉపయోగించుకొనుట కొరకు దానిని సుత్తితో కొడుతుంటారు. అది ఏ కారణంచేతైనా వంగిపోతే తిరిగి దాని వంపును సరిచేసి దిగగొడతారు. అదియెంత మొండికేసినా సుత్తితోనే సరిచేస్తుంటారు. ఎందుకంటే లక్ష్యం సాధించడానికే! అంతేకానీ మేకుపై ఎలాంటి కోపంగానీ, ద్వేషంగానీ ఉండదు. అలాగే సద్గురువు సుత్తిలాంటివాడైతే శిష్యుడు మేకు వంటివాడు. శిష్యుడు లక్ష్యాన్ని చేరునంతవరకు గురువు అతనిని వెంటాడి మరల మరల ప్రయత్నిస్తూ తన పనిని తాను చేస్తూ ఉంటాడు. గోడకు కొట్టిన మేకు అందరికీ ఎన్నోవిధాల ఉపయోగపడుతుంది. అదేవిధంగా లక్ష్యసాధనలో పరిపూర్ణుడైన శిష్యుడు సమాజానికీ, దేశానికీ ఉపయోగపడాలన్నదే గురువు యొక్క ఆశయము. శిష్యుడు గూడ తనలాగే సర్వులను ధర్మమార్గంలో నడిపేటందుకు సమర్థుడై ప్రఖ్యాతి పొందాలన్నదే యథార్థమైన గురువు లక్ష్యము.

## శ్రీక్షేత్ర శ్రీ కురువపుర పరిచయం

ధరణిపై జన్మించిన మానవుల నందరిని మోహచిత్తులను జేసి, తన చేతి కీలుబొమ్మలుగా జేసుకొని ఆటలాడించే మాయను తరిమిగొట్టి, తామెవరో? తెలుసుకొనేటట్లు చేయగలిగే ఆత్మ దర్శనం గావించే సద్గురు సంప్రదాయానికే "దత్త సంప్రదాయ"మని పేరుగలదు. దీనికి మూలం శ్రీ దత్తాత్రేయస్వామి. ఈ సంప్రదాయ ప్రవర్తకులలో, మహాత్ములూ, ఘటనాఘటన సమర్థులైన గురువులు ఎందరో గలరు. వారిలో శ్రీపాద శ్రీవల్లభస్వామివారు కలియుగంలో ఆ దత్తదేవుని ప్రథమ అవతారులు. ఆస్వామివారియొక్క తపోభూమియే శ్రీక్షేత్ర కురువపురము! ఈ ప్రదేశము పురాణకాలములో కశ్యప మహర్షి దంపతులు తపమొనరించిన పుణ్యభూమి. మరియు కురువంశ మూల పురుషుడైన కురు మహారాజు ఇచ్చట తపస్సు చేసినట్లు పురాణములలో చెప్పబడినది. శ్రీపాద శ్రీవల్లభస్వామి ఈ ప్రదేశమును తమ అనుష్ఠాన క్షేత్రముగా ఎన్నుకొన్నారు. వారి అద్భుత తపస్సు చేత ఈ క్షేత్రము యొక్క మహిమ మరింత విస్తారమై విశ్వవ్యాప్తమైనది.

శ్రీ స్వామివారి యొక్క మహిమాన్విత లీలలు ఆనాటి నుండి ఈనాటి వరకు భక్తులకు దివ్యానుభూతులను కలిగించుచున్నవి. శ్రీపాద శ్రీవల్లభస్వామివారు చేసిన తపః ఫలితంగా ఎందరో సాధు మహాత్ములకు, సత్పురుషులకు ఈ క్షేత్రమందు దైవదర్శనము, గురుదర్శనము లభించుచున్నది. ఎందరో ముముక్షువులై మోక్షార్హతను పొందినారు. ఆరు శతాబ్దాలు గడిచినా శ్రీపాదస్వామి ఈనాటికీ నిత్య సత్య స్వరూపులని ఈ సంఘటనలు నిరూపిస్తున్నవి. నాటినుంచి నేటివరకు ఇచ్చటి శ్రీవారి పాదుకలు ఉత్తములైన బ్రాహ్మణ కుటుంబము వారిచే పూజించబడుచూ భక్తుల మనోభీష్టములను తీర్చి అనుగ్రహిస్తూవున్నవి.

---

* : *ఈ క్షేత్రము కర్ణాటక రాష్ట్రములో రాయచూరు జిల్లాలో రాయచూరుకు 20 కి.మీ. దూరంలోగల ఆత్కూరు గ్రామమునకు ఉత్తర దిశగా కృష్ణానది మధ్యలో ఉన్నది. ఇప్పుడు రాయచూరు నుండి మక్తల్ చేరి (ఆంధ్ర ప్రాంతము వారు మహబూబ్‌నగర్ జిల్లాలోని మక్తలుకు జేరి) అక్కడి నుండి శ్రీక్షేత్ర శ్రీవల్లభాపురం చేరుకొని బుట్టిలపై నదిని దాటి సులభంగా శ్రీక్షేత్ర కురువపురం చేరుకొనుచున్నారు. కురువపుర దర్శనం ఈ రోజులలో అత్యంత తేలికైనది. నివాస వసతి, భోజన వసతులు శ్రీవల్లభాపురంలో శ్రీవిఠల్‌బాబాగారి ఆశ్రమంలో లభిస్తున్నవి. కావున భక్తుల రద్దీ బాగా పెరిగింది. తండోపతండాలుగా భక్తులు వచ్చి దర్శనం చేసుకొని పునీతులౌతున్నారు.*

## శ్రీ క్షేత్ర శ్రీవల్లభాపురం

ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్‌నగర్ జిల్లా (పాలమూరు)లో మక్తల్ మండలంలోగల పసుపల గ్రామ శివారులోని పంచదేవ పహాడ్ గ్రామానికి చేరువలో, కృష్ణానదీ తీరంలో "భాస్కరబండ ప్రదేశం"గా ప్రసిద్ధి చెందిన పుణ్యస్థలమే శ్రీక్షేత్ర శ్రీవల్లభాపురము. ఇదియు పురాణకాలములో ప్రసిద్ధిగాంచిన పుణ్యభూమియై యున్నది. సప్తఋషులలో ఒక్కరైన శ్రీ వశిష్ఠ మహామునియును, సృష్టికి ప్రతి సృష్టి చేసిన విశ్వామిత్ర మహర్షియును దక్షిణాదిలో ఒకే ప్రాంతంలో ఉండి తపమాచరించినది ఈ ప్రదేశములోనే! వీరికి అనువుగా చుట్టుప్రక్కల గ్రామాలు ఏర్పడినవి. ఈ మహర్షుల ఆశ్రమ పశుసంతతి కొరకు ఏర్పరచిన గ్రామమే పసుపలగ్రామము. మహర్షులు యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించిన ప్రదేశమే పంచదేవ పహాడ్ గ్రామం. అదియేవారి దైవారాధన కేంద్రము. అదేవిధంగా దానికి సమీప గ్రామమైన గోపులాపురం గోపాలకులు గోసంతతిని సంరక్షించు ప్రదేశము. మహర్షుల శిష్యవర్గములో లింగధారులైన వారు నివసించి పూజలు సల్పు స్థలము "పంచలింగాల"యని పేరుపొందిన గ్రామము. ఈ క్షేత్రానికి దిగువన "పారేవుల" అను గ్రామము కలదు. ఇది పండితుల భూమి. ఇచ్చట ఆ కాలంలో వేద పాఠశాల, గురుకులం ఎంతో ప్రసిద్ధి చెందినవి. అనేక ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇచ్చటకు వచ్చి వేద విద్యను అభ్యసించే వారు. ఇందువలన ఈ ప్రదేశము పురాణములలోని దివ్యపురుషులచేత తపస్సు చేయబడినదియు, వేదశాస్త్ర పురాణబోధలు, జ్ఞానబోధలు చేసిన పావన స్థలముగా గూడా తెలియుచున్నది.

అంతేగాక ఈ స్థలము శ్రీపాదస్వామి వారు స్నానానుష్ఠానములు గావించుకొని భక్తుల సమస్యలు, కష్టాల నివారణకు తగిన సూచనలు తెలిపిన దర్బారు ప్రదేశముగానూ చరిత్రకెక్కింది.

శ్రీ స్వామివారు ఈ చోట చిత్రవిచిత్రమైన లీలలెన్నింటినో అనుగ్రహించి యున్నారు. శ్రీపాదస్వామి నిత్యము సూర్య నమస్కారములు చేసిన పెద్ద శిలపైన ఆయన తన ఆకారమును గూడ అనుగ్రహించినారు. ఆ శిలను స్పృశించి శ్రీవారి చైతన్య ప్రభావమును ఇప్పటికీ అనుభవించి భక్తులు పరవశులగుచున్నారు. శ్రీస్వామి వారిని ఆ చోట ప్రార్థించి కోరిన వరములను పొందుచున్నారు. ఈ క్షేత్రము నుండి తేలికగా పుట్టీలలో నది దాటి కురువపురం చేరుకోవచ్చును.

ఇంతటి మహామహిమాన్వితమైన పుణ్యప్రదేశమును శ్రీపాద శ్రీ వల్లభులు మన గురుదేవులైన శ్రీశ్రీశ్రీ స్వామి విఠలానంద సరస్వతి మహరాజ్ వారికి 1998 మే నెలలో ప్రసాదరూపంగా అనుగ్రహించి, ఇచ్చట మహాక్షేత్ర నిర్మాణం చేయించి తన మహిమలను అపారంగా ప్రకటించుచున్నారు. (ఇచ్చట ప్రతిష్ఠించబడిన శ్రీదత్త, అనఘామాత, కాలభైరవ, రేణుకామాత, శ్రీ సాంబశివ, శ్రీసీతారామ, శ్రీసాయిబాబా మూర్తులు కోరిన వరాలను భక్తులకు ప్రసాదిస్తున్నారు)

## సద్గురు మాహాత్మ్యము - ప్రస్తావన

భారతదేశం పుణ్యభూమి. అతి పవిత్రమైన సవిత్రి యిది! యోగులు నడయాడి పునీతం చేసిన యోగభూమి. ప్రపంచ దేశాలన్నింటికీ గురుస్థానము భారతదేశమే! ఈ దేశములో సద్గురువులు సమభావం కలిగినవారు. తామెన్నైనా శ్రమలకోర్చి, తమ శిష్యులను సమున్నత స్థితియందు నిలిపి గురువులుగా తీర్చిదిద్దుటలో సిద్ధసంకల్పులు. ఉదాహరణకు ఒక జ్యోతి అనేక జ్యోతులను వెలిగించుటకు కారణమైన విధముగా – ఒక జ్ఞాని తన జ్ఞానమును అనేకమందికి బోధించి వారు కూడా జ్ఞానులగుటకు కారణమగుదురు.

అందువలననే ఈ దేశములో అనేక కోట్ల సంవత్సరముల నుండి గురుశిష్య సాంప్రదాయము నిరాఘాటంగా కొనసాగుచున్నది.

సద్గురువులు సర్వదేవతాస్వరూపులని గురుగీతావాక్యం మనకు తెలుపుచున్నది. మన పూర్వీకులైన సత్పురుషులు ఈ కారణంగానే సద్గురువులను సేవించి, పూజించి, తరించినారు. సద్గురు పాదములు సర్వతీర్థాలకు, సకల పుణ్యక్షేత్రాలకు నిలయంగా భావించి, గురుసేవా భాగ్యంతోనే సర్వశక్తులు పొంది ఎందరో బ్రహ్మానందానుభూతిని అందుకున్నారు.

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల వలన సృష్టి, స్థితి, లయాలు జరుగుచున్నవి. జీవుల కర్మఫలములకు తగిన దేహములు, అనుభవములు ఈ ప్రపంచములో కలుగుచున్నవి. ఆ త్రిమూర్తుల స్వరూపమైన సద్గురువులు జీవుల కర్మఫలములను అనుభవింపజేయుచు, సత్కర్మాచరణతో జీవులను పునీతులను జేయుచు కర్మబంధముల నుండి తప్పించే ప్రయత్నం చేయుదురు.

బ్రహ్మ తన సంకల్పంతో జీవునికి నివాసయోగ్యమైన దేహాన్ని సృష్టిస్తాడు. సద్గురువు ఆ శరీరంలో నివసించే జీవునకు జ్ఞానప్రబోధం చేసి సద్బుద్ధిని కలిగిస్తాడు. ఇది సద్గురుని యందున్న బ్రహ్మతత్త్వం. విష్ణువు శరీర పోషకుడైతే సద్గురువు తాను ప్రబోధించిన జ్ఞానాన్ని పోషించి ప్రదీప్తం చేస్తాడు. అతనిలోని జ్ఞానమును విజ్ఞానముగాను, సుజ్ఞానముగాను తీర్చిదిద్దుతాడు. ఇదియే సద్గురునియందు గల విష్ణుతత్త్వం. మహేశ్వరుడు లయకారకుడని వ్యవహరించబడుచున్నాడు. సద్గురుడు తన జ్ఞాన ప్రబోధంతో శిష్యునిలోని అజ్ఞానమును పూర్తిగా నిర్మూలించి, దేహభావాన్ని తుదముట్టించి పరమాత్మునిలో లయం అయ్యేటట్లు చేస్తాడు. ఇదే సద్గురుని యందు గల శివతత్త్వం!

ఈవిధంగా బ్రహ్మ విష్ణు మహేశ్వరుల సమిష్టి కృషియైన సృష్టి స్థితి లయాలకు సద్గురుదేవుడు చక్కని మెఱుగులు పెడతాడు. ఈ కారణంగానే సద్గురుడు త్రిమూర్తులకన్నా గొప్పవాడని శివుడు పార్వతీదేవికి "గురుగీత"లో బోధించినాడు.

## దివ్యఘటన

ఇప్పుడు మనం శ్రీ గురుదేవులు తెలిపిన కథామృత పానం చేయుటకు, సత్యదర్శన దృశ్యములను దర్శించుటకు సిద్ధమవుదాము. శ్రీక్షేత్ర శ్రీవల్లభాపురం నిర్మాణం జరిగిన తర్వాత ధనుర్మాసోత్సవములు ప్రారంభించి నిత్యమూ నగర సంకీర్తనం చేస్తున్నాము.

ఈరోజు ఎంతో శుభదినం. వైకుంఠ ఏకాదశి పర్వదినం. శ్రీక్షేత్రశ్రీవల్లభాపురంలో భక్తులందరమూ తెల్లవారుఝాముననే లేచి కాలకృత్యాలు తీర్చుకొని కృష్ణా నదిలో స్నానాలు చేసినాము. ప్రతిరోజు చేయు విధముగా భజనతాళాలు తీసుకొని నామసంకీర్తనతో అందరం నగర సంకీర్తన చేస్తూ మూడు ప్రదక్షిణలు పూర్తి చేసినాము. త్వరత్వరగా పైన శ్రీదత్తాత్రేయస్వామి వారిని ఉత్తరద్వారమున కెదురుగా పీఠముపై వేంచేపు చేసి అలంకరించాము. స్తోత్రము చేసి హారతి ఇస్తుంటే చిన్ననాడు మంగళగిరి క్షేత్రంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని ఉత్తర గోపుర ద్వారము నందు దర్శించుకొన్న అనుభూతులను నెమరువేసుకొన్నాను. ఇంతలో శ్రీ గురుదేవులు పిలుస్తున్నారని వార్త అందింది. వెంటనే క్రిందకు దిగి వచ్చాను.

పూజ్య శ్రీ విఠల్‌బాబాజీ వారు వచ్చి బయట కూర్చుని ధ్యాన నిమగ్నులై ఉన్నారు. వారు ధ్యాన స్థితిలో ఏదో దివ్యదర్శనం చేస్తున్నట్లుగా అవగతమైనది. వారి ముఖంలో అలౌకి కానందానుభూతి ద్యోతకమగుచున్నది. యాంత్రికంగా నమస్కరించుకొని అట్లే చాలా సమయం వేచి యున్నాను.

కొంతసేపటికి వారు మామూలు స్థాయికి వచ్చిన తర్వాత తిరిగి నమస్కరించాను. వారు నన్ను చూస్తూనే "అమ్మా! దత్తుడిని బాగా దర్శించుకొన్నావా?" అని ప్రశ్నించారు. "స్వామీ! దర్శించు కొని వచ్చా"నని చెప్పాను. శ్రీ బాబాగారిలాగన్నారు. "మాకిక్కడనే ఒక అద్భుత దృశ్యం గోచరించినది".

అప్పుడు నేను "బాబాగారూ! నేను మీ స్థితిని గమనించాను. తమరికేదో విశేష దర్శనం కలిగిందని మీ ముఖ కవళికల ద్వారా తెలియబడుచున్నది. మీ సంతోషమును, పారవశ్యమును చూచితిని. మా దర్శనము బాహ్యదర్శనము, తమరి దర్శనము అంతర్దర్శనము. మా సంతోషము లౌకికము. తమ ఆనందము అలౌకికము, అద్వితీయము. స్వామీ! తమరు దర్శించిన విశేషములను వినే అర్హత మాకున్న యెడల వివరించండి! విని ధన్యులమవుతాము" అని ప్రార్థించాను.

అప్పుడు శ్రీ బాబాగారు "అయితే అందరూ స్థిమితంగా కూర్చుని వినేటందుకు సిద్ధమైతే చెప్తా"నన్నారు. అందరినీ వచ్చి కూర్చుండే ఏర్పాటు చేశాను. **అప్పుడు శ్రీ బాబాగారు తమ అద్భుత దర్శన విశేషములను వర్ణించ సిద్ధమైనారు.**

# 2వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

## ప్రస్తావన

మానవ జన్మ ఎత్తిన ప్రతివారికీ జ్ఞానం ఉంటుంది. అది లౌకిక విషయ పరిజ్ఞానమేగాని అసలైన ఆత్మజ్ఞానం కాదు. భౌతిక సుఖాల విషయజ్ఞానంగా కొందరిలో వుండి జీవితము, సుఖములనేవి క్షణభంగురములనీ, మృత్యువు వెన్నంటి వున్నదనే జ్ఞానం వాళ్ళకు వుండదు. పుట్టిన ప్రతి జీవికి మరణం తప్పదన్న జ్ఞానం కలిగిన వెంటనే ఈ జీవితంలో మనం ఏమి చేయాలి? మన జ్ఞానాన్ని ఆత్మకు సంబంధించిన జ్ఞానంగా ఎలా మలచుకోవాలనే తపన ప్రారంభం అవుతుంది. దీనికి పెద్దలు అనేకమైన మార్గాలను వారు వారు అనుసరించినవి మనకు బోధించారు. అవే ధ్యానము, యోగము, తపము, జపము, భక్తి, ఆరాధన, భగవత్సేవ, మానవ సేవ, తీర్థయాత్రలు, క్షేత్ర దర్శనాలు, దీనరక్షణ అని ఎన్నో మార్గాలు చెప్పబడి వున్నాయి. కాబట్టి ఎవరికి వారు ఇందులో తమకు నచ్చిన ఏదో ఒక మార్గాన్ని ఎంచుకొని అనుసరించాలి.

కానీ సంసారంలో వుండే స్త్రీ–పురుషులకు పైన చెప్పబడిన వానిలో దేనిని ఆచరించాలన్నా కష్టమే! ప్రతి మార్గమునూ కొంతవరకే వాళ్ళు అనుసరించగలరు. సంపూర్ణంగా ఏదో ఒకటి చేయా లనుకొంటే సంసారమును వదలాలి. అది కుదరదు. భగవంతుని దయవలన అటువంటి అసమర్థుల కొరకు ఏర్పడినవే ఈ మహాత్ముల చరిత్ర పారాయణలు. ఈ పారాయణల వలన ఎక్కువ పైకం ఖర్చు కాదు. శరీరానికి అలసట ఉండదు. భగవత్కృప చక్కగా లభిస్తుంది. కోరినవన్నీ లభిస్తాయి. ముఖ్యంగా పాపములు, పరిహారం అవుతాయి. ఆధ్యాత్మిక జ్ఞానం అభివృద్ధి అవుతుంది. మనసు, బుద్ధి వికాసమును పొంది అంతవరకు ఉన్న జ్ఞానం ఆ తర్వాత ఆత్మ జ్ఞానంగా అభివృద్ధి అవుతుంది. ఇన్ని లాభాలు శ్రీ సద్గురువుల చరిత్ర పారాయణవల్లనూ, శ్రవణంవల్లనూ మనకు లభిస్తున్నవి. మన సమయాన్ని మాత్రం వృధా కాకుండా జాగ్రత్తపడదాము.

ఎన్నో అపూర్వ విషయాలను తెలిపే గురుదేవులు పూజ్యశ్రీ విఠలానంద సరస్వతి మహారాజ్‌వారు లభించటమన్నది మన పూర్వజన్మ సుకృతం అని అక్కడ సమావేశమైన సభికులందరికీ విన్నవించి, వారు మనకు చెప్పే విషయాలను శ్రద్ధగా వినండని ప్రార్థించి శ్రీ బాబాగారికి నమస్కరించి కూర్చున్నాను.

## సద్గురులీల

శ్రీ బాబాగారు అంతకు ముందు దర్శించిన అలౌకిక అద్భుత దృశ్యాన్ని ఒకసారి గుర్తు చేసుకొని ఇట్లు ప్రార్థించారు.

సద్గురుమూర్తికి, సకల క్షేత్రధామునికి, సకల తీర్థరూపునికి శ్రీక్షేత్రశ్రీవల్లభాపుర నిలయునకు సాష్టాంగ దండ ప్రణామములను సమర్పించుకొనుచున్నాను.

**ధార్మికులారా!**

ఈ రోజు పరమపావనమైన వైకుంఠ ఏకాదశీ పర్వదినం. ముక్కోటి దేవతలు ఆనంద పరవశులై యున్న శుభ సమయమందు ఈ దివ్యమైన క్షేత్రమున ఒక అద్భుత దృశ్యము కనిపించినది. మనము ధ్యాన మందిరముగా చెప్పుకొనుచున్న ప్రదేశము శ్రీ పాద వల్లభులవారు దర్బారు తీర్చి అందరకు వరములిచ్చి రక్షించిన స్థలము. ఇంతవరకు వారనుష్ఠానము చేసుకొనిన చోటు భాస్కర బండ అనే అనుకున్నాము. వారు నిత్యం సూర్యదేవునికి 108 సార్లు సంప్రదాయ బద్ధముగా నమస్కారములు చేసి తదుపరి సహజగణపతి స్వామి వారికి వందనాలు చేసి నదిలో నుండి బయటకు వచ్చి నలుదిశల వైపును భూమి, ఆకాశముల వంక జూచి కొంతసమయం అక్కడనే నిలబడి (ఇప్పుడు గురుమందిరము ఉన్న స్థలంలో) తిన్నగా నడచివచ్చి ఇప్పుడు గర్భగుడి కట్టిన ప్రదేశంలో ఉన్న ఒక పెద్ద రావి వృక్షము క్రింద ఒక చిన్న బండ రాతిపైన ఆసీనులైనారు.

చుట్టూ చెట్లు, పొదలు, అనేక పక్షుల కిలకిలా రావములతో ఆ వాతావరణమంతయు ఎంతో ఆహ్లాదకరముగా నున్నది. శ్రీపాద శ్రీ వల్లభులు చుట్టూ ఉన్న పక్షులను, అక్కడ తిరుగాడుచున్న గోవులను, కుక్కలను, సర్పములను, జంతువులను ప్రేమతో సావధానంగా చూచినారు. అవన్నీ శ్రీస్వామివారి వంక మరీమరీ చూచి గౌరవభావంతో నమస్కరించుకొన్నాయి. ఆ దృశ్యము నయనానందకరముగా నున్నది. అంతలోనే తూర్పువైపు నుండి కొందరు మనుష్యులు రావడం కనిపించినది.

శ్రీ స్వామి వారు కన్నులు మూసుకొని ధ్యానంలో నిమగ్నమై ఉన్నారు. ఆ వచ్చిన వారిలో ఒకరు అయ్యలారా! మీరు వర్ణించిన లక్షణములు గల స్వామి వీరేనా? సుమారు 20 రోజులక్రితమే వీరీ ప్రాంతమునకు వచ్చినారు. నదిలోని అగ్రహారంలో ఉంటూ, ప్రతిదినము ఇచ్చటికి వచ్చి, గ్రామంలో భిక్ష స్వీకరించి వెళ్ళుచున్నారు అని చెప్పగా ఆ వచ్చినవారు ఆనంద పారవశ్యంతో తలలూపి శ్రీ స్వామి చెంతకు చేరినారు.

శ్రీపాదశ్రీవల్లభస్వామి వారిని దర్శించేసరికి వారందరికి సంభ్రమాశ్చర్యములు ముప్పిరిగొన్నవి. శ్రీస్వామి పరమాత్మానుసంధానములో నున్నట్లు వారు గ్రహించుకొన్నారు. వారి ముఖమండలము చుట్టూ ఒక దివ్య తేజోవలయం విరాజిల్లుచుండుటను వారు గాంచిరి. శ్రీస్వామి శరీరముపైన బడుచున్న సూర్యకిరణాలు మెఱుపుల వలె కాంతి పుంజములై ఆ ప్రదేశమునంతటినీ ప్రకాశములో ముంచి వేస్తున్నట్లుగానూ, ఆ కాంతిలో వారందరూ లీనమైనట్లుగానూ అద్భుతమైన అనుభూతిని పొందినారు.

అందులో ఒక బ్రాహ్మణ పండితుడు తమతో వచ్చిన వారందరినీ శ్రీస్వామి వారికి ధ్యానభంగం కాకుండా నిశ్శబ్దంగా కూర్చుండమని సైగల ద్వారా తెలిపినారు. వారలా కూర్చుని శ్రీ స్వామి వారిని చూచుచుండగనే ఆశ్చర్యకరమైన దృశ్యం గోచరించింది. ఆ బ్రాహ్మణుడు చుట్టూ ఉన్న ప్రదేశమును చూచెను. దివ్యమైన ఆ ఉషోదయం వేళలో దూరంగా చుట్టూ అనేకమంది సాధువులు, ముముక్షువులు, దేవతలు చేతులు జోడించి శ్రీ స్వామి వారిని దర్శించుట కనిపించీ కనిపించనట్లుగా లీలగా గోచరించెను. వారందరూ శ్రీపాదుని దర్శించుటకై వచ్చినారని తలంచి ఆశ్చర్యపోయెను. ఇది దివ్యమైన భవ్యమైన శ్రీవారి మహాదర్బారుగా గోచరమైనది. తామందరూ మధ్యలో ఆసీనులై వుండిరి. అద్భుతమైన సూర్యుని కాంతి కిరణములు శ్రీవారి శరీరంపైనబడి ప్రతిఫలించి, ఆ దివ్యమూర్తి నుండి అందరిని చుట్టుముట్టినట్లు కనబడెను. అప్రయత్నంగా అతని కన్నులు మూతబడినవి. గోకర్ణములో తన యింటి ముంగిట లభించిన శ్రీ స్వామి వారి నిజదర్శనము తిరిగి ఇప్పుడు లభించినందుకు పరవశుడైనాడు. ఈ పరమాద్భుత దృశ్యం దర్శించి పరమానంద భరితుడైనాడు. కన్నులానంద బాష్పములు స్రవించుచుండగా దివ్యానుభూతిని పొంది పారవశ్యంలో కొంత తడవుండిన ఆ బ్రాహ్మణుడు నెమ్మదిగా కన్నులు తెరచి అందరి వైపున్నూ చూచెను. తమతో వచ్చిన పండితులు మరియు ఇతరులు కూడ కన్నుల నానంద బాష్పములురాల శ్రీస్వామివారిని చూస్తూ తానున్న పరిస్థితిలోనే వారునూ ఉన్నట్లు గ్రహించుకొనెను.

శ్రీ పాద శ్రీ వల్లభస్వామి వారు ధ్యానములో ఉన్నప్పటికిన్నీ వారిని ఎవరు దర్శింపవచ్చినారో

---

**గమనిక:** అప్పటివలెనే ఇప్పుడు కూడా ధనుర్మాసములో సూర్యనారాయణ స్వామి ఈ క్షేత్రంలో శ్రీదత్తమూర్తిని తమ అమృత కిరణములతో అభిషేకము చేస్తారు. ఈ దృశ్యములను దత్త భక్తు లందరూ ప్రతి సం. డిసెంబర్ 15 నుంచి జనవరి 15 వరకు దర్శించుకొని తరించుచున్నారు. ముఖ్యంగా డిశంబరు 30 నుండి జనవరి 3 వరకు ఆ దృశ్యం చక్కగా కనిపిస్తుంది.

అను విషయము వారి ఎఱుకలోనే ఉంది. శ్రీ స్వామి సర్వజ్ఞులు, సర్వాంతర్యామి. దర్శింపవచ్చిన వారందరి హృదయాంతర్వర్తిగా తానందుకొన్న బ్రహ్మానందానుభూతిని లేశమాత్రముగా అదరికి కలుగునట్లు సంకల్పించినారు. శ్రీపాదుల దర్శనం వలన వారు ఆ సమయంలో పొందిన దివ్యానుభూతిని వర్ణించుటకు ఎవరి వశముగాదు. శ్రీపాదస్వామి వారు కొద్దిసేపటిలోనే కన్నులు తెరచి కనుసైగలతోను చిరునవ్వులతోనే అందరినీ పలకరించినట్లు చూచారు.

వాత్సల్యపూరిత కంఠస్వరంతో స్వామివారు "ఓహో! ఏమీ? గోవిందభట్‌జీ! ఈ రోజు చాలా సుదినం. ఎక్కడి గోకర్ణక్షేత్రం? ఆశ్చర్యంగా ఉన్నదే! మీ మహాబలేశ్వరుని వదలి ఇంతదూరం వచ్చారు!" అంటూ చమత్కారంగా చిరునవ్వు నవ్వుచూ పలకరించారు. గోవిందభట్ లేచి స్వామివారికి పాదాభివందనం చేసి, పాదముల వద్ద కూర్చుని, స్వామివారిని చూస్తూ "మహాత్మా! ఒక్కమాటైనా చెప్పకుండా ఇంతదూరం వచ్చి చేరారే! మీ దర్శనభాగ్యం లేక నేనెంత తహతహలాడితినో మీరెరుగరా? మేము చేసిన అపరాధం ఏమిటి? స్వామీ? ఎందులకీ శిక్ష?" యని గొంతుగద్గద మగుచుండపలికినాడు. శ్రీస్వామివారు తమ అమృతహస్తమును అతని శిరస్సుపై నుంచి నిమురుచు "నాయనా! అంతయు సర్వేశ్వరుని సంకల్పము. ఇది అతి పవిత్రమైన క్షేత్రం. మహాత్ముల తపోభూమి. కురువపురం అత్యంత మహిమాన్వితమైన క్షేత్రం. గుప్తంగా ఎందరో మహాత్ములు నేటికీ ఈ పరిసరాలలో తమ తపస్సును కొనసాగిస్తూనే ఉన్నారు. ఇదే నా చివరి మజిలీ! అందులకే ఇచ్చటికి చేరినాను" అని స్వామివారు అనగానే గోవిందభట్ ఆనందబాష్పాలు కారుస్తూ గొంతు గద్గదమవుచుండ "హే! ప్రభో! నీ లీలలు అనంతములు సద్గురుమూర్తీ! దిక్కు తెలియక నిన్ను వెదుకుచూ నీ స్మరణ చేతనే నీ సన్నిధి చేరిన నా భాగ్యమే భాగ్యం. నీ కృపా విశేషమునేమని తెల్పుదును? రాత్రి పంచదేవ్ పహాడ్‌యందు సంకీర్తనము చేయించితివి. ఈ వైకుంఠ ఏకాదశి పర్వదినాన సాక్షాత్ ఓంకార రూపునిగా, దర్శనమిచ్చినావు. ఓ సద్గురుమౌళీ!

**"సహస్ర శీర్షాపురుషః సహస్రాక్ష సహస్రపాద్**
**స భూమిం విశ్వతోవృత్వా అత్యత్తిష్ఠ దశాంగుళమ్"**

అన్నట్లు నీలోనే విష్ణువును, లక్ష్మీదేవిని, బ్రహ్మదేవుని, గణేశుని, శివుని సమస్త దేవతామూర్తులను దర్శింపజేసినావు. నా తల్లిదండ్రులొనరించిన పుణ్య పరిపాకం చేతనే నిన్నీవిధంగా దర్శించగల్గితిని. ఆహా! భగవంతా! ఈ విశ్వమంతయు నీ లీలా విలాసమే! నీవే! జగత్తుకంతటికిని నియంతవు. ఆది గురుడవు. నాయకుడవు. కర్తవు. భోక్తవు. హర్తవు గూడా నీవే

స్వామీ! శ్రీపాదశ్రీవల్లభా! ఈ దృశ్యమాన జగత్తునకు మూలాతిమూలమున్నూ నీవే! నీవు ఈ విధంగా దర్శనమిచ్చిన ఈ ప్రదేశమున్నూ దర్శించుకొన్న మేమున్నూ పునీతులమైతిమి. నీ మహిమనేమని కొనియాడగలము? భక్తులమైన మేమంతా ఈనాటి నీ దర్శనంతో తరించి పోయినాము. దీనదయాళా! నిన్ను దర్శింపవలెనన్నను, నిన్ను స్మరింపవలెనన్నను సామాన్యులమైన మాకు సాధ్యమా? నీ యనుగ్రహలేశమే మాపై ప్రసరించకున్న నీ నామస్మరణకూడా చేయలేము. ఈ కలియుగమున మాబోటి సామాన్య మానవులనుద్ధరించుటకై నీకు నీవే సంకల్పించుకొని నీ కృపారసము మాపై ప్రసరింపచేయుటకై మానవ రూపములో వచ్చి యున్నావని స్ఫురించుచున్నది.

పరమాత్మను సరాసరి దర్శించుకోలేని మా వంటివారము నీ దర్శనము చేసుకొనగల్గు చున్నాము. ఓ! ముని వేషధారీ! ఆనాడు అత్రిమహాముని అనసూయామాతలకు పుత్రుడై పుట్టిన ఆదిగురువువు, గురుదత్తుడవు నీవేనను భావము మాలో కల్గించితివి. నీ సంపూర్ణ తత్త్వమును మేము తెలియగలమా? స్వామీ! నీకివే మా శతకోటి వందనములు" అని ప్రార్థనాపూర్వకముగా స్తుతించెను.

శ్రీపాదస్వామి వారు మందహాసం చిందిస్తూ గోవిందభట్‌తో కూడా వచ్చిన భక్తులందరిని తమ చూపులతోనే ఆశీర్వదించారు. అప్పుడు గోవిందభట్ ఒక్కొక్కరిని శ్రీస్వామి వారికి పరిచయం చేశారు. ఆళందినుండి వచ్చిన చిదంబరశాస్త్రిగారు, వారి శిష్యపరివారమును, మరియు పండరిపురము నుండి వచ్చిన పాండురంగ విఠల్‌భట్, రామానందపూజారి వారల శిష్యబృందమును విడివిడిగా పరిచయము చేయగా వారు వరుసగా వచ్చి శ్రీస్వామివారికి పాదాభివందనములు గావించిరి.

శ్రీపాదస్వామివారు ఆశీర్వదించు సమయములోనే పంచదేవ్‌పహాడ్ గ్రామస్థులు మరి కొందరు దర్బారు ప్రదేశమునకు చేరుకొని స్వామికి సాష్టాంగ వందనములు చేశారు. అలా వచ్చిన వారిలో గ్రామ పెద్దలు రామాచార్యులు, సిద్ధప్ప అనే విశ్వబ్రాహ్మణుడు శంకరప్ప అనే తెలుగువాడు, మరియు పసుపల గ్రామస్థులు నాగన్న రాములయ్య అనే తెలుగువారు ఉన్నారు. శ్రీపాదులు వారందరినీ దీవించి "ఓ! భక్తులారా! ఏమి విశేషము? ఈరోజున అందరూ కలిసి వచ్చినారు?" అని ప్రశ్నార్థకముగా చూచినారు.

అప్పుడు వారు మహానుభావా! ఇన్నిరోజులు మీ గురించి మాకు రవ్వంతయైనా తెలియలేదు. నిన్న ఈ పండితులు, అయ్యగార్లు మా ఊరికి వచ్చినారు. వారు చెప్పుకొనుచుండగా వింటిమి.

ఎన్నో మైళ్ళదూరం నుండి కష్టపడి నడచి నడచి మీ దర్శనము కొరకు వచ్చినారని తెలిసినది. వీరెంత పుణ్యాత్ములో! మేమెంత అవివేకులమో! మాకిప్పుడు తెలిసి వచ్చినది. తమరు కామధేనువనీ, కల్పవృక్షమనీ వీరు చెప్పినారు. అటువంటప్పుడు మేము మిమ్ములను సేవించుకొనక నిర్లక్ష్యం చేయుటను తమరు క్షమించి మాయందు దయతో రక్షించండి!" అని ప్రార్థించారు. అంతేగాక ఈ రోజున మహా పర్వదినమైన వైకుంఠ ఏకాదశి. కావున మీతో సహా భక్తులందరికీ పాలు పండ్లు ఏర్పాటు చేయగలందులకు తమరి అనుమతి కోరి వచ్చినాము" అని ప్రార్థించారు. శ్రీస్వామివారికినీ, యాత్రాబృందములోని వారికినీ ఫలములు, పాలు సమర్పించుకొన్నారు. శ్రీస్వామివారు ప్రసన్నులై "ధార్మికులారా! మీ గ్రామస్థులలో ఈవిధంగా ధర్మ, త్యాగ, వితరణ, భక్తి, ప్రపత్తులు, జాగృతమైనందులకు చాలా సంతోషము. మీరు ఈ విధముగా అతిథి అభ్యాగతుల సేవలో పాల్గొని పుణ్యపురుషులు కండి! భౌతిక సంపద నిలిచేది కాదు. దానిని వినియోగించి ఈ విధంగా సంపాదించుకొన్న పుణ్యమే మీ వెంటనంటి వచ్చేది. మీ జీవితములు ధన్యతనొందుటే గాక మీ గ్రామము యొక్క కీర్తి ప్రతిష్టలు చరిత్రలో లిఖింపబడును గాక!" అని దివ్యాశీస్సులనొసగిరి.

తదుపరి యాత్రికులను జాగ్రత్తగా కురువపురమునకు చేర్పించమని ఆదేశమిచ్చి శ్రీస్వామి వారు మాత్రం నీటిపై నడుస్తూ కురువపురమును చేరుకొన్నారు. శ్రీ స్వామి అలా నడుస్తూ వుంటే వారి ప్రతి అడుగు క్రిందను ఒక పద్మము ప్రకటితమై అదృశ్యమైంది. ఆ వింతను అందరూ తిలకించి విస్మితులైనారు" అని చెప్పుచూ శ్రీవిఠల్‌బాబా మహరాజ్‌వారు ఆ దృశ్యాన్నంతటినీ పునరావలోకనం చేసుకుంటూ కన్నులానందాశ్రువులు స్రవించుచుండగా అలౌకికానందా నుభూతిని తనలో ఇముడ్చుకుంటూ లేచి "ఒకసారి ఈ నేలను తాకి, ఈ పుణ్యభూమికి మనమంతా నమస్కరించాలి" అంటూ నమస్కరించారు.

వెంటనే శిష్యులు, భక్తులు అందరూ ఆ నేలను తాకి నమస్కరించి, ముక్తకంఠంతో

"దిగంబరా! దిగంబరా! శ్రీపాదవల్లభ దిగంబరా!" అని ఎలుగెత్తి నామస్మరణ చేసి "సమర్థసద్గురు శ్రీపాద శ్రీ వల్లభ మహరాజ్‌కి జై" అని జయజయ ధ్వానములు చేశారు.

శ్రీ బాబావారు మాకు ఆవిధంగా తాము దర్శించిన అద్భుత ఘట్టాన్ని వర్ణిస్తూ ఉన్న సమయంలో వారిలోని పులకింతను, అలౌకికానందమును చూచి మేమున్నూ తన్మయులమైనాము. శ్రీపాద శ్రీవల్లభస్వామి వారి కృపాకటాక్షమును మాకు కలిగించిన గురుదేవులకు కృతజ్ఞతాపూర్వక వందనములు చేసుకొన్నాము.

ఆ రోజు సాయంకాలం శ్రోతలందరమూ ఒక దగ్గఱ చేరుకొని శ్రీబాబాగారు తెలిపిన శ్రీపాదస్వామి వారి లీలలను మననం చేసుకొంటూ ఉండగా శ్రీ బాబాగారు వచ్చి ఆసీనులైనారు. వారికి నమస్కరించి "గురుదేవా! శ్రీపాద స్వామివారి కరుణా కటాక్షములతో తమరు తెలిపిన లీల ఎంతో అద్భుతమైనది. తదుపరి ఆ భక్తులకు శ్రీ స్వామి ఏమి బోధించినారో చెప్పి మమ్మ ధన్యుల చేయం"దని అడిగాము.

అప్పుడు శ్రీబాబాగారు ఇట్లు చెప్పినారు. "అమ్మలారా! అయ్యలారా! శ్రీపాదస్వామి ఎంత దయామయుడో తెలుస్తున్నది గదా! మనమీనాడు ఇక్కడ ఈ విధంగా వారి దివ్యమైన దర్శనము పొందుటకు యోగ్యత కలిగి యున్నామంటే దీనికి వారియొక్క అవ్యాజకరుణయే కారణము. వారు మహాసంకల్ప సిద్ధులు. వారి సంకల్పబలమే మనలనిక్కడ నిలిపినది. ఈ క్షేత్రము యొక్క ఆవిర్భావము, దీనికి నాంది ప్రస్తావన అంతయు మీకు తెలియును గదా! ఇది ఆయన మనకు అనుగ్రహించిన మహా ప్రసాదం" అనుచు శ్రీ బాబాగారు గొంతు గద్గదికము కాగా శ్రీ స్వామిని తలంచుకొని ఇట్లు చెప్పటం ప్రారంభించారు.

శ్రీస్వామి వారి ఆదేశానుసారం కురువపురం పోతూ గోవిందభట్టు మొదలగు పెద్దలందరూ గ్రామస్థులను చూచి "రేపు ద్వాదశి. తర్వాత వచ్చే పున్నమినాడు దత్తజయంతి. ఆ రోజున శ్రీదత్త స్వరూపులైన శ్రీస్వామివారికి పాదపూజ చేసుకొందుముగాక!" అని చెప్పి, ఆ ఏర్పాట్ల నిమిత్తమై కొంత ద్రవ్యమును గ్రామపెద్దలకు ఇవ్వబోగా, వారు నిరాకరించి ఆ అవకాశమును, అదృష్టమును తమకు కల్పించమని గ్రామపెద్దలు ప్రార్థించిరి. తర్వాత శ్రీ స్వామివారి ఆదేశానుసారంగా గ్రామస్థులు వివిధ పరికరముల సహాయంతో ఈ యాత్రాబృందమును నది దాటించి కురువపురం చేర్చినారు. అప్పుడు నదిలో నీరు తక్కువగా ఉన్నందున ఎట్టి ఇబ్బందులు కలుగలేదు.

ఆ ప్రశాంత వాతావరణము, శ్రీస్వామివారి ఆవాసము జూచి గోవిందభట్టు మొదలైన భక్తులు అత్యంత ఆనందమును పొందినారు. "ఇంతగొప్ప ప్రదేశము కావుననే శ్రీస్వామివారు జనపదాలను వదలి ఇక్కడకు వచ్చి తపస్సు చేసుకొనుచున్నారు. ముందుముందు కాలంలో స్వామివారి పాదస్పర్శతో ఈ క్షేత్రం మరింత పవిత్రతను సంతరించుకొని స్వామి మహిమలకు ఆలవాలం కాగల"దని చిదంబర శాస్త్రిగారు అన్నారు. మరియు "అళందిగ్రామం సంత్‌జ్ఞానేశ్వర్ మహరాజ్ వారి కారణంగానే పవిత్రతను సంతరించుకొన్న"దని వివరించారు. ఆ యాత్రా బృందములోని వారందరూ ఆపవిత్ర ప్రదేశమంతా తిరుగుచూ అచ్చట ప్రకృతిని మరియు నెమళ్ళ

కుందేళ్ళు జింకలు అచ్చట తిరుగుచుండుట చూచి ఆనందపడుచూ వివిధ రకాలుగా వారు దర్శించిన అనేక దివ్యక్షేత్రములకున్నూ ఈ పవిత్ర క్షేత్రమునకున్నూ గల భేదమును వర్ణించుకొన్నారు. క్రమంగా సంధ్యాసమయం అయింది. అందరూ కృష్ణానది చేరుకుని స్నానాదులను ముగించి సంధ్యావందనములు చేసుకొని తిరిగి (దీవికి) గడ్డపైకి చేరుకొని శ్రీ స్వామివారుండు ప్రదేశమునకు చేరినారు. అది ప్రదోష పూజా సమయం. శ్రీ పాదులవారు ఒక అశ్వత్థ వృక్షము క్రింద ధ్యాన నిమగ్నులై ఉన్నారు. వారందరూ కూడా స్వామివారి స్థితిని గమనించి వారిచుట్టూ చేరి నమస్కరించుకొని ధ్యానానికి ఉపక్రమించారు. నాలుగు ఘడియలు గడచిన పిదప శ్రీస్వామి వారు "జైగురుదత్త – శ్రీ గురుదత్త" అని ధ్యానమును విరమించినారు. అందరూ ఆ జయజయ నాదంతో జాగృతిచెంది శ్రీస్వామిని చూచారు. శ్రీస్వామివారు "మీరందరూ ఈరాత్రికి ఇచ్చటనే జాగరణ చేయండి నేను అలా వెళ్ళివస్తాను" అని వడివడిగా పడమటి వైపు కొంతదూరం సాగి అచ్చటనున్న వృక్షములవెనుకకు వెళ్ళారు.

పది నిముషముల తర్వాత గోవిందభట్టు అతని మిత్రులు స్వామివారు వెళ్ళినవైపుగా వారిననుసరించి నడుస్తూ అల్లంతదూరంలో ఆగి అక్కడనుండి గమనిస్తున్నారు. దూరంగా ఆకాశంలో వివిధ వర్ణాల వెలుగు పుంజములు కన్పించినవి. ఆ వెలుగులు దగ్గరైన కొద్దీ వివిధ దేవతలు, యోగుల రూపంలో దర్శనమైనది. వారందరూ తేజోరూపులై శ్రీస్వామివారిని దర్శించి వారితో సంభాషణలు జరిపినట్లుగా గ్రహించగల్గారు.

నిశ్శబ్దంగా వెనుకకు మరలి కొలది దూరంలో ఆగి అచ్చటి వృక్షముల క్రింద విశాల ప్రాంగణములో కూర్చుని సత్సంగము, నామస్మరణములతో ఈరేయి గడపాలని నిర్ణయించుకొని గురువులను ప్రార్థించుకొని శ్రీసూక్తము, పురుష సూక్తములను పఠించిన తదుపరి చిదంబర శాస్త్రి తోటివారితో "మిత్రులారా! మన యాత్ర విశేషంగా పూర్తి కాబోవుచున్నది. అనేక జన్మలలో మన మాచరించిన పుణ్య కర్మల ఫలితంగా ఈ స్వామి సన్నిధికి చేరినాము. వారి దివ్యరూపం ఒకమారు నారాయణుడు గాను, ఒకమారు జగన్మాతగాను, ఒకమారు విద్యను ప్రబోధించు మహా గురువుగాను, వేద రహస్యములను దెల్పు బ్రహ్మవేత్తగాను నా మనసుకు గోచరిస్తూ వుండినది. ఈ రోజు పరమ పవిత్రమైన ఏకాదశీ పర్వదినం. ఇన్ని రోజులు యాత్రచేసి ఈ రోజుకు వీరి సన్నిధికి చేరుట గూడ విశేషమే! ఇవి ధనుర్మాసములో వచ్చు పవిత్ర దినముల అనుభవము మనకు మరువరానిది. రేపు ద్వాదశి. మన వద్ద నున్న వస్తువులు, గ్రామస్థులిచ్చిన కొన్ని

పదార్థములతో ద్వాదశి పారాయణను ఈ పరమ పవిత్ర క్షేత్రమందు పూర్తి చేసెదము. శ్రీ స్వామి వారిని కూడ మనతో కలిసి భిక్ష చేయుమని ప్రార్థించెద"మని సూచన చేసెను.

అదే విధంగా శ్రీ స్వామి వారిని ప్రార్థించి రేపు రాబోవు పూర్ణిమనాడు దత్త జయంతి పర్వ దినమున వారికి పాదపూజ కొరకు అనుమతిని కోరవలసియున్నదనెను. ఏ గురువును పూజించినా శ్రీ దత్త గురువే స్వీకరించునని శాస్త్రము. అందుకని శ్రీవారి అనుమతిని ముందుగా పొందవలెనని పలికెను.

అందరు అది విని సాధు! సాధు! అని జయ జయనాదములు చేసిరి. గోవిందభట్టు అమితమైన ఆశ్చార్యానందములతో ప్రేమగా "చిదంబరా! నీ హృదిలో కలిగిన ఈ యోచన నీది కాదు. మన రాకతో ఆనందము కల్గి ఇచ్చట గుప్తంగా అనేక సంవత్సరాలుగా తపమొనర్చుచున్న యోగులు ఇటువంటి ఉత్సవమును జరిపించ సంకల్పించి నీచేత పలికించారు. భళీ! భళీ! అనంతకాలము నుండి దైవారాధన, గురుసేవ నిష్ఠా గరిష్ఠులమై ఆచరించినందులకు మనకు ఈ అపూర్వ అవకాశము వారలచే సంకల్పించబడినది" అని పలికి చేతులు జోడించి ఆ మహా యోగులకు నమస్కరించెను. పాండురంగభట్టు కల్పించుకొని "మిత్రమా! ఎక్కడెక్కడి వారమో! మన గురువుల అనుగ్రహంతో మరల ఈ విధంగా కలుసుకొను భాగ్యము కలిగింది. నాకైతే చిన్నతనంలో గురుకుల వాసంలో కలిసియున్నట్లుగా వున్నది. ఆనాడు అనేక పర్వదినములను కలిసి చేసుకొన్నాము. తర్వాత సాంసారిక జీవితంలోపడి అనేక శుభకార్యములను విడివిడిగా జరుపుకొన్నాము. తిరిగి ఇప్పుడు అందరు కలిసి పర్వదినాలను గడుపుకొను భాగ్యము కలిగినదనెను.

శ్రీ రామానందపూజారి ఇలాగన్నాడు.

"ఘటనములు దైవ సంకల్పము చేతనే కల్పింపబడతాయి. ఇదికూడ అటువంటిదే! ఆ పాండురంగడే మనకు ఈ భాగ్యాన్ని కల్గించ సంకల్పించుకొన్నాడేమో? త్రయోదశి రోజున మనం భిక్షా సమయముననే శ్రీవారిని మొదట దర్శించుకొనిన ప్రదేశమునకు చేరి పరిసర గ్రామస్థుల సహకారములతో ఉత్సవమునకు ఏర్పాట్లు చేసుకొనిన బాగుండును అని ఒకరికొకరు చెప్పుకొని అందరును వివిధనామ సంకీర్తనలతో ఆ రాత్రి గడిపిరి. తెలతెలవారుచుండగా నదీ తీరమునకు చేరి స్నానానుష్ఠానములను గావించుకొని తిరిగి ఆ పవిత్ర స్థలమునకు చేరుకొనిరి. శిష్యులను తమ వద్ద నున్న వస్తు సామగ్రితో పాకము చేయ నాజ్ఞాపించి ఎవరికి వారు విడివిడిగా కూర్చుండి వారి వారి అనుష్ఠాన దైవములకు మంత్రబద్ధంగా పూజగావించుకొనిరి. ఈలోగా పాకము తయారైనది. శిష్యులు ఈ విషయము గురువులకు తెలిపినారు.

రామానంద పూజారి లేచి తమ అనుష్ఠానదైవములకు పదార్థములను నివేదన చేసి మంగళహారతి ఇచ్చినారు.

అంతలో శ్రీస్వామి వారు వచ్చిరి. శ్రీస్వామి వారి కెదురేగి గోవిందభట్ చేతులు జోడించి మహాత్మా! భిక్ష సిద్ధమైనది. తమరాకకై ఎదురుచూచుచున్నాము అనగా శ్రీస్వామివారు "గోవిందజీ! ఈ రోజు భిక్ష మీతోనే చేయవలెనని కురువపురము తొందరగా చేరుకున్నాను" అన్నారు.

శిష్యులు మోదుగ ఆకుతో తయారుచేసిన విస్తరులలో 5గురు గురువులకు వడ్డన చేసినారు. వారు ద్వాదశి పారాయణను పూర్తిచేసిన పిదప శ్రీస్వామి వారు శయనించగా ఈ నలుగురు వారి చుట్టూ చేరి సేవ చేస్తూ వారియొక్క అపారమైన కరుణను పొందసాగిరి. మిగిలిన శిష్యులు వారి భోజనములను ముగించిరి" అని తెలిపి తదుపరి వృత్తాంతమును మరొక్కనాడు తెలిపెదనని శ్రీ బాబాగారు "జయము! జయము! శ్రీపాద స్వామి వారికి" అని జయజయనాదములు చేసిరి. అందరమున్నూ వారితో శ్రుతి కలిపినాము.



# 3వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభస్వామినే నమః

### గురువుల అవ్యాజకరుణ

అనంతా! హే! భగవంతా! నీ లీలలు వర్ణింప ఆదిశేషుడైన చాలడనగా నేనెంత స్వామీ! జీవులపై అవ్యాజకరుణను ప్రసరింపజేయుటకై అవతరించిన దేవా! సద్గురు తత్త్వమును ఈ భువిపైన స్థాపించి సర్వులకూ జ్ఞానమును ప్రసాదించి పునీతులను చేయగల సామర్థ్యము వేరెవ్వరికి గలదు స్వామీ! మాకు తమ దర్శన, స్పర్శన, సంభాషణాది భాగ్యమును కల్పించి మమ్ముద్ధరించు దేవా! నీకు అనంతకోటి నమస్కారములు. సద్గురువులు ఘటనాఘటన సమర్థులు. ఆనాటి వశిష్ఠ మహర్షి దశరథ మహారాజుకు ప్రేరణనిచ్చి తమ తపశ్శక్తితో పుత్రకామేష్టి యజ్ఞకర్మ చేయించి శ్రీ మహావిష్ణువు భువిపైన అవతరించుటకు కారణమైనారు. తన్మూలమున రాక్షస సంహారం జరిగి భూభారము తగ్గి శాంతి పరిరక్షణ జరిపించారు. ద్వాపరయుగంలో వేద వ్యాస భగవానుడు గాంధారి యొక్క గర్భము విచ్ఛిన్నమై నూటొక్క శకలములుగా విడిపోగా ఆ భాగాలన్నింటినీ నేతి కుండలలో భద్రపరచి తన అద్భుత తపశ్శక్తితో అన్నింటికీ రూపమును ప్రాణమును ప్రసాదించుటే గాక వారందరినీ మహా బలాఢ్యులుగాను, వీరాధివీరులుగాను అగులాగున అనుగ్రహించడం జరిగింది. గురువనగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల సమిష్టిరూపం అని నిరూపించినారు. కలియుగంలో సద్గురువుల అవసరం ప్రతి వ్యక్తికీ వున్నదని బ్రహ్మదేవుడు –కలి బ్రహ్మ సంవాదంలో– సూచించారు.

శ్రీపాద శ్రీవల్లభుల వారు జగద్గురువులై అవతరించారు. కావున వారి లీలలు అమోఘం. వాటిని వినిపించి మమ్ము కృతార్థులను చేయండని పూజ్యశ్రీ విఠల్‌బాబావారిని ప్రార్థించగా ఇట్లు ప్రారంభించినారు.

“శ్రీపాదరాయా! సద్గురూత్తమా! కార్యకారణ స్వరూపా! నీ సంకల్పమే గురుభక్తి ప్రదీపన మొనర్చుటతో ప్రాచుర్యం పొందినది. నీ అడుగుజాడలలో నడచుచున్న మా యొక్క సర్వ రక్షణా భారము నీదే! నీవు పలుకమన్న పలుకు పలికెదను. నీకన్న అన్యమేదియు లేదు. ఈ విశ్వ స్వరూపుడవే నీవు. హే! విశ్వరూపా! మాపై నీ కరుణారసమును ప్రసరింపజేసి నీ లీలలను సంపూర్ణంగా దర్శింప జేయ వేడుచున్నాడీ విఠలుడు. అని కన్నులు మూసి ప్రార్థించి ఇట్లు చెప్పదొడంగిరి.

ధార్మికులారా! శ్రీపాద స్వామివారికి ఆతిథ్యమిచ్చిన ఆ బ్రాహ్మణులు ఆనంద పరవశులైరి. సాయంకాలము తమ అనుష్ఠానముల కొరకై శ్రీపాదులవారు పశ్చిమవైపునకు వెళ్ళగా వీరు ఉత్తర దిక్కునకు వెళ్ళి స్నానాదికములను ముగించుకొని గ్రామస్థులు పంపిన పాలు పళ్ళతో ఆనాటి అల్పాహారమును ముగించిరి. శిష్యులందరూ వారిచుట్టూ చేరి ఆసీనులు కాగా గోవిందభట్ ఈవిధంగా తన ఆనందమును వివరించసాగాడు.

మిత్రులారా! దత్త సాంప్రదాయ గురువులు, మహాత్ములు, అవధూతలు, చిత్రవిచిత్రమైన రీతులలో శిష్యులను పరీక్షించుతారని గ్రంథాలలో చదివాను. మరియు శిష్యులు గురుతత్త్వము నెరిగి ఓర్పుతోను, శ్రద్ధతోను, భక్తితోను సేవిస్తేనే ఆ మహాత్ముల నిజతత్త్వము దర్శనము, అనుగ్రహము సంపూర్ణంగా లభిస్తుందని చెప్పబడింది. శిష్యుడావిధంగా పరీక్షలకు నిలువలేక పోయినా, ఓర్పు కోల్పోయినా, శ్రద్ధ లోపించినా, వారి అనుగ్రహం పొందుట దుర్లభం కాగలదు. దత్త గురువులను ఆరాధించే శిష్యులు తమ సర్వస్వమును త్యాగం చేసి వారి సన్నిధిలో వినయము, భక్తి, ప్రేమ, దయ, సత్యవర్తనములతో నివసించాలి. సర్వజీవులయందు ప్రేమ అనుగ్రహము, దయ, కలిగి ప్రవర్తించాలి. ఈ ప్రకారం సేవించేవారికి గురువుల స్పర్శద్వారాను, వాక్కులద్వారాను, దృష్టిద్వారాను చేయబడే అనుగ్రహం శక్తిపాతమై భక్తులయొక్క, శిష్యులయొక్క శారీరక మానసిక సమస్యలను నివారించి వారికి రాబోవు విపత్తులనుండి గూడ రక్షణ కల్పించబడుతుంది.

ఈ సాంప్రదాయ గురువులు లభించుట, వారి శిష్యులుగ చేరుట ఎన్నో జన్మలలో చేసుకొన్న పుణ్యఫలం వల్లనే సంభవిస్తుంది. అని ఎందరో చెప్పగా విన్నాను. మనకు అటువంటి ఏ పరీక్షలు లేకుండా శ్రీపాదస్వామి సాక్షాత్ దత్తగురువు అద్భుత దర్శనాలు కల్గించారు. నా అంత అదృష్టవంతుడు ఉండడనిపిస్తుంది" అని గోవిందభట్టుగారు దత్తవాత్సల్యాన్ని కొనియాడారు.

అప్పుడు శ్రీపాండురంగ విఠలభట్టుగారు ఇట్లు ప్రవచించారు. "అవును మిత్రమా! నేనుగూడ పురాణములందు చదివాను. దత్త సాంప్రదాయ గురువులు శిష్యులనుద్ధరించే విధానమే ఒక విశిష్ఠమైన విధానము. వారు మొదట శిష్యులను ఆర్థికంగాను, ఆదిభౌతికంగాను, ఆధ్యాత్మికంగాను తీర్చిదిద్దుతారు. తర్వాత వారంతట వారే క్రమంగా ముక్త సంగులయ్యే విధంగా చేస్తారు. ఇంకొక విశేషమేమిటంటే దత్త సాంప్రదాయ గురువులు ఎన్ని జన్మలైనా సరే శిష్యులను వెంటనుండి కాపాడుతారు. ఈ సాంప్రదాయంలో ఒక గురువు వద్ద సేవకుడైన శిష్యునకు ఎక్కడకు పోయినా, ఏ గురువుకు నమస్కరించినా స్వీకరించేవాడు శ్రీదత్తుడేనన్న భావం పటిష్టంగా ఉండాలి. కావున

శ్రద్ధతో ఓర్పుతో సమర్థులైన గురువును సేవించి ముక్తిని పొందాలని చెప్తారు. మరియొక విశేష మేమంటే ఈ సాంప్రదాయములోని శిష్యులు ఏ గురువునైనా, ఏ దేవతనైనా దర్శించినప్పుడు అందులో తమ గురురూపాన్నే చూచుకొంటారు. వీరిని దత్త సాంప్రదాయకులైన గురువులు సదారక్షిస్తూ వుంటారు. ఈ విశేషభావాన్ని అనేక ఇతిహాసాల ద్వారా తెలుసుకొన్నాము. ఈరోజు ఆవాక్యాలు అనుభవంలోనికి వచ్చినా"యని సంతోషంతో గొంతు గద్గదమవుతుండగా చెప్పారు.

తర్వాత చిదంబరశాస్త్రి "సత్యం సత్యం పునః పునః సత్యం" అన్నట్లుగా "మిత్రులారా! నిజమే! శ్రీదత్తస్వామి దర్శనము బహు సులభమని కొందరు చెప్తారు. ఆయన కృప, దర్శనము బహు దుర్లభమని కొందరు చెప్తారు. ఈ సాంప్రదాయ గురువులు తమ దరి చేరిన శిష్యులను అనుగ్రహించే విధానంలోనే విశిష్ఠత ఉన్నమాట వాస్తవమే. ముందుగా వారు శిష్యులకు జటిలమైన (బరువైన) అర్థంకాని వేదాంతం బోధించరు. వారు చెప్పేవి అనుభవపాఠాలు. శిష్యుల సమస్యలను బాధలను తీర్చే ఉపాయం చెబుతారు. కాని ఇల్లు-వాకిలి, ఆలు, బిడ్డలు, బంధాలు కావున వాటిని వదిలి వేయమని చెప్పరు. ఎవరి బాధ్యత ఎంతవరకు నిర్వహించాలో చెప్తారు. నిర్వహించడానికి శక్తిచాలక బాధపడే శిష్యులకు ధైర్యం చెప్పి నిర్వహింపచేస్తారు. అనికూడా నేను కొన్ని గ్రంధాలలో చదివాను. కొన్ని సమస్యలకు పరిష్కారం సూచించి ముందుకు నడుపుతూ కర్మసిద్ధాంతాన్ని దానిలోని సూక్ష్మార్థాలను వివరించి బోధించుతారు. అనుభవానికి వచ్చే కర్మలన్నీ జీవుడు పూర్వం చేసుకున్నవే కావున దుఃఖానికి కష్టానికి ఎవరో కారణం అని నిందించే వారి మనస్తత్వాన్ని మార్పు చేస్తారని కూడా చెప్పబడివుంది. మనకీనాడు కల్గిన దర్శనాలు, నిదర్శనాలు మనపూర్వీకుల అనుగ్రహం అంటూ ఆనందపరవశులై చెప్పారు.

వారందరూ ఆ విధంగా వారివారి అనుభవాలను గూర్చి చెప్పుకుపోతూ ఉంటే రామానందపూజారి గారు తన్మయత్వము ననుభవిస్తూ ఉన్నారు. తర్వాత "మిత్రులారా! ఈ దత్తగురువు మనలననుగ్రహించిన విధానము మరింత వింతచర్య! కానీ నేను కొందరు సాధువుల ద్వారా తెలుసుకొన్నదేమిటంటే దత్త సాంప్రదాయ గురువులు శిష్యుని మనస్సు, బుద్ధి శుద్ధత్వాన్ని పొంది నిర్మలమగుటకు ఎన్నో విధాల జాగ్రత్తలు తీసుకుంటారు. శిష్యుడు తనవైపుగా ఒక్క అడుగు వేస్తే గురువు తొమ్మిదడుగులు వేసి శిష్యుని చేరదీసుకుంటాడు. అదృశ్యంగా శక్తిపాతం ద్వారా శిష్యుని అంతరంగంలో నిద్రావస్థలోనున్న శక్తిని జాగృతం చేస్తారు. అతని జ్ఞానాన్ని చైతన్యవంతం చేసి పరమోత్తమ జ్ఞానిగా తీర్చిదిద్దుతారు. వారు ఇట్లు చేస్తానని నోటితో చెప్పేదానికన్నా

చేసేదే ఎక్కువగా ఉంటుంది. ఆధ్యాత్మిక పురోగతిని పొందిన శిష్యుడు తన స్థితికి, తన ప్రజ్ఞకు తానే ఆశ్చర్యపోయి ఇది తనలో పనిచేస్తున్న గురుకృప అని గమనించుకోవాలి. లేకుంటే అహంకార రక్కసి కోరల్లో చిక్కుకుంటాడు. సచ్ఛిష్యుడైతే లోకంలో కీర్తి, ప్రతిష్ఠలు పొందుతాడు. కానీ నాకు ఈనాడు దత్తానుగ్రహం ఇంత సులభంగా లభించింది. ఇదంతా మా పాండురంగ విఠల్‌బట్టుగారి వల్లనేనని నేననుకుంటున్నాను మరియు పండరివాసుడైన విఠలుని దయవల్లనూ నన్నీ అదృష్టం వరించింది. ఈ యాత్రలో మీ అందరితో పాల్గొని శ్రీస్వామి దర్శనం పొందగలగడం నా పురాకృత సుకృతమే" అన్నారు. ఇలా వారలు సంభాషణ చేయుచుండగనే శ్రీపాద వల్లభులు అచ్చటికి చేరి తమ ఆసనంపై పవళించారు. అది గమనించి అందరూ విశ్రాంతికి ఉపక్రమించారు.

తెల్లవారి స్నానాదికములు పూర్తి చేసుకొని జప అనుష్ఠానములు కావించి వారంతా అక్కడనే తమ భిక్షా కార్యక్రమం పూర్తి చేసుకొనిరి. శ్రీపాదస్వామి వారు నిత్యము చేయురీతిగా తమ అనుష్ఠానములు పూర్తి చేసుకొని భిక్షకు బయలుదేరగా పంచదేవ పహాడ్ గ్రామ పెద్ద రామాచారిగారు స్వామిని తమ యింటికి భిక్షకు ఆహ్వానించి భక్తి శ్రద్ధలతో స్వామికి భిక్ష సమర్పించారు. తదుపరి స్వామి దర్బారు ప్రదేశమునకు చేరిరి. గోవిందభట్టు మొదలైన యాత్రికులు కూడా దర్బారు ప్రదేశమునకు చేరుకున్నారు.

గోవిందభట్టు మొదలగువారు శ్రీస్వామితో ఇట్లు విన్నవించుకున్నారు. "ఓ! దేవాదిదేవా! దివ్యప్రభావా! రాబోవు పౌర్ణమి దత్తాత్రేయ జయంతి. మాకు మీరే దత్తస్వరూపులు. కావున ఆనాడు మాకు మీరు దర్శనమిచ్చిన ఈ దివ్యసుందర ప్రదేశంలో, తాము దర్బారు చేయు స్థలము నందే తమకు పాదపూజ చేయు భాగ్యమును ప్రసాదించమని త్రికరణశుద్ధిగ కోరుచున్నాము. ఇంతటి పర్వదినమున మిమ్ము అర్చించుకొను భాగ్యము మా జన్మకు మరల లభించునా? సద్గురూరాయా! మా యందు గల వాత్సల్యముతో తమరు మాకు అనుమతిని ప్రసాదించండి" అని మరీమరీ ప్రాధేయపడి కోరుకున్నారు.

శ్రీస్వామివారు చిరునవ్వులు చిందిస్తూ ఆశీర్వదించారు. భక్తుల కోరికలను భగవంతుడు కాక మరెవరు తీర్చాలి. వీరి కోరికయు సమంజసముగానే ఉంది. ఇప్పుడు వీరు ప్రారంభించబోయే ఈ దత్తజయంతి ఉత్సవము అనేక రూపాలుగా ముందుముందు కాలంలో విస్తరించగలదు. అందుకు ఇవి ప్రారంభఘడియలు. అని వారి సమ్మతిని తెలిపారు.

చతుర్దశి రోజున భక్తులంతా కలిసి పంచదేవపహాడ్, పసుపల గ్రామస్థుల సహాయంతో

దర్బారు ప్రదేశమంతా పచ్చిఆకుల పందిరి నిర్మాణం చేశారు. గోమయంతో నేలంతా అలికి రంగవల్లులతో అలంకరించారు. అనేకమైన పువ్వులు సేకరించి చక్కని వేదికను ఏర్పరిచారు. పంచపల్లవములతో అలంకరించారు. శ్రీ స్వామి వారి పాదపూజకు కావలసిన వస్తు సామాగ్రి, సుగంధద్రవ్యాలు, పూవులు, పండ్లు మరియు పూజాపాత్రలు అన్నీ సమకూర్చుకొనిరి. గ్రామపెద్దలు వెంటరాగా శ్రీ గోవిందభట్టు ప్రముఖులు శ్రీపాదస్వామి వారిని సభాస్థలికి ఆహ్వానించి తోడ్కొని వచ్చుటకు సూర్య నమస్కారశిల వద్దకు ఎదురేగిరి. శ్రీపాదులవారు నిత్యానుష్ఠానము ఒనరించుకొని నదిలోనుండి బయటకు వచ్చి తాము నిత్యము కొలది సమయము నిలబడుచోటుకు చేరగనే భక్తబృందము వారిని సమీపించారు.

ఆరోజున దివ్యతేజో సంపన్నమైన శ్రీస్వామి వారి ముగ్ధ మనోహర మంగళకాంతులీను మందస్మిత వదనారవిందమును దర్శించినంతనే వారందరికి నిత్యము దర్శించు శ్రీస్వామి వారి యందు ఈరోజున ఒక అలౌకిక సౌందర్యము పొడగట్టినది. ఆ వచ్చిన వారందరూ క్షణకాలం కనురెప్పలార్పక అట్లే చూచుచు నిలిచిరి. శ్రీపాదస్వామివారు సర్వజ్ఞులు కనుక వారిని పలుకరించి "దత్తస్వామి పూజకు అన్నీ సిద్ధమైనవా?" అని అడిగిరి. గోవిందభట్టు తేరుకొని "స్వామీ! అన్నీ సిద్ధపరిచితిమి. తమ రాకకై వేచియున్నాము. తమరినాహ్వానించుటకై వచ్చి ఏదో తమకము నందుండి మాట్లాడలేక నిలబడితిమి. స్వామీ! తమరు ఈ దీనులను క్షమించవలెనని శ్రద్ధాభక్తులతో వేడుకొనెను.

శ్రీస్వామి చిరునవ్వు నవ్విరి. పండితులందరూ ఆహ్వానపూర్వకముగా ఉచ్చైస్వరముతో వేదపఠనము ఆరంభించిరి. వారు ముందు నడుచుచుండగా శ్రీస్వామి వారిననుసరించిరి. అట్లు శ్రీస్వామిని ఉత్సవ లాంఛనముగా దర్బారుస్థలమునందలి వేదికవద్దకు తోడ్కొని వచ్చిరి. శ్రీస్వామి వారు ఆసీనులు కాబోవుచుండగా అందరూ చూచుచుండగా ఆసనముపై వ్యాఘ్రాజినము ఒకటి ప్రకటమైనది. తదుపరి శ్రీస్వామి దానిపై ఆసీనులైరి. ఆ దృశ్యము అక్కడచేరిన భక్తులందరిని ఆశ్చర్యచకితులను చేసినది. ఎవరూ వేయకుండానే ఆ వ్యాఘ్రాజినము అక్కడికి ఎట్లు వచ్చినదో ఎవరికీ అంతుచిక్కలేదు.

అప్పుడు గోవిందభట్టు శ్రీస్వామివారిని సాక్షాత్ జగద్గురు శ్రీదత్తస్వామిగా భావించి ధ్యాన, ఆవాహన, ఆసనాదికములను మహాసంకల్పము పఠించుచూ, నమకచమకములతో శ్రీస్వామి వారికి అర్ఘ్య, పాద్యాదికముల సమర్పించి పాదాలను అభిషేకించిరి. గంధపుష్ప మాలాలంకారములు చేసిరి. అర్చనానంతరం ధూపదీప నైవేద్య షోడశోపచార పూజను పూర్తిచేసిరి. వేదోక్త మంత్ర

పుష్పమును పఠించి భక్తి జ్ఞాన వైరాగ్యములను ప్రజలందరిలోను కల్గించి సుఖశాంతులను ప్రసాదించు దత్తమూర్తికి నమస్కారశతములు సమర్పించిరి. శాంతి మంత్రములను పఠించిరి.

గురుపూజానంతరము శ్రీవారికి పంచభక్ష్య పరమాన్నములతో భిక్షనర్పించిరి. ఘనమైన సమారాధనము అక్కడ చేరిన వారందరికీ జరిపించబడెను. వచ్చినవారందరూ తృప్తిగా భుజించిన పిమ్మట మిగిలిన పదార్థములు కృష్ణానదిలో జలచరముల కర్పించబడెను. ఈ పూజా కార్యక్రమము మరియు భిక్షా కార్యక్రమముల అనంతరము శ్రీస్వామివారు అందరికీ ఆశీస్సులిచ్చి కురువపురమునకు చేరినారు. గోవిందభట్టు తదితరులు కూడా స్వామివారితో ఆ సాయంత్రం గడుపవలయునని నదిని దాటి కురువపురము చేరుకున్నారు. ఆరాత్రి అంతయూ భజన సత్సంగములతో గడిపినారు.

దత్తజయంతి ఉత్సవాలు పూర్తి చేయబడినాయి. మరుసటిరోజు యధాప్రకారం శ్రీపాదస్వామి వారు బ్రహ్మముహూర్తంలో నదిదాటి భాస్కర బండ చేరుకుని నిత్యానుష్ఠాన కార్యక్రమాలు నిర్వహించారు.

గోవిందభట్టు మొదలైనవారంతా స్థానికుల సహాయంతో నదిదాటి స్నానాదికాలు చేసి సంధ్యావందనాది నిత్య కార్యక్రమాలు పూర్తి కావించుకొని శ్రీస్వామి ఉన్న ప్రదేశమును చూడగా శ్రీస్వామి వారింకా ధ్యానములోనున్నట్లు తోచింది. వారికి ధ్యానభంగం కల్గించకుండా అందరూ తిన్నగా దర్బారు ప్రదేశానికి చేరుకున్నారు.

అంతకుముందు వారికి కల్గిన దర్శనాలను తలచుకొంటూ మరలమరల స్వామి అనుగ్రహాన్ని నెమరువేసుకోసాగారు. వారందరూ ఆ విధంగా ఆనందపరవశులైయుండగా ఆ కూర్చున్నవారిలో ఆంజనేయశర్మ అను మందబుద్ధియైన బ్రాహ్మణబాలుడు కూడా వుండెను. యాత్రబృందము పంచదేవపహాడుకు చేరకముందే ఆంజనేయశర్మ ఆ బృందంలో కలిశాడు. ఆ బృందంలో ఒకడిగా వారితోపాటు కృష్ణానదిలో స్నానమాచరించి వారి ననుసరిస్తూ ఉన్నాడు.

అందరితోపాటు శ్రీపాదస్వామికి సాష్టాంగనమస్కారం చేశాడు. వారందరూ శ్రీపాదులవారి మహిమలు గూర్చి వారి కరుణా కటాక్షము గూర్చి ఒకరికొకరు చెప్పుకొనుట వింటున్నాడు. శ్రీస్వామి సాక్షాత్తు దత్తస్వామియని ప్రశంసించుట విన్నాడు. వారి సంభాషణలోని విషయము వానికేమియు అర్థము కాలేదు. కానీ దత్తగురువులు మహాత్ములు. ఆశ్రితుల కర్మలను మెల్లగా తొలగించి ఉద్ధరిస్తారని చెప్పుకొన్న విషయాలు కొంచెం కొంచెంగా అర్థమయినవి. ఎందుకంటే వాని తల్లి విసుగుతో నాకర్మకొద్దీ పుట్టావు. నీ కర్మకొద్దీ చదువు రాకుండా మూర్ఖుడవైనావు" అని

నిందిస్తూ ఉంటుంది. తన గ్రామంలో ఇరుగుపొరుగువారు కూడా "వీడు పూర్వజన్మలో ఏదో దుష్కర్మ చేసినాడు. అందుకే గాయత్రీమంత్రం కూడా పలుకలేడు. పుట్టడమైతే బ్రాహ్మణకులంలో పుట్టాడు. ఏమి ప్రయోజనం? వీడిది అజాగళస్తనం (మేక మెడచన్ను) వంటి జన్మ!" అంటూ నిందిస్తూ ఉంటారు. వాడు ఏమీ పని చేయడం కూడా చేతకాని వాడు. వాని అదృష్టం కొద్దీ ఈ ఏడు రోజులు ఈ యాత్రాబృందంతో ఉంటూ వారితోటే తింటూ వారిమాటలు వింటూ గడిపాడు. నిత్యమూ శ్రీపాదస్వామిని దర్శించుకొనేవాడు. అదే వాడుచేసిన పుణ్యవిశేషం. తదుపరి శ్రీస్వామి అతనిని ఏవిధంగా ఉద్ధరించారో తెలియగలదు.

అచట పాండురంగ విఠలభట్టు మరియు చిదంబరశాస్త్రి ప్రముఖులు వారిశిష్యులకు అర్థమయ్యే రీతిలో స్వామివారి ప్రభావాన్ని వివరించి చెప్పారు. వారు చెప్పే సమయంలో గ్రామస్థులు కూడా కొందరు విన్నారు. అంతలో శ్రీస్వామి తమ అనుష్ఠానమును సూర్యనమస్కారములు ముగించుకొని దర్బారు ప్రదేశమునకు వచ్చి చేరినారు. శ్రీస్వామిని చూస్తూనే భక్తులంతా లేచి క్రమశిక్షణతో ఒకరితర్వాత ఒకరుగా వచ్చి సాష్టాంగ నమస్కారములు చేసి ఇట్లు చెప్పిరి. "స్వామీ! మీ సన్నిధిని వదలలేక పోవుచుంటిమి" అని గోవిందభట్టు దీనముగా పలికెను. "స్వామి సన్నిధిలో తాము అనుభవించిన అనిర్వచనీయ ఆనందము మరల ఎప్పుడు లభించునో!" అని చిదంబరశాస్త్రి పలికెను. పాండురంగ భట్టు ఈ విధముగా పలికెను. "ఓ! కృపానిధీ! జ్ఞానసాగరా! నీ అమృతదృష్టిచే మా పురాకృత సుకృతము ఫలించినది. అద్భుతమైన దివ్యానుభూతిని కలిగించారు. ఈవిధంగా దర్శన, స్పర్శన, సంభాషణాభాగ్యము పొందగలిగితిమి. మాకు ప్రసాదించిన ఈ దివ్యానుభూతుల స్మృతిని ఎల్లప్పుడు ఉండునట్లు అనుగ్రహించుమని వేడుకొనెను.

రామానందపూజారి ఇట్లు విన్నవించెను. "మీ ఆశీస్సులు, ఆదేశములు తీసికొని మేము తిరిగి పోవలసియున్నది. కాని పోవుటకు మనసు రాకున్నది. దయానిధీ! మమ్ములను ఇదేవిధముగా సర్వదా రక్షించుము" అని వేడుకొనెను. "దేవా! మా కవసరమగు జ్ఞానమును బోధించి, శాంతిని కల్గించి, పరమలక్ష్యమును తెలిపి గమ్యము చేర్చు భారము నీదేతండ్రీ!" అని ప్రార్థించెను.

## శ్రీపాదులవారి దివ్యప్రబోధం

శ్రీపాదస్వామివారు వారం రోజులుగా ఈ భక్తుల మానసిక స్థితిని అనగా ఆవేదనను, ఆనందమును గూడ తెలుసుకొంటూనే వున్నారు. ఇప్పుడు వారు స్వస్థానమునకు ప్రయాణమైపో వలసియున్నది. కావున వారి మనసుకు సుస్థిరమైన శాంతిని అనుగ్రహించి ఆశీర్వదించి పంప

వలసియున్నది. కావున శ్రీ స్వామివారిట్లు వారికి బోధించినా”రని శ్రీ బాబాగారు వివరణ ప్రారంభించారు.

అప్పుడు శ్రీపాదస్వామి ఆ భక్తులనుద్దేశించి “ధార్మికులారా! నిజ భక్తులారా! ఎంతో కష్టపడి గురుదర్శనమునకు వచ్చినారు. నిజానందమును పొందినారు. మానవజన్మ సృష్టిలోని సమస్త జీవరాసులలోను ఉత్తమమైనదిగా చెప్పబడినది. ఎందులకంటే ఈశ్వరుని కరుణను, లీలా విశేషములను గ్రహించుటకు తగిన బుద్ధి, జ్ఞానమున్ను ఈ మనుష్య శరీరంలో ప్రసాదించబడి యున్నది. ఇటువంటి నరజన్మను పొందిన జీవుడు ప్రకృతియందుగల సమస్త జీవులను గమనించి తన దేహముయొక్క ఔన్నత్యమును గ్రహించవలెను. జన్మ-మరణముల గురించి తెలుసుకొనవలెను. దీనికై అత్యంత జిజ్ఞాసతో అన్వేషించి సరియైన సమాధానముకొరకు వేగిరపడవలెను. భగవంతుని నిరంతరం చింతించవలెను. అట్లు మనసును, బుద్ధిని అంతర్ముఖమొనర్చి ప్రార్థన చేయు మానవునికి భగవత్కృపవలన సద్గురువు మానవ రూపంలో లభించగలడు.

అట్లు లభించిన తర్వాత భగవంతునికీ - సద్గురువునకు భేదమెంచక ఏమరక స్మరించి ఆ సన్నిధిని అనుభవించుట నేర్చవలెను. గురుని సామర్థ్యమే ఆ భక్తుని ద్వారా సర్వకాల సర్వావస్థల యందునూ ప్రకటితము కాగలదు. అప్పటివరకు జీవుడు ఆచరించిన దుష్కర్మల ప్రభావము భస్మీభూతమగును. సకలయోగ సాధనలవలన కలుగు లాభము ఆ క్షణమందే ఇట్లు పరిపక్వత నొందిన జీవునకు ప్రాప్తించును. సమర్థ సద్గురుని సన్నిధిని నిరంతరం మానసికంగా అనుభవించే వానికి ముఖ్యముగా క్షమ, శాంతి, విరక్తి, వివేకము, దానం, దయ, శమ, దమాదులన్నీ వేరు వేరుగ సాధించేపని లేకనే సహజముగా ప్రాప్తించును. మోహమనునది దరికి చేరదు. తనలోని మార్పులను తాను గ్రహించినా గ్రహింపకపోయినా (అవి సహజం కావున) ఇతరులకు ఆ మార్పులు ప్రస్ఫుటంగా కనిపించును. ప్రతి క్షణము తలంపులలోను, చేతలలోను అద్భుతమైన మార్పు కలుగును. మృత్యుభయము నుండి అతడు దూరమగుచున్నాడు. అటువంటప్పుడు ఈ కనిపించే ప్రకృతిలో ఏ శక్తులు అతనిని భయపెట్టలేవు.

సమర్థ సద్గురుని సేవించే ఉత్తమ సాధకునకు అసాధ్యమన్నది లేదని నమ్మండి. ఆధ్యాత్మికము - లౌకికములను వేరు చేసి చూడవద్దు. దృష్టిని సద్గురునియందు లేక భగవంతునియందు నిలిపినపుడు నిర్భయముగా క్షేమముగా లోకయాత్ర జరిగిపోవును. అతడేది సాధించవలెనని సంకల్పించునో అది ఎదుట ప్రత్యక్షము కాగలదు. ఆ స్థితిలో దైవ సంకల్పము, మానవ

సంకల్పములకు భేదమన్నది వుండదు. దైవమే ఈ విధమైన ఉత్తమ మానవుల ద్వారా ధర్మ సంస్థాపనమును సంకల్పించి లోకహితము చేయ ప్రారంభించును.

పరమాత్మను నిజముగా యోచించి సర్వహృదయాంతర్వర్తిగానే ఉన్నాడు అని తెలుసుకొని నమ్మితే చాలు అంతటా ఆయన దివ్యదర్శనం లభిస్తుంది. దర్శనమేకాదు. ఆదివ్య శక్తి సాక్షాత్తుగా అక్కడ ప్రకటమవుతుంది. ఆ స్థితిని పొందిన మరుక్షణం భగవంతుని దివ్యవాణి వినిపిస్తుంది. కర్తవ్యం చక్కగా అవగాహనకు వస్తుంది. ఆ పరాత్పరుని శక్తి ఈ శరీరాల ద్వారానే అద్భుత ప్రభావాన్ని ప్రసరింపజేసి సర్వులకు ఉపకారం జరిపిస్తుంది.

అటువంటప్పుడు ఆయనుభూతి తనయందేగాక ఎదుటివారియందునూ ప్రభావమును జూపును. ఆ పరమాత్మయొక్క నిగూఢ శక్తిని తన శక్తిగా భావించినచో అహంభావము చోటు చేసుకొని పతనమునకు దారితీయును. కాబట్టి నిరంతరం అహంకారదూరులుగా ఉండి పరమాత్మ దివ్య చైతన్యముతో ఐక్యమైయుండుటయే కర్తవ్యము. స్వాభిమాన మానవ సంఘముచే పరిత్యజించబడిన దీనులు, హీనులు, పాపులు, పతితులైన వారి యెడ పరమాత్ముని కరుణ తప్పక కలుగును. అట్టివారిని దైవసాక్షాత్కారము, గురుసాక్షాత్కారమును పొందిన వారు తప్ప ఎవ్వరు దయచూడగలరు? కావున వారిపై అపార దయతో వ్యవహరించి ఓర్పు, సహనంతో వారిని చేరదీసి వారి మార్గమును మళ్ళించి దైవత్వమువైపునకు త్రిప్పవలెనన్నదే దైవ సంకల్పము.

పాపులను దైవం ద్వేషించునన్న తలంపును దూరీకరించి దైవ ప్రేమ వారిపై పుష్కలంగా ప్రసరించునని వారికెఱింగించవలెను. అట్లు తెలిపినచో పాపులు, పతితులు దైవమునకు దగ్గరై తమ తమ ప్రవృత్తులను మార్చుకొనుటకు అవకాశము కలుగును. ఆర్తులు, అర్థార్తులు, జిజ్ఞాసులు, జ్ఞానులు అను నాలుగు విధములైన వ్యక్తులు పరమాత్మకు కావలసినవారేనని భగవద్గీతా వాక్యం ఉన్నది. కానీ సజ్జనులైన వారిలో మాత్రం పరమాత్మ తత్త్వమన్నది పూర్తిగా ప్రస్ఫుటంకావటం లేదు. ఈ మార్పే ఇప్పటికాలమాన పరిస్థితులను చక్కజేయుటకు కావలసియున్నది.

భక్తులారా! మీరు పొందిన ఇచ్చటి అనుభవాలు, అనుభూతులు మీకు ఎల్లవేళలా శాశ్వతంగా లభించునుగాక! మీమీ జీవితాలను భగవంతుని సేవకులుగా రూపొందించుకొనుడు! నామస్మరణ చేసినతోడనే నా కృప మీకు లభించగలదు!

మానవుని ప్రాపంచిక జీవితము ఆనందధామముగా మలచుకొనుటకు సృష్టిలో ఒకే మార్గము కలదు. అది నిస్వార్థసేవ, భగవదారాధన. దీనికై దేవయజ్ఞం, ఋషియజ్ఞం, పితృయజ్ఞం,

నరయజ్ఞం, భూతయజ్ఞములను పంచమహాయజ్ఞములు సూచించబడినవి. ఇవికాక దేవతా రాధనము, తల్లిదండ్రుల సేవ, మహాత్ములసేవ, అతిథిసేవ, సర్వజీవ రాశులయందు భూతదయతో వర్తించుటయనునవి కూడా పంచయజ్ఞములే. వీటిని సక్రమముగా ఏ ఆశ్రమము వారైనా ఆచరించి తరించవచ్చును. (బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్థము, సన్యాసము అని నాలుగు ఆశ్రమముల వారని భావము) అని హితవాక్యములు ప్రవచించిరి. ఆ ప్రవచనములలోని అద్భుతమైన ప్రబోధములు వారి మనసులకెంతో ఆనందాన్ని, కర్తవ్యపాలనను, ధర్మమార్గాన్ని అందించాయి. అందరూ ముగ్ధులైయుండగా గోకర్ణక్షేత్రవాసియైన గోవిందభట్టు పారవశ్యంతో **"దిగంబరా దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా"** అంటూ పెద్దగా నామం చేస్తూ అందరితో పలికించాడు. వారితో శ్రీస్వామివారు గూడా ఆ నామాన్ని బిగ్గరగా చేశారు. అందుకే అది అద్భుతమైన తారక మంత్రంగా రూపొందినది. చివరకు "అఖిలాండ కోటి బ్రహ్మాండనాయక రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ సమర్థసద్గురు శ్రీపాదవల్లభస్వామికి జయము జయము" అని జయనాదం చేశారు.

శ్రీపాదస్వామి ప్రసన్నవదనులై వారందరినీ ఆశీర్వదించారు. ఆనాడు ఆ మహాభక్తుని నోటినుండి అప్రయత్నంగా ఉచ్ఛరించబడిన ఆ దివ్యమంత్రము (దిగంబరా- దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా!) నాటినుండి నేటి వరకు అందరిచేత నిత్యం జపించబడుతోంది. తదుపరి భక్తులకు తారకమంత్రంగా గోవిందభట్టు, చిదంబరశాస్త్రిగారల ద్వారా ప్రచారం చేయబడినది. ఈ మంత్రజపం చేసి ఎందరో శ్రీదత్తదర్శనం పొంది తరించారు.

నేడు ఈ దివ్యమైన మహామంత్రము సర్వజనులకు ఆధారమైనది. ఇటువంటి దివ్యమంత్రము మొదటిసారిగ పలికిన ప్రదేశమే శ్రీపాదవల్లభుల దర్బారు ప్రదేశము. **అదియే నేటి శ్రీక్షేత్ర శ్రీవల్లభాపురం.**

కొలదిసేపట్లో పంచదేవ పహాడ్, పసుపలగ్రామపెద్దలు అచ్చటికి వచ్చారు. వారుకూడా ఆనామం వింటూ ఆభజనలో లీనమై కొంతసేపు నామం పలికారు. శ్రీస్వామి ఆపమని చేసైగ చేయగా అందరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు.

ఆయా గ్రామపెద్దలను చూచి శ్రీస్వామి ఇలా అన్నారు. మీరు ఏపనిమీద వచ్చినారు? అని ప్రశ్నించగావారు స్వామీ! ఈరోజున మీకు ఈ యాత్రికులకు భిక్ష ఏర్పాటు చేయుటకు మీ అనుమతి కోసమై వచ్చినాము. మా యందు దయయుంచి తాము అంగీకరించవలసినదని ప్రార్థించిరి. శ్రీస్వామి చిరునవ్వు నవ్వుచూ "నాయనలారా! ఇది ఎంతో పుణ్యప్రదమైన కార్యక్రమము.

అన్నిదానములకన్నా అన్నదానము చాలా గొప్పదని శాస్త్రములు ఘోషిస్తున్నవి. మీ అభీష్టం ప్రకారమే చేయుడని ఆజ్ఞాపించిరి. ఆ గ్రామములవారు ఎనలేని ఉత్సాహంతో కావలసిన పదార్థములన్నీ తెచ్చి వంటలు చేయించి సమారాధన నిర్వహించారు. శ్రీస్వామివారికి మొదట భిక్ష సమర్పించారు. శ్రీపాదస్వామి వారికి దక్షిణ సమర్పించుటకై వారు ప్రయత్నించుచుండగా శ్రీ స్వామివారు ఇదికాదు. నేను మీ నుండి కోరుకొనే దక్షిణ శ్రద్ధ, ఓర్పు మాత్రమే అన్నారు. తదుపరి అందరూ తృప్తిగా భుజించారు. గోకర్ణవాసియైన గోవిందభట్టుతో వచ్చిన యాత్రాబృందం శ్రీస్వామివారికి నమస్కరించారు. పండరీపుర క్షేత్రవాసుడైన పాండురంగ విఠలభట్టు, రామానందపూజారి వారి శిష్యులు అళందినివాసి చిదంబరశాస్త్రి వారి శిష్యులు వారివారి స్వస్థానమునకు పోవుటకు శ్రీస్వామి అనుమతిని కోరారు. శ్రీస్వామి ఆశీస్సులు పొంది అందరూ తిరుగుప్రయాణం అయ్యారు. శ్రీపాదస్వామితో గడిపిన క్షణాలను, దివ్యదర్శనానుభూతులను మనస్సులో స్మరిస్తూ పరవశంతో వారి నామాన్ని **దిగంబరా–దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా!"** అని నోరారా కీర్తిస్తూ వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళారు.

ఆ సంఘటన వలన పసుపల, పంచదేవపహాడ్ గ్రామస్థులు మరియు పరిసర గ్రామాల వారు శ్రీస్వామి మహాత్మ్యాన్ని తెలుసుకోగలిగారు. యాత్రకు వచ్చిన సజ్జనులతో కొంతదూరం నడిచి వారిని సాగనంపినారు. ఈ వృత్తాంతమంతా ఈ శ్రీవిఠల్ బాబావారి మనోదృష్టికి గోచరించినదని పలుకుచూ శ్రీపాద స్వామి వారి కరుణచేతనే ఎక్కడెక్కడివారునూ వచ్చి ఈ కురువపుర దర్శనం చేసుకొన్నారు. ఇప్పుడైనా ఎప్పుడైనా ఆ స్వామి వారి అనుగ్రహంలేనిదే ఎవ్వరూ ఈ గడ్డపైన అడుగిడలేరు. అనగా ఎవరు రాగలిగినారో వారిపై స్వామివారి అపార కరుణ ఉన్నదని గ్రహించుకోవాలి. అందుకే క్షేత్ర దర్శనానికి వచ్చిన భక్తులను ప్రేమతో ఆదరించాలని చెప్పి బోధించినారు.

శ్రీ స్వామివారు భౌతిక ధనమును ఏనాడు అపేక్షించలేదు. వారి వారి మనోభావాలనే దక్షిణగా స్వీకరించారు అంటూ శ్రీ బాబాగారు వివరించగా అందరం జయజయ నాదములు చేసినాము.

# 4వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

ఆహా! ఏమి వింత! మనం కలియుగవాసులైనందులకు దుఃఖపడే పనేమీలేదు. అందులో 20వ శతాబ్దములో పుట్టినందుకు ధన్యులమనే భావించాలి. ఎందుకనగా ఎక్కడికి పోవాలన్నా వేగవంతమైన ప్రయాణ సాధనములున్నవి. పోయిన చోటనెల్లా ఆహారపు అంగళ్ళున్నవి. ఆకలి బాధ లేదు. ఎన్ని క్షేత్రాలయినా దర్శించుకొని రావచ్చు. రాగలుగుచున్నాము. కానీ శ్రీపాద స్వామి వారి కాలంలో అనగా 14వ శతాబ్దంలో ఏ తీర్థయాత్రలైనా కాలినడకనే పోవాలి. ఆనాటి యాత్రికులకు ఏ గ్రామంలోనైనా ధార్మిక పురుషులు ఆదుకొని అతిథి సత్కారం చేసి భిక్ష పెడితే సరే! లేకుంటే పస్తులుండాల్సిన పరిస్థితే వుండేది. అటువంటి రోజులలో గోకర్ణం నుండి శ్రీశైలం, శ్రీశైలం నుండి కురువపురం కాలినడకన వచ్చినారంటే వారెంతటి పుణ్యాత్ములో వారి కథను మనం చెప్పుకొని, విని పుణ్యం సంపాదించుకొనుచున్నాము.

ముందురోజు శ్రీ బాబాగారు తెలిపిన శ్రీపాదులవారి అద్భుతలీలను మనసులో తలచుకుంటూ శ్రీ బాబావారికి నమస్కరించాను. శ్రీ బాబావారు నా వంక సాలోచనగా చూచారు.

నేనప్పుడు బాబాగారూ! తమరాఘట్టాన్ని వర్ణిస్తుంటే ఒకవిధమైన దివ్యానుభూతి మాకు గూడా ప్రసాదించినట్లనిపించింది. ఆ ఘట్టంలోని గోవిందభట్టు అనుభక్తుడెవరు? ఆ సత్పురుషుని ఉదంతమును గూడా దయతో వినిపించగోరుచున్నాను" అని ప్రార్థించగా శ్రీబాబాగారు చిరునవ్వుతో ఇట్లనిరి.

"సరే! అమ్మా! మీకు కుతూహలం ఉంటే, అందరూ కూర్చుంటే చెప్తాను. సత్కథా కాలక్షేపం అవుతుంది. మహాభక్తులైనవారిని స్మరించుకొనుటయే సత్సంగము యొక్క ఆంతర్యము. పోతనగారు చెప్పినట్లు.

"పలికెడిది భాగవతమట – పలికించెడివాడు రామభద్రుడట

నే పలికిన భవహరమగునట – పలికెద వేరొండు గాథ పలుకగనేలా?"

భాగవతము అనగా భగవంతునికీ భక్తునికీ గల సంబంధము అనుబంధముగా మారుట. ఈ అనుబంధము భక్తియను సూత్రముతోనే బంధించబడుతుంది. సృష్టిలోని జీవులన్నింటికీ భగవంతునితో సంబంధమైతే ఉన్నది. అది ఉన్నదని తెలియడానికి భక్తి కావాలి. అది లేనప్పుడు

భగవంతుడు మనకు దూరంగా ఎక్కడో ఉంటాడు. మనం దుఃఖిస్తుంటే ఆయన నవ్వుకుంటాడు అని కొందరు భావిస్తారు. కానీ భక్తులు ఈ సృష్టిలోని ప్రతి అణువునూ భగవంతుని రూపంగా విశ్వసిస్తారు. ఆరాధిస్తారు. కాబట్టి భక్తుని కథ భగవంతుని కథలో ఇమిడే ఉంటుంది.

## శ్రీగోకర్ణక్షేత్ర మహిమ

అలాగే గోవిందభట్టు అనువారు గోకర్ణక్షేత్రంలో నివసించేవాడు. శ్రీపాదస్వామివారు క్షేత్రాలన్నీ దర్శించుకొంటూ గోకర్ణం చేరి కొంతకాలం అక్కడే ఉన్నారు. ముందుగా మీకు గోకర్ణక్షేత్రం యొక్క విశేష మహిమను చెప్పి, తర్వాత గోవిందభట్టును గురించి చెప్తాను. ముందుగా క్షేత్రాన్ని కీర్తించి తర్వాత శ్రీపాదలీలలను కీర్తించుకొందాము.

భారతావనిలో – అరేబియా సముద్రతీరంలో – కర్ణాటక రాష్ట్రంలో గోకర్ణమనే ప్రసిద్ధిగాంచిన శైవపుణ్యక్షేత్రం అత్యంత పావనము, పురాతనమునైనది. పూర్వం రావణాసురుడు తన తల్లి పూజచేసుకొనేటందుకని లింగము కావాలని శివుని గూర్చి ఘోరతపస్సు చేసి ఆయనను మెప్పించాడు. శివుడు ప్రత్యక్షమై వరము కోరమనగా తనతల్లి సైకతలింగమునకు పూజచేస్తుండగా సముద్రపు అలలతాకిడికి అది చెదిరిపోయింది. కావున పూజ కొరకు ఆమెకు లింగం కావాలని కోరాడు. లేకుంటే ఈ కైలాసాన్ని పెకలించుకపోయి, లంకలో ప్రతిష్ఠించాలని వచ్చానన్నాడు. రావణుని కోరిక విని ప్రసన్నుడైన శివుడు తన ఆత్మలింగాన్ని ప్రసాదించాడు. ఈ ఆత్మలింగంవున్న చోటు కైలాసమేనని చెప్పాడు. దానిని క్రింద పెట్టకుండా తీసుకొని పోవాలని చెప్పాడు. దానిని తీసుకొని రావణుడు లంకకు పోవుచుండగా శ్రీ గణేశునికి కోపం వచ్చింది. తనను పూజించకుండా, తన అనుమతి లేకుండా తనను తలవకుండా, లెక్కచేయకుండా పోతున్న రావణుని ఎట్లైనా ఆపాలని నారదుని సహాయంతో గణేశుడు, విష్ణువు చేసిన లీలానాటకం వలన ఆ లింగము అచ్చట ప్రతిష్ఠించబడినది. ఇది ఒక వింత కథ. నారదుడు రావణునికి అడ్డుతగిలి సంధ్యాసమయం గుర్తు చేస్తాడు. ఆ సమయంలో సుదర్శన చక్రమును సూర్యునికి అడ్డువైచి కృత్రిమ సంధ్యా సమయాన్ని సృష్టించాడు విష్ణువు. రావణుడు చుట్టూ చూడగా గణేశుడు బాలకునిరూపంలో గోచరించాడు. ఆ బాలుని పిలిచి బ్రతిమాలి ఆత్మలింగము క్రింద పెట్టరాదు కనుక నేను సంధ్యవార్చుకొని వచ్చేవరకు దీనిని ధరించి వుండమని కోరాడు. అమాయాబాలకుడు నేను మూడుసార్లు పిలిచేలోపు రాకుంటే క్రింద పెట్టేస్తానని చెప్పగా, రావణుడు దానికి ఒడంబడి, ఆతని చేతికి లింగాన్నిచ్చి, సంధ్యవార్చుకొనుటకు సముద్రం వద్దకు పోయాడు. స్నానం చేసేలోపు

రావణా, రావణాయని మూడుసార్లు పిలిచి గణేశుడా లింగమును సకల దేవతలను స్మరించుచూ అచ్చట నేలపై ప్రతిష్ఠించెను. రావణుడు వచ్చులోపలనే ఆలింగము నేలలో బలముగా నాటుకుపోయెను. దానిని పెకలింప ప్రయత్నించి రావణుడు విఫలుడై మరలిపోయెను. ఆతని బలముకన్నా ఎక్కువ బలము కలిగినందున ఆలింగమునకు "మహాబలేశ్వరు"డని ఖ్యాతి కలిగెను. ఆలింగము రావణుని చేతి రాపిడికి గోకర్ణాకారము కలిగియున్నందున "గోకర్ణ"మనే పేరు సార్థకమై ఆ ప్రదేశము భూకైలాసమనే ఖ్యాతికి పాత్రమైనది.

అటువంటి దివ్యక్షేత్రంలో శ్రీపాదులవారు మూడు సంవత్సరాలు తమ అనుష్ఠానమును, తపస్సును కావించినారు. జ్ఞానబోధలు చేసినారు. శ్రీస్వామివారు అచ్చటికి చేరి కొన్నిరోజులు గడిచినవి. అయినను ఆ ప్రాంతవాసులకు శ్రీపాదుల వారి దివ్యత్వము, నిజతత్త్వము గురించి ఏమియు తెలియలేదు. ఆయనను ఒకసాధువుగాను, సాధకునిగాను, భిక్షకునిగాను ఎవరికి తోచిన విధంగా వారు భావించేవారు. శ్రీస్వామి వారి దివ్యత్వం బయటపడే సన్నివేశం ఇక్కడ ఇలా జరిగింది.

ఒకనాడు గోవిందభట్టు తన యింటి అరుగుపైన కూర్చుండి కొందరు మిత్రులతో ఆధ్యాత్మిక విషయాలు చర్చించుచూ సత్సంగము చేయుచుండెను. వారి చర్చలో గురుగీతలోని అంశాలు కొన్ని చోటు చేసుకొనెను.

"గురవో బహవస్సంతిః శిష్యవిత్తాపహారకః ।

తమేకం దుర్లభమ్మన్యే శిష్యహృత్తాపహారకః ॥ (గు.గీ)

ప్రపంచంలో ఎందరో గురువులుంటారు. వారిలో కొందరు శిష్యులగు వారి విత్తమును హరిస్తారు (ఖర్చు చేయిస్తారు). వారివద్దనుండు ధనము పూర్తిగా ఖర్చయిపోయిన పిమ్మట వారిని పలకరించే వారు ఉండరు. ఆ స్థితిలో బంధువులు అసలే దూరమవుతారు. గురువులు కూడ వదిలేస్తే వారి పరిస్థితి మరీదారుణమై గురువుల పట్ల విముఖత కలిగి వ్యతిరేక ప్రచారం చేస్తారు. కానీ సద్గురువు అట్లుగాక శిష్యుల హృదయ తాపమును హరించువాడుగ ఉండవలె. కష్టంలో సుఖంలోగూడ బంధువుల కన్నా ఎక్కువగా సద్గురువే శిష్యుణ్ణి ఆదుకొంటాడు. అందుకని సద్గురువును, పరమగురువును అన్వేషించి వరించవలెనని శివుడు పార్వతికి చెప్తారు.

ఆవిధంగా గురువును వరించిన తర్వాత జన్మంతా వదలరాదు. అటువంటి శక్తిమంతులైన గురువులు ఎక్కడ లభిస్తారు? మనం వారికొరకు ఎక్కడ అన్వేషిస్తాము? అన్వేషణ అనగానే ఇల్లు

వదలిపోవాలి. సంసారం వదలిపోయి అన్వేషించలేము. కాబట్టి మన కర్తవ్యం ఏమిటి? అని ఒకరికొకరు ప్రశ్నించుకొనుచున్నారు. అటువంటి పరమగురువు లభ్యం కావాలని నిత్యమూ భగవంతుని ప్రార్థించుదాము. అదియే మన కర్తవ్యముగా తోచుచున్నది. అంతకన్నా మనము చేయగలిగినదేమున్నది? అని గోవిందభట్టున్నూ వారిమిత్రులున్నూ చర్చ చేయుచుండిరి.

అదే సమయంలో వారి గుమ్మం ముందర ఒక బాలయోగి నిలిచి "హరహర మహాదేవశంభో శంకర"యని ఎలుగెత్తి లోపలనుండు గృహిణికి వినిపించునట్లుగా భిక్ష కోరుచూ నామస్మరణ చేసెను. ఆ కంఠస్వరం వింటూనే గోవిందభట్టు ఆ బాలసన్యాసి ముఖం వంక పరికించి చూచెను. ఆశ్చర్యముగా అనేకమైన ఆలోచనలు ఒక్కసారిగా కలిగెను. చిరుతప్రాయములోఉండి పాలుగారు బుగ్గలు, ముద్దులు మూటగట్టుచున్న వదనారవిందము, సుందర సుకుమారుడై, ముగ్ధమోహనుడై యున్న ఆయతి వేషధారిని కన్నార్పక చూచుచుండెను. తలపై నల్లని కురులు శిఖగా ముడివేయబడియున్నది. చెవులకు రుద్రాక్షలు, మెడలోను, చేతులకునూ రుద్రాక్షమాలలు కాషాయాంబరము ధరించియున్నాడు. లలాటమందు వైష్ణవ చిహ్నమైన నామమును ధరించెను. షోడశ వర్షప్రాయములోనే ఈవిధంగా సంపూర్ణ వైరాగ్యస్థితిని ఎట్లు పొందగలిగినాడు? ఇది సామాన్యులకు సాధ్యము కాదు. ఈయతి కారణజన్ముడేయని తోచుచున్నది. అనిచూపులను అటునిటుపోనీక అట్లే నిలిపియుంచెను. కొంతసేపటికి ఆ బాలసాదువు ముఖవర్చస్సు తేజోవంతమై ప్రకాశించుచుండగా. ఆయన ముఖంలోనుండి శంకరుడు ప్రత్యక్షమై, క్షణంలో అదృశ్యమై విష్ణువు కన్పట్టెను. మరుక్షణమందు అదృశ్యమయ్యెను. ఆస్థానముననే బ్రహ్మదర్శనమిచ్చెను. ఈవిధంగా త్రిమూర్తులు మారిమారినా బాల సన్యాసి ముఖంలో దర్శనమిచ్చినారు. చివరకు శ్రీపాదయోగి మహారాజ్ వారు నిలబడియున్నట్లు గుర్తించెను.

ఈ విధమైన దివ్యదర్శన భాగ్యంతో ఒడలు పులకరింపగా తన్మయుడై చేష్టలుడిగి, అట్లే నిలచి, కొంతసేపటికి మామూలు స్థితికి వచ్చి ఈయతి సామాన్యుడు కాదు. సద్గురువేనన్న భావము ఆయనలో కలిగెను. అప్పుడు తటాలున సాష్టాంగపడెను. అట్లు పాదాభివందనము చేసి లేచుసరికి గొంతు గద్గదికమై మాటరాకుండెను.

అంతలో ఆయన యిల్లాలు సన్యాసికి భిక్ష ఇవ్వవలెనని బయటకు వచ్చుచుండగా చేతితో ఆమెను వారించి, స్వామినిలోనికి దయచేయమని సంజ్ఞలు చేసెను. ఆ యిల్లాలు అది గ్రహించుకొని అతిథిపూజకై అర్ఘ్య పాద్యములు తెచ్చెను. గోవిందభట్టు "స్వామీ! నా జన్మము, వంశము, నా

గృహము మీరాకతో పావనమైనవి" అంటూ అర్ఘ్యపాద్యములిచ్చిలోనికి దయచేయుడని ప్రార్థింప అంగీకార సూచకంగా చిరునవ్వులు చిందించి వారింటిలోనికి అడుగిడినారు.

శ్రీ స్వామివారిని ఆహ్వానించి ఉచితాసనమున కూర్చుండబెట్టి సకల ఉపచారములతో పూజించి ఆనందముప్పొంగుచుండ ఆస్వామికి విస్తరివేసి సకల పదార్థములు ఆ యిల్లాలు వడ్డింపగా గోవిందభట్టు ఆయనకు విసరుచూ భుజింపజేసెను. గోవిందభట్టు మనసులో కృష్ణుడు అర్జునునకు చూపిన విశ్వరూప సందర్శనమును భావించి మాటిమాటికి పరవశుడగుచుండెను. దివ్యదర్శనానుభూతులతో వేరు ఆలోచనలు తోచకుండెను.

శ్రీ స్వామివారి భోజనానంతరము వారికి నమస్కరించి "స్వామీ! తమ నెలవెక్కడ? నామధేయము తెలుసుకొనవచ్చునా? నాకు అర్హత యున్నచో సెలవిండు. నేడు నా పూర్వీకుల పుణ్యసంచయము పండినది. కావుననే తమ దర్శనము లభించినది. నేను ధన్యుడనైతిన"ని పాదాభివందనమాచరించి ప్రార్థన చేసెను.

ఆతని మనోభావనలన్నియు శ్రీస్వామి వారికి విశదమగుచుండగా స్వామి చిరునవ్వులు చిందిస్తూ అతనితో "మాకొక్క నెలవనియేమున్నది? తీర్థయాత్రలు చేయుచూ ఈ క్షేత్రమునకు చేరుకొంటిమి. ఈశ్వరాజ్ఞ ఎట్లైన అట్లు నడుచుకొనుచుందుము. శ్రీపాద శ్రీవల్లభుడన్న నామధేయము ఈ దేహమునకు సంకేతము. ఎవ్వరే నామమున పిలచినను స్వీకరించెదము" అనుచూ తమ విషయమును ద్వంద్వార్థములతో సూచన చేసిరి. గోవిందభట్టు తన మనోభావములకు అనుకూలమైన సమాధానములు శ్రీస్వామివారి నోటివెంట వచ్చుటకు విస్మయమందుచు నా భావము సరియైనదే. వీరు త్రిమూర్తి స్వరూపులైన సద్గురువులే! వీరు దత్తస్వరూపులే! లేకున్న ఇంతచిన్న వయస్సులో ఇంతటి తపోమహిమ నెవ్వరు సాధించగలరు. వీరి సాంగత్యమును విడువరాదని నిర్ణయమును స్థిరపరచుకొని వారికి వీడ్కోలు చెప్పినారు.

శ్రీస్వామివారు ఇదే క్షేత్రములో ఉంటున్నట్లు తెలిసికొన్నాడు. కాన సాయంకాలము మందిరమునకు పోయి దైవదర్శనముతో పాటుగా శ్రీస్వామి వారిని గూడ దర్శనం చేసుకొన్నాడు. వారితో కొంతసేపు ముచ్చటించిన తదుపరి నిత్యము తమ యింటికే భిక్షకు రావలసినదిగా ప్రార్థించాడు. శ్రీపాద శ్రీవల్లభులు అనుమతి సూచకంగా తలపంకించారు.

తదుపరి పరమధార్మికుడైన గోవిందభట్టు అభ్యర్థన మేరకు శ్రీపాదస్వామి ఆయనపై పరిపూర్ణ కటాక్షాన్ని ప్రసరింపజేయు నిమిత్తం ప్రతిరోజూ వారింట భిక్ష స్వీకరించడం జరిగింది.

నిత్యమూ సాయంకాలం గోవిందభట్టు శ్రీస్వామిని దర్శించుట వారి సన్నిధానంలో తన మిత్రులతో గూడి సత్సంగం చేయుట జరిగేది. శ్రీస్వామివారియందు గోవిందభట్టుకు అపార విశ్వాసము కలిగినందున నిరంతరం వారి స్మరణము, గుణకీర్తనము చేయుచుండేవాడు.

తదుపరి శ్రీస్వామివారిని సాయంకాల సత్సంగమును తమయింటి వద్దనే చేయప్రార్థించెను. కొన్నిరోజుల తరువాత వారికి శయనవసతిని గూడ తమ గృహమందే ఏర్పాటు చేసెను. శ్రీస్వామి యొక్క సన్నిధిని విడచి కాలము వృధా చేయుట తనకిష్టము లేకుండెను. ఎట్లైనను స్వామి వారి సాన్నిధ్యము తనకు దక్కునట్లు యోచించి స్వామివారిని తన యింట శయనించుటకు అభ్యర్థించెను. గోవిందభట్టు యొక్క ప్రగాఢభక్తి, శ్రద్ధలకు మురిసిపోయి శ్రీస్వామి అతనికోరిక మన్నించి సమ్మతించెను.

నిజముగా ఒక యోగ్యుడైన, ఉత్తముడైన సన్యాసికి ఒకపూట భిక్షయిచ్చినచో వేయిమంది బ్రాహ్మణులకు సమారాధన చేసిన ఫలములభిస్తుందని శాస్త్రవాక్యం గలదు. అటువంటిది నిత్యమూ శ్రీస్వామివారిని పూజించి, సేవించి, భిక్షయిచ్చిన గోవిందభట్టు మనందరికీ ప్రాతఃస్మరణీయుడే!

అతడు పుణ్యపురుషుడు. ఉత్తమ బ్రాహ్మణుడు. దాదాపు రెండున్నర సంవత్సరములు ఇట్లు గడిచెను. ఇట్లుండ ఒకనాడు శ్రీపాద స్వామి వారు అనుష్ఠానమునకు వెళ్ళి మధ్యాహ్న భిక్షకు రాలేదు. ఆరోజు గోవిందభట్టు ఎదురుచూచి చూచి ఈ హఠాత్పరిణామమునకు వ్యాకులపడెను. శ్రీస్వామి వారు ఎక్కడెక్కడ సాధనలు చేయుచుందురో ఆయా ప్రదేశములన్నియు వెదకెను. శ్రీస్వామి వారి ఆచూకీ తెలియలేదు. అంతనతడు ఐశ్వర్యము కోల్పోయిన వానివలె విచారగ్రస్థుడయ్యెను.

శ్రీపాదస్వామి వారా క్షేత్రంలో తాను నిర్వహించవలసిన తపోనుష్ఠానముల పరిమితి పూర్తి అయినట్లు తెలిసి ఆ క్షేత్ర నాయకుడైన మహాబలేశ్వరునకు మ్రొక్కి ఆయన వద్ద సెలవు తీసుకొని శ్రీ మల్లిఖార్జున స్వామి సన్నిధికి చేరారు.

శ్రీపాదస్వామి గోకర్ణం విడిచి వెళ్ళిపోయిన తర్వాత గోవిందభట్టు శ్రీస్వామి దర్శనమునకు దూరమైనందులకు ఎంతో ఆవేదన చెందెను. ప్రతినిత్యం స్వామిని ధ్యానించేవాడు. ధ్యానంలో వారి దర్శనం లభించేది. అయినా భౌతికంగా గురుదర్శనం కొరకు మనసు ఆరాటపడేది. ఆ తపన రోజురోజుకు ఎక్కువ కాసాగింది. గ్రామంలో మహాబలే శ్వరాలయంలో నిత్యదర్శనములు నిర్వర్తించడానికి వెళ్ళినపుడల్లా శ్రీస్వామివారిని గురుదర్శనం కల్గించమని కోరుకుంటుండేవారు. అన్నిప్రాంతాల నుండి వచ్చిన యాత్రికులను స్వామి గురించి విచారణ చేసేవాడు దక్షిణాది నుండి

వచ్చిన కొందరు యాత్రికులు ఈయన చెప్పిన లక్షణములను బట్టి ఆకారవర్ణనను బట్టి తాము శ్రీశైల క్షేత్రంలో అట్టిస్వామిని దర్శించినామని చెప్పిరి.

వారు దర్శించిన యువకుడైన యోగి పుంగవుడే శ్రీపాదుడై యుండవచ్చునని భావించి గోవిందభట్టు ఆనందపరవశుడయ్యెను. ఎవరి ముఖతః శ్రీపాదుల విషయం తెలుసుకున్నాడో వారందరినీ గురుబంధువులుగా ఆదరించి ఆప్యాయతగా గోకర్ణక్షేత్ర విశేషములను వర్ణించి చెప్పెను. క్షేత్రదర్శనం చేయించెను.

శ్రీపాదస్వామి శ్రీశైలంలో ఉన్నారని తెలిసిన నాటినుండి వారి దర్శనాభిలాష మనసును వేగిర పెట్టుచుండెను. ఇంతలో అతని చిన్ననాటి గురుకుల సహపాఠియు మహారాష్ట్రలో పూనా దగ్గరలోని “అళంది” క్షేత్ర నివాసియునైన చిదంబర శాస్త్రియను పండితుడు శిష్యసమేతముగా గోవిందభట్టు యింటికి వచ్చినాడు. ఇతడు జ్ఞానేశ్వర్ మహరాజ్‌ను దర్శించి సేవించిన గొప్ప పండితుడు, బ్రాహ్మణ సంఘానికి అధిపతియును అయిన గంగాధరశాస్త్రి వంశస్థుడు.

గోవిందభట్టు మహదానందముతో చిదంబరశాస్త్రి మరియు యాత్రా బృందమును ఆహ్వానించి వారికి కావలసిన సదుపాయము విడిది మరియు ఆతిథ్యము ఏర్పాటు చేసినారు. ఉభయ కుశలప్రశ్నలు ఐన తర్వాత అల్పాహారమును సేవించి విశ్రాంతిగా కూర్చున్న శాస్త్రి గోవిందభట్టుతో ఇలా పలికారు. “మహాత్మా! తమరు పూర్వము తెలియచేసిన విధంగా మహామహిమాన్వితమైన యువయోగి పుంగవుని దర్శించుకోవాలని చాలాకాలంగా ప్రయత్నించగా ఇంతకాలానికి ప్రయాణం కుదిరింది. ఆస్వామివారిని, మిమ్ములను మహాబలేశ్వరుణ్ణి కూడా దర్శించుకునే అవకాశం కలిగినందుకు ఎంతో ఆనందంగా ఉంది అని చేతులు జోడించి వినయంగా పలుకగా గోవిందభట్టు వారితో ఇట్లనెను.

“మిత్రమా! శ్రీస్వామివారు ఇచ్చటనుండి వెళ్ళిపోయి మూడు మాసములపైనే అయినది. వారి భౌతిక దర్శనం దొరకక నేనునూ చింతించుచున్నాను. ఎంతో ప్రయత్నించగా వారు శ్రీశైల క్షేత్రంలో ఉన్నారని ఈ మధ్యనే తెలిసినది. అనగానే చిదంబరశాస్త్రి “అహో! జ్ఞానేశ్వరా! ఏమి నాయనా ఈ పరీక్ష? ఎంతో శ్రమకోర్చి నేటికిక్కడకు చేరితే శ్రీస్వామి దర్శనం దొరకలేదు. ఏమిటి తండ్రీ నా కర్తవ్యము? అని బాధపడసాగినాడు. అంతేకాక భట్టుగారితో “మిత్రమా! నీ ద్వారా శ్రీస్వామి అపరదత్తావతారమని వారిని దర్శించాలని బయలుదేరుతూ పండరిపుర క్షేత్రములోని వేదపండితుడైన పాండురంగవిఠలభట్టు గారిని అచటి ఆలయ పూజారి రామానందపూజారిని ఇక్కడకు రమ్మని కోరినాను. నేడో రేపో వారు కూడా యిచ్చటికి రావచ్చు. అని చెప్పుచుండగానే

గోవిందభట్టు ఇంటి వెలుపల నుండి ఎవరో పిలిచినట్లు వినబడింది. ఆ కంఠధ్వని వింటూనే చిదంబరశాస్త్రి "ఇదిగో వారు రానే వచ్చారు" అని ఇరువురు లేచి వెలుపలకు వచ్చి పరస్పరం పరిచయ కార్యక్రమాలు ముగించి లోనికి ఆహ్వానించారు. వారికి కూడా గోవిందభట్టు బస ఏర్పాటు చేసినారు. ఆరాత్రి గడిచింది.

మర్నాడు ఉదయమే వారందరికి మహాబలేశ్వర దర్శనం చేయించి క్షేత్ర మహిమను చక్కగా వివరించాడు గోవిందభట్టు. అందరూ ఆలయమండపంలో కూర్చుని తిరిగి శ్రీస్వామివారి దర్శనం గురించి చర్చించసాగిరి. అంతలో పాండురంగవిఠల్‌భట్టు "మిత్రులారా! శ్రీస్వామి వారిని ఇచ్చట దర్శించుకొని తీర్థయాత్రలు చేయాలనే అన్ని కార్యములు చక్కదిద్దుకొని వచ్చాము. కావున యాత్రలు చేసుకొంటూ మనమందరమూ శ్రీశైల క్షేత్రానికి పోదాము. అచ్చటనే శ్రీస్వామి దర్శనం చేసుకుందాము" అని అనగానే గోవిందభట్టు చాలా చక్కని ఆలోచన. శ్రీస్వామివారిని దర్శించాలని నా మనసు చాలా వేగిరపడుచున్నది. అది ఈవిధంగా పూర్తికానున్నది కాబోలు. ఇదంతా శ్రీపాదులవారి అనుగ్రహమే. నేను ఒంటరిగ యాత్రలు చేయలేనని మీ అందరిని నాకు తోడుగా పంపినారు. ఇంతకాలం మహాబలేశ్వరునికి చేసిన ప్రార్థనా ఫలితమే ఇది అంతయునని పొంగిపోయెను. "జై మహాబలేశ్వరా" అని నామస్మరణ చేసి చేతులు జోడించినాడు. వెంటనే చిదంబరశాస్త్రి మిత్రులారా! మనందరి సంకల్పమూ అదే. అనసూయానందనుడు దేహధారియై అవతరించి యుండగా వారిని దర్శించి తీరవలసినదే. ఆ దివ్యపురుషుడి దర్శనం పొందడానికి ఎంతవ్యయ ప్రయాసలకైనా మనం వెనుకంజ వేయరాదు. అనగా రామానందపూజారి శ్రీస్వామి వారిదర్శనం చేయాలని సంకల్పమైనది చాలా సంతోషం. ఆ క్షేత్రం దివ్యమైనది. మహత్తరమైనది. దక్షిణ భారతదేశంలో నల్లమల అడవుల మధ్య "శ్రీ పర్వతం అనే పర్వతమున్నది. అక్కడ శివుడు జ్యోతిర్లింగమై విరాజిల్లుచున్నాడు. అష్టాదశ పీఠాలలో ఒకటైన శ్రీభ్రమరాంబిక శక్తిపీఠంగా అక్కడ వెలసియున్నది. కృష్ణానది అక్కడ పాతాళగంగ అనే పేరుతో ప్రవహిస్తూ అందరిని సర్వపాప విముక్తులను చేస్తున్నది. అటువంటి పరమపవిత్రమైన శ్రీశైల క్షేత్రంలో ఎందరో మునులు, మహర్షులు వారి తపోశక్తిని అచ్చటనే ధారపోసి ఆ క్షేత్ర దర్శనంతో పాపులు పరిశుద్ధులగుటకై సంకల్పించినారని చెప్పుకొందురు. అందువల్లనే ఆ క్షేత్రంలో శ్రీశైల మల్లిఖార్జున దేవాలయ శిఖర దర్శనంతో పునర్జన్మ ఉండదని ప్రతీతి. శ్రీపాదస్వామి వారు కూడా ఆ క్షేత్రంలో తపస్సు చేసి ఆ క్షేత్రం యొక్క పవిత్రతను ద్విగుణీకృతం చేయడానికే అక్కడకు చేరి ఉంటారు. కావున మనమందరము శ్రీశైలయాత్ర చేద్దాము అని చెప్పినారు.

## భక్తులందరూ శ్రీశైలయాత్ర

మరుసటిరోజు గోవిందభట్టుతో సహా అందరూ బృందంగా ఏర్పడి యాత్ర సాగించారు. అనేక మజిలీలు చేసుకుంటూ దారిలో తారసపడిన దివ్యక్షేత్రాలు దర్శించుకొంటూ శ్రీశైల క్షేత్రానికి చేరారు. అందరూ పాతాళగంగలో స్నానం చేసి మల్లిఖార్జునస్వామిని భ్రమరాంబికామాతను దర్శించుకున్నారు. శ్రీపాద స్వామి వారి పోలికలు చెప్పి అటువంటి స్వామి ఇక్కడ తపస్సు చేసుకొంటూ వున్నారా? అని అచటి పూజారుల వద్ద విచారించారు. ఆ పూజారులిలా చెప్పారు. కొంతకాలం క్రిందట గోకర్ణము నుండి ఒక చిన్నవయసు గల స్వామివారు వచ్చి ఇక్కడ నాలుగునెలలు ఉన్నారు. వారు ఎవరితోను ఎక్కువగా మాట్లాడేవారు కాదు. ధ్యానము, జపము, తపము చేసుకుంటూ ఉండేవారు సత్సంగములో జ్ఞాన బోధలు చేశేవారు. ఇటీవలనే వారు ఇక్కడనుండి వేరే తపోభూమికి వెళ్ళినట్లు తెలిసింది అని చెప్పారు.

అయితే వారు వెళ్ళేముందు కృష్ణానది మధ్యలో పురాణకాలం నుండి మహాత్ములు, ఋషులు తపస్సు చేసుకున్న కురుగడ్డ అనే పుణ్యభూమి ఉన్నదని వారి కక్కడ తపస్సుకు అనుకూలంగా ఉంటుందని అచ్చటికి తాము వెళ్ళబోతున్నామని వారితో సన్నిహితంగా మెలిగిన నిర్మలానంద బ్రహ్మచారికి చెప్పియున్నారు. మీరు విచారించుకొని మార్గం తెలుసుకొని వెళ్ళండని చెప్పారు. పూజారులు ఈ యాత్రాబృందాన్ని ఎంతో ఆదరించి వారికి కావలసిన భోజనసామాగ్రినంతా సమకూర్చి అన్ని సదుపాయాలు చేశారు. శ్రీపాదవల్లభులే మనకు మార్గదర్శనం చేయాలి! చేస్తారు కూడా. ఎందుకంటే వారిని దర్శించాలనే సంపూర్ణ ఆకాంక్షతో మనము బయలుదేరాము. సర్వజ్ఞులైన ఆస్వామి సంకల్పములేక మనమింతదూరం రాగలమా! అని గోవిందభట్టు వారిమిత్రులు గూడ దృఢనిశ్చయం చేసుకున్నారు. ఆసాధువు గారిని కూడా అన్ని విషయాలు విచారించగా వారు దగ్గరదారి తెలిపి కృష్ణానది ఏ దిక్కుగా వస్తున్నదో ఆ దిక్కుగానే ప్రయాణమై పొమ్మని వారు తెలిపారు. మరియు శ్రీపాద వల్లభులు వివరించిన నివృత్తి సంగమం గురించి కూడా తెలిపారు. శ్రీపాద వల్లభులను స్మరించుకుంటేనే వారికి మార్గము ఎవరో ఒకరు తెలుపుచున్నారు. దైవదర్శనంగాని, గురుదర్శనం గాని హృదయపూర్తిగ కోరుకునేవారు శ్రద్ధాభక్తులతో, విశ్వాసంతో, తీవ్రమైన ఆర్తితో, దృఢమైన సంకల్పంతో ప్రయత్నిస్తే వారికి ఆయా దేవతలు, గురువులు అదృశ్యరూపంలో ఉంటూ దారి చూపిస్తారు. వారికి దర్శనాన్ని అనుగ్రహిస్తారు. అప్పుడే వారికి దైవంగాని గురువుగాని విశ్వరూపులై ఉన్నారని సత్యం బోధపడుతుంది.

ఈవిధంగా శ్రీపాదవల్లభుల దర్శనాభిలాషులై వారందరూ శ్రీవారి నామస్మరణతో మూడు రోజులు శ్రీశైలంలో బస చేశారు. శ్రీస్వామివారి మహాత్మ్యం గురించి అక్కడివారలతో చర్చించారు. శ్రీశైలవాసులు శ్రీస్వామి ఇంతగొప్పవారని మాకు తెలిసినదని చేతులు జోడించి స్వామికి నమస్కరించారు. శ్రీస్వామితో సన్నిహితంగా మెలిగిన బ్రహ్మచారి నిర్మలానంద వద్దనూ, పూజారుల వద్దనూ వీడ్కోలు చెప్పి ఆ మిత్రబృందం అచ్చటినుండి బయలుదేరినారు. వారు శ్రీశైలంలో వేకువజాముననే బయలుదేరారు. మార్గమధ్యంలో దర్శనీయ క్షేత్రం శ్రీఉమామహేశ్వరం కలదని తెలుసుకొని ఆ క్షేత్రంలో ఒకరోజు మజిలీచేశారు. ఉమామహేశ్వరుని దర్శించుకొని తమ యాత్ర చక్కగా సాగునట్లును, గురుదర్శనమగునట్లును అనుగ్రహించవలసినదిగా ఆ దైవములను కీర్తించి ప్రార్థించారు. అచటినుండి బయలుదేరి శ్రీపాదులను స్మరించుకొంటూ నడచి, నడచి అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన "అలంపురం" క్షేత్రానికి చేరుకున్నారు. అచట పరమపావనమైన తుంగభద్రనదిలో స్నానాదికములు ఆచరించారు. అందరూ వారి నిత్యానుష్టానములు సంధ్యావందనాదికములు నిర్వహించుకున్నారు. అచ్చట నెలకొన్నస్వామి వారిపేరు బాలబ్రహ్మేశ్వరస్వామి, అమ్మవారిపేరు "జోగులాంబ" (యోగినీమాత) ఆదివ్యమూర్తులు భక్తులకు కోరుకున్న వరములిస్తారని అచ్చట పూజారులు చెప్పగా గోవిందభట్టు మిత్రబృందమంతా గురుదర్శనమనే కోరికతో బయలుదేరినారు గనుక అందరూ ప్రశాంత మనసుతో మా కోరికను, మా యాత్రను సఫలం చేయమని అచ్చటి దైవమును ప్రార్థించుకున్నారు. అచ్చటి నుండి బయలుదేరి సరాసరిన కృష్ణా – భీమా నదుల సంగమస్థానమైన **నివృత్తి సంగమానికి** చేరి అచ్చట శ్రీపాదులవారిని స్మరించుకొని స్నానంచేసి తమ కురుగడ్డ యాత్ర ఏ ఆటంకములు లేక సాగి శ్రీపాద వల్లభుల దర్శనం కలిగేలా అనుగ్రహించమని మరిమరీ వేడుకున్నారు. తిరిగి ప్రయాణం సాగించి మార్గశిర శుద్ధ దశమి రోజుకు కృష్ణానదీ తీర గ్రామమైన పంచదేవ పహాడ్ అనే గ్రామానికి చేరుకున్నారు. మహాత్ములు, సాధకులైన వారిని, వారి శిష్యబృందాన్ని చూచి పంచదేవపహాడ్ గ్రామస్థులకు ఆశ్చర్యము ఆనందము కూడా కలిగెను. వారిని చేరి అందరూ సాష్టాంగ వందనం చేశారు. వారికి వలసిన సంభారములు సమకూర్చిరి. సమయోచిత సత్కారములు చేసిన తర్వాత గ్రామస్థులందరూ వారిని ఇట్లు ప్రశ్నించారు. "అయ్యలారా! మీరు ఎంతోదూరం ప్రయాణించి వచ్చినారు. ఆ విశేషములను మాకు దయతో వివరించమని కోరిరి. అప్పుడు గోవిందభట్టు వారితో తాము గురుదర్శనాభిలాషతో బయలుదేరినది మొదలు ఇచ్చటికి చేరిన వివరమంతయు

సవిస్తరముగా వివరించారు. ఏదిఏమైనా అయ్యలారా! మా సంకల్పానికి శ్రీపాదుల సంకల్పము మరియు వారి అనుగ్రహము తోడుగా వుండబట్టే ఈ రోజుకిలా ఇచ్చటికి చేరుకోగలిగాము అని వారికి తెలిపారు. ఆ గ్రామస్థులకు శ్రీపాదుల లీలలు మహత్తులు అప్పుడు కొంచెం కొంచెంగా అర్థం కాసాగెను. వీరిద్వారా శ్రీపాదుల దివ్యత్వం వారికి అవగతమైనది.

తర్వాత ఆ భక్తబృందము గ్రామస్థులను ఇట్లు కోరారు. మమ్ములను సూర్యోదయానికి పూర్వమే నది దాటించితే మేము రేపు ఉదయాన్నే శ్రీపాదుల దర్శనం చేసుకోగలము. రేపు మహాపర్వదినము. వైకుంఠ ఏకాదశి పర్వము. ఇంతదూరం రాగలిగాము గదా! వారి దర్శనమైతే గాని మా తపన తీరదు అని వారిని కోరారు.

అప్పుడాగ్రామస్థులిలా తెలిపారు. అయ్యలారా! మీరునది దాటి అక్కడకు ఎందుకు పోవడం. మీరు చెప్పిన స్వామివారే ప్రతిరోజూ ఝాము పొద్దుండగానే నదిదాటి ఈ ఒడ్డుకు వస్తారు. ఇప్పుడు మనం కూర్చున్నచోటుకు పడమరగా కృష్ణానదిలో ఆస్వామి స్నానం జపం తపం సూర్య నమస్కారాలు అన్నీ ఏమోమో చేస్తూ ఉంటారు. మీరు ఆస్వామిని రేపు ఉదయాన్నే ఇవతలి ఒడ్డునే దర్శించుకోవచ్చని చెప్పారు.

గోవిందభట్టు వారి మిత్రబృందమునకు మరీ సంతోషమైంది. ఆశ్చర్యంతో గోవిందభట్టు ఏమీ! ఈస్వామి యొక్క భక్త పరిపాలనా దక్షత! శ్రీస్వామి వారు మాకు ఇక్కడే దర్శనమిచ్చెదరా! ఆ అవ్యాజకరుణామూర్తిని ఏమని పొగడగలము! అని స్వామి వారి గురించి, వారి దయార్ద్ర హృదయము గురించి మిత్రులతో అభివర్ణించెను. అప్పుడు వారంతా నామసంకీర్తన చేయుచూ భగవన్మహిమా విశేషములు చర్చించుచూ తెల్లవారుఝాము వరకు కాలక్షేపం చేసిరి. ఆస్వామిని మనసులో ధ్యానించుచునే తెల్లవారుఝామున లేచి కాలకృత్యములు తీర్చుకొని కృష్ణానదిలో స్నానమాచరించిరి. సంధ్యావందనాది నిత్యానుష్ఠాన కార్యక్రమములు పూర్తి చేసుకొని అత్యంతాసక్తితో ఆగ్రామస్థుని సహాయముతో "శ్రీపాద" నామస్మరణ చేస్తూ వేగంగా వారందరూ స్వామి దర్శనానికి వచ్చారు.

వారి ఆసక్తికి అనుగుణంగా శ్రీస్వామివారు వారికి దర్శనమిచ్చిన విధానమే ఇంతకుముందు మీకు చెప్పిన దివ్యదర్శనం అంటూ శ్రీబాబాగారు తెలిపారు.

ఎంతో కష్టపడి తీర్థాలు సేవిస్తూ వచ్చిన భక్తులు సద్గురుని దర్శనం చేత అనుగ్రహింపబడిన ఈ వృత్తాంతమంతయు విని శ్రీపాద శ్రీవల్లభులకు జయజయకారములు చేసినాము.

# 5వ అధ్యాయం

## శ్రీ శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

## శ్రీపాదుని జనన వృత్తాంతము

శ్రీ దత్తావతారులైన శ్రీపాద స్వామివారి లీలలను శ్రీదత్త సాంప్రదాయ గురుపరంపరలోని పరమహంస పరివ్రాజకాచార్యులైన శ్రీశ్రీశ్రీ స్వామి విఠలానంద సరస్వతి మహరాజ్‌వారి ద్వారా ప్రసాదించ బడుటయనునది మన పూర్వజన్మల సుకృతమే. శ్రీవారి లీలలను, అద్భుతమైన ఆ ఘట్టములను వేద, వేదాంత వివరణలను వారు దర్శించి పులకించి మనకు ప్రబోధించుట మనలను తరింప జేయుటకే గానీ వేరు కాదు.

ఈ కలియుగంలో ఎటువంటి మహాపాపములైననూ పటాపంచలగుటకు మహాత్ముల చరిత్రలలోని అపూర్వ ఘట్టములు, వారి అమోఘమైన లీలలు విశ్వాసముతో పారాయణ మొనర్చుటే ప్రాయశ్చిత్తమని శ్రీ గురుచరిత్రలో సిద్ధసరస్వతి నామధారకునికి చెప్పిన మాట మనం ఎన్నటికీ మరువరాదు. అంతేకాదు. సద్గురువుల బోధలు, లీలలు వినుటకు ఎవరు ఉత్సాహముతో నుందురో వారి దుష్కర్మలన్నియు పెనుగాలికి మబ్బులవలె చెల్లాచెదరై దూరముగా పోవునని చెప్తారు. మన జీవితమనే నౌకకు చుక్కానిగా సద్గురువునే నిర్ణయించుకొనినప్పుడు జీవిత నౌక ఏ విధమైన ఒడుదుడుకులు లేకుండా సాఫీగా సంసార సాగరం నుండి తీరమునకు చేర్చబడును.

ఇప్పటివరకూ శ్రీ బాబాగారు చెప్పిన కథా విధానమును విని "స్వామీ! ఈ గోకర్ణ క్షేత్రంలోనే శ్రీస్వామి చూపిన లీలలు ఎంతో అద్భుతంగా వున్నవి. వారు జన్మించినది మొదలు వారి తీర్థయాత్రల వరకు తమరు వివరిస్తే వినిమేమంతా తరిస్తాము. ఎన్నిమార్లు విన్నా సద్గురుని లీలలు తనివి తీరదు. అయినా తలచుకొన్నప్పుడల్లా మాపాప పంకిలము నిర్మూలమవుతుంది. అనుగ్రహించండి బాబా!" అని నేను ప్రార్థించగా శ్రీ విఠల్‌బాబాగారు నవ్వి "అవును! ఎన్నిసార్లు విన్నా తనివి తీరదంటే బాగుంది. కానీ కుక్క తోక వంకర అన్నట్లు మీలోని వక్రబుద్ధులు మాత్రం మారకుంటే ప్రయోజనం లేదు. అయినా వినండి! చెప్తాను భగవంతుని ప్రతిలీలకు అర్థం వుంటుంది. ఏదీ వృధా కాదు" అని ప్రారంభించారు.

## శ్రీక్షేత్ర పీఠికాపుర విశేషం

శ్రీపాద వల్లభుల జనన వృత్తాంతం తెలిపేముందుగా ఆ క్షేత్ర మహాత్మ్యమును చెబుతాను వినండి. కలకండలో తీపి అన్ని వైపుల అంతటను సమంగానే వుంటుంది. మహాత్ముల చరిత్రలు కూడా ఆద్యంతము ఆశ్చర్యకరము, అద్భుతముగానే ఉండుననుటలో సందేహము లేదు.

సాక్షాత్ శ్రీ దత్తాత్రేయ స్వామి తమ దివ్య సంకల్పంతో భక్తజనోద్ధరణ, దీన జన సంరక్షణ కొరకు ఈ భువిపై మానవ రూపంలో అవతరించారు. ఇది యొక దివ్యలీల.

పూర్వం క్రీ.శ. 14వ శతాబ్దంలో 1320లో తూర్పు సముద్రతీరం (బంగాళాఖాతం)లో అప్పటి విశాఖపట్నం జిల్లాగా ఉండి తదుపరి తూర్పు గోదావరి జిల్లాగా ప్రకటించబడిన "పిఠాపురం" పట్టణం ఆ కాలంలో సంస్థానాధీశుల పరిపాలనలో ఉండేది. అనేక మంది చిన్న చిన్న రాజులకు ఈ పట్టణంలో దివాణములు వుండేవి. పిఠాపురం శ్రీమంతుల నగరంగా, రాజధాని కేంద్రంగా ప్రసిద్ధి గాంచినది. అనేక మంది పండితులు, పురాణవేత్తలు వేద వేదాంగములను ఆకళింపు చేసుకొన్న ఘనాపాటీలైన ఉత్తమ బ్రాహ్మణులు నివసించే అగ్రహారంగా కూడా ఖ్యాతి చెందినది.

ఈ పట్టణంలోనే అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన "పురుహూతికా" శక్తిపీఠం వెలసి యున్నందున దీనిని పీఠికాపుర అగ్రహారం అని కూడా పిలుస్తారు. అంతేగాక శివుడు "కుక్కుటేశ్వరస్వామి"గా ఇచ్చట వెలసి యున్నాడు. దీనికి సంబంధించిన ఒక పురాణగాథ కలదు.

## పాదగయ విశిష్ఠత

పూర్వం ఒకప్పుడు గయాసురుడనువాడు దేవతలననేక విధములుగా బాధించుచుండెను. దేవేంద్రాది సకల దేవతలు త్రిమూర్తులతో కలసి వానిని పరిమార్చుటకు ఉపాయమునాలోచించిరి. వానిని త్రిమూర్తులున్నూ గెలవలేమనగా బ్రహ్మదేవుడిట్లు ఉపాయము తెలిపెను. గయాసురుడు రాక్షసుడైనప్పటికీన్నీ నిత్యము హోమములు, యజ్ఞములు ఇష్టపూర్తిగా చేస్తూ వుంటాడు. కావున మనము యజ్ఞము నిర్వర్తించుట కొరకు అతని నాభిస్థానమును యజ్ఞకుండముగా ఉపయోగించుకొనవలెను. అందులకతడు అభ్యంతరం చెప్పడు. అని త్రిమూర్తులు కలసి నిర్ణయించుకొని గయాసురుని వద్దకు వెళ్ళారు. అతని నాభి స్థానము యజ్ఞప్రదేశముగా చేసుకొని యజ్ఞము చేయుటకు అనుమతి కోరారు. వరగర్వితుడైన గయాసురుడు వారి అభ్యర్థనను స్వీకరించాడు. దేవతలు, త్రిమూర్తులు కోరేవారు గాను, తాను వరమిచ్చేవాడు గాను వూహించుకొని

తన గొప్పతనమునకు తానే పొంగిపోయినాడు. త్రిమూర్తులు ఒక నియమమును గూడ అతనికి ఎఱుక పరిచారు. 10 రోజుల యజ్ఞము పూర్తయ్యేవరకు అతను కదలకూడదు. కదిలితే అతను చనిపోతాడని తెలిపారు. గయాసురుడు అహంభావముతో నిరభ్యంతరముగా తన అంగీకారమును తెలిపినాడు. యజ్ఞం భంగం కానీయనని అభయమిచ్చాడు. వాని శరీరమును అపరిమితంగా పెంచాడు. నాభివద్ద బ్రహ్మ దేవుడు యజ్ఞం ప్రారంభించాడు. చావు గురించిన భయమే వానికి లేదు. పది రోజులు యజ్ఞ కార్యము నిరాటంకముగా సాగినది. ఆ రాత్రి గడిచిన గయాసురుడిచ్చిన వాగ్దానము పూర్తవుతుంది. విష్ణు మాయా ప్రభావముచేత అర్థరాత్రి దాటుతుండగా గయాసురునికి లఘు శంకకు వెళ్ళుట తప్పనిసరైనది. అదే సమయమునకు విష్ణువు ప్రేరణ వలన శివుడు (కుక్కుటము)కోడిపుంజువలె మారి కూత పెట్టినాడు. ఆ కోడి కూతకు గయాసురుడు కదిలాడు. యజ్ఞం భంగమైనది. తాను యజ్ఞం కొరకు శరీరమును త్యజించినప్పటికీ కీర్తి వస్తుందని సంతోషంతో దేవతలు పన్నిన మాయోపాయానికి వారిని నిందించలేదు. విష్ణుదేవునితో ప్రాణం పోకముందే వరం కోరుకొన్నాడు. ఓ! దేవతలారా! ఈ శరీరం పోతుందనే బాధ, మమత నాకు లేవు. నా తలయున్న ప్రదేశం బ్రహ్మగయగాను, నాభి ప్రదేశం విష్ణుగయగాను, పాదాలున్న ప్రదేశం పాద గయగాను, శివక్షేత్రంగాను, పుణ్యతీర్థాలుగా, ఆ ప్రదేశాలను అనుగ్రహించండి. మీరును ఆయా స్థానాలలో నా తృప్తి కొరకు భువిపై వుండండి అని వరం కోరగా త్రిమూర్తులు సంతోషంతో ఆశీర్వదించారు. పీఠాపురంలో పాదగయ సమీపంలో శివుడు కుక్కుటేశ్వరుడుగా వెలిశాడు. ఇన్ని దేవతా మహిమలు కలిగియున్న మహాక్షేత్రము పీఠాపురము. ఈ పాద గయలో పుణ్యస్నానమాచరించి, భక్తులు పితృదేవతలకు, పిండ ప్రదానములు చేయుటచే విశేష పుణ్యఫలం కల్గుతుంది. ఇచ్చటి నందీశ్వరుడు చాలా మహిమ కల్గినవాడు. ఇంత మహిమాన్వితమైన క్షేత్రంలో శ్రీ దత్తాత్రేయ స్వామి వారు అపార దయతో స్వయంభువుగా వెలసి, పాదగయ క్షేత్రాన్ని పావనం చేస్తున్నారు.

## కుంతీమాధవ క్షేత్రం

శ్రీకృష్ణ పరమాత్మ పంచపాండవులచేత ఇంద్ర ప్రస్థ నిర్మాణము, రాజసూయయాగము పూర్తి చేయించి అగ్రతాంబూలం అందుకొన్నాడు. ఆ సభలోనే శిశుపాలుడు మతిచెడి మితిమించి నోటికి వచ్చినట్లెల్ల నిందా వాక్యాలు పలికాడు. బంధువే అయినా, చిన్ననాటి నుండి అన్నీ తెలిసినా శిశుపాలునికి వినాశకాలే విపరీతబుద్ధి అను విధంగా రోజులు దగ్గరపడి కృష్ణుడిని తూలనాడాడు. నూరు తప్పులు క్షమించుతానని కృష్ణుడు శిశుపాలుని తల్లికి మాటయిచ్చినందున అట్లే సహించి

అన్నీ విన్నాడు. నూరు లెక్క సరిపోయింది. నూట ఒకటికి నోరెత్తే సమయానికి సుదర్శన చక్రం వచ్చి అతని తలను ఖండించేసింది. సభికులందరూ అవాక్కయినారు.

యజ్ఞపూర్ణాహుతి అనంతరం బంధువులందరూ సెలవు తీసుకొన్నారు. చివరకు శ్రీకృష్ణుడు అందరివద్దా వీడ్కోలు పలికి చివరగా కుంతీదేవి వద్దకు వచ్చి "అత్తా! నేను పోయివస్తాను. నీకేమి కావాలో కోరుకో"మనగా కుంతీదేవి నాకెప్పుడూ కష్టాలనే ప్రసాదించు నాయనా! అని కోరింది. అదేమిటమ్మా! ఎవ్వరైనా సుఖాలు కోరుకొంటారుగానీ కష్టాలు కోరుకొంటారా! అనంటే కష్టాలలో వుంటేనే నిన్ను తలంచుకొనడమూ, నీవు మమ్ము కాపాడడం జరుగుతుంది. సుఖాలలో నిన్ను తలంచుకొనము నాయనా! సుఖాలమత్తు మమ్మల్ని నీకు దూరం చేస్తుంది అని చెప్పింది. ఆ కారణంచేత ఆమె యందు అనురాగంతో పిఠాపురంలో కుంతీమాధవుడుగా కృష్ణుడు వెలసినాడని పురాణవాక్యం. కాబట్టి ఆ మహా పుణ్యక్షేత్రంలో శ్రీదత్తాత్రేయులవారు తమ ప్రథమావతారమును ధరించినారు. వారు జన్మించిన స్థానములో శ్రీపాద శ్రీవల్లభ సంస్థానము ఇప్పుడు నెలకొల్పబడింది.

ఒకానొక యుగంలో కష్టపడి దత్తదర్శనం పొందిన మాతాపురం భక్తుడైన విష్ణుదత్తుడు. దత్తుని సంకల్పంచేత పీఠాపురంలో వేదపండితుడైన బ్రాహ్మణోత్తముడు శ్రీ అప్పలరాజు శర్మగా జన్మించి నివసిస్తూండేవారు. ఆయన ధర్మపత్ని సుశీలయే సుమతీదేవిగా పుట్టింది. పేరుకు తగినట్లు ఆమె గొప్ప సుగుణాల ఖని. అనసూయ మాత వంటి మహాపతివ్రత. తన భర్తకు నిత్యకర్మాను ష్ఠానమునకు వలసిన ఏర్పాట్లన్నియు ఏమారక చేయుచు సహకరించుచుండేది. భక్తితో అతిథి అభ్యాగతులను సేవించుచుండెడిది. ఆ దంపతు లిరువురు శ్రద్ధాభక్తులతో ఆ క్షేత్రంలో వెలసి యున్న స్వయంభూదత్తుని తమ ఆరాధ్యదైవముగా పూజించుకొనుచుండెడివారు. వారికి ఇరువురు కుమారులు కలిగిరి. అందు పెద్దవాడు గుడ్డివాడున్ను రెండవ వాడు కుంటివాడునై యుండిరి. ఆ తరువాత ఆ దంపతులకు ఇద్దరు పుత్రులు పుట్టి చనిపోయిరి. వికలాంగులైన ఆ ఇరువురు పుత్రులకు విసుగు లేకుండా సుమతి సేవలు చేస్తూ వుండేది. భర్తకు సేవలు చేస్తూ బంధుజనులను, మిత్రులను ఆదరిస్తూ మహా యిల్లాలుగా పేరు పొందినది.

ఒకానొక మహాలయ అమవాస్య నాడు వారి గృహమందు పితృకార్యమునకై సకల ఏర్పాట్లు చేసుకొని యుండిరి. శ్రాద్ధక్రియ యింకనూ ప్రారంభింపబడలేదు. మధ్యాహ్నవేళ వారి వాకిలి ముందర దండకమండల ధారియైన ఒక సన్న్యాసి వచ్చి నిలిచి "మాతా! భవతి భిక్షాందేహి" అని బిగ్గరగా పలికెను. ఆ యిల్లాలు సుమతీదేవి బయటకు వచ్చి చూచెను. అచ్చట ఒక గొప్ప అవధూత,

అవతార పురుషుడైన సాధువు నిలబడి భిక్ష కోరుచున్నట్లు ఆమెకు తోచెను. శ్రీదత్తాత్రేయుని వారు కులదైవముగా కొలుచువారుగావునను, మధ్యాహ్నవేళల్లో శ్రీ దత్తాత్రేయ స్వామి వారు భిక్షకై తిరుగుచుంటారన్న పురాణ వాక్య శ్రవణం చేసియున్న కారణంగాను, ఆయన సాక్షాత్ దత్తస్వామియని ఆమె మనసుకు తోచినది. కావున శ్రాద్ధము రోజున బ్రాహ్మణ భోక్తలు భుజించనిదే ముందుగా ఎవ్వరికి భిక్ష ఇవ్వరాదన్న శాస్త్రమునుల్లంఘించి, వడివడిగా భిక్ష తీసుకువెళ్ళి "దత్తార్పణమస్తు" అనుకొని ఆ సన్యాసి జోలిలో వేసినది. ఆమెలోని దృఢ భక్తికి, అనితర సాధ్యమైన శ్రద్ధకూ, సమయస్ఫూర్తికి మెచ్చి నిజముగానే ఆ సన్యాసి దత్తస్వామిగా సాక్షాత్కరించాడు. మూడు ముఖములు ఆరు చేతులతోను, త్రిమూర్తుల ఆయుధములతోను, తెల్లని కాంతితో కన్నులు మిరుమిట్లు గొల్పుచున్న, ఆ స్వామి యొక్క దివ్యమూర్తిని, ఆ సుమతీదేవి తన పూర్వజన్మ సుకృతంచేత చర్మచక్షువులతోనే తనివితీర దర్శించినది.

ఆ దివ్య దర్శనానుభూతిని వర్ణింపశక్యంగాదు. సుమతీదేవి కళ్ళతో అమృతపానం చేస్తున్నట్లు చూస్తూ, "తండ్రీ! పురాణ పురుషులకే సాధ్య పడదని చెప్పబడే నీ దర్శనభాగ్యం నాకనుగ్రహించినావు. నీ కృపాకటాక్షములకు పారం (హద్దు) లేదు. ఓ దేవదేవా! నా జన్మ తరించినది" అంటూ రెండు చేతులు జోడించి నమస్కరించినది.

శ్రీదత్తస్వామి, "తల్లీ! నీ అచంచలమైన విశ్వాసానికి, నిష్కళంక భక్తితత్పరతకు నేను సంప్రీతుడనైనాను. శ్రాద్ధ భోక్తలు భుజించక ముందే నన్ను దత్తునిగా విశ్వసించి, భిక్ష యిచ్చినావు. నీ విశ్వాసానికి తగిన దర్శనం పొందావు. అమ్మా! ఏదైనా వరము కోరుకో! ప్రసాదిస్తానన్నాడు జగన్మోహనమైన ఆయన రూపాన్ని దర్శించి, ఆయన వాగమృతమును తనివితీర గ్రోలిన ఆ తల్లి సుమతీదేవి, "పరమాత్మా! నీవుకోరి నా చేతి అన్నం స్వీకరించినావు. నా జన్మ తరించే లాగున దర్శనమనుగ్రహించావు. తండ్రీ! నా కింకేమి కావాలి? నేను ధన్యురాలనైనాను. మా పితృదేవతలు ధన్యులైనారు. నీవు భక్తుల పాలిటి కల్పవృక్షానివి. నన్ను "తల్లీ"యని సంబోధించినావు. కావున నేను కోరేది యిదే. నన్ను నీకు తల్లిని చేయి స్వామీ! నీ విచ్చిన మాట నిలుపుకో!" అని కోరింది.

భక్తిశ్రద్ధలతో కూడిన బుద్ధియొక్కశక్తి సమయస్ఫూర్తితో నిండుతుంది. ఆ తల్లి యొక్క సంస్కారవంతమైన, వినయవంతమైన వాక్కులు విని శ్రీదత్తస్వామి ప్రసన్నులై "తప్పక నీ కోరిక ఫలిస్తుంది. కాని ఆ పుత్రుడు చెప్పినట్లు నీవు వినాలి. అతనికి ఏవిధమైన ఆటంకము నీవు కల్పించ రాదు" అని హెచ్చరిక చేశారు. అప్పుడు సుమతీదేవి "ఓ దేవాదిదేవా! క్లిష్ట పరిస్థితుల్లో

నాకు ఎప్పటి కప్పుడు మోహము కలుగకుండా వివేకాన్ని నీవే ప్రసాదించాలి” అని వేడుకొన్నది. ఆ దేవదేవుడు “సరే!”నని ఆశీర్వదించి అంతర్థానమైనారు.

సుమతీదేవి ఆనంద పరవశురాలైంది. ఈ ఆకస్మిక సంఘటనను, శ్రీదత్తస్వామి స్వరూపము ను, వాక్కులను పదే పదే తలంచుకొని లోనికి వచ్చి భర్తను ప్రక్కకు పిలచి “నాథా ! ఇప్పుడే ఒక వింత జరిగింది. మన వాకిట్లో ఒక భిక్షువైన సన్యాసి, అవధూత యైన స్వామి రాగా నేను బిక్ష ఇచ్చాను. ఆయన దత్తరూపుడై దర్శనమిచ్చారు. ఆ దివ్యదర్శనాన్ని మరువలేక శరీరం ఇంకా రోమాంచితమగుచున్నది. ఆ దేవదేవుడు తల్లీ!” అన్నారు. నన్ను నీకు తల్లిని చెయ్యమని అప్రయత్నంగా కోరాను. తథాస్తు అని వరమిచ్చి అదృశ్యమైనారు అని చెప్పింది. ఆ చెప్పే సమయంలో ఆమె కళ్ళలోని కాంతిని గమనించి అప్పలారాజున్నూ ఆమె భాగ్యానికి లోలోన పొంగిపోయినారు. “సాధ్వీ! నీవు చాలా మంచిపనిచేశావు. మన పితరులకు తృప్తి కల్గుటే గాదు వారికి బ్రహ్మలోక ప్రాప్తికూడా కలుగగలదు. అని అభినందించి, ఆశీర్వదించి తదుపరి కార్యాన్ని నిర్వర్తించు కొన్నారు.

ఒకానొక శుభ ముహూర్తాన సుమతీదేవి గర్భంధరించింది. మరుసటి సంవత్సరం భాద్రపద శుక్ల చతుర్థినాడు ఉదయం శుభఘడియలలో కాలాతీతుడు, పుట్టుకలేని వాడైన ఆ దేవదేవునికి జన్మనిచ్చింది. ఆ శిశువు యొక్క జన్మలగ్నమును బట్టి, గ్రహస్థితులను బట్టి దైవజ్ఞులు జాతకము గణించారు. ఈ బాలుడు లోకకల్యాణార్థము అవతరించినాడు. ఈతడు సద్గురుడు, లోక గురుడునైన శ్రీ దత్తాత్రేయుడేనని కొందరు తెలిపినారు. ఆ శిశువు పాదములలో దివ్యచిహ్నములున్నవి. కావున అతనికి శ్రీపాదుడని నామకరణం చేసినారు.

ఆ దివ్యబాలుడు శుక్లపక్ష చంద్రునివలె దినదిన ప్రవర్థమానుడగుచు తన లీలలతో అందరిని అలరిస్తుంటే సంవత్సరాలు రోజులవలె గడచినవి. సుమతీమాత, అప్పలరాజుశర్మ గూడ అంతవరకు వున్న బాధలన్నింటినీ మరచి శ్రీపాదుల ఆటపాటల సందడిలో హృదయానందమును పొందినారు. తల్లిదండ్రులేగాక ఇరుగుపొరుగు వారందరు శ్రీపాదుని దర్శనంతోనే పులకించి తమ బాధలను మరచిపోయి సంతోషంతో పొంగిపోయేవారు. అంతేకాదు ఆ పవిత్రగోదావరీ తీర ప్రాంతవాసు లందరూ గూడ తెలియని ఆనందంతో ధన్యులైనారు. శ్రీపాదునికి ఎనిమిదవ సంవత్సరంలో తల్లిదండ్రులు ఉపనయనం చేయ సంకల్పించి శుభముహూర్తము నిర్ణయించినారు. బంధువులందరిని ఆహ్వానించారు. గురువులు వేద పండితుల సమక్షంలో రంగరంగ వైభవంగా ఉపనయనము చేసినారు.

ఉపనయన సభలోనే శ్రీపాదులవారు అందరికీ ఆశ్చర్యం గొలిపే లాగున నాలుగు వేదములలోని పనసలను సుస్వరంతో చెప్పసాగెను.

అష్టవర్ష ప్రాయముగల నవ వటువు తనదైన ప్రత్యేకమైన ఉచ్ఛైస్వరంలో ఋగ్వేద పనసను వల్లించసాగెను.

"అగ్నిమీళే పురోహితం యజ్ఞస్య
దేవమృత్విజమ్ హోతారం రత్నధాతమమ్"

సభలోని ఘనాపాటీలు, చతుర్వేద వేత్తలైన మహాపండితులు, ఇతర అధ్యాపకులు అందరూ ఒక్కసారిగా నిశ్చేష్టులైనారు. పసివాడా ! పండితోత్తముడా! అని వారిలో వారు మీమాంసలో పడిరి. అంతలో శ్రీపాదులవారు యజుర్వేద పనసను పఠించసాగిరి.

ఇషేత్వోర్జేత్వా వాయవస్థో
పాయవస్థ దేవో వ స్సవితా
పార్పయతు శ్రేష్ఠత మాయ కర్మణి॥

మహా మహా ఘనాపాటీలు పండితులు అందరూ ఋగ్వేద పనసను విన్న విస్మయంలో నుండి బయట పడక ముందే రెండవ వేదమును విన్న వారు ఒక్కసారిగా దిగ్భ్రాంతులయ్యారు.

శ్రీపాదస్వామి వెంటనే తక్కిన రెండు వేదములైన సామ అధర్వణ వేద మంత్రములను ఈ విధంగా ఉచ్చరించిరి.

అగ్ని ఆయాహి వీతయే గృణానో
హవ్యధాతయే నిహోతా తత్సిబర్హిషి

శంనో దేవీ రభీష్టయ
ఆపోభవంతు పీతయే
శంయో రభి స్రవంతునః

సభాసదులైన వేదపండితులు, ఘనాపాటీలు మహా పండితుల హృదయస్పందన పయనించి వారి కరముల చేరి అప్రయత్నముగా కరతాళ ధ్వనులను చేయించి, "జయహో! జయహో!" అని ఆనంద గంభీర స్వరంతో ఉచ్చరించి "చిరంజీవ!" అని ఆశీర్వదించిరి. మాతామహులు ఆనందముతో ఆలింగనము చేసికొనిరి.

వారంతా ఇతను సామాన్య బాలకుడు కాడనిన్నీ, కారణజన్ముడని అవతార పురుషుడని కొనియాడారు. అట్లుకానియడల ఈ విధంగా సుస్వర వేదగానము అసాధ్యమని అందరూ శ్లాఘించినారు.

ఉపనయనానంతరము కుమారుని గురుకులంలో చేర్చి వేదవిద్యలు నేర్పించాలనుకున్న అప్పలరాజశర్మకు ఏమి చేయాలో స్ఫురించలేదు. మరుసటి దినము నుండి ఆబాలుడు మంత్రోచ్ఛాటనతో సంధ్యావందనము, దేవతార్చన చేయు విధానమునకు పొంగి పోయిరి. అంతేగాక ఆ దివ్యబాలుడు తండ్రివద్ద వేద విద్యనభ్యసించు విద్యార్థులకు, శిష్యులకు వేదాలలోని మర్మములను విపులీకరించి చెప్పసాగెను. ఇది తెలిసి వయోవృద్ధులైన పండితులు కూడా అతని వద్దకు వచ్చి వారికి గల సందియములను తీర్చుకొని ఆనందముగా వెళ్ళేవారు. శ్రీపాదుని జ్ఞాన బోధలు, వేద సమన్వయమును విన్నవారందరూ ఇతడు శ్రీగురుదత్తుడే నని కొనియాడారు. సుమతీదేవి దత్తుడు తనకిచ్చిన దివ్యానుభూతిని స్మరించుకొనేది. రాజుశర్మ ఇది భగవంతునికి తప్ప సామాన్యులకు సాధ్యమా అని పరవశించేవాడు. ఈ విధముగా పండితులచేకొనియాడ బడుచు, తల్లి దండ్రులను సంతోష పెడుతూ శ్రీపాదవల్లభుడు షోడశ కళాపూర్ణుడై వర్ధిల్లుచున్నాడు.

## శ్రీపాదుల దివ్యసంకల్పం

క్రమముగా శ్రీపాదులు పదహారు సంవత్సరముల ప్రాయము వాడయ్యెను. శ్రీపాదుల వారు ఇల్లు విడిచి వెళ్ళవలసిన సమయం ఆసన్నమైంది. వారి సంకల్పంతోనే వారి తండ్రి మనస్సులో వివాహ ప్రసక్తి కలిగింది. అప్పలరాజు శర్మ తన కుమారునికి తగిన కన్యకొరకు అన్వేషింపసాగెను. ఒకనాడు శ్రీపాదుడు తండ్రిని చేరి "తండ్రీ! మీరు నాకొరకు కన్యాన్వేషణ చేయనక్కరలేదు. సర్వశుభలక్షణములతో కూడిన కన్య సిద్ధముగానే యున్నది. ఆమెయే "యోగశ్రీ". నేనామెను చేపట్టి శ్రీవల్లభుడనౌతాను. సన్యాస యోగమునవలంభించి తీర్థాటనము చేయబోయె దను" అని తెల్పెను.

సుమతీదేవియు, అప్పలరాజుశర్మయు కన్నుల నీరు నిండ నాయనా! నిన్ను కన్న తర్వాత మాకుగల దుఃఖములన్నీ మరచి నీ ప్రేమలోనే బ్రతుకుచున్నాము. నీవు యిల్లు విడచి వెళ్ళినచో మేము జీవించలేము. మా బ్రతుకులు నీటి నుండి బయటపడిన చేపలవలె కాగలవు. నీవు సాక్షాత్ పరమేశ్వరుడవే అయినా మాకు పుత్రుడవై పుట్టినావు కావున మమ్ము పుత్ర ధర్మముతో రక్షించు బాధ్యత నీదేకదా! అని విలవిలలాడిరి.

సుమతీదేవి తొలి సంతానమైనట్టి వికలాంగులైన కుమారులిరువురినీ శ్రీపాదుల చెంతకు తీసుకొని వచ్చి ఇలా అన్నది. "నాయనా! నిన్ను చూచుకొని నీ అన్నలవలన కలుగు దుఃఖాన్ని మరచితిమి. ఇప్పుడు నీవు వెళ్ళిపోతే వీరితో నాకిక మరణమే శరణ్యము అన్నది. శ్రీపాదుడు తల్లిపై ప్రసన్న దృష్టిని సారించి మృదు మధుర వాక్కులతో ఊరడిస్తూ, ప్రేమపూరిత హృదయంతో అన్నలిరువురినీ తన అమృత హస్తముతో స్పృశించాడు. తృటిలో వారిద్దరికీ అంగవైకల్యము తొలగిపోయినది. వారితో "అన్నలారా! మీరు శ్రద్ధగా తల్లిదండ్రులకు సేవ చేయండి. సర్వ సంపదలతో వర్థిల్లుతారు"అని పలికి తల్లిని సమీపించి ప్రేమతో నమస్కరించి "తల్లీ! నీ మనసు కిప్పుడు శాంతి లభించినదా! నీ కుమారులు నిన్ను ఏమరక సేవించెదరు. మనుమలు, మనుమరాండ్రతో నీ వంశము వృద్ధి చెందును. కావున నాకు మనస్ఫూర్తిగ దేశాటన చేయుటకు అనుమతినిమ్ము!" అని తల్లి తండ్రులకు ముమ్మారు ప్రదక్షిణచేసి వారివద్ద సెలవుకోరాడు. సుమతీ దేవికి తన నిజ దర్శనము అనుగ్రహించాడు. "అమ్మా! నీవిపుడు దర్శించిన రూపాన్ని నిరంతరం స్మరిస్తూవుంటే అజ్ఞానం నీదరికి రాదు. నీవు కోరినవన్నీ పుష్కలంగా సమకూరుతాయి" అని వరమిచ్చి తీర్థాటనకు బయలుదేరినాడు. నాకు తిరిగి మీ దర్శనం కలుగుతుంది అని వారితో ఒక మాట చెప్పారు స్వామి.

ఇలా చెప్తూ శ్రీపాదుల దివ్య సంకల్పం దర్శించేందుకు బాబాగారు కొంచెంసేపు ధ్యానస్థులైనారు. వారి స్థితిని గమనించి మేము నామస్మరణ చేసుకొంటూ కూర్చున్నాము. కొంతసేపటికి వారు మామూలు స్థితికి వచ్చి అందరివంకను జూచి దేవదేవుని లీలలు అద్భుతములు అని కీర్తించారు. తదుపరి అందరము జయజయ నాదములు చేసినాము.



# 6వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

## శ్రీపాదులవారి తీర్థాటన

సృష్టియంతయు త్రిగుణాత్మకమే. ఏదో ఒక గుణము అధికము, మరియొక గుణము కొంచెం తక్కువ, మూడవది మరీ తక్కువ ఈ విధముగా మూడు గుణములు అనగా సత్వరజస్తమో గుణముల సమిష్టి రూపమే ఈ జగత్తు. మనము స్వీకరించు ఆహారములందు గూడ ఈ మూడు గుణములున్నూ ఎంతోకొంత ఎక్కువ తక్కువ నిష్పత్తులలో మనకు చేరుచుండును. అంతేకాక మనలో వున్న గుణములననుసరించియే ఆయా పదార్థములను ఇష్టపడుట జరుగునని గీతాచార్యులు బోధించియున్నారు.

సృష్టిస్థితి లయములకు కారకులైన త్రిమూర్తులు గూడ గుణము ననుసరించే వారి వారి కర్తవ్యమును పాలన చేస్తూవున్నారు. వారికిన్నీ మూలమైనది, ఏకముగా వున్న "ఓంకార స్వరూపము". అటువంటి దివ్యతత్త్వం అత్రి మహర్షికి అనసూయమ్మకు పుత్రుడుగా పుట్టి ఆకార స్వీకారం చేసినప్పటికిన్నీ త్రిగుణములకు అతీతంగానే ప్రవర్తిల్లుచూ శ్రీదత్తాత్రేయుడనే పేరుతో సృష్టిలోని అస్తవ్యస్తములను చక్కబఱచడానికి ఈ అపూర్వమైన శ్రీపాదరూపం ధరించి భువిపైకి వచ్చినట్లు ఈ కథా విధానము ద్వారా తెలుస్తున్నది. వారు ఏ విధంగా చరించి జ్ఞానదానం చేసినారో ఇప్పుడు శ్రీ విఠల్‌బాబాజీ వారి ద్వారా విందాము అని నేనిట్లు ప్రార్థించాను.

గురుదేవా! శ్రీపాదవల్లభుల వారి దివ్య సంకల్పమున్నూ, వారి తీర్థాటన ద్వారా జరిగిన భక్తోద్ధరణమున్నూ మాకు వినిపించి దయతో మా మనస్సులలోని రుగ్మతలను దూరం చేయగలందులకై ప్రార్థిస్తున్నాను అని కోరగా శ్రీ బాబాజీ ఇలా చెప్పదొడంగినారు.

హే పరమేశ్వరా! త్రిగుణాతీతుడా! సర్వలోకారాధ్యా! నీ లీలలు నీకే ఎఱుక! జరిగిన సంఘటనలు నీయనుగ్రహంతో మాకు నీవు గోచరింపజేసినంతవరకు వివరించగలము. కానీ నీ లీలలు అనంతములు. వానిని పూర్తిగా ఎఱిగినవారు లేరు. స్వామీ! శ్రీపాద శ్రీవల్లభా! శరణం! శరణం! అని కన్నులు మూసుకొని ప్రార్థించి తలపంకించుతూ ఇట్లు చెప్పసాగిరి.

ధార్మికులారా! శ్రీపాద స్వామివారు ఇల్లు వదలిపోయేముందు అన్నలకు గ్రుడ్డితనమును, కుంటితనమును నివారించిన విషయం చూచినవారు, సంగతి తెలిసినవారున్నూ, అంతకు ముందు

శ్రీ స్వామివారి వద్ద వేద వివరణలు వినిన పండితులు, కొందరు బంధువులు అందరూ శ్రీ స్వామివారి చుట్టూ చేరినారు. వారందరూ శ్రీ స్వామి నిర్ణయం మేరకు నడుస్తుంటే వారి వెంట పిఠాపురం గ్రామం ఉత్తరంగా పొలిమేర వరకు వెళ్ళి సాగనంపినారు. వారిని విడిచిరాలేక రాలేక వెనుదిరిగినారు.

## కాశీక్షేత్రం

శ్రీపాద శ్రీవల్లభస్వామివారు కొంతదూరంపోయి తమతో వచ్చిన వారందరికీ వీడ్కోలు చెప్పి మరికొంతదూరం పోయి తర్వాత తమ యోగశక్తితో కాశీ క్షేత్రాన్ని చేరుకొన్నారు. గంగానదీ తీరమునందు తొలుత స్వామివారు గంగా మాతను ప్రార్థనచేసిరి. గంగను పూజించి, స్తుతించిన తదుపరి గంగలో స్నానమునకుపక్రమించగా గంగామాత వారి ఎదుట సాక్షాత్కరించి చేతులు జోడించి వారికి నమస్కరించి “ఓ తండ్రీ! తమ సాన్నిధ్యమెప్పుడు లభించునాయని ఎదురుచూచుచుంటిని. నాయందు అపార దయతో వచ్చి నన్ను పవిత్రీకరించితిరి. ధన్యురాలనైతిని. దేవదేవా! ఎందరో పాపాత్ములు నా జలములలో మునిగి వారి వారి పాప ప్రక్షాళన చేసికొందురు. వారు పునీతులు కాగా ఆ పాపములన్నీ తీసుకొని వాటిని ప్రక్షాళన చేసుకొనుటకై తమవంటి మహనీయుల పాద స్పర్శకై నేను తపించుచుంటిని. నాయందు కృపాదృష్టితో తమరేతెంచి నన్ను పావనమొనర్చిరి. ఇదే విధమైన దయా దృష్టితో నిరంతరము నన్ననుగ్రహించమని ప్రార్థించెను. శ్రీపాదస్వామి వారు గంగామాతను ఆశీర్వదించి చిరుదరహాసం చేశారు. స్నానానుష్ఠానములు ముగించి, ఒక సామాన్య సాధకునివలె కాశీ విశ్వేశ్వరుని దర్శించి ఆ క్షేత్రమున మూడు రోజులు వసించిరి. వారికి భిక్ష యిచ్చుటకు అన్నపూర్ణమాత ఎంతో సంతోషంతో ముందుకు వచ్చినది. అచ్చటనే నివసించు యోగులు కొందరు స్వామిని దర్శించి స్తుతించి వారి జ్ఞానబోధలను శ్రవణంచేసిరి. స్వామివారు యోగులకు యోగమును ప్రసాదించిరి. సాధకులకు యోగ సాధనలోని రహస్యములను బోధించి వారి అవరోధములను తొలగించి అనుగ్రహించిరి. శ్రీపాదుల వారి దివ్యశక్తిని అట్లనుగ్రహింపబడిన వారు మాత్రమే గ్రహించగల్గిరి.

కాశీ క్షేత్రంలో అనేకమంది సాధువులు, సన్యాసులు, బ్రహ్మచారులు నివసించుచు యోగ సాధన సాగించుచుండిరి. వారిలో శ్రీ సచ్చిదానంద సరస్వతి అను యోగీశ్వరుడు అన్ని రోజులున్నూ శ్రీపాద స్వామి వారిని అనుసరించుచూ వారి బోధలను పూర్తిగా అవగతము చేసుకొనెను. శ్రీపాదుల వారు కాశీ విడచి వెళ్ళునది గ్రహించి ఆ స్వామి “మహాత్మా! మాకు తమ ఆదేశం ఏమిటో

తెలియజేయండి. సాధనలో అనేక సమస్యలను ఎదుర్కొనుచున్న ఈ సాధకులకు మీ దర్శన మాత్రం చేత అవరోధములు తొలగిపోయినవి. వారందరూ పూర్ణయోగమువైపు నడచుటకు సంసిద్ధులైనారు. తండ్రీ! మీ అండదండలు మాకు ఎల్లప్పుడు కావాలి. తిరిగి తమ దర్శనం మాకెప్పుడు లభించునో తెలపగలరు. ఎచ్చట వున్ననూ మమ్ములను మరువక కాపాడండి. శ్రీపాద స్వామివారు చిరునవ్వులతో "తప్పకుండా దర్శనం లభిస్తుంది. అంతా విశ్వేశ్వరుని కృపయే"నని వారికి వీడ్కోలు పలికిన తదుపరి శ్రీ స్వామి అచ్చటి నుండి అదృశ్యమై హరిద్వార్ క్షేత్రమునకు చేరిరి.

## హరిద్వార్

శ్రీపాదస్వామి వారు యథావిధిగా గంగామాతను ఆరాధించి స్తోత్రముచేసిరి. ఇది నిజంగా వారికి అవసరంలేకున్నా వారి వెంటనున్న వారికి విధి విధానాన్ని చూపించుటకై ఆచరించి చూపిరి.

**"యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరోజనః**

**సయత్ప్రమాణం కురుతే – లోకస్తదనువర్తతే॥** (భ॥గీ॥)

మహాత్ముల ఆచరణను అందరూ అనుసరించెదరు. కావున వారు సాక్షాత్ శ్రీహరిహర బ్రహ్మ స్వరూపులైన ఓంకారమూర్తియే! ఐనను లోకులకొరకీవిధంగా స్తోత్రం చేసిరి. "ఓ! గంగామాతా! సగర పుత్రులను పవిత్రీకరించుటకు భగీరథుని ప్రార్థన ఆలకించి భువిపైకి వచ్చుటయేకాక పాతాళమున భస్మ రాసులైయున్న వారి పితామహుల కందరికీ సద్గతులు కల్పించినావే! నీవు ఆవిర్భవించిన చోట నుండి నీ లక్ష్య సాధనకై ఎంతోదూరము కష్టమునకోర్చి మిట్టపల్లాల నధిగమిస్తూ ప్రయాణించినావే! ఓ భాగీరథీమాయీ! నీకై ఎంతో దూరమునుండి శ్రమించి వచ్చిన నీపుత్రులము. మమ్ము పునీతులను చేయుమమ్మా!" అని అందరికొరకు ప్రార్థనచేసిరి.

గంగా మాత వారి ముందు ప్రత్యక్షమై వారికి నమస్కరించినది. అంతలో అనేకమంది గుప్తముగా అచట నున్న మహాత్ములు, యోగులు అందరూ శ్రీపాదస్వామికి మాత్రము కనుపించునట్లు ప్రకటమై చేతులు జోడించి ఇట్లు ప్రార్థించిరి. "అహో! భగవంతా! దీనదయాళా! కృపాసాగరా! ఓ! విశ్వరూపా! శ్రీదత్త ప్రభూ! ఈ రూపంలో మాకు దర్శన మనుగ్రహించినావు. ధన్యులము స్వామీ! అనసూయా మాతను, అత్రి మహర్షినీ అనుగ్రహించిన దత్త ప్రభూ! నిన్ను దర్శింపవలెనన్ననూ, నిన్ను అనుసరింపవలె నన్ననూ సామాన్యులకు సాధ్యమా స్వామీ! ఆ కాలమున నీ దర్శనము మహాదుర్లభము. ఈ కలియుగ మందు నీకొరకు తపించుటకు సామర్థ్యములేనివారైన దీనులకు

సులభముగా అందు బాటులో నుండుటకై ఇట్లీ రూపమున అవతరించినావా! కరుణాసాగరా! నీ లీలలు అపారములు. నీ నామమే మహామంత్రమై కలియుగమందలి భక్తులకు సన్మార్గమును, ముముక్షువులకు మోక్షమును ప్రసాదించుగాక! సనక, సనందనాదులు ఆది శేషుడు గూడ నీ మహిమను కీర్తించలేరు. మాకు కన్నుల విందు కలిగించిన ఈ రూపము వర్ణనాతీతమైయున్నది. మమ్ము ధన్యులను చేసితివి” అని ప్రార్థనలు చేసిరి. శ్రీపాదస్వామి వారందరిపైనను కృపా దృష్టిని వర్షింపజేసి ఆనందసాగరంలో ఓలలాడించిరి. అందరికీ ఆశీర్వచనములు చేసి మరుక్షణంలో శ్రీస్వామి వారక్కడ అదృశ్యమై హృషీకేశ్ క్షేత్రమునందు ప్రత్యక్షమైరి.

## హృషీకేశ్

శ్రీపాద స్వామివారు హరిద్వార్ నుండి హృషీకేశ్ క్షేత్రమునకు చేరుకొని అచ్చట ఒక సాధారణయోగివలె త్రివేణీఘాట్‌నందు గంగా స్నానమాచరించి ధ్యాన నిష్ఠలో నిమగ్నులైరి. అటుగా వచ్చు పోవువారలందరూ పదహారేండ్ల బాలయోగిని జూచి ఆయన అపూర్వ సౌందర్యమునకు ఆశ్చర్యపడిరి. కానీ వారికి ధ్యాన భంగము కలిగించరాదని దూరము నుండియే నమస్కరించుకొని వెడలిపోయిరి. శ్రీ స్వామివారు మధ్యాహ్న వేళయందు ఆశ్రమాలలో భిక్ష స్వీకరించి నివేదన గావించి తదుపరి సర్వజీవ ప్రీతికి కొంత భాగము సమర్పించి మిగిలినది తాము స్వీకరించిరి.

సన్యాసులు, సాధువులు భిక్షను అర్థించి తెచ్చి ఈ విధముగానే చేయవలెను. కరతల భిక్ష చేయువారు మాత్రము మూడిండ్లలోగానీ, ఐదిండ్లలోగానీ భిక్ష కోరి కరతలమున స్వీకరించి తక్కువగానీ ఎక్కువగానీ ఎప్పటికప్పుడు ఆత్మారాముని స్మరించి సమర్పణముగా స్వీకరించెదరు. మరల మరునాడు మధ్యాహ్నవేళ యందు మాత్రమే భిక్ష చేసెదరు. కొందరు యాచించక ఉన్న చోటనే ఏది లభించిన నదియే దైవ ప్రసాదమని భుజించెదరు. ఎవరైనా తాము తినగా మిగిలినది (భుక్త శేషము) పెట్టినను దైవ ప్రసాదముగా గ్రహించి స్వీకరించెదరు. వారే అవధూతలు, వారికి ఎంగిలి దోషము లేదు. గృహస్థులు సర్వసాధారణముగా దైవ నివేదన చేయు సమయంలో వండిన పదార్థములన్నియు ఒక విస్తరిలో వడ్డించి నివేదన చేయుదురు. తదుపరి ఆ నివేదించిన పదార్థములను అట్లే వుంచి బ్రహ్మచారులు గానీ, సాధువులు, సన్యాసులు ఎవ్వరైనా భిక్షకు వచ్చిన వారికి సమర్పించుట అలవాటు. కొందరు గృహస్థులు అతిథికి పెట్టనిదే తాము భోజనము చేయనని వ్రతము పూనుకొందురు. ఈ భిక్షా స్వీకారముగానీ, భిక్షా ప్రదానముగాని ఈశ్వర ప్రసాదితము, ఈశ్వరార్పణముగానే జరిగినప్పుడు ఇరువురు ముక్తిని బడయగలరు. ఇది గృహస్థులు తెలియవలెను.

## బదరీక్షేత్రం

శ్రీపాదవల్లభులు హృషీకేశ్‌లో అదృశ్యమై బదరీ క్షేత్రమునందు నిలువగానే అచ్చట ఎందరో అదృశ్యయోగులు వేలాది సంవత్సరములుగా అచ్చట తపోనిష్ఠలో వున్నవారు, సిద్ధాశ్రమ వాసులు పూజ్యశ్రీ అచ్యుతానందసరస్వతిస్వాముల వారు వారి శిష్యులు, పూజ్యశ్రీ సర్వేశ్వరానంద స్వామివారు, పూజ్యశ్రీ మహావతార్ బాబా, పూజ్యశ్రీ  నిత్యానంద సరస్వతీ స్వామి, పూజ్యశ్రీ నిరంజనానంద సరస్వతీ స్వామి మరియు దత్త సాంప్రదాయకులు, నాథ సాంప్రదాయకులు, అఘోర సాంప్రదాయకులు అయిన వారు ఎందరో ప్రకటమై ఇట్లు స్తుతించిరి. “ఓ! దత్త ప్రభూ! దేవాదిదేవా! విశ్వకర్తవు, విశ్వభోక్తవు, లీలా విశ్వంభరుడవు, ఏకమేవాద్వితీయం బ్రహ్మ అని చెప్పెదరు. కానీ నీ తత్త్వమెవ్వరెరుంగుదురు. కారణములన్నింటికి మూలకారణమైన వాడవు. కార్యకారణ స్వరూపుడా! సకలాయుధ ధరా! ధర్మస్థాపకా! యజ్ఞపురుషా! యజ్ఞ ఫలప్రదాతా! కలియుగావతారా! హే! శ్రీపాద శ్రీవల్లభా! కోటి చంద్ర ప్రభాభాసమానా! ఆశ్రిత కర్మ బంధ విదూరా! నీ సుందర సుకుమార మంగళకరమైన రూపమును మాకు దర్శింపజేసి కృతార్థులను చేసితివి.

అత్రి అనసూయా గర్భ సంజాతుడవైన సమయమున నీవు షోడశ వర్షప్రాయుడవై, షోడశ కళాప్రపూర్ణుడవై వారినలరించుటకు ఆ ప్రాయమునందే నీ రూపమును స్థిరపరచితివి.

అదే విధముగా ఈ కలియుగము నందును, షోడశ వర్షప్రాయమున విరాగి రూపమున నీ తల్లితండ్రులను విడచి లోక కళ్యాణమొనరింప తరలివచ్చితివి. షోడశ కళా ప్రపూర్ణుడవై మా హృదినలరించుచున్నావు. ఈ రూపమునందు మార్పులేకుండా ఇట్లే సంచరించెదనని మాకు వాగ్దానము చేయుమని ప్రార్థించిరి. మరియు నీవు సహస్ర శీర్షుడవు. సహస్రాక్షుడవు. సహస్ర బాహుడవు. సహస్ర పాదుడవు, యోగివి, భోగివి నీవే. ఈ జగత్తులోని ఐశ్వర్యమంతయూ నీదే! నీది కానిదేదీ ఈ విశ్వమందు లేదు. ఓ సర్వలోకారాధ్యా! నీ సందర్శనమున మా తపస్సులు పూర్ణమైనవి. మా హృదయములు సంతృప్తినందినవి. మాయామయుడవు, మాయాతీతుడవు నీవే! త్రిగుణాత్మకుడవు, త్రిగుణాతీతుడవు నీవే! నీదయారసము ఒక్క బిందువు లభించినా పాపుల జన్మలు పావనమగును.  కేవలము దీన జనోద్ధరణకు కావలసిన విధంగా రూపధారణ చేయుట నీకే తగును దేవా! అద్వైతమై, అపూర్వమై, అద్వితీయమై, అమూల్యమై, అప్రమేయమై ప్రకాశించు నీ దివ్యతేజోమయ స్వరూపము సాకారమైనపుడు యోగులను కూడ మోహాంబుధిలో ముంచు చున్నది. నీ అనుగ్రహంతోనే నీ మహత్తును వాక్కులతో మేము స్తుతించగల్గుచున్నాము. నీవు

ఎచ్చట కొలువుందువో అచట సకల తీర్థములు, సకల దేవతలు కొలువు తీరెదరు. సర్వాంతర్యామి యైన నీవు భక్తులకు శ్రేయస్సును అనుగ్రహించుటయే దీక్షగా పూనినవాడవు. ఏకము – అనేకము, గుణము – నిర్గుణములేకాక గుణాతీతుడవై ఎవ్వరికీ అంతుతెలియని గుణములతో ప్రకాశిస్తున్నావు అని తనివితీరా ప్రస్తుతించారు.

బదరి క్షేత్రము భరతఖండపు సర్వశ్రేష్ఠమైన పుణ్యక్షేత్రముగా చెప్పబడినది. ఈ క్షేత్ర ప్రభావమును, వర్ణనమును భారతము, హరివంశము, భాగవతము మున్నగు ఇతిహాసములందు విపులముగా వర్ణించబడియున్నది. భాగవతము దీనిని భరత ఖండపు ఆధ్యాత్మిక రాజధానిగ పొగడినది. అక్కడకు చేరిన వారికి సహజముగా కోరికలపై విజయము లభించునని, క్షేత్ర రాజమని, లక్ష్యసిద్ధికై బదరీ యాత్ర చేయుట ముఖ్యమని కొందరు తెలిపియున్నారు. అచ్చట నారాయణుడే అధి దైవము. ఇచ్చట గంగకు అలకనందయని పేరు. అందలి నిర్మల జలము అనేక ఓషధీ లతలపై గుండా జాలువారి, కొండలపై నుండి దుముకుచు, కొన్ని చోట్ల వేగముగా ప్రవహించును. గంగా ప్రాదుర్భవ స్థానము శ్రీమన్నారాయణుని పాదపద్మములో కనుక ఇక్కడి గంగ నారాయణుని పాదముల నుండి స్రవించుచు నిర్మల జలవాహినిగ మనకు దర్శనమిస్తున్నది. జగత్తునందు సర్వశ్రేష్ఠమైనదిగ పేరొందినది. సాక్షాత్ నారాయణుని పాదోదకమని వ్యవహరించబడుచున్నది. ప్రాచీన యుగముల నుండి ధృవుడు, పృధుమహారాజు, ప్రియవ్రత మహారాజు మొదలైన రాజులు, నారదాదిమునులూ బ్రహ్మాది దేవతలు గూడ దర్శించి సేవించిన దివ్య క్షేత్రము ఈ బదరి!

అప్సర స్త్రీలు ఇంద్రుని ద్వారా ప్రేరేపింపబడి ఆ క్షేత్రమున నారాయణ మునికి తపో భంగమొనరించలేకపోయిరి. వారికన్న సౌందర్యవతియైన ఊర్వశి అను స్త్రీని నారాయణముని తన తొడ నుండి సృష్టించి చూపగా దేవలోక అప్సరసలు సిగ్గుపడినారు. ఇంద్రుడు వచ్చి క్షమాపణ కోరగా అతనికి ఊర్వశిని బహుమానముగా యిచ్చి పంపినాడు. అందువలన అచ్చట పురుషునకు స్త్రీపట్ల పుత్రికా భావము లేదా ఏ స్త్రీయైనా తనకు తల్లియను (మాతృ) భావము కలుగుట వలన కామజయము కల్గును. కావున బదరీ క్షేత్ర దర్శనము, అచ్చట నివాసము చేయు జనులకు కామజయము తథ్యమని పురాణ వాక్యమున్నది. సాధకులకు, తపస్వులకు కామజయమే మోక్ష ప్రాప్తికి ముఖ్య సాధనము గదా!

అచ్చటి నారాయణుడి మూర్తి చతుర్భుజములు కలిగి ఊర్ధ్వహస్తములందు శంఖ, చక్రము లుండును. అధో హస్తములు రెండు తొడలపై చిన్ముద్రతో యుండును. ఆయన పద్మాసన మందు

ధ్యాన నిష్ఠలోయుండును. ఆయన చుట్టూ నారదుడు, ఉద్ధవుడు, కుబేరుడు, లక్ష్మీ, గణేశుడు దర్శనమిచ్చెదరు. అటువంటి నారాయణుని శ్రీపాదస్వామివారు విధి ప్రకారం దర్శనం చేసుకొన్నారు.

అదృశ్య యోగులందరు శ్రీ స్వామిని స్తుతించి వారి ఆశీస్సులు పొంది అంతర్ధానమైరి. అచ్చటనే నివసించు శ్రీసదానంద బ్రహ్మచారి అనే సాధకుడు కొందరు సాధువులతోను, శిష్యులతోను వచ్చి శ్రీపాద స్వామిని దర్శించి పాదాభివందనమాచరించిరి. శ్రీ వారి ముఖమండలమున వెలుగు దివ్య తేజస్సును, వారి తపో మహిమ యొక్క ప్రకాశమని గుర్తించి ఆనందంతో నారాయణుడే స్వయంగా ఈ రూపములో వచ్చినాడని జయ జయ నాదములు చేసిరి. శ్రీ స్వామిని ఉచితాసనమున కూర్చుండ చేసిన తర్వాత ఇట్లు ప్రార్థించిరి. హే! భగవాన్! తమ దర్శనం చేతనే నాకు దివ్యమైన ఆనందం కల్గు చున్నది. మా సాధనలు ప్రారంభదశలోనే ఉన్నవి. తమరు దయతో మాకు మార్గదర్శనం చేయ గలందులకై మీ పాద పద్మములవద్ద శరణాగతి చేయుచున్నాము.

**"శ్రీమత్పరం బ్రహ్మగురుం స్మరామి - శ్రీమత్పరం బ్రహ్మ గురుం భజామి**

**శ్రీమత్పరం బ్రహ్మ గురుంవదామి - శ్రీమత్పరం బ్రహ్మ గురుం నమామి"**

ఓ! పరబ్రహ్మ గురుదేవా! నీ నామమే స్మరించెదము. నీ పాదాలే భజించెదము. నీ లీలలనే చెప్పు కొందుము. నీకే నమస్కారములర్పించెదము. నీవు తప్ప మమ్ము ఆదరించు పరమ గురువు లేరు లేరు అని స్తుతిచేసినాడు. ప్రభూ! మానవుని యొక్క అవస్థలు, వానియందు ధర్మ మర్మములు, చేయదగు కర్మములు మాకెఱింగించి మమ్ము ధన్యుల చేయుమని ప్రార్థించి అందరూ చేతులు జోడించిరి.

శ్రీపాద శ్రీవల్లభులు మందహాస వదనులై మృదుమధుర కంఠముతో సాధకులారా! మానవునికి నాలుగు అవస్థలు 1. బాల్యము 2. కౌమారము 3. యౌవనము 4. వార్ధక్యము అగునవి. నాలుగు ఆశ్రమములు: 1. బ్రహ్మచర్యం 2. గృహస్థము 3. వాన ప్రస్థము 4. సన్యాసము అనునవి. నలుగురు గురువులు: 1. తల్లి, 2. తండ్రి, 3. గురువు, 4. దైవం. అనుసరించాల్సిన నాలుగు ధర్మములు : 1. సత్యము 2. ధర్మము 3. శాంతి, 4. ప్రేమ అనునవి. సాధించాల్సిన పురుషార్థాలు నాలుగు : 1. ధర్మము, 2. అర్థము 3. కామ్యము 4. మోక్షము

మానవుడైపుట్టిన ప్రతివాడు ఈ పురుషార్థములను సాధించవలెను. అట్లు సాధించవలె నన్నచో నాలుగవస్థలలోను, నాలుగు ఆశ్రమాలలోను నాలుగు ధర్మములు, వాటిని సకాలంలో ప్రబోధం చేసేటందుకు నలుగురు గురువులున్నూ సహకరించెదరు. ఎట్లనగా **మొదటి గురువు**

తల్లియే. తల్లి బిడ్డకు పాలిచ్చి సాకుచూ ఆటపాటల సమయం నుండియే నడక, మాట, తీరు, తెన్ను నేర్పించుతుంది. ఎవరితో ఏ విధంగా ప్రవర్తించాలో, ఎవరిని ఏమని పిలవాలో అన్నీ నేర్పించుతుంది. శైశవ అవస్థ దాటి బాల్యావస్థలోకి వచ్చే సమయంలో చేయకూడని పనులు చేయనివ్వక దండిస్తుంది. ప్రకృతిలోని సకల వస్తువులను పరిచయం చేస్తుంది. సత్యమును అభ్యసించే సమయం. అనగా బాల్యదశలో ఉన్నది ఉన్నట్లుగా గ్రహిస్తారు. విద్యార్థి దశకు ఎదిగి ఉపనయనం జరిపించితే ఆ బాధ్యతలను తండ్రి **రెండవగురువుగా** చేపట్టుట, విద్యాభ్యాసము, తోడి బాలురతోగాని, పెద్దలతోగాని మసలు విధానము లౌకిక, ధార్మిక మార్గములను తెలుపు చుంటారు. దీనినే బ్రహ్మచర్యాశ్రమం అని తెలుపుతారు. వేద విద్యలుగానీ, వృత్తి విద్యలుగాని, వ్యవసాయ పరిశ్రమలుగానీ ఈ అవస్థలోనే పట్టుబడాలి. శరీరము దారుఢ్యమును పెంచుకొనే సమయం. దీనిని కౌమారదశ అంటారు. మానవుడు దాదాపుగా జీవితము యొక్క లక్ష్య సాధనకు లౌకికముగా కావలసిన విషయ పరిజ్ఞానాన్ని అధ్యయనం చేయు దశ. ఈ దశలో తండ్రి, మరియు గురువులు (పెద్దలు, తాతలు) తమ వంతు సహకారాన్ని అందిస్తారు. ఈ దశలో సాధించబడేది ధర్మ మార్గంలో జీవితాన్ని నడుపుకోవాలనే సంకల్పం. అది బలంగా వుంటే వాడు సన్మార్గం వైపునే పయనిస్తాడు. యౌవన దశలో అడుగుపెడతాడు.

అలా ధర్మాన్ని ఆధారం చేసుకొని అర్థ సంపదను పొంది మూడవ పురుషార్థ సాధనకై గృహస్థాశ్రమమును నిర్వహించవలసి వస్తుంది. ఈ ఆశ్రమంలోనే అసలు తాను పొందవలసినవి పొందుచూ గూడ తన జన్మ సార్థకం అయ్యేందుకు పనికివచ్చే గురుబోధలు, మాతా పితరుల సేవ, అతిథి అభ్యాగతులయందు ఆదరణ, బంధువర్గముతోడి సుహృద్భావము అలవరచుకోవాలి. మూడవ పురుషార్థమైన* "కామ్యము" అను పదానికి కొందరు శారీరక కామ వికారమును తీర్చుకొనుట యని భావించెదరు. అది పొరపాటు. సాధించవలసిన పురుషార్థములు అనగా కష్టపడి మనసా, వాచా, కర్మణ సాధనతో సాధించవలెను. కానీ శారీరక కామము జంతువులకు గూడ సహజమే గదా! దానిని కష్టపడి సాధించేదేమున్నది? అది వికారము అన్నారు. దానిని వదిలించుకొని, విదిలించుకొని పురుషార్థాలను సాధించుకోవలెను. కామ్యము అను పురుషార్థము

---

* Note: *కామ్యమనగా మిశ్రమము, కలసిపోవుట, లీనమగుట, తాదాత్మ్యము చెందుట, లయ మగుట అనగా ఆత్మ పరమాత్మలో కలియుట. ఆత్మ తన్ను తాను లుప్త పరచుకొని పరమాత్మలో లీనమగుట (అనగా యోగ విద్య).*

ద్వారా శరీర దారుఢ్యము తగ్గకముందే జీవుడు చివరి పురుషార్థమైన మోక్షమను (ఆత్మ జ్ఞానము) దానిని కోరి తెలుసుకొనుట. ఆ మార్గమును పెద్దలు, గురువుల వద్ద చేరి శ్రవణంచేసి సంసారము నందుండియే నిరంతరము దానికి అంటుకొనకుండ ప్రవర్తించగలుగుటయే కామ్య విద్య. ఈ విద్య ఆధ్యాత్మిక గురువుల వద్ద గృహస్థుగానే నేర్వవలెను. నదులన్నియు ప్రవహించుచు ప్రకృతికి సహకరించుచు చివరకు సాగరమందు కలిసి శాంతినొందునట్లు మానవుడు దైవమును గుర్తించుటకు ప్రయత్నించవలెను.

సంసార బాధ్యతలను సంపూర్ణముగా నిర్వహించుచునే మనసు ద్వారా వానప్రస్థమును తలంచవలెను. అనురాగముతోగాక విరాగముతో సంసారమును కొంతకాలము నడుపుచూ తదుపరి వానప్రస్థుడైన తర్వాత కొంతకాలము సన్యాసమును మనసుతో భావించుచు పరిపక్వ దశను పొందవలెను. పూర్తిగా సంసార భారమును భగవంతునిపై వదలుటకు ఆ స్థితిని, ధృతిని పొందినప్పుడు సన్యాసమును స్వీకరించుట ఉత్తమమార్గము. ఇది క్రమ పద్ధతి. అట్లుగాక బ్రహ్మచర్యము నుండి సన్యాసము స్వీకరించవలెనన్నచో సద్గురువుల కృపా కటాక్షములను సేవ ద్వారా పొందవలెను. పుష్కరకాలముపైన పరీక్షించిగానీ గురువులు సన్యాస దీక్షలనివ్వరు. ఏలననగా శిష్యులు పతనము కాకూడదనియే వారి సంకల్పము. శిష్యులను స్వీకరించుటయు, వారికి సమయోచిత బోధలు చేయుటయు, వారి మానసిక స్థితిని నిరంతరము కనిపెట్టుటయు గురువుల బాధ్యతయై యుండును. ఆ స్థితిలో వారి భారమంతయు దైవముపైనే వుంచి చరించవలెను.

సాధకులారా! సాధనా మార్గము చాలా కఠినమైనది. ఎంతో నిగ్రహ శక్తితో ముందుకు సాగవలెను. తల్లి, తండ్రి, గురువు, దైవము మన జన్మను సార్థకం చేసుకొనుటకీ విధంగా ఉపయోగపడుచున్నారు. కావున వారినెల్లప్పుడు మరువరాదు. శరీరానికి గల నాలుగు అవస్థలను తెలిసి ఏ అవస్థలో దేనిని సాధన చేయవలెనో తెలిపితిని గదా అట్లు చేయుట ఉత్తమ సాధకుల లక్షణము. అందరికీ శుభము చేకూరునుగాక! సాధనలో అందరూ ముందుకు పోతూ లక్ష్యాన్ని చేరుకోవాలని ఆశీర్వదించారు.

శ్రీవారి ప్రబోధము విని తాము ఎంతోకాలంగా ఈ క్షేత్రములో నివసించి ఈ క్షేత్ర నాయకుడైన బదరీనారాయణుని సేవించినందులకుగాను ఈ దివ్య స్వరూపుని దర్శనము, ప్రబోధనము లభించినది అని భావించి చేతులు జోడించి "మహాత్మా! ధన్యులమైనాము. ఎవరి కృపవల్ల యోగము, యోగ సామ్రాజ్యము సిద్ధిస్తుందో వారే మాకు ఈ హితములను తెల్పడం

మహద్భాగ్యము" అని అనేక స్థాయిలలోనున్న సాధకులు అందరూ శ్రీ స్వామి వారికి మ్రొక్కి "స్వామీ! తమ ద్వారా విన్న ఈ పరమ సత్యాలు మాకు ఎంతో ఉపకరించినవి. రేపు గూడ మాయందు దయతో మరికొన్ని విషయాలు బోధించ"మని కోరినారు. శ్రీ స్వామి అంగీకరించారు. ఆ సాధకులందరు శ్రీ స్వామి వారికి భిక్ష సమర్పించి ధన్యులయినారు.

మరునాడు శ్రీ స్వామివారు స్నానానుష్ఠానములను పూర్తిచేసుకొని దైవదర్శనము చేయు సందర్భములో తొలిరోజున శ్రీ స్వామి బోధలను విన్న సాధకులే కాక మరికొంత మంది సాధకులు, యాత్రికులున్నూ అక్కడకు చేరియుండిరి. శ్రీపాదస్వామివారి రాకకై వేచి యున్న సదానంద బ్రహ్మచారి శ్రీ స్వామివారిని సద్గురువుగా మానసికంగా వరించుకొన్నారు. అందుచేత శ్రీ స్వామి వారికి పాదపూజ చేయవలెనని తగు సామగ్రినంతయు అమర్చుకొని నిరీక్షిస్తూ వున్నారు. శ్రీపాద స్వామివారి వద్దకు చేరి చేతులు జోడించి ప్రార్థన పూర్వకంగా సత్సంగ సమావేశము వద్దకు స్వాగతించి తోడ్కొని వచ్చి ఉచితాసనమున కూర్చుండజేసెను. అందరును సాష్టాంగ వందనము లాచరించిరి. తదుపరి శ్రీ స్వామివారి అనుమతితో సదానందుడు శ్రీపాదుల వారికి యథావిధిని పాదపూజను నిర్వహించి ప్రార్థించెను. గురువరేణ్యా! చిరుప్రాయమందే తమరు మాకు మార్గదర్శనం చేసి అనేక విషయాలను బోధించారు. మా ధ్యేయమూర్తి తమరే. సాధనలోని మర్మాలు మరికొన్నింటిని మాకు తెలిపి మమ్ము ఉద్ధరించుటకు తమరే సమర్థులు అని కొనియాడి తన వేడికోలును విన్నవించెను.

సాధకులందరూ శ్రీ స్వామి వారి వాగమృతమును గ్రోలుటకు ఎంతో కుతూహలంతో వేచియుండుటను గమనించినారు. వారినుద్దేశించి శ్రీ స్వామి ఇట్లు బోధించిరి.

సాధకులారా! నిన్నటి రోజున మానవుడు వివిధ దశలలో సాధించవలసిన నాలుగు పురుషార్థములను వివరముగా తెలుసుకొన్నారు. ఆ నాల్గింటిలో ధర్మ, అర్థ, కామ్యములను ప్రేయస్సులనీ, చివరిదైన మోక్షమును శ్రేయస్సు అనీ వ్యాఖ్యానకర్తలు చెప్పెదరు. ప్రేయస్సులనగా ప్రకృతి ప్రేరణలచేత వానియందు ప్రీతి కలిగి ఆచరించుట. శ్రేయస్సు అనగా పూర్వ పుణ్య విశేషముచేత జీవునికి శ్రేయో మార్గమునందు అభిలాష కలుగుట. మానవ జన్మమును పొందిన ప్రతి జీవుడు తాను అనేకమైన జీవ జంతు రూపములు ధరించి చివరికి పుణ్య విశేషము చేతనే ఉత్తమమైన మానవ జన్మను పొందినానని తెలిసికొనవలెను. అట్లు తెలిసికొన్న తదుపరి ఈ జన్మ ముగియు లోపున మోక్షమును సాధించవలెనని శాస్త్ర ప్రబోధము. మోక్ష మార్గమువైపునకు మానవ ప్రయత్నం ఏదైతే వున్నదో ఆ స్థితినే "ముముక్షుత్వము" అంటారు.

దీనికి పునాది బలంగా వుండాలి. అందుకు సాధకుడు సాధించవలసిన సాధన సంపదను సాధనా చతుష్టయం అని నాలుగు విధములుగా సూచించారు. (1) నిత్యా నిత్య వస్తు వివేకము (నిశ్చయము) (2) ఇహాముత్ర ఫలభోగ విరాగము (వైరాగ్యము) (3) శమాది షట్కసంపద (4) ముముక్షుత్వము. జీవుడు ఉద్ధరింపబడాలను తలంపు కలగడమే "వివేకము" ద్వారానే కలుగుతుంది. కార్యాచరణను పూర్తి మెలకువతో "వివేకము"తో చేయుట. అది ఎట్లనగా ఇప్పటివరకు తన చేత సంపాదింపబడిన సంపద నిత్యమా? అనిత్యమా? యను ప్రశ్నము కలుగవలెను. అనిత్యమని తేలిన మరుక్షణం దానియందు ఇష్టత పోవును. కనుక వివేకం కలిగిన తోడనే వైరాగ్యం అనే రెండవ సోపానమును అధిగమించును. ఇవి ఇహలోక, పరలోక భోగములయందు విరక్తి కలుగుట ద్వారా సంభవించును. ఈ స్థితి కలుగుటకుగాను శమ, దమాది షట్క సంపదను సంపాదించాలి. (1) శమము (అంతరింద్రియ నిగ్రహము) (2) దమము (బాహ్యేంద్రియ నిగ్రహము) (3) ఉపరతి (4) తితీక్ష (5) శ్రద్ధ (6) సమాధానము అనునవి.

**(1) శమము :** అంతరింద్రియ నిగ్రహము. అనగా మనసు, బుద్ధి, చిత్తము, అహంకారములనబడు అంతఃకరణ చతుష్టయమును ఇతర విషయ చింతనము చేయనీయకుండా నిరోధించి భగవద్విషయములయందు ప్రవర్తింపజేయుట. ఇది పూనికతో చేయు ప్రక్రియ. మనస్సు పైన ఆధిపత్యము వహింపకలుగుట.

**2. దమము :** దమమనగా పంచకర్మేంద్రియములు, పంచ జ్ఞానేంద్రియములపై ఆధిపత్యమును సాధించుట. పంచకర్మేంద్రియములనగా వాక్కు, పాణి, పాద, పాయువు, ఉపస్థలు. పంచజ్ఞానేంద్రియములనగా త్వక్కు (చర్మం) చక్షుః (కళ్ళు) శ్రోత్ర (చెవులు) జిహ్వ (నాలుక) ఆఘ్రాణ (ముక్కు) అన్నీ కలిసి పది ఇంద్రియములు. వీనిని నిగ్రహించుట. అనగా వీనిని అనుచిత కార్యాలకు వినియోగించక జాగ్రత్త వహించుట. ఏలననగా ఈ దశేంద్రియములు మనసు యొక్క అధీనంలో వుండును. మనస్సు గనుక స్వాధీనమందున్నచో ఈ దమమును సాధించుట సులభమే.

**(3) ఉపరతి :** చిత్తమునందు యదార్ధ జ్ఞానమును పొంది (మొదటి శమ, దమముల ద్వారా సంపాదించిన లబ్ధి) శాశ్వత వస్తువుపై ధ్యానము నిల్పుట, తద్వారా పొందే శాంతిని 'ఉపరతి' అని సంబోధిస్తారు.

**(4) తితీక్ష : ఓర్పు :** శీతోష్ణములు, సుఖదుఃఖములు, ఆకలిదప్పులు, ఆశా-నిరాశలు వీటిని ద్వంద్వములు అంటారు. ఈ ద్వంద్వాల లక్షణములు తెలుసుకొని వాని చేత బాధించబడక ఓర్పు కలిగియుండుట. తాను సాధించవలసిన దానిని ఎంత కష్టమైనా వదలకూడదని ఇష్టముతో కూడిన ధైర్యము వహించి సాధించుట.

**(5) శ్రద్ధ :** గురూపదేశమునే పరమాత్మ యొక్క వాణిగా భావించాలి. గురువాక్యము, భగవద్వాక్యము వేరు కాదను నమ్మకము ద్వారా గురువే భగవంతుడని భావించి సేవించుటే స్వభావముగా పొందుటయే శ్రద్ధయని పిలువబడును. స్వభావము నుండి శ్రద్ధ బయల్పడును. "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అని శ్రీ గీతాచార్యులవారి ఉద్బోధ అందరికీ తెలుసునుగదా. శ్రద్ధ కలిగి గురుసేవ చేసే వానికి భగవంతుడు గురు రూపంలో తన సేవలనందుకొంటున్నట్లు అనుభవం లభిస్తుంది. ఇది 5వ సంపద.

**(6) సమాధానము :** సాధనలో పూర్ణత్వము పొందు సమయమున ఈ సృష్టి యంతటికిన్ని ఆధారమైన దివ్యత్వము యొక్క సంస్పర్శము చేత కల్గు తృప్తి, ఇప్పుడు చెప్పబడిన ఆరు విధముల సాధనా సంపద సాధనా చతుష్టయంలో మూడవ సోపానం. ఇవన్నీ సాధించుటకు ఒక లక్ష్యమును దృష్టియందుంచుకొన్న గాని పురుష ప్రయత్నమున ముందుకు సాగలేము. ఆ లక్ష్యమే ముముక్షుత్వము. అనగా మోక్షమును పొందవలెనని ఆసక్తి. మోక్షమనగా జన్మరాహిత్యము. చ్యుతి లేనిది. మానవజన్మ లక్ష్యము ఇదియే. దీనిని సాధన ద్వారానే సాధించవలెను. మానవజన్మను పొందిన జీవునకు ఒకటే కర్తవ్యము. అదియే మోక్షమును పొందుట. ఆ లక్ష్య సాధనకు మాత్రమే మానవజన్మ లభించినది. అందుచేత ప్రతి మానవుడు వివేక– వైరాగ్యముల ద్వారా దేహముండగానే సాధన చేసి తరించవలెను. అని వారందరికి ప్రబోధించిరి. వారిలో నిజమైన సాధకులకు తమ స్మరణతో ఆటంకములు తొలగిపోవునని వాగ్దానం చేసిరి. అందరూ సద్గురుమహరాజ్‌కీ జై అని జయజయ నాదములు చేసిరి. శ్రీపాదస్వామి ఆ భక్తులు సమర్పించిన ఫలహారమును స్వీకరించి అచ్చటి నుండి కేదార్‌నాథ్ చేరిరి.

## కేదార్‌నాథ్

కేదార క్షేత్రంలో శ్రీపాద వల్లభులు కేదారేశ్వరుని దర్శించిరి. ఒక సామాన్య సాధకునివలె నమస్కరించిరి. అచట అనేకమంది సాధకులు, యోగులు వారి దివ్యత్వమును వారి ముఖమండలం చూచి గుర్తించి, వారు కారణజన్ములని కొందరు, సాక్షాత్తుయోగి సార్వభౌములని కొందరు భావించినారు. ఎంత మంది వారిని ఒకేసారి దర్శించినను వారి ఆజ్ఞ అయితేనే నోరు విప్పి కీర్తించగలరు. వారి దివ్య సంకల్పంతో మాత్రమే ఏదైనా జరుగునను విషయాన్ని యోగులు అవగతం చేసుకుని మంత్రముగ్ధుల వలె ఆత్మలోనే మహదానందము పొందుచూ పరవశించి నిలచియున్నారు. కన్నులతోనే శ్రీవారి దివ్యరూపాన్ని ఆస్వాదిస్తున్నారు. పరమశివునే పరమ దైవముగా భావించి అనేక వేల సం.ల నుండి సాధనచేస్తూ అచ్చటనే నివసించు చున్న సిద్ధయోగి

అఘోరి సాంప్రదాయకుడు కూడ శ్రీ స్వామిని దర్శించుకొన్నాడు. వారిట్లు పలికిరి. "ఓ స్వామీ! బాలయోగీ! ఏమి నీ నటన! నీవు కాశీ క్షేత్రములో విశ్వేశ్వరుని దర్శించునప్పుడు మీ ఇరువురు ఆలింగనమొనర్చుకొనుటను నేను దర్శించగలిగాను. అప్పుడే కేదారేశ్వరుడు నీవిక్కడికి వస్తావని చెప్పాడు. ఎప్పుడెప్పుడాయని ఎదురుచూస్తున్నా!" అంటూ వుండగా అతని ఆకారం చూచి పిచ్చివాడని అక్కడున్న వారంతా నవ్వుకున్నారు. శ్రీ స్వామి ఆయనను దీవించారు. సాధకులైన వారు మాత్రం శ్రీపాద వల్లభులకు పాదాభివందనం చేస్తున్నారు. శ్రీపాదస్వామి ప్రసన్నులై అందరిపైనా తమ అమృతదృష్టిని సారించారు. సాధక యోగులు శ్రీ స్వామి వారిని ఒకానొక ఉచితాసనముపై ఆశీనులను చేసి తదుపరి ఇలా ప్రార్థించారు. "స్వామీ! చిరుప్రాయమందే ఇట్లు వైరాగ్యమును బూని తీర్థయాత్రలు చేయుచున్నారు. తమరి స్థితి ఎంతో గొప్పదని తమ ముఖమండలము చుట్టూ విరాజిల్లుచున్న తేజో వలయము తెలుపుచున్నది. మహాత్మా! తమకేమీ అభ్యంతరం లేకపోతే తమ సంకల్పమును తెలపండి" అని ప్రార్థించిరి. శ్రీ స్వామివారు మా గురువుల ఆదేశంతో తీర్థాటనము చేయు సంకల్పంతో వచ్చియున్నామని అర్థోక్తిగా పలికిరి. అప్పుడు వారందరూ "స్వామీ! మా సాధనలోని లోపాలను సరిచేసి మార్గదర్శనము చేయగలందులకై యోగిరాజైన మిమ్ము శరణు వేడుచున్నాము. ఓ పరబ్రహ్మ స్వరూపా! జ్ఞానసాగరా! కృపానిధీ! మాకవసరమగు జ్ఞానమును బోధించి, శాంతిని ప్రసాదించి, పరమ లక్ష్యమును తెలిపి గమ్యమును చేర్చు భారము మీదే! అని ప్రార్థించిరి. అంతలో అఘోరీ సాంప్రదాయ యోగిగారు పరుగు పరుగున వచ్చి "సాధువులారా! గట్టిగా పట్టుకోండి! లేకుంటే ఈ మహత్తరమైన ఉపాధి దొరికేది కాదు" అంటూనే నిముషంలో పరుగెత్తిపోయినాడు. అందరూ కొంత అర్థమైనట్లు కొంత అర్థంకానట్లు భావిస్తున్నారు. శ్రీ స్వామి మాత్రం ఏమీ మాట్లాడకుండ వున్నారు.

సంకల్ప సిద్ధులు, కార్యకారణ స్వరూపులునైన స్వామివారు వారందరినీ దయాదృష్టితో వీక్షిస్తూ "సాధకులారా! పరబ్రహ్మ నిత్యమై నాశరహితమై సర్వశక్తిమంతమై యుండి చైతన్య - ఆనందముల సంఘటితమైనదిగ నున్నది. దాని స్వభావము మొదట పృథ్వి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారములను అష్టవిధ ప్రకృతులుగ ఏర్పడినవి. ఈ భౌతిక స్వభావము నుండి 24 తత్వములేర్పడి జగత్తుగ పరిణామం పొందినవి. సృష్టికంతకు గర్భమైన ప్రకృతి యందు చైతన్యమను పరమాత్మ బీజముంచబడినది. జీవరాసుల సృష్టియంతయును జీవుల యొక్క కర్మలననుసరించి ఉద్భవించి అంతమున ప్రకృతియందే లయమగును. ఈ సృష్టియంతయు త్రిగుణాత్మకమైనదే. అందరి వ్యక్తిగత ఆత్మలును (జీవులు) పరమాత్మ యొక్క

అభిన్న భాగములే. అగ్ని నుండి విడివడిన అగ్నికణము కూడ అగ్నియే అయినట్లు జీవాత్మ – పరమాత్మ ఒక్కటే. దీనిని సమిష్టి విజ్ఞానదృష్టితో తెలియవలెను. సమిష్టి విజ్ఞానము సమిష్టి అహంకారము, సమిష్టి మనసు ఈ మూడు ఒకే అంతఃకరణ యొక్క మూడు రూపాలు. మనసు, బుద్ధి, వాక్కులకు అందనిది పరమాత్మ. అయినను ప్రకృతి యొక్క ఉనికి వల్లనే పరమాత్మను ఋజువు పరచుకోవలెను. దృశ్యము వేరు ద్రష్ట వేరు అను భావనను దూరం చేసుకోవలెను. అప్పుడు జ్ఞాత, జ్ఞేయము, చైతన్యము – పదార్థము అను ద్వంద్వ భావము పోవును. బుద్ధితో విషయమును గ్రహించుట, గ్రహించిన దానిని అనుభవ పూర్వకముగా తెలుసుకొనుటకు ఆచరణలో పెట్టుట ముఖ్యము. అట్లు ఆచరణలో పెట్టగానే జీవితము పూర్తిగ మారిపోవును. ఇది అనుభవైకవేద్యము. ఇది యోగ శరీరము ద్వారా మనసునకిచ్చు శిక్షణ. యోగము భౌతిక శరీరమును బలిష్ఠముగా, పటిష్ఠముగా చేయును. మనసును ఏకాగ్రము చేయును. ఆ స్థితిలో యోగము యొక్క పరమావధియైన సమాధిని పొందుటకు మనస్సు ఆటంకము కాకుండును. భ్రమలన్నియు, వృత్తులన్నియు శమించును. ఈ స్థితిని పొందినవాడు జీవితలక్ష్యమును పొందినట్లే. ఆ స్థితి యందు దివ్యచక్షువులతో ఈశ్వరుడే క్రియాశక్తిగాను, చైతన్యముగాను గుర్తించగల్గుచు అంతయూ పరమాత్మ స్వరూపంగా దర్శనం లభించి నిజానందం, బ్రహ్మానందము, పరమానందము పొందగలరు. ఇట్లు వచించుచుండగా విని వారంతా నిజానంద స్థితిని పొంది ఉండగా శ్రీపాదస్వామివారు అచ్చటి నుండి అదృశ్యులైరి అని శ్రీ బాబాగారు చెప్పగా అందరూ శ్రీపాద శ్రీవల్లభస్వామి వారికి జయము జయమని పలికినాము. జగద్గురువైన శ్రీపాద స్వామివారి తీర్థాటనమును మనో నేత్రంతో తిలకించే శ్రీవిఠల్‌బాబావారు ప్రవచనం చేస్తున్నంతసేపునూ ఆయా క్షేత్రములు వారు దర్శించుకొని వచ్చినవే కావున పరవశంతో తిరిగి వాటిని దర్శించగలిగినందుకు సంతోషంతో విషయాలను వివరించినారు.

ఒకసారి శ్రీ బాబాజీ గారితోపాటుగా భక్త బృందం 55 మందిని 1998 ఏప్రిల్ నెలలో ఉత్తర హిందూదేశ క్షేత్రయాత్రకు మమ్మల్ని గూడ తీసుకెళ్ళినారు. కావున ఆ యాత్రల గురించి వింటూ వుంటే నేను మానసికంగా ఆ క్షేత్రాలను దర్శించుకొన్నాను. ఆ మహాపుణ్య క్షేత్రాలు దర్శించడమే గాక వాటి పేరు ఉచ్చరించినా పుణ్యమే కానీ **దర్శనం కన్నా భక్తి ముఖ్యం అంటారు శ్రీ బాబాగారు.**

"జై గురుదత్త"

# 7వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

## శ్రీపాదులవారి తీర్థాటనం

మనం తీర్థాటనం చేసినా దానిలోని ఆంతర్యమును గ్రహించి దైవసన్నిధిని అనుభవించగలిగితే జన్మానికి ఒక్కసారి దర్శించుకొంటే చాలు! చాలామంది దర్శనానికి వెళ్ళి గర్భగుడి దాకపోయి మూల విరాట్టు ముందర నిలబడి కళ్ళు మూసి దర్శిస్తారు. ఇంత కష్టపడి వెళ్ళి కళ్ళు మూసుకొంటే ఇంక దర్శనం ఎలాగవుతుందని పూజ్యశ్రీ విఠల్‌బాబాజీ అప్పుడప్పుడు మనలను సరిదిద్దుతారు. అక్కడేమో కళ్ళు తెరచి బాగా చూడండి. బయటకు వచ్చి కళ్ళుమూసినా అదే మూర్తి కనిపిస్తుంది అని చెప్తారు.

అంత ఇష్టతను భగవంతునిపై పెంచుకోమనే పెద్దల సలహా. ఇటువంటి యోచనలతో మనసంతా ఆనందంతో నిండిపోగా శ్రీ బాబాగారితో నేనిలా ప్రార్థించాను. "స్వామీ! శ్రీపాద స్వామి వారు కేదారం నుండి ఎక్కడికి వెళ్ళారు. ఆ వివరాలు కూడ చెప్పి మమ్ము ధన్యులను చేయండి!" అని అడిగాను. శ్రీ గురుదేవులు ఈ విధంగా చెప్పసాగిరి. "శ్రీపాదశరణం, శ్రీపాదశరణం, శ్రీపాద చరణం భజే" "శ్రీపాదశరణం శ్రీపాదశరణం శ్రీపాదచరణం భజే" అని నామం చెప్పించి శ్రీపాదుల వారి తీర్థాటనమునిట్లు వివరించినారు.

భక్తులారా! అమ్మలారా! అయ్యలారా!

తదుపరి శ్రీపాదులవారు మానస సరోవరమువద్ద ప్రకటితమైనారు. వెంటనే అచ్చట మానసాదేవి ప్రకటమై శ్రీస్వామి వారికి పాదాభివందన మొనర్చి యిట్లు స్తుతించినది. ఓ దేవాది దేవా! అపారకరుణా పారీణా! మీ అవ్యాజప్రేమ పూరిత హృదయమునందు మాకు స్థానం ఇచ్చినారు. తమ దర్శనభాగ్యం కలిగించి మమ్ము పునీతులను చేసినారు. తమ ఆజ్ఞలకు లోబడి మేము ఉన్న చోటనేయుండి తమ నామస్మరణ చేయుచుందుము. మహాత్ములైన యోగి పుంగవుల స్పర్శను కోరి ప్రార్థించుచుందుము. తమ దయ కలిగినప్పుడే మహాత్ములు వచ్చి మాజలమందు స్నానమాడి మమ్ము పునీతుల చేసెదరు. ఇప్పుడు తమరే స్వయముగా వచ్చియున్నారు. తమ పాద ప్రక్షాళనము చేసి తరించుటకు అనుమతి కోరుచున్నా"నని ప్రార్థించగా శ్రీ స్వామి చిరునవ్వులతో ఆనతినిచ్చిరి. ఆ భాగ్యమునకు పొంగిపోయిన మానసాదేవి వారి పాదపద్మములు కడిగి పూజించి, సేవించి,

నమస్కరించి ఆనంద పరవశురాలైనది. ఆమెను దీవించుచు "తల్లీ! ముందు ముందు కాలంలో నీ వద్దకు ప్రజలు తండోపతండములుగా వచ్చి సేవించెదరు. వారందరికీ నీవు పాప ప్రక్షాళనము చేయ సమర్థురాలవుగా వుండుము" అని పలికి దీవించిరి.

అంతయు తమ దయ, ఉదారత్వమువలన సర్వులకు సుఖము-శాంతి లభించును గాక! యని వచించి ఆమె అంతర్ధానమయ్యెను. శ్రీపాద స్వామివారు అచ్చటి నుండి హిమవత్పర్వత శ్రేణిని నలువైపుల కలయజూచిరి. కొంచెము ముందుకుసాగి సర్వోత్తుంగ శృంగమైన కైలాస శిఖరమును దర్శించుచు "హరహర మహాదేవ శంభోశంకర" అని నామస్మరణము చేయుచు నమస్కరించిరి.

తదుపరి దశదిశల నవలోకించుచుండగా ఒక్కసారిగా కోలాహల ధ్వనులతో నందీశ్వరుడు, భృంగీశ్వరుడున్నూ సమస్త ప్రమధ గణములతో సహా ఎదుట నిలిచి చేతులు జోడించి "శ్రీపాద శ్రీవల్లభులకు జయము జయము"అని జయజయ ధ్వానములు చేసిరి. శ్రీపాద స్వామి ప్రసన్నులై కృపాపూర దృషితో వారందరినీ వీక్షించుచూ పలకరించినారు. నందీశ్వరుడు ప్రార్థనా పూర్వకముగా చేతులు జోడించి "దేవాదిదేవా! దివ్య ప్రభావా! కరుణావరుణాలయా! కైలాసమునకు స్వాగతం – సుస్వాగతం. మా ప్రభువు శ్రీశంకర భగవానులు తమరిని సగౌరవముగా కైలాసమునకు తోడ్కొని రమ్మని మాకాజ్ఞాపించియున్నారు. తమరి రాకకై సమస్త దేవతలు నిరీక్షించు చున్నారు. హేపావనమూర్తీ! దయచేయండ"ని వేడికోలుగా పలికెను. శ్రీ స్వామి వారు మందహాస చిత్తులై వారందరినీ ముందు నడవమని చేతితో సైగచేసిరి. సమస్త ప్రమధ గణములు సంతోషాంతరంగులై "శ్రీపాద శ్రీవల్లభులకు జయజయ ధ్వానములొనరించగా శ్రీ స్వామి తమ నిజరూపమైన శ్రీదత్తాత్రేయ స్వామి రూపమును ప్రకటించిరి. వెంటనే వారు "శ్రీదత్తాత్రేయులకు జయ"మని పలికిరి. తిరిగి శ్రీపాదులరూపమున గోచరించిరి. ఈ విధముగా కైలాసము చేరు సరికి శ్రీస్వామి తమ రెండు రూపములను దర్శింపజేసిరి. ఆచిద్విలాసముతో ప్రమధగణము చిందులు వేయుచూ సంబరములు అంబరమంటున్నట్లు జయజయ ధ్వానములతో సభలోనికి ప్రవేశపెట్టినారు.

సభా ప్రాంగణములోనికి చేరిన శ్రీపాద స్వామివారి అపురూప లావణ్యము, ముగ్ధ మోహనాకారమును దర్శించి త్రిమూర్తులు, త్రిమాతలు, దేవేంద్రాది దేవతలు, సమస్త మునిగణములున్నూ ఆనందముతో లేచి నిలబడి స్థాణువులైరి. ఒక్క క్షణంలో తిరిగి సంభాళించు

కొని శ్రీ శివశంకరుడు "స్వాగతం! మహాభాగ! సుస్వాగతం"అని పలుకగా జగద్గురు శ్రీదత్తాత్రేయ స్వామిగా తమ నిజరూపమున స్వామి నిలచిరి. వారికై ఏర్పరచిన ప్రత్యేక ఆసనముపై ఉపవిష్టులు కమ్మని శ్రీశంకరుడు సూచించగా శ్రీ స్వామి ఆసీనులైరి. తదుపరి అందరు తమ తమ ఆసనములపై ఆసీనులైరి. త్రిమూర్తులొక వైపునను, త్రిమాతలొకవైపుననూ ఉన్నతాసనముల నధిష్ఠించియుండగా, శ్రీ గణేశుడు, శ్రీ సుబ్రహ్మణ్యుడునూ తమ తమ స్థానములలో ప్రకాశించుచుండిరి. సనకాది ఋషులు, సప్త ఋషి మండలి, సకల ప్రజాపతులు, దేవేంద్రాది అష్టదిక్పాలురు, నాగులు, గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుష, సిద్ధ, సాధ్య, విద్యాధరాది సకల దేవగణముల వారున్నూ ఉచితాసనముల నలంకరించిరి. నారద మహర్షియు, తుంబురుడున్నూ ఉచితాసనముల నలంకరించి సభకు శోభను కూర్చుచుండిరి. అందరున్నూ "శ్రీదత్తాత్రేయ స్వామి వారికి జయము జయము" అని జయజయ ధ్వానములు గావించిరి. శ్రీపాద స్వామి తమ అమృతమయ దృష్టితోనే అందరినీ ఆశీర్వదించినారు.

మహేశ్వరుడిట్లు పలికెను. "సర్వలోకారాధ్యా! తమ అవ్యాజకరుణాపూరిత హృదయంతో మాకు దర్శనమొసంగి మమ్ములను ఆనంద వారిధిలో ఓలలాడించినారు. తమరి రాకకై మేమందరము ఎంతో ఆతురతతో వేచియున్నాము" అని పలుకుచూ మహేశ్వరుడు జగన్మాతయైన పార్వతీదేవి నొక్కసారి అవలోకించి చూపులతోనే ఆమె హృదయ భావమును గ్రహించి, ఇరువైపుల నున్న బ్రహ్మ, విష్ణు దేవతలందరి వంక చూచి సభలో వారందరి భావములను గ్రహించుకొని శ్రీపాద స్వామివారితో యిట్లు సంభాషించసాగిరి. స్తుతిపూర్వకంగా ఇట్లనిరి.

సర్వేశ్వరా! ఓంకార స్వరూపా! త్రిగుణాతీతా! సత్వ, రజ, స్తమో గుణములకు ప్రతిరూపములై ప్రకాశిస్తూ త్రిమూర్తులమని పేరుగాంచిన ముప్వురము మాకు విధించిన సృష్టి స్థితి లయాలను సక్రమముగానే నిర్వహిస్తూ వున్నాము. త్రిగుణముల పరిధిలోని విషయములు మాత్రమే మాకు తెలియబడును. తమరో త్రిగుణములకున్నూ అతీతులు. తమ తత్త్వం మాకుగూడ అవగతం కాదు. అలనాడు అత్రి మహాముని అవ్యక్తమైన, అనూహ్యమైన, ఆకార రహితమైన నిర్గుణమును దర్శింపగోరి తపించుటయు తమరి అనుగ్రహమును పొంది పుత్రునిగా పుట్టమని కోరుటయు ఈ కల్పమందు జరిగిన అత్యంత విశేష ప్రక్రియ. తమరివద్ద వరము పొందియున్న విషయమును ఎఱిగి కూడ త్రిమూర్తులము అనసూయా మాతను పరీక్షించు నెపమున పోయి "చిన్న తనమును" పొందితిమి. ఇదియంతయు తమరి లీలా విలాసములోని భాగమేనని తరువాత తెలిసికొంటిమి. మేము అవమానము పొందిననూ లోకములోని వారికిది యొక గుణపాఠముగా లభించినది.

మహాత్ములను, మహా సాధ్వీమతల్లులను కొంచెపు బుద్ధితో వంచించ ప్రయత్నించినచో వారి ముందు కొంచమై (చిన్నవారై) పోవుదురని తెలియవచ్చినది. త్రిగుణముల ప్రభావము త్రిలోకముల లోని వారినేగాక త్రిమూర్తులను గూడ వశము చేసుకొనునని మహాత్ములు గుర్తించి జగద్గురుడవైన నిన్ను ఏమఱక స్మరించుచు తరించుచున్నారు.

త్రిగుణములకు లోబడని అత్రి మహర్షియు, కించిత్తుగూడ అసూయలేని అనసూయ మాతయు నీ అనుగ్రహమునకు పాత్రులై నిన్ను పుత్రునిగా బడసి ధన్యత పొందినారు. లోకానికి గురుతత్త్వమును ప్రసాదించారు. చిరస్మరణీయులైనారు. ఆనాడు వారి కొరకు తమరు విచిత్ర రూపధారణ గావించి సకల లోకములకు గురు స్వరూపముగా వెలసినారు. శ్వేతవరాహ కల్పమందు వైవస్వత మన్వంతరములో 27 మహాయుగములు గడిచిపోయినవి. 28వ మహాయుగము నందు కృత, త్రేత, ద్వాపరయుగములు గడచిపోగా కలియుగ ప్రారంభమునందు పుణ్య దంపతులైన విష్ణుదత్తుడు - సుశీలాదేవి మహాసాధ్వీమణియు తమ అనుగ్రహమునకు పాత్రులైనారు. వారి ననుగ్రహించి వారి భక్తి, ప్రపత్తులకు తగిన విధముగా మంత్రోపదేశమిచ్చి లోకోపకారము చేయుటకై ఆదేశించితిరి. ఇంతకాలము తర్వాత తిరిగి ఆ దంపతులను సుమతి-అప్పలరాజ శర్మలుగా అవతరింపజేసి వారి గర్భమునందు తాము ప్రస్తుత రూపధారణచేసియున్నారు.

ఈ సంఘటనము గురించి అవగాహన కలదు కానీ మా అందరి హృదయాలకు అందని ఒకే ఒక సమస్య కలికాల మానవుల ప్రవర్తనమే స్వామీ. ప్రస్తుతకాలమందు మున్నెన్నడును లేనటు వంటి విపత్కర పరిస్థితులుత్పన్నమగుచున్నవి. సర్వకారణములకున్నూ కారణమైన మూల శక్తి "ఓం"కార తత్త్వము యొక్క సంకల్పముననుసరించియే ఈ పరిస్థితులు ఏర్పడుచున్నవని ఎఱుకలో నున్ననూ దీనిని సవరించునుపాయము కొరకు అందరము ఎదురు చూచుచుంటిమి. తమ కాలానుగుణ్యమైన లీలావైచిత్ర్యము త్రిమూర్తులమైన మాకు అగోచరమైయున్నది.

మేము గుణప్రయుక్తులము. తమరు గుణాతీతులు. ఓ! అనఘేశ్వరా! తమరీవిధంగా భువిపైన అవతరించుటకుగల కారణము నెఱుగలేక దీనియందేదో మర్మముగలదని మాత్రము ఊహించితిమి. కలియుగ మానవ స్థితులను గమనింపగా వారియందు దేవతా గుణములు, దానవ గుణములు, మానవ గుణములు, మహర్షుల గుణములు సమ్మిళితమైయున్నవి. పోను పోను రాబోవు కాలంలో మానవజాతిలో ఉన్నత లక్షణములు ప్రక్కకు తొలగిపోగా మానవులే దానవులగుదురేమోయని తోచుచున్నది. అంతేకాదు దానవులకన్నా మరింత హీనులై మహోపద్రవ కారులగుదురేమో?ననిపించుచున్నది.

పూర్వము దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేయుటలో నారాయణుడున్నూ నేనున్నూ సహకరించ గలిగినాము. కానీ ఈ కలియుగ మానవులలో దాగియున్న రాక్షసులను ఎట్లు నిర్జించగలమోనని, దీనికి మాశక్తి చాలదని తెలిసి తమరిని ప్రార్థించుచుంటిమి. ఈ విధమైన మానవజాతిని నిర్మూలించకనే సన్మార్గములోనికి మళ్ళించి ఉద్ధరించే ప్రయత్నంలో మనకు ఒక నిర్దిష్టమైన ప్రణాళిక కావలసి యున్నది. సర్వజీవ ఉద్ధరణమే తమ నైజము, ఉద్దేశ్యము, తత్త్వమునైయున్నది. కావున ఓ చైతన్య స్వరూపా! తమ దివ్య సంకల్పమును గ్రహించలేని మాకు మీ అవతరణలోని నిగూఢ తత్త్వమును విశదపరచి మమ్ము కృతార్థులను చేయగలరని వేడుకొనుచున్నాము" అని పలికెను.

ఈ విధంగా పరమేశ్వరుడు శ్రీ దత్తాత్రేయ స్వామివారి జన్మ వృత్తాంతమును, వారి పుత్రునిగా పొందగలిగిన అత్రి-అనసూయలను, విష్ణుదత్త, సుశీల దంపతులను, సుమతి అప్పల రాజు దంపతుల భాగ్యమును కొనియాడుచుండగా త్రిమాతలు (లక్ష్మి, సరస్వతి, పార్వతి)న్నూ ఒకరికొకరు జూచుకొనిరి. వారి మనసులో ఒక్కసారిగా నారద మహర్షి మాటల ద్వారా అనసూయాదేవి కొనియాడబడుటను తాము సహింపలేకపోవుటయు, భర్తలను ప్రేరణచేసి పంపుటయు తలంపునకు రాగా ఆ సంఘటనములోని దృశ్యము వారికి మనోగోచరమయ్యెను. త్రిమూర్తులు పసిబాలురైన ఘట్టము, అనసూయాసతి మాతృ ప్రేమతో వారికి స్తన్యపానము చేయించిన ఘట్టమును తిలకించి ఆమె పాతివ్రత్య మహిమ ఎంత మహిమాన్వితమోనని మనస్సు లోనే నమస్సులర్పించిరి.

అంత బ్రహ్మదేవుడు లేచి పరతత్త్వమే రూపుదాల్చి మా ఎదుట సాక్షాత్కరించిన ఈ మహాభాగ్యమునకు మేమెంతో పొంగిపోవుచున్నాము. సమర్థ సద్గురూత్తమా! సచ్చిదానందా! త్రిగుణాతీతా! అనసూయాత్రి నందనా! మీ తత్త్వమును మీరు తప్ప అన్యులెఱుంగలేరు. మూల తత్త్వముచేత నిర్దేశించబడిన రీతినే సృష్టికార్యమును నా పరిధికి లోబడి నిర్వహించుచున్నాను. కానీ ఇంతకు ముందెన్నడూ ఇటువంటి విపరీత, విచిత్ర, దుష్ట, దుర్మార్గ గుణములు కలిగిన మానవ సృష్టి పూర్వ కలియుగములందు జరిగియుండలేదు. ఇది అత్యంత కలవరమునకు కారణమగుచున్నది. దీనికి మూలకారణము నరయ లేక కర్తవ్యమును ఉపాయముతో సరిచేసుకొను ప్రయత్నంలో తమరిని శరణుపొందుచున్నాము అని పలికి తమ ఆసనముపై ఆసీనులయ్యెను. పరమేష్ఠి పలుకులను విని శ్రీదత్తస్వామి నారాయణుని వైపు చూచి చిరునవ్వు నవ్వగా వారున్నూ సమాధానముగా చిరునవ్వులనే ప్రకటించినారు. సాలోచనగా దత్తుడు మహర్షులవైపు చూడగానే

చిరంజీవియైన మార్కండేయ మహర్షి లేచి చేతులు జోడించి శ్రీ స్వామి వారికి శిరసు వంచి నమస్కరించి ఇట్లు విన్నవించారు.

"స్వామీ! శ్రీపాద శ్రీవల్లభా! అనసూయాత్రినందనా! హే దత్తాత్రేయా! సద్గురు సార్వభౌమా! యోగీశ్వరేశ్వరా! సర్వయోగానుసంధాయకా! తమ లీలావైదుష్యము అన్యులకు అలవికానిది. అది నిరంతరము చైతన్యవంతమై ఎప్పటికప్పుడు మార్పులు చెందుచూ అవాఙ్మానస గోచరమై యున్నది. చిరంజీవత్వము ద్వారా ఇప్పటికి నేను దర్శించిన అనేక మహాయుగములందలి కలియుగములకన్నా ఇప్పుడు జరుగుచున్న కలియుగము భిన్నముగా గోచరించుచున్నది. ఇందలి మానవుల మేధస్సునందు దైవీగుణసంపద, ఆసురీగుణ సంపదలు పడుగు – పేక కలిసి వస్త్రముగా ఏర్పడిన విధముగా సుఖమును కల్పించునట్లుగా భ్రమింపజేసి దుఃఖ సాగరమున ముంచి వేయు సంకల్పములను కలిగి వర్తించుచున్నది. ఈ మానవులు వస్తు, విషయ విజ్ఞానమును విస్తరింపజేయుట ద్వారా వినాశమును కొని తెచ్చుకొను సంకల్పములను చేయుచున్నారు.

ఇంకను రాబోవు కాలమునందు మానవులు తమ మేధాశక్తితో అనేకమైన నూతన వస్తు ఆవిష్కరణలు చేయుదురనీ, ప్రాణసంకటకరములైన అణ్వస్త్రములు, దూరదర్శన, దూరశ్రవణ యంత్రములు సృష్టించుట ద్వారాను, వేగవంతమైన వాహనముల ప్రవర్తింపజేయుట ద్వారాను, పంచభూతముల స్వరూప స్వభావములను ధ్వంసమొనరించుచూ వాతావరణ కాలుష్యము, చిత్ర కాలుష్యము, శబ్ద కాలుష్యము, ఆహార కాలుష్యము, జలకాలుష్యములను ప్రభావితంచేసి, భావ కాలుష్యము ప్రబలి అనేకమైన అలవికాని వ్యాధులబారినపడి మరణింపనున్నారు. అనేకమైన వైపరీత్యముల కారణంగా దాదాపుగా సర్వ మానవాళియు అపమృత్యువునే పొందు మార్గంలో పయనిస్తుందని భవిష్య దర్శినివలన గ్రహించితిమి. దీని నివారణకేదైనా ఉపాయమున్నదాయని మహర్షులందరున్నూ చేరి అనేకమైన చర్చలు చేసితిమి. కానీ ఈనాటి మానవులకు శరీర దారుఢ్యములేని కారణంగా సాధనా పటిష్ఠత చేకూరదు. యోగాభ్యాసము గానీ, ధ్యానాభ్యాసముగానీ పట్టుబడదు. శరీర బలంలేని కారణంగా మానసిక బలమున్నూ తక్కువే. అందువలన చంచలత్వమేగాని నిశ్చలమైన భక్తిమార్గమందుగూడ నిలకడయుండదు. ముఖ్యముగా "శీలసంపద"ను కాపాడుకొనవలెనను జ్ఞానముండదు. తల్లి దండ్రులయెడల ప్రేమ, గౌరవ భావములు లేక హింసా ప్రవృత్తిని కలిగియుందురు. ఇక గురువులపట్ల గౌరవము, భక్తి అసలే యుండదు. భగవంతుని వలన తమకు జన్మ లభించిన విషయమును మఱచి సంచరించెదరు.

ఈ పరిస్థితులను ఎట్లు చక్కబఱచి భూలోక ధర్మ సంరక్షణ చేపట్టెదవో సృష్టికి మూలమైన నీకే ఎఱుకయని అందరము సామూహికంగా నిన్నే ప్రార్థించు చుంటిమి. మా ప్రార్థన మాలకించి నరరూపము ధరించివచ్చితివి. నీ ముగ్ధమోహనరూపముతో కలిదోష నివారణమెట్లు చేసిచూపెదవోనని వేచియుంటి"మని విన్నపము శ్రీ స్వామి వారికి వినిపించెను.

అంత దరహాసవదనంతో వారినందరినీ వీక్షిస్తూ శ్రీవారి చూపులు జాబాలి మహర్షిపై నిలచినవి. శ్రీస్వామి వారు తమకవకాశమిచ్చినారని ఎంతో ఆనందంతో ఆ మహర్షి లేచివారి యొక్క వినతిని శ్రీ స్వామివారికి ఇట్లు వినిపించిరి.

దయాసాగరా! ప్రేమ స్వరూపా! అత్రినందనా! అద్భుతమైన శ్రీదత్తాత్రేయ రూపము కన్నా ఈనాటి శ్రీపాద శ్రీవల్లభుల రూపమే ఒక విశిష్ఠతను సంతరించుకొని అనిర్వచనీయమైన ఆనందమును సర్వులకు కలిగిస్తున్నది. దేవదేవా! కరుణాసింధూ! నీ లీలలు మాకు తెలియనలవి కానివి. అయినను తెలుసుకోవాలని సర్వులకు కుతూహలము మెండుగా వున్నది. దేవ, ముని గణములకే ఆ లీలలు వింతగా గోచరిస్తుండగా మరి అజ్ఞానబద్ధులైన మానవులేపాటి తెలుసుకొన గలరయ్యా! మాకు చాలా ఆశ్చర్యమును గొలుపుచున్నదీ విషయం.

ఈ కలియుగ మందలి మానవులు జ్ఞానదూరులు. భక్తిలేశమాత్రము లేనివారు. ఒకవేళ లేశ మాత్రం భక్తి కలిగి భగవంతుని అర్చించినా స్వప్రయోజనంకొరకు, స్వార్థభావంతోనేగానీ వేరు ఆశించి మాత్రం కొలవరు. రాబోవుకాలంలోని మానవులు తామే సృష్టికర్తలుగా భావించి గొప్పలు చెప్పుకొనుచుందురు. తమను సృష్టించిన వాడొకడున్నాడని విస్మరింతురు. కనబడుచున్న తల్లి దండ్రులనే తిరస్కరించువారు కనబడని భగవంతుని అసలే ఒప్పుకొనక నాస్తికులై చరించెదరు. కర్తవ్యపాలనము, స్వామిభక్తి, న్యాయవర్తనము, ధర్మరక్షణము అనునవి లోపించి సర్వులు ధన పిశాచి యొక్క కబంధ హస్తములలో చిక్కుకొని సుఖలాలసతో ప్రవర్తించెదరు. ఈ శరీరములు క్షణ భంగురములన్న మాట విస్మరించి శాశ్వతంగా సుఖ సంపదలు ఏర్పరచుకొనుటకు అనేక వక్ర మార్గముల ధన సంపాదన చేయుదురు. గురువులను, భక్తి కలిగిన వారిని అవహేళన చేయుదురు. యజ్ఞయాగాది క్రతువుల నిరసించి ఆత్మస్తుతి, పరనింద మొదలగు అపమార్గమందు చరించుచూ మరణమాసన్నమగువరకు "ఆశ" అను దానిని వదలరు. ఇటువంటి మంద బుద్ధులను, జడులను ఏ విధముగా ఉద్ధరించెదవోనని మేమందరము నిరీక్షిస్తున్నాము అని తమ లోకకల్యాణ కాంక్షలను విన్నవించెను.

తదుపరి వశిష్ఠులవారు లేచి శ్రీ స్వామి వారికి చేతులు జోడించి నమస్కరించి ఇట్లు ప్రస్తావించిరి.

"త్రిభువనపాలా! సర్వలోక పాలకా! సమర్థ సద్గురూ! ఓంకార స్వరూపా! నీవు సర్వజ్ఞుడవు. ఈ కలికాలమునందు మానవులు ఎదుర్కొను సమస్యలను అవలోకించగా మా మహర్షుల ఆవేదన అధికమగుచున్నది. మధ్యంతర ప్రళయమునకు దారితీయునట్లు తోచుచున్నది. సమాధానము తోచకున్నది. ఇప్పటివరకు ధర్మహాని జరుగునప్పుడల్లా మూలతత్త్వము యొక్క సంకల్పానుసారము శ్రీ మహావిష్ణువు అవతారధారణ చేయుట ద్వారా దుష్ట శిక్షణ, ధర్మరక్షణ జరుగుచున్నది. ఈ కలియుగ మందు మీరు స్వయముగా నరరూప ధారణ గావించినారు కదా! మీ దివ్య ప్రణాళికలు మీకే అవగతములు! దయాసాగరా! మానవులు మా సప్త మహర్షుల మరియు ఇరత ఋషి సంతతులమని గోత్రోచ్చాటన ద్వారా చెప్పుచున్నారు. మా సంతతిగా ఆచరించవలసిన ఆచార వ్యవహారములు మానవత్వపు విలువలను పాటించక భ్రష్టులైపోవుచుండుటను చూడలేకున్నాము స్వామీ! వీరికి తరణోపాయమును తెలియజేయవలసినదిగా తమరిని ప్రార్థిస్తూ తమ ప్రణాళికలో మావంతు చేయవలసిన కర్తవ్యమును ఆదేశించిన యెడల ధన్యులమయ్యెదము అని సవినయముగా అన్నారు.

శ్రీపాద స్వామివారు తమ దివ్య సంకల్ప విశేషములను సకల దేవతలకు విడమరచి వారితో చర్చించే లక్ష్యముతోనే కైలాసమునకు వచ్చినారు. కావున అందరి అభిప్రాయములు, ఆవేదనలు, ఆకాంక్షలు, అభిశంశనములు శ్రద్ధగా వింటున్నారు. లోలోన మురిసిపోవుచున్నారు. తమ విశిష్ఠమైన అవతార కార్య నిర్వహణకు ఒక నిర్దిష్టమైన ప్రణాళిక వున్నది. దానికి మరికొందరి సహకారమున్నూ కావలసియున్నది. కావుననే అందరివైపున్నూ ప్రసన్న దృష్టిని సారిస్తూ చిరు నవ్వులు చిందిస్తూ చివరకు నారద మహర్షి వైపు చూచి మీకు గూడ ఏదో ఆలోచనము ఉన్నట్లున్నదే! దత్త స్తోత్రములు, కవచములు చెప్పిన త్రిలోక సంచారులు, త్రికాలవేదులు అయిన తమరి ఆలోచనములను గూడ తెల్పిన దానిని గూడ పరిగణనలోనికి తీసుకొనెదము అని ప్రేరణ చేసినారు.

అప్పుడు నారదులవారు లేచి త్రిమూర్తులకు, త్రిమాతలకు, దత్తస్వామికి మరియు సభలోని వారికిన్నూ నారాయణ నామస్మరణంతో అభివందన మాచరించి ఇట్లు వచించారు. స్వామీ! మీరు స్మృతి మాత్ర ప్రసన్నులు. సర్వ హృదయాంతర్వర్తులు. మాలోని ప్రశ్నలు–సమాధానములకు ప్రేరణకర్తలు తమరే కదా! ఈ సకల చరాచర సృష్టిలో తమ సంకల్పము

కానిదేమున్నది! అయినను తమ ప్రేరణవలన ఈ కలియుగంలో రాబోవుకాలంలో భయంకరమైన మార్పులవలన దైవభక్తులు, గురుభక్తులు ఏవిధంగా రక్షింపబడగలరు! కలుషిత భావములతో నిండిన సమాజమునందు దైవీకార్యములు నిర్వహించుకొను భక్తులకు కలగబోవు ఇబ్బందులను తలంచి భవిష్యత్తు గురించే మా చింతన! కలియుగ ప్రారంభములో పరమేష్ఠి కలిపురుషునకు ఆనతిచ్చిన విధంగా సద్గురు భక్తులు మాత్రమే కలి ప్రభావమును దరిచేరకుండ జీవించగలరు. కానీ అటువంటి సద్గురువుల అండదండలు మానవులకు లభించవలెను గదా! ఆ విషయమై మాత్రమే మా యోచన వున్నది. కలిలో గురుపీఠము సుస్థిరముగ నిర్వహించబడినచో సకల దేవతలకున్నూ సంతోషము కలుగగలదు. మానవులు– దేవతలు పరస్పరం సహకారులుగా నుండవలెను. ఇది వేద విధి. దీనికి హానికలిగినప్పుడు మాకు చింత కలుగుట, ఆ చింతను తమరు తీర్చుట సహజ పద్ధతియేగదా! స్వామీ ఇదియే నా ఆలోచన. తమ ముందుంచినాను అని విన్నవించి కూర్చున్నారు. శ్రీ స్వామివారు సభా సదులందరి వంక పరికించి చూస్తుంటే అందరి హృదయములందుగల ఆకాంక్ష విశదమగుచున్నది. చిరు ధరహాసం పెదవులపై నాట్యమాడు చుండగా శ్రీ స్వామి ఇలా పలికారు. తమ భవిష్యత్ప్రణాళికను ఈ విధంగా వివరింప నుద్యుక్తులైనారు.

త్రిమూర్తులారా! త్రిమాతలారా! దేవ, మునిగణములారా!

మీరు వచించినది యదార్థమే. మీ అందరి యొక్క ఆశయాలు అత్యున్నతమైనవే! **సర్వ జీవులు సుఖశాంతులతో ఉండవలయునన్నదే దైవీభావన. ఈ భావనను భూలోకానికి అందించుటయే ప్రస్తుత అవతార లక్ష్యము. అనగా భువినే దివిగా మార్చు ఉత్తమ సంకల్పము జరిగినది.** ఇది క్రమ క్రమముగా అంచెలంచెలుగా మార్పులు జరుగనున్నది. మీరందరూ భావించిన విధముగా ఈ కలియుగ మానవులు అత్యంతమేథా సంపత్తి కలిగినవారు. పూర్వము యజ్ఞయాగాది క్రతువులు సత్కార్యములు చేసి అనేకులు స్వర్గలోక వైభవమును పొందాలని కోరుకొనేవారు. ఇప్పటివారు అట్లుగాక దేవలోకమున ఏ ఏ సౌఖ్యములు వర్ణించబడియున్నవో వాటిని భూమిపైననే ఏర్పాట్లు చేసుకొని సర్వులు సుఖించవచ్చునని ప్రయత్నించుటయు అందు సఫలీకృతులగుటయు జరుగుతుంది.

అమరత్వము (మరణంలేని స్థితి) గురించి గూడ పూర్వము నుండి ఎందరో ప్రయత్నించి విఫలులు కావడం జరిగింది. ఈ కలియుగ మానవులలో ఇదే భావన మారురూపం ధరిస్తుంది.

జీవితాలు క్షణభంగురములని అందరూ తెలుసుకొనుట ద్వారా సుఖలాలసులైన వారు వాటిని పొందవలెనని తహతహతో అనేక రోగాలద్వారా శిక్షల ననుభవించుట జరుగుతుంది. అట్లు జీవితములు, శరీరములు శాశ్వతము కాదని తెలిసిన మరికొందరు మరణ భయమునుండి మనసును మాత్రం దూరంగా ఉంచుకొందురు. అనగా మరణము గురించిన ఆలోచనను మనసు లోనికి రానీయకుండా వుండెదరు. హఠాత్తుగా మరణము సంభవించగా నిర్ఘాంతపోయెదరు. అనేక దుష్కర్మల ఫలితములు రోగములుగా శరీరాలను పీడించగా దానికి అనేక ఔషధములను సేవించి నివారణ పొందుచున్నట్లు భావించి తృప్తిపడెదరు. అయినను మరణము గురించి యోచించరు. ఆ విధంగా నిర్భయంగా మసలుటయే మృత్యువుపై విజయము సాధించినట్లు భావించెదరు. దేవతా సుఖములు దివ్యములనియూ, వారు నిర్మించుకొని అనుభవించు సుఖములు క్షణికములు, ప్రమాద కరములు, భ్రమ మాత్రమని ఎఱుగరు. మానవ శరీరమే యంత్ర, మంత్ర, తంత్ర సముదాయమను జ్ఞానమును ఎఱుగక కొందరు సంచరించెదరు. ఒకరినొకరు చంపు కొనుటకుద్యమించెదరు. యంత్ర, మంత్ర, తంత్ర రూపమైన వారి శరీర భాగాలను అధ్యయనం చేయగలిగిన వారు కొందరు ఆ జ్ఞానంతోనే యంత్రములను భౌతికంగా తయారుచేసి సర్వులకు ఉపయోగించు విధముగా చేసి సేవచేసినట్లు భావించుకొందురు.

కొందరు మంత్రములను తమకు అనుకూల విధముగా మార్చుకొని సిద్ధిని ప్రాప్తింప జేసుకొనలేక సతమతమయ్యెదరు. కొందరు తంత్ర విద్యనుపాసించి పరులకు మేలు చేస్తున్నామని భావించుచు తమకు ఇతరులకున్నూ కీడునే సంకల్పించుకొనుట తటస్థించును. సర్వానర్థముల కున్నూ మూలకారణం తత్త్వజ్ఞాన శూన్యతయే! వారు ఏఏ పరిస్థితులను సుఖములని భ్రమిస్తారో ఆయా సుఖములు దుఃఖ హేతువులు, రోగ హేతువులు, మరణ హేతువులుగ పరిణమించును. ఇది అజ్ఞానవశముననే జరుగును.

సంతాన నిరోధక ఉపాయములను అవలంభించి భగవత్ సృష్టికి తాము అడ్డుకట్ట వేయగలిగినామని ఘనముగా చాటుకొందురు. మరికొన్ని శతాబ్దముల తర్వాత సంతానమును పొందుటకు కావలసిన శరీర పుష్టిని, అవకాశములను కోల్పోయెదరు. అప్పుడుమేధావులనబడు జ్ఞానులు కొందరు సృష్టియనేది మానవుని చేతిలో లేదనే సత్యాన్ని ప్రబోధం ద్వారా తెల్పి జాతి నిర్వీర్యం కాకుండా సృష్టి ఆగిపోకుండా వుండేటందుకు మానవాళిలో కావలసిన మార్పులను తెస్తారు.

అహింసా విధానమును పాటిస్తున్నట్లు భావిస్తూ జీవహింస చేస్తారు. తల్లిదండ్రుల హింసిస్తారు. భార్య పిల్లలను హింసిస్తారు. తృప్తి, ఓర్పు, శ్రద్ధలు లేనప్పుడు వారికి అశాంతియేగాని సుఖమన్నది వుండదు. ఎవ్వరైనా తాము చేయు పనులే ధర్మమైనవిగాను, తమ పద్ధతులే సక్రమ మైనవిగా భావిస్తారు. ఇతరులేమి చెప్పినా ఒప్పుకొనరు. అధికారంకొరకు ప్రతివారూ తాపత్రయ పడతారు. సేవా భావం మనసులో వుండరాదు అనీ అందరూ అహంభావంతో యజమానులమనే భావిస్తారు. ఎవరితప్పు వారికి తెలియదు. **ఇటువంటి సమాజమును దారిలోపెట్టుటకు, సక్రమ మార్గంలో నడిపించుటకు సంపూర్ణ శ్రద్ధ, సహనము, శుద్ధమైన అంతఃకరణము కలిగి సర్వ జీవుల పట్ల దయ, ప్రేమ, భక్తి కలిగియుండే గురువుల అవసరం ఎంతైనావున్నది.** తనకు తాను తరించాలనే భావమును విడచి సద్గురువులు సమాజ సేవకు పూనుకోవాలి. సమాజంలోని దీనులను, హీనులను, రోగులను, పాపులను ప్రేమతో దరిచేర్చుకోవాలి. అనగా ఇప్పటివరకు ప్రవర్తిల్లు చున్న జాతి, కులములను ముందు దూరం చేసుకోవాలి. పుణ్యాత్ములైన వారికి గురువులుగా వుంటూ పాపులకు దూరంగా సంచరించుటలో గొప్పదనమేమీ లేదని తెలుసుకొని దిగజారిపోవుచున్న వారిని ఉద్ధరించుటకు గురువులే పూనుకోవాలి. తప్పుచేసిన వారిని ప్రేమతో అత్యంత చాకచక్యంతో తప్పు నుండి మరలించాలి. దీనికి గురుతత్త్వము మాత్రమే సమర్ధవంతమైయున్నది.

మీరు దర్శించిన భవిష్యత్ కలి ప్రభావమంతయు సత్యమే. మీరందరూ ఒక్కసారి పునరాలోచనము గావించి చూడుడు. ఎంతటి ఘోర కలినైనా, ఎంతటి విచిత్ర గతిగలిగి నడుస్తున్న దైనా మనము మన మార్గమును కొంచెము సవరించుకొన్నచో ఎటువంటివారినైననూ మన మార్గములోనికి తేగలము. వేద విజ్ఞానము గూడ ఒక్కొక్క యుగమునకు కావలసిన మార్పులతోనే ప్రవర్తిల్లుచున్నది గదా. వేదమే సృష్టికి మూలం. దానిననుసరించియే విధాత సృష్టి జరుగుచున్నది. ఈ ప్రకృతియంతయు నిత్య చైతన్యముతో కూడి మార్పునకు తావిచ్చుచున్నది.

ఆ ప్రకృతియే మానవుని ప్రవృత్తిగూడనైయున్నది. అది మార్పు చెందుటయన్నది సహజమే. దీనిని మరికొంచెము విశ్లేషించుకొన్నచో నా సంకల్పము మీకందరకు విశదమగును అని చెప్పు చుండగనే వినువారలందరకు శ్రీపాద స్వామివారి గురుతత్త్వము అవగతమైనది. వారి అపార కరుణకు సర్వులు ముగ్ధులైనారు. తిరిగి శ్రీపాద స్వామివారు ఇట్లు వచించిరి. మీరందరూ పూర్వము చేసిన దుష్ట శిక్షణనే తలంచి యోచించుచున్నారు.

దుష్ట శిక్షణ యనగా దుష్టబుద్ధితో తప్పుచేసిన వారిని దండించి శిక్షించుట జరుగుచుండేది.

ఇప్పుడు దీనికి ఒక నూనతమైన రహస్య ప్రణాళికను నిర్ణయించినాను. ఇప్పుడు దుష్ట బుద్ధియు మంచిబుద్ధి (ఇతరులకు మేలు చేయు బుద్ధి)యు త్యాగబుద్ధియు అన్నియు ఒకే మానవునిలో నిండియుండి ఒక్కొక్కసారి ఒక్కొక్క బుద్ధి వానికి ప్రేరణలు చేయుచున్నవి అను విషయమందరికీ విదితమే. అందుచేత ఆ వ్యక్తిని సంహరించుట కుదరదు. కాబట్టి ఎటువంటి వ్యక్తినైన ప్రేమతో దరి చేర్చుకొని వానిలోని దుష్ట గుణములందు పరివర్తన తెప్పించినచో వానిలో దుర్గుణములు సద్గుణములుగా రూపుదిద్దుకొనును. తద్వారా ప్రేమ తత్వమును వానిలో అభివృద్ధి పరచెదను. అపారమైన క్షమాగుణముతో ద్వేషమును దూరీకరించెదను. **పాపాలకు ప్రాయశ్చిత్తముగ పూర్వము తపస్సు యజ్ఞములు పూజలు విధించినాము. ఇప్పుడు నామస్మరణ మాత్రమునే వారి అనేక పాపములను నిర్మూలించెదను.** వారిలో సత్వగుణ ప్రేరణ చేసి రజో తమో గుణముల నుండి బయల్పడునట్లు చేయుదును. ఏ విధమైన ఆయుధమును ధరించను. సాధు రూపమును ధరించి ప్రేమయే భూషణముగా ధరించి సంచరించెదను. నా శుద్ధమైన జ్ఞాన ప్రకాశంలో ఎంతటి పాపులైనను తరించవలెనను బుద్ధి కల్గిన చాలు. వారు నా వైపు తిరిగి ఒక అడుగు వేస్తే నేను వారి వైపుగా 9 అడుగులు వేస్తానని వాగ్దానమున్నది. తద్వారా చిన్న-పెద్ద, స్త్రీ-పురుష, కులం-మతం, బీద-ధనిక భేదం లేకుండాఅందరి యందునూ నూతన భక్తి విధానమును ప్రేరేపించెదను. ఆపైన వారి కర్మానుభవం ద్వారా కొంత కర్మలు నశించిపోవును. అవధూత లక్షణములు తెలిపి వారందరికీ సూక్ష్మములో మోక్షమార్గమును చూపిస్తాను అని శ్రీస్వామి వారు తెలుపుచుండగా మహర్షులు, దేవతలు ఆశ్చర్యపోయినారు.

నారదుల వారు విస్మయముతో "స్వామీ! ఏమీ ఈ వింత? పాపులను శిక్షించుట మాని ప్రేమించెదరా? తప్పుచేసిన వారిని ప్రేమతో దరిచేర్చుకొందురా! కోపాలు, శాపాలు యికపై ఉండవన్నమాట. ఈ నూతన ప్రణాళిక యొక్క అమలు ఎట్లు జరుగనున్నదో వేచి చూడవలెను. భూలోకమున దుష్టులను శిక్షించకనే ధర్మస్థాపన చేయ నిశ్చయించితిరా! ఇది ఎట్లు సాధ్యము అనిపించుచున్నది. కొంచెము దీనిని వివరముగా తెల్పండి స్వామీ!" అనగా శ్రీ స్వామి వారు నవ్వుచూ శిక్షయను పదము "శిక్షణ" యని తెలియుడు. శిక్షణ యనగా విద్యగరపుట, తద్వారా అవిద్యను దూరీకరించుట జరుగును అని తెల్పిరి. అదీకాక వారు స్వయంగా చేసుకొన్న కర్మల ఫలితములనెట్లైన అనుభవించక తప్పదు. ఇంక వేరు శాపములతో పనియేమున్నది. చేసిన కర్మఫలానుభవము చేతవారు బాధపడునపుడు వారిని మరింత నిందించక ప్రేమతో సానుభూతితో

ఆదరించుటను సర్వులకు నేర్పి మానవసేవయే మాధవ సేవయని అసలైన సేవ యొక్క స్వరూపమును అందరికీ అభ్యాసము చేయించుట ద్వారా కొన్ని కర్మఫలానుభవములు సూక్ష్మీకరింపబడి తొలగిపోవునట్లు ఈ ప్రణాళిక నిర్ణయించబడినది. ఈ విధంగా గురువులైన వారు ప్రేమమూర్తులు, త్యాగమూర్తులుగా వుండవలెనని శాసనము జరిగినది. వీరు శిష్యులకు తొమ్మిది లక్షణములను గురించి బోధించవలసి యుండును. (1) అకించనత్వము (అహంకార రాహిత్యము) (2) నిర్మత్సరత్వం (మత్సరము లేకుండుట) (3) దక్షత కలిగియుండుట (సోమరితనము లేకుండుట) (4) నిర్మమత్వము (మమకారము లేకుండుట) (5) గురుసేవా పరాయణత్వం (శరణాగతి) (6) నిశ్చలత్వము (చంచల స్వభావములేకుండుట) (7) పరమార్థ జిజ్ఞాస (నిరంతరం పరుల సుఖశాంతులను కోరుట) (8) అనసూయత్వం (అసూయ లేకుండుట) (9) పవిత్ర సత్య భాషణం (శుద్ధమైన, సత్యమైన మాటలు పలుకుట) ఈ లక్షణములన్నియు సద్గురునియందు నిరంతరం శోభించుచుండవలెను. బోధ ద్వారా ఏమి తెలుపదలంచెనో దానిని తాను కలిగియుండ వలెను.

ఈ విధమైన అవగాహనను జనులకు కల్గించుటయే ఈ అవతార లక్ష్యము. సరియైన సమయమందు ఇట్లవతరించుట నాకర్తవ్యము. ఈ అవతార రహస్యమే మీకు మార్గదర్శనమును కలిగించును. శ్రీరామావతారమున దేవతలందరూ వానర వీరులుగాను, శ్రీకృష్ణావతారమందు యోగులు మునులు గోపికలరూపంగాను అవతరించి తరించినది మీకు తెలియును. కావున ఈ సంకట పరిస్థితులలో భూలోకమును ఉద్ధరించు సేవలో ఎవ్వరైనా ఇష్టపూర్తిగా పాల్గొనవచ్చును. బలవంతమేమియును లేదు. కానీ మీరు భువిపై సద్గురు రూపముతోనే అవతరించి విశ్వమునే గురువుగా భావించి సేవించదలంచియుంటే ఇప్పుడు నేను ప్రతిపాదించిన సకల సాధన సంపత్తితో అవతరించి మానవసేవ చేయండి.

గురు సేవ అనగా విశ్వమానవ సేవ యని మరువరాదు. సుఖ-దుఃఖములు, పాప-పుణ్యములు, శీతోష్ణములు, అహంకార మమకారములను ద్వంద్వములకు ఏ మాత్రం లోనుకారాదు. ఇంతకంటే ఎక్కువ మీకు చెప్ప పనిలేదు. త్రిమూర్తులు, ఇంద్రాది దేవతలు, ఎవరు భువిపైన అవతరించినా పై విషయములకు అనుకూలంగా గురుస్వరూపముగానే రావలెను. అట్లు సద్గురువులై ప్రజలను సన్మార్గములో నడిపించుట ద్వారా లోకోద్ధరణ చేయండి అని చెప్పగా వారిలో కొందరు ఏ సమయమందు అవతరించవలెనో సూచనలు ఇవ్వమని కోరగా ఆయా

సమయానుకూలంగా మీకు సూచనలు అందుతాయి. ఆ విధంగా అవతరించి కలి కల్మషముల నుండి మానవ జాతిని జ్ఞానబోధలతో ఉద్ధరించ వలసినదిగా ఆజ్ఞాపనచేసిరి. తాము ప్రతి శకమందు సద్గురు రూపధారణ చేసి అవిరళ కృషి చేస్తామని తెలిపినారు. తమ తదుపరి అవతారము నరహరియనియు, మాణిక్య ప్రభు, శ్రీ స్వామి సమర్థులనియు, తదుపరి శ్రీ సాయిబాబాగాను, శ్రీ వాసుదేవానంద సరస్వతి, బ్రహ్మానంద సరస్వతి గాను వచ్చెదనని పలికి ఒక్కొక్క సమయమందు రెండు మూడు చోట్లను ఇంకనూ ఎక్కువ చోట్లనూ గూడ అవతరించి నా లక్ష్యమును నెఱవేర్చెదనని తెలిపిరి. క్రమముగా ఈ దివ్య ప్రణాళికయొక్క స్వరూపము విజృంభించి లోక కల్యాణమునకై ప్రతివారు సిద్ధము కాగలరు.

తర్వాత భూత, ప్రేత, పిశాచ గణములు తమవంతు కార్య నిర్వహణకు సిద్ధముగా నుంటిమని స్వామివారిని వేడగా ఇట్లు సెలవిచ్చినారు. మీరందరూ మీమీ శక్తులతో యుక్తులతో స్వాభావికంగానే భూమిపైన సంచరించండి. ఏ మానవుడైనా గజకర్ణ, గోకర్ణ, టక్కు, టమార విద్యలతో ప్రజలను మోసగించు ప్రయత్నంలో గురువుగా చెలామణీ అయితే వారియందు చేరి దుష్ట గుణాలను బాగుగా వృద్ధిపరచండి. ఆపైన ఈకాల భైరవస్వామి వారు తన శక్తితో వారికి బుద్ధి గఱపి సకల పరీక్షలు నిర్వహించి అర్హతగలిగిన వారిని నా సన్నిధానమునకు చేర్చును. కావున కాలభైరవ స్వామి యొక్క అధీనమునందు మీ గణములందరు మానవుల బుద్ధులను మార్చుటకు సంసిద్ధముగా వుండండి. అందరూ సద్గురువును చేరునట్లు చేయండి. లోక కల్యాణ కార్యమందు నిమగ్నులు కండి అని ఆజ్ఞాపించారు.

కశ్యప ప్రజాపతి లేచి నమస్కరించి స్వామీ! తమ తీర్థాటము పూర్తి చేసుకొన్న తదుపరి భరతఖండమందు శ్రీశైలమునకు దగ్గరలో కృష్ణానది మధ్యన కురువపురమను ఒక దీవియందు తపస్సాధన నెపంగా నివసించుడు. అచ్చట పూర్వము మేము తపస్సు చేసి శ్రీమన్నారాయణుని మూడు అవతారములకు తల్లిదండ్రులమైతిమి. ఇప్పటికిని ఎందరో మహాత్ములు అచ్చట అదృశ్యముగా తపస్సమాధియందుండెదరు. ఆ ప్రదేశము యొక్క మహిమ ముందు ముందు కాలంలో ప్రసిద్ధముకాగలదు. మీయొక్క తపస్సుతో అచ్చటి మహిమ అద్భుత రీతిని జనులను ఆకర్షించుకొని వారిని పుణ్యవంతులుగా చేయును. ఈ విధంగా ఆ స్థలము మీలోక కల్యాణ కార్యమునకు దోహదకారి కాగలదు. పాపులను దయతో పవిత్రీకరించుటయే ముఖ్య ఉద్దేశ్యమని చెప్పినారు. కావున నేనీ సూచన చేయగల్గితిని. మేము మీ నూతన ప్రణాళికా విధానము

జయప్రదముగా వలెనని సంకల్పించి నిత్యము విశ్వశాంతికై ప్రార్థించెదమని చెప్పగా శ్రీదత్తాత్రేయ స్వామి అనుమతించి "అట్లేయగును గాక" ఆశీర్వదించిరి.

తదుపరి దక్ష ప్రజాపతి వారు లేచి నమస్కరించి "స్వామీ! భూలోకమున యజ్ఞయాగాది క్రతువులు పూర్వమువలెగాక ఇప్పటివారి బలమునకు తగినట్లుగ సులభ పద్ధతిలో ఆచరించు నూతన విధానమును ప్రవేశపెట్టుటకు తగిన సమయము తమరు సూచించినచో ఆ ప్రణాళికను మేము ఎవరైనా సాధకుల ద్వారా అందజేసి మావంతు సహాయము చేయవలెనని కోరుచుంటిమి. ఆ విధముగా మానవులు దేవతలను ఒక్కసారైనా తలంచుకొనుట తటస్థించును. వారి పాప ప్రక్షాళనమునకు ఈ ప్రక్రియ చక్కగా తోడ్పడునని మా అభిప్రాయము. తమరిందులకు అవకాశము కల్పించవలెనని కోరుచున్నాము అని ప్రార్థించగా శ్రీదత్తస్వామివారు తప్పక తమ సూచనను పరిగణనలోనికి తీసుకొందుమని వాగ్దానముచేసిరి. సమయమునకు తగిన సూచనలు తమకు ఇవ్వబడునని తెలిపిరి. *

గణనాథుడు శ్రీ స్వామివారితో ఇట్లు చెప్పెను. తమ నూతన దివ్య ప్రణాళిక చాలా అద్భుతముగానున్నది. దేవతల మందరము మాయొక్క శక్తియుక్తులనుపయోగించి తమ లోక కల్యాణభావనకు అనుకూలముగా ప్రవర్తించెదము. భక్తులైన వారిని ఎటువంటి కఠిన పరీక్షలకు గురిచేయక స్మరణమాత్ర సంతుష్టులమై వారిపట్ల దయగలిగి వర్తించెదము. తమరు ప్రస్తుతం గోకర్ణ క్షేత్రమున కొంతకాలం నివసించి అచ్చటి దైవత్వమును మహిమపరచి కొందరికి జ్ఞాన బోధలు కావించెదరుగాక. తదుపరి కురువపురమున కృష్ణానదీ ఉత్తర తీరమున పురాతన కాలము నుండి మా యొక్క స్థానము ఏర్పడియున్నది. ఆ సహజ ఘట్టమునందు ఎందరో మహాయోగులు తపస్సుచేసి సిద్ధిని పొందినారు. తమరు అచ్చటికి చేరిన పిదప పరస్పరం చర్చించుకొని లోక కల్యాణ కార్యమును కొనసాగించెదముగాక! మాకు ప్రాధాన్యతను కల్పించదలంచియే తమరు భాద్రపద శుద్ధ చతుర్థినాడు ఈ అవతారము తీసుకొనియున్నారు. మన మిరువురమున్నూ ఐక్య భావనతో కలికాల మానవుల నుద్ధరించెదముగాక! యని పలుకగా చిరునవ్వులతో శ్రీపాద స్వామి వారు తలపంకించి "మీ సహకారముతో మా ప్రణాళిక విజయము సాధించునుగాక. మా అవతార

---

* *శ్రీశ్రీశ్రీ దత్తావతారులైన సర్వేశ్వరానంద సరస్వతి స్వామివారి ఆదేశంతో శ్రీశ్రీశ్రీ పండిత శ్రీరామ శర్మగారి ద్వారా గాయత్రి యజ్ఞములను సంక్షిప్తపరచి ప్రచారములోనికి తీసుకొని రాబడినది. ఇప్పుడు విశ్వవ్యాప్తముగా ఈ యజ్ఞములు నిర్వహించబడుచు విశ్వశాంతికి కృషి జరుగుచున్నది.*

ప్రయోజనము మీ ద్వారా కొన్ని వందల సంవత్సరముల తర్వాత ప్రచారములోనికి వచ్చి వేల సంవత్సరములు ప్రజలకు అందుబాటులో నుండగలద”ని వాగ్దానము చేసినారు.

తర్వాత సుబ్రహ్మణ్య స్వామివారు లేచి దేవదేవా! మీ దివ్యావతారము సంచరించు ప్రతి చోటను ధర్మరక్షణ చేయుకొరకు మేము నాగరూపమున సంచరించుచూ ప్రజలయందు భక్తి భావములు పెంపొందునటుల చేయు ప్రక్రియను చేపట్టెదము. ఈ రూపంగా మీ సేవ మాకు లభించగలదని ప్రార్థించెను. నాగరూపము మానవుని శరీర మందు అంతర్లీనముగా వున్ననూ వారు మమ్ము భౌతికముగా చూచి ద్వేషించెదరు. తమరి దయవలన, అపార ప్రేమవలన తమ ప్రేమ సామ్రాజ్యంలో మాకు భాగము కల్పించినచో మేము వారికి దైవ సమానముగా తోచగలము. ఈ యొక్క అవినాభావ సంబంధమును తమరే పునరుద్ధరించగలరని నమ్మియున్నామని పలుకగా తప్పక అట్లే జరుగునుగాక యని శ్రీ స్వామివారు ఆశీర్వదించినారు.* తదుపరి బ్రహ్మదేవుడిట్లు పలికెను.

శ్రీపాద శ్రీవల్లభా!

ఇంతకు పూర్వమే కలియుగ మానవుల సంక్షేమమును, భక్తిని సంకల్పించుకొని బృగు మహర్షి శ్రీమహావిష్ణువును వక్షముపై పాదములతో తాకుట ద్వారా శ్రీమహాలక్ష్మి అలిగి వైకుంఠమును వీడిపోగా శ్రీమన్నారాయణుడున్నూ భూలోకవాసుడుగా మార్పుచెందెను. అవతార సమయము కాకున్నను భూలోకమందు భక్తి, ప్రపత్తులు నెలకొల్పు అవసరమున ఆయన పద్మావతీ దేవిని పరిణయమాడెను. వైకుంఠమునకు నారాయణుని, శ్రీమహాలక్ష్మిని రప్పించుటకు అందరమున్నూ కొంత నాటకమాడి ఎట్లో నెగ్గితిమి. శ్రీమహావిష్ణువు శ్రీ వేంకటేశ నామముతో కలియుగ అవతారముగా కీర్తించ బడుచూ అనేకమందిని భక్తిమార్గంలో నడిపిస్తూ భూలోక వైకుంఠమను పేరు తిరుమలకు సార్థకం చేశారు. అయినా శ్రీ వెంకటేశ్వరస్వామివారు మాతృ ప్రేమను అందరిపై వర్షింపజేయుచున్నారు కాబట్టి భక్తులు వారికిమాతృ, పితృ స్థానములను కల్పించి గురుభావనచేయలేని స్థితిలో వున్నారు. అయిననూ నామస్మరణతోనే ఆస్వామి సకల సౌభాగ్య సంపదలను తమ భక్తులకిచ్చుచున్నారు. ఈ విషయాన్ని ఆసరాగా తీసుకొని భక్తులయొక్క కోరికలు

---

** కలియుగంలో అనేక దోష, పాప పరిహారములకై నాగపూజలు విరివిగా జరిపించుకొని ప్రజలు పునీతులగుచున్నారు. ఇదియు శ్రీదత్త సంకల్పమే. వారి ఆశీర్వాద ఫలితమే. కుండలినీ జాగృతి యందు గణేశుడు, సుబ్రహ్మణ్యుడు సంచరించుటయే దీని ఆంతర్యము.*

పెరుగుచున్నవేగాని భక్తి క్రమంగా తరిగి పోవుచున్నది. శరణాగతి, అనుభవము, నిర్మలమైన భక్తి క్షీణదశకు చేరుచున్నది. దానిని పునః ప్రతిష్ఠించవలసినదిగా తమరిని కోరుచున్నాము.

అని విన్నవించగా శ్రీదత్తస్వామివారు "అవును. భక్తులలోని లోపాలను తొలగించుటకు తగు సమయములో సూచనల నిచ్చెదను. శబరిమలపై నెలకొన్న ధర్మశాస్త్ర కూడ ప్రస్తుతం నివురు గప్పిన నిప్పువలె వున్నారు. విజయవాటికలోని కనకదుర్గమ్మ మహాశక్తివంతమైన దైనప్పటికిన్నీ దైవికమైన పూజలు సన్నగిల్లినవి. శ్రీశైలమందు వెలసిన శ్రీమల్లికార్జునుని వైభవము మరుగునపడియున్నది. వీటన్నిటిని పునరుద్ధరించుటకై ప్రజలలో భక్తిని చైతన్యపరచెదను. కొంత వ్యవధిలో అన్నియు పరిపుష్టము కాగలవు. ముందుముందు కాలములో మండల దీక్షలను ప్రతిపాదించి ప్రచారమొనర్చు గురువుల ద్వారా ఆ కార్యమును సానుకూలపరచెదను. సమస్త క్షేత్రములు వైభవోపేతమై అలరారును.

నారదుల వారికి కలిగిన సందేహమునకుగూడ ఇదియే సమాధానము. గురుభక్తులకు రక్షణ ఏ విధముగా నుండునని అడిగినారు. వారికి సర్వదా సద్గురువుల కృప రక్షణ కవచముగా నుండగలదు. గురుభక్తుల యొక్క మనసు ప్రలోభములకు చోటు పెట్టకుండునంతవరకు నా రక్షణకు లోపముండదు. నా అవతారపరంపర ఆగదు. కలియుగాంతము వరకు నా కర్తవ్యమును ఇట్లే నిర్వహించెదను. మీరందరూ సహకరించండని ఆదేశములిచ్చిరి.

ఈ ప్రణాళిక ఇట్లు నిర్ణయించబడినదని శ్రీస్వామి వివరించగా దీనికి ఆమోదముగా అందరూ జయజయ ధ్వానములు చేసినారు. శ్రీ స్వామివారు అందరికీ తమ నిజరూప దర్శనమిచ్చి ఇక తమ తదుపరి కార్యక్రమమునకై ఉపక్రమించగా శంకరుడు లేచి వచ్చి శ్రీ స్వామికి దండము, కమండలము సమర్పించుకొని నమస్కరించెను. బ్రహ్మదేవుడు వచ్చి జపమాలను సమర్పించి నమస్కరించెను. శ్రీమన్నారాయణుడు అపరిమితానందముతో స్వయంగా తులసిమాలను శ్రీస్వామి వారి మెడలో అలంకరించి ప్రణామము సల్పెను.

ప్రమథగణములలోని వారు వచ్చి స్వామి కురులను శిఖగా మలచిరి. నారదుల వారు ఆ శిఖకు రుద్రాక్షమాలను అలంకరించినారు. తుంబురుడు ముందుకు వచ్చి చేతులకు రుద్రాక్ష కంకణాలు, మెడలో రుద్రాక్షమాలలు అలంకరించి నమస్కరించెను. శ్రీ స్వామివారిల్లు వదలు సందర్భంలోనే తండ్రి అప్పలరాజు శర్మ పావుకోళ్ళను పాదాలకు తొడిగించారు.

ఆంజనేయస్వామి వారు ప్రకటమై నమస్కారమొనర్చి స్వామి వారికి ఒక వ్యాఘ్రాజిన

మును సమర్పించుచూ "స్వామీ! దీనిని తమరు స్పృశించిన చాలును. ఇది తమరి వెంటనే అదృశ్యముగా వుండి తమరు ఎక్కడ ఆసీనులగుదురో అక్కడ ప్రకటమగును. తమరు లేచిన వెంటనే అదృశ్యమగును. దయతో స్వీకరించమని కోరగా మందహాస వదనులై శ్రీపాద శ్రీవల్లభులు దానిని చేతితో స్పృశించగానే అది అదృశ్యమయ్యెను.

అట నుండి శ్రీస్వామి వారు గోకర్ణ క్షేత్రమును చేరినారు. అని శ్రీ విఠల్ బాబావారు శ్రీపాద స్వామి వారి తీర్థయాత్రా విశేషములను అద్భుతరీతిని వివరింపగా భక్తులందరు విని నిజానందమున ఓలలాడిరి.

శ్రీ విఠల్‌బాబాగారు శ్రీదత్త సంకల్పాన్ని ఇలా వివరించి శ్రీ కాలభైరవ స్వామి గురించి ఇలా చెప్పారు. కాలభైరవుడు కాశీ యందున్నాడు. కాశి పరమ పవిత్ర పుణ్యక్షేత్రముగా అలరారుచున్నది. అచ్చట మరణమును పొందిన వారికి పునర్జన్మలేదని శాస్త్రము ఘోషించుచున్నది. ఈ సూత్రము ననుసరించి ప్రతివారున్నూ కాశిలో మరణించాలని కోరుకొనుట సహజం. కానీ కాలభైరవుని తత్త్వాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేయాలి. మానవులు చేయు సకల కర్మలను కాలభైరవుడు క్రమబద్ధంచేసి కాలానుసారంగా అనుభవించేందుకు వీలుగా సుఖదుఃఖ రూపాలుగా అమర్చి మానవులను పుట్టిస్తాడు. వాటిని ముందుకు వెనుకకు జరపాలన్నా కాలభైరవునకే అధికారం ఇయ్యబడినది. కాలభైరవుడనగా కాల స్వరూపమే. కాలానికి అధిపతి. భైరవుడు అంటే భయంకరుడు అని అనుకొంటారు. కాలాన్ని నిర్నిబద్ధంగా నడిపేవాడని అసలైన అర్థం. గొప్ప ధ్వని కలిగి యున్నాడని అర్థం. సర్వత్రా వ్యాపించి యున్నాడని అర్థం. మీరు ఏ సమయానికి ఏ పనిని చేసినా చేయకపోయినా కాలము తన పనిని తాను చేసుకుపోతుంది. కావున కాలగమనాన్ని నిరంతరం గమనించుకోమని పెద్దలు చెప్పుచుంటారు.

ఈ కాలభైరవ స్వామి కాశీలో మాత్రమే వుంటే ఇంతటి జటిలమైన కార్యనిర్వహణ ఎలా చేయగలడు. కాబట్టి కాలరూపంలో జగత్తంతయూ నిండియున్నాడు. మీ హృదయమనే ఘడియారాన్ని ఆయనే కదిలిస్తున్నాడు. దానిని ఆధారం చేసుకొనే భౌతికమైన ఘడియారం తయారు చేయబడినది. ఆ విధంగా మీలోపలను బైటనూ నిండియున్న కాలస్వరూపుని నిరంతర స్మరణతో కార్యనిర్వహణా సామర్థ్యాన్ని పొందవచ్చు. ఆయనను కొలిచేవారికి బలం, శౌర్యం, ధైర్యం, సాహసం, దక్షత సంప్రాప్తిస్తాయి. నిద్రించిన వారిని మేలుకొలుపునది కాలమేనని తెలుసుకొంటే జ్ఞాన విషయాలపట్ల మేలు కొనుటకు కూడ కాలభైరవుని సహాయమే మనకు అవసరమని తెలుస్తుంది.

నిద్రించిన వ్యక్తి తప్పని సరిగా మేలుకొనునని భావిస్తారు. కానీ అట్లు మేలుకొనకపోయినచో అతను కాలధర్మము చెందెనని భావించుతారు. కాలమునకు, ధర్మమునకు అవినాభావ సంబంధం వున్నది. కావున మీమీ ధర్మాచరణలో కాలమును గడిపినచో, కాలము, ధర్మము మిమ్ము సన్మార్గ మందు నడుపును. తర్వాత జీవునికి తిరిగి సన్మార్గమందే జన్మ లభించును. కావున కాలభైరవుని మహత్తత్త్వము తెలియగలవారు లేరు.

ఈ విధంగా భావిస్తూ అనుసరించుట అందరి కర్తవ్యము. ఏలననగా ఆయనయే దత్తస్వామి (జగద్గురుడు) సన్నిధికి చేర్చువాడు. ముక్తిమార్గమును జూపువాడు.

ఆయన చేతిలో నెమలి ఈకలకట్టను ధరించి మరియొక చేతిలో అగ్నిపాత్రను ధరించినాడు. పాశము, ఢమరు, అంకుశములన్నూ ధరించియున్నాడు. అవన్నీ భక్తుల కర్మల ననుసరించి శుద్ధిచేసి జీవులకు శ్రేయస్సును కూర్చుట కొరకే ఉపయోగించును. ఆశలను తన అంకుశముతో పెకలించివేయును. ఢమరు శబ్దంతో పాప విషయిక చర్చలు ఆశ్రితుల చెవుల బడనీయకుండ రక్షించును. తన ఆశ్రితులైన వారి కర్మలను నెమలి ఈకల చీపురుతో తుడిచి వేయును. గ్రహబాధలను తొలగించును. మొండి తనముతో తమ ఆచారములే సరియైనవని విద్యాహంకార, పాండిత్యాహంకార, కులాహంకార, వయోహంకారములతో విర్రవీగు వారికి ఆయన చేతిలో వున్న అగ్నిపాత్రతో విద్యుత్ చికిత్స చేసి వారి దోషాలను పోగొట్టి సరియైన మార్గములో పెట్టునని కాలభైరవోపనిషత్తు నందు చెప్పబడినదని సవివరంగా తెలిపి పండరీపురం లోను క్షేత్రపాలకుడు కాలభైరవుడే! కాశీవలెనే శ్రీక్షేత్ర శ్రీవల్లభాపురంలో గూడ క్షేత్రపాలకుడు కాలభైరవుడే!

మన శరీరమనే క్షేత్రానికి గూడ క్షేత్రపాలకుడు కాలభైరవుడేగదా. ఆ విధంగా ఆయన తత్త్వాన్ని తెలుసుకొని ఆయన కొలువైన క్షేత్రము అనగా శరీరం కాశీయని భావించి ఎందరో ముక్తిని బడసియున్నారు. విషయమును శ్రవణంచేయాలి. తర్వాత దానిని మననం చేయండని అందరినీ ఆశీర్వదించారు.

నిజమే! కాలమును మనం ఉపయోగించుకొంటే ధన్యులవుతాము. లేకుంటే సోమరు లవుతాము. విచిత్రం ఏమంటే ఎదుటివారి సోమరితనం మనకు తెలుస్తుంది. కానీ మనది మనకు తెలియదు. ఇదే మహామాయ. ఆ మాయ నుండి తప్పుకోవడానికి ఒక్కటేమార్గం. అదే నామస్మరణం!

"శ్రీపాద శరణం – శ్రీపాద శరణం"

జైగురుదత్త శ్రీ గురుదత్త

దిగంబరా! దిగంబరా! శ్రీపాదవల్లభ దిగంబరా!

# 8వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

## శ్రీపాదులవారి శ్రీశైల నివాసం

శ్రీశ్రీశ్రీ విఠల్‌బాబాగారు శ్రీపాద శ్రీవల్లభ స్వామివారి యాత్రా విశేషాలు వినిపించగా శ్రోతలందరమూ సంతోషాంతరంగులైనాము. అందరికీ కైలాసమందు పరమశివుని సభయొక్క దృశ్యము కళ్ళకు కట్టినట్లు వర్ణించి తెలిపినారు. శ్రీపాదులవారి దివ్య సంకల్పమును విని ఆ సభలోని వారివలె మేమందరం గూడ ఆశ్చర్య చకితులైనాము. ఈ విధానము యొక్క అమలుకు వేచి చూడాలని నారద మునీంద్రులంటారు ఆనాడు. కానీ ఈనాడు మేము ఎంతో అదృష్టవంతు లము. శ్రీ విఠల్‌బాబ సన్నిధానంలో ఎందరో దారి తప్పిన తమ్ముళ్ళు సేద తీరినారు. ఈ సమాజంలో పాపం చేయనివారు, తప్పులు చేయనివారెవ్వరూ లేరు. అటువంటి వారిని దరి జేర్చుకొని శ్రీ బాబాగారు వారిలోపాలు తెలియజెప్పి వారి జీవితాలలో వెలుగులు కురిపించి వారి సంసారాలు చక్కజేసిన ఉదంతాలు లెక్కించలేనన్ని గలవు.

ఇవన్నీ నా మనసులో మెదలుచుండగా శ్రీ బాబాగారికి మ్రొక్కి ఇలా విన్న వించుకొన్నాను. స్వామీజీ! శ్రీపాదస్వామివారు కైలాసం నుండి గోకర్ణం చేరినారు. గోకర్ణంలో సుమారు మూడు సంవత్సరాలున్నారు. వారు శ్రీశైలంలో నాలుగు మాసములు గడిపినట్లు చెప్పియున్నారు. ఆ సమయంలో శ్రీశైలంలో శ్రీస్వామివారి లీలల గురించి మాకు వివరించితే ధన్యులము అని కోరాను.

అప్పుడు శ్రీ బాబాగారు శ్రీపాదులవారిని ధ్యానించి కొంతసేపటికి కన్నులు తెఱచి ఇట్లు చెప్పసాగిరి.

మల్లికార్జునస్వామి మరియు భ్రమరాంబదేవి నెలకొన్న శ్రీశైల క్షేత్రమునకు స్వామి చేరుకోవాలని సంకల్పించారు. సంకల్పించగానే శ్రీపాదస్వామివారు యోగ గమనంతో శ్రీశైల క్షేత్రమునందు ప్రకటమైనారు. వారి సంకల్పము లోక కల్యాణకారణము. మహాత్ములకు కర్తవ్య నిష్ఠయే బలమైనది. వేరెటువంటి బంధములు వారిని బంధించవు. ఇతరులకు వారి సంకల్పములు ఏ మేరకు తెల్పవలయునో ఆ మేరకే తెలుపుతారు. వారు సంకల్పించిన గోకర్ణ క్షేత్ర పవిత్రీకరణము, మాలిన్య ప్రక్షాళనము, మహిమా ప్రదీపనము మొదలగు సంకల్పములు పూర్తియైనవి. ఆ క్షేత్రము సంపూర్ణ తేజోవంతమై పూర్వపు వైభవమును సంతరించుకొన్నది.

శ్రీపాదస్వామివారు కైలాసమునందు తమ దివ్యప్రణాళికను విశదపరచిన తదుపరి వారి కార్యక్రమములను సర్వత్రా వీక్షించు పరమేశ్వరుడున్నూ, ఆయన పరివారమున్నూ శ్రీశైల క్షేత్రమందు వారి రాకకై ఎదురుచూస్తున్నారు. వారందరూ శ్రీపాదస్వామి సాన్నిధ్యమును అభిలషించుచున్న విషయము శ్రీ స్వామి వారు గ్రహించుకొనిరి. వారి రాకకై ఎదురుచూచుచున్న ప్రకృతిమాత పులకించిపోయింది. శ్రీశైల క్షేత్ర శోభ నూతనంగా ప్రకాశిస్తున్నది. వృక్షములు, లతలు సమస్తము కొత్త చిగుళ్ళతో, పూవులతో కళకళలాడుచున్నాయి. శ్రీపాదులవారి ఆగమనం దైవ రహస్యంగనుక అచ్చట వున్న సాధువులకు, సాధకులకు అర్థం కాలేదు. కానీ వాతావరణ పరిస్థితులను బట్టి ఎవరైనా మహాత్ములు ఈ క్షేత్ర దర్శనమునకు వచ్చుచుండవచ్చునని మాత్రం గ్రహించగలిగారు. వారి వారి సాధనలో నిమగ్నులైనారు.

బ్రహ్మచారి నిర్మలానంద మరియు వయోవృద్ధులైన శ్రీ అభేదానంద సరస్వతి స్వాముల వారు మాత్రం అచ్చటికి వచ్చు మహాత్ముల గురించి ఏమైనా ఆధారం లభిస్తుందేమోనని తీవ్రంగా ధ్యానం చేయసాగినారు.

శ్రీ పాదస్వామి ముందుగా సాక్షిగణేశుని దర్శించగోరి ఆయన సన్నిధిలో నిలచిరి. వారిరువురి ఆంతర్యము ఒక్కటే గావున శ్రీగణపతి దేవుడు స్వస్వరూపముతో ప్రకటమై “శ్రీపాద శ్రీవల్లభా! స్వాగతం! సుస్వాగతం! మీరాకకై ఎదురు చూచుచున్నాము. చాలా సంతోషం. మీరు వచ్చేశారు” అని పలికిరి.

శ్రీపాదులవారు శ్రీ గణేశునికి అభివాదము చేసి “స్వామీ! నాకు అమ్మదర్శనము, ఆశీస్సు కావాలి! అమ్మను దర్శించుకొనుటకు అనుమతి ప్రసాదించండి. తమరు మొదటి దైవంగదా!” అనగా గణేశుడు శ్రీపాదునితో “మన ఇరువురి మధ్యన అంతరము లేదు. అవశ్యం దర్శించండి. అమ్మకూడ మీ కొరకు ఎదురు చూస్తున్న”దని తెలిపి అంతర్ధానమైనాడు.

శ్రీపాదులవారు చిరునవ్వులు నవ్వుకుంటూ శ్రీమల్లికార్జునస్వామిని దర్శించుకోగా ఆయన సంతోషాంతరంగుడై చిరునవ్వులతోనే స్వామివారి నమస్కారములందుకొన్నారు. వ్యక్తుల మధ్య నమస్కారము యొక్క అర్థము “నీకు–నాకు–భేదం లేదు” అని తెలుపుకొనుటయే! అదే విధంగా దైవ రూపాల మధ్యన గూడ అంతరం లేదు. కానీ కార్యార్థమై మాత్రమే దైవం అనేక రూపాలలో ప్రకటం అవుతూ అనేక నామాలుగా రూపొందినది. ఇది ప్రతివారూ తెలుసుకోవలసిన విషయం.

ఆ తర్వాత శ్రీపాదస్వామి భ్రమరాంబమాత దర్శనమునకు వెళ్ళిరి. వారు ఆ మాత

సన్నిధిలో కాలు పెట్టగానే అమ్మ ప్రత్యక్షమై ఎంతోకాలం తర్వాత కంటబడిన తనయునిపై తల్లి ప్రేమామృతమును కురిపించు విధముగా ప్రియ సంభాషణము చేసెను. ఇరువురు తన్మయులై లోక కళ్యాణము గురించి చర్చించుకొనిరి. శ్రీపాదులవారిని కొంతకాలము తన సన్నిధిలో ఉండమని కోరగా శ్రీపాదులు తమ ఇచ్ఛగూడ అదియేనని వాక్రుచ్చిరి.

శ్రీపాద స్వామివారు చాతుర్మాస్యము లిక్కడనే ఉండవలెనని నిర్ణయించుకొనిరి. శ్రీపాదులు అవతారము తీసికొనక పూర్వము తమ తాతగారైన బాపన్నార్యులకు ప్రేరణనిచ్చి వారి చేత ఇచ్చట ఎన్నో సంవత్సరముల క్రిందటనే సవితృకాఠక చయనమను మహాయాగము చేయించి ఇచ్చటి దేవతలందరికీ శక్తిపాతము నిర్వహింపజేసియున్నారు. ఇప్పుడు మరి కొంతకాలము స్వామివారు నివసించి ఈ క్షేత్రమును మరింత శక్తిసంపన్నంగా చేయదలచిరి.

శ్రీశైల శిఖర దర్శనంచేత మానవులకు పునర్జన్మ వుండదని శాస్త్రవాక్యం. అన్ని క్షేత్రాలకు వలెనే ఇక్కడ కూడ కొందరు మ్లేచ్ఛులు, అనాచారులు, దుండగుల వలన క్షేత్ర మహాత్మ్యమునకు ముప్పు వాటిల్లినది. పూర్వ వైభవమును ఆ క్షేత్రమునకు ప్రసాదించుటకు మహాత్ములు, త్యాగధనులు మాత్రమే సమర్థులు. త్రిమూర్తి స్వరూపుడు, దత్తస్వరూపుడు, కలియుగ ప్రథమావతారుడైన శ్రీపాద శ్రీవల్లభుడే ఈ విధమైన శక్తిపాతం చేయగల సమర్థుడు. కావున వారి రాకకై అక్కడ తపము నాచరించు మహాత్ములు మరియు క్షేత్రాధిదేవతలందరూ ఎదురు చూచుచున్నారు. వారి అభ్యర్థన మరియు తన కార్యాచరణ దృష్ట్యా శ్రీపాద స్వామివారు ఆ క్షేత్రంలో నాలుగు మాసములుండవలెనని సంకల్పించుకొన్నారు.

శ్రీశైలము దట్టమైన అరణ్య మధ్యమున నున్న పర్వత శిఖరంపైన నెలకొనియున్న పుణ్యక్షేత్రము. ఎంతో మంది ఋషులు, యోగులు, మునులు, సిద్ధులు అదృశ్యముగా వారి సాధనలను కొనసాగించుచు వారి యొక్క తపోశక్తిని ఆ క్షేత్రమునందు ధారపోయుచుందురు. సాధువులు, సన్యాసులు అచ్చటి శక్తి ప్రసారమును స్వీకరిస్తూ తమ సాధనలకు మెఱుగులు దిద్దుకొని అద్భుతమైన దర్శనములను పొంది ఉన్నత యోగ స్థితులను చేరుకొనే ప్రయత్నం చేస్తుంటారు. అందువలన ఈ క్షేత్రమందు అనేక స్థాయిలలో సాధన సాగుచుండును. పూర్ణత్వమును పొందిన సిద్ధులు గూడ లోక కళ్యాణార్థం వారి సాధనను వినియోగపరుస్తుంటారు. పరమ పవిత్రమైన ఈ క్షేత్రంలో కృష్ణమ్మ పాతాళగంగయనే పేరుతో ప్రవహిస్తూ క్షేత్ర మహాత్మ్యమును ఇనుమడింప జేస్తున్నది. తనలో స్నానమాడిన వారికి పాపప్రక్షాళనము గావిస్తూ వారిని పవిత్రీకరించి మహాత్ముల

స్పర్శతో తిరిగి తాను పవిత్రతను పొందుచూ ప్రవహిస్తున్నది.

రెండు రోజులవరకు శ్రీపాదస్వామివారి గురించి అక్కడ సాధకులకు గుర్తింపు కలగలేదు. శ్రీపాద స్వామివారు గూడ నిత్యము పాతాళగంగలో స్నానమాచరించి తమ సాధనను, అభ్యాసము, అనుష్ఠానములను నిర్వర్తించుచు గడిపిరి. లోకహితము కొరకు శ్రీ గణేశుడే వీరి ఉనికిని బయటపెట్ట సంకల్పించి కొందరు సాధువులకు, సాధకులకు స్వప్న దర్శనమిచ్చి ఏకకాలంలో వీరు సద్గురువులనీ వారిని ఆరాధించిన వారి మార్గములు సుగమం కాగలవని ప్రబోధించెను. ఆ స్వప్నంలోనే శ్రీపాదులవారి రూపమును జూపించెను.

ఆ విధమైన గణపతియొక్క స్వప్న సాక్షాత్కారము గూడ వారికి మునుపెన్నడూ కలిగియుండలేదు. కావున ఆశ్చర్య సంభ్రమములు, ఆనందము ముప్పిరిగొనగా వారు ఎవరికి వారే క్షేత్రమంతయూ గాలించ సాగిరి. హఠకేశ్వరము, పాలధార, పంచధార, భీమునికొలను, విభూదిమిట్ట ఇత్యాది ప్రాంతములన్నింటి యందును వారి అన్వేషణ తీవ్రముగా సాగించిరి. వారి సాధన ఫలించినది. వెదుకపోయిన తీగ కాలికి తగిలినట్లు ఒక ఏకాంత ప్రదేశమున విశాలమైన వటవృక్ష ఛాయలోగల రాతిబండపైన మృగ చర్మముపై కాషాయ వస్త్రధారియైన శ్రీపాద శ్రీవల్లభులు ధ్యానమందు నిమగ్నులై యుండుటను దర్శించిరి.

రుద్రాక్షలు, తులసిపూసలు, లలాటమందు నామము ధరించిన 16 సం.ల ప్రాయముగల బాలయోగి పుంగవుని దర్శనము చేసుకొనిరి. చిరుధరహాస వదనారవిందము ఎంతసేపు చూచినను తనివితీరదని పించు ముద్దుల మోముతో, ఆజానుబాహుడై దివ్యతేజస్సుతో ప్రకాశించు ఆధ్యానమూర్తిని మనసార వారంతా స్తుతించుచు ఆ మహాత్ముడెప్పుడు కన్నులు తెఱచునాయని అట్లే వేచియున్నారు. వారిలో వారు ఇటువంటి సద్గురువు, సాక్షాత్‌గా దక్షిణామూర్తివలె తేజరిల్లువారు మన పూర్వపుణ్య విశేషంచేతనే ఇచ్చటికి వచ్చారు. వీరి సాంగత్యము, సమాశ్రయము మనము పొంది తీరవలసినదేనని భావించుచు గణపతిదేవుని కృపను శ్లాఘించుచున్నారు.

అట్లుండగా కొంత సమయమునకు శ్రీపాదులవారు నెమ్మదిగా కన్నులు తెఱచి చుట్టూ చేరి ఆత్రుతతో వీక్షించుచున్న యోగులు, సాధకులవంక చిరునవ్వులు చిందిస్తూ కృపా దృష్టిని సారించారు. చేతులు జోడించి నిలబడియున్న వారందరినీ కన్ను సైగలతోనే పలకరిస్తున్నట్లు శ్రీ స్వామి "ఏమిటి! ఎందుకు వచ్చినా?"రన్నట్లు అడిగారు. వారిలో ముఖ్యులు కొందరు వినయపూర్వకంగా నమస్కారములు చెల్లించి "స్వామీ! తమరేనా శ్రీపాద శ్రీవల్లభులు! శ్రీ గణేశుని

ప్రబోధంతో మేము తమరికై అన్వేషణ సాగించి ఇచ్చట దర్శించుకొని తృప్తి చెందినాము" అని పలుకగా శ్రీస్వామి అవునన్నట్లుగా తలను పంకించినారు. అందరు ముక్త కంఠంతో "జయము.. జయము.. శ్రీపాదశ్రీవల్లభ గురుమూర్తికి జయమగుగాక" అని జయజయ ధ్వానములు చేసినారు. తర్వాత వారి విన్నపముల నీ విధంగా వివరించసాగిరి.

"స్వామీ! సాధకుల పాలిటి కల్పవృక్షమైన శ్రీదత్తాత్రేయ స్వామివారు భూమిపైన అవతరించిన విషయము కొందరు మహాత్ముల ద్వారా వినియుంటిమి. ఆదిగురువైన అవతార పురుషుడు ఎప్పటికైనా ఈ క్షేత్రమునకు వచ్చెదరని గూడ వినియుంటిమి. అందులకై మేమందరము క్షణక్షణం ఎదురు చూచుచుండగా ఈనాటికి మా అదృష్టము ఫలించినది. స్వామీ! మాకేమి కావలెనో మాకే తెలియదు. మా సాధనలలో అవరోధములు తొలగి మార్గము సుగమము కావలెను. దానికై మార్గదర్శకుని అవసరముగలదు. మాలోని లోపములు మాకు తెలియబడవు. తెలిసినను వానిని దూరీకరించుకొను శక్తి లేక ముందుకు పోలేక పోవుచున్నామని మాత్రము తెలుస్తున్నది. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో మమ్ము రక్షించి మార్గము సరిచేయగల సమర్థులు తమరే స్వామీ! తమరి ముగ్ధమోహన సౌందర్య రూపమును దర్శించగనే మా కన్నులు సార్థకతనొందినవి. ఈ జన్మలు సార్థకమయ్యే విధంగా మమ్ము ఆశీర్వదించండ"ని మ్రొక్కి వేడుకొనిరి. "ఈ పవిత్ర క్షేత్రమందు, పవిత్ర చాతుర్మాసారంభ సమయంలో తమరి దర్శనం మేమిప్పటివరకు చేసిన సాధనల ఫలమని నమ్ముచున్నాము. దయతో ఈ పర్వ దినములు మాతో గడిపినచో మా జీవితములు ధన్యములగును. నిత్యము పాతాళ గంగా స్నానముతోపాటుగ తమరి జ్ఞానబోధయను గంగలో గూడ స్నానమాడి తరింతుము" అని ప్రార్థనా పూర్వకంగా కోరుకొనిరి. శ్రీస్వామి అంతయు చిరునవ్వులతోనే విని అంగీకార సూచకంగా తలను పంకించినారు.

అచ్చట చేరినవారిలో బ్రహ్మచారి నిర్మలానంద అనుయోగి శ్రీ స్వామివారిని ప్రార్థించి తన మఠమునకు రమ్మని ఆహ్వానించి తోడ్కొనిపోయి వారికి తమ యథాశక్తి కందమూలాదులను భిక్షనొసగెను. తదుపరి అచ్చటనే విశ్రాంతికై ఏర్పాటు చేసినాడు.

ఆ క్షేత్రంలో స్థిరంగా వుండే సాధకులు, తాపసులు, యోగులు, బ్రహ్మచారులు, సిద్ధులేగాక అనేకమంది గిరిజనులు గూడ ఉంటారు. గిరిజనులు వనమూలికా సేకరణ ద్వారా కొందరు వైద్యులకు సహకరిస్తూ వారి వారి జీవన విధానమునను సరించుచూ భుక్తిని సంపాదించుకొనుచుండేవారు. యోగులు, సాధకులు కొన్ని వనమూలికలు, పత్రములను సేకరించి

వాటిని ఉపయోగించు విధానములను గిరిజనులకు తెలిపేవారు. తద్వారా క్రూరమృగముల నుండి, విష జంతువుల బారి నుండి రక్షణ లభించును. అట్లే కొన్ని చెట్ల ఆకులు తినుట ద్వారా ఆకలిదప్పుల నివారణ కలుగును.

కొన్ని మూలికలనుపయోగించి దీర్ఘ వ్యాధుల నివారణ చేయుచుండెడివారు. గిరిజనులు అడవిలో తిరిగి మహాత్ములు, యోగులైన వారికి అనేకమైన కందమూలములను, ఫలములను సమర్పించెదరు. వారే విధమైన ప్రతిఫలమున్నూ ఆశించక కేవలం వారి దీవెనలు మాత్రమే ఆశించెదరు. యాత్రికుల వద్ద మాత్రం ప్రతిఫలం తీసుకొందురు. అడవిలో లభించు ఫలములు, తేనె తెచ్చి యాత్రికులకు విక్రయించెదరు. కొన్ని రకముల దుంపలు గూడ విక్రయించెదరు. శ్రీశైల దర్శనంతో పాప ప్రక్షాళనమేగాక యోగుల దర్శనము లభించును. వారి అనుగ్రహము, ఆశీస్సు లభించి అనేక రోగములకు నివారణ లభించునని కష్టపడి ఆ రోజులలో శ్రీశైల యాత్ర చేసేవారు భక్తులు.

సాధువులలో కొందరు మాత్రమే యాత్రికుల వద్ద యాచన చేసి పదార్థములు గానీ, ద్రవ్యముగానీ తీసికొనుట జరుగును. ఉత్తమ సాధువులెవ్వరూ దక్షిణ తీసుకొనరు. మఠములందు కొంతసేపు మాత్రమే నివాసము చేయుదురు. ఎక్కువ సమయం వృక్షచ్ఛాయలలోనే జీవితమును గడుపుదురు. సత్రములందు జరుగు అన్నదానములకు గూడ కొందరు మాత్రమే పోయెదరు. వారి వారి గురువుల ఆదేశముల ప్రకారం జీవనం సాగిస్తూ సాధనను కొనసాగించేవారు. ఉత్తములు ఈ విధంగా మఠములందు చేరు సాధకులు, బ్రహ్మ చారులు, సాధువులు, సన్యాసులు అనేక స్థాయిలలో వుంటారు. కావున ఒకరి పద్ధతి ఒకరికి నచ్చదు. తమ తమ మార్గములే అసలైన ధ్యాన జ్ఞాన మార్గములని ఎవరికి వారు భావిస్తుంటారు. శిష్యులపైన గురువుకు మాత్రమే శాశించు అధికారము గలదు. ఇచ్చట ఎవరిపైన ఎవరికిన్నీ అధికారము లేనందున వారి మార్గమే గొప్ప. వారి గురువులే గొప్పయని భావించుట జరిగేది. భక్తులెవ్వరైనా దరి చేరి జ్ఞానం గురించి తెలుసుకోవాలని ప్రశ్నించితే వారి పద్ధతిలో మహావాక్యాల వివరణలు అద్వైత సిద్ధాంతములు గాని, శంకర భాష్యములుగాని బోధించేవారు. అది సామాన్య గృహస్థులకు, ప్రారంభ సాధకులకు ఉపయోగపడుతుంది. కానీ తోటి సాధకులు, సన్యాసులు వాటిని ఖండించుట, ద్వేషించుట, వ్యతిరేకించుట కూడ అప్పుడప్పుడు జరుగును.

ఆ క్షేత్రమునకు కొన్ని పర్వదినములందు పండితులు వచ్చి గొప్పగా ఉపన్యాసములు

చెప్పుట జరుగును. ఎవరికి అవసరమో వారు మాత్రమే విని తరించెదరు. అచ్చట ధ్యాన, యోగ, తపో సాధనలు చేయువారికి సాక్షాత్‌గా శ్రీమల్లికార్జునస్వామి వారే సిద్ధిని ప్రసాదించెదరను విశ్వాసము ముఖ్యంగా ఉంటుంది.

ఇప్పుడీ స్వామి శ్రీపాదులు విచ్చేసినారంటే శ్రీ గణేశుడు చెప్పబట్టి వీరిని దత్తస్వామిగా ఆదిగురువుగా అందరూ అంగీకరించినారు. లేకుంటే ఎవరిదారి వారిదే. అందరూ ముముక్షువులే! (మోక్ష కాములే). కానీ మనసు పరిపరి విధముల ఆలోచనలతో వుండును. భావైక్యము లేనందున అంగీకారము కుదరదన్నమాట.

శ్రీపాదస్వామివారి దివ్యతేజో సంపన్నత్వము ముముక్షువులందరినీ ఒక త్రాటి మీదకు తీసుకొచ్చినది. వారి వారి సాధనలు అనేక స్థాయిలలో ఉన్ననూ ఆత్మజ్ఞానము, ఆత్మ సాక్షాత్కారమును పొందవలెనను ఒకానొక లక్ష్యము, అందరియందును గలదు. కావున శ్రీ స్వామి వారి అనుమతితో శ్రీ అభేదానంద స్వామి వారి ద్వారా యజ్ఞక్రతువులు నిర్వహించబడును. అనంతరం శ్రీ పాదుల వారి పవిత్ర జ్ఞానబోధకు సమయాన్ని వినియోగపరచునట్లుగా ఒక ప్రణాళిక నిర్ణయించబడినది. ఆ ప్రకారంగా సర్వులున్నూ శ్రీస్వామి వారి సన్నిధానమునకు చేరుకొనేవారు.

సభికులందరి అభిప్రాయమును శ్రీ అభేదానంద సరస్వతి స్వామివారు శ్రీపాద స్వామివారికిట్లు విన్నవించారు. “స్వామీ! సద్గురూత్తమా! త్రిమూర్తి స్వరూపా! త్రిగుణాత్మకా! స్వయం ప్రకాశమూర్తివైన శ్రీ దత్తాత్రేయ స్వామీ! మాపై ఎనలేని కరుణతో శ్రీ మల్లికార్జునస్వామివారు తమరినిక్కడకు రప్పించినారు. మాకు హితోపదేశమును చేయ ప్రార్థన” అంటూ శ్రీస్వామిని చేతులు జోడించి స్తుతించి ప్రార్థించారు. అందరూ ఆమోదంగా “సాధు! సాధు!” అని పలికిరి.

శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారు ఒకింతసేపు ధ్యాన ముద్రలో సర్వేశ్వరుని, భ్రమరాంబ మాతను ప్రార్థించి కన్నులు తెఱచి అందరిపైనను ప్రేమాస్పద దృష్టిని సారించుచు ఇట్లు ప్రారంభించిరి.

మహాత్ములారా! తాపసులారా! మీమీ మనోభావములు మాకు అవగతమైనవి. మీరందరూ మీమీ సాధనా మార్గములో నిష్ణాతులే! మీ అనుభవముల ననుసరించి వ్యక్తీకరించు మీ భావములు మీకు సత్యములుగా గోచరించుట సహజమే! ఇదియే మాయ యొక్క విలాసము. సత్యవస్తువు అనబడు పరబ్రహ్మ తత్త్వమునకు మార్పులేదు. ఏకమై, సమరసమై, నిత్యమై, అఖండమై, అద్వితీయమై, అచింత్యమై, స్వప్రకాశమై, అనూహ్యమై, ఆద్యంతరహితమై, అచలమై,

సమస్తమందునూ వ్యాప్తమైయున్నది. స్వయంకృషితోను, తీవ్రసాధనతోను, దృఢ సంకల్పంతోను మాత్రమే దీని ఉనికిని తెలియనగును. అదియే సాక్షాత్కారము. అప్పటిదనుక సంశయము లుద్భవించుచునే యుండును.

శరీర ధారులందరికీ ఈ సమస్య ఏర్పడుట సహజము. త్రిగుణముల సమిష్టి రూపమే మానవ దేహములు. ఆయా గుణములు సమతుల్యముగా నుండక ఒక దానిని ఒకటి మించుటకై ప్రయత్నించును. ఏ గుణము యొక్క ఆధిక్యత ప్రకాశించుచుండునో వ్యక్తి ఆ గుణము యొక్క ప్రభావముచేత ప్రవర్తించు చుండును. దేహంతో తాదాత్మ్య భావనను దేహాత్మ భావన యందురు. పరమాత్మతో తాదాత్మ్యమును సాధన ద్వారా అనుభవించుచుండు వారికి క్రమంగా దేహాత్మ భావము తొలగిపోవును. అనగా నేను దేహమును కాను. పరమాత్మ యొక్క అంశమును. ఆ తత్త్వమును అవగాహన చేసుకొనుట కొరకు ఈ దేహమను పరికరము యొక్క అవసరమున్నది. దీనిని ఉపయోగించుకొని ఈ జనన మరణ వలయము (చక్రము) నుండి విడివడవలయునను తీవ్రమైన ఆకాంక్ష యొక్క మరొక్క పేరే "ముముక్షుత్వము" అనబడుతుంది. మీరందరూ మోక్షాపేక్ష కలిగిన వారే. కావున అందరికీ కావలసినది ఒకే ఫలితము. అదియే ఆత్మ సాక్షాత్కారము అని బోధించగా సభలోని ముముక్షువులేగాక అనేక మంది భక్తులు యాత్రికులు గూడ సంభ్రమాశ్చర్యములో మునిగి కొంతసేపు చిత్తరువులవలె నుండిరి. శ్రీస్వామి వారి ప్రవచనము సాగినంత సేపున్నూ వారి వారి హృదయాలకు చల్లని అమృతపు జల్లులవలె సోకి ఆషాఢ మాసపు తొలకరి జల్లులకు బీడు భూమి పులకించిన విధంగా పులకరింత కలిగి వింటున్నంత సేపు వారికి శరీర భావన తెలియనేలేదు.

శ్రీపాదస్వామివారు చివరకు శాంతి మంత్రములు పలుకుచుండగా అందరూ శృతికలిపిరి. అందరూ జయజయ నాదములు చేయగా శ్రీస్వామివారు వారందరితో ఇట్లనిరి. "ఆర్యులారా! ఈ విధంగా ఈ సత్సంగములో విషయములను శ్రవణ, మనన, నిధి ధ్యాసములతో అందరూ గ్రహించండి. మేము స్వేచ్ఛా విహారులం. కావున నిత్యం మేమున్నను లేకున్నను తమలో ఎవరో ఒకరు ఈ సత్సంగమును నిర్వహించుకొనుడ"ని సూచన చేసిరి.

సాధకులందరూ ఈ విషయమునకు ఒడంబడి ఇట్లనిరి. "స్వామీ! తమ మృదు మధుర గంభీర విషయ వివరణములు మాకు ఎంతో ఉపకరించినవి. తమ అనుగ్రహంతో ఈ జ్ఞానామృతమును గ్రోలుచున్నామనిరి.

తదుపరి యొకనాడు శ్రీ స్వామివారు స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణ, తత్త్వప్రకాశములను ప్రవచింపగా వారి వారి జ్ఞానము విజ్ఞానమయముగా మారుటను వారు గ్రహించుకొనుచుండిరి.

సింగన్నదొర యను భిల్లుడు అక్కడ వుండే స్వాములు కొందరికి, క్షేత్రానికి వచ్చిపోయే భక్తులకు అడవిలో దొరికే దుంపలు, ఫలములు, పూలు, అనేక రకాల ఆకులు, కొన్ని తీగెలు, వనమూలికలు, వేరులు, పుట్ట తేనె వంటి అమూల్య వస్తువులు సేకరించుకొని వచ్చి ఎవరికి కావలసినవి వారికి ఇస్తుంటాడు. కొన్ని విక్రయిస్తాడు. అడవి కట్టెలు తెచ్చి యజ్ఞ సమిధలు సమకూర్చుతాడు. శ్రీ స్వామివారు వచ్చింది మొదలు వారి రూపం చూచి ఆయన దివ్యపురుషుడని గ్రహించుకొన్నాడు. ఇది అతని యొక్క పూర్వపుణ్యవశమున కలిగిన అదృష్టంగా భావిస్తూ నిత్యం శ్రీ స్వామి సన్నిధిలో కొంచెంసేపైనా గడపనిదే పోయేవాడు కాదు.

ఇలావుండగా కొన్ని రోజుల తర్వాత ఒక రోజున కందమూలములు సమర్పించి చేతులు కట్టుకొని నిలబడియున్నాడు. శ్రీ స్వామి వారు ప్రేమమూర్తులే! అయినా అడిగేటందుకు సంకోచంగా వుంది. అందుకని అట్లే నిలబడి యుండగా శ్రీ స్వామివారే స్వయంగా పలకరించి "ఏమి సింగన్నదొరా! ఏదో ఆలోచించుకొనుచున్నావు! అంటూ ప్రశ్నించే సరికి సింగన్న తడబడ్డాడు. శ్రీ స్వామి వారు "చెప్పు! భయం దేనికి? నీకేమి కావాలో అడుగు. అపారమైన సేవలు అందరికీ అందిస్తున్నావు. ఆ మల్లికార్జునస్వామి దయవలన నీకేమీ కొఱత యుండదు" అన్నారు.

సింగన్నదొర శ్రీ స్వామి పాదాలు పట్టుకొని "స్వామీ! తమరికి తెలియనిదేముంది? నాకు ఆరుగురు సంతానము. అందులో నలుగురు కుమారులు. స్వామీ! నాలుగవ కుమారునికి చూపులేదు. ఇద్దరు కుమార్తెలు. అందులో చిన్న కుమార్తెకు మాటలురావు. ఆ గ్రుడ్డి, మూగ పిల్లల భవిష్యత్తును ఊహించినప్పుడెల్ల నా గుండె బ్రద్దలవుతుంటుంది. స్వామీ! తెల్లవారితే అడవి జంతువుల మధ్య తిరుగుచూ పొట్టపోసుకునే వారము గదా! తమరు చెప్పే వేదాంత జ్ఞాన బోధలు వింటుంటే ఈ శరీరాలు ఎవ్వరికీ శాశ్వతం కాదని తెలుస్తూనే వుంది. అవివేకులము, మోటు మనుషులం స్వామీ! తమరు చూపే ప్రేమ, తమరు బోధించే అహింస అనే విషయాలు మా జీవితాలకు చాలా దూరం. నేను యింటికి పోయి తమరు చెప్పిన విషయాల గురించే ఆలోచన చేస్తూ వుంటున్నాను. నా భార్య ఇదేమిటని అడిగింది స్వామీ! నా భార్యతో తమరు చాలా గొప్ప మహిమగలవారనీ, ప్రేమ గలిగిన వారనీ చెప్పాను స్వామీ! అప్పుడామె నాతో ఇలా జగడమాడింది.

ఆడవాళ్ళైన మేము సాధుసన్యాసుల వద్దకు చేరలేముగదా! అంత గొప్ప స్వామిని మరి నేను పిల్లలు చూడవద్దా! నీవే చూచుకొంటూ గడిపేస్తావా. అంది స్వామీ! స్వామీ! తమరు గనుక దయ చూస్తే మీరెప్పుడంటే అప్పుడే నా గుడిసెకు తీసుకుపోతాను. నా భార్యగూడ ఒక్కసారి తమర్ని దర్శించుకొన్నదంటే ఇక నన్ను ఆటంక పెట్టదు స్వామీ! ఎన్నాళ్ళైనా నీ సేవ చేసుకోనిస్తుంది. నా ప్రార్థన ఆలకించండి స్వామీ! అక్కడైనా పండ్లు, తేనె, దుంపలు అవే తిందురుగాని అని బ్రతిమాలుచూ చేతులు కట్టుకొని చెప్పుచున్నంతసేపు శ్రీపాద స్వామి చిరునవ్వులు చిందిస్తూ విన్నారు.

శ్రీపాద స్వామివారికి అతనిపై దయ కలిగింది. వెంటనే శ్రీస్వామి వారు బ్రహ్మచారి నిర్మలానందతో ఇలాగన్నారు. "బ్రహ్మచారీ! సింగన్న ఇంతగా కోరుచుంటే నాకు వారింటికి వెళ్ళాలనిపిస్తున్నది. మరి నీవేమంటావు?" అని ప్రశ్నించగానే ఆయన "స్వామీ! తమరు ఏది నిర్ణయిస్తే మాకదే శిరోధార్యం. వేరు అభిప్రాయం ఏమీ లేదు" అన్నారు. అనగానే శ్రీ పాదస్వామి లేచి "పోదాం పద సింగన్నా!" అనగానే బ్రహ్మచారి వారిని అనుసరించాడు. ముందు సింగన్న తరువాత శ్రీ స్వామి ఆ వెనుక బ్రహ్మచారి విసవిసా నడవడం ప్రారంభించారు.

ఇంట్లో ముందుగా చెప్పకుండా హఠాత్తుగా శ్రీ స్వామిని తమ యింటికి ఆహ్వానించేశాడు. పరుగు లాంటి నడకతో ముగ్గురు సింగన్న గుడిసెకు చేరుకొన్నారు. సింగన్న భార్యను "ఓ లచ్చీ! ఏడున్నాయే! రాయే!" అంటూ అడవి ప్రతిధ్వనించేలాగున కూత పెట్టాడు. ఓ! ఒత్తున్నా! అంటూ భార్య పిల్లలందరూ బిలబిల వచ్చేశారు. ఈ లోపల శ్రీ స్వామివారిని కూర్చోమనాలంటే ఒక్కటే కర్రల మంచం ఉంది వాళ్ళింట్లో. అదే వాల్చి "స్వామీ! దయచేయండి! కూర్చోండి స్వామీ!" అనగా శ్రీ స్వామి ప్రసన్నులై వచ్చి కూర్చున్నారు. ఇంతలో సింగన్న ఒక ఈతాకుల చాపను క్రింద పరచి బ్రహ్మచారిని కూర్చుండజేశాడు. అతని భార్య సరాసరి దొడ్డి వాకిలిలో నుండి వచ్చింది. సింగన్న భార్యతో "లచ్చీ! ఈ స్వామివారే శ్రీపాదులంటారు. వారి సిరిపాదం మనింట్లో పెట్టారు. ఇక సూడు. మన అదురుష్టం ఎట్లా మారిపోతదో" అంటూ వున్నాడు. అంతలో ఆమె వచ్చింది. "స్వామీ! మమ్మల్ని దయతో సూడండి! అడవిజాతి మనుషులం. మాకే మరియాదలు తెలీవు" అంటూ మోకాళ్ళపై వంగి నమస్కారం చేసింది.

శ్రీ స్వామి దరహాసంతో వారిపై తమ అమృత దృష్టిని కురిపిస్తున్నారు. ఇంతలో బ్రహ్మచారి నిర్మలానంద సింగన్నతో శ్రీ స్వామివారికి పాదాలు కడిగి పూజించండి. అని చెప్పగా లక్ష్మిపోయి ముంతతో నీళ్ళు తెచ్చింది. కొన్ని అడవిపూలు తెచ్చారు పిల్లలు. అన్నీ పెద్ద పెద్ద ఆకులలో పెట్టుకొని

సింగన్న బ్రహ్మచారితో "అయ్యా! నీవే పూజ ఎట్లా చెయ్యాలో మాతో చేయించమ"నగా ఆయన ముందుగా శ్రీ స్వామివారి పాదాలు కడిగించారు. ఆ కడిగిన నీటిని ప్రక్కకు తీసి పూవులతో పూజ చేయించారు. నైవేద్యంగా తేనెలో వేసిన నేరేడు పండ్లు, జామ పండ్లు, కొన్ని దుంపలు (పచ్చివి) తెచ్చి అన్నీ ఆకులలో పెట్టించారు. తర్వాత అందరినీ వచ్చి నమస్కారం చేసుకోమనగా వరుసగా అందరూ నమస్కరించారు.

అట్లు నమస్కరించేటప్పుడు తన నాల్గవ కుమారుడు అంధుడని చూపినాడు సింగన్న. స్వామి వారి పాదాలకు నమస్కరించుటకై అతడు వంగి శ్రీస్వామి పాదాలు స్పృశించి కన్నులకు ఆ చేతులను అద్దుకొనగానే అతనికి చూపు కనిపించడం అందరినీ ఆశ్చర్య చకితులను చేసింది. తర్వాత సింగన్న తన మూగ కుమార్తెను తీసుకొచ్చి శ్రీ స్వామి వారికి మ్రొక్కించాడు. నివేదన చేసిన ఫలములలో నుండి ఒక నేరేడు పండు తీసి శ్రీ స్వామివారే ప్రసాదం ఆ పిల్ల చేతుల్లో వుంచి "తిని రుచి చెప్పు" అన్నారు. ఆ పిల్ల ఆ పండును తిని "ఇది తియ్యంగా వుంది" అని మాట్లాడుచూ తెలిపేసరికి ఆ భార్యాభర్తల ఆనందానికి హద్దులేలేవు. బ్రహ్మచారి యొక్క ఆశ్చర్యానికి, ఆనందానికి గూడ అవధుల్లేవు. ఇంతటి మహిమాపూర్ణమైన స్వామివారి సాహచర్యం ఎన్ని జన్మల పుణ్యంవలననో గాని లభించదు అనుకొంటూ ఆమాటను పైకే అనేశాడు. వెంటనే శ్రీ స్వామివారు "నిర్మలానందా! విన్నవి, చూచినవి ఏవైనా నేనీ ప్రాంతంలో ఉన్నంతవరకు ఎవరికీ బహిర్గతం చేయవద్దు" అంటూ ఆజ్ఞాపించారు. అట్లే నడుచుకొంటామని అందరూ తలలూపారు.

తర్వాత శ్రీపాదస్వామివారికి తేనెలోమాగిన నేరేడు పండ్లు, మరికొంత తేనె, జామ పండ్లు అన్ని ఫలహారంగా సమర్పిస్తే వారు వాటిని అతిసూక్ష్మంగా స్వీకరించి మిగిలినవి అక్కడున్న వారికే పంచమన్నారు. ఆపైన శ్రీ స్వామివారు ఇంక తిరిగి మఠానికి పోవ సంకల్పించగా మరల సింగన్నదొర నమస్కారం చేసుకొని "స్వామీ! ఈ జన్మకిది చాలు. నాకింక జన్మలే లేకుండ చెయ్యి. నీవు తలంచుకొంటే ఏదైనా జరుగుతుంది. స్వామీ! నీవు సాక్షాత్తుగా శ్రీశైలమల్లన్నవే" అంటూ నమస్కరిస్తుంటే అతని పూర్వజన్మలన్నీ శ్రీస్వామివారి మనోదృష్టిలో ఒక్కసారిగా గోచరించినవి.

అతడు ఒకానొక జన్మలో వేదవేదాంగములు చదివిన గొప్ప పండితుడు. అధ్యాపకుడు. ఆ సమయంలో తాను కాశీలో చదివిన వాడినని చాలా అహంకారంతో వుండేవాడు. అతని పేరు కాశీ విశ్వనాథ పండితుడు. అందరితో పొగడించుకొనేవాడు. తన వద్ద విద్యాభ్యాసం చేసేవారు తనకన్నా విద్యలో మించిపోకూడదనే దురభిప్రాయం ఉండేది. ఏ గురువులైనా తన విద్యార్థి

గొప్పవాడుగా కావాలని అప్పుడే గురువుకు పేరు ప్రఖ్యాతులు రావాలని విశాల హృదయంతో విద్య నేర్పించాలి. అట్లుగాక అందుకు వ్యతిరేకంగా కుచ్ఛిత బుద్ధితో వుండే అధ్యాపకునికి మరుసటి జన్మలో విద్యయందు మక్కువ వుండదు. అందువలన ఇతడు తరువాతి జన్మలో క్షత్రియుడైనాడు. గోవర్ధనవర్మయను పేరున దక్షిణాదిలోని మదురై (క్షేత్రం) నగరానికి రాజైనాడు. కానీ రాజోచితంగా దైవకార్యాలలో పాల్గొనునప్పుడు విరివిగా ద్రవ్యం ఖర్చుచేయలేక పిసినారిగా వున్నందున తర్వాతి జన్మలో కళింగపట్నంలో సోమదత్తుడను వైశ్యుడుగా పుట్టాడు. ఆ జన్మలోగూడ వైశ్యజాతి లక్షణాలను పొంది దాన ధర్మాలు చేయకుండ కాయకష్టం మీద మక్కువ జూపుచు అందరికీ అదే బోధించేవాడు. కావున తదుపరి జన్మలో తిరునంతపురంలో ఒక రైతు ఇంట్లో "నారాయణ" అనే పేరుతో పుట్టాడు. ఆ జన్మలో వృత్తియందు నిమగ్నం కాకుండా రోజంతా చేపలు పట్టడం ఆనందించడంవలన తర్వాతి జన్మలో కాశీ క్షేత్రంలో "శివుడు" అను పేరున జాలరిగా పుట్టాడు. అందరినీ పడవలో ఎక్కించి గంగలో త్రిప్పుచూ ద్రవ్యం ఇచ్చినది తృప్తితో తీసుకోకుండా ఇంకా ఇమ్మని పీడించేవాడు. సాధువులను గూడ ద్రవ్యం ఇమ్మనేవాడు. ఆ కారణంగా తదుపరి జన్మలో వింధ్యాచల అడవులలో "రావణ"నామధేయంతో కిరాతుడై (బోయ) జన్మించాడు. జంతువులను చంపి తింటూ వున్నా గూడ గత జన్మలో కాశీవాసంవలన ఆ జన్మలో అడవిలో దారినడిచేవారికి సేవలు చేసేవాడు. దారి చూపేవాడు. దుష్టబుద్ధిలేదు. ఆ కారణంగా ఇప్పుడు శ్రీశైలంలో భిల్లుడై పుట్టి ఇంత సద్బుద్ధితో నడుచుకొంటున్నాడు. ఇతనికి మరియొక హీనజన్మ ఎత్తవలసిన అవసరం వుంది. ఇదంతా శ్రీస్వామివారి మనోదృష్టికి గోచరించింది. అందువలన ముక్తి ప్రసక్తే లేదు.

శ్రీ స్వామి ఇవన్నీ దివ్యదృష్టితో చూచినారు కావున పైకి "సింగన్నా! నీవు చాలా అదృష్టవంతుడవు. ఆరు జన్మల నుండి పుణ్యక్షేత్రాలలోనే జన్మిస్తున్నావు. నివసిస్తున్నావు. సద్గురు భక్తి లభించింది. ముందు వచ్చే రెండు జన్మల్లోగూడ నా దర్శనం నీకు లభిస్తుంది. అప్పుడు ముక్తి సంగతి ఆలోచించుదాము" అని చెప్పి ఆశీర్వదించగానే అతడు సంతోషంతో "స్వామీ! మీ అనుగ్రహం నాకుంటుందన్నారు. అది చాలు నాకు. ఎన్ని జన్మలైనా ఎత్తుతాను". అంటుంటే అందరూ నవ్వుకొన్నారు. మీ జీవితంలో ఏమీ లోటురాదు. అని వారిని ఆశీర్వదించి శ్రీ స్వామివారు బయల్దేరి మఠానికి చేరుకొన్నారు. నిర్మలానంద మనస్సులో ఈ సింగన్నకే మళ్లీ జన్మలో దర్శనం వుందన్నారు. మరి నా సంగతి ఏమిటో! నాకు గూడ ఆ విధంగా దీవిస్తే స్వామి నేను ధన్యుడనే అని తలంచాడు.

అని శ్రీ బాబాగారు చెప్పగానే మాకందరికీ (వినేవారికి) శ్రీ గురుచరిత్రలో ఏడు గీతలుదాటి ఏడు జన్మల విశేషాలు వివరించిన దళితుని కథ అర్థమైపోయింది. కానీ ఒక సందేహం వచ్చింది. ఇంక ఆలస్య మెందుకు నేను ఉత్సాహంగా "బాబాగారండీ! కోపగించకుండా నా ప్రశ్నకు సమాధానం చెప్పండి. శ్రీ నరసింహ సరస్వతి స్వామివారు భస్మం చల్లి వేదాలు పలికించిన దళితుడేగా ఇతడు. అతనిని శ్రీ గురుడు ఈ జన్మలో కాదు. నీవు నిత్యం పాపనాశ తీర్థంలో స్నానం చేసి పరిశుద్ధుడై ముందు జన్మలో శుద్ధ బ్రాహ్మణుడై పుడతావులే అని దీవిస్తారు గదా. మరి ఆ తర్వాత ఏ అవతారంలో సేవకుడైనాడు అనేది అర్థం కావడం లేదు. దయతో సద్గురుని సేవాఫలం వృధాపోదన్న విషయాన్ని కాస్త వివరించండి!" అని ప్రార్థించగా బాబాగారు ఒక్కసారి పకపకా నవ్వి "ఇదంతా అర్థమైంది. అదెందుకు అర్థంకాదు. శ్రీ సాయిబాబా నానా సాహెబు చంద్రోర్కరుతో నీది నాదీ మూడు జన్మల బంధం అని చెప్పారుగదా! అతడే ఇతడు!" అన్నారు. అందరం ఆశ్చర్యము ఆనందము ఉప్పొంగగా శ్రీపాద శ్రీవల్లభులకు జయజయనాదములు చేసినాము.

శ్రీపాదుల లీలలు అమోఘం. అపారం. ఆ దేవుని నామం తలచినా చాలు మనలను ఆయన వదలకుండా జన్మజన్మాంతరాలు కాపాడి సన్నిధానం ఇస్తాడన్నది అక్షరసత్యము!



# 9వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

## విద్యాగీత ప్రవచనం

శ్రీ విఠల్‌బాబాగారు శ్రీపాదస్వామివారి బోధలను ఈ విధంగా వివరించసాగిరి. ఒకనాడు శ్రీపాద స్వామివారు చాతుర్మాస సందర్భంగా చేయు సత్సంగ సమావేశమునకు వచ్చి ఆసీనులైనారు. అందరూ అప్పటివరకు అనేక ఆధ్యాత్మిక విషయముల గురించి, సాధనా మార్గములను గురించి చర్చ చేయుచు అక్కడకు చేరిన వారందరు తమ తమ అనుసరణీయ మార్గములే సత్యమార్గములని వాదించుకొనుచుండిరి. శ్రీ స్వామివారు వచ్చిన వెంటనే అందరూ జయజయ ధ్వానములు చేసి చేతులు జోడించి నమస్కారములు చేసినారు.

శ్రీ స్వామివారు అక్కడ చేరిన వారందరి వంక పరికించి చూచుచూ యోగులారా! మహాత్ములారా! ఏదో గణనీయమైన చర్చలో నిమగ్నమైనట్లున్నారు. నా రాక దానికి అంతరాయము కలిగించినదా? యని ప్రశ్నించినారు. అప్పుడు వృద్ధుడైన అభేదానందసరస్వతిస్వామివారు నమస్కరించి "స్వామీ! తమరి రాక మాకు శ్రేయోదాయకమే. మేము మా యొక్క సాధనా మార్గముల గురించి చర్చించుచూ ఏ మార్గము సులభమో, ఏ పద్ధతిలో జ్ఞాన ప్రాప్తి త్వరితముగా లభించునో ఆ విషయములనే చింతించుచుంటిమని పలికి ఉత్తమ జ్ఞానప్రాప్తికి తమరు ఇంకను సులువైన మార్గమును మాకు బోధించి మమ్ము ధన్యుల చేయండని ప్రార్థన పూర్వకంగా పలికెను.

శ్రీపాదులవారిట్లనిరి. ఆర్యులారా! చర్చలు, వాదములు, ప్రతివాదములు చర్చించువారి స్థాయినిబట్టి వుంటాయి. చెప్పేవానికి వినేవానికి ఒక సామరస్యం వుండాలి. వినేవాడు అది తనకు తెలిసిన విషయమే అయినా అందులో ఏదో నూతనత్వం దొరకకపోవునాయని శ్రద్ధగా వినవలెను. చెప్పేవాడు తాననుభవించినది, కూలంకషముగా తెలుసుకొన్నది, శాస్త్ర సమ్మతమైనదానినే చెప్పవలెను. ఇద్దరిలోను అహంకారము పొడసూపరాదు. చర్చలలో విజ్ఞాన వివరణము మాత్రమే వుండాలిగాని విజయకాంక్ష వుండరాదు.

విజయకాంక్ష మహాజ్ఞానిని గూడ అజ్ఞానంవైపు మళ్ళిస్తుంది. సత్సంగము వలన వ్యక్తులు ముముక్షుత్వమును పొందిన సన్నివేశములు ఎన్నియోగలవు. సాధకులారా! పరమపవిత్రమైన ఈ క్షేత్రంలో చాతుర్మాస పర్వదినములలో యజ్ఞ భట్టారకుని ముందర కూర్చుని ఇట్లు చర్చించరాదు

అని మందలింపుగా నుడివిరి. సభికులందరూ మౌనం వహించిరి. శ్రీ స్వామివారు సాలోచనగా అందరివైపు జూచుచు మీరేకాదు. గతంలో మహామహులైన మునిపుంగవులు తమలో తాము ఈ విధంగానే వాదులాడుకొనిరి. వారికి తత్త్వజ్ఞానము పూర్తిగా అలవడుటకు పరమేష్ఠియు, పరమేశ్వరుదున్నూ విద్యా స్వరూపిణియైన జగన్మాతతో చెప్పించిన "విద్యా గీత"ను నేటి నుండి వివరించెదను. శ్రద్ధాళువులై వినుడు. అని శ్రీపాదులు వారికి బోధించారు" అని శ్రీ బాబాగారు నావైపు చూచి "అమ్మా! ఈ విద్యాగీత రహస్యాతి రహస్యము. త్రిపుర సుందరిదేవి ప్రబోధము. మీరందరూ గూడ సావధానంగా వినండి!" అని తెలిపి శ్రీ స్వామి వారి ప్రబోధాన్నిట్లా వివరింపసాగారు.

శ్రీపాద శ్రీవల్లభులు చిరునవ్వులు నవ్వుచూ ఒకానొక సమయమందు శ్రీ దత్తాత్రేయస్వామి వారు పరశురామునికి అత్యంత నిగూఢ సత్యమును తెలుపుటకై ఒక సన్నివేశమును ప్రకటించినారు. దానినిప్పుడు మీకు తెలిపెదను. విను"దని ఇట్లు ప్రారంభించిరి.

బ్రహ్మలోకమునందు అప్పుడప్పుడు జ్ఞాన, తత్త్వ విచారము జరుపుటకు సభ నిర్వహించి మహాత్ములందరూ లోకకల్యాణమునకై అనేక సులభ సాధనా మార్గములను ప్రతిపాదన చేయుచుందురు. ఎందరో మానవులు మహాత్ములై తమ తమ సాధనా గరిమతో బ్రహ్మలోకము (సత్యలోకము)నకు చేరుకొని బ్రహ్మదేవుని సన్నిధిలో స్థిరముగా నుండెదరు.

ఒకసారి బ్రహ్మలోకమున జరుగు సభకు మహర్షులు ఆహ్వానింపబడినారు. ఆ సభా ప్రాంగణమందు సనకసనందనాదులు, వశిష్ఠ, పులస్త్య, పులహ, క్రతు, భృగు, అత్రి, అంగీరస, ప్రచేతన, నారద, చ్యవన, వామదేవ, విశ్వామిత్ర, గౌతమ, శుక్రాచార్య, పరాశర, వ్యాస, కణ్వ, కశ్యప, దక్ష, సుమంత, శంఖ, లిఖిత, మొదలగు మహర్షులు, రాజర్షులు, దేవర్షులు మరికొందరు తత్త్వజ్ఞులున్నూ చేరి ఆసీనులైయుండిరి. సభాధ్యక్ష స్థానమందు బ్రహ్మదేవుడుండెను. సరస్వతీదేవి తన వీణానాదములో లీనమైయుండెను. మహా పురుషులు, ఉత్తమ జ్ఞాన సిద్ధులైన వారల సమక్షమందు ప్రజాహితము కొరకు, లోక కల్యాణముకొరకు జ్ఞాన సాధన విషయము ప్రతిపాదించబడెను. దానిపైన తత్త్వ విచారణము ప్రారంభమయ్యెను.

గొప్ప జ్ఞానులు, తపస్వులు, యోగులకు మాత్రమే ఈ సభలో పాల్గొనుటకు ప్రవేశము లభించును. అంతకు ముందే బ్రహ్మలోక ప్రాప్తిని పొందినవారు అచ్చటనే వుంటూ నిత్యము పరతత్త్వ విచారము చేయు చుందురు. ఆ విధముగా ప్రజాహితమునకై వారందరూ చర్చించి ఉత్తమ మార్గమును నిర్ణయించి సర్వులకు హితము కూర్చవలసియున్నది. అందులకై మహర్షుల

యొక్కయు, బ్రహ్మదేవుని యొక్క సలహాలను పొంది సత్యాన్వేషణ సాగించవలసియున్నది. తద్వారా వారు పరమాత్మానందానుభూతిని పొంది అనుభవపూర్వక వాక్యములను జిజ్ఞాసువులకు కొన్ని ఉపాయములను తెల్పవలసియున్నది.

మహాత్ములైన వారు పరస్పరం జ్ఞాన చర్చలు చేయునప్పుడు వారి ముఖతః బహిర్గతమగు జ్ఞాన విలాసము అనేక రూపములుగా వెలువడుతుంది. అన్ని సాధనా మార్గములున్నూ గమ్యానికే చేర్చును. మార్గాలు వేరైనా గమ్యమొక్కటే కావున వారివారికి అనుకూలమైన మార్గాన్ని ఎంచుకొని సాధన సాగించెదరు. ఇదే మహాత్ముల ద్వారా జరుగు లోక కళ్యాణము.

ఈ సభలో ముఖ్యముగా మానవులు జ్ఞానమును పొందుటకై గల మార్గములు, జ్ఞాన ప్రాప్తికి సాధనములు, సాధనచేత పొందవలసిన జ్ఞాన స్వరూపము, అటువంటి జ్ఞానం సిద్ధింపజేసుకొన్నవారిలో ఎవరు ఉత్తములు, వారు అనుసరించు పద్ధతి ఎట్లుండునని విచారణ ప్రారంభమయ్యెను. కానీ మహాదేవి యొక్క మాయ వలన వారి చర్చలో వాదప్రతివాదములు చోటు చేసుకొన్నవి. వాదించువారలలో అహము పెరిగి పట్టుదల హెచ్చి ఎవరికి వారు తామే ఉత్తమ జ్ఞానులమను భావము పొడగట్టినది. మహాత్ములైన వారున్నూ, బ్రహ్మదేవుడున్నూ మౌనం వహించిరి.

బ్రహ్మదేవుని సమక్షంలో మహర్షులు, ప్రజాపతుల సమక్షంలో అందరూ తమకు గల జ్ఞానమును ప్రక్కకుపెట్టి పెద్దలను వినయంతో అడిగి తెలుసుకొనవలసి యుండగా వీరి ప్రవర్తన దాని విరుద్ధముగా తమ తమ అభిప్రాయములను సమర్థించుకొనుటయు తామే ఉత్తమ జ్ఞానుల మనుటయు జరిగెను. వారిలో వారికి అంగీకారము కుదరక వాదము బిగిసిన తదుపరి సభాధ్యక్షుడైన బ్రహ్మదేవునితో "హే! పరమేష్ఠీ! నీవు సకల చరాచర సృష్టికర్తవు. నీకు తెలియని విషయముండదు. మాలో ఎవరుత్తమ జ్ఞానులో నిర్ణయించగల సమర్థులు మీరేనని కోరినారు.

అప్పుడు బ్రహ్మ అన్నీ తెలుసుగావుననే ఇలాగన్నారు. "సభాసదులారా! మీ వాద ప్రతివాదములన్నియు విన్నాను. ఏది సత్యమో, ఏది సత్యదూరమో నిర్ణయించుట కష్టతరముగానున్నది. మీమీ భావములు సమంజసముగానే వున్నవి. ఇప్పుడు మనందరము సదాశివుని సన్నిధికి చేరి వారిని ప్రార్థించి సరియైన సమాధానమును పొందుద"మని సలహా చెప్పి వారందరిని వెంట తోడ్కొని పరమేశ్వరుని కడకుపోయినారు.

పరమేశ్వరుడు సర్వజ్ఞుడైననూ అందరిని జూచి మహాత్ములారా! బ్రహ్మదేవా! ఏమీ! ఈ

సమయములో మీరందరూ ప్రజాహితం గురించి చర్చించుట మాని ఇచ్చటకు చేరినారేమి! అని ప్రశ్నించెను. వచ్చిన వారందరూ చేతులు జోడించి పరమశివునికి, జగన్మాతకు గణేశునికి, సుబ్రహ్మణ్యస్వామికి అందరకు వందనములు చేసిరి.

సర్వేశ్వరా! సర్వజ్ఞుడైన నీకు తెలియనిదేమున్నది. మాకు సత్య నిర్ణయమునందు అంగీకారము కుదరక తమ వద్దకు వచ్చియున్నాము. తమ నిర్ణయం కొరకు వచ్చియున్నామని విన్నవించెను.

సదాశివునికి సర్వము విదితమే. వివాదము చేయువారందరియందునూ అహంభావము పూర్ణముగా ఏర్పడియున్నది. ఇప్పుడు ఎవరేమి చెప్పినా వీరికి అంగీకారము కుదరదు. నేనేమి చెప్పినా అది నా అభిప్రాయమని భావించెదరేగాని సత్యమని తెలియలేరు. కావున వీరికి విద్యారూపిణియైన పరాశక్తి ద్వారా సత్యమును తెలియజేయవలసి యున్నదని భావించి వారితో "ఆర్యులారా! మీ అభిప్రాయములన్నియూ సత్య విషయములే. ఇందు ఏది ఉత్తమ జ్ఞానమో చెప్పుట కష్టసాధ్యము. దీనికి ఒక ఉపాయము గలదు. విద్యా స్వరూపిణియైన పరాశక్తిని ధ్యానించి ఆమె ద్వారా నిగూఢ సత్యమును తెలిసికొందుము" అని బోధించి అందరూ కలసి సమ్మతితో మనసారా ధ్యానించినారు.

**1)** **యా దేవీ సర్వభూతేషు విష్ణుమాయేతి శబ్దితా**
**నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః**

**2)** **యా దేవీ సర్వభూతేషు చేతనే త్యభిధీయతే**
**నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః**

**3)** **యా దేవీ సర్వభూతేషు బుద్ధి రూపేణ సంస్థితా**
**నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః**

**4)** **యా దేవీ సర్వభూతేషు నిద్రా రూపేణ సంస్థితా**
**నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః**

**5)** **యా దేవీ సర్వభూతేషు క్షుధారూపేణ సంస్థితా**
**నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః**

**6)** **యా దేవీ సర్వభూతేషు ఛాయా రూపేణ సంస్థితా**
**నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః**

7) యా దేవీ సర్వభూతేషు శక్తి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
8) యా దేవీ సర్వభూతేషు తృష్ణా రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
9) యా దేవీ సర్వభూతేషు క్షాంతి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
10) యా దేవీ సర్వభూతేషు జాతి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
11) యా దేవీ సర్వభూతేషు లజ్జా రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
12) యా దేవీ సర్వభూతేషు శాంతి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
13) యా దేవీ సర్వభూతేషు శ్రద్ధా రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
14) యా దేవీ సర్వభూతేషు కాంతి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
15) యా దేవీ సర్వభూతేషు లక్ష్మీ రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
16) యా దేవీ సర్వభూతేషు వృత్తి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
17) యా దేవీ సర్వభూతేషు స్మృతి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
18) యా దేవీ సర్వభూతేషు దయా రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
19) యా దేవీ సర్వభూతేషు తుష్టి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః

20) యా దేవీ సర్వభూతేషు మాతృ రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
21) యా దేవీ సర్వభూతేషు భ్రాంతి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
22) ఇంద్రియాణా మధిష్ఠాత్రీ భూతానా మఖిలేషుయాః
భూతేషు సతతం తస్యై వ్యాప్త్యై దేవ్యై నమోనమః
23) చితి రూపేణ యాకృత్స్న మేత ద్వ్యాప్య స్థితాం జగత్
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః
24) నమో దేవ్యై మహా దేవ్యై శివాయై సతతం నమః ।
నమః ప్రకృత్యై భద్రాయై నియతాః ప్రణతాః స్మృతామ్ ॥

వారట్లు ధ్యానించగా మహాదేవి యొక్క సంకల్పంతో మేఘ గర్జన ధ్వనులు ఆకాశమున దద్దరిల్లెను. విద్యుల్లతలు కన్నులకు మిఱుమిట్లు గొలిపెను. శంఖనాదముతో కలసి దశనాదములొక్కసారిగ వినవచ్చెను. మొదట ఆ మేఘ గర్జనము ఎందులకో వారి కర్థము కాలేదు. దిగ్భ్రాంతులై మహేశ్వరి యొక్క దర్శనము కొరకు ఎదురుచూచిరి. కానీ ఆమె నాదమయిగానే దర్శనమిచ్చినది. కానీ పూర్ణరూపము జూపలేదు.

అప్పటి వారి సందేహములకు శబ్దమయిగా మారి శ్రోత్రేంద్రియము ద్వారా వారి అంతః కరణములోనికి ప్రవేశించుటయే కర్తవ్యము. ఆమె శబ్దము ద్వారా ఇట్లు పలికినది. "ఋషులారా! ఇప్పుడు నన్నెందుకు తలంచినా?"రని ప్రశ్నించినది.

అప్పుడు త్రిమూర్తులు అక్కడ చేరియున్న ముని, ఋషి గణములతో మహాదేవికి మీమీ సమస్యను తెల్పమన్నట్లుగా చేతితో సైగలు చేసిరి. ఆ మునులు, ఋషులందరూ దేవి నూహించి నమస్కరించి ఇట్లు వినుతించినారు.

"దేవీ! శబ్ద బ్రహ్మమయీ! చిదానందమయీ! సత్యమయీ! చిన్మయీ! వేదానందమయీ! మహాగుణమయీ! పరమ సుఖమయీ! శ్రీమయీ!" అంటూ ప్రార్థించి ఇట్లు విన్నవించారు. "అమ్మా! శ్రీ విద్యా స్వరూపిణివైన నీవు దప్ప మాకీ సత్య విషయమునెవ్వరూ బోధించలేరు. దయతో మామనవిని ఆలకించుతల్లీ! నీ యొక్క పర రూపము, అపరరూపము, ఈశ్వరత్వము, జ్ఞానము, దాని ఫలము దీనిని సాధించు ముఖ్యసాధనము, సాధకుడు, సిద్ధి స్వరూపము, సిద్ధియొక్క పరాకాష్ఠ,

ఉత్తమ జ్ఞానియొక్క వర్తనము అను విషయాలపైన చర్చించిన మాకు ఏకపక్ష అంగీకారము కుదరలేదు. ఇందు సత్య నిర్ణయము చేసి మమ్ము ధన్యుల జేయ ప్రార్థన"అని తెల్పగా మహాదేవి ఇట్లు పలికెను.

"సర్వ మానవుల సంశయములను దూరం చేయగల మీకు సంశయము కలుగుట అత్యంత ఆశ్చర్యకరము. మీ అందరి ప్రశ్నలకు సమాధానము చెప్పెదను. పాల సముద్రం నుండి అమృతమును పొంది దేవతలు అమరులైనట్లు సకల శాస్త్రములనెడి సముద్రము నుండి లభించు ఈ అమృతమును మీకొరకు ఇచ్చు చున్నాను. విశ్వాసముతో ఆస్వాదించండి. శ్రద్ధగా ఆలకించండి.

**(1) పరరూపము:** దేనియందు ఈ జగత్తు సృష్టించబడి, పోషించబడి, లయమగుచున్నదో, ఏది అజ్ఞానులకు జగత్తుగా, వృద్ధి క్షయములు కలిగినదిగా కంటికి కనిపించు చున్నదో అదియేనా పరరూపము. అనగా ఇంద్రియ గోచరమైయ్యే దంతయూ నాపర రూపమే.

ఇదియే యోగులకు అంతఃకరణమందు నిస్తరంగ, గంభీర, చైతన్య మహాసముద్రము నిశ్చలంగా గోచరించు చున్నది. వారు నా పర రూపమును ఆ విధంగానే దర్శించెదరు. కొందరు దానినే తమ స్వరూపంగా తెలుసు కొందురు. అయినను వారి వారి స్వభావములను బట్టి, ఇష్టతలను బట్టి భక్తి భావప్రేరితులై భేదము కల్పించుకొని నన్ను స్త్రీ మూర్తిగా ఆరాధించుచుందురు. అంతఃకరణ, ఇంద్రియాలు, కాయము ఈ మూడింటినీ ముడివేయు సూత్రమే ప్రాణము. ఆ ప్రాణముగా భాసించునది నా పర రూపమే. ప్రాణము, దేహము వేరైనప్పుడు లోకము (జగత్తు) భాసించదు. అందువలన శాస్త్రములు నా పర రూపమును ఇట్లు నిరూపించుచున్నవి.

**(2) అపర రూపము:** ఇక నా అపర రూపము వినుడు. అనేక బ్రహ్మాండములకు వెలుపల ఊర్ధ్వముగా సుధాసముద్రమునందుగల మణిద్వీపములో కదంబ వన మధ్యమున చింతామణి రత్న నిర్మిత ఆరామములో పంచ బ్రహ్మమయమైన మంచము అనగా బ్రహ్మ, విష్ణు, ఈశ్వర, రుద్రులు నాలుగు కోళ్ళుగాను, సదాశివుడే మంచము యొక్క పలకగాను ఏర్పడియున్నది. దానిపైన కామేశ్వరీ, కామేశ్వరుల (స్త్రీ-పుం) రూపమున అనాది మిధునముగా ప్రకాశించుచుండునదే నా అపరరూపము.

జాగ్రత్, స్వప్న, సుషుప్తియను మూడు పురము (అవస్థలు) లందు సకల జీవులలో ప్రకాశించుచుండునట్టి దానినిగూడ అపరరూపముగా చెప్పెదరు. కావున దీనినే త్రిపుర సుందర రూపమని గూడ చెప్పెదరు. మరియును సదాశివుడు, ఈశానుడు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, గణేశాది దేవతలు, దిక్పాలకులు సకల దేవ గణములైన వారందరూ మానవ దేహమందు నాతో కూడ వున్నారు. వారంతా బాహ్యంగా నా యొక్క అపరరూపాలుగా ఆరాధించబడుతున్నారు. ఏ

రూపమును ఆరాధించినను ఆయా రూపములతో ఆ పూజను నేనే స్వీకరించి వారికి తగిన ఫలము నొసగుచున్నాను. **ఇది తెలియలేనివారు అజ్ఞానముతో ఆయా దేవతలొసగు ఫలముగా భావిస్తారు.** ఈ విషయము నెఱిగి నన్నారాధించువారు జ్ఞానులు. ఆరాధన యొక్క ఫలమే జ్ఞానముగా తెలియవలెను అని మునులకు విద్యాదేవి వినిపించెను.

శ్రీపాద స్వామివారు ఈ విషయమువరకు దెల్పి శాంతి మంత్రములు పలికి ఆనాటి సభ చాలించిరి. సాయంకాల అనుష్ఠానములకై అందరు నిష్క్రమించిరి. శ్రీ అభేదానంద సరస్వతి స్వామి, బ్రహ్మచారి నిర్మలానందయు శ్రీపాద స్వామివారిని అనుసరించిరి.

మరుసటి దినమున త్రిపుర రహస్య వివరణమును వినుటకై సాధకులు, యోగులు, బ్రహ్మచారులు, సాధువులు, కొందరు గృహస్థులు యాత్రికులున్నూ వచ్చి ముందుగానే సమావేశము అయివున్నారు. కానీ అందరూ ఏ విధమైన సంభాషణములు చేయక ఎంతో ఆసక్తితో శ్రీపాద స్వామివారు చెప్పబోవు రహస్యములను వినుటకై వేచియున్నారు.

శ్రీపాదులవారు వచ్చుటతోడనే వారిమెడ యందొక పూలమాలను వైచి బ్రహ్మచారి నిర్మలానంద జయ జయధ్వానములు చేసెను. శ్రీపాదులవారు శ్రోతల నుద్దేశించి ఆర్యులారా! నిన్న మనము చెప్పుకొన్నటువంటి మహాదేవి యొక్క పర, అపర రూపములేగాక ఇంకను ఆమె యొక్క ఐశ్వర్యము (ఈశ్వరత్వము) గురించి గూడ ఆ త్రిపుర సుందరిమాత ఇట్లు చెప్పుచున్నది. ఋషులారా! కేవల చైతన్య రూపిణిగా ఏక రూపమున నున్న నేను ఇతర ద్రవ్యమేమియు లేకయే జగత్తు యొక్క రూపమున భాసించుచున్నాను. **ఇట్లు అనేకముగా భాసించు చున్నను (గోచరించుచున్నను) రెండవ వస్తువు లేదను విషయమును జ్ఞానులు తెలియుచున్నారు.** నాకు దుర్ఘటమన్నదే లేదు. అంతయు సుసంఘటితమే. ఇదియే నా ఐశ్వర్యము (ఈశ్వరత్వము). నేనే సర్వమునకు ఆధారమును. అంతటను వ్యాపించి దేనితోను సంబంధము లేక కేవలముగానున్నాను. నా మాయ చేతనే నా స్వరూపము నావరించి సంసారము కలదాననై శిష్యత్వమును పొంది గురువు నాశ్రయించి ఆత్మతత్త్వమును తెలిసి ముక్తిని బడయుచున్నాను. ఒక నటుడు ఎన్ని వేషములు ధరించినను నటన తర్వాత తానుగా నుండునట్లు ఈ సంసారమందు ఎన్ని రూపములు ధరించినను "నేను" నేనుగానే ఉంటున్నాను. ఈ నా ఐశ్వర్యమును లెక్కింప నెవ్వరివశము గాదు. ఇది తెలియుటయు జ్ఞానమే.

ఇటువంటి జ్ఞానము గూడ పరము (ద్వైతము) అపరము (అద్వైతము) అను భేదములతో బహు విధములుగా నున్నది. ద్వైతమునందు ధ్యానించువాడు తన స్వరూపముకన్న భిన్నముగా

ఇష్టదేవతా రూపమునో, లేక మంత్రమునో ధ్యానించును. అందువలన ద్వైత జ్ఞానము బహు విధములుగా భాసిల్లుచున్నది. ఇట్టి ధ్యానము స్వప్నములో రాజగుట వంటిదే. అయినను విషయము నుండి మనసు మరలి దైవమును ధ్యానించుట చేత చిత్తశుద్ధియను ఫలము నిచ్చుచున్నది. ఇటువంటి ధ్యానములో నా యొక్క అపరరూపముగా చెప్పబడిన త్రిపుర సుందర రూపమును ధ్యానించుట జ్ఞానసిద్ధికి సాధనము. ఈ విధంగా విద్యారూపిణి యైన నన్ను ఆరాధింపక ఎవ్వరును అద్వైత జ్ఞానమును పొందలేరు.

అద్వైత జ్ఞానమనగా దృశ్యమైన రెండవ పదార్థమేదియు లేక కేవలంగా ప్రకాశించు పరమచైతన్యమేనని అనుభవమును పొందుట. ఆ స్థితిలో ద్వైతమునకు తావులేదు. అద్దమందు గోచరించు వ్యాఘ్రములు, సర్పములు ప్రతిబింబములని తెలిసినప్పుడు వాటి నుండి భయమును ఎట్లు పొందడో అట్లే ఈ అద్వైతసిద్ధిని పొందిన జ్ఞానికి ఈ భౌతిక ప్రపంచమందలి ఏ క్రూరజీవి నుండి భయము లేకున్నది. నిర్వికల్ప సమాధిని పొంది ఏ యోగి శుద్ధ చిదాత్మగా భాసిల్లుచున్నాడో అటువంటి సమాధి నుండి లేచిన తదుపరి గూడ అట్లే అనుభవమును పొందును. ఈ గుర్తింపునే ప్రత్యభిజ్ఞానమని చెప్పెదరు.

పరజ్ఞానమనగా సమాధియందువలెనే తక్కిన సమయములందు గూడ స్వరూప జ్ఞానముతోనుండుట యని చెప్పబడినది. ఇట్టి జ్ఞానమువలన తరువాత ఎటువంటి వ్యవహారమందును, ఏ పదార్థమందును సత్యత్వ బుద్ధి కలగదు. అద్దములోని ప్రతిబింబమునకు ఏ విధమైన ఉనికియు లేదని తెలిసినదో అట్లే ఆత్మయందు ప్రతిబింబించుచున్న సకల పదార్థములకున్నూ ఆత్మగాక ఇతర యే ఆధారములేదని నిశ్చయ జ్ఞానము కలిగినచో గాలిచేత చెదరగొట్టబడు మేఘములవలె సంశయము లన్నియు ఎగిరిపోవును. ఈ పరజ్ఞానము కలిగిన తరువాత గూడ మానవునిలో కోపము, కామము మొదలైన సంస్కారములు నామమాత్రంగా ఉన్ననూ అవి కోరలు తీసిన పాములవలె ఒక ప్రక్కన పడియుండగలవు అని చెప్పి ఆ రోజు శాంతి మంత్రపఠనం చేశారు. సభకు స్వస్తి చెప్పి నిత్యానుష్ఠానమునకు వెడలినారని చెప్పి శ్రీ బాబాగారు భక్తులారా మహాదేవియే మహా మాయ. ఆమెయే మాయగాను (అవిద్యగాను), మాయను తొలగించునది (విద్య) గాను వ్యవహరించగలదు. ఈ విద్యాగీతను శ్రద్ధతో విని పునీతులుకండి అని ఆశీర్వదించుచూ శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారికి జయజయ నాదములు చేసినారు.

శ్రీ దత్తానుగ్రహము లేకున్న దత్తక్షేత్రమందు అడుగే పెట్టలేమనగా దత్తుని బోధలు ఈ నాడు శ్రీ బాబాగారి ద్వారా వినగలిగిన మనమంతా ఎంతో ధన్యులమని తలచుకొన్నాము.

# 10వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

## శ్రీపాదుల దివ్యసంకల్పం

మరునాడు శ్రీపాద స్వామి ఇట్లు తెలిపినారని శ్రీ విఠల్ బాబాగారు ప్రారంభించినారు. సాధకులారా! మహాదేవి పరజ్ఞానమును తెలిపిన తదుపరి అపర జ్ఞానమును గురించి ఇట్లు చెప్ప దొడంగెను. కొందరు శ్రవణంచేతగాని, తర్కము చేతగాని దేహేంద్రియముల తత్త్వవిచారణ చేసి వీనికి అతీతమైన కేవల చిదాత్మయొక్క స్వరూపమును బుద్ధిచేత నిశ్చితముగా గ్రహించుట అపర జ్ఞానమనబడును. దీనినే పరోక్ష జ్ఞానమని గూడ అంటారు. దీనిని పొందినవాడు దేహాత్మ భావము అనగా దేహమే నేనను భావము నుండి విడివడును అని తెలిపినది.

తదుపరి పరజ్ఞానమును పొందినంతనే సకల దుఃఖములు నశించునని త్రిపుర సుందరి యొక్క కృపను ఇట్లు తెలిపెను. **ఎచ్చటను దేనివలనను భయము కలుగకుండుటయే మోక్షము.** ఇది తేలు, ఇది పాము, పులి అని తోచుట భయము కలిగించు చున్నది. ఆత్మకన్నా అన్యము లేదని రూఢిగా తెలిసిన వానికి వ్యవహార దశ యందు గూడ సూర్యోదయముతో చీకటి మాయమైనట్లు తనకన్నా రెండవ వస్తువే తోచదు. సర్వత్రతానే యున్నట్లు భాసించును. కావున ఆత్మజ్ఞానమునకు భిన్నమైన జ్ఞానములన్నియు భయకారణములే. అభయమే మోక్షము. మోక్షమే సకల సాధనలకు ఫలము. **తెలిసికొనువాడు, తెలిసికొనుట, తెలిసికొనబడు విషయము దానివలన కలుగు ఫలము** అను నాలుగున్నూ ఎప్పుడు ఒక్కటిగా తోచునో అప్పుడు మోక్షము కలిగినట్లు చెప్పబడును. భేదభావము నశించునంతవరకు సంసారము నశించదు. ఇందుకు ప్రత్యేకమైన బాహ్య వస్తు సామగ్రితో ఎట్టి పనియు లేదు. లోనున్న ఆత్మయొక్క అనగా తన స్వరూప జ్ఞానము పొందుటయే ముఖ్యము. ఈ జ్ఞానమును పొందిన తత్క్షణమే కొండంత సంసారము పిండియై గాలిలో కలిసిపోవును.

ఇటువంటి అపరజ్ఞానమును పొందవలెనను దృఢమైన సంకల్పమే అసలైన సాధనము. ఇట్టి సంకల్పము దృఢముగానిచో ఇతర సాధనములన్నియు నిష్ప్రయోజనమే. ఎట్లయినను ఈ జ్ఞానమును నేను పొందెదనను దృఢ నిశ్చయంతో, ఎవడు తత్పరుడై యుండునో వాడు అన్ని విధముల ముక్తుడే. క్రమముగా అట్టివాడు కొన్ని దినములలోనో, సంవత్సరములలోనో లేక జన్మాంతరములోనైనా ముక్తుడగుచున్నాడు.

బుద్ధియొక్క నిర్మలత్వము లోని భేదములనుబట్టి ముక్తి ఇప్పుడు గాని మఱికొంత కాలమునకైననూ గాని సంభవించుట తథ్యము. సాధనా మార్గమందు పయనించువానికి సకల పురుషార్థములను నశింపజేయు నట్టి దోషములు బుద్ధియందు అనేకములుండును. ఆ దోషముల చేతనే సాధకులు గానీ, సాధారణ వ్యక్తులు గానీ ఎల్లప్పుడు ఘోరమైన సంసారమునందు తాపములను పొందుచున్నారు.

ఇవి ముఖ్యంగా మూడుగా విభజించినారు. వినుడు. (1) అనాశ్వాసము (2) కామవాసన (3) జడత్వము అని ఈ మూడునూ జనుల బుద్ధిని ఆవరించి మూఢులను చేయుచున్నవి. (1) ఇందు మొదటిదైన **అనాశ్వాసము** నందు రెండు ముఖ్యదోషములున్నవి. **సంశయము** మరియు **విపర్యయము** అని ప్రతీతి. సంశయము అనగా మోక్షమన్నది ఉన్నదో లేదో అని భావించుట. విపర్యయమనగా ఉన్నదానిని లేదని తలంచి (నమ్మి) ప్రయత్నమును విరమించుట. సాధకుడు ఈ దోషమును అధిగమించవలయు నన్నచో పెద్దల సాంగత్యము ద్వారా మోక్షమున్నదని తెలిసి నిశ్చల మనస్సుతో విశ్వసించుట సాధనయందు అమితమైన శ్రద్ధ వహించుట ద్వారా ఈ దోషము నివారించుకొనగలడు.

(2) రెండవ దోషమైన **కామవాసన** యనునది మనసునకు సంబంధించినది. కావున మనసునందు వివేక, వైరాగ్యములు కలిగినచో శ్రవణం చేయుటకు, శ్రవణం చేసిన విషయమును మనన మొనరించి బుద్ధియందు నిక్షిప్తము చేయుటకు అనుకూలమేర్పడును. ప్రతి క్షణము సాధకుడు ఈ దోషములను బుద్ధియందు చేరనీయకుండ జాగ్రత్తపడవలెను.

(3) ఇక మూడవ దోషము జడత్వము. ఇది బుద్ధికి సంబంధించినది. ఈ దోషమువలన ఎంత గొప్ప జ్ఞాన బోధయైనను బుద్ధికెక్కదు. **ఆత్మ దేవతా స్వరూపిణియైన నా యొక్క సేవ చేత తప్ప వేరు విధముగా జడత్వమన్నది నివారించబడదు. కాబట్టి సాధకుడు దీని నుండి దూరమగుటకు నా స్వరూపంగా గురుసేవను తప్పక సేయవలెను.** ఆతనియందున్న భక్తి, శ్రద్ధలను బట్టి జడత్వము క్రమంగా గాని, వెంటనేగానీ లేక జన్మాంతరమందుగానీ నశించిపోవును. అట్లు జడత్వము నశించగానే సకల విఘ్నములు తొలగిపోవును. అతడు కృతార్థుడగును. అట్లుగాక సర్వబుద్ధి ప్రచోదనమునకు కారణమైన నన్ను గుర్తింపక మూఢుడైన వాడు ఇతర సాధనములెన్ని అవలంభించినను విఘ్నములనే పొందును. కావున ఋషులారా! సేవా తత్పరత్వమే బుద్ధి దోషములను జయించుటకు మార్గము అని తెలిపెను.

విద్యా రూపిణియైన త్రిపుర తన మహిమను సాధకులకొరకు ఇట్లు వివరించి సాధకులలో సేవా తత్పరతే సాధనా పటిమను పెంచి శ్రేష్ఠత్వమును చేకూర్చును అనియు లోకమందు ఎల్లరచేతను అట్టివాడు పూజించబడును, శ్లాఘించబడుననియూ చెప్పి తదుపరి విషయమునిట్లు వివరించసాగెను.

ఋషులారా! ఇక సిద్ధి విషయమై వినుడు. సాధకుని యందు ఆత్మజ్ఞానము సిద్ధించుటయే అసలైన సిద్ధి. ఇది కలిగిన తర్వాత అతనికి కావలసినదంటూ ఈ సృష్టిలో ఏదీ ఉండదు. సాధారణముగా సాధన సమయంలో లభించు అణిమాది సిద్ధులను ఆతడు తృణప్రాయంగా చూచి ప్రక్కకు నెట్టివేసిన గానీ ఆత్మజ్ఞాన సిద్ధి లభించదు. అట్టి ఆత్మజ్ఞానికి దుఃఖ, భయ, శోకాదులు లేశమైనను లేవు. అట్టి తరి ఆతడు బ్రహ్మానందము ననుభవించుచుండ ఈ సిద్ధులన్నియు ఆతని పాదముల వద్ద పడి వుండును.

తర్వాత సిద్ధియొక్క పరాకాష్ఠను గురించి విద్యారూపిణియైన పరమేశ్వరి యిట్లు వచించెను. ఇటువంటి ఆత్మ జ్ఞానమును సిద్ధింపజేసుకొన్నవారు ఎందరో రాజ్య పరిపాలనాది వ్యవహారములందు నిమగ్నమై సమాధిగతులు కాలేకున్నను, లేక ప్రయత్నింపకున్నను వారి మనస్సు స్వరూపస్థితి (సమాధి స్థితి) యందే యుండును. అదియే **ఉత్తమ జ్ఞాన సిద్ధి.** కొందరు సకల వ్యవహారములను చేయుచున్నను మధ్యలో సమాధిస్థితిని పొందుచుందురు. **ఇది మధ్యమ జ్ఞాన సిద్ధి.** కొందరు సకల వ్యవహారములను వదలి నిరంతరం సమాధియందుండవలెనని అభిలషింతురు. **అది అధమమైన జ్ఞానసిద్ధి.** ఈ మూడింటిలో ఉత్తమమైనదే జ్ఞానసిద్ధికి పరాకాష్ఠ. సకల వ్యవహారములయందునూ ప్రవర్తించుచు తన మనసునందు ఏ వ్యవహారముంచుకొనక శుద్ధ చిన్మాత్రముగ నుండువానికి వాసనల యొక్క ప్రకోపముకలుగదు. అందుచేత సంకల్పములుండవు. తనకై ఏ సంకల్పం లేకున్నను లోక సంగ్రహ దృష్టితో శాస్త్రము ననుసరించియే ప్రవర్తించును. **ఇది జ్ఞాన సిద్ధుని పరిస్థితి.** ఎవడు సకల వ్యవహారములను చూచుచుండియు దేనినీ ఆత్మకన్నా భిన్నంగా తలంపడో అట్టివాని **జ్ఞానసిద్ధి పూర్ణము.**

**సిద్ధులలో ఉత్తముడు:**

**ఇటువంటి జ్ఞాన సిద్ధిని పొందిన వాడు మాత్రమే సిద్ధులలో ఉత్తముడు. తన యొక్క అనుభవము చేత అనేక విధములుగా వుండు జ్ఞానులయొక్క స్థితి భేదములను గ్రహించుచుండును. ఇతనికి కోరిక గాని, సంశయము గాని లేవు. వ్యవహారములందితడు నిర్భయుడై సుఖమును,**

**దుఃఖమును స్వప్న వస్తువులవలె తనయందే చూచు చుండును. బంధము అసత్యమగుటను తాను తెలిసికొన్నందువలన అతని దృష్టియందు ఎవ్వడునూ బద్ధుడు కాడు. కావున ఉత్తమ జ్ఞాని ఒకడు బద్ధుడనీ, ఒకడు ముక్తుడనీ భేదముతో చూడడు. ఎవనికిని మోక్షము కావలయునని తలంపడు. మోక్షము అన్నది ఒకరిచ్చునది కాదు. ఎవరికి వారు సాధనచేత పొందవలసినదని తలంచి సర్వత్ర సమదర్శనుడై యుండును. అటువంటి ఉత్తమ జ్ఞాని నాయందే జీవించును. నేనాతని యందు విలసిల్లెదను. మా యిరువురకు భేదము లేదు.**

ఋషులారా! మీరడిగిన వన్నియు స్పష్టముగా తెలిపితిని. గ్రహించితిరా! వీనిని తెలిసికొన్నవాడు ఎన్నడును భ్రాంతిని పొందడని తెలిపి ఆ మాత (శబ్దమయి) ఆపివేసెను. ఋషులు లబ్ధజ్ఞానులైరి. అందరూ త్రిమూర్తులకు నమస్కరించి తమ తమ నెలవులకు పోయిరి.

శ్రీపాద శ్రీవల్లభస్వామివారు శ్రీదత్తునిచేత భార్గవ రామునకు బోధించబడిన విద్యాగీతను తెల్పగా అందరూ విన్నారు.

విద్యాగీత వినిన వెంటనే అందరికీ తామెంతటి తప్పు చేశామన్న విషయం అర్థమై తలలు వంచుకొని ఏమీ మాట్లాడుటకు వీలుగాక మౌనంగా వుండిపోయారు అందరూ.

శ్రీపాద స్వామి వారు తిరిగి ఈ విధంగా చెప్పసాగిరి.

"ప్రతీ విషయము అభ్యాసము చేయునపుడు కొద్దిగా అవగాహన గలుగుట సహజమే! కాని అవగాహన కల్గినంత ప్రమాణము చాలా గొప్పదిగాను, అధికముగాను అనిపించి త్రప్పుదోవ పట్టిస్తాయి. దీనిని మరొక విధముగా చెప్పవలెనన్న "తెల్సినది అణువంత – తెలియవలసినది ఆకాశమంత". పూర్వము భారధ్వాజ మహర్షి వేదాధ్యయన సంఘటన బహుశ మీ అందరి మస్తిష్కాల నుండి దూరము కాలేదని తలుస్తాను. అఖండమైన వేదరాశి నుండి పరమేష్ఠి ప్రసాదించిన మూడు పిడికెళ్ళ వేద అధ్యయనం ఆయనకు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇందు గమనించవలసిన విషయం ఏమనిన జ్ఞాన సముపార్జనకు అంతులేదు. అందువలన ఏ వ్యాసంగ మందును "మేము నిష్ణాతులము" అని గర్వపడరాదు. సద్గురుని అనుగ్రహమువలన అందరూ జ్ఞాన సంపద వృద్ధియగునట్లు ప్రయత్నించి, కృషిచేసి సాధించవలెను. దీనికి శ్రద్ధ, విశ్వాసము చాలా చాలా ముఖ్యమైనవి.

శ్రీ దత్తాత్రేయులవారి ముఖతః వినిపించిన ఈ విద్యాగీతను శ్రవణంచేసిన భార్గవరాముడు ఆది గురువునకు నమస్కారము చేసి నిలచెను అని శ్రీపాద స్వామివారు అచ్చట చేరిన సాధు సమూహమునకు వివరించినారు. అందరూ జయజయ నాదములు చేసినారు.

అని శ్రీ విఠల్‌బాబాగారు తమ సుదీర్ఘ ప్రవచనమును చేసినారు. ఇంతటి గహనాతి గహనమైన, నిగూఢమైన శ్రీ విద్యాగీతయను రహస్యము త్రేతాయుగమున మన సాంప్రదాయ మూలపురుషుడైన శ్రీ దత్తా త్రేయస్వామి వారిచేత భార్గవునకు ప్రబోధించబడినది. కలియుగ ప్రథమ దత్తావతారునిచేత పవిత్ర శ్రీశైల క్షేత్రమునందు సాధుపుంగవులకు నిర్వచించబడినది. ఈనాడు శ్రీపాదవల్లభుల అనుగ్రహంతో మనము చెప్పుకొనగలిగితిమి. ఇంతటి మహాభాగ్యము మనకు కలిగించిన శ్రీపాద స్వామివారికి కోటికోటి ధన్యవాదములు చెప్పుకొందుము అని "దిగంబరా.. దిగంబరా ... శ్రీపాద వల్లభ దిగంబరా" యని జయ జయ నాదములు చేసి ఆనందపారవశ్యంతో ఉప్పొంగిపోయినారు.

అందరమూ నామస్మరణముతో శృతి కలిపినాము.

శ్రీపాదస్వామివారు నాలుగు మాసములు శ్రీశైల క్షేత్రంలో వున్నారు. ఒక్కొక్క రోజు ఆ కొండ చుట్టు వున్న అటవీ ప్రాంతంలో ఒక్కొక్క ప్రదేశమునకు వెళ్ళేవారు. కొన్ని వందల వేల సంవత్సరముల నుండి అచ్చటనే తపోనిష్ఠలోనే వుంటూ బయటి నుండి వచ్చు భక్తులుగాని, దొంగలు గాని, వనమూలికలు సేకరించే కొండజాతివారుగాని ఎవ్వరి కంటికీ గోచరించకుండా ఎందరో మహాత్ములు పెద్ద పెద్ద వృక్షాల రూపంలోనో లేక కొండ శిలల రూపంలోనో వుంటారు. వారిని ఎవ్వరూ గుర్తించలేరు. అటువంటి మహా తపస్సంపన్నులైన వారు శ్రీ స్వామివారు తమ ప్రదేశానికి వచ్చినారని తెలిసి నిత్యము వారి దర్శనం కొరకు ధ్యానంలో కోరుచున్నారు.

ఆ విధమైన ప్రార్థనల స్పందనలు శ్రీ స్వామివారికి చేరుచున్నవి. కావున వారిని అనుగ్రహించుట కొరకు శ్రీపాదస్వామి స్వయంగా వెళ్ళి వారివద్ద నిలిచారు. పరమానంద భరితులై అచ్చట తపస్సు చేస్తూ వుండే స్వాములు తమ స్వస్వరూపం ధరించి శ్రీ స్వామివారి అలౌకిక సౌందర్యమును తనివితీరా ఆస్వాదించి ఆనందపరవశులైనారు.

శ్రీపాదుల ముగ్ధ మోహన స్వరూపమును దర్శించిన ఆ మహాత్ములు "వందల వేల సంవత్సరాల మా తపస్సులు, మా నిరీక్షణ నేడు ఫలించినది హే! దత్తా! నీవు సంచారం చేస్తూ వచ్చి మాకు దర్శనమిచ్చుట సమకూడునని ఎదురుచూస్తు మేము వేచియున్నాము. స్వామీ! నీ దయ అపారము, అద్వితీయము. నీ దీన జనోద్ధరణ కార్యమునందు మావలన ఏదైనా సహకారము జరుగగలదన్నచో మాకు నీ ఆదేశములు అవశ్యం శిరోధార్యములు" అని శ్రీపాదులవారిని శ్లాఘించినారు.

శ్రీపాదులవారు ఆ మునీశ్వరులను అమృత దృష్టితో వీక్షించి "తమకు తెలియని ప్రపంచము ఎక్కడనూ లేదు. మీ దృష్టికి సర్వము విదితమే. కలియుగ మందు కలహములే నెలకొనును. అటువంటి కలిపురుషుని ప్రభావమును తగ్గించుటకు సద్గురువుల దయాదృష్టి యొక్క అవసరం వున్నది. తమరున్న చోటనే వుంటూ అదృశ్యంగానే మీ తపోశక్తిని వినియోగించి శ్రీశైలం క్షేత్రానికి వచ్చు భక్తులందరికీ గురువులయందు భక్తి విశ్వాసములు ఏర్పడవలెనని సంకల్పం చేయండ"ని వారికి కొంత కర్తవ్యాన్ని బోధించినారు. ఆ మహాత్ములు ఈ విధమైన దివ్య సంకల్పమును విని "సాధు! సాధు! శ్రీపాద శ్రీవల్లభ! నీ దివ్య ప్రభావము లోకమంతయు వెలయుగాక!"యని పలికి వారి అనుమతిని తెలిపినారు.

ఈ విధంగా శ్రీపాదులవారు మహాత్ములను పలకరించాలని సంకల్పించినప్పుడు ఎవరికీ చెప్పకనే వారు స్వయంగా వెళ్ళేవారు.

ఒకసారి సింగన్నదొరను, నిర్మలానంద బ్రహ్మచారిని వెంట తీసుకొని హతకేశ్వరం వెళ్ళుచున్నారు. దారి పొడవునా అనేక మూలికల ఉపయోగములను గురించి మాట్లాడుచూ పోవుచుండగా సింగన్నదొర కూడ తనకు తెలిసిన వనమూలికల గురించే మాట్లాడుచు నడుస్తున్నాడు. హఠాత్తుగా శ్రీస్వామి వారొక చోట ఆగి మీరిక్కడే కొంతసేపు ఉండండి. కొందరు పెద్ద మనుషులు నాకొరకు వేచియున్నారని వారికి చెప్పి గబగబా పెద్ద పెద్ద అంగలువేస్తూ కొన్ని చెట్లు చాటుకు వెళ్ళినారు. అచ్చట రెండు పెద్ద పులుల రూపాలు సింగన్నకు, బ్రహ్మచారికి కనిపించెను. శ్రీ స్వామివారీ విధంగా పులులున్న చోటికి వెళ్ళుచున్నారేమా! అని ఆశ్చర్యంగా చూస్తున్నారు దూరం నుండి.

ఆ రెండు పులులున్నూ శ్రీ స్వామివారికి నమస్కరించుకొన్నవి. శ్రీ స్వామివారు "మహాత్ములారా! ఏమీ ఇట్లు వచ్చినారు! తమరికేమి కావలెనని" ప్రశ్నించినారు. వారు "తండ్రీ! శ్రీపాదా! నిన్ను దర్శింపవలెనని మాత్రమే కోరి వచ్చినామ"ని వారు చెప్పినారు. శ్రీపాదస్వామి "ఆర్యులారా! తమరు శ్రీశైల దర్శనమునకు వచ్చు భక్తులకు సకల శుభములు కలగాలని క్రమంగా వారందరు ముందుముందు కాలంలో శివదీక్షలు పూని సద్గుణ సంపన్నులు కావాలని సంకల్పించండి. తమ తపశ్శక్తిని లోకకల్యాణానికి ధారపోయుటయే తమ కర్తవ్యం"అని వారికి బోధించుటను దూరంనుండి సింగన్నదొర, నిర్మలానంద బ్రహ్మచారియు వినుచునే యుండిరి. తరువాత ఆ పెద్దపులులు రెండునూ అంతర్ధానం అయిపోగా శ్రీ స్వామివారు తిరిగి వచ్చి

బ్రహ్మచారితోను, సింగన్నతోను "పదండి! పోదాం!" అన్నారు. వారు నడక ప్రారంభించిన తర్వాత సింగన్న "స్వామీ! ఇదేమి! తమరు ఎవరో పెద్ద మనుషులను కలవాలని పోయి పెద్దపులులను కలిశారు. మాకు చాలా భయం వేసింది. నేను అచ్చటికి రావాలని ప్రయత్నిస్తే నిర్మలానంద స్వామి నన్ను వద్దని ఆపినారు. వారెవరు?" అంటూ ప్రశ్నించాడు. చిరునవ్వులతో శ్రీ స్వామివారిలా సెలవిచ్చారు. "సంభాషణంతా మీరు విన్నారుగా. ఇదెవ్వరికీ చెప్పవద్దు. మహాత్ములైనవారు ఈ ప్రపంచంలో ఎప్పుడేరూపం ధరించగోరితే ఆ రూపం ధరిస్తారు. వారు ఎప్పుడో జ్ఞాన సిద్ధిని పొంది ముక్తులైనవారు. వారిని గూడ లోకకల్యాణ సంకల్పం చేయమని కోరాను" అన్నారు.

అప్పుడు సింగన్న "అవును స్వామీ! మీ సంభాషణ అంతయూ విన్నాము. మేము మీ వెంట వున్నందుకు వారు ఆ రూపాలతో వచ్చినట్లున్నారు. కానీ స్వామీ! రేపెప్పుడైనా మాకు పెద్దపులి కనిపిస్తే మరి మేము చంపివేస్తాము గదా. అది క్రూర జంతువు. ఇతరులకు హాని చేస్తుందని మా భయం. ఇప్పుడీ సంఘటన చూచిన తర్వాత మరి నేను పాపం చేస్తానేమోనన్న భయం కల్గుచున్నది" అన్నాడు.

శ్రీ స్వామివారు నవ్వి మహాత్ములు నిరంతరం పెద్దపులి రూపంలో సంచరిస్తారనుకొన్నావా. వారిప్పుడు మాత్రమే అట్లు వచ్చినారు. అని పలికి అయినను నీవు పెద్దపులులనే కాదు. ఏ క్రూర జంతువులైనను నీ కంట పడినప్పుడు నన్ను స్మరించుకో! నీవు వాటిని చంపే పనిపడదు. అవి దూరంగా పోతాయిలే! అని వరమిచ్చారు. నిర్మలానంద బ్రహ్మచారికిన్నీ, సింగన్న దొరకున్నూ ఆశ్చర్యానికంతులేకుండా పోయిందని చెప్పి శ్రీ బాబాగారు తర్వాత ఇలాగన్నారు.

"ఆ పులుల రూపాలతో మహాత్ములు వచ్చి శ్రీస్వామితో సంభాషించడం, ఆ సంభాషణమంతయూ వీరిద్దరికీ వినిపించడం ఇదంతా శ్రీపాదులవారి లీలయే. వారి సంకల్పం లేకుంటే ఆ దృశ్యంగానీ, ఆ మాటలుగానీ ఎవ్వరికీ కనిపించదు. వినిపించదు. శ్రీదత్తస్వామి లీలలెన్ని చెప్పుకొన్నను సముద్రంలో నీటిబొట్టు మాత్రమే. వారి సంకల్పం చేతనే మనమిప్పుడు వారి లీలలు చెప్పుకోగలుగుచున్నాము" అని ఆనందముప్పొంగగా ప్రవచించినారు. తర్వాత ఇలా చెప్పారు.

"శ్రీ స్వామివారు ఒక్కొక్క రోజు వారిని వెంట తీసుకొని వెళ్ళేవారు. ఒక్కొక్క రోజు శ్రీస్వామి ఎవ్వరికీ చెప్పకుండా అదృశ్యంగా తలంచిన చోటికి వెళ్ళి వచ్చేవారు. ఆ విధంగా వారు ఆ చుట్టు పట్టు క్షేత్రములైన త్రిపురాంతకం పోయివచ్చారు. అట్లే ఉమామహేశ్వర క్షేత్రానికి పోయివచ్చారు.

నిత్యకృత్యముల అనంతరం దైవ దర్శనంకు వారెక్కడకు పోవాలని సంకల్పిస్తే అక్కడకు వెళ్ళేవారు. ఈ సంగతి తర్వాత అక్కడి భక్తులు ఈ క్షేత్రానికి వచ్చినప్పుడు వీరి సత్సంగంలో పాల్గొని ఈ స్వామివారు ఆ క్షేత్రంలో దర్శనమిచ్చినారని చెప్పగా విని అందరూ ఆశ్చర్యపోయినారు. శ్రీ స్వామివారు మాత్రం ఏమీ ఎరగనట్లుండిపోయేవారు.

ఆ నాలుగు మాసాలలో శ్రీ స్వామి తపశ్శక్తి, మహిమలు వారికి ఎన్నో అనుభవంలోనికి వచ్చినవి. సింగన్న దొర కొడుకుకు, బిడ్డకు అంగవైకల్య నివారణ జరుగుట అచ్చట మొదటి మహిమా ప్రకటనం.

శ్రీపాద స్వామివారు ఈ విధంగా దీపావళి వరకు అప్పుడప్పుడు అడవిలో సంచరిస్తూ అప్పుడప్పుడు సాధకుల సత్సంగంలో పాల్గొంటూ గడిపినారు. కార్తీకమాసం ప్రారంభమైన తర్వాత శ్రీ స్వామివారు ఒక రోజున త్రిపురాంతకమునకు, ఒక రోజు ఉమామహేశ్వరం పోయి దర్శించి వచ్చారు. ఒక రోజు వారు కదళీ వనమునకు పోవాలను సంకల్పాన్ని బయటకు చెప్పగా కొందరు సాధకులు తాము గూడ వచ్చెదమని కోరినారు. వారందరినీ అనుమతించగా అందరూ కలిసి పాదయాత్ర సాగించారు. కొంతదూరం పోయిన తర్వాత శ్రీ స్వామి వారు తమతో వచ్చిన వారి అలసటను గ్రహించినారు. అందుకని వారందరితో ఇట్లు చెప్పిరి. మీరందరూ ఇచ్చటనే నిలబడండి. ముందుముందు దారి చాలా దుర్గమముగా వుండును. కాబట్టి నేను పోయి అచ్చట మహాత్ములను పలకరించి వస్తానని చెప్పగా వారు అచటనే ఆగినారు. శ్రీ స్వామి వారు అచ్చటి నుండి కొంచెం ముందుకు పోయినట్లే పోయి అక్కడే అదృశ్యమైపోయినారు. రెండు మూడు గంటల తర్వాత శ్రీ స్వామి వారు భక్తులు, సాధకులున్నచోటికి రాగా అందరూ ఆశ్చర్యంగా అంతటి కీకారణ్యంలోనికి దారి చూపేవారు లేకుండా ఒక్కరే పోయివచ్చినారంటే చాలా ఆశ్చర్యపోయినారు.

ఆ కీకారణ్యంలో శ్రీ స్వామివారు ప్రవేశించగానే అచ్చటనే తపస్సు చేస్తూ వుండే కృపాచార్యుల వారు ప్రకటమై శ్రీపాదులకు, అభివాదము చేసినారు. శ్రీ స్వామివారు ప్రసన్నులై చిరునవ్వులతో "ఏమీ మహాత్మా! తపస్సంకల్పములు చక్కగా నెఱవేరుచున్నవి గదా! యని ప్రశ్నించగా "శ్రీ దత్తా! ఎంతదయామయుడవయ్యా! ఆనాడు కైలాసమందు భువిని దివిగా మార్చు దివ్య ప్రణాళిక నిర్ణయించినావని విని ఎంతో సంతోషించితిని. ద్వాపరమందే రాజ్యకాంక్షలు, కలహాలు మిక్కుటమై మహాభారత యుద్ధమునకు దారితీసినవి. అటువంటిది కలియుగంలో సుస్థిరశాంతి స్థాపన ఎట్లు చేయ నిశ్చయించి నావో ఆ వ్యూహము మాకెవ్వరికినీ అర్థముకాని విషయమే. నీ లీలలు నీకు

దప్ప ఎవ్వరికీ తెలియవు" అని ప్రస్తుతించగా శ్రీపాద స్వామి ఆర్యా! తమరు తపస్సంప న్నత్వము చేత పాప ప్రక్షాళనము గావించుకొన్నారు. ఇకపైన యుగాంతము వరకు తమ తపస్సు ప్రజల మనస్సులలోని పాపములు ప్రక్షాళనం కావాలని సంకల్పించి లోక కల్యాణమునకు దోహదం చేయండి. ఇందుమూలంగా రాబోవు కృతయుగమందు తమరు గొప్ప పుణ్యపురుషులుగా అవతరించగలరని ఆశీర్వదించగా కృపాచార్యులు సంతోషంతో లోకకల్యాణమునకు తప్పక తపస్సు చేస్తానని తెలిపెను.

ఆ తర్వాత శ్రీ స్వామివారు లేనప్పుడు నిర్మలానంద బ్రహ్మచారి, సింగన్నదొర తమకు తెలిసిన మహత్తులు చెప్పగా విని అందరూ శ్రీస్వామి వారి శక్తియుక్తులను మనం ఏ విధంగానూ అంచనా వేయలేమని నిర్ణయించు కొన్నారు. శ్రీశ్రీశ్రీ అభేదానంద సరస్వతి స్వామి వారు మాత్రం మౌనంగా చిరునవ్వులు నవ్వుచూ శ్రీ స్వామి వారిని కన్నులార దర్శించుచు పరవశించారు. ఒకనాడు శ్రీపాద స్వామివారు ఇట్లా చెప్పారు.

"మనము భుజించే ఆహారమునే ఔషధమంటారు. ఇవన్నీ వన మూలికలే. మూలికలలో జ్ఞాన మూలికలు, అజ్ఞానమూలికలని రెండు విధములుగా వుంటాయి. సామాన్య భాషలో వాటిని "భోజ్యములు" మరియు "అభోజ్యములు" అనగా తినుటకు యోగ్యమైనవి గాను, యోగ్యము కానివిగాను చెప్తారు. జ్ఞాన మూలికలను స్వీకరించుట వలన మనలోని ఓజస్సు, తేజస్సులు వృద్ధి అయి మన జప, తపో, సాధనలు సరైన మార్గములో సాగుతాయి. మరి వీటిని వర్గీకరించుటకు మానవుల బుద్ధి లేదా వివేకములపై ఆధారపడెదరు. ఎంతటి బుద్ధి, వివేకవంతుల కైనను (నూతనముగా) దేనినైనా చూచినప్పుడు దాని గురించి పూర్తి అవగాహన కలుగదు. అందుకుగాను ముందుగా ఆ విషయమును తెలిసియున్న వ్యక్తి ద్వారా మార్గదర్శనము పొందవలసియుండును.

అదే విధంగా అభోజ్యములైనటువంటి వనమూలికలను తెలియక తినుటవలన అనేకమైన రుగ్మతలు కలుగుతాయి. మానసిక, శారీరక రుగ్మతలు ఏర్పడతాయి. సామాన్యమైన వాటివలన అనారోగ్యము, విషపూరితముల వలన ఉన్మత్తులుగా (పిచ్చివారు)గా మారుటవంటి ఎన్నో అపాయములు కల్గును.

ఇచ్చట నాకు ఆహారమును బ్రహ్మచారి నిర్మలానంద సమకూర్చుచున్నాడు. అతను అరణ్యమందు అన్ని ప్రదేశములయందు తిరిగి తినుటకు అనువైన కందమూలాదులను వెదికి తీసుకొని వచ్చి శుభ్రముచేసి నాకు అందించుచున్నాడు. మీకందరకు ఈ విషయము అవగతమే.

శ్రీశైలంలో అడవిలో మనకు లభించు ఆహారం కందమూలములేగదా. పక్వ ఆహారములు, ఫలములు అందరికీ లభించవు. మీరు ఎట్లు భోజ్యములను స్వీకరించి అభోజ్యములను వదలివేయుదురో సాధనయందు గూడ ఉత్తమ, మధ్యమ, అధమములైన వానిలో ఉత్తమ సాధనలను స్వీకరించి సర్వేశ్వరునికి ప్రీతిపాత్రులుకండి. సిద్ధులకొరకు చేయు సాధనలు మధ్యమములు. ప్రజల మన్ననలు, సన్మానములు ఆశించి చేయు సాధనలు అధమములని శాస్త్రవాక్యము. తంత్ర ప్రయోగములతో భూతప్రేత, పిశాచములను వశీకరించుకొనుట, ప్రజలను భయభ్రాంతులను చేయుట అన్నవి అధమాధమ సాధనలు. వాటివలన తిరిగి మానవ జన్మకు దూరమైపోవుదురు అని వివరించిరి.

మీరు మీమీ గురువుల నుండి పొందిన దీక్షలను వారి వారి పర్యవేక్షణలో కొలదికాలము సాధన చేసిన పిదప, వారి వారి ఆజ్ఞానుసారము మీకు నిర్దేశించబడిన ప్రదేశములలో మీ సాధనను కొనసాగించి సిద్ధిని పొందుట సాంప్రదాయము. అలాగే మీరందరు ఇచ్చట చేరి ఈ క్రతువులు నివర్తించు చున్నందుకు లోక కల్యాణము కలుగును. ఇచ్చట మార్గములు భిన్నముగా నుండినను గమ్యము మాత్రము ఒక్కటే! అచ్చటికి (గమ్యానికి) చేరినవారు ఈ తారతమ్యములను పరిగణించరు. ఈ మార్గములయందు ప్రయాణించువారలు ఎవరూ గొప్పవారు కాని తక్కువ వారు కాని కారు. వారి వారి మానసిక స్థితి, పూర్వ కర్మల రీత్యా వారికి తగు సమయమందు గురు సమాగమము మరియు గురు మార్గ నిర్దేశనము జరుగుతుంది. అందువలన అన్ని మార్గములు శ్రేష్టమైనవే! వాటి గురించి తర్కమును వాదములను విడిచిపెట్టి సాధనోన్ముఖులు కావాలి – అందువలన త్రిపుర చెప్పిన విద్యాగీత ననుసరించి యోగశ్రేష్ఠులు కండి!"

శ్రీపాద స్వామివారు చెప్పిన ఈ వివరణను విని అచ్చట నున్న వారందరూ – సాధు! సాధు! అనిరి.

"శ్రీపాదా! సమర్థ సద్గురువన్న నీవే! ఈ రోజు కదా మా సాధనలు ఫలించినవి! ఇంతటి సద్గురుని సన్నిధానం మాకు సర్వదా అభిలషణీయం! సర్వకాలములందు మాతో వుండి మార్గదర్శనము చేసి రక్షించు స్వామీ!" అని ప్రార్థించినారు మిగతావారు – మహత్తరమైన మహిమాన్వితములై జగన్మాత ప్రభావం ఈ జగత్ ప్రభువులవారి నోట వినడం మా సాధనల ఫలితం మా గురువుల దీవెనలు అని తమలో తాము చెప్పుకొనినారు. శ్రీపాద స్వామివారిని మనసున దలంచుటతోనే అమితానందము గలుగుచున్నదని చెప్పుకొనిరి.

శ్రీపాద స్వామికి జయజయ నాదములు చేయుటతో ఆనాటి సభముగిసినది.

శ్రీపాదులవారి దక్షిణ పర్యటనలో అతి ముఖ్యమైన జ్ఞాన బోధ శ్రీశైల క్షేత్రమందు ఈ విధంగా జరిగినది. గావుననే ఆ క్షేత్రమునకు అద్భుతమైన వైభవం కలిగినదని శ్రీ బాబాగారు పలికిరి.

## అశ్వత్థామ

శ్రీశైలక్షేత్రంలో చాతుర్మాస వ్రతము పూనినవారలు ఒక ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలను రూపొందించుకొని దాని ప్రకారం వ్రతాచరణం చేస్తూ వున్నారు. కానీ శ్రీ స్వామివారి వ్రతం వేరు. వారిది లోక రక్షా దీక్ష. శ్రీపాద స్వామివారు వీబూది మఠమందు ఉంటున్నారు. పగలంతా ఎక్కడెక్కడో సంచరిస్తూ సత్సంగ సమయానికి వచ్చిన రోజు అందరికీ జ్ఞానబోధలు చేస్తారు. మిగిలిన సమయాలలో సత్సంగము అక్కడ చేరిన వారిలో పెద్దలు, ఔత్సాహికులు అనేకమైన సూత్ర భాష్యములు వివరిస్తూ బోధిస్తారు.

నిర్మలానంద బ్రహ్మచారి శ్రీ స్వామివారి మహిమావిస్తారం చేత బాగా ఆకర్షించబడినాడు. కాబట్టి సింగన్న దొరను వెంట తీసుకొని అడవియంతా తిరిగి మంచి కందమూలములు, పండ్లు తెచ్చి శ్రీ స్వామికి సమర్పిస్తూండేవాడు. శ్రీపాదులవారు గూడ అతని వినయ విధేయతలకు ప్రసన్నులై ఒక్కొక్కసారి తమతో అడవిలో సంచారానికి తీసుకువెళ్ళేవారు.

ఇలావుండగా ఒకరోజు విబూధి మఠమునందు శ్రీపాద స్వామి వారుండగానే ఒక వింత జరిగెను. శ్రీపాదులవారు అందరితో ఇట్లనిరి. మీరందరూ ఇక్కడే నిశ్శబ్దంగా కూర్చోండి. ఒక మహాత్ముడు రాబోవు చున్నాడని చెప్పి వారులేచి కొంచెం దూరంగా వచ్చి నిలచారు. అంతలో ఒక దివ్య తేజో పుంజము శ్రీ స్వామి కెదురుగా నిలచుట అందరికీ గోచరించినది. కానీ వారి రూపముగానీ, మాటలుగానీ ఏమీ గోచరించలేదు. వినిపించలేదు.

శ్రీ స్వామి వారి ఎదుట ఆ కాంతిమయ శరీరం నుండి అశ్వత్థామ ప్రకటమైరి. శ్రీ స్వామివారి చరణాలు స్పృశించి నమస్కరించి నిలువగా శ్రీ స్వామివారు "ఏమి నాయనా! అశ్వత్థామా! కుశలమా?" యని ప్రశ్నించినారు.

అందులకా యశ్వత్థామవారు "స్వామీ! సద్గురుదేవా! దయా సాగరా! శరణు! శరణు! ఇంతకాలమునకు మీ దర్శనంతో ధన్యుడనైతిని. కరుణా సింధూ! దేవా! దీనబాంధవా! ఏమి నా ప్రారబ్దము! ఎంతకాలం ఈ అశాంతి. ఆవేదన తీరుట ఎన్నడు? ఇంకనూ ఎంతకాలము ఈ

నరకయాతనను అనుభవించవలసి యున్నది. ప్రభూ! నన్ను ఉద్ధరించి ఉత్తమగతులు ప్రసాదించవేడుచున్నాను. సద్గురువులైన తమకు అసాధ్యమన్నది లేదు. గ్రహములను గ్రహగతులను మార్చి శాపోపహతులను రక్షించగల సామర్థ్యము సద్గురువులకేగలదని నమ్మి ఇంతకాలం తమరి రాకకై నిరీక్షిస్తూ గడుపుచున్నాను. ఈ నాటికి నా నిరీక్షణ ఫలించినద"ని ప్రార్థన చేసెను. శ్రీపాద స్వామివారు సర్వజ్ఞులు. సకలము ఎఱిగిన వారు. అశ్వత్థామతో "నాయనా! నీవు చిరంజీవిగా వుండవలెనని మీ తండ్రిగారి అభిమతము. ఆ కారణముచేత నీవు యుగాంతము వరకు ఇట్లే ఉండక తప్పదు. పాప సంచితమైన ఆహార వ్యవహారమువలన సంప్రాప్తించిన కర్మ ఫలమును అనుభవించి మాత్రమే తీర్చవలెను. నీ అదృష్టముచేతను, నీ తండ్రిగారి ఆశీర్వచనము చేతను మా దర్శనం ఈనాడు నీకు లభించినది.

నీకు తండ్రియు, గురువున్నూ ఒక్కరే! ఆ కారణంగా నీవు నీ తండ్రిని గురుభావముతో సేవించలేదు. తండ్రిగా మాత్రమే చూడగలిగివి. అందువలన నీకు అశాంతి కలిగి బాధింపబడుచున్నావు. ఇకపైన నీ తండ్రిని గురువుగా భావించి మనసారా ధ్యానించి ప్రార్థించు. నీకు శాంతి లభిస్తుంది. శుభం చేకూరునుగాక!" అని ఆశీర్వదించినారు.

తిరిగి అశ్వత్థామ శ్రీపాదులవారికి నమస్కారం చేసి సెలవు తీసుకొని వెడలిపోయినాడు. ఆ కాంతి పుంజము తిరిగి ఆకాశమార్గంలో పోవుట మాత్రము అందరికీ కనిపించినది.

ఈ సంఘటన చూచిన వారందరూ ఆశ్చర్యంలో మునిగియున్నారు. శ్రీపాద స్వామి వారు సభలోనికి వచ్చిన తదుపరి నిర్మలానంద బ్రహ్మచారి ఇట్లు వినయంతో ప్రశ్నించాడు.

స్వామీ! మాకు వినే అర్హత వుండినట్లైతే తమను దర్శింపవచ్చిన మహాత్ముని పేరు విశేషములను తెలపగలరు. లేకుంటే మమ్ము క్షమించగలరని వేడికోలుగా ప్రశ్నించగా శ్రీపాదస్వామి "ఓహో! అదా మీసందేహం! ఆయన ఇచ్ఛానుసారమే ఆ సంభాషణను మీరు వినలేకపోయినారు. యుగ భేదంవల్ల ఆ వాక్కులు వినబడలేదు. రూపం కనబడలేదు. అనేకమంది మహాత్ములు ఈ విధంగా జ్యోతి స్వరూపులై సంచరిస్తూ వుంటారు. ఆ వచ్చిన మహానుభావుడు అశ్వత్థామ. వారికి కావలసిన శాంతిని ప్రసాదించే మార్గం తెలిపి పంపించివేసినాను" అని జరిగిన సంభాషణలోని సారాంశమును మాత్రం వివరించారు. అంతేగాక శ్రీశైలంలో సాధన చేసుకొనే యోగులు, సాధకులు చాలా జాగ్రత్తగా మెలగండి. ఎందుకంటే వేలాదిసంవత్సరాలుగా ఇచ్చటనే యుండి తపస్సంపన్నులైన వారెందరో మీమీ ప్రవర్తనలను కనిపెట్టుచుందురు. ఎవరైతే గురువాజ్ఞకు వ్యతిరేకులై ప్రవర్తిస్తారో

వారికి తగిన పరీక్షలు, శిక్షలు గూడ పెట్టుటకు వారు సమర్థులైయుంటారు.

అందుచేత మీ ప్రతి కదలికయు వారు గమనిస్తుంటారని మాత్రం తెలుసుకొని మెలగండని అందరికీ హితబోధలు చేశారు. ఈ విధంగా ప్రతిరోజు స్వామి వారిని ఆశ్రయించి బోధల ద్వారా నిత్య నూతన విషయాలను శ్రవణం చేస్తూ వారు గడుపుచున్నారు.

శ్రీశైల క్షేత్రమునందు శ్రీపాద శ్రీవల్లభస్వామిారు ఆషాఢ శుద్ధ ఏకాదశీ పర్వము నుండి కార్తీక పౌర్ణమి పర్వదినము వరకు నిత్యము స్నానానుష్ఠానములు, దైవదర్శనములతోపాటు సకల సాధు సత్పురుషులతో సత్సంగములను  నెఱపి వారికి అద్భుతమైన జ్ఞానామృతమును పంచినారు. నాలుగు నెలలు నాలుగు రోజులవలె గడచిపోయినవి. శ్రీశైల క్షేత్రమంతయు శ్రీపాదుల జ్ఞాన బోధలతో పరవశించినది. అందరినోట ఒకటే మాట. ఇంత చిన్న వయసులో నున్న బాలయోగి సాక్షాత్ శివుడో లేక దత్తాత్రేయుడో కాకుంటే ఈ జ్ఞాన, వైరాగ్యములు తాను పొందుటేగాక ఇట్లు వివరముగా బోధించుట ఎవరికీ తరముగాదు. ఈయన ఆ జన్మ సిద్ధుడే. కనుకనే చూపులేని వారికి చూపునిచ్చాడు. మూగకు మాటలనిచ్చాడు. అనేకమైన ఆధివ్యాధులను నివారించినాడని అందరు చెప్పుకొనగా అనేకమంది యాత్రికులు, భక్తులు గూడ దర్శించుకొన్నారు.

సాధువులు ఈ సాంగత్యము ద్వారా మెఱుగుపెట్టబడినారు. వారిలో వారు సాధనానుభూతులను చవిచూచినారు. కొందరికి వారి అంతరాంతరాళములలో వెలుగుమార్గం గోచరించింది. శ్రీ స్వామివారు చాతుర్మాసముల చివరిరోజు అనగా కార్తీక పౌర్ణమిరోజు భిక్ష స్వీకరించిన తదుపరి మానసికంగా శ్రీమల్లికార్జున స్వామికి, భమరాంబ మాతకు ప్రణామాలు సమర్పించి ధన్యవాదములు తెలిపినారు. అంతకాలము తమతో కలసి సత్సంగము చేసిన సాధువులందరిని సాధన చక్కగా చేసి గమ్యం చేరమని దీవెనలిచ్చినారు.

నిర్మలానంద బ్రహ్మచారితో మాత్రము శ్రీపాదస్వామి ఇట్లు పలికారు. "ఓ బ్రహ్మచారీ! నా ప్రవాస దినములీ క్షేత్రమునందు పూర్తియైనవి. ఇప్పుడు నా తదుపరి మజిలీ మరియు చివరి మజిలీ యైన కురువపుర ద్వీపమునకు పోవుటకు సమయమైనది.  ముందుగా భీమానది – కృష్ణానదీ సంగమము చేరి అచ్చట శ్రీ భీమేశ్వరుని దర్శించి తదుపరి కురువపురమందు నా తపోసాధనను కొనసాగించెదను. ఇంతకాలము శ్రద్ధగా సేవలు చేసితివి. నీ సాధనను చక్కగా కొనసాగించి ఉత్తమ స్థితిని పొందుము" అని ఆశీర్వదించినారు.

నిర్మలానంద బ్రహ్మచారి శ్రీ స్వామివారి నిర్ణయమును విని వారి వియోగమును తలంచి

"స్వామీ! ఈ నాలుగు నెలల కాలము మమ్ము లాలించి పాలించిన దేవదేవా! తమరు ఎంచుకొన్న క్షేత్రము ఇంతకన్నా పవిత్రమైనదా స్వామీ! తమ సాధనకు ఇచ్చట ఆటంకములు కలుగునని ఇట్లు నిర్ణయించుకొంటిరా. తమరికే ఆటంకములు లేకుండునట్లు నేను తమ శిష్యుడనై సేవించెను. ఇచ్చటనే యుండి తమరు, తపమాచరించినచో మాకందరికీ ఆనందము కలుగును స్వామీ! అంటూ ప్రార్థించగా శ్రీ స్వామివారు చిరునవ్వులు చిందిస్తూ "బ్రహ్మచారీ! మనము ఎచ్చటను బంధాలు, అనుబంధాలు పెంచుకొనరాదు. స్థలముతోగానీ, వ్యక్తులతోగానీ మనకు బంధము లేదు. సర్వేశ్వరుని నిర్ణయం ప్రకారం వర్తించాలి. ప్రతి క్రియకు ఒక కారణం ఉంటుంది. కాలపరిమితి ఉంటుంది. ఈశ్వరాజ్ఞనే అందరం పాటించుట మేలు. సంయోగ వియోగాలు ఆత్మకేమీ లేవు. అది అఖండమని గ్రహించు. నీవు రాదలంచిన నా సూచన మేరకు అచ్చటికి రావలెను. లోకకల్యాణమే నా కర్తవ్యం. కురువపురం అతి పురాతనమైన తపోభూమి. అచ్చట నా దివ్య సంకల్పమునకు ప్రారంభ సమయం ఆసన్నమైన"దని చెప్పుచునే వున్నచోటనే అదృశ్యమైపోగా ఆ బ్రహ్మచారి నిర్ఘాంతుడై కొద్ది క్షణాలుండి తదుపరి వారు నిలచిన ఆ భూమికి నమస్కరించు కొన్నాడు.

శరీరము పులకరించగా ఎంతటి మహానుభావుల సన్నిది ఇన్ని రోజులు మనకు లభించినదో! ఈనాడు నాకర్థమైన"దని తలచి పరవశించాడు అని శ్రీ విఠల్ బాబాగారు వివరించి కొంచెంసేపు తన్మయత్వం లో వున్నారు. తర్వాత ఇలా చెప్పారు. శ్రీపాద స్వామి నడయాడి అందరినీ అనుగ్రహించినటువంటి భూమిపైననే మనకింత ఆనందం కలుగుచున్నదంటే నిత్యము వారి సాన్నిధ్యాన్ని అనుభవించిన వారెంత అదృష్టవంతులో గదా! అని జయజయ నాదాలు చేయగా అందరం వారితో శ్రుతికలిపినాము.



# 11వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

## శ్రీపాదులు నివృత్తి సంగమం చేరుట

మేము కుతూహలంగా శ్రీ బాబాగారిని చేరి "స్వామీ! శ్రీశైలంలో అదృశ్యమైన తదుపరి శ్రీపాద స్వామివారు కురువపురం వెంటనే చేరినారా? లేక నివృత్తి సంగమంలో కొంతకాలం ఉన్నారా? వివరంగా తెలపండి" అని కోరగా శ్రీ బాబాగారిట్లు ప్రారంభించిరి.

శ్రీపాద స్వామివారు శ్రీశైలమందు అదృశ్యమై భీమా-కృష్ణా నదుల సంగమ స్థానమైన నివృత్తి సంగమమును చేరుకొనిరి. అచ్చటనే సాయం సంధ్యా వేళ స్నానాదికములు నివర్తించి శ్రీ భీమేశ్వర లింగమును ప్రదోష వేళలో దర్శించి సేవించిరి. అచ్చటగల ఒక రాతిపైన కూర్చుండుటకు వారు సంకల్పించగానే వ్యాఘ్రాజినము ఆచోట ప్రకటమై తన విధిని నిర్వహించింది. వారు దానిపై ఆసీనులు కాగా అంతలో మరొక అద్భుతం జరిగింది.

నదీ తీరాన, అనేక శిలల రూపాలలో తపమాచరించుకొనుచున్న ఋషులు, యోగులు తమ స్వస్వరూపాలతో ప్రకటమై చేతులు జోడించి "రాజాధిరాజ యోగిరాజా శ్రీదత్తాత్రేయ ప్రభో! జయము జయము" అని జయజయ నాదములు చేసిరి. అంతలో మరికొందరు ఆకాశ మార్గాన జ్యోతి స్వరూపులైన యోగులున్నూ వచ్చి నిలచి శ్రీపాదులకు జయము జయమని ప్రార్థనలు చేసిరి.

**ఓం నమో బ్రహ్మాది భ్యో**
**బ్రహ్మ విద్యా సంప్రదాయ కర్తృభ్యో**
**వంశర్షిభ్యో మహద్భ్యో నమో గురుభ్యః**

**మాలా కమండలు రధఃకరః పద్మయుగ్మే మధ్యస్థ పాణి యుగళే ఢమరు త్రిశూలే**
**యస్యస్త ఊర్ధ్వకరయోః శుభ శంఖ చక్రే వందే తమత్రి వరదం భుజషట్కయుక్తమ్॥**

**కృతే జనార్ధనో దేవః త్రేతాయాం రఘునందనః**
**ద్వాపరే రామకృష్ణౌంచ కలౌ శ్రీపాద వల్లభః ॥**

**కాషాయ వస్త్రం కరదండ ధారిణం కమండలుం పద్మ కరేణ శంఖం**

**చక్రం గదా భూషిత భూషణాఢ్యం శ్రీపాదరాజం శరణం ప్రపద్యే ॥**

**ఔదుంబరః కల్పవృక్షః కామధేనుశ్చ సంగమః**

**చింతామణిర్గురోః పాదౌ దుర్లభౌ భువనత్రయే ॥**

**"కరుణాలయ దివ్యస్వరూపా! శ్రీపాద రాయ! శరణు! శరణు! దేవా! సద్గురుమూర్తీ!"** అంటూ స్తుతించారు.

వారందరికీ శ్రీపాద శ్రీవల్లభులు అభివందనములొనరించుచూ "మహాత్ములారా! తపోధనులారా! ముని పుంగవులారా! వేలాది సంవత్సరములుగా తమ యొక్క తపః ఫలితములను లోక కల్యాణమునకై ధారపోయుచు ఈ ప్రపంచమును శక్తిమంతముగా చేస్తున్న ఘనులు తమరందరు. ఇప్పటివరకు తమరు బ్రహ్మానందానుభూతిలో లయమై పరమాత్మయందే నెలకొనియున్నారు. ఈ కలియుగ మానవ సమాజములో ఏర్పడిన అజ్ఞానపు వాతావరణమును క్రమంగా జ్ఞాన దీప్తితో నింపుటకై నేను చేయబోవు కృషికి తమ యొక్క సహకారముగూడ అవశ్యమైయున్నదని పలుకగా వారందరూ "ప్రభూ! మావలన ఏ విధమైన సహకారము అవసరమో నిర్దేశించిన యెడల తప్పక మావంతు సహకారమునందించగలమ"ని అందరూ పలికిరి.

మహాత్ములారా! ఈ కలి ప్రభావమును నిర్జించగల శక్తి, తగ్గించగల శక్తి ఒక్క సద్గురువునకే గలదు. కావున జన్మ రాహిత్యమును పొందిన తమరిని జన్మబంధములో పడమని కోరను. కానీ తమరు ముక్తులుగానే వుంటూ ఏ వ్యక్తికి ఏ వ్యక్తితో సంబంధమేర్పడినచో ఆధ్యాత్మిక సాధనలో ఆతడొక అడుగు ముందుకు వేయగలడో పరికించి తెలుసుకొని ఏదో ఒక కారణంగా ఆ వ్యక్తుల కలయికకు కృషిచేసి వారి మనసులలో గురుభక్తికి ప్రేరణ కల్పించండి. అదృశ్యంగానే వుంటూ తాము తరించుచూ ఇతరులు తరించుటకు మార్గమును సుగమం చేయండి. ఈ ఉపకారం వలన మీ తపశ్శక్తి పెరుగుతుంది కానీ తరగదు. ఇదియే నాకు వలసిన సహకార"మని పలికిరి.

మునులు, ఋషులు, తాపసులు, యతీశ్వరులు ఒక్కసారిగా ఆశ్చర్యానందములతో "శ్రీపాద శ్రీవల్లభా! ఏమి నీ కార్యదక్షత! ఏమి నీ దివ్య సంకల్పము. ఇంతవరకు మాకిటువంటి యోచన కలుగనేలేదు. నీ కృప అపారము స్వామీ. మా తపశ్శక్తిని ఈ విధంగా ఉపయోగపెట్టు నుపాయము దెల్పి మమ్ము కృతార్థులను చేసితివి" అని అందరూ జయజయ ధ్వానములు చేసిరి.

తదుపరి ఆ మహాత్ములందరు శ్రీ దత్తాత్రేయస్వామి వారి యొక్క దివ్య సంకల్పము, వారి కార్యాచరణకై ఏర్పడిన ప్రణాళిక యొక్క స్వరూప స్వభావములను దర్శించగలిగారు. ప్రపంచములో ఎక్కువగా దుర్జనులున్నను వారికి శిక్షణ గఱుపుటకు సజ్జనులు కొద్దిమంది అయినా చాలు. సత్యమునకుండు శక్తిని ప్రదీప్తం చేయునప్పుడు అసత్యము రూపుమారిపోవుచుండునని శాస్త్రం తెలుపుచున్నది. ఒక్క సూర్యుడే ప్రపంచమంతటికీ వెలుగులు విరజిమ్ముచూ జీవ జంతువుల సృష్టికి సహకరిస్తున్నాడు. శ్రీదత్తాత్రేయ స్వామి తానొక్కడే ఈ కలి మాయను తప్పించి ప్రపంచ మానవాళిని మార్చగలడు. కానీ మనపై దయతో తన దివ్య ప్రణాళికలో మనలను భాగస్వాములుగా జేయుట ద్వారా మనకు దత్త సేవాభాగ్యాన్ని కల్పిస్తున్నారని పరిపరి విధముల కొనియాడి వారందరూ కార్యోన్ముఖులగుటకు నిర్ణయించుకొని అంతర్ధానమైనారు.

శ్రీ స్వామివారు ఆ రాత్రి కక్కడనే విశ్రమించి, మర్నాడుదయమే తిరిగి స్నానానుష్ఠానములను దీర్చుకొని సమీపమందున్న 'కృష్ణా' గ్రామమునకు చేరుకొన్నారు. కృష్ణానదీ తీరాన ఏర్పడియున్నందున ఆ గ్రామము పేరు "కృష్ణ"గా వెలసింది. అనేకమంది బ్రాహ్మణ వంశములవారు ఆ గ్రామంలో నివసిస్తూ నదీ స్నానములు, అనుష్ఠానములు ఆచరించుటకు వీలుగా గృహములేర్పరచుకొని ఉన్నారు. శ్రీ స్వామివారు ఒక బ్రాహ్మణ గృహము వాకిట నిలచి "హరహర మహాదేవ శంభో శంకర" అనుచు శివనామోచ్చారణము గావించిరి. ఆ నాదములోని శ్రావ్యత, గంభీరతలకు ఆనందము కలిగి లోపలనున్న గృహస్థుడు బయటకు వచ్చి చూడగా ఇంటి ముంగిట ముగ్ధమోహనాకారుడు, సుందర సుకుమార తేజోవిలాసుడు, దండ కమండల ధారుడు, జటాధరుడు అయిన ఈ బాలయోగీశ్వరుని దర్శించి కొంతసేపు నిశ్చేష్టుడై అట్లే నిలచెను.

ఇతడు బ్రహ్మ తేజస్సు, విష్ణు వర్చస్సు, శివుని తపోశక్తి అన్నీ కలబోసినట్లున్నాడు. ఏమని సంబోధించాలో తెలియక సాక్షాత్తుగా తనను పరీక్షించుటకు శివుడే వచ్చినట్లు భావించుచు తేరుకొని "ఆర్యా! స్వాగతం! లోనికి దయచేయండి! మధ్యాహ్నవేళ భిక్షకై మా గృహమునకు వచ్చిన సాక్షాత్తు పరమేశ్వరులే తమరు" అని ప్రార్థన చేయగా శ్రీ స్వామి "ఆర్యా! నేను సాధారణ భిక్షకుడను మాత్రమే" అనుచుండగా ఆ గృహ యజమాని ప్రవర చెప్పుకొని సాష్టాంగ ప్రణామము నాచరించి శ్రీ స్వామివారిని చేయి పట్టి లోనికి తోడ్కొనిపోయి యథావిధి ఉచితాసనమిచ్చి అర్ఘ్యపాద్యములిచ్చి అర్చన చేసెను. తదుపరి ఇట్లు ప్రార్థించెను. మహాత్మా! సాధారణముగా మధ్యాహ్న సమయంలో అతిథి రూపంలో ఎవరు వచ్చినా వారు దత్త స్వరూపులని శాస్త్రవాక్యం. అందునా తమరు

యోగీశ్వరులు. నన్ను నా వంశమును తరింపజేయుటకై విచ్చేసిన పరమేశ్వరులో లేక దత్తాత్రేయులో! నేను తెలుసుకోగలిగిన వాడను కాను. ఈ కించిత్తు సేవా భాగ్యము ప్రసాదించుట నా పూర్వజన్మ సుకృతమని స్తుతించి శ్రీ స్వామివారికి విస్తరివేసి సకల పదార్థములు వడ్డింపజేసి వారు భుజిస్తుంటే వీవనతో విసరుచూ సేవించెను. శ్రీ స్వామివారు ప్రసన్నులై అతనిపై అపార కృపను వర్షింపజేశారు. వారి కుటుంబము వారందరినీ అనుగ్రహంతో వీక్షించినారు. తదుపరి ఆ గృహస్థు శ్రీస్వామివారి పేరు అడిగి తెలుసుకొన్నారు. "శ్రీపాద శ్రీవల్లభుల"నగానే ఆతని సంతోషానికి మేరలేదు – వారి శ్రీపాదం తమ గృహం పావనం చేసినందుకు.

ఆ రోజు సాయంకాలమందు శ్రీ స్వామివారి అనుమతితో ఆ గృహస్థు తోటి బ్రాహ్మణులందరినీ తమ యింటి కాహ్వానించి సత్సంగ సమావేశము నేర్పరచెను. అందరివంకా జూచి శ్రీ స్వామివారితో ఆయన ఇట్లు పలికెను. "స్వామీ! మేమందరము వేద విధుల నభ్యసించి అందరకు శుభకార్యములు నిర్యాణానంతర కార్యములు (అపర కర్మలు) చేయించు పురోహితులము. కానీ ప్రత్యేకముగా మోక్ష సాధనకొరకు ఏ విధమైన కృషియు చేయలేకున్నాము. అందరు సంసార పోషణ కొరకు మాత్రమే కృషిచేయుచున్నాము. ఇటువంటి మాకు సులభమైన సాధనా మార్గమేదైనా తమవంటి మహాత్ములే సూచించగలరని తమరిని ప్రార్థిస్తున్నా"మని విన్నవించెను.

శ్రీ స్వామివారు క్షణకాలం కన్నులు మూసి తలపంకించుచూ ఇట్లు ప్రారంభించిరి. "ఆర్యులారా! వేద పండితులారా! పురుషార్థ సాధనలో మీకు తెలియనిదేమున్నది. ధర్మ, అర్థ, కామ్య, మోక్ష సాధనాది నాలుగున్నూ పురుషుడు సాధించవలసినవే. తమరు నిత్యము చేయు పురోహిత వేద విధులనే వివేకముతో నిర్వర్తించినచో తమరికి వైరాగ్యమన్నది "కరతలామలకమే!". ఏలననగా అది అనుభవ జ్ఞానముగా ఇంతవరకూ గుర్తించలేదు కావున బ్రహ్మజ్ఞానము, ఆత్మజ్ఞానము, దివ్యజ్ఞానము అనువాని స్వరూపమేదో వేరుగా వున్నట్లు భావించబడు చున్నవి. ఒక్కసారి ఆలోచించండి. తమరు నవజాత శిశువుకు జాతకర్మ చేయించి నామ కరణము గావిస్తూ వుంటారు. జాతకర్మ అనగా తల్లి గర్భము నుండి శిశువు బయటికి వచ్చినది. దానికి శుద్ధి పుణ్యాః వచనంతో ఆ జీవుని శుద్ధి చేస్తున్నారు. ఆ మంత్రములలోని అర్థములను ఒక్కసారి స్మరించండి. ప్రతి శిశువు ఒకే రకంగా భూమిపైకి వస్తున్నది. కానీ వానికి జన్మ సంస్కారములు, ఆజన్మ (పూర్వజన్మ) సంస్కారములు, వంశాచార విధులు, ఎన్నో విధముల సహకరించితే వాడు ఉత్తముడు కాగలడు.

అందరియందును పరమాత్ముని అంశయే జీవరూపముగా ప్రకాశించుచున్నది. ఇది వేద రహస్యము. అయినను తమరు ఈ విషయము దూరముగా వుంచెదరు. తల్లి గర్భమునందు జీవుడు శ్రీమన్నారాయణుని పది అవతారములను వాని సూక్ష్మ రూపములను పది నెలలలో పొందుచున్నాడు. ఇది సార్వజనీన రహస్యము. మొదటి నెలలో నీటిలో చేపవలె తల్లి గర్భంలో తిరుగుచూ రెండవ నెలలో కూర్మ రూపం ధరిస్తాడు. మూడవ నెల వరాహరూపంలో వుంటాడు. నాలుగవ నెలలో నరసింహ రూపంలో శిశువు తయారవుతాడు. ఐదవ మాసంలో కుబ్జ మానవ రూపుడనగా వామన రూపం ధరిస్తాడు. ఆరవ మాసంలో అనాగరిక మానవ (పరశురామ) రూపములో వుంటూ ఏడవ మాసంలో నాగరిక పురుషరూపం (శ్రీరామ)లో శిశువు ముక్కు, కన్నుల తీరు తేటగా తెలుస్తుంది. ఎనిమిదవ నెలలో పూర్ణ పురుషరూపం, తొమ్మిదవ నెలలో బుద్ధి స్వరూపుడై (బుద్ధావతారం) తన పూర్వకర్మలు, భవిష్యత్కర్మలు అన్నీ తెలుస్తూ వుంటాయి. భగవంతునికి చేతులు జోడించి ప్రార్థిస్తూ ఎన్నెన్నో జన్మలైనాయి. ఇకపైన జన్మ వద్దు తండ్రీ అంటూ ప్రార్థిస్తాడు. పదియవ నెలలో ధనంజయ వాయువు యొక్క వత్తిడితో తల్లి గర్భం నుండి బయటపడుటతోడనే భూమ్యాకర్షణ శక్తికి లోనౌతాడు. "విషయ విజ్ఞాననాశనరూపాయ కల్కిః" అన్న తీరుగా వాడికి అప్పటిదాకా వున్న పరమాత్మ ప్రసాదిత జ్ఞానం శూన్యమై పోతుంది. ఆపైన ప్రతి విషయం నేర్చుకొనే పరిస్థితే వుంటుంది. కావున ఇప్పుడు చెప్పబడిన జ్ఞానం నిరంతరం జ్ఞాపకం పెట్టుకొని నిత్యము ఆయా కర్మలు చేయించండి. మీ నిత్యకర్మలోనే **వివేకాన్ని** పొందండి. అదియే అనుభవజ్ఞానం అంటారు.

అంతేగాక నిర్యాణానంతరం జీవునికి తమరు అపరకర్మలు చేయించుచున్నారు గదా! ఆ మంత్రార్థము లను ఒక్కసారి మనసులో స్మరించండి. **వైరాగ్యము** తమకు మరియొక్కరు నేర్పించ నవసరము లేదు. "యద్దృశ్యం – తన్నశ్యం". యేది ఈ రోజు కంటికి కనిపిస్తున్నదో అది రేపు నశించబోవుచున్నది. ఎట్లనగా నిన్నటివరకు లేదా క్రిందటి క్షణం వరకు కనిపించిన, మాట్లాడిన వ్యక్తి ఈ క్షణంలో శవంగా మారి భస్మం చేయబడుచున్నాడు. శరీరాన్ని విడచిన జీవుని గతులు (నడత) ఏ విధంగా వుంటుందో మంత్రబద్ధం చేయబడియున్నది. ఈ జన్మయందు ఆతడొనరించిన కర్మ సంచయమును కొంత కొంత పరిహారము చేసి ఆ జీవునికి సద్గతులు కల్పించుటయే మీరాచరించు అపర కర్మలకు అర్థము. అందువలన ఆ విధి విధానముగా అపర కర్మాచరణ జరుగకుంటే ఆ జీవునకు సద్గతులు కలుగవు. ఇది మీకు తెలిసిన విషయమేగదా!

ఆయా కర్మల యొక్క అర్థమును కూలంకషంగా తెలిసి ఆచరించుటచేత **వివేకము మరియు వైరాగ్యము** రెండూ కలుగును. ఎప్పుడీ జ్ఞాన మార్గము లభించునో సంసారము నందుండినను తామరాకుపైన నీటి బిందువువలె సంసారము అంటకుండ విడిబడి తమను తాము ఉద్ధరించుకొనగలరని శ్రీ స్వామివారు సుదీర్ఘమైన బోధ చేయువేళ అందరూ చిత్తరువులవలె కదలక మెదలకయుండిరి. శ్రీ స్వామి తమ బోధను ఆపిన కొన్ని క్షణాల అనంతరం తలలుపండిన పండితులు, నడివయస్సు గృహస్థులు, బ్రహ్మచారులు అందరూ గూడ "జయము! జయము! శ్రీపాద శ్రీవల్లభులకు జయము!" అని జయజయ నాదములు చేసినారు.

ఇంత చిన్నబాలునికి ఈ జ్ఞానమార్గ బోధ మనకు చేయగల శక్తి సంపన్నత ఎట్లు లభించెనో! ఆశ్చర్యము. వీరు సామాన్య యోగికాదు. ఆ జన్మ సిద్ధులై యుండవలెనని ఒకరికొకరు చెప్పుకొనిరి. ప్రదోష సమయానికి ముందు శ్రీ స్వామివారు తమ ప్రబోధమును పూర్తిచేసి వారందరివద్ద వీడ్కోలు తీసుకొని అచ్చట అదృశ్యమై కురువపరం చేరారు.

**కురువపురం ఆగమనం**

నివృత్తి సంగమము నుండి శ్రీపాదస్వామి వారు కురువపురమునకు వచ్చి చేరు సమయమునందు కురువపురమందు గల మునులు, యోగులు, సిద్ధులు మొదలగు వారంతా దివ్యదృష్టితో శ్రీ స్వామి వారి ఆగమనమును ముందుగానే గ్రహించి వుండుటచేత వారి రాకకై ఎదురు చూస్తున్నారు. శ్రీస్వామి వారు ఆ ప్రదేశమునకు వస్తారనే విషయం వారికి తెలుసును గాని ఇదమిత్థమైన సమయమునకు శ్రీదత్తావతారుడు, శ్రీ పాదులవారు వస్తారన్న విషయం మాత్రం వారికి తెలీలేదు. వారి పరిస్థితి శ్రీరామ దర్శనము కొరకు ప్రతీరోజూ ఎదురు చూచు శబరి వలెనున్నది. తమ గురువు చెప్పిన మాట కారణంగా శబరి మాత విసుగు చెందకుండా ప్రతీరోజూ కుటీరాన్ని అలంకరించి, శ్రీరామ నైవేద్యము కొరకు ఫలములను, పూజకు పూలను సిద్ధంచేసుకొని అమితమైన ఓర్పుతో ఎదురు చూచేది. ఆ ఎదురుచూపు, నిరీక్షణలే కాకుండా శ్రీరామ నామ స్మరణే తపస్సుగా మారి చివరకు శ్రీరామ దర్శన భాగ్యం, మరియు ఆయన అనుగ్రహాన్ని పొందినదామె!

మునులు, యోగులు, సిద్ధులు అంతా వారి నిత్య సాధనానుష్ఠానములను ఆచరిస్తూ శ్రీ స్వామి వారి రాకకై నిరీక్షించసాగారు. అందరి మనస్సులయందు శ్రీ స్వామి వారు త్వరలో రానున్నారు అనే స్థిరమైన భావన కల్గింది. కాని శ్రీపాద స్వామి వారి రాక దైవ రహస్యమగుట వలన కాల నిర్ణయంమాత్రము వారి దివ్య దృష్టి లేదా భవిష్య ద్దర్శనమునకు అందలేదు.

మహాత్ములందరూ ఎంతో ఆతృతగా శ్రీపాద స్వామివారి రాకకై ఎదురుచూడసాగారు. ఆ శుభఘడియ దగ్గరయ్యే కొలది వారిలో ఆతృత అధికమవసాగింది. శ్రీ స్వామివారి రూపం వారి వారి మనో ఫలకములందు గోచరించగా అంతటి అందమైన రూపాన్ని ప్రత్యక్షంగా దర్శించుట కొరకు వారంతా ఉవ్విళ్లూరసాగారు.

ఈ విధమైన ఆతృత, ఆశలతో వారు ఎదురుచూచుచూ శ్రీ స్వామివారు ఆశీనులగుటకు, విశ్రమించుటకు వీలుగా ఒక రాతి (ఫలకము) బండను, ఒక చెట్టు నీడలో ఏర్పాటు చేసినారు. అంతలో అకస్మాత్తుగా ఒక **వ్యాఘ్రాజినము** (పులి చర్మము) వారు ఏర్పాటుచేసిన రాతిబండపై ప్రత్యక్షమైనది. ఉన్నట్లుండి కనబడిన పులి చర్మమును చూచిన వారందరూ శ్రీదత్తస్వామి వచ్చు సమయమిదే అని జాగరూకులై, భక్తి, శ్రద్ధ, వినయములతో లేచి నిలబడి "జై గురుదత్తా! శ్రీగురుదత్తా!" అనినీ మరియు శ్రీస్వామివారిని అనేక విధములుగా ప్రార్థించ సాగిరి.

'శ్రీపాద శ్రీవల్లభ స్వామి' అచ్చట ప్రత్యక్షమై తన గురించి ఏర్పాటుచేసిన ఆ రాతిబండపై కూర్చుని అందరినీ సాలోకనంగా చూచారు. అందరూ శ్రీ స్వామివారికి నమస్కరించి ఫలపుష్పాదులను సమర్పించినారు. పవిత్ర కృష్ణా జలాలతో పాదాభిషేకం చేసినారు. వారందరినీ ఆశీర్వదించి, శ్రీపాదస్వామి వారితో "మీరంతా ఈ పవిత్ర క్షేత్రములో మా రాకకై ఎదురు చూస్తూ మీమీ తపోసాధనలవలన ఈ ప్రదేశము యొక్క పవిత్రతను మరింత వృద్ధిపరచినారు. ఇది కలియుగం! అందువలన మీరు మీమీ రూపములను అదృశ్యముగా నుంచి మీ సాధనలను కొనసాగించండి. ఇచ్చటకు అరుదెంచు మానవుల మనోభావములను మీరు శుద్ధిచేసి వారి యందు సద్భావ ప్రేరణ కల్గించండి. వారిలో జ్ఞాన ప్రదీప్తము గావించండి. లోక కల్యాణ కార్యము ఈ విధముగా చేయండి. అని వారితో చెప్పి వారు సమర్పించిన వాటి నుంచి రెండు ఫలములు స్వీకరించి విశ్రమించారు. ఆ మహాత్ములతోబాటు ఆ ఫలపుష్పాదులు సమస్తం అదృశ్యమైపోయాయి.

మరుసటి రోజు ఉదయం శ్రీపాదులవారు నదిపై నెమ్మదిగా అడుగులు వేయుచూ ఇవతలి ఒడ్డునకు రాసాగిరి. అత్యంత ఆశ్చర్యకరంగా శ్రీస్వామి వారి పాదము మోపు ప్రదేశమందు ఒక కమలము ఉద్భవించ సాగింది. కృష్ణమ్మ తన అన్నగారి పాదములకు ఈ కమలసేవ అన్నట్లుగా వారి ప్రతి అడుగుకూ ఒక్కొక్క కమలము వుద్భవించుట మరియు వారు మరొక అడుగు వేసిన వెంటనే ముందు వుద్భవించిన కమలము అదృశ్యమగుచుండగా శ్రీస్వామి ఈవలి ఒడ్డుకు చేరుకొనిరి.

అప్పటివరకు శ్రీ స్వామివారి రాకకై ఎదురుచూచుచుండిన గణపతి ప్రత్యక్షమై శ్రీపాదస్వామివారిని ఆలింగనము చేసుకొని సంతోషముప్పొంగగా శ్రీ గణేశుల వారు ఇట్లనిరి.

“శ్రీపాదా! నేను కైలాసంలో మిమ్ములను కలసిన సమయంలో ఇచ్చటకు చేరమని కోరితిని. ఆ ప్రకారమే మీరు ఇచ్చటికి చేరినారు. ఇది భూలోకంలోనే ఎంతో పవిత్రమైన సిద్ధక్షేత్రం. వేలాది సంవత్సరములుగా అనేకులు తమ తమ సాధనలలోని లోపములను సరిచేసుకొనుటకు ఇచ్చటికి చేరి సాధనలను చేసి దివ్యత్వం పొంది వెళుతుంటారు. మీరాకతో ఈ క్షేత్ర శక్తి ద్విగుణీకృతం అవుతుంది” అని పలుకగా! శ్రీపాదులవారు “మహాదేవా! జ్ఞాన స్వరూపా! మీ సంకల్పం లేనిదే ఏ కార్యము సఫలము కాదు. మీరు నాకు అండ దండలుగా వుంటే పరమేష్ఠి సంకల్పము ప్రకారము మానవులను ధర్మమువైపు జాగృతి చేయగలము” అని పలుకగా “అస్తు! అస్తు!” అంటూ శ్రీ గణేశుల వారు అదృశ్యులైరి.

శ్రీపాదులవారు తమ నిత్యానుష్ఠానమునకై శ్రీ సహజ గణపతికి అభిముఖంగా తూర్పువైపు తిరిగి అచ్చటగల విశాలమైన బండ దగ్గర నిలచిరి.

శ్రీ స్వామివారు సహజ గణపతిస్వామివారితో ముచ్చటించిన తదుపరి తమ సూర్య నమస్కారములను నిత్యానుష్ఠానములను కొనసాగించుచుండగా – అచ్చట నదీ తీరమునగల ప్రకృతి ఆనందంతో పరవశించినది. పక్షుల కిలకిలరావములతో ఆ ప్రదేశం అంతా ప్రతిధ్వనించసాగింది. భూమాత పులకించి తనను వుద్ధరించుటకు సాక్షాత్ దేవదేవుడు మరల భూమిపై అవతరించినందులకు వాతావరణం అంతా ఎంతో ఆహ్లాదకరంగా మారిపోయింది. సకల పక్షి జంతు సంచారముతో ఆ ప్రదేశమంతా కళకళలాడింది.

నిత్యానుష్ఠానమును ముగించుకొని నది ఒడ్డుకు చేరి నిలబడి నలుదిశల చూచుచు ఏవో సైగలు చేసి ఆకాశం వంక ఒకసారి భూమివంక ఒకసారి చూచి చిరునవ్వుతో తలవూపుతూ, ముందుకి నడవసాగారు. దగ్గరలోగల రావిచెట్టును చూచిరి. శ్రీ స్వామి అచ్చట గల ప్రదేశమంతటను కలయజూచి కూర్చొనుటకు అనువుగా వున్న ఒక బండను వీక్షించగా అది రావి చెట్టు నీడకు శ్రీ స్వామివారి సంకల్పాన్ని అనుసరించి చేరింది. వారి మనోభావాన్ని అనుసరించి **వ్యాఘ్రాజినము** ఆ రాతి బండపైకి చేరగా వారు దానిపై ఆసీనులయ్యారు. అంతలో అచ్చటగల విషనాగులు, క్రూరమృగములు, సాధన చేయు యోగులు, మహాత్ములు, ఋషులు, మునులు, సిద్ధులు శ్రీస్వామివారి సన్నిధానమునకు చేరుకొనిరి. శ్రీపాద స్వామికి వారందరూ నమస్కరించి వారి ఆశీస్సులను పొంది అనుగ్రహ భాషణమునకై వేచియుండిరి. శ్రీ స్వామివారు ముందుగా అచ్చటకు చేరిన కౄరమృగములను, విషనాగులను చూచి వాటితో “మీరు నా దర్శనమునకు గుప్తముగా రావలసినది. మీరు ఈ విధముగా వచ్చిన యెడల నా కార్యక్రమమునకు ఆటంకము కలుగుతుంది. అందువలన

మీరు ఇచ్చటకు చేరువారలకు ఎటువంటి అసౌకర్యమును కల్గించరాదు అని ఆజ్ఞనిచ్చిరి. అటులనే అచ్చటకు చేరిన మహాత్ములతో "మీరు మీ మీ సాధనలను కొనసాగించండి. మీకు సకల శుభములు చేకూరతాయి. సద్గురుని అనుగ్రహం ఎల్లవేళలా మీకుంటుంది" అని అన్నారు.

పంచదేవ పహాడ్ గ్రామమునకు పోయి భిక్ష చేసి మరల నదీ తీరమునకు వచ్చి కొలది సమయం రావిచెట్టు నీడను విశ్రమించి వెంటనే కురువపురమునకు చేరుకొనిరి.

శ్రీపాదులవారి లీలలు అనంతములు. వారి దర్శన భాగ్యమే ఒక లీల. శ్రీ స్వామివారి దర్శన మాత్రముననే కర్మ ధ్వంసము జరుగును. సహజ గణపతి వెలసిన స్వయంభూ క్షేత్రమిది. శ్రీ మహాగణపతి సంకల్పానుసారం శ్రీపాదులవారు తమ లీలలను జరిపించు ప్రదేశముగా ఈ పంచదేవ పహాడ్ గ్రామ శివారు ప్రాంతమును తమ నెలవుగా చేసుకొని అనేకానేకమైన లీలలను జరుపుటకు, తద్వారా మానవులను ధర్మ మార్గమునందు నడిపించుటకు వారు సంకల్పించిరి.

– అని శ్రీ విఠల్‌బాబాగారు తెలిపి శ్రీపాద శ్రీవల్లభస్వామివారు కార్తీక పౌర్ణమి రాత్రికి నివృత్తి సంగమంలో వుండి బహుళ పాడ్యమి నాడు శ్రీక్షేత్ర కురువపురం చేరినారు. బహుళ విదియనాడు సహజగణపతి నెలకొన్న ఈనాటి శ్రీక్షేత్ర శ్రీవల్లభాపురం పవిత్రమైన భూమిపైన అడుగుపెట్టినారని తెలుస్తున్నది. ఈ పుణ్యభూమిపై ఇప్పుడు గూడ అనేకమంది యోగులు అదృశ్యంగా తమ తపస్సులను కొనసాగిస్తూనే వున్నారు. అందువల్లనే ఈ క్షేత్రంలో ఎవ్వరైనా అసభ్యంగాగానీ, అధర్మంగా గానీ ప్రవర్తించితే వాళ్ళకు ఆ మహాత్ములే శిక్షలు వేస్తారు. మనం వాళ్ళను తిరిగి ఏమీ తిట్టనక్కరలేదు. వాళ్ళ కర్మ మాత్రం వాళ్ళను శిక్షించేటట్లుగా ఆనాడే ఏర్పాటు చేయబడిందని చెప్పారు.

శ్రీ బాబాగారు మనకళ్ళెదుట తప్పు చేసిన వారిని గూడ క్షమిస్తున్నారంటే ఇదే దానికి మూల సూత్రం అన్నమాట. పైవాళ్ళు సర్వం గమనిస్తున్నారు. వారికివ్వవలసిన అనుభవం వారికిస్తారు అని కాబోలు అనుకున్నాము మేము. కానీ బాబాగారి క్షమాగుణం యొక్క వైభవం ఈ మధ్యనే నాకు అవగాహనకు వచ్చింది. అదేమిటంటే తప్పు చేసిన వ్యక్తి ఫలానా అని తెలిసికూడ శ్రీ బాబాగారు "ఓ దత్తాత్రేయా! స్వామీ! ఈ తప్పు వలన వానికి కలుగు దుఃఖమును, పాపమును నివారించు తండ్రీ!" అంటూ ప్రార్థన చేస్తున్నారు. మనలను గూడ అట్లు చేయమని ఆదేశించినారు.

ఇది వినగానే వింతగా వుంటుంది. కానీ శ్రీపాదుల దివ్య ప్రణాళికలో ఇది ఒక సూత్రమని మనకిప్పుడు విశదీకరించబడినది.

శ్రీపాద శరణం – శ్రీపాద శరణం – శ్రీపాద చరణం భజే।

శ్రీపాద శరణం – శ్రీపాద శరణం – శ్రీపాద చరణం భజే।

# 12వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

## అంబికయను బ్రాహ్మణి - ఆంజనేయశర్మ వృత్తాంతము

శ్రీపాదులవారి నామస్మరణంతోనే అనేక దురితాలు ధూళిలో కలిసిపోతాయని మనకు తెలుసును. అనన్య చింతనము ద్వారా కర్మ విముక్తులు కండి! అని శ్రీ విఠల్‌బాబావారు ప్రతి ప్రవచనంలోనూ పాడిందే పాటగా చెప్పుచునే వుంటారు. ఈ అనన్య చింతనం అనేది ఎంత ప్రయత్నించినా మనకేమో కుదరదు. అందుకే మహాత్ములు దొరికినప్పుడెల్లా వారి ప్రవచనాలు విని కొంతలో కొంత ప్రయత్నం చేద్దామనిపిస్తుంది.

అమృతంవంటి శ్రీపాదస్వామి జననము లీలలు, దివ్యసంకల్పం విని ఆనందంతో పాటు కొన్ని సందేహాలు పొడసూపాయి. బాబాగారితో ధైర్యం చేసి స్వామీ! శ్రీపాద స్వామివారు కురువపురం చేరినది తపస్సు చేసి తాము తరించుటకు గాక అందరినీ తరింప చేయడానికే గదా! లోకహితానికై మహాత్ములు తమ జీవిత సర్వస్వమును అంకితం చేస్తారు గదా! వారివలన ఎవరెవరు ఏ ఏ లాభములను పొందినారో తాము దర్శించి మాకు తెల్పండని వేడుకొన్నాను. తమ వాక్కుల ద్వారా వెలువడునది సత్య వచనములని మా నమ్మకము అని ప్రార్థించాను. శ్రీపాదుల దివ్య సంకల్పం కైలాసంలో చెప్పినదాన్ని అమలు చేసేందుకు తొలి కేంద్రం కురువపురమే గదా! వివరంగా చెప్పండని కోరాను.

అప్పుడు శ్రీ బాబాగారు ఇలాగన్నారు. మీ అభిప్రాయం సరియైనదే. మహాత్ములు చేయు ప్రతి కార్యము లోకహితం కొరకే ఉంటుంది. **అది దృశ్య రూపంగానే ఉంటుందనుకోకూడదు. అదృశ్యంగా కూడా హితము జరుగుచునే ఉంటుంది.** శ్రీపాద శ్రీ వల్లభుల అనుగ్రహం మనందరిపైనా వర్షిస్తూనే ఉన్నది ఆనాడు – ఈనాడు కూడా. ఈ సమయం ఎంతో పవిత్రమైనది. ఈ ప్రదేశము పరమ పావనమైనది. శ్రీపాదులవారి స్మరణము చేత సమస్త పాప సముదాయములు భస్మీభూతం కాగలవు.

వారి అనుగ్రహంతో తృణము మేరువుగాను – మేరువు తృణముగాను మారిపోతుంది. గంగలో స్నానం చేస్తే పాపం నశిస్తుంది. పూర్ణచంద్రుని చల్లదనంవలన మనస్సుకు కలిగిన తాపం నశిస్తుంది. కల్పవృక్షమును సేవిస్తే దైన్యం (అందని వస్తువు కొరకు పడే ఆరాటం) నశిస్తుంది.

ఇవన్నీ ప్రయత్న పూర్వకంగా సాధించాలంటే చాలా కష్టపడాలి. కాశీ దాకా వెళ్ళగలిగితేనే గంగలో స్నానఫలం దక్కేది. తాపం తీరాలంటే పూర్ణచంద్రుని వెన్నెల సమయందాకా ఆగాలి. ఇక కల్పవృక్షం కొరకైతే తపస్సు చేయాలి. ఇంత కష్టం లేకుండానే సద్గురు లీలా శ్రవణం భక్తితో చేస్తే ఒకేసారిగా పాప, తాప, దైన్యములు నశింపు జరుగుతాయని తెలియండి! ఇది గురు భక్తులబాట. సద్గురుని దివ్య చైతన్యం ఈనాటికీ ఇక్కడ మనకు అనుభవమగుచూ మనలను ఉద్ధరిస్తూనే వున్నది. ఆనాడు జరిగిన లీలలే అయినా విని అది కథయే కదా! అనుకొంటే మీకు అనుభవ రూపంగా ఏమీ దొరకదు. ఆనాడు వారిని ఉద్ధరించావు. ఇప్పుడు మమ్మెందుకు ఆదుకోవు అని విశ్వాసంతో ప్రార్థన చేయాలి. శ్రద్ధతో, ఓర్పుతో, నిరంతర స్మరణతో ఉండే వారికి ఆయన అనుగ్రహం లభించడం తథ్యం. ఉదాహరణకు నామధారకుడు గురుచరిత్రలో నా పూర్వీకులందరూ గురు భక్తులైనందున నాకెందుకు నీ దర్శనమియ్యవు? లేకుంటే సత్పురుషులకు ఫిర్యాదు చేసి నా ఋణం రాబట్టుకొంటానని ఎంత ధీమాగా పలుకుతాడు. గురుభక్తులు ఆ విధంగా గూడ అనుగ్రహాన్ని పొందవచ్చు.

ఆ స్వామి వారి లీలలు చెప్పేవారికీ వినే వారికీ కూడా ఆనందాన్ని ప్రసాదిస్తాయి అని చెప్పి ఇలా ప్రార్ధన చేశారు.

"శ్రీపాదరాయా! దయాసాగరా ! ఆనంద సంధాయకా ! నీకరుణ మాపై కురిపించి నీ లీలలను స్ఫురింప చేయుమయ్యా! వేదవేదాంత వేద్యా ! వేదోద్ధారకా ! నీవే మాకు శరణ్యము" అని చేతులు జోడించి ప్రార్థించి ఇలా చెప్పసాగారు.

## అంబికయను బ్రాహ్మణి వృత్తాంతము

కురువపురంలో అంబిక మరియు శివశర్మ యను బ్రాహ్మణ దంపతులు నివసిస్తూండేవారు. వారికి పూర్వకర్మల దోషంవల్లనో, వారి దురదృష్టమో కలిగిన సంతానం పెక్కుమంది చనిపోయిరి. ఒక్కరుకూడ బ్రతకలేదు. శివశర్మ మహా పండితుడు. వేదపండిత సభలకు, సమావేశములకు తరచుగా పోయివస్తూ గొప్ప బహుమానములు అందుకొనేవాడు. సద్బ్రాహ్మణుడు, సదాచార సంపన్నుడని చుట్టుప్రక్కల గ్రామాలవారు వారికి పండిన పంట నుండి ఎంతో కొంత ఈ బ్రాహ్మణునికి ధర్మం చేస్తూ ఉండేవారు. ఆయన గూడ గ్రామస్థులు సుఖసంతోషాలతో వుండాలని ప్రార్థన చేసి తన నిత్యానుష్ఠానములు చేసుకొంటూ ఉండేవారు. అంబికయు భర్తకు అనుకూలవతియైన భార్యగా ఆయన అడుగుజాడలలో నడుచుకుంటూ ఉండేది. ఇరుగు పొరుగు

వారల సంక్షేమము కోరే మనస్తత్త్వం కలిగి వర్తించేది. వారి జీవితాలలో అన్నీ వున్నా సంతోషం దూరమైంది. పుట్టిన సంతానం పుట్టినట్లు దూరమవుతుంటే అంబిక చాలా బాధపడి ఒక రోజు భర్తనుచేరి "నాథా! మన జీవితాలలో ఈ కొఱత ఇలా వేధిస్తున్నది గదా! మన పూర్వజన్మ సుకృతమో, దుష్కృతమో తెలియకున్నది. తీర్థయాత్రలు చేసి పుణ్యక్షేత్రాలలోని దైవదర్శనాలన్నా చేసుకొంటే మన జీవితంలో పాపం పరిహారమై మనలనుద్ధరించే సంతానం కలిగి ఈ చింత తీరుతుందేమోననిపిస్తున్నది. మీకు చెప్పగలిగేటంతదానను కాను. కానీ నా బాధ అర్థం చేసుకొని నా కోరిక మన్నిస్తారని ఈ ప్రస్తావన చేస్తున్నానంటూ నెమ్మదిగా కోరింది.

శివశర్మ కూడా కాస్త నిదానంగానే ఆలోచించాడు. ఆ కాలంలో ఏ పుణ్యక్షేత్ర సందర్శనానికైనా కాలి నడకనే పోవాలి. అందువల్ల స్త్రీలు ఎక్కువదూరం ప్రయాణాలు చేయ సమర్థులు కారని మరియు స్త్రీలకు మరికొన్ని ఆటంకాలుంటాయని పూర్వం పురుషులు మాత్రమే తీర్థయాత్రలకు పోయేవారు. కాని అంబిక తన ప్రారబ్ధాన్ని బాపుకొనేటందుకు తీర్థయాత్రలకు తీసుకుపొమ్మని కోరుచున్నది. తనకున్నూ పుత్రులు లేకుంటే పున్నామ నరకం తప్పదని తెలుసు. ఏ పుట్టలో ఏ పామున్నదో! ఆమె కోరిక కూడా సమంజసమైనదే. ధర్మపత్నియైన అంబిక అభిమతం తనను గూడ ఉద్దరించే మార్గమే గదా! తీర్థయాత్రలు శుభకరమేనని తన సమ్మతిని భార్యకు తెలిపాడు.

ఒక శుభముహూర్తాన భార్యాసమేతంగా శివశర్మ తీర్థయాత్రలకు బయల్దేరినాడు. పాదయాత్రలు చేస్తూ తొలుతగా అలంపురం చేరినారు. తుంగభద్రా నదిలో స్నానం చేసి అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన జోగులాంబ (యోగినీమాత)ను దర్శనం చేసుకొన్నారు. అంబిక మనః పూర్వకంగా ఆ మాతనిలా ప్రార్థించింది. "తల్లీ ! నా జీవితంలో సంతాన నష్టాన్ని కలిగించే దుష్కర్మను తొలగించి వంశోద్ధారకుడైన పుత్రుని ప్రసాదించమని వేడుకొన్నది. తదుపరి శివశర్మ దంపతులు దారిలో తారసపడే ప్రతి దేవాలయమును సందర్శిస్తూ ఉమామహేశ్వరం చేరారు. అచ్చట మహిమాన్వితమైన ఆ దేవతా మూర్తులను సందర్శించి ప్రార్థించారు. అచ్చటి నుండి నడచి నడచి శ్రీశైలం చేరుకొన్నారు. పాతాళగంగలో స్నాన మాచరించి శ్రీ భ్రమరాంబా–మల్లికార్జునులను దర్శించి అర్చించుకొన్నారు. ఆ దేవదేవునిలా ప్రార్థించారు. తమ దుష్కర్మలను నిర్మూలించి తమకు పుత్ర సంతానమును ప్రసాదించమని మనసారా ప్రార్థనలు చేశారు. అచ్చటనున్న జ్యోతిర్లింగమునకు అభిషేకములు, అర్చనలు అన్నీ శివశర్మ స్వయంగా చేసినాడు. మూడు రోజులు ఆ క్షేత్రంలో ప్రశాంతంగా నివసించారు. శ్రీగిరినిలయునీ, భ్రమరాంబాదేవినీ పదే పదే ప్రార్థించుకొన్నారు. తర్వాత భార్యాభర్తలిరువురు బయద్దేరి తిరుగుప్రయాణం చేశారు. వారు

నిండైన తృప్తితో ప్రశాంతంగా ఇంటికి తిరిగి వచ్చారు.

తీర్థయాత్రలు పూర్తి చేసిన సందర్భంగా బంధుమిత్రులనందరినీ ఆహ్వానించి అత్యంత వైభవంగా అన్నసమారాధన చేసి బ్రాహ్మణులకు భూరి దక్షిణలు, సంభావనలు సమర్పించారు. గోదానము కూడా చేసినారు. వచ్చినవారంతా వీరికి దీర్ఘాయుష్మంతుడైన పుత్రుడు కలగాలని దీవించారు. కొద్ది రోజులలో అంబిక గర్భం ధరించి ఒక మగ శిశువును కన్నది. శివశర్మ చాలా సంతోషించాడు. అంబికకు "ఈ బాలుడు దైవ ప్రసాదము. మన తీర్థయాత్రల ఫలము" అని విశ్వాసము కలిగింది. ఆ పుత్రునికి ఆంజనేయ శర్మ అని నామకరణం చేశారు. ఆ బాలుడు భౌతికంగా బాగానే ఎదుగుతున్నాడు. కానీ వాడు మానసికంగా మాత్రం అమాయకంగా వున్నాడు. ఏడు సంవత్సరాలు పూర్తికాగానే శివశర్మ తన కుమారునికి యథావిధిగా ఉపనయనం చేసి గాయత్రీ మంత్రోపదేశం చేస్తే వాని బుద్ధి వికసిస్తుందేమోనని ఉపనయనం తలపెట్టాడు.

చాలా వైభవంగా తమ బంధువులను, స్నేహితులను ఆహ్వానించి శివశర్మ తన పుత్రునికి ఉపనయనం చేశాడు. ఎంతో కాలానికి వీరింట్లో శుభకార్యం చేసుకొంటున్నారని బంధువులంతా వచ్చారు. ఆంజనేయ శర్మకు ఉపనయనం చేశారు. ముహూర్త సమయంలో తండ్రి శివశర్మ కుమారుని చెవిలో గాయత్రీ మంత్రోపదేశం చేశాడు. కానీ కుమారుడు మంత్రం సరిగా పలకలేకపోయినాడు. "వాడు మందబుద్ధియని తెలిసి గూడ ఇంత వైభవంగా ఉపనయనం చేసి ఖర్చుపెట్టావు. అనవసరంగా ఇదంతా చేశావు. ఆ పిల్లవాడు సరిగా ఒక్క మంత్రం కూడా పలకలేక పోతున్నాడు" అని కొందరు శివశర్మను ఎగతాళి చేశారు. ఎక్కడి బంధువులక్కడ వారి వారి ఇండ్లకు పోయినారు. శివశర్మ భగవంతునిపై భారం వేసి కొడుకుకు ప్రతిపూట సంధ్యావందనం నేర్పించేటుందుకై వానిచే మంత్రాలు వల్లె వేయించే ప్రయత్నం విడువలేదు. కానీ వానికి మంత్రాక్షరాలు నోరు తిరగక ఉచ్చరించలేకపోయేవాడు. శివశర్మ కోపంతో వానిని దండించేవాడు. పోగా పోగా ఒక్కడు బ్రతికి బట్టకట్టాడు. వాడినీవిధంగా రోజు కొడుతూ ఉంటే తల్లి చూచి భరించలేకపోయేది. దండించక పోతే విద్యలు రావని మొదట మొదట ఓర్చుకొన్నది. కొన్ని రోజులైన తర్వాత ఎంత కొట్టినా వీడికి బుద్ధి వికసించక పోతే మంత్రాలెలా వస్తాయి? "వీడు అమాయకుడే! స్థబ్ధుడే ! అందుకని కొట్టి చంపేస్తారా?" అంటూ భర్తను అంబిక ఒక రోజు అడ్డుకొన్నది. "దెబ్బలు కొడితే భయం ఉంటుంది. భయంవల్ల చదువు వస్తుంది. నీవు వీడిని అతిగారాబం చేసి మూర్ఖుడిగా తయారు చేశావు" అని శివశర్మ భార్యపై కోపగించాడు.

ఎలాగైనా తనకు ఈ మంత్రాలు, పాఠాలు, దెబ్బలు తప్పితే చాలునని ఆంజనేయశర్మ సందు చూచుకొని బయటికి పారిపోయేవాడు. ఒక రోజు శివశర్మ మితిమీరిన కోపంతో ఆ బాలుని బాగా కొడుతుంటే అంబికకు కోపం వచ్చి "నాథా ! ఇక వీడి ఒంటి మీద ఒక్క దెబ్బపడినా నేను సహించలేను. ఆత్మహత్య చేసుకొంటాను. వీడి కర్మలో ఏది వున్నదో అదే అవుతుంది. మీరు కొట్టినంత మాత్రాన బుద్ధిరాదన్నాను గదా! ఎన్నో మ్రొక్కులు మ్రొక్కి ఒక్క కొడుకు దక్కితే చాలని మనం ప్రార్థించుకొన్నది ఇలా కొట్టి చంపుకోవడానికా? మనకింతే ప్రాప్తియని తెలుసుకోలేరా? మీ విద్యలు కనీసం ఈ మాత్రం ఆలోచించుకోనివ్వడం లేదా? నేను వీడిని చూచుకొని మాత్రమే బ్రతుకుచున్నాను. వేదవిద్యలేనంత మాత్రాన వీడు మనిషిగా ఈ ప్రపంచంలో బ్రతుకగూడదా?" అంటూ తీవ్రంగా మాట్లాడింది.

ఏనాడూ భర్తమాటకెదురాడని భార్య అలా మాట్లాడేసరికి శివశర్మకు తీవ్రమైన మనోవేదన కలిగింది. "అవును! భగవంతుడే ఎవరి కర్మకు వారిని వదిలేస్తాడు. అటువంటప్పుడు నేను మాత్రం ఎందుకీ విధంగా తాపత్రయపడాలి?" అని తనలో తానే కుమిలి కుమిలి ఇక జీవితంలో సాధించాల్సిందంటూ ఏమీ లేదు. మహా పండితుని కొడుకుకు సరిగ్గా గాయత్రీ మంత్రం కూడా రాలేదన్న అపఖ్యాతి ముందర మరణం ఏమీ గొప్పకాదని ఆ రోజు నుండి ఏ శుభకార్యాలకు యజ్ఞయాగాలకు వెళ్ళడం మానేశాడు. తీర్థయాత్ర తర్వాత సమారాధన, పుత్రోదయం తర్వాత దానాల రూపంగాను, ఉపనయనం కార్యమునకు ఉన్న ధనమంతా ఖర్చయ్యింది. అయినా ప్రయోజనం చేకూరలేదు. బాలుడు జన్మించాడుగానీ వంశ గౌరవం నిలబెట్టటానికి విద్యావంతుడు కాలేక పోయినాడు గదా! అనే దిగులుతో కృంగి కృశించి కొద్ది రోజులలోనే మరణించాడు. అంబికకు ఇటు కొడుకు ప్రయోజకుడు కాలేదు. భర్త మరణించాడు. విధవరాలైంది. పైగా కొడుకు వుండీ కూడా అనాథే అయ్యింది. ఉపనయనం అయింది కావున భిక్ష కొరకు పది ఇళ్ళకు వెళ్ళే అర్హత వుంది ఆంజనేయ శర్మకు. కానీ ఆ ఊర్లో అతని సంగతి అందరికీ విశదమే. ఆ కారణంగా ఎవ్వరూ అతడికి భిక్ష కూడా ఇవ్వని స్థితి వచ్చింది. క్రమంగా ఇంటిలోని సామాగ్రిని విక్రయించి కొన్నాళ్ళు పొట్టపోసుకున్నారు. చివరకు అది కూడా లేని స్థితిలో ఎంతో బాధపడింది అంబిక. కొడుకు మూలంగా ఆ తల్లికి ఏ విధమైన రాబడియు ఆ గ్రామంలో రావడం లేదు. పూర్వం నిండుగ ధాన్యాలతో నిండియుండే గాదెలు ఖాళీతో నిండుకున్నవి. మొదటి నుండీ ఆమె దేనికీ కష్టపడలేదు. కానీ ఈ పరిస్థితులలో కాయకష్టం చేసి జీవించవలసి వచ్చింది.

లోగడ అంబిక సంతానం గురించే దుఃఖించేది. ఇప్పుడు ఒక దుఃఖం తీరిందనుకొంటే మరొక దుఃఖం మీదపడింది. ఉన్న ఊరిలో ఒకప్పుడు బాగా బ్రతికిన కుటుంబంలోని వ్యక్తి. వేరు పనులేమీ చేయుట తెలియదు. ఇప్పుడు తన కొడుకు నెలా పోషించుకోవాలన్న ఆలోచనతో కొన్ని రోజులు తాను వస్తులుండి కొడుకుకు అన్నం పెట్టింది. అయినా ఆంజనేయశర్మలో ఏమాత్రం మార్పులేదు. అంబికయే ఆలోచించి ఒక నిర్ణయం తీసుకొంది.

ఆ ఊరిలో తనకూ, తన పుత్రునికీ స్థానం లేదని తెలిసింది. కావున కొడుకును తీసుకొని గ్రామాన్ని విడిచిపెట్టింది. కృష్ణానదిని దాటి చుట్టుప్రక్కల గ్రామాలలో బ్రాహ్మణుల యిళ్లలో ఏదో ఒక పని చేసి వారు పెట్టింది తెచ్చుకొని కొడుకుకు పెట్టి తానూ తింటూ, ఎవరు ఆదరిస్తే వారింట్లో తలదాచుకొంటూ కాలం వెళ్ళదీస్తున్నదా తల్లి. సొంత ఊరు వదలిన తర్వాత ఏ వూరైతే నేమి. ఎక్కడ ఆదరణ దొరికితే అదే మన ఊరని సరిపెట్టుకొని, భగవంతుని ప్రార్థించుకొంటూ, ఏనాటికైనా తన కొడుకుకు మంచి రోజులు రాగలవని, వాడినొక ఇంటివాడిని చేయాలని కలలు కంటుండేది ఆ పిచ్చితల్లి.

ఇలా తల్లీ కొడుకులు జీవిస్తుండగా ఆంజనేయశర్మ గోకర్ణం నుండి వస్తున్న యాత్రికులతో దారిలో కలిసి పంచదేవ పహాడ్‌కు రావడం జరిగింది. ఆ రాత్రి వారు చేసిన నామ సంకీర్తనలో పాల్గొన్నాడు. మర్నాడు వారితో పాటుగానే కృష్ణానదిలో స్నానం చేశాడు. వారంతా గోకర్ణము, శ్రీశైల విశేషాలు, మాహాత్మ్యాలు గ్రామస్థులకు చెప్తుతుంటే విన్నాడు. గోవింద భట్టు బృందంతో పాటుగా వచ్చి శ్రీపాద స్వామివారిని వైకుంఠ ఏకాదశీ పర్వదినాన దర్శించుకున్నాడు. అందరూ సాష్టాంగ నమస్కారాలు చేస్తుంటే తాను కూడా చేశాడు. గోవిందభట్టు మొదలైన వారందరూ తిరిగి వెళ్ళిపోయాక తాను తిరిగి ప్రయాణించి తల్లిని చేరుకొన్నాడు. తల్లి అంబిక ఏడు రోజులుగా తనయుడు కనిపించలేదనీ, ఏమైపోయాడోననీ బాధపడుచున్నది. కానీ ఎవరినన్నా అడుగుదామన్నా, ఎవరికన్నా చెప్పుకొందామన్నా వారు ఈసడించుకొంటారని భయం. అయినా ఒకరిద్దరిని అడిగింది. వారు ఎగతాళి చేశారు. "ఎందుకమ్మా! అప్రయోజకుడైన కొడుకు ఉండి నిన్నేమి ఉద్ధరిస్తాడు? నీవు భిక్ష చేసి తెచ్చిపెడితే తినేవాడేకానీ నీకు పెట్టే ఆశ ఎలాగూ లేదుగా! పోనీ! ఎట్లైనా పోయి వాడి పొట్టైనా పోసుకోగలిగితే సంతోషించరాదా!" అని ఎద్దేవాగా పలికారు. అంబిక మనసెంతో గాయపడింది. కానీ భగవంతుని ప్రార్థన చేసుకొంది. శ్రీశైల మల్లన్నను తలుచుకొన్నది. నేనుండగా వాడినొక ఇంటివాణ్ణి చేయాలని కోరిక వుంది. "భగవాన్! నీవు ప్రసాదించిన ఈ పుత్రునివల్ల

వంశాభివృద్ధి లేకపోతే నీవు ఈ వరం నాకిచ్చి మాత్రం ఏమి ప్రయోజనం తండ్రీ!" అంటూ ప్రార్థించుకొంది. తనలో తనే బాధపడింది. ఎంతైనా నేను తల్లిని గదా! నాకు ఓపిక ఉన్నన్ని రోజులు ఏదో ఒక పని చేసి నీరు మోసియైనా వాడికన్నం పెట్టుకుంటుంటే చూచేవాళ్ళు ఓర్చుకోలేకపోతున్నారే! భగవాన్! ఏమి ఈ లోకం! మాబోటి వాళ్ళు బ్రతికేటందుకు కూడా అర్హత లేదా! అంటూ దుఃఖిస్తూ నిద్రించింది.

మరునాడు ఆంజనేయ శర్మ వచ్చి తల్లికంటపడ్డాడు. తల్లి తనయుని చూస్తూనే "నాయనా! ఏడు రోజుల నుండీ కనపడకుంటే ఏమై పోయినావోనని బాధపడుతున్నానురా! నాకు చెప్పకుండా ఎక్కడకు పోయినా?"వని అడిగింది. అప్పుడాతడు అదుగో! నీవు కూడా అదే ప్రశ్న వేస్తున్నావు. మన ఎదురింటాయన ఆమాటే అడిగితే మరే గోకర్ణం నుండి యాత్రికులు వచ్చారు గదా! వారితో పాటుగా పోయి కృష్ణానదిలో స్నానం చేశాను. అక్కడ ఒక స్వామిని చూచాను. అని చెప్తుంటే ఆయనేమో అక్కడిదాకా వెళ్ళినవాడివి ఆ యేట్లో పడిచావక మళ్ళెందుకొచ్చావు? అన్నాడమ్మా! మళ్ళీ నీకు చెప్తేనీవూ అలాగే అంటావు గదా! అందుకే నీకేమీ చెప్పలేదు. నేను చెప్పను" అన్నాడు గారాంగా. తల్లి ఇలా అంది "కృష్ణానదిలో స్నానం చేయడం మంచిదే నాయనా! మనం కురువపురంలో వున్నప్పుడు రోజు నీ తండ్రీ, నేను కృష్ణానదిలో స్నానం చేసేవారం. అయినా తీర్థయాత్రలు చేయాలనిపించి కోరితే నా కోర్కెమన్నించి మీ తండ్రి నన్ను శ్రీశైలయాత్ర చేయించారు. ఆ మల్లికార్జున స్వామి వరం వల్లనే నీవు పుట్టావు" అని చెప్తూంటే ఆంజనేయశర్మ "అమ్మా! ఇప్పుడు నీవు చెప్పావే ఆ ఊరిపేరు గూడా అక్కడ చెప్పారు. ఆ స్వామి వారుగూడ అక్కడ తపస్సు చేశారట. ఇంకా ఏమేమో చెప్పారు. కర్మలు పోతాయన్నారు. నాకు కొంచెంకొంచమే అర్థమయినాయి అన్నాడు.

తల్లి కొడుకుతో "మంచిదేలే! నాయనా! ఇతరులతో మనకెందుకు? నీవు తిరిగొచ్చావు. నాకదే చాలు అన్నది. మరునాడు ఆమె ఒకరింట్లో తద్దినమునకు వంట చేయడానికి ఒప్పుకొన్నది. ఉదయాన్నే తొందర తొందరగా లేచి వెళ్ళిపోయింది. ఆంజనేయ శర్మ నిద్రలేచి వాని పనులు చేసుకొన్నాడు. యాత్రికులతో వున్నన్నాళ్ళు స్నానం చెయ్యగానే బొట్టుపెట్టుకోవాలని తెలుసుకొన్నాడు. కావున తాను ఈ రోజున ఇంటి వద్ద ఆ అలవాటు మరువకుండా దేవుని దగ్గర నుండి గంధము, కుంకుమ తీసుకొని బొట్టు ధరించాడు. అంతకు ముందు ఎప్పుడైనా తల్లి చెప్పినా బొట్టు పెట్టుకొనేవాడు కాదు. అటువంటివాడు తనంతట తానే బొట్లు ధరించాడు.

అంతేకాదు. అలా దేవుని ముందర కూర్చోగానే అతనికి మొన్న వారంతా చెప్పుకొన్న మాటలు మదిలోకి రాసాగినవి. గురువు యొక్క గొప్పదనము గురించి గురువు సాక్షాత్ పరమేశ్వరుడేనని, గురువు లేనిది ఈ ప్రపంచంలో ఏదీ లేదని ఆ సజ్జనులు చెప్పుకొన్నవన్నీ జ్ఞప్తికి వచ్చింది. ఆంజనేయశర్మకు మామూలుగానైతే జరిగిన విషయాలేవీ జ్ఞాపకం ఉండవు. అందువల్లనే పాఠాలు వల్లెవేయలేకపోయేవాడు. ఎవరైనా నిందించినా అంతే. మతిమరుపువల్ల అవేవీ గుర్తుండేవికావు. కానీ ఈనాడు ఆశ్చర్యంగా ఆ యాత్రికుల సంభాషణలు, శ్రీ స్వామివారి దివ్యరూపం జ్ఞాపకానికి వస్తున్నవి. ఇది అతనికే ఆశ్చర్యాన్ని కలిగించింది.

వారి మాటలు, శ్రీపాదుల అనుగ్రహ వాక్కులు అన్నీ గుర్తుకు వచ్చినవి. గోవిందభట్టు పాడిన "దిగంబరా – దిగంబరా – శ్రీపాదవల్లభ దిగంబరా" ఆ పదం గుర్తుకొచ్చింది. ఆ దివ్యమంత్రాన్ని మరల మరల వారు జపించిన విధంగానే నామ సంకీర్తన చేయసాగినాడు. అలా తాను సంకీర్తన చేస్తుంటే అతనికి అమితమైన ఆనందం కలిగింది.

అప్పుడతనికి బాగా ఆకలివేసింది. తల్లి వున్న చోటకి వెళ్ళేందుకని బయటికి వచ్చాడు. వీధిలోకి పోగానే ఆంజనేయశర్మ ముఖాన పెట్టుకొన్న బొట్టును చూచి కొందరు కొంటెవాళ్ళు గేలి చేయడం మొదలు పెట్టారు. నీకోసం మీ అమ్మ ఏడుస్తుందని తిరిగి వచ్చావా? వెళ్ళినవాడివి మళ్ళీ ఎందుకు తిరిగొచ్చావు? కృష్ణలోపడి చచ్చిపోయినా పీడ పోయేది" అన్నారు.

ఆంజనేయశర్మ నిన్నటి వరకు ఎవరైనా నవ్వినా, ఎగతాళి చేసినా ఏమీ పట్టించుకొనేవాడు కాదు. ఏమీ గుర్తుపెట్టుకొనే వాడు కాదు. అటువంటి వానికిప్పుడు వారీమాటలనగానే ఎందుకో బాగా రోషం వచ్చింది. బాధ కలిగింది. తనలో ఏమి మార్పువచ్చిందో తనకే తెలియదు. ఆ బాధ తట్టుకోలేక అతని తల్లి ఎవరింటిలో వున్నదో అక్కడికి పోయినాడు. "అమ్మా! అమ్మా!" అంటూ పిలిచాడు. ఏమిటని వాళ్ళమ్మ బయటకు వచ్చింది. చూస్తే! ఆంజనేయశర్మ. నుదుట గంధం, కుంకుమ బొట్టు పెట్టుకొని ముచ్చటగా వున్నాడు. "అంబిక ఏమిటి నాయనా! ఎందుకు నీవిక్కడికి వచ్చావు? నేనే ఇంటికి వస్తానుగా. కొంచెంసేపు ఆగు!" అన్నది. ఆమె మాటలు వినిపించుకోకుండానే "అమ్మా! నేను పోతున్నా! కృష్ణలో పడి చనిపోతా! నేను చచ్చిపోతే అందరికీ సంతోషం కలుగుతుంది" అంటూ ఏడుస్తూ చెప్తున్నాడు. అంబికకు ఏమీ బోధపడలేదు. కుమారుని దగ్గరగా తీసుకొని ఇదేమిటిరా! చనిపోతానంటావు. తప్పుకదా! అయినా నీకు ఏమి బాధ కలిగింది. ఎందుకలా మాట్లాడుచున్నావు? అని వానిని తలనిమిరి, గడ్డము పట్టుకొని, "అటువంటి ఆలోచనే చేయకూడదు

నాయనా! నీవు తప్ప నాకింకెవరున్నారు?" అని బుజ్జగించింది. దానికి అతడిలా చెప్పాడు. "ఈ ఊరిలోనివారందరూ నన్ను ఎగతాళి చేస్తున్నారు. కృష్ణలోపడి చనిపో!మ్మని అంటున్నారు" అని ఏడ్వసాగినాడు. తల్లి "బాధపడవద్దు తండ్రీ! వారేమన్నా నీవు పట్టించుకోవద్దు" అంటుండగా ఆ బాలుడు తల్లిని విదిలించుకొని కృష్ణానదివైపుకు పోసాగినాడు.

తల్లి "పోవద్దు నాయనా! పోవద్దు! ఆగు-ఆగు" అంటూ వెంటపడి వానిని ఆపి "శ్రీశైల మల్లన్న ప్రసాదంరా నీవు! నీవు చనిపోతావన్న మాటే నేను వినలేను. నిన్ను చూచుకొనే నా బ్రతుకు వెళ్ళదీస్తున్నాను నాయనా!" అంటుంటే ఈ దృశ్యం చూచిన గ్రామస్థులు కొందరు ఇరువురినీ చూచి "సరిపోయింది! తల్లీ కొడుకులు! వీధిన పడడమూ! చస్తాననడం! వింత! ఇంకేమి కావాలీ! పోండి! ఇద్దరూ కలిసే ఏట్లో దూకండి! పీడ విరగడైపోతుంది!" అని గేలి చేయసాగారు. ఆంజనేయశర్మ రోషంతో తల్లిని విదిలించుకొని ఏటివైపు పరుగిడసాగినాడు. వానివెంట ఏడుస్తూ, వానిని వారిస్తూ తల్లి గూడా కొడుకు వెంట పరుగెత్తసాగింది. శ్రీ గురుని సంకల్పము వలన గాబోలు వాడు శ్రీపాదుల దర్బారు ప్రదేశము ప్రక్కలగల నదీతీరము వైపుగా పరుగిడసాగినారు.

## బ్రాహ్మణబాలునికి శ్రీపాదుల అనుగ్రహం

శ్రీస్వామివారు నదీతీరంలో గట్టుపైన కూర్చుండి ధ్యానంలో ఉన్నారు. శ్రీపాదస్వామి వారి బట్టలు ఉదికి ఆరవేసి శ్రీపాద నామస్మరణ చేస్తూ కూర్చున్నాడు రజకుడైన రవిదాసు. గోవిందభట్టు ఆనంద పారవశ్యంతో పలికిన నామం అందరికీ తారక నామంగా మారింది. అతడు కూడా "దిగంబరా-దిగంబరా- శ్రీపాదవల్లభ దిగంబరా" అనే నామం చేస్తూ కూర్చుని ఉన్నాడు. శ్రీపాద స్వామికి ఆంజనేయ శర్మ, అతని తల్లీ నదిలో దూకడానికి నిర్ణయించుకొని వస్తున్నట్లు తెలిసింది. సర్వ సమర్థులు, సర్వాంతర్యామియైన ప్రభువుకు తెలియనిదేముంటుంది? రవిదాసుతో స్వామి ఇలా చెప్పారు. "రవిదాసూ! అల్లంత దూరాన కనిపిస్తున్న ఆ తల్లీ కొడుకులను నీవుపోయి, వారి ప్రయత్నం మాన్పించి ఇక్కడికి తీసుకొనిరా!" అన్నారు.

రవిదాసు వెంటనే నదీతీరాన చూడగా అచ్చట నిజంగానే ఆ తల్లీ కొడుకులు నదిలో దూకే ప్రయత్నంలో వున్నట్లు కన్పించారు. రవిదాసు ఒక్క పరుగున వారి వద్దకు వచ్చాడు. "ఆగండి! ఓ బాపనయ్యా! ఓ తల్లీ! లేకుంటే నేను మిమ్ములను తాకవలసి వస్తుంది" అంటూ బెదిరించాడు. ఆంజనేయశర్మ, తల్లీ ఆగినారు. అతడు వాళ్ళ దగ్గరకు వచ్చి "నడవండి! ఆ స్వామి వారు మిమ్ములను అక్కడకు తీసుకురమ్మంటున్నారు!" అంటూ గదిమాడు. అతనివెంట వారిద్దరూ

మంత్రముగ్ధులైనట్లు నడిచారు. స్వామి సన్నిధిని చేరారు. స్వామి ఆ తల్లిని చూచి "ఏమమ్మా! మీరక్కడ ఏమి చేస్తున్నా"రని ప్రశ్నించారు. ఆ తల్లి దుఃఖిస్తూ తమ కథను పూర్తిగా వివరించి తన గోడునంతా వెళ్ళబోసుకుంది.

చివరగా ఈ అమాయకుడైన కొడుకుని పోషించుకొనుటకై ఇతరుల ఇండ్లవద్ద చాకిరి చేసి, నీరుమోసి తిప్పలు పడుచున్నాను. కాని ఊరివారందరూ వీనిని "పండితపుత్రః శుంఠః" అని గేలిచేస్తూ నీవు వ్యర్థుడవు. నీకు పిల్లనెవరిస్తారనీ, ఆ నదిలో దూకి చావమని నిందిస్తుంటే వీడు నదిలో దూకి ఆత్మహత్య చేసుకొంటానని వచ్చాడు. స్వామీ! వీడిమీదే ఆశలు పెట్టుకొని వీడి కోసమే జీవించే నేను వీడు పోయాక ఇంకా బ్రతకటం ఎందు?కనుకున్నాను" అని తీవ్రమైన శోకంతో విన్నవించింది.

శ్రీ స్వామివారు అపార కరుణామయుడు. ఆర్తజన బాంధవుడు. ఆ తల్లీ, కొడుకులను అమృత దృష్టితో వీక్షించారు. అంబికతో ఇలా అన్నారు. "అమ్మా! నీవు పూర్వజన్మలో చేసిన కర్మల ఫలితంగా ఇలాంటి పుత్రుడు కలిగాడన్నావు. కాని ఈ విధంగా ఈ జన్మను అంతం చేయాలనుకొన్నావు! ఆత్మహత్య పాపం ఎంత బలీయమో తెలుసా? నీ అవివేకపు ఆలోచనకు స్వస్తి చెప్పి నిత్యమూ ఈశ్వరుని ఆరాధించు! నీకు వచ్చే జన్మలోనైనా మంచి సంతానం కలుగుతుంది అన్నారు. అప్పుడా బ్రాహ్మణి "స్వామి ! మాకు ఉదరపోషణయే బహుకష్టముగా నున్నది. నేను పూజలేవిధంగా చేయగలను? ఈ కొడుకును పెంచలేక, లోకనిందలు సహించలేక, విరక్తితో వున్న నాకు ఏది శ్రేయస్కరమో తమరే నిర్ణయించండి!" అని వేడుకొంది.

అప్పుడు శ్రీ స్వామివారు కరుణార్ద్ర హృదయంతో ఆమె కుమారుని చేరబిలిచి అతని శిరస్సుపై తమ దివ్య హస్తమునుంచి "ఓం" కారమునుచ్చరించిరి. ఆ స్పర్శ తగిలిన తోడనే ఆ బాలుని శరీరము నందు విద్యుత్తు ప్రవహించినట్లు ప్రకంపనలు కలుగగా నిశ్చేష్టుడై శ్రీ స్వామి వారి ముఖ మండలమును, వారి కళ్ళలోని దివ్యశక్తిని దర్శించెను. శ్రీ స్వామివారితోపాటు తానున్నూ ఓంకారమునుచ్ఛరించెను. అట్లు శ్రీ స్వామివారు అతనితో ముమ్మారు ఓంకారోచ్ఛారణ చేయించి అతనిపైన తమ అమృతదృష్టిని సారించగా అతని శరీరము స్థిరత్వమునొందెను. మనస్సు ఆహ్లాదపడెను. ఏదో తెలియని దివ్యానుభూతిని పొందెను. ఆ మూర్ఖబాలునికి సకల శాస్త్రపరిజ్ఞానము స్ఫురణకు వచ్చెను. సకల విద్యలు వేద మంత్రములు ఎప్పుడో వల్లెవేసినవానివలె మనసున భాసించెను. వెంటనే అతడు --

"ఓం నమోస్త్వనంతాయ సహస్ర మూర్తయే – సహస్ర పాదాక్షి శిరోర్బాహవే

సహస్ర నామ్నే పురుషాయ శాశ్వతే సహస్ర కోటీయుగధారిణే నమః ॥

అని చేతులు జోడించి ప్రణామము చేయుచూ ప్రార్థన చేసెను.

అతని తల్లి అంబికతో శ్రీస్వామి "మాతా! ఇప్పుడు నీ దుఃఖం తీరిందా? ప్రశాంత చిత్తంతో ప్రదోష సమయమున నిత్యము శివపూజ విధిగా చేయు"మని ఆదేశించిరి. "ఆ విధంగా చేస్తే వచ్చే జన్మలో తమవంటి ఉత్తమ పుత్రుడు కలుగునట్లు నన్నాశీర్వదించండి స్వామీ!" అని అంబిక ప్రార్థించింది. శ్రీస్వామివారు తప్పక నీ కోరిక నెఱవేరుగాక! అని దీవించారు. అంతేగాక ప్రదోషకాలంలోని శివపూజా ప్రభావాన్ని వివరిస్తూ ఇలా చెప్పారు.

"పూర్వం ఉజ్జయినిలో చంద్రసేనుడను రాజు తన స్నేహితుడైన మణిభద్రునితో కలిసి ప్రదోష శివపూజా వ్రతము నాచరించుచూ ప్రజలందర్నీ భక్తిమార్గంలో నడిపించాడు. ఆ నగరంలోని గొల్లబాలురు వారి ముంగిళ్ళలో ఆకులుపూవులతో మండపమేర్పరచి శనిత్రయోదశినాడు ప్రదోషపూజ చేయసాగిరి. ఆ బాలురతల్లులందరూ ఆ పూజ చూస్తూ వుండగా ఒక బాలుని తల్లి ఆ పూజను విఘ్నపరుస్తూ తన కుమారుని లోనికి తీసుకువెళ్ళినది. ఆ బాలుడు ఏడుస్తూ తన తల్లి తప్పిదమును క్షమించమని ప్రార్థించగా అచ్చట శివలింగము నందు తేజో రూపముతో శివుడు ప్రత్యక్షమై అతనిని ఓదార్చెను. అతని తల్లి శివ పూజనుచూచిన కారణంగా యశోదగా జన్మించి విష్ణు జనని కాగలదని వరమిచ్చెను. రాత్రిపూట ఆ ప్రకాశము ఏమిటని అందరూ అచ్చటికి చేరిరి. మహా రాజుకూడా అచ్చటికి వచ్చెను. అదే సమ యంలో ఆ రాజ్యంపై దండెత్తి వచ్చిన కుట్రదారులైన శత్రురాజులు కూడ వచ్చి ఆ వింత జ్యోతిర్లింగ మును దర్శించిరి. ఆ దర్శనంతో వారి బుద్ధులు మారిపోయి శత్రుత్వమును విడనాడి చంద్రసేనునితో మైత్రి సలిపిరి. కావున తల్లీ ! ఈ వ్రతప్రభావము చెప్పనలవి కానిది. నీ అభీష్టములు సిద్ధించుటేగాదు నిన్ను దూషించువారు, ద్వేషించువారున్నూ నీకు హితులై వర్తించెదరు. అని ఆవ్రత ప్రభావము చెప్పుచుండగనే మరికొందరు భక్తులున్ను అచ్చటికి వచ్చి ఆ వృత్తాంతమంతయు తెలిసికొని ఆశ్చర్యపోయిరి. శ్రీపాద వల్లభస్వామికి జయము, జయము అని జయజయ నాదములు చేసిరి.

అంబికామాత శ్రీస్వామివారి అనుగ్రహమును స్వయంగా పొందినది. తన కుమారుని ఒక్క క్షణములోనే వారు సకల విద్యా పారంగతుని చేశారు. అటువంటి స్వామివారి వాక్కులకు తిరుగుండదని తెలుసుకొన్నది. ఈ స్వామి అఘటన ఘటనా సమర్థులని అనుభవమైనది. కావున

వెంటనే కుమారునితోసహా వారి పాదపద్మాలపై వ్రాలినది. స్వామినిలా ప్రార్థించినది. "స్వామీ! నీవు సామాన్యుడైన యతీశ్వరుడవు కావు. సాక్షాత్ లోక గురుడైన ఆదత్తాత్రేయుడవే! మీరు చెప్పిన విధంగా ప్రదోషకాలంలో శివపూజావ్రతమును తప్పక ఆచరించెదను. మీ వాక్కులు వృధాకావు. ఈ లోకంలోని అజ్ఞానులను చేరదీసి, జ్ఞానము ప్రబోధించి, మా కర్మలను నిర్మూలించి, మాకు దారి చూపుటయే కర్తవ్యంగా అవతరించిన ఓ! శ్రీపాదశ్రీవల్లభస్వామీ! శరణు-శరణు. నీకరుణామయ దృష్టిని మాపై ప్రసరింపజేసి మమ్ముద్ధరించితివి. స్వామీ! ధన్యురాలనైతి"నని ప్రస్తుతించినది. శ్రీ స్వామివారు ఆమాతా పుత్రులనాశీర్వదించి ఆంజనేయశర్మతో "ఓయీ! ఈ రోజు నుండి నీమాత సంరక్షణా భారము నీవే వహింపవలయును" అని ఆజ్ఞాపించిరి. సకలశాస్త్ర పారంగతుడైన ఆ బ్రాహ్మణ కుమారుడు స్వామికి, తల్లికి సాష్టాంగవందనము లాచరించి గురుదేవులనిట్లు స్తుతించెను.

"హే! కరుణానిధీ! దేవాదిదేవా! అనాధ నాథా! ఆదిమధ్యాంత రహితా! అద్భుత మహిమాన్వితా! ఈ దీనుని కరుణించి అనుగ్రహించితివి. తండ్రీ ! నీ సంకల్పశక్తి చేత ప్రసాదించబడిన ఈ విద్యలు నిన్ను ఏమారక స్మరించు శక్తిని, భక్తిని ప్రసాదించి నన్ను సదా నీ పాదారవింద సన్నిధిలో వుంచునట్లు వరమునిమ్ము. తల్లి, తండ్రీ, గురువు, దైవము నాకన్నీ నీవే ప్రభూ!"

**శ్లో॥ త్వమేవ మాతా పితాత్వమేవ - త్వమేవ బంధుశ్చ సఖాత్వమేవ।**
**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ - త్వమేవ సర్వం మమదేవ దేవ॥**

**(1) దాతా। విధాతా। సకల జగన్నిర్మాణ కర్తా**
**అనంతా, అచ్యుతా, భక్తాభీష్ట ప్రదాతా**
**సత్యధర్మ శాంతి ప్రేమ స్వరూపా**
**పాహిమాం పాహిమాం అనఘేశ శ్రీదత్త॥**

**(2) అత్రి వరదాయకా - అనసూయ పుత్రకా**
**ఆపదుద్ధారకా - ఆనంద దాయకా**
**ఆసేతు శీతనగ - ఆశ్రిత పరిపాలకా**
**పాహిమాం పాహిమాం - అనఘేశ శ్రీదత్త ॥**

**(3) మునిజన వందితా - ముముక్షు సేవితా**
**యోగీశ్వరేశ్వరా - యోగిజన వల్లభా**

యోగమాయాధీశ - యోగీశ పూజితా
పాహిమాం పాహిమాం - అనఘేశ శ్రీదత్త ॥

(4) కరుణా జల నిధీ - శుభకల్పభూజా
అరుణారుణతేజ - శ్రీపాదరాజా
అపూర్వ గుణగణ - మిళితపదాంబుజా
పాహిమాం పాహిమాం - అనఘేశ శ్రీదత్త ॥

(5) సకలవేదసార - సంసారభయదూర
విజ్ఞాన విస్తార - సుజ్ఞాన ప్రస్తార
ఓంకార హ్రీంకార - అక్షరాకారా
పాహిమాం పాహిమాం - అనఘేశ శ్రీదత్త ॥

(6) అతులిత బ్రహ్మాండ - అధినాయకా
దేవేంద్రాద్యమర - సంకటహారకా
జంభాసురాది - దుష్ట సంహారకా
పాహిమాం పాహిమాం - అనఘేశ శ్రీదత్త ॥

(7) సుమతి అప్పలరాజ - దత్తవరపుత్రా
సకలతీర్థ క్షేత్ర - పావనశుభగాత్రా
శ్రీక్షేత్ర కురువపుర - శ్రీకర చరిత్రా
పాహిమాం పాహిమాం - అనఘేశ శ్రీదత్తా ॥

(8) అంబికా వరసుతా - ప్రాణప్రదాతా
సకల విద్యా పూర్ణ - జ్ఞాన ప్రదీప్తా
ఆంజనేయశర్మ - భాగ్య విధాతా
పాహిమాం పాహిమాం - అనఘేశ శ్రీదత్త ॥

*ఫలశ్రుతి: శ్రీపాదాష్టక మిదం పుణ్యం విద్యావాన్ యపఠేన్నరః*
*బుద్ధిర్బలం యశోధైర్యం - లభతే సర్వకామితః*

అని స్తోత్రమును పఠించెను. ఈ ఘటనతో శ్రీస్వామివారి దివ్యమహిమ అందరికీ వెల్లడియైనది. వారి ప్రతిష్ఠ పరిసర గ్రామాలకు క్షణాలలో పాకిపోయింది. భర్త మరణంతో అనాథయై

కురువపురం (స్వగ్రామం) విడచి అవమాన భారంతో మతిస్థిరం లేకుండా గ్రామ గ్రామాలు తిరుగుచూ, భిక్ష చేసుకొంటూ, అందరిచేత నిందించబడే తల్లి అంబికయూ ఆంజనేయశర్మయూ శ్రీపాదులవారి అనుగ్రహం పొందడంతో వారి దరిద్రం కూడా తీరిపోయింది. ఈ వింత సంఘటన గూర్చి తెలిసికొన్న పంచదేవపహాడ్ గ్రామ పెద్దలు, పండితులైన కరణముగారు మున్నగు వారు ఆంజనేయశర్మను తమ గ్రామంలోనే ఉండవలసినదిగా కోరారు. ఆంజనేయశర్మ వేద పఠనం, శాస్త్రవాక్యములకు అందరూ అబ్బురపడి ముచ్చటపడ్డారు. వారి నివాసానికై ఒక గృహమును ఉచితముగా ఇచ్చెదమని ఒకరు, వారికి ఆహార ధాన్యములు సమకూర్చెదమని మరి యొక్కరు ముందుకు వచ్చిరి. సద్గురువు అనుగ్రహిస్తే తృణమును మేరువుగా మార్చగలరనే దానికిదే నిదర్శనము.

సత్యవాక్పరిపాలకులైన శ్రీ స్వామి చెప్పినట్లు వారి జాతకములు పూర్తిగా మారిపోయినవి. మృత్యువునాహ్వానించిన తమ బ్రతుకులలో శ్రీస్వామి అమృత వృష్టిని కురిపించారు. శ్రీపాదులు ఆజ్ఞాపించిన శివపూజ నిత్యము చేయాలని అంబిక నిశ్చయించుకొన్నది.

“దిగంబరా–దిగంబరా–శ్రీపాద వల్లభ దిగంబరా” అంటూ నామాన్ని నిరంతరం స్మరిస్తూ వాళ్ళు ఆనందమయ జీవనం గడిపారు.

భక్తులారా! ఈ విధంగా శ్రీపాదస్వామివారు తపస్సు చేసినది తాము తరించాలని కాదు. అందరినీ తరింప జేయుటకే వినియోగిస్తారు. గోవిందభట్టు యాత్రా బృందం వచ్చి వెళ్ళిన నాటి నుండి పసుపల, పంచదేవపహాడ్ గ్రామాల భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించుటకు, శ్రీపాద స్వామివారిని దర్శించి నమస్కరించుటకు అలవాటు పడినారు. గోవిందభట్టు పలికిన నామమే మహామంత్రమై విలసిల్లినది. గోకర్ణము, ఆళంది, పండరీపుర భక్తుల ద్వారా శ్రీపాదులవారి లీలలు, మహిమాన్వితమైన నామము మహారాష్ట్రమంతటా ప్రచారం చేయబడింది. కర్ణాటకలోను శ్రీవారి మహిమలు విస్తరించి ఆ రెండు రాష్ట్రాలలోనూ దత్తభక్తి చైతన్యం సెలయేరులైపారిందన్నారు శ్రీ విఠల్ బాబాగారు.

గోవిందభట్టు మిత్రబృందము శ్రీస్వామివారిని దర్శించుకొన్న ప్రదేశంలోనే తరువాత నిత్యము దర్బారుగా భక్తులు, ఆర్తులు వచ్చి స్వామిని దర్శించి ఎన్నో లాభములు పొందినారు. బాధలు నివారించుకొన్నారు. మందబుద్ధి బాలునికి విద్యాలాభము కలిగిన లీల వలన శ్రీస్వామి వారి ఖ్యాతి మరింత ప్రఖ్యాతమైనది. ఈ లీలవలన శ్రీపాదస్వామి విద్యాదానము, ఉత్తమ సంతాన

ప్రాప్తి కలిగించడమే కాక ఉత్తమ వ్రతముల ద్వారా జన్మాంతర కర్మలను తొలగించు మార్గమును తెలిపిరి. ఈ అద్భుత సన్నివేశం జరిగినది ఈదర్బారు ప్రదేశమే. ఈనాడు శ్రీ దత్తదేవుని నిలయంగా మారి శ్రీక్షేత్ర శ్రీవల్లభాపురంగా ప్రసిద్ధి గాంచినది. అనేక దివ్య దర్శనాలను, ఆశ్రయించిన భక్తులకు అనుగ్రహాన్ని ప్రసాదిస్తూ అదృశ్యంగా శ్రీపాదులు (శ్రీదత్తుడు) ఆశీర్వదిస్తున్నారు. అంటూ ఆనంద బాష్పాలు స్రవించగా తెలిపినారు శ్రీ బాబాగారు.

శ్రీ బాబాగారు చెప్పిన ఈ సుదీర్ఘ ప్రవచన కథాసారం అందరి మనసులను ఆశ్చర్యానందా లలో ముంచింది. నేను తెప్పరిల్లుకొని శ్రీ బాబాగారితో "స్వామీ! తమరు ఈ వృత్తాంతం చెప్పు చున్నప్పుడు మధ్యలో కదిలించరాదని ఊరకున్నాను. ఈ బాలునికి వేద శాస్త్ర విజ్ఞానమంతా ఎప్పుడో నేర్చినట్లు మనసులో భాసించినదన్నారు. ఇతడు పూర్వజన్మలో పండితుడా? ఏమి? దయతో వివరించండి. మా జన్మలు పావనమవుతా"యని ప్రార్థించాను.

మరల అదరి తరపున ఆహా! మాకు తెలివి తెలిసే సమయానికి తమరిని పంపి శ్రీపాదుడు మాకు దత్త భక్తిని తెలియజేశాడు. ఇది మా అదృష్టం. కలియుగ ప్రథమ దత్తావతారుని ప్రథమ కార్యక్షేత్రంలో వారు చేపట్టిన నూతన ప్రణాళికను గురించి తెలుసుకొనుటకు మేమెంత పుణ్యం చేసుకొన్నామో! దత్త సంప్రదాయ విశిష్ఠతను మాకు ప్రబోధించి మా జన్మలు చరితార్థం చేశారు" అని అన్నాను. అందరం ఒక్కుమ్మడి లేచి, చేతులు జోడించి,

కాషాయ వస్త్రం కరదండ ధారిణం
కమండలుం పద్మకరణే శంఖం
చక్రం శతాభూషిత భూషణాఢ్యం
శ్రీపాదరాజం చరణం ప్రపద్యే॥

శ్రీపాద శ్రీవల్లభ సద్గురు స్వరూపా! శ్రీవల్లభాపుర లీలా విహార శోభనమూర్తీ! భక్త చింతామణీ! దయాసాగరా! పండరీనాథాంశ సంభూతా! పరమగురూ! జయ! జయ! శిష్య వత్సలా జయ! జయ! అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ తస్మాతఀ కారుణ్యభావేన రక్ష! రక్ష! దత్తప్రభో!" అంటూ శ్రీశ్రీశ్రీ విఠలేంద్ర సరస్వతీ స్వామి పాదకమలాలకు సాష్టాంగ నమస్కారాలు చేశాం. హృదయాలుప్పొంగగా భక్తి ప్రపత్తులతో – శ్రీ విఠల్ బాబాగారు మావైపు చిరునవ్వులు చిందిస్తూ – చేతులు పైకెత్తి మమ్మల్ని ఆశీర్వదించటం చూచి మా జన్మలు ధన్యమైనవనుకొని పులకించిపోయాం.

# 13వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభస్వామినే నమః

సద్గురు సాన్నిధ్యం మనకు లభించడమన్నది దత్తుని అనుగ్రహంతోనేనని మనం భావించాలి. వారితో సన్నిహితంగా మెలగగలగడం, వారి బోధలను అవగాహన చేసుకోగలిగే బుద్ధి వుండినప్పుడు సమయాన్ని సద్వినియోగం చేసుకొని మహానుభావుల వాక్కు ఎప్పుడు ఏమి వెలువడుతుందో దానిని గ్రహించుకొనేటందుకై వేచి యుండాలని పెద్దలు చెప్తారు. స్వాతికార్తెలో ఆలుచిప్పలు వర్షం చినుకులకొరకు ఎదురు చూస్తూ వుంటాయి. స్వాతికార్తెలో నేలమీద పడిన చినుకులు నేలపాలవుతాయి. ఆలుచిప్పలో పడినవి మాత్రమే ముత్యాలుగా మారుతాయి. ఇతర కార్తెలలోపడిన వర్షం చినుకులు ముత్యాలుకావు. ఒక్క స్వాతికార్తె చినుకులకే ఆ అదృష్టం కలిగింది. అందువలన ఆ మూడు ఏకంకావాలి. అంటే – స్వాతికార్తె వుండాలి. వర్షం పడాలి. ఆ చినుకులు ఆలుచిప్పలలో పడాలి అన్నమాట! అదే విధంగా జ్ఞానబోధలు గురుదేవులు చెప్పే సమయం కుదరాలి. వినేవారు శ్రద్ధతో వినాలి. విన్న దానిని మననం చేసి ఫలితాన్ని పొందాలి. అప్పుడే జన్మతరిస్తుంది.

గురువులచే సూచించబడిన వ్రతాలు, పూజలు ఏవైనా సద్యఃఫలాన్ని ప్రసాదిస్తాయని శ్రీ విఠల్ బాబాగారి బోధల ద్వారా మనకు తెలుస్తుంది.

### ప్రదోష పూజ ఫలితము

మరొకనాడుదయం శ్రీ బాబాగారు ప్రశాంతంగా, గంభీరంగా, నిశితంగా దేనిని గురించియో యోచిస్తున్నట్లు కూర్చున్నారు. నేను వారికి నమస్కరించి మౌనంగా నిలబడగా వారు ప్రశ్నార్థకంగా చూచారు. "స్వామీ! శ్రీపాద స్వామివారి లీలా వైభవాన్ని తెలుసుకొనే కోరికతోనే నిలబడినాను. దయతో తమరు వినిపించితే ధన్యురాలను" అన్నాను.

శ్రీ బాబాగారు నా వొంక దయార్ద్ర వీక్షణాలు ప్రసరిస్తూ నవ్వుతూ ఇలా ప్రారంభించినారు. "శ్రీపాదా! దేవదేవా! ఏమి నాయనా నీ లీల! ఈమానవులను ఉద్ధరించే ప్రయత్నంలో నీవెంత నిర్దిష్టంగా పని చేస్తున్నావో ఊహించనలవి కాదయ్యా! నీకివే నా హృదయపూర్వక నమస్సులు" అని ప్రార్థించి ఇలా చెప్పారు.

శ్రీపాద స్వామివారు ఏడువందల సం.ల క్రిందటనే దీనజనోద్ధరణకోసం తమ జీవితాన్ని అంకితం చేశారు. ఆనాటి ప్రజలు ఉంటే పండితులు, లేకుంటే అమాయకులు. ఎక్కువగా అందరు ధర్మ మార్గంలోనే వర్తించేవారు. కాబట్టి పెద్దలు, తల్లిదండ్రులు, గురువులపట్ల గౌరవభావంతో

ఉంటూ, వారు ఏమి చెప్పితే దానిని చక్కగా ఆచరించేవారు. ఉదాహరణకు అంబికా మాత సద్గురుని శక్తియుక్తులు కళ్ళారా చూచింది. వారి అనుగ్రహంతో తన కష్టాలు గట్టెక్కించుకొన్నది. అంతటితో సుఖపడుతూ ఇంట్లో కూర్చోకుండా సద్గురుడు విధించిన ప్రదోష పూజను కష్టపడి ఆచరించినదా మహాతల్లి. ఎన్ని రోజులు చేయాలి? అని శ్రీపాదులను ప్రశ్నించలేదు. భక్తి శ్రద్ధలతో జీవితాంతము చేసింది. అలా చేసింది కాబట్టే ఆ దత్త స్వామికి మరుజన్మలో తల్లికాగలిగినది.

మరి ఈ రోజులలోనో! భక్తులని వచ్చేవారంతా పిల్లల చదువులు, వారికి ఉద్యోగాలు, వారికి పెళ్ళిళ్లు, ఆపైన వారికి మళ్ళీ పిల్లలు కావాలని కోరుతున్నారు. ఈ క్షేత్రంలో శ్రీస్వామివారు దయతో అన్నీ అనుగ్రహిస్తున్నారు. అందరికీ అన్ని సుఖాలు అమరుతున్నాయి. విడవకుండా శ్రీగురు చరిత్ర పారాయణ చేయండి. ముందు జన్మలో మీ గర్భాన మహాత్ములు జన్మించే అవకాశం వుంది అని చెప్తే చేస్తారా? ఈ జన్మలో కోరికలు నెఱవేరి సుఖపడడానికి చేయమంటేనే "చేశానండీ! ఏమీ ఫలితం రాలేదండీ!" అంటారు. ఫలితం వస్తే వచ్చిందండీ! అని ఆ గ్రంథాన్ని ప్రక్కన పెట్టేస్తారు. ముందు కాలంలో ఈ సమాజ స్థితిగతులను సరిచేయుటకు భూమిపైకి రావలసిన మహాత్ములకు జన్మనిచ్చేందుకు ఏ తల్లైనా, తండ్రైనా సిద్ధపడుతున్నారా! అంటే ఎక్కడా మచ్చుకైనా ఈ ఆలోచనను దృష్టిలో పెట్టుకొని నేను నిత్యము నియమం తప్పక ఈ పూజ చేస్తాను. లేక పారాయణ చేస్తాను అనే వారు నాకొక్కరు గూడ కనిపించుట లేదు. పూజలు చేయాలంటే పైసలు ఖర్చు. పారాయణకు మీ సమయం మాత్రమే ఖర్చు చేస్తే చాలు. కానీ బంధువులు, శుభకార్యాలు, పలకరింపులు, సంసారం ఇబ్బందులు ఇవన్నీ చెప్తారు. బంధువుల ఇళ్ళకు పోకుంటే వారికి కోపాలొస్తాయని భయం వుంది. కానీ భగవంతుని ఆదేశాలు తలదాల్చకపోతేనో! సద్గురువుల బోధలు పెడచెవిన బెడితేనో! ఎవరూ కోపపడరని గదా! వారి భావం. కాదులే! భగవంతుడు, సద్గురువులు ప్రేమమయులు గదా అని వారి అభిప్రాయం. అదీగాక ఈ రోజు సుఖంగా గడిస్తే చాలు. రేపటి రోజున బాధలొస్తే అప్పుడు చూద్దాములే. పిలిస్తే పలికే దైవం ఉన్నాడుగా. ఆయనను మనకవసరమైనప్పుడే పిలుద్దాం. అనుకుంటున్నారు.

ఇదంతా చూస్తూ వుంటే ఈ ప్రపంచం ఏ విధంగా ఉద్ధరించబడుతుంది? అనే ఆవేదన కలుగుతుంది. అందుకే ఆనాటి మహానుభావులైన గురువులకు, వారి ఆదేశాలను తలదాల్చి ఆచరించిన తల్లులకు, తండ్రులకు వేలవేల నమస్కారాలు మనం చెయ్యాలి" అని బాబాగారు "శ్రీపాద శ్రీవల్లభ మహరాజ్‌కీ జై" అని జయజయ ధ్వానాలు చేయగా, అందరం 'జై' అని వారితో శ్రుతి కలిపాము. తర్వాత వృత్తాంతాన్నిలా శ్రీ బాబాగారు ప్రారంభించారు.

**అంబికా మాత యొక్క శివపూజ:**

ఒకనాడు శ్రీపాద స్వామివారు స్నానమాచరించి అనుష్ఠానము పూర్తి చేసుకొను సమయానికి అంబికయు, ఆంజనేయ శర్మయు వచ్చి చేతులు జోడించి "హే! దీనబంధూ! స్వామీ! తమయనుగ్రహము నేమనికొనియాడగలను. మాకు జీవము, జీవికయు ప్రసాదించిన త్రిమూర్తి స్వరూపులు. మమ్ము పంచదేవపహాడ్‌లోనే నివసించమని గ్రామస్థులు కోరగా నివసించ నిశ్చయించుకొంటిమి. తమరు నాకు ఆదేశించిన శివపూజా వ్రతమును ఎక్కడ చేయవలెను? ఇంటి యందునా? నదీ తీరముననా? జీవనమునకు కావలసిన సంభారములు గ్రామస్థులు సమకూర్చ నిశ్చయించినారు. మీమహిమలకు ఎల్లలు లేవు. మీ లీలలు అమోఘము స్వామీ! అంటూ ప్రార్థించారు.

శ్రీపాద స్వామి వారు మందహాసంతో "అదా మీ సందేహం! ఎక్కడో ఎందుకు? ఇక్కడనే శివుడుండగా" అంటూనే తమ సంకల్ప శక్తితో ఆ బండపైన తాకుతూ వారి చేతిని గుండ్రంగా త్రిప్పినారు. వారి చేతి క్రిందనే శివలింగం సిద్ధమైంది*. ఈ అద్భుత దృశ్యం ఆ తల్లీ కొడుకులను, రవిదాసునూ గూడ మంత్రముగ్ధుల్ని చేసింది. మాతా, పుత్రులు సాష్టాంగ నమస్కారములాచరించిరి. ఆ రోజు నుండి ప్రదోష పూజను ప్రారంభించిన అంబికా మాత శ్రీ స్వామి వారి ఆజ్ఞానుసారం చేస్తూనే వుంది. ఆంజనేయశర్మ యింట్లో వున్న రోజున తల్లికి తోడుగ వచ్చేవాడు. గ్రామాంతరం వెళ్ళినరోజున రాలేకపోయేవాడు. తాను వచ్చిన రోజున మంత్రాలు చదివేవాడు. తల్లి పూజ చేసేది. రానినాడు తల్లే తనకు వచ్చిన మంత్రాలు చదువుకొని పూజించేది. ఆంజనేయశర్మ పండితుడైన తర్వాత కృష్ణానదీ తీరంలోనే తండ్రికి ఆబ్దికాలు నిర్వహించేవాడు.

**ఆంజనేయశర్మ ఉన్నతి :** అనగా శ్రీపాద స్వామివారు అనుగ్రహం పొంది సకల విద్యలందు నిష్ణాతుడై పండిత సభలందు పాల్గొనుచున్నాడు. ఘనమైన సన్మానములను అందుకొను చున్న విషయం చుట్టుపట్ల గ్రామాలకేగాక దూరదూర ప్రాంతాలవారికి గూడ తెలిసింది. ఈ విధంగా

**నోట్:** అలా ఆనాడు శ్రీ స్వామి తన చేతితో సృజించిన శివలింగం అంబికామాతచే పూజింపబడినది. ఆ శివలింగమే ఈనాడు కూడా నదీ తీరంలో, సహజ గణపతి, భాస్కరబండగల ప్రదేశంలో దర్శనీయంగా వున్నది. భక్తులకు ఇష్టకామ్యాలను యోగులకు యోగ విభూతులను ప్రసాదిస్తూ శాశ్వతంగా నిలచిన తార్కాణాలివి. ఇవన్నీ సమకూడిన ప్రదేశమే "శ్రీక్షేత్ర శ్రీవల్లభాపురం"గా దివ్యక్షేత్రమై ఈనాడు ప్రసిద్ధికెక్కినది.

అనుగ్రహించగల సమర్థుడైన దివ్య పురుషుడిక్కడ వున్నారన్న విషయమున్నూ ప్రచారం జరిగింది" అని శ్రీ బాబాగారు చెప్పుచుండగా నేను మధ్యలో "శ్రీ బాబాగారండీ! నిన్న ఆంజనేయ శర్మ పూర్వజన్మ వృత్తాంతం చెప్తానన్నారు. దయచేసి చెప్పండి స్వామీ!" అంటూ ప్రార్థించాను. "ఓహో! అదా! చెప్తాను" అంటూ బాబాగారిలా మరల చెప్పటం ప్రారంభించారు.

మహారాష్ట్ర దేశంలో ఆళంది అనే పట్నం ఉంది. అక్కడ వేద వేదాంగములు నేర్చిన పండితులైన బ్రాహ్మణ పరిషత్తు ఉండేది. చుట్టు ప్రక్కల చాలా గ్రామాల విద్యార్థులు ఈ పట్నంలో ఉండి వేద విద్యనభ్యసిస్తూ వుండేవారు. అందువలన బ్రాహ్మణ సంఘము చాలా పటిష్ఠంగా వుండేది. అనేక విషయాలు పరిషత్తు వారు చర్చించి ఎవ్వరికైనా ధర్మ నిర్ణయాలు చేయవలసి వస్తే చేస్తూ వుండేవారు. వారు నిర్ణయించినారంటే ఆ నిర్ణయం తప్పక అమలు జరిగి తీరాల్సిందే!

ఆ పట్నంలోనే సిద్ధోపంత్ అనే పండితుడు పాండురంగ భక్తుడొకడుండేవాడు. ఆయనకొక కుమార్తె గలదు. ఆమె పేరు రుక్మాబాయి. ఆ ఊరి ప్రక్కనగల నదీ తీరంలో ఒక యాత్రికుడై వచ్చిన విఠోబా అను బ్రాహ్మణుడు సిద్ధోపంతుకు తారసపడితే ఇంటికి అతిథిగా ఆహ్వానిస్తాడు. ఆతడు అక్కడికి కొంత దూరాన ఉన్న ఆపెగాం నివాసి. ఆ పూట వారింటిలో భోజనం చేస్తుంటే సిద్ధోపంత్ కుమార్తె రుక్మాబాయి చూచి తల్లితో రాత్రి తనకు స్వప్నంలో పాండురంగడు ఈ వ్యక్తిని చూపి ఇతడే నీ భర్తయని చెప్పినాడని తెలిపింది. ఈ విషయం సిద్ధోపంత్ విఠోబాకు చెబితే తనకు గూడ పాండురంగడు స్వప్నంలో చెప్పితేగానీ వివాహం చేసుకోనంటే అప్పుడు భగవంతుడే అతనికి స్వప్నంలో తెలుపుతాడు. అప్పుడతడు పెండ్లికి ఒప్పుకొంటాడు.

సంసార విరక్తుడై తాను తీర్థయాత్రలు చేస్తుంటే దేవుడే ఇలా పెండ్లి చేశాడేమి? అని విఠోబా చాలా విచారంలో పడి కొన్ని రోజులకు ఎవరికీ చెప్పకుండా కాశీకిపోయి సన్యాసం తీసుకొంటాడు. ఈ సంగతి ఆతని గురువు ద్వారా తెలిసి భార్య, మామగారు, అత్తగారు గూడ ఆ గురువుగారి వెంట కాశీకి పోతారు. శిష్యుని మందలించి గురువుగారు సంతానం కలిగేవరకు నీవు గృహస్థాశ్రమంలో వుండమని శాసించారు. ఇక విధిలేక ఆతడు గురువాజ్ఞ మేరకు వచ్చి ఆళంది లోనే కాపురం ఉంటాడు. రుక్మాబాయికి దైవ కృపవలన గర్భం వచ్చింది. కానీ బ్రాహ్మణ సంఘములో వారందరూ ఇది అక్రమ పద్ధతి. శాస్త్ర విరుద్ధమైన సంతానము, గృహస్థుడు సన్యాసం పొందిన తర్వాత మళ్ళీ గృహస్థాశ్రమం తీసుకొంటే భ్రష్టుడైనట్లే! అందుచేత ఆ భార్యా భర్తలను

బ్రాహ్మణ సంఘము నుండి వెలి వేయవలెనని ప్రతిపాదన తెచ్చారు. అనేకమంది వృద్ధ పండితులు శాస్త్ర చర్చ పెట్టి తర్వాత నిర్ణయించుదామన్నా గూడ అందులోని విశోబా పండిట్ మాత్రం చర్చలు అన్నీ తర్వాతనేగానీ ముందు వారిని వెలివేయాలని, ఈ విషయాన్ని పట్టణమంతా చాటింపు వేయించాలని, వెలివేస్తేగాని కుదరదని, బాగా పట్టుపట్టి, వాదించి ఆ నిర్ణయం చేయిస్తాడు.

తన పాండిత్యాన్నంతటినీ మూర్ఖపు పట్టుదలకే వినియోగించి సాటి బ్రాహ్మణుని అవమానించుటతో ఎంతో తృప్తిపడతాడు విశోబా.

రుక్మాబాయి తండ్రి సిద్ధోపంత్‌ను కనిపించినప్పుడెల్లా విశోభా దూషిస్తాడు. వితోబానైతే మరీ దూషిస్తాడు. ఆతడు నదీతీరంలో ఊరికి దూరంగా సంఘమువారు విధించిన శిక్షననుభవిస్తూ ఇది భగవంతుని లీలగా భావిస్తూ ఎంతో ఓర్పుతో బ్రతుకుతుంటే క్రమంగా వారికి ముగ్గురు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల పుడతారు. వితోబా వైరాగ్య పురుషుడు కావున పెద్దవానికి నివృత్తి దేవుడనీ, రెండవ వానికి జ్ఞానదేవుడని, మూడవ వానికి సోపాన దేవుదని, కుమార్తెకు ముక్తాబాయి అని నామకరణం చేస్తాడు.

పెద్ద పిల్లవానికి ఏడు సంవత్సరాలు రాగా వితోబా బ్రాహ్మణ సంఘం వారిని ఆశ్రయించి తన మగ పిల్లలకు ఉపనయన కార్యము నిర్వహించి బ్రాహ్మణ సంఘంలో చేర్చుకొనండి, వాళ్లకు వేద విద్యలు నేర్పించండి అని ప్రార్థిస్తాడు. సంఘం వారు పెద్దలు ఆలోచించుకొని పైఠణ్‌లో అధికార పరిషత్తును సంప్రదించి నిర్ణయం చేద్దామని చెప్పుచుంటే విశోబా పండిట్ మాత్రం విరుచుకుపడతాడు. "భ్రష్టుడికి కలిగిన సంతానం గూడ భ్రష్టులే! సంఘం నుండి వెలివేసిన తర్వాత పుట్టిన సంతానానికి ఉపనయనానికి అనుమతి ఇవ్వకూడదు. వారు అబ్రాహ్మణులక్రిందనే జమ" అని నానా దుర్భాషలాడి వితోబాను కించపరుస్తాడు. వితోబా ఏమీ తోచక మనశ్శాంతి కొరకు కుటుంబ సమేతంగా తీర్థయాత్రకై త్రయంబకేశ్వరం పోయి, గోదావరి నదిలో స్నానంచేసి, ఈశ్వరుని దర్శించి, తిరుగు ప్రయాణంలో పులిగాండ్రిపు శబ్దానికి భయపడిన పెద్దకొడుకు కనపడలేదని ముగ్గురు పిల్లలతో తిరిగొచ్చాడు.

ఈశ్వర సంకల్పం వలన నివృత్తిదేవునికి అక్కడ గుహలో గహినీనాథ మహరాజువారి దర్శనం, స్పర్శనం, ఉపదేశం అన్నీ లభించాయి. ఆ గురువు శక్తిపాతంచేసి యోగ విద్యను అతనిలో ప్రదీప్తం చేశారు. నెల రోజుల తర్వాత ఇంటికి వచ్చి తండ్రితో అన్నీ చెప్పాడు నివృత్తి. నాథ సాంప్రదాయ గురువు దొరికినందున నివృత్తినాథుడని ఆ తర్వాత అతడు ప్రఖ్యాతి పొందినాడు.

కుచ్ఛితుడైన విశోబా పండితుడు విఠోబాగానీ, పిల్లలుగానీ ఎవరు కంటబడినా దూషించుచూ వుంటే విఠోబా ఓర్పుతో సహిస్తూ విశోబాను తిరిగి ఏమీ అనకపోయినా విఠోబా మాత్రం ఇలాంటి బ్రతుకెందుకు? ఈ అవమానాలు భరించేకన్నా మరణించరాదా! నదిలో దూకరాదా! అని సూటిపోటిగా అనేవాడు.

విని విని విఠోబా, రుక్మాబాయి దంపతులు ఒకనాటి రాత్రి నదిలోదూకి జలనిమజ్జనం కావాలని నిర్ణయం తీసుకొన్నారు. గురుకృపవలన నివృత్తినాధునకు వారి ఆలోచన తెలిసిపోయింది. జరుగనున్నది జరుగక మానదు. మీ నిర్ణయం ప్రకారం మీరు నడవండని తల్లిదండ్రులకు చెప్పినాడు. వారట్లే నదీ జలాలలో నిమజ్జన మైనారు. తర్వాత సిద్ధోపంత్ తన మనుమలకు తానే దిక్కు అని బ్రాహ్మణ సంఘంవారిని కోరగా వారు పైఠాణ్ అధికార పరిషత్ నుండి అనుమతిపత్రం తెచ్చుకోమంటారు.

ఈ పిల్లలు నలుగురు పైఠాణ్‌పోయి అధికార పరిషత్తును కలుస్తారు. వారిముందర జ్ఞానదేవుడు దున్నపోతుచేత వేదం పలికిస్తాడు. అధికారి యింట్లో పితృదేవతలను రప్పించి పితృకార్యం నెఱవేర్చుతాడు. ఇవన్నీ చూచివారు వీరిని బ్రాహ్మణులలో కలుపుటకు అనుమతినిస్తున్నామని పత్రం ఇస్తారు.

అది తెచ్చి పిల్లలు ఆళందిలో సంఘం వారికి ఇస్తారు. వారు బ్రాహ్మణులలో కలుపుకొంటారు. అయినా గూడ ఈ పిల్లలను విశోబా హేళన చేస్తూ ఏడిపించాలని చూస్తాడు. తమ్ముళ్ళను జాగ్రత్తగా హెచ్చరిస్తూ అతనినేమీ అనకుండా చూస్తాడు నివృత్తి. పిల్లలు పెద్దవారైనాగూడ వాళ్ళని విశోబా భ్రష్ట సంతానమే అనే అంటుంటాడు. వారికి ఎవరూ నేర్పకుండా వేద విద్యలు వచ్చాయి. కాబట్టి గురుకులంలో నేర్చుకోలేదు కాబట్టి వారు వేదోచ్ఛారణ చెయ్యరాదంటాడు. విశోబా తన తెలివినంతా ఆ కుటుంబాన్ని హేళన చేయడానికే ఉపయోగిస్తాడు.

ఒకనాడు ముక్తాబాయి రొట్టెలు కాల్చే మట్టి పెంకును పగులగొట్టేస్తాడు. ఆ పిల్ల జ్ఞానదేవునితో చెప్పగా ఆయన తన వీపుమీదనే రొట్టెలు కాల్చమంటాడు. జ్ఞానదేవుని నోట్లో మంటలు చిమ్ముతుంటే వీపుపై ముక్తాబాయి రొట్టెలు కాలుస్తుంది. ఇది చూచిన తర్వాత విశోబా వచ్చి జ్ఞానదేవుని పాదాలు పట్టుకొని క్షమించమని కోర్తాడు. తాను వీరిపట్ల చేసిన అపరాధం ఇంతని చెప్పటానికి వీలులేనిదని పశ్చాత్తాపపడతాడు. అప్పుడు జ్ఞానదేవుడు విశోబాతో చేసిన కర్మలు అనుభవించవలసిందేగదా! నీవు ఇతరులకు ఎన్ని ఇబ్బందులు కల్గించవలెనని

సంకల్పించినావో అవన్నీ నీవు ఉత్తర జన్మలో ఎదుర్కొనవలసినదే! చివరకు ఇప్పుడు పశ్చాత్తాపపడినావు కావున నీకా జన్మలో సద్గురుని దర్శనంచేత విద్యాలాభం కలుగుతుంది. అహంకారం ఎప్పుడైనా పతనానికి దారితీస్తుందని చెప్పాడు.

తనను ఆదరించి గురువుగ ఉపదేశమివ్వమని కోరగా జ్ఞానదేవుడు ముక్తాబాయిచేత ఉపదేశం ఇప్పించాడు విశోబాకు. ఆనాటి నుండి విశోబా మంచిగా మారిపోయి అనేక విధాల జ్ఞానేశ్వర మహరాజ్ సమాధి అయ్యేవరకున్నూ, ఆపైన గూడ తన జీవితాంతమున్నూ గురుసేవ మరువకుండా చేసుకొన్నాడు.

అందుచేతనే ఆనాటి విశోబాయే అంబిక కడుపున పుట్టి అనేకులచే అవహేళనకు గురియై ఆ కర్మలన్నీ తీర్చుకొని గురుకృపకు పాత్రుడైనాడని శ్రీ విఠల్‌బాబాగారు చెప్పినారు. అంతేకాదు ఎవరెవరి అనుభావాలను బట్టి వారి పూర్వకర్మలను వారే తెలుసుకోవచ్చును. ధైర్య స్థైర్యాలతో వాటిని తీర్చుకొంటూ ఇప్పుడు మంచినే అందిదరికీ కోరుచూ జీవితాన్ని పండించుకోవచ్చు. అన్నీ మీ నుదుటిపైని వ్రాతలు కాదు. మీ చేతలే!" (కర్మలే) అంటూ ముగించారు.

ఇది విన్న మేమంతా మనం ఎంత జాగ్రత్తగా వాక్కును వినియోగించాలోనని, కర్మలోని మర్మాన్ని ఇప్పుడు శ్రీ బాబాగారు చెప్పినట్లుగా మనకెవ్వరు చెప్తారు? అనీ మహాత్ముల సన్నిధి లభిస్తేగాని మనకీ విషయాలు తెలియవు" అనే సత్యదర్శనం చేశాం.

మరొక్కనాడు శ్రీ విఠల్‌బాబా మహరాజ్‌వారు ప్రశాంతంగా కూర్చున్న సందర్భంలో స్వామికి నమస్కరించుకొని "ఈ చోట నిర్వహించబడిన శ్రీపాద శ్రీవల్లభస్వామి వారి దర్బారులో వారు చేసిన బోధలు విని ఎవరెవరు లాభం పొందినారో? వివరంగా చెప్పండి స్వామీ! తద్వారా మా సాధనలోని లోపాలను సరిదిద్దుకొనేటందుకు ఒక అవకాశం కలుగుతుం"దని ప్రార్థించాను.

శ్రీ బాబాగారు ఇలా ప్రారంభించారు. "లోపాలనేవి స్థూలంగా కొన్ని, సూక్ష్మంగా కొన్ని ప్రతి సాధకునిలోనూ వుంటూంటాయి. వాటిని సందర్భానుసారంగా సవరణ చేసుకోవాలి. ఎంతటి కఠినమైన రాయి (శిల)ని గూడ అరగదీస్తూపోతే దాని గతుకులు మిట్టపల్లాలుపోయి చివరకు చక్కగా నునుపుదేలుతుంది. సాధకులకు గురుబోధ ఒక్కసారిగా కాకపోయినా వినగా వినగానైనా మనసుకెక్కాలి. ఇది సూదంటురాయి పద్ధతి అంటారే (అయస్కాంత పద్ధతి) ఆ విధంగా ఒక అయస్కాంతము ద్వారా ఇనుపముక్క రాపిడి పద్ధతిలో అయస్కాంతంగా మారుతుంది. అది గూడ ఇనుము నాకర్షిస్తుంది. ఆ విధంగానే వినగా వినగా ఏవో నాలుగు ముక్కలు వంటబడ

తాయని నిత్యం పురాణం వింటూ వుంటారు. కొందరు ఏది విన్నా వదిలేస్తారు అక్కడికక్కడే! మరికొందరికి పూర్వం ఎప్పుడో విని, మఱుపున బడిన విషయాలు మరల గుర్తుకొచ్చి, మంచి మార్గంలోకి మనసును మళ్ళించుకొంటారు. అలాగే పంచదేవ పహాడ్ గ్రామ పెద్ద, బ్రాహ్మణోత్తముడు అయిన శ్రీరామాచార్యులనే ఆయన ఈ విధంగా శ్రీపాద శ్రీవల్లభ స్వామివారి దర్శనము, సంభాషణము, బోధలు వలన మఱుపునబడిన చిన్ననాటి గురుబోధలను తిరిగి మననం చేసుకొని, వాటికి మెఱుగులు పెట్టుకొని ఆచరణలో పెట్టగలిగారు. ఇప్పుడా విషయమే చెప్తాను. వినండి! వారి ధర్మాచరణ ఎంతగా అభివృద్ధి చెందినదనగా శ్రీపాద స్వామివారి కొరకు ఎవ్వరు వచ్చినా వారికి కించిత్తైనా సేవచేసి తరించా లన్నంతగా భావం కుదిరింది. గురుసేవయనగా గురుభక్తుల సేవయే! భగవత్సేవయనగా భగవద్భక్తుల సేవయే! ఈ రహస్యమును తెలిసి పాటించితే భగవంతుని కరుణకు, ప్రేమకు పాత్రులౌతారు. హే! త్రిమూర్తి స్వరూపా! ఆది మధ్యాంతరహితా! మాయా మానుషరూపా! శ్రీపాదరాయా! నీ నిర్మలప్రేమను మాకింతపంచి, నీ బోధలు, లీలలు మాకు దర్శింపజేసి ధన్యులను జేయవే! నీపాదారవిందములకు అనేక కోటి నమస్కృతులు" అని ప్రార్థించి బాబాగారు మరల ఇలా చెప్పసాగినారు.

పంచదేవపహాడ్ గ్రామంలో నరసింహస్వామి వారి ఆలయ సమీపంలో కొందరు పెద్ద వాళ్ళు చేరి నిత్యము ఊరిలోని విషయములు, పొరుగూరి విషయములు చర్చించుచు సాయంకాల వేళల్లో కాలక్షేపము చేయుట అలవాటు. శ్రీపాద స్వామివారు కురువపురం చేరడం, వారిని గ్రామస్థులు గుర్తించలేకపోవటం, గోకర్ణ యాత్రా బృందం వారి ద్వారా శ్రీ స్వామివారి మహిమ తమకు తెలియబడడం అంతా వారి పూర్వపుణ్యంగా భావించుకొన్నారు. ఇది ఇలా వుండగా వింతలలోకెల్లా వింత ఆంజనేయశర్మ విద్యావంతుడు కావడం. ఇదేమి చమత్కారము! ఇటువంటి మహానుభావుని సన్నిధి మనకు లభించడం మనం చేసుకొన్న పుణ్యంగాక మరి ఏమిటి!

ఇలా చర్చలు చేసుకొనుచుండగా ఈ సంభాషణ విని అటుగా వెళ్ళుచున్న గ్రామ పెద్ద, బ్రాహ్మణోత్తముడు శ్రీరామాచార్యులు గూడ అక్కడకు వచ్చిరి. అందరు గౌరవ సూచకంగా నమస్కారం చేసి కూర్చుండుటకు స్థలము చూపించిరి. వారిట్లనిరి. నేను గురుకులంలో చదువుకొనే రోజులలో పెద్దల ద్వారా తెలిసికొన్న విషయం జ్ఞాపకం వస్తున్నది. చెప్తాను వినండి. అది వింటే మీకు ఈ మహాత్ముని తత్త్వం బోధపడుతుంది.

ఎవరికి గురుముఖతః జ్ఞాన బోధ లభిస్తుందో వాని జన్మ ధన్యము. వానికీ ప్రపంచమంతా ఒకే కుటుంబం లాగ తోస్తుంది. గురుస్మరణతోనే గురువుతో తాదాత్మ్య స్థితిని పొందగలిగినవాడు.

తదుపరి విశ్వంతో తదాత్మ్య స్థితిని పొందగలడు. ఆ ఏకత్వ భావాన్ని ఎంతగా అనుభవిస్తాడంటే తన అనుభవాన్ని చెప్పడానికి అతనిలో భేద భావం మిగలదు. అగ్ని సంస్కారం పొందిన కర్పూరం అందరికీ కాంతినిచ్చి తాను మిగలకుండ పోవునట్లుగా సాధకుడైన సద్గురు శిష్యుడు మోక్షపదవిని గూడ త్యాగం చేసి సేవకుడిగానే మిగిలిపోయేందుకు ఇష్టపడతాడు. భగవంతుడే సర్వత్రా వున్నట్లు అనుభవాన్ని పొందుతాడు.

ఆ విధంగా అనుభవాన్ని పొందిన గురుదేవుడు ఏ శిష్యునికి లభిస్తాడో ఆ శిష్యుడు ధన్యుడు. ఆతడు తన గురుదేవుని అండదండలతో ఆయన యొక్క సమర్థవంతమైన శిక్షణ పొంది తన భారమంతా గురువుకప్పగించితే  వాని బరువు బాధ్యతలు గురువే చేపడతాడు. మార్జాలకిశోర న్యాయమువలె ఆశిష్యుడు శరణాగతి తత్త్వంతో గురుని పాదాలవద్ద శరణుపొందుట వరకే వాని కర్తవ్యము. పిల్లి తన పిల్లలను అదను కనిపెట్టి సురక్షిత ప్రాంతానికి నోటకఱచుకొని చేర్చినట్లు శిష్యుని జ్ఞాన రక్షణా భారాన్ని వహింపగలడు. ఆ సద్గురు సన్నిధానంలో ఎటువంటి సంశయములుగాని, నీచభావములుగాని, కల్మష భావములుగానీ పొడచూపే అవకాశం లేదు. ఆ గురుదేవుని సన్నిధిలో సద్గురుని కృపతో శిష్యుడు ఎంత అవకాశం వుంటే అంతగా ఎదుగుతాడు. సద్గురు సంకల్పమూ, సామర్థ్యము మాటల కందరానిది. వర్ణింపనలవి కానిది. ఆ సామర్థ్యమే తుచ్ఛ సంసార బంధములను దూలించి శిష్యుని పరమపద సామ్రాజ్యపట్టభద్రుని చేయగలదు. ఆయన చూపే ప్రేమ మార్గంలో నడవడం ఒకటే శిష్యుని కర్తవ్యం. ఆచరణ, సాధన చక్కగా చేసిన శిష్యుడు ఎంతో భాగ్యశాలి. అతనికి వైరాగ్యము, సన్యాసము అనుభవం ద్వారా అప్రయత్నంగా లభించే ఆభరణాలుగా వుంటాయి.

అనుభవజ్ఞుడైన సద్గురుని చేరిన శిష్యుని జీవితం అన్ని స్థాయిలలోను చరితార్థమవుతుంది. అతని ఆధ్యాత్మిక స్థితి ఎప్పటి కప్పుడు చక్కదిద్దబడుతుంది. అటువంటి గురుదేవులు శిష్యుడిపాలిట కామధేనువేనని శాస్త్రాలు చెప్పుచున్నాయి. ప్రథమాంకంలో శిష్యునికి సుఖము, సంతోషము, ప్రేమ, అభయమును ప్రసాదిస్తారు. తర్వాత అతనిలో వైరాగ్యమును మేలుకొలిపి, వాసనలతో చిక్కుకున్న మనసులోని చిక్కుముడులను విప్పి యదార్థ దర్శనము చేయించేవరకు బోధలు చేస్తూ వుంటారు. జ్ఞానాన్ని అతనిలో స్థిరపరచి, శరీరమనే క్షేత్రంలో భక్తి, ప్రేమలను పంటలను పండించి, ధర్మస్థాపనకు, సమాజహిత కార్యాలకు అతనిని వినియోగపరుస్తారు.

నది సముద్రంలో కలిసినపుడు తన ఉనికిని కోల్పోయి సముద్రమని పిలువబడుచున్నట్లు

శిష్యుడు తన ఉనికిని మఱచే స్థితికి ఎదిగేవరకు గురుదేవుల కర్తవ్యం ఉంటూనే వుంటుంది. అప్పుడే అతడు సద్గురువౌతాడు. ఈ స్వామి గూడ అట్టి సద్గురువే. అందువల్లనే అనేక ప్రాంతముల నుండి శ్రీ స్వామివారి దర్శనమునకు వచ్చిన ఆ పండితులు శ్రీ స్వామి సన్నిధిని అనుభవించి జ్ఞానులైనారు. అందువలన వారు శ్రీ స్వామివారు దూరం కావడం సహించలేక తపన చెందుచూ వచ్చి, శ్రీవారిని దర్శించి ఆనందమును పొంది తిరిగి వెళ్ళలేక వెళ్ళుచున్నారు. ఇటువంటి దివ్య మూర్తి మన ప్రాంతంలో చరించడం మనమూ, మన ప్రాంతమూ చేసుకొన్న పుణ్యఫలము. అందరూ శ్రీ స్వామివారి పట్లనూ, వారి కొరకు వచ్చే భక్తులపట్ల జాగరూకతతో వ్యవహరించండి. ఎటువంటి అపరాధములు చేయకండి. నరకం పొందకండి అని ప్రబోధించినాడు. అందరూ ఆనందంతో ఆ గురుదేవునికి నమస్కరించి, ఇంతలో అచ్చట నున్నవారు శ్రీ సదానంద బ్రహ్మచారిని "స్వామీ! తమరు శ్రీ స్వామిని సన్నిధిలో వుండి సేవించినామని తెలిపితిరి గదా! సద్గురువు ఎచ్చట లభించును? సద్గురువును గుర్తించుట ఎలా? సద్గురుని సేవించుట ఎలా? మాకు తెలియచేయుడు!" అని ప్రార్థించిరి.

"దిగంబరా.. దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా" అని వారు ఉచ్ఛైసన్వనంతో కీర్తిస్తూ వుండగానే శ్రీ స్వామివారిని శ్రీక్షేత్ర శ్రీబదరీనాథ్‌లో దర్శించి సేవించిన శ్రీ సదానందుడనే బ్రహ్మచారి దక్షిణదేశ యాత్రలు చేయుచు తన మిత్ర బృందముతో అచ్చటికి చేరినారు. నూతనంగా విచ్చేసిన సన్యాస, బ్రహ్మచారి బృందమును చూచి గ్రామస్థులు లేచి నమస్కరించి వినయంగా ఆసనములు చూపించిరి. ఆ గ్రామ పెద్ద వారిని "స్వామీ! తమరెవరు? ఎచ్చట నుండి వచ్చుచున్నారు?" అని వినయంగా అడిగినారు. అందులకా బృందములోని సదానంద బ్రహ్మచారి వారితో "అయ్యా! మేము బదరీక్షేత్ర వాసులము. దక్షిణాదియాత్రలు చేయుచు ఇచ్చటికి వచ్చినాము. మా యాత్రలలో శ్రీపాద స్వామి ఇచ్చట వున్న విషయం తెలిసినది. శ్రీ స్వామి బదరీలో వున్నప్పుడు వారి సన్నిధిలో వుండే భాగ్యం మాకు కలిగింది. ఇందులో అనేకులు స్వామిని ఎరుగుదురు. వారు సాక్షాత్ దత్తదేవులు అని మాకెన్నో అనుభవాలు కలిగినాయి. అందులకే శ్రీస్వామిని దర్శించాలని మేము ఇచ్చటికి చేరినాము. దయతో శ్రీ స్వామివారిని చేరుమార్గము తెలుపండి" అని అడిగెను. ఆ గ్రామ పెద్ద "అలాగే! తప్పక దర్శించుదురుగాని" అన్నారు. అది వేసవికాలం. నదిలో నీరు తక్కువగ వున్నందున కురువపురం నడచి నదిని దాటి పోవచ్చును. మార్గము చూపేవారికొరకు కబురు పంపిరి.

సదానంద బ్రహ్మచారి "అయ్యలారా! మంచి ప్రశ్నలు వేసినారు. సద్గురువెచ్చట లభించు?"నని అడిగారు. సద్గురువు ఒక చోట లభించును. ఒక చోట లభించదని చెప్పలేము. గురువు సర్వాంతర్యామి. సర్వ శక్తి స్వరూపుడు. వారంతటనూ వున్నారు. అన్నింటనూ వున్నారు. వారు తమను తాము ఈ జగత్తుకు ఏనాడో దత్తం చేసుకొన్నారు. శిష్యుడు కూడ శ్రద్ధచేత, ఓర్పుచేత, నిరంతర అన్వేషణచేత, మనో వాక్కాయ కర్మలచేత తనను గురువునకు దత్తం చేసుకొన్నప్పుడు శిష్యుని సాధన, అతని పుణ్యఫలం పరిపక్వమైనప్పుడు వారు లభించగలరు. దానికి ఒక నిశ్చితమైన స్థలం లేదు. అది ఎచ్చటైనా జరుగవచ్చును. ఎప్పుడైనా జరుగవచ్చును.

ఆర్యులారా! వారిని గుర్తించుట ఎట్లు?" అడిగినారు. సాధకునకు సాధనలోను, ఇహపరమైన జీవితంలోను ఎన్నియో ఆలోచనలతో నున్న మనోవృత్తులన్నియు ఏ సత్పురుషుని సందర్శనం చేత శాంతినొంది, చిత్తము నిర్మల మగునో, విషయేచ్ఛ తొలగిపోవునో, అంతః శుద్ధియేర్పడునో, పరిశుద్ధమైన శీలం అలవడునో, పరమ సత్యమైన ఈశ్వరతత్త్వం గ్రాహ్యమగునో, అదే గురుస్థానంగా గ్రహించాలి. అచ్చటనే వారి సన్నిధిలోనే సాధకునకు ముముక్షుత్వం లభిస్తుంది.

ఈ విధంగా లభించిన గురువును సేవించుటెట్లు? అనుదానికి సమాధానంగా తత్త్వదర్శి, యోగియైన గురువును ఎవరు శ్రద్ధతోను, వినయముతోను, తదేక నిష్ఠతో, పట్టుదలతో, ఏకాగ్రతతో, మనోవాక్కాయ కర్మలతో సేవించుచు, ఇంద్రియ నిగ్రహము పాటించెదరో వారికి గురువనుగ్రహము కలుగును. శ్రద్ధా రహితునికి, సంశయచిత్తునికి గురువనుగ్రహం కలుగదు. అంతేగాక ఈర్ష్య, అసూయ, ద్వేషం కలవారికి గురుదర్శనమే దుర్లభం. ద్వేషమనగా ద్వి+విషం. విషం భౌతిక శరీరాన్ని మాత్రమే నష్టపరుస్తుంది. ద్వేషం అనగా రెండింతల విషం. కావున అది రెండు రకాల నష్టాన్ని కలిగిస్తుంది. ఆధ్యాత్మిక జీవితాన్ని నష్టపరచి జీవ శరీరాన్ని గూడ చంపివేస్తుంది. అందువలన సాధకుడు వీటిని దూరంగా వుంచి గురువును చేరి సాష్టాంగ నమస్కారమాచరించి, సేవించి, వారి ప్రబోధములను మననం చేసి సాధనచేసి ముక్తుడు కావాలి. అంతియేకాక అనన్యభక్తితో గురు శుశ్రూష చేయాలి. స్వార్థాన్ని త్యజించాలి. సుఖదుఃఖాలను సమభావంతో స్వీకరించడం అలవరచుకోవాలి. సర్వభూత హితుడు కావాలి. పవిత్ర కార్యాచరణతో వ్యవహరించాలి. పరమ పవిత్రతతో కలిసి మెలసి చరించాలి. గురువైన మహాత్ముని పాదపద్మాలనే ఆశ్రయించాలి. నేను – నాది అనే భావం త్యజించి, సర్వము గురువునకు సమర్పించి, త్యాగంతో, మౌనవ్రతంతో, పరమ గురునిపై పరిపూర్ణ విశ్వాసంతో, సహనంతో ఆయనను పూజించి ఆత్మజ్ఞానం పొందాలి.

ఇట్లు ఆత్మజ్ఞానం పొందిన వారికి అసాధ్యం అన్నది యేదీలేదు. వారు మృత్యువును గూడ జయింపగలరు. మోక్షాన్ని పొందగలరు.

ఈ విధంగా సేవించిన ఎందరో మహానుభావులు మనకు మార్గదర్శకులైనారు. వారు అవతారపురుషులై గూడ ఈ మార్గాన్నే ఎంచుకొన్నారు. వశిష్ఠుని శ్రీరాముడు, సాందీపని మునిని శ్రీకృష్ణుడు, ఆదిశంకరాచార్యులను పద్మపాదుడు మున్నగువారు గురువులుగా సేవించియే మార్గదర్శకులైనారు – అని వివరించిరి. తదుపరి నదిని దాటించేవారు రాగా వారి ఆసరాతో కృష్ణానదిని దాటి అందరూ కురువపురం చేరుకున్నారు. వారందరు ఆనాటి సాయంకాలము కృష్ణానదిలో స్నానమాచరించి సంధ్యావందనాదికములు నిర్వర్తించుకొన్నారు. కురువపురంలో శ్రీపాద స్వామి వారుండు ప్రదేశమునకు పోయి వారిని సందర్శించి అందరూ సాష్టాంగ నమస్కారములు చేసినారు. శ్రీపాద స్వామివారు సదానంద బ్రహ్మచారినీ, మరియు వచ్చిన వారిలో పాతభక్తులను కొందరిని ప్రసన్న దృక్కులతో, చిరునవ్వులతో పలకరించారు. సదానందులు అందరినీ శ్రీ స్వామికి పరిచయం చేసి తర్వాత శ్రీ స్వామి వారినిట్లు స్తుతించారు.

దేవాదిదేవా! సద్గురుమౌళీ! మీ లీలలు అనంతములు. బ్రహ్మ విష్ణు మహేశ్వర అను నామ రూపాలతో సృష్టి స్థితిలయాలు చేస్తూ వాటికి అతీతంగా నీ స్వయంప్రకాశ శక్తితో సకలము నిర్వహిస్తూవుంటావు. సకల కార్య, కారణ స్వరూపుడవు. మహాకారణుడవు. విశ్వస్వరూపుడవు. శరీరముకంటే కరచరణములు వేరుకానట్లు ఈ విశ్వముకంటే నీవు అన్యము కాదు. మా దృష్టికి గోచరించే భూత జాలమంతయు నీరూపమే. ఓ! సచ్చిదానందమూర్తీ! నీ స్మరణయే మాకు తరణోపా యమై మమ్మిక్కడకు తీసుకువచ్చినది. మాలో దక్షిణదేశ యాత్రా సంకల్పముద్భవిం చుటయు గోకర్ణ క్షేత్రము చేరుసరికి గోవింద భట్టు యొక్క ప్రబోధము మాకు మీ దర్శనభాగ్యము కలిగించినది. నిన్ను స్మరించుకొనుచు మార్గమంతయు ఎటువంటిశ్రమ, ఆయాసము లేకుండ ఇచ్చటకు చేరుకొంటిమి. ఆహా! సర్వ జీవులను ఆనందపరచుటయే నీకానందము. ఓ! దేవా! మమ్ము సాధనలో కడవరకు నీ కృపాదృష్టితో చూచి గమ్యము చేర్చుభారమునీదే స్వామీ!" అని ప్రార్థించెను.

సదానందులు చేసిన స్తోత్రమునకు శ్రీపాదులు అమితముగా ప్రసన్నులైనారు. "నాయనలారా! చాలా సంతోషము!" అని అందరివంక పరికించుచూ ఇలా చెప్పసాగారు. "మీలోని భక్తి శ్రద్ధ, విశ్వాసములే మిమ్ముల నిక్కడివరకు తీసుకొని వచ్చినవి. మానవుడై పుట్టిన ప్రతివాడు తాను తరిస్తూ, తోటివారిని తరింపజేసే ప్రయత్నం చేయాలి. నీవు అదే విధంగా జ్ఞానాన్ని పది

మందికి పంచుతూ అందరికీ హితోపదేశం చేస్తూ మార్గాయాసం తెలీకుండా ఇంతదూరం యాత్ర చేయించావు. మాకెంతో ఆనందమైనది. అయ్యలారా! ఈ క్షేత్రము యొక్క మహిమ చెప్పనలవికానిది. ఇది పురాణ కాలము నుండియు మహర్షుల తపోభూమి. కశ్యపాది మహర్షులి చ్చట తపసుచేసి సద్యఃఫలితాన్ని పొందినారు. తపస్సు చేసికొనుటకు వీలుగా ప్రశాంత వాతావరణము గల్గి నదీ మధ్యమందున్న ప్రదేశము. సిద్ధియు శీఘ్రముగా లభించును. ఇచ్చట ప్రవహించుచున్న కృష్ణవేణీనది శ్రీదత్తాత్రేయస్వామి వారి పాద పీఠికయైన సహ్యాద్రి పర్వతశ్రేణిపై నుండి జాలువారి ఎన్నో ప్రదేశములను, ఎందరో జీవులను పునీతులను చేయుచు ప్రవహించి ఈ కురువపురం చేరుకొన్నది. ఇక్కడి నుండి మహదానందముతో కృష్ణమ్మ శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబల పాదాల సన్నిధికి చేరి పాతాళగంగ పేరుతో భక్తుల పాపములన్నీ ప్రక్షాళనము చేయుచున్నది. తదుపరి ఇంకనూ ముందుకు సాగి విజయవాటికయందు శ్రీ కనకదుర్గమ్మ, శ్రీ మల్లేశ్వరులను సేవించు భక్తులచే సేవించబడుచున్నది.

ఆపైన కొంతదూరము పోయి, పరవశంతో సాగరమున సంగమించే ప్రదేశమున, హంసలదీవి వద్ద శ్రీ దత్తాత్రేయుని పాదాలు కడిగి సముద్రములో కలియుచున్నది. ఆ సువిశాల సముద్రములో కలిసి గంభీర రూపము ధరించుటలోగల ఆంతర్యమేమిటో గమనించండి! నది సముద్రమున కలిసిన తదుపరి తన నామమును, రూపమును, తన గుణమును సమస్తమును కోల్పోవుచున్నది. దీనినే లయతత్త్వమందురు.

సాధారణంగా ప్రతిసాధకుడు ఇదే విధంగా తన జీవితమును పరమాత్మ తత్త్వంలో లయమొనర్చి తన ప్రత్యేకమైన ఉనికిని కోల్పోవుటయే "లయయోగ"మనబడును. ప్రతివారు సంపూర్ణంగా తమ జీవితమును పరమాత్మకు సమర్పణ చేయవలెనని తెలిసినను, దానికై ప్రయత్నించినను కోటికొక్కరు మాత్రమే గమ్యమును చేరగలరు. అయినను సాధన అన్ని స్థాయిలలోను జరుగుచునే యుండవలెను. వారి వారి సాధనా తీవ్రతయే స్థాయీ భేదములుగా గోచరించును. నిరంతర స్వయంకృషిచేత గూడ సాధకునిలో కుండలినీ శక్తి జాగృతమవుతుంది. అది అనాహతమును చేరి అనాహత నాదములో లీనమై ఒక్కొక్కప్పుడు అక్కడే ఆగిపోతుంది. అట్లుగాక ఉత్తమ గురువులను చేరిన శిష్యులకు గురుకృపతో జాగృతమైన కుండలినీ శక్తి ఎక్కడా ఆగకుండ విశుద్ధి చక్రము ఆజ్ఞా చక్రములు దాటి సహస్రారమును చేరితే సిద్ధి లభిస్తుంది. పూర్ణపురుషులైన గురువులెందరో వారి సన్నిధిని చేరిన శిష్యులకు స్పర్శ ద్వారాను, దృష్టి ద్వారాను,

సంకల్ప బలం ద్వారాను, మంత్రోపదేశం ద్వారాను శక్తిపాతం చేసి మూలాధారంలోని కుండలినీ శక్తిని జాగృతం చేసి చైతన్యపరచి ఊర్ధ్వముఖంగా సుషుమ్న నాడి ద్వారా షట్చక్ర దర్శనం చేయించి సహస్రారమునకు చేర్చి సద్గురు రూపంలో లయమొనర్చెదరు. అక్కడ జీవుడు తన సర్వస్వమును విదిలించుకొని పరమాత్మలో లయమై సమాధిస్థితిని పొందును. దీనినే "సిద్ధ సమాధి"యనీ పరంజ్యోతి దర్శన"మనీ అందురు.

దత్తసంప్రదాయ శిష్యులకు అదే సంప్రదాయ గురువులు ఎవ్వరైనా గత జన్మలలో ఆగిపోయిన సాధనను గుర్తుచేసి దానిని కొనసాగించుకోవడానికి సహాయం చేస్తారు. ఇదే దత్త సాంప్రదాయ విశిష్ఠత. శిష్యుని అర్హతలను బట్టి దత్త సంప్రదాయ గురువులు "భ్రమర కీటక న్యాయం" ద్వారా శిష్యులను ఉద్ధరించడం జరుగుతుంది. ఈ రకమైన సాధకునకు గూడ సిద్ధ సమాధి లభించి అష్టసిద్ధులు వశమవుతాయి. కానీ గురుప్రసాదితమైన ఆ శక్తులను గురువాజ్ఞలేనిదే ప్రదర్శించి కీర్తిగడించాలని ప్రయత్నించరాదు. **అన్నింటినీ తనయందే యిముడ్చుకొంటే తానే పరిపూర్ణుడై కల్పవృక్షమువలె అర్థులకు అన్నీ ఇవ్వగల సమర్థుడౌతాడు.**

సద్గురుడు తన వద్దకు చేరిన వారందరికీ ఆ విధమైన సిద్ధినీ స్థితినీ అనుగ్రహించే వీలులేదు. అర్హతలన్నీ పరీక్షించిన తర్వాతే అనుగ్రహించుట జరుగుతుంది. శిష్యులేకాదు. ఈ సమస్త చరాచర జగత్తును సద్గురుడు అపారంగా ప్రేమిస్తాడు. కానీ వారి ప్రేమను, పరీక్షను సద్బుద్ధితో స్వీకరించే శిష్యులే శక్తిపాతమునకు అర్హులౌతారు. అట్లుగాక వారి చర్యలను (బాల, ఉన్మత, పిశాచ, అవధూత) వికృతంగా అన్వయించుకొని భేదబుద్ధితో వ్యవహరించితే సద్గురువుకు దూరమై ఘోరంగా విలపిస్తారు. గురువును ద్వేషించిన వారు జన్మ జన్మాంతరముల వరకు గురు శిష్య సాంప్రదాయానికి దూరమవుతారు. శిష్యుడీ విషయమును గుర్తుంచుకొని గురుసన్నిదిలో జాగరూకుడై ప్రవర్తించి జన్మను చరితార్థం చేసుకోవాలి" అని ప్రబోధించారు.

సదానంద బ్రహ్మచారి చేతులు జోడించి "హే! ప్రభో! సర్వజ్ఞులైన తమరు ప్రవచించిన గంభీర, నిగూఢ తత్త్వము చాలా విలక్షణమైనది. శిష్యునికి ఉండవలసిన భక్తి, ప్రపత్తి మరియు సద్గురునికి సహజంగా వుండే శిష్య వాత్సల్యము, బాధ్యతాయుతమైన ప్రేమను తమరు ఎంతో మధురాతి మధురంగా నిర్వచించినారు.

ఓ! యోగి చంద్రమా! తమయొక్క దివ్య ప్రబోధములో "భ్రమర కీటక న్యాయము" ద్వారా శిష్యులను ఉద్ధరించు గురువులున్నారని శెలవిచ్చియున్నారు. ఆ వివరణను సంపూర్ణంగా మాకు బోధపరచుటకు తమ వంటి వారే సమర్థులు. దయతో ఆ సిద్ధాంతమును వివరముగా

బోధించమని వేడుకొంటున్నాను. ఏ విషయమైనను చతురతతో, నిపుణతతోను బోధించువారల ద్వారా బోధించబడినప్పుడే మావంటి మందబుద్ధుల తలలో నాటు కుటుంది. కావున మా అందరి పై కృపాదృష్టి ప్రసరింపజేసి ఆ విషయమును తెలుప కోరుతానని ప్రార్థించినాడు.

అప్పుడు శ్రీపాద స్వామివారు చిరునవ్వులు చిందిస్తూ నాయనలారా! ఈ విశ్వములో భగవానుని సృష్టిలోనే ఎన్నో వింతలు వున్నవి. సర్వజీవరాసులు తమ వంశాభివృద్ధికై స్త్రీ-పురుష సంపర్కం ద్వారా పిల్లలనుకనును. కొన్ని జీవరాసులు గ్రుడ్లు పెట్టును. ఆ గ్రుడ్డు నుండి బయటకు వచ్చిన పిల్లలు తల్లిని పోలియుండును. వీటన్నింటికీ విరుద్ధమైన పద్ధతిలో తన వంశాభివృద్ధిని చేయు శక్తి ఒక్క భ్రమరమునకే కలదు. భ్రమరము స్త్రీ-పురుష భేదము లేకుండా మట్టితోగూడ నిర్మించును. ఏ జాతికి చెందినదను విషయంతో సంబంధం లేకుండా ఏదో ఒక కీటకమును తన కాళ్ళతో కరచుకొని తెచ్చి ఆ మట్టి గూటిలో ఉంచును. ఆ గూటిని మూయుటకై మరల మట్టిని తెచ్చుటకై అవతలకు పోయినప్పుడు కీటకము ఎటైనా పాకిపోవునేమోనని దానిని కదలలేని స్థితివరకు తన తొండముతో బాగుగ కుట్టును. కాని అది పూర్తిగా చావదు. ఆ స్థితిలో దానిని వదలి తానుపోయి చిన్న చిన్న మట్టిముద్దలు తెచ్చి ఆ గూటిని పూర్తిగా మూసివేయును. తదుపరి నిర్ణీత సమయంవరకు కొన్ని రోజులు ఆగూటి చుట్టూ ఝుంకారము చేయుచు పరిభ్రమించును. తదుపరి ఆభ్రమరం ఏమైపోవునో, ఎచ్చటికిపోవునో ఎవరికీ తెలియదు. గూటిలో నుంచబడిన కీటకము తనను అంతగా కుట్టిన భ్రమరము యొక్క ధ్వనిని గుర్తుచేసుకొని అది ఎప్పుడు వచ్చునో, ఎప్పుడు కుట్టునోనను భయముతో భ్రమరమునే ధ్యానించుచుండును. ఆ నిరంతర ధ్యానముతో తానే భ్రమరముగా మారును. ఆ కీటకమునకు భ్రమరము యొక్క రూపము, దానివలెనే శబ్దము చేయు శక్తి మొదలగునవన్నియు సంక్రమించును. తిరిగి తన వంశాభివృద్ధినొనర్చుటకై ఈ పద్ధతినే పాటించు గుణము గూడ దానికి సంప్రాప్తించును. ఇది అందరి యిండ్లలో కంటికెదురుగా కనబడుచుండు సృష్టి వైచిత్ర్యము. అందువలననే ఈ ఉదాహరణము నిచ్చుటపరిపాటి.

ఇదేవిధంగా సద్గురువు తన సంప్రదాయమును కొనసాగించుటకు తాను వివాహమాడి వారసులను కనడు. జాతి, కుల, వయో, లింగభేదము పాటింపక ఏ శిష్యుడినైనా వాని స్థూల, సూక్ష్మాది దేహ సంబంధము నుండి విడిపించి, తన కారుణ్యంతో వాడు జీవించియుండగానే జీవభావమును తొలగించి, బ్రహ్మభావమును పొందులాగున అతనిని సిద్ధము చేయును. భ్రమరము తానుగా పోయి కీటకమును పట్టి తెచ్చును. కాని సద్గురువు తన సంకల్పబలంతో శిష్యుని తన వద్దకు ఆకర్షించుకొనును.

శిష్యుడు "తను, మన, ధన, ప్రాణములను సమర్పించుటకు సంసిద్ధత కలిగియుండుటయే అసలైన అర్హత. "తత్త్వమసి" అను విషయ వివరణము గురువు అనుభవ పూర్వకముగా శిష్యునికి ప్రసాదించి ఉద్ధరించును. అనగా వానిని ఆక్షణమునందే సంసార మహార్ణవము నుండి తీరమును చేర్చును. ఆపైన మహదానందమునే అనుభవించును. అటువంటి గురువు బ్రహ్మ విష్ణుమహేశ్వరులను మించిన సాక్షాత్పర బ్రహ్మయైయున్నాడు. తనకు కర్త, భర్త, హర్త గురువేనను విశ్వాసమే శిష్యునికి శ్రీరామరక్ష. గురువే పరమగతి. అటువంటి గురువును పొందినవాడు నిరంతరము గురుసేవ చేయుట తప్ప వేరు పూజలు చేయ వలసినపనిలేదు. ఎందుకనగా సకల దేవతల సమిష్టిరూపమే సద్గురువు. శిష్యునిలో ఇటువంటి పవిత్రమైన భావన పటిష్ఠంగా ఏర్పడాలంటే అతడు దివ్యానుభూతిని స్వయంగా పొందాలి. గురువాదేశిస్తే ఏ పూజనైనా చేయవచ్చు. ఏదేవతనైనా ఆరాధించవచ్చు. అట్టి యెడ ఏమీ దోషము లేదు. అంతేగాక గురువాజ్ఞచే చేయబడుపూజలు సద్యః ఫలితమును అతి శీఘ్రముగా కలిగించును" అని తెలిపినారు.

పరమానంద భరితుడైన సదానంద బ్రహ్మచారియు వారి మిత్రబృందమును జయజయ ధ్వానములు చేసిరి. సదానందుడు లేచి నిలబడి నమస్కరించి "ఓ! దేవదేవా! సద్గురూ! నీ వాగమృతమును గ్రోలి ధన్యులమైనాము. కర్మతంత్రం పట్ల అభిమానంగలవారు నీ అఖండ తత్త్వాన్ని గ్రహించలేరు. ఓ! సచ్చిదానంద స్వరూపా! నిష్కాముడవైన నిన్ను నిష్కాములైన వారే గుర్తించి, నీ నిజతత్త్వమును గ్రహించి సేవించి తరించగలరు. నీ లీలలు వర్ణింప నాతరమా! దీనదయాళో! ఎక్కడి బదరీక్షేత్రము! ఓ! శ్రీపాద శ్రీవల్లభా! నీవు అనంత ఘటనాఘటన సమర్థుడవు! నీవే మూలాధార క్షేత్ర నిలయుడవై సకల సంకల్పములు కలిగించువాడవు. నీవే విఘ్నేశ్వరుడవు. సాధకుల సాధనలోని ఆటంకములను (విఘ్నములను) ధ్వంసము చేసి నిష్కంటకమైన బాట చూపే మార్గదర్శివి. నీవే సకల విద్యలకు నిలయుడవు. మాలోని సంకల్పశక్తివి నీవే! కావుననే గోకర్ణ క్షేత్రము చేరుసరికి నీ నివాస స్థానము గోవిందభట్టు ద్వారా తెలియవచ్చినది. వారు మాకు మార్గ నిర్దేశనం చేసి మా కోరిక నెరవేర్చారు. ఆహా! సర్వజీవులయానందము నీవే! ఓ! దేవా! మమ్మ కడవరకు నీ కృపాదృష్టితో చూచి గమ్యమును చేర్చుమని ప్రార్థించిరి. శ్రీపాదస్వామి వారందరికినీ తమ దివ్యాశీస్సులను, అమృత దృక్కుల ద్వారా ప్రసాదించగా వారు ఆ రాత్రికి అచ్చటనే విశ్రమించిరి. శ్రీపాదుల వారు వారికి జ్ఞాన ప్రబోధం చేసి తదుపరి తీర్థయాత్రలకై అనుమతిని ప్రసాదించి పంపినారు.

## పులులకు అభయము

ఒకసారి శ్రీపాదస్వామి దర్శనానికని రాయచూరు నుండి ఒక భక్తుడు ఒంటరిగానే వచ్చాడు. కురువపురం చేరుకొనేసరికి చీకటి పడింది. శ్రీ స్వామివారికి మ్రొక్కాలని వేగిరపడుతూ వచ్చి చూడగా, ధ్యానమగ్నులైన శ్రీ స్వామి వారి ఎదుట రెండు పెద్దపులులు కూర్చుని వుండుటను చూచాడు. భయంతో వణికి పోతూ నోటమాటరాక అట్లే నిలబడ్డాడు. శ్రీ స్వామి వారు ధ్యానం విరమించి "మిత్రులారా! పాపం నా భక్తుడొకడు మిమ్ముచూచి భయపడ్డాడు. ఇక మీరు వచ్చిన పని అయినది. ఇక సెలవు తీసుకోం"దని వారిని పంపివేశారు. తర్వాత ఆ భక్తుడు స్వామి మాటలు చెవిన సోకి దగ్గఱకెళ్ళి, భయం భయంగా నమస్కరిస్తూ వుంటే "లక్ష్మీ నరసయ్యా! ఎందుకు భయపడ్డావు?" అని అతనిని పేరుతో సంబోధించేసరికి అతని ఆశ్చర్యం రెండింతలైంది. అవాక్కయినాడు.

"ఏమి పనిమీద వచ్చావు?" అని శ్రీ స్వామివారు ప్రశ్నిస్తే అతను కొంత తడవునకు తేరుకొని తనకు సంతానంలేదనీ, తమ అనుగ్రహం వుంటే సంతానం కలుగుతుందని ఆశించి వచ్చానని సమాధానం చెప్పారు. "ఈ రాత్రికి ఉండి రేపు ఉదయాన్నే వెళ్ళు! వెళ్ళేటప్పుడు ఈ కృష్ణానదిలోని నీరు నీ వద్దనున్న మట్టిముంత నిండా ఇక్కడి నుండే తీసుకుపోయి నీ భార్యకిచ్చి త్రాగించు సంతానం కలుగుతుం"దని దీవించారు. అతడట్లే చేసెను. తర్వాత సంవత్సరానికి ఆ దంపతులు కవల పిల్లలతో వచ్చి శ్రీ స్వామికి నమస్కరించారు. శ్రీ స్వామివారు అప్పుడా పిల్లలకు పెద్ద పులిరాజు, చిన్న పులిరాజు అని నామకరణం చేయమన్నారు. అందులకతడు భయంతో కంపించుతున్నాడు. అతని మనోభావమును గ్రహించి శ్రీ స్వామివారిలా చెప్పారు. "నీవు వచ్చిన రోజున రెండు పులులను దర్శించావుగా! అవి వాటి జన్మల నుండి విడుదల కోరి వచ్చాయి. వాటినే నీ గర్భంలో పుట్టేటట్లు ఆశీర్వదించా"నని చెప్పారు. అచ్చట వుండి ఆ వార్త విన్నవారంతా ఆశ్చర్యపోయారు. అతను గూడ భయపడుచుండగా శ్రీ స్వామివారు "భయపడకు లక్ష్మీ నరసయ్యా! ఆ పులులు వాటి స్వభావమును నా దర్శనంతోనే వదిలేశాయి. నీ కడుపున పుట్టిన కుమారులు ఉత్తమోత్తములుగా ఉంటారు" అని ఆశీర్వదించి తిరిగి వారలకు 'నరహరి' అని "నరసింహ" అని నామకరణములు జేయగా ఆ దంపతులు ఆనందముతో ఉప్పొంగిపోయారు.

## గురుకృప

శ్రీ స్వామి విఠల్ బాబావారి ముఖతః ఈ లీలలు విని అందరము ఆనంద తన్మయులైనాము. నిజంగా శ్రీపాదస్వామి వారి దివ్యశక్తి ప్రదానంతోనేగదా ఆంజనేయశర్మలో సకల విద్యలు జాగృతమైనాయి. అప్పటివరకు ఎన్నో అవమానములను భరించాడు. అలా నిందలు, అవమానాలు సహించే వారి యెడ గురుకృప మరింత అధికమవుతుంది. మహాత్ముల దివ్యశక్తి ప్రసారం ఏ మేరకు ఎవరికి అవసరమో ఆ మేరకే వినియోగించబడుతుంది. పిడుగుకూ బియ్యానికీ ఒకటే మంత్రం అని భ్రమపడుట మన అవివేకం. సద్గురుని వాక్కు, స్పర్శ, దృష్టి, సంకల్పం ఏ విధంగానైనా శక్తి ప్రదానం చేయవచ్చును. ఒక్కొక్కప్పుడు, ఒక్కొక్క వ్యక్తిని ఒక్కొక్క తీరుగా గురువులు అనుగ్రహిస్తారు. ఒకదానికొకదానికి పోలిక వుండదని తెలుసుకోవాలి. వారివ్వదలచిన అనుగ్రహాన్ని మనం పుచ్చుకోవడానికి సంసిద్ధంగా వుండాలి. కానీ కోరరాదు. ఇదే గురుతత్త్వంలోని రహస్యం.

తర్వాత అందరం జయము జయము శ్రీపాద శ్రీవల్లభస్వామి వారికి అని జయ జయ నాదములు చేసి విఠల్ బాబావారికి నమస్కరించితిమి.



## 14వ అధ్యాయం

### శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

తదుపరి విశేషాలు వినేటందుకు అందరం కుతూహల మనస్కులమై శ్రీ బాబాగారిని సమయమెఱిగి ప్రశ్నించాలని వేచివున్నాము. మా ఆతురత గ్రహించుకొన్న శ్రీ బాబాగారు "ఇంకనూ శ్రీపాదస్వామి వారు ఎవరెవరని ఏ విధంగా ఉద్ధరించారో చెప్తాను జాగ్రత్తగా వినండి!" అంటూ ఇలా ప్రారంభించారు.

క్రమంగా గ్రామస్థుల సహాయం తీసుకొని సంసారం నిర్వహించుకొనే స్థితి నుండి అభివృద్ధిని చెంది తన స్వంత సంపాదనతో తల్లిని పోషించుకొనుచు సకల జనహితం కోరి నిత్య కృత్యాలు, భగవత్ప్రార్థనలు చేస్తూ మంచి పేరు సంపాదించుకొన్నాడు ఆంజనేయశర్మ. కొన్ని సంవత్సరాలు గడిచాయి. శ్రీపాదుల కృపతో కల్యాణ ఘడియలు దగ్గఱపడినాయి.

ఒకానొకనాడు ఆంజనేయశర్మను మూర్ఖుడనీ, జడుడనీ, బుద్ధి హీనుడు, పనికిరానివాడని అనేక విధములుగా నిందించిన బంధువులకు గూడ ఇతడు విద్యావంతుడైనాడని తెలిసింది. సంపన్నుడైనాడని తెలిసింది. తండ్రి మరణం తర్వాత తల్లీ కొడుకులను పలకరిస్తే ఎక్కడ సహాయం చేయవలసి వస్తుందేమోనని ఆనాడు వదలి వేసిన బంధుత్వాన్ని ఈనాడు పురస్కరించుకొని సరాసరి ఆంజనేయశర్మ నివాసానికి వచ్చినారు. అంబికను "అక్కా, వదినా, పిన్నీ, అత్తా" అని పిలుస్తూ ఆమె యొక్క ఓర్పును, మంచితనాన్ని గురించి మరీ మరీ పొగడినారు. "అక్కా! నీవు గురువనుగ్రహం పొందిన సుగుణశీలివి. ఎటువంటి సంపదలైనా నీ సుగుణ సంపద ముందర వృథాయే!"నని ముఖస్తుతి చేసి "ఏ అదృష్టవంతురాలు నీకు కోడలవుతుందో! దాని ఒళ్ళంతా బంగారమే అవుతుంది!" అని ఒకరు, "కొడుకు పెళ్ళీ ఈడుకు వచ్చాడు. మాకు పప్పన్నం ఎప్పుడు?" అని మరొకరు ఇట్లా ఆమెకు ఊపిరాడకుండా అంతా పొగడ్తల వర్షం కురిపించసాగారు.

అంబికామాత ఎంతో ఓర్పుతో సాలోచనగా ఏమీ మాట్లాడక పూర్వ జీవితాన్ని గురించి యోచిస్తుండగా "అక్కా! కష్టాలలో ఉన్నప్పుడు రాలేదని, పరామర్శించలేదని అనుకుంటావేమో! పనుల వత్తిడివల్ల రాలేకపోయినాను. ఏమీ అనుకోవద్దు" అని సంజాయిషీ చెప్పుచూ, వరుసకు తమ్ముడైన మల్లికార్జునశర్మ అను గృహస్థు ఆమెదరికి చేరినాడు. ఆతని భార్య గూడ "నిజమే వదినా! ఇంట్లో అనేక ఇబ్బందులు. అందుకే రాలేకపోయినాము" అని సమర్థించింది. అన్నీ

ప్రశాంతంగా విన్నది అంబికా మాత. వరుసకు అక్క కూతురైన ఆమె వచ్చి "పిన్నీ! చల్లకొచ్చి ముంత దాచడమెందుకు! మల్లి మామయ్య కూతురు సుబ్బలక్ష్మి మంచి అందమైన పిల్ల. మన వాడికి ఈడు జోడు సరిపోతుంది. నువ్వు "ఊ" అంటే చాలు. మంచి ముహూర్తం నిర్ణయించు తానంటున్నాడు" అని ప్రారంభించింది. "అవును వదినా!" అంటూ మరదలు వత్తాసు పలికింది. అంబిక "మా వాడిని ఇంటికి రానీయండి! ఆలోచించి చెప్తా"ననగానే ఇంకా అందులో ఆలోచించడానికేమున్నదమ్మా! నీ మాట వాడు కాదంటాడా?" అని ఆమెను "సరే"నను అంటూ వత్తిడి చేస్తుండగానే ఆంజనేయశర్మ ఇంటికి వచ్చాడు. అతను రాగానే బంధువులంతా ఒక్కసారిగా "నీవు ఇంద్రుడివి! చంద్రుడివి! ఇక పెళ్ళి చేసుకొని గృహస్థు కావాలి! మీ అమ్మను పువ్వుల్లో పెట్టి చూచుకోవాలి! వంశాభివృద్ధి చెయ్యాలి!" అంటూ అతనికేమాత్రం ఊపిరి పీల్చుకొనే అవకాశం కూడా లేకపోయేటట్లు ప్రశ్నలవర్షం కురిపించారు. ఆంజనేయశర్మ "అమ్మా! ఏమిటీ! ఎవరు వీరంతా?" అని తల్లిని అడిగినాడు. ఆమె మనసులో కొంత కష్టమూ కొంత ఇష్టము వున్నది. సంభాళించుకొని నీకు ఈయన వేలు విడిచిన మేనమామ అవుతాడురా! ఈమె ఆయన భార్య! వీళ్లంతా ఆయన అక్క పిల్లలు! అంతా మన బంధువులే!" అని పరిచయం చేసింది. "సరే! అందరికీ మరి భోజనం వడ్డించ"మనగానే వారు అదేమిటమ్మా అసలు విషయం చెప్పవేమిటి?" అన్నారు అంబికతో. అప్పుడామెవంక ప్రశ్నార్థకంగా చూస్తున్న కొడుకుతో "వీరంతా ఈ మామయ్య కూతురిని నీకిచ్చి పెళ్ళి చేయించాలని వచ్చారు" అని చెప్పి "గ్రామ పెద్ద రామాచారి గారిని పిలుచుకొని రా!" అని అతనిని పురమాయించి పంపించింది. వారింటికి వెళ్ళేసరికి ఆంజనేయశర్మను చూచి "రావయ్యా పెళ్ళికొడుకా!" అంటూ ఆయన ఆహ్వానించారు. శర్మ ఆశ్చర్యపోయాడు. "మా అమ్మ మిమ్మల్ని తీసుకురమ్మంది. రండి! వెళదాం" అని పిలిచాడు. ఆయన వెంటనే వచ్చి అంబికామాతతో మాట్లాడగా "మావాడికి తండ్రి లేడు గదా! తమరే మాకు పెద్దలు!" అని చెప్పి ఆమె కళ్ళ నీళ్ళు పెట్టుకొనుట చూచి, రామాచార్యులు ఆమెను ఓదార్చి "గతం గతః. పాత విషయాలు మరచిపోండమ్మా! ఇప్పుడు వారికి వారై వచ్చారు. పిల్లనిస్తామంటున్నారు. ఏమి చెప్తారో? చెప్పండి!" అనగానే "నాదేముందండి. ఆ స్వామి కృపవల్లనే గదా మాకు ఇంతటి స్థితి కలిగింది. కాబట్టి ఈ విషయంలోగూడ ఆ స్వామి వారి ఆజ్ఞయే మాకు శిరోధార్యం!" అన్నదామె.

బంధువులంతా వెంటనే అందరితో కలిసి దర్బారు ప్రదేశానికి చేరుకొన్నారు. శ్రీ స్వామి వారు ప్రసన్నులై "శుభం! ఆంజనేయశర్మకు పెండ్లి జరిపించండి! గృహస్థుడవుతాడు!" అని

ఆశీర్వదించారు. అందరూ "శ్రీపాద స్వామివారికి జయము! జయము!" అని జయజయ ధ్వానాలు చేసి తిరిగి ఇంటికిపోయినారు. తర్వాతనే అందరూ శుభ నిర్ణయం చేసినారు. మంచి ముహూర్తం చూచి పెళ్ళి నిశ్చయించినారు.

ఆంజనేయశర్మ వివాహానికి దూరదూర పండితులందరికీ ఆహ్వానాలు అందించినారు. మల్లికార్జునశర్మగారి గ్రామానికి పంచదేవపహాడ్ గ్రామస్థులలో ఆంజనేయశర్మపై అభిమానం కలవారంతా బయల్దేరి ఎడ్ల బండ్లు కట్టుకొని వెళ్ళినారు. ఆకుపచ్చని తోరణాలతో అలంకరించబడిన పందిరిలో శుభకరమైన మేళతాళాల మధ్యన పురోహితులు మంత్రోచ్ఛారణలు చేస్తుండగా, ముత్తైదువలు పాటలు పాడుచుండగా, మంగళ స్నానాలు చేసి, ఆంజనేయ శర్మ పెళ్ళికొడుకు ముస్తాబు చేసుకొని, పెళ్ళి పిల్ల సుబ్బలక్ష్మి మెడలో మంగళ సూత్రం కట్టాడు. గట్టిగా మూడు ముళ్ళువేసి, ఏడడుగులు నడిచి, అగ్నిసాక్షిగా నూతన వధువు చిటికెనవ్రేలు పట్టి ప్రదక్షిణలు చేశాడు. ఆహూతులైన పెద్దలందరూ దీర్ఘాయుష్మంతులై వర్థిల్లండి!" దీవింపగా అందరికీ ఆ వధూవరులు నమస్కారములు చేశారు. అంబిక సంతోషానికి అవధులు లేవు. పండితులందరినీ ఘనంగా సన్మానములు, సంభావనలు ఇచ్చి సత్కరించారు. కన్యాదాత గూడ అందరికీ వందన సమర్పణచేసి, పెళ్ళి పిల్లను అప్పగింతలు చేసి అత్తవారింటికి పోవుటకు రెండెడ్ల బండ్లు ఏర్పాటు చేసినారు.

బంధువులందరిలో ఆనందం వెల్లివిరిసింది. అంబిక కోరికలు రెండూ తీరిన తన్న సంతోషంలో మాట పెగలలేదు. కొడుకు విద్యావంతుడు కావడం, ఒక యింటివాడు కావడం అనే ఆమె రెండు కోరికలు నెఱవేరినవి. "ఇదంతా కృపా విశేషం తప్ప మరొక్కటికా"దని ఆమె ఆనంద బాష్పాలు కారుచుండగా అందరితోను గొప్పగా చెప్పుకొన్నది.

ఈ విధంగా ఆంజనేయశర్మ అభివృద్ధిని సాధించినది తెలిసి ఎందరో భక్తులు దూర దూర ప్రాంతాల నుండి వచ్చి అనేక సమస్యలను శ్రీ స్వామివారికి నివేదించి నివారణ పొందేవారు. అంబికా మాత పూజించే శివలింగమును దర్శించుకొని సుఖశాంతులు పొందినారు.

భక్తులారా! ధార్మికులారా! ఆ విధంగా అంబికామాత జీవితాంతం శివపూజ చేసి మహాపుణ్యాన్ని ఆర్జించుకొన్నది. సాధారణంగా మానవులందరికీ జీవితంలో మూడుభాగాలు ఉదర పోషణకొరకు ధన సముపార్జన తోనే గడిచిపోతుంది. చివరిదశలో (వృద్ధాప్యంలో) భగవదారాధన చేద్దాములెమ్మని చాలామంది జాప్యము చేస్తారు. భౌతికధన సంపాదనలో వుండే ఆసక్తి పుణ్యధన

సంపాదనలో వుండదు.  వృద్ధాప్యంలో అవయవములన్నీ పట్టుదప్పి ఏ పుణ్యకార్యాలుగానీ, తీర్థయాత్రలు గానీ, జపతపములుగానీ, ధాన్యముగానీ చేయలేని స్థితిలో వుంటాయి. శరీరం దేనికీ సహకరించదు.  చేయాలనే మనసువున్నా శరీరం చెప్పినట్లు మనం వినవలసిన స్థితి యేర్పడుతుంది. అందువల్లనే ప్రతివారు ఈ విషయాన్ని తెలుసుకొని చిన్న వయసు నుండే భగవత్కార్యాలు ఆచరించే ప్రయత్నం చేయాలి. జపధ్యానాలు గూడ చిన్నవయసులోనే స్థిరంగా చేయుట కుదురుతుంది. ధన సముపార్జన చేసే సమయంలోనే దాన ధర్మాలు ఆచరించుట ద్వారా, అతిథి అభ్యాగతులను సేవించడం ద్వారా మహాపుణ్యాన్ని సంపాదించుకోవలసిన కర్తవ్యం గృహస్థులకున్నది. గాన విజ్ఞాన సంపర్ణులై మెలగండి! ఉత్తమ స్థితిని పొందండి!

"జైగురుదత్త" అని విఠల్‌బాబావారు అంబికా మాతను కొనియాడి తదుపరి యిట్లు పలికిరి. "గురువాక్య పాలనము అనునదే ఒక వ్రతముగా భావించవలెను. సందేహములుండరాదు. సద్గురు సేవా భాగ్యము ఎన్నో జన్మల పుణ్యఫలమని తెలిసి సంతోషంతో సేవలు చేయ పూనుకొన్నవారికి సకల దేవతల సహాయమున్నూ లభిస్తుంది. సద్గురువు అనుగ్రహం కలవాడికి ఏ గ్రహాలు అడ్డురావు. ఈ విషయాన్ని మీరందరూ గుర్తుంచుకోండి!" అని ప్రబోధించారు.

శ్రీ విఠల్‌బాబావారు ఈ సంఘటనను వివరించి "అందరికీ గురువు కష్ట నివృత్తికి సూచనలిస్తారు. కానీ ఆచరించవలసినది భక్తులూ, శిష్యులే! తామేమీ కష్టపడే పని లేకుండా గురువుల తపశ్శక్తినో, మంత్రశక్తినో, తంత్ర శక్తినో వినియోగించి తమ కష్టాలను నివారించాలని అనుకొనేవారుంటారు. కానీ ఎవరికర్మ నివృత్తి కావాలో వారే స్వయంగా కష్టపడి మనసా, వాచా, కర్మణా భగవదారాధన చేస్తే భగవదనుగ్రహం తప్పక దొరుకుతుం"దని విస్పష్టంగా చెప్పినారు.

శ్రీ బాబాగారి ప్రవచనం విన్నటువంటి నా మనసులో ఒక సందేహం కలిగింది. అంబికా మాత ఈ జన్మలోనే గదా సద్గురు దర్శనం పొందినట్లు తెలుస్తున్నది. శ్రీ బాబాగారు ఎన్నో జన్మల పుణ్యఫలంగా ఆమెకు సద్గురు దర్శనం లభించిందంటున్నారు. ఆమె పూర్వజన్మ వృత్తాంతమేమైనా చెప్పితే మన నడతలో ఏమైనా మార్పులు చేసుకొనే వీలుంటుంది గదా! అనే భావన కలిగింది. శ్రీ బాబాగారికి నమస్కరించి "స్వామీ! ఇప్పుడు తమరు చెప్పిన "పూర్వపుణ్య ఫలము" అనే విషయమై సమాధానం తమరు తప్ప చెప్పేవారెవరు! మా యందు దయ యుంచి, ఆమె పూర్వగాథను వినిపించి మాకు కనువిప్పు కలిగించండి బాబా!" అని ఆర్తితో ప్రార్థించాను.

కొంతసేపు శ్రీ బాబాగారు మౌనంగా ధ్యాన నిమగ్నులైనారు. తదుపరి నవ్వుచూ కళ్ళు

తెలిచి మా అందరివంకా చూచుచు అమ్మలారా! అయ్యలారా! శ్రీపాదుని కరుణ లభించినది అంటే పూర్వజన్మల సుకృతం అని చెప్పాను. ఇక్కడ ఇప్పుడు మీకందరికీ గూడ శ్రీపాదుల అనుగ్రహం పుష్కలంగా లభిస్తున్నదని చెప్పాను గదా! అంబిక పూర్వ సుకృతం గురించి ప్రశ్నించినట్లుగా తిరిగి మీ అందరి సుకృతాలు చెప్పమన్నావనుకో. నేను మీకెవ్వరికీ కనబడకుండా అదృశ్యమైపోతాను. సద్గురుదేవులు మనకెంత వరకు కావాలో అంతే తెలియనిస్తారు. ఇది మాత్రం గుర్తుపెట్టుకోండి!" అని మాకు హెచ్చరిక చేశారు.

మేము నమస్కారం పెట్టి "అలా అడగము స్వామీ! శ్రీపాదుల అనుగ్రహం చాలు మాకు!" మా నడవడిని మెఱుగుపరచుకొనే దృష్టితో ప్రశ్నించాను. క్షమించండి!" అని వేడుకొన్నాను.

తర్వాత శ్రీ బాబారు "శ్రీపాదశరణం, శ్రీపాద శరణం, శ్రీపాద చరణం భజే" అని నామం మా అందరిచేత చెప్పించి తర్వాత ఇలా చెప్పారు.

ధార్మికులారా! పాపములు, పుణ్యములు ప్రతివారూ చేస్తూనే వుంటారు. ఆ రెండూ గూడ అనుభవించే తీర్చుకోవాల్సి వుంటుంది. వినండి అంబిక పూర్వం ఒకానొక జన్మలో దశార్ణ దేశరాజైన వజ్రబాహుడనే రాజుకు రెండవ భార్య. పేరు అప్పుడు ఇందుమతి. రాజు పెద్ద భార్య పేరు సుమతి. పేరుకు తగినట్లు ఆమె సుగుణవతి. చిన్నభార్యకు సవతి అంటే పడదు! సుమతి ఆమెను ప్రేమతో 'చెల్లీ!' అని పిలిచినా గూడ ఇందుమతి మాత్రం 'అక్కా' అని పిలవదు. ఆమెతో కలవదు. గౌరవం లేకున్నా ఫరవాలేదు. కానీ కడుపు నిండా ద్వేషం నింపుకొని, ఎప్పుడూ కుళ్ళుకుంటూ, అవకాశం వస్తే ఆమెను హింసించాలనే తలంపులతో వుండేది. రాజుగారిని ఎక్కువగా ఆకట్టుకొని తనవద్దనే నిలుపుకోవాలని, పెద్ద రాణి మందిరానికి పోనియ్యగూడదని భావించేది. రాజు ధర్మాత్ముడు గనుక ఇద్దరు రాణులను సమంగానే ప్రేమతో చూచేవాడు. ఇలావుండగా పెద్దరాణి గర్భం ధరించినది. రాజుకు ఈ శుభవార్త తెలిసి నగరమంతా ఉత్సవం చేయించాడు. పెద్దరాణియైన సుమతికి సకాలంలో పుంసవనము, సీమంతము మొదలగు వేడుకలు, శాంతులు అన్నీ జరిపించాడు. చిన్నరాణి ఈర్ష్య మరింత పెరిగి ముందు ముందు రాజు తనను నిరాదరణ చేస్తాడేమో?"నని రాజును ఏ విధంగానైనా పెద్ద రాణి వద్దకు పోకుండా ఆపాలనుకొంది. ఈ ప్రయత్నంలో ఆమె తన చెలికత్తెతో కలిసి, మంతనాలు చేసి, పెద్దరాణికి గర్భస్రావం కావాలని ఆహారంలో మందుపెట్టించింది.

పెద్దరాణి సుమతికి గర్భస్రావం కాలేదు. కానీ శరీరమంతా పుండ్లు, దురదలు ఏర్పడినవి.

వైద్యులచే కొన్ని చికిత్సలు చేయించాడు రాజు. త్వరలోనే ఆ రాణి ప్రసవించినది. మగ శిశువు జన్మించాడు. ఆ శిశువునకు కూడ శరీరమంతా పుండ్లుపడే వున్నాయి. మహారాజు వజ్రబాహునకు కుమారుడు కలిగిన సంతోషం లేకుండా పోయింది. ఎన్ని చికిత్సలు చేసినా ఆ పుండ్లు తగ్గక చీము, రక్తము కారగా ఈగలు, దోమలు, పురుగులు వేధించసాగాయి. రాజవైద్యులకు గూడ ఆ వ్యాధి నివారించడం సాధ్యం కాకపోవడంతో రాజు మనశ్శాంతిని కోల్పోయివున్న తరుణం చూచి, చిన్న రాణి ఆయనతో సవతిపైన లేనిపోని కల్పనలు చేసి, తల్లీబిడ్డలిద్దరూ పాపం చేసుకొన్నారు. ఆ పాపాల ఫలితం ఇప్పుడీ రోగమని, ఇటువంటి వారివలన అందరికీ గూడ ఆ రోగాలు అంటుకుంటాయని చెప్పి రాజు మనసు విరిచింది. ఆయన చిన్న భార్య మాటలు నమ్మటానికి వీలుగా ఒక జ్యోతిష్యుని పిలిచి చాటుగా అతనికి ధనమిచ్చి ఎట్టైనా పెద్దరాణిని, కొడుకును రాజుకు దూరం చేయమని కోరింది. ఆ జ్యోతిష్యుడు పిల్లవాని జాతకం చూచి ఆ తల్లీ కొడుకులను త్యజించితే గానీ రాజుకు, రాజ్యానికీ మేలు జరగదని సలహా చెప్పాడు.

రాజు ఆ జ్యోతిష్యుని మాటలు నమ్మి పెద్ద రాణిని, కొడుకును అడవిలో విడచిపెట్టమని భటులకు ఆజ్ఞాపించాడు. వారు రాజాజ్ఞను పాటించి సుమతిని కొడుకునూ నట్టడవిలో విడిచారు. ఆ పసివానితోను, శరీర బాధలతోను ఆ రాణి తన భర్త యొక్క నిరాదరణకు గురియగుటయేగాక ఈ అడవిలో దిక్కులేని విధంగా తన శిశువును పొట్టకు కట్టుకొని కనిపించిన కాయగసురులు తింటూ, తిరుగుచూ భగవంతుని ప్రార్థిస్తూ తన శిశువును పొట్టకు కట్టుకొని విలవిలలాడింది. మనుష్య సంచారములేని ఆ అడవిలో కనీసం ఏ క్రూర జంతువైనా తమను మ్రింగివేసినా బాధలు తీరతాయనుకొనేది.

కానీ విధియనేది చాలా విచిత్రమైనది. ఒక్క క్రూర మృగం కూడ ఆమె జోలికిరాలేదు. అలా తిరిగి తిరిగి వేసారి ఒక చెట్టుక్రింద వుండగా కొందరు పశువుల కాపరులు ఆమె కంటబడ్డారు. సుమతి వారిని “దగ్గరలో ఏదైనా ఊరు గలదా”యని అడిగింది. వారు దారి చూపారు. ఆమె మెల్లగా ఆ జనపదానికి చేరుకొని అది ఏ రాజుగారి రాజ్యమో విచారించుకొన్నది. ఎందుకంటే తన భర్తదే అయితే తనకెవ్వరూ ఆశ్రయం ఇవ్వరని, రాజభటుల కంటబడితే తన ప్రాణాలు దక్కవని ఆమె భయం. ఆ గ్రామం పద్మాకరుడను వైశ్యరాజుపాలనలోనిదని తెలుసుకొన్నది. తన పరిస్థితిని ఆ రాజునకు తెలుపమని అక్కడి గ్రామస్థులను కోరింది. వారు దయతో రాజుగారికి తెల్పగా, ఆయన స్వయంగా వచ్చి, ఆమెను పరామర్శించి, ఒక రాజ్యానికి రాణియైన సుమతి

దుస్థితికి మనసు కరిగి, గౌరవాదరములతో ఆమెను పల్లకీలో తీసుకెళ్ళి, రాజవైద్యులను పిలిపించి అనేక విధాల వైద్యం చేయించాడు.

ఒకనాడు రాణి కొడుకు చనిపోయాడు. ఆమె వేదనకు అంతులేదు. తానుకూడ చనిపోతానని రోదిస్తున్నది. రాజైన పద్మాకరుడు సానుభూతితో ఎంత ఓదార్చినా ఆమె తన బ్రతుకు కొడుకుతోనేనని, అతను చనిపోయాక తానింక ఎవరి కొరకు బ్రతకాలని గుండెలు బాదుకొని ఏడుస్తుండగా ఋషభయోగి (అవధూత) అను మహాత్ముడక్కడ ప్రత్యక్షమైనారు. వారి పాదాలు పట్టుకొని ఆ రాణి సుమతి గోడుగోడున ఏడ్వసాగింది.

అప్పుడా యోగి ఎందుకేడుస్తున్నావని ప్రశ్నిస్తే నా కొడుకు చనిపోయాడు. నేనూ చనిపోతాను అన్నది. ఆ యోగిరాజు ఆమెకీవిధంగా తత్త్వబోధ చేసారు. "అమ్మా! నీవు అనవసరంగా దుఃఖిస్తున్నావు. నీవు కన్న శరీరం ఇక్కడే వున్నది. జీవుడికి కర్మలను అనుభవించేటందుకు ఉపయోగపడేదే ఈ శరీరం. ఇది పనికి రానప్పుడు పాతబట్టను విసర్జించిన విధంగా జీవుడా శరీరాన్ని వదిలేస్తాడు. మరొక్క వస్త్రమును ధరించు విధంగా మరొక శరీరాన్ని ధరిస్తాడు.

వాసాంసి జీర్ణాని యథా విహాయ - నవాని గృహ్ణాతి నరోఽపరాణి
తథాశరీరాణి విహాయ జీర్ణా న్యన్యానిసంయాతినవానిదేహీ॥ (భ.గీ)

ఏ దేహంతో ఎంత కర్మలను అనుభవించాలో, ఏఏ కర్మలు చేయాలో విధి నిర్ణయం ప్రకారం జరిగి పోతుంటాయి. పిచ్చితల్లీ! ఉపశమనం పొందు. నీ కర్మానుభవం పూర్తయ్యేవరకు నీవు శరీరం వదలటం కుదరదు. అన్నీ విధి చేతిలోనే వున్నాయి. జీవుడు చేసిన కర్మలననుసరించి సుఖదుఃఖాలతో కూడిన జన్మపరంపర కలుగుతుంది. ఆ విధంగా జన్మించిన ప్రతి జీవి మరణించుతాడు. తిరిగి జన్మిస్తాడు. ఇందువలన సత్యమును తెలిసినవారు దుఃఖం నుండి తప్పించుకొంటారు. ఈ ఏడుపు భగవంతుని కొరకు ఏడిస్తే ఉత్తమ లక్షణం అలవడుతుంది. ఈ బంధాలు, అనుబంధాలు సత్యముకాదని తెలుసుకో! పోయిన జన్మలో వీడికి నీకు సంబంధం వున్నదా? ఎవరెవరి గర్భాలలో పుట్టాడో చెప్పగలవా? కాబట్టి దుఃఖించవ"ద్దని చెప్పగా ఆ తల్లి "స్వామీ! మహాత్మా! ఆపదలో ఉన్నవారిని ఆదుకొనేటందుకు దైవం వలె మాకు దర్శనమిచ్చారు. మహాయోగుల దర్శనం వృథా కారాదు. నా జీవితంలో ఎంత సుఖం అనుభవించానో ఇప్పుడంతకంత కష్టాలపాలై అడలుచున్నాను. నేనేదో పూర్వజన్మలో పాపం చేసుకొన్నానేమో! పట్టపురాణినైనా భర్తకు దూరమై బిడ్డతో అడవిలో అలమటించాను. ఈ రాజాశ్రయం

దొరికిందనుకొంటే ఈనాడు నా విధి వక్రించి కొడుకు చనిపోయాడు. నా దుఃఖం పోవాలంటే మీ అనుగ్రహలేశం నాపై ప్రసరింపజేస్తే చాలు! యోగి మహాజనులు నిగ్రహానుగ్రహ సమర్థులని ఎన్నోమారులు విన్నాను. తమరు కరుణించి నా కొడుకును బ్రతికించండి! నా జన్మంతా తమకు ఋణపడివుంటా"నని పాదాలు పట్టి వదలకుండా ప్రార్థిస్తుంటే ఋషభయోగుల వారికి ఆ చనిపోయిన శిశువు యొక్క పూర్వజన్మ వృత్తాంతం మనసులో గోచరించింది.

అ పిల్లవాడు పూర్వజన్మలో అవంతీపురంలో మంచి పండితుడు. అనుష్ఠానపరుడైన బ్రాహ్మణుడు. సగము వయసులో ఆతనికి కర్మవశాత్తుగా ఒక వేశ్యతో పరిచయం ఏర్పడింది. ఇల్లు, పిల్లలు అన్నీ వదిలేసి, ఆమెతోనే నిరంతరం గడుపుచూ, అనేక దుర్వ్యసనాలకు గూడ అలవాటుపడ్డాడు. ఆ విధంగా వుండగా అతని అదృష్ట వశమున ఒకరోజు సాయంవేళ ఋషభయోగి వారి వాకిలిముందుగా పోతూవున్నారు. ఆ భ్రష్ట బ్రాహ్మణుడు, వేశ్య ఆయనను చూచి పరుగునవచ్చి వారి పాదాలకు నమస్కరించారు. ఆయనను ఒక్కసారి లోపలకు రమ్మని బ్రతిమాలి ఆహ్వానించి తీసుకొని వచ్చి ఆసనమిచ్చి అర్చించారు. ఆ మహాత్ముడు అవధూత కావున ఏ పట్టింపులున్నూ లేక వారిచ్చిన ఆతిథ్యమును స్వీకరించారు. ఆ రాత్రంగా వారిరువురు ఆయనకు వీవనతో వీస్తూ పాదసేవలు చేస్తూ గడిపారు. అదే వారు చేసుకొన్న పుణ్యం. వేకువన లేచి అవధూత తన దారిన తాను పోయారు.

తర్వాత ఆ బ్రాహ్మణునికి కాస్త పరివర్తన కలిగింది. ఇంటికిపోయి భార్యా పిల్లలతో యథావిధిగా సంసారం చేసుకొన్నాడు. కాలంతీరిన తర్వాత ఒక్కపూట యోగికి సేవ చేసిన పుణ్యానికి రాజు భార్య కడుపున జన్మించాడు. దుష్కర్మల ప్రాబల్యంతో ఇప్పుడు మరణించాడు. ఇవన్నీ ఆ యోగిరాజుకు తెలియగానే ఆ రాణిపైనను, కించిత్తు సేవచేసిన ఆమె కొడుకుపైనను జాలి కలిగింది. ఘటనా ఘటన సమర్థులుగావున కొంచెం భస్మం అభిమంత్రించి ఆ శవంపైనను, ఆ తల్లి శరీరం పైననూ చల్లినారు. అందరూ చూస్తుండగా చనిపోయిన బాలుడు పునర్జీవితుడైనాడు. అప్పుడా దేశపు రాజు మహాత్ములకు సాధ్యంకానిది లేదు కదా! అని యోగి మహరాజ్ వారి పాదాలకు నమస్కరించి "స్వామీ! ఈమెను, ఈ బిడ్డను కరుణించారు. వారిని వజ్రబాహు మహారాజుకు అప్పగించవలసియున్నది. తమరిక్కడనే మా సేవలు అందుకుంటూ రెండు రోజులుండి మమ్ము, మా రాజ్యాన్ని పావనం చేయండి! మీ వంటి మహాత్ముల సేవ మాకు సులభంగా లభిస్తుందా! నా ప్రార్థన ఆలకించండి! ఎట్టి సందేహములు రాకుండ నేను ఆ రాజుకు

కబురుపంపి తమ సన్నిధిలోనే ఈ మహాసాధ్విని స్వస్థానమునకు చేర్చెదను. అనుజ్ఞఇవ్వం"దని కోరెను.

ఋషభయోగి ఆదేశం తీసుకొని వజ్రబాహురాజునకు సమాచారము పంపెను. ఆ రాజు రథారూఢుడై వచ్చి తన తప్పులు మన్నించమని ఋషభయోగి పాదాలపైబడి వేడుకొనెను. తన భార్య, కొడుకులను బ్రతికించి తన వంశమును కాపాడినందుకు ఈ యోగిరాజుకు వేలవేల ధన్యవాదములు తెలుపుకొని తన రాజ్యమునకు కూడ విచ్చేసి తన ఆతిథ్యమును స్వీకరించవలసినదిగా కోరెను. సుగుణాల ఖనియైన రాణి సుమతీదేవి గూడ స్వామి వారి పాదాలు పట్టి ప్రార్థించెను. తోటిరాజైన పద్మాకరునితో సహా అందరినీ ఆ రాజు తన రాజ్యమునకు తోడ్కొనిపోయి సమాదరించెను. ఋషభయోగి ప్రసాదించిన పుత్రునికి నామకరణ మహోత్సవము చేసెను. యోగి మహరాజ్ వారి సూచన మేరకు అతనికి "భద్రాయువు" అని నామకరణం చేసెను. బ్రహ్మాండమైన ఉత్సవము నగరమంతయు జరిపించెను.

రాజుగారి చిన్నభార్య ఇందుమతికి ఋషభయోగి గారి ఆశీర్వాదంతో చనిపోయిన పిల్లవాడు బ్రతికి నాడని తెలిసినప్పటి నుండి ఆ మహాత్ముని ద్వారా తన కుటిల చర్యలు రాజుగారికి తెలిస్తే తనను ఇలాగే అడవిలో వదిలేస్తారేమోననే భయం పట్టుకొన్నది. అందుకని ఎవ్వరూలేని సమయంచూచి యోగి మహరాజ్‌వారి పాదాలుపట్టుకొని తన తప్పులు మన్నించమని వేడుకొన్నది. తాను ద్వేషంతో చేసిన కుటిల చర్య పాపమని తెలిసిందని చెప్పి తనను కరుణించి పాపరహితురాలను చేయమని కోరింది. అంతా తెలిసిన యోగీశ్వరులు ఆమెతో "అమ్మా! ఎవరు చేసిన కర్మలను వారు అనుభవించక తప్పదు. కర్మబీజం సూక్ష్మాతి సూక్ష్మంగా వుంటుంది మఱ్ఱిచెట్టు విత్తనంవలె. కానీ కర్మఫలం అనుభవానికి వచ్చినప్పుడు పెద్ద మఱ్ఱి వృక్షము ఊడలు పాతుకొన్న విధంగా విస్తారంగా అనుభవమవుతుంది. ఎవ్వరికైనా ఇదే సిద్ధాంతం తల్లీ!

నీవు అనేక జన్మలలో ఈ కర్మ ఫలములను అనుభవించెదవు. ఒకానొక జన్మలో తిరిగి మీ భార్యా భర్తలిరువురూ బ్రాహ్మణ దంపతులై పుడతారు. భర్త నిరాదరణకు నీ సవతిని గురిచేశావు కావున నీవు కొడుకుపై ప్రేమతో భర్తను కోల్పోయి దిక్కులేనిదానవై ఊరూరూ తిరుగుచూ అవస్థలు పడతావు. ఇప్పుడు కలిగిన పశ్చాత్తాప ఫలితంగా నీకప్పుడు సద్గురుని దర్శనం లభిస్తుంది. నీవు ఆయన కరుణను పొంది ఆయన సూచనను నిశ్చల భక్తితో పాటిస్తే ఆపై జన్మలో ఒక సద్గురునికి తల్లివి కాగలవు. ఆ తర్వాత పూర్తిగా పాప ప్రక్షాళనం జరిగి నీవు ముక్తిని పొందగలవు" అని యోగిరాజు వరమిచ్చారు.

అందువలన మనం తెలుసుకోవలసినదేమిటంటే సద్గురు దర్శనం, యోగుల దర్శనములకు, వారికి చేసిన కించిత్తు సేవలకు లభించే ఫలము అద్భుతము, అపారము అని బాబాగానే సెలవిచ్చి, అంబిక పుణ్యకర్మ ఇప్పుడు అర్థమైందా? అని శ్రీ బాబాగారు మమ్మల్ని ప్రశ్నించారు.

ఈ కథా శ్రవణంచేసిన మా అందరికీ ఎంతో ఆనందము కలిగింది. తర్వాత నేను "స్వామీ! సద్గురుని అనుగ్రహం పొంది సకల విద్యాపారంగతుడైన ఆ బ్రాహ్మణ యువకుడు ఆంజనేయ శర్మ తర్వాత శ్రీపాద స్వామి వారిని ఎప్పుడైనా దర్శించాడా? స్వామి వారి యందు చివరి వరకు సంపూర్ణ భక్తితో వున్నాడా? ఆతని తరువాతి జీవిత విధానమును కూడా వినిపించండి స్వామీ!" అని ప్రార్థించగా శ్రీ స్వామి మహరాజ్ వారిట్లు చెప్పసాగిరి.

ఆంజనేయశర్మ ఉత్తమ పండితుడే! అత్యంత ప్రేమాభిమానములతో శ్రీ స్వామివారిని దర్శించుకొనుచుండేవాడు. ఈ సంఘటన తర్వాత శ్రీపాద స్వామి వారి మహిమ, కీర్తి దిగంత విశ్రాంతమైనది. సంఘములో ఆంజనేయ శర్మకు అత్యంత గౌరవనీయమైన స్థానం లభించినది. క్రమంగా విద్వత్ పరిషత్‌లో గొప్ప గుర్తింపు కలిగి ఉన్నతమైన స్థాయికి చేరినది. సద్గురుని అనుగ్రహంతో అతడెంతో కుశాగ్రబుద్ధిగా మారినాడని సామాన్యులందరూ ఆతనిపట్ల గురుభావంతో మెలిగేవారు. అనేకమైన సమస్యల పరిష్కారములకు, గ్రహశాంతులకు, వివాహాది శుభకార్య నిర్వహణలకు ఆహ్వానించి ఘనమైన పారితోషికములు సమర్పించేవారు. పురోహితుడు, సద్బ్రాహ్మణుడు ఏ కార్యము చేయించినా ఇచ్చినది పుచ్చుకోవాలేగాని ఇంత ఇమ్మని కోరరాదు. ఈ నియమాన్ని ఆంజనేయశర్మ తప్పక పాటించేవాడు. అలాగే బ్రాహ్మణసభలకు, వేద సభలకు, యజ్ఞయాగాది క్రతువులకు ఆహ్వానించబడి గొప్ప బహుమతులను పొందుచున్నాడు. ఆ విధంగా అతడు బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు గడించాడు. సకల సంపదలు పొందాడు.

ఒకసారి పట్నంలో గొప్ప యజ్ఞము జరిపించుటకై వేద పండితులందరూ ఆహ్వానింపబడిరి. అత్యంత విధి బద్ధముగా యజ్ఞము నిర్వహించబడెను. వేద పండితుల సమావేశంలో జరిగిన సద్విషయ చర్చలో ఆంజనేయశర్మ మాట్లాడిన తీరును గమనించి, విషయ విశ్లేషణమునకు అందరూ ముగ్ధులైరి. తోటి పండితులందరూ విశేషముగా అభినందించిరి. అందు ఒక అనుభవజ్ఞుడైన ఘనాపాటి ఆంజనేయశర్మను చూచి "నాయనా! నీ తండ్రి నాకు బంధుసముడు. గురుకులమున

నివసించి విద్యాభ్యాసము చేయకున్నను. నీవు గురువనుగ్రహమును పొందితివి. గురుప్రసాదిత సకల విద్యా ప్రపూర్ణుడవైతివి. ఒకానొకప్పుడు నిన్ను బుద్ధి హీనుడని నిందించితిమి. ఆ దిగులుతోనే నీ తండ్రి కాలంచేశాడు. నీవింత పండితుడవగుట నీ పూర్వజన్మ సుకృతమే. సద్గురు కటాక్షమున సప్త విధ బుద్ధులను ఏకకాలమునందు సంగ్రహించగలిగిన అపార బుద్ధిమంతుడవు. నాయనా! నీ జన్మ ధన్యమైనది. గురుసేవ, మాతృసేవ మరువక ఆచరించి యశోవంతుడవై శతాయుష్మంతుడవై వర్థిల్లు"మని ఆశీర్వదించెను.

ఈ విషయమును వినిన మిగిలిన పండితులకు చాలా ఆశ్చర్యము కలిగెను. ఆ ఘనా పాటిగారితో సభలో ఒక పండితుడు లేచి "ఆర్యా! మీ మాటకు అడ్డురావడం కాదుగానీ యదార్థముగా ఇట్లు సకల శాస్త్రములు, వేదములు ఒక జడునికి సంప్రాప్తింపజేయటమన్నది సాధ్యమా! రామాయణ కాలంలోని వశిష్టులవారు గూడ శ్రీరామలక్ష్మణ భరత శతృఘ్నులను గురుకులంలో నిలుపుకొని సకల విద్యలను అభ్యసింపజేసినారు. కానీ ఒక్కసారిగా విద్యావంతులనొనర్చలేదు. వేద వ్యాసముని మొదలగువారు తపస్సాధనచేత సకల విద్యా రహస్యములను సిద్ధింపజేసుకొన్నారు. కానీ ఈ విధంగా విద్యా జాగృతి ఎదుటివ్యక్తిలో కలగటమన్నది ఎక్కడైనా వున్నదా?" అని ప్రశ్నించారు.

దానికి ఆ వృద్ధ పండితుడు "పండిత శ్రేష్ఠులారా! సకల విద్యలకు అధిపతి గణపతియే! ఆ గణపతి మన శరీరంలోని మూలధార క్షేత్రంలో సుస్థిరంగా వున్నాడు. ఈ విషయం యోగ శాస్త్రం చెప్పుచున్నది. పూర్ణయోగియైనవాడు సంకల్పంచేత ఆ మూలధార క్షేత్రాధిపతియైన గణపతియొక్క అనుగ్రహంచేత ఏ విధమైన అద్భుతాలైనా చేయించగలరు. ఇతనికి విద్యా ప్రదాతయైన స్వామి గణపతికి ప్రతిరూపం కావచ్చు. లేక పూర్ణయోగియైన దత్తాత్రేయుని ప్రతిరూపం కావచ్చును. దత్తాత్రేయ స్వామి కార్తవీర్యునకు వేయి చేతుల బలాన్నిచ్చాడని పురాణంలో వున్నది. అంతేకాదు. ఆ దత్త స్వామి అవధూత రూపంలో నిరంతరం సర్వత్రా సంచరిస్తూ గుర్తించే వీలు లేకుండా అదృశ్యమై పోతూ వుంటాడని ప్రసిద్ధి. కానీ ఈ యోగి అందరికీ దర్శనమిస్తూ తిరుగుచూవున్నారు. అదే మహా భాగ్యం" అని వారు వివరిస్తూండగానే ఆంజనేయశర్మ "ఆర్యా! తమరు చెప్పినది సత్యమే! శ్రీపాద స్వామివారు గణేశ చతుర్థి రోజునే జన్మించారు. దత్తాత్రేయ ప్రతిరూపమని ఎందరో కొనియాడినారు. ఆయన నిత్యం సూర్యనమస్కారాలు చేసే చోట సహజ గణపతి గూడ వున్నాడు. ఆయన నదిపైన నడిచేటప్పుడు వారి పాదాల క్రింద ఒక్కొక్క అడుగుకూ ఒక్కొక్క పద్మం ప్రకటమై అదృశ్యమవుతుంది. వారి ఆసనంగా వ్యాఘ్రాజినంగూడ అప్పుడే ప్రకటమై

వారు లేచే సమయానికి అదృశ్యమవుతుండేది. వారు నిజంగా మహిమాన్వితులే!" అనిచెప్పాడు.

అప్పుడా వృద్ధ పండితుడు "సభాసదులారా! దత్తాత్రేయుడంటే భక్తవత్సలుడు. ఎటువంటి దుష్కర్మలనైనా తొలగించగల సమర్ధుడు. పూర్వమొక బ్రాహ్మణుని కుమారునికి ఏడు భూతాలు ఆవేశించి ఏడిపిస్తూ వుంటే ఆయన ఆ బ్రాహ్మణునికి ఏడు మంత్రాల నుపదేశించి వానిని బాగుచేసిన ఇతి వృత్తమొకటి వున్నది" అని ఇట్లు చెప్పసాగెను.

## వేదశర్మకు శ్రీదత్త కృప

పూర్వము విశాలపురము దగ్గరలో ఒక అగ్రహారమునందు వేదశర్మయను ఒక విద్వాంసుడుండేవాడు. ఆతనికొక కుమారుడు కలిగెను. ఆ పిల్లవాడు తొలుత దినదిన ప్రవర్ధమానుడుగా ఎదిగెను. ఉపనయనము చేయ నిశ్చయించు సమయంలో ఆ పిల్లవాని కర్మవశాత్తుగా అతనిని ఏడు బ్రహ్మపిశాచములు ఆవేశించి సఖ్యతలేక ఒకదానితో నొకటి జగడమాడుచు వికృత చేష్టలు చేయించుచుండెను. ఒకటి నవ్వించును. ఒకటి ఏడిపించును. ఒకటి నృత్యము చేయించును. ఒకటి గానము నాలపింపజేయును. ఒకటి మలమును నట్టింట విసర్జింపజేయగా మరొక్కటి ఆమలమునే భక్షించమని ప్రేరేపించును మరొక్కటి పరుగెత్తించును. ఈ విధంగా ఆ పిల్లవానిని ఆడించుచుండగా తల్లిదండ్రులకు దిక్కుతోచక ఎవరో బోధించగా శ్రీదత్తాత్రేయుని ప్రార్ధనలు చేస్తుండేవారు.

ఒకనాడు వారి వాకిట నిలిచి యొక అవధూత భిక్షమడిగెను. వేదశర్మ ఆయనకు భిక్షనిచ్చి భక్తితో ఆయవధూత యుండుతావు తెలియవలెనని వెంబడించెను. దారిలో తన వెంట రావలదని పిచ్చివానివలె నటించుచూ ఆ భిక్షకుడు రాళ్ళతో, మట్టితో కొట్టెను. తిట్టరాని తిట్లు తిట్టెను. కానీ ఆ భిక్షకుని ముఖతేజస్సును బట్టి ఆతడు మహాత్ముడని విశ్వసించిన వేదశర్మ అన్నియు సహించుకొని వెంట నడిచెను. ఆయన చివరికి ఒక కొండ దరికి చేరి కూర్చుండగా వేదశర్మ ఆయన పాదాలు పట్టుకొని "దేవదేవా! నీవు సామాన్య భిక్షకుడవు కావు. నన్ను కష్టాల నుండి కడతేర్చగల దేవుడవే! దత్తుడవే! అని ప్రార్ధించెను. ఆయన నేను పిచ్చివాడిని. నీకేమి ఉపకారం కావాలి చెప్పు. అనగా నా కుమారుని పట్టి పీడించు ఆ దుష్ట గ్రహములను నిర్జింపగల శక్తివంతుడవు నీవు తప్ప ఎవ్వరున్నారు?" అని వేదశర్మ ప్రార్ధించెను.

అప్పుడాయవధూత వేదశర్మను కరుణించి "నీ కొడుకును ఏడు గ్రహములు ఆవేశించి యున్నవి. నీకిప్పుడు ఏడు మంత్రములను ఉపదేశించెదను. వానిని నేను చెప్పిన క్రమంతో నీవు

జపించినచో రోజుకొక్కటి చొప్పున వానిని వదలిపోవును. నీ కుమారుడు నీకు దక్కు"నని చెప్పి వేదశర్మకు ఏడు మంత్రములను ఉపదేశము చేసెను.

వేద శర్మ సద్గురునాధునకు సాష్టాంగ వందన మాచరించి సెలవు తీసుకుని స్వగృహామునకు పోయెను. అవధూత చెప్పిన విధంగా రోజుకొక్క మంత్రమును తీవ్రముగా జపించగా ఒక్కొక్క పిశాచము "నే పోతున్నా, నేపోతున్నా"నని శబ్దం చేయుచూ తొలగిపోయెను. చివరికి ఆ బాలుడు పరిశుద్ధుడుకాగా వేదశర్మ శ్రీదత్తాత్రేయ స్వామి వారికి అనేక విధముల పూజలు సలిపెను. కుమారునికి ఉపనయన కార్యమును జేసి వేద పండితునిగా జేసెను.

శ్రీదత్తాత్రేయుడెక్కడో ఒక్క చోటనే వుంటాడనుకొనుట పొరపాటు. ఆయన అన్ని చోట్ల వుంటారు. ఎక్కడ భక్తులు ఆర్తితో పిలుస్తారో అక్కడ వారిని ఆదుకోవడానికి సిద్ధంగా వుంటారు. కానీ వారి దర్శనాన్ని గుర్తించుట మాత్రము చాలా కష్టసాధ్యము. నిరంతర నామ స్మరణము చేసేవారికి వారి గుర్తింపు కలుగుతుందని దత్త తత్వాన్ని వివరించారు.

ఇవన్నీ విన్న పండితులు అటువంటి అవతార పురుషుని దర్శనం మనందరం తప్పక చేసుకోవాలని కోరినారు. ఆంజనేయశర్మ "శ్రీ స్వామివారి అనుమతిని పొంది తమందరికీ నేను ఆహ్వానం పంపుతానని మాట యిచ్చా"దని శ్రీ బాబాగారు వివరించి "దేవ దేవా! దివ్య ప్రభావా! నీ లీలలు నీవే తెలుపవలెను స్వామీ! అంటూ మేను రోమాంచితము కాగా నమస్కారం చేశారు. అందరం శ్రీపాదులకు జయజయ ధ్వానాలు చేశాము.



# 15వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

## రజకుడు

శ్రీపాద శ్రీవల్లభులు కైలాస సభలో వారి ప్రణాళికను వివరించే సమయంలో కలియుగంలో పోనుపోను ధర్మరక్షణ తాను చేస్తానన్నారు. జ్ఞానబోధయనే శిక్షణ ద్వారా అజ్ఞాన నిర్మూలనం చేస్తానని తెలిపినారు. కులమత సమన్వయం గూడ చెప్పినారు. కులాల నిర్మూలనం చేస్తానని చెప్పలేదు. జ్ఞాన ప్రదానం చేయడానికి కుల–మత భేదం లేదన్నారు. ఈ జన్మలో ఒక కులంలో పుట్టిన వ్యక్తి మరుజన్మలో అదేకులంలో పుట్టవచ్చు, పుట్టకపోవచ్చు. కావున కులం పేర కుమ్ములాటలు వద్దని ఆనాడే సమన్వయపద్ధతి, సమభావములను ప్రతిపాదించారు. భగవంతుని దృష్టిలో సర్వులు సమానులే! ఆయనకు లేని భేదం మానవులలో వుంటే భగవంతునికి వారసులం కాలేము సరికదా! దూరమై పోతామనే బోధలు శ్రీపాద శ్రీవల్లభుల నుండే ప్రారంభమైనట్లు తెలుస్తున్నవి.

పూజ్యశ్రీ విఠల్‌బాబాగారి సన్నిధికి చేరి నమస్కరించి కూర్చుని అత్యంత ఆసక్తితో "స్వామీ! శ్రీపాద స్వామి వారి లీలా స్రవంతిని కొనసాగించి ఈ దర్బారు ప్రదేశము యొక్క విశేషములను మరికొన్ని వివరించి, మమ్మల్ని కృతార్థులను జేయ"మని ప్రార్థించినాను.

అప్పుడు శ్రీ బాబాజీవారు "దిగంబరా – దిగంబరా – శ్రీపాదవల్లభ దిగంబరా" అని కొంతసేపు మా చేత నామం చెప్పించి ఇలా ప్రార్థించారు. "హే త్రిగుణాతీతా! లీలామానుష రూపధారీ! నీకు నీవై ఈ జగత్తును ఉద్ధరించ సంకల్పించి అవతరించిన దయానిధీ! పురుషోత్తమా! నీ లీలలను నీవే నా నోటపలికించు స్వామీ" అని ప్రార్థించి ఇట్లు చెప్పసాగిరి.

ఇక్కడ దర్బారు ప్రదేశము ఏర్పడినది గోవిందభట్టు వాళ్ళ రాకతోనే. కాని వారు రాకముందు సుమారు ఇరువది రోజుల నుండి నదీతీరంలో బట్టలు ఉతికి శుభ్రం చేసే రజకుడొక్కడు శ్రీస్వామి వారిని ప్రతి రోజు గమనిస్తూ ఉండేవాడు. అతడు ఇక్కడికి కొద్ది దూరంలో వున్న చిట్యాల గ్రామ నివాసి. అతనికి శ్రీస్వామి వారి గురించి ఏమీ తెలియకపోయినా వారి ముఖంలో ప్రస్ఫుటమగుచున్న తేజస్సు వలన ఆయన మహాత్ముడని అతనికి తోచినది. అందుకే శ్రీ స్వామి వారికి దూరంనుండే నమస్కరించుకొని వారిని పలకరించకుండానే తన పనిని తాను (ఊరిలోని

వారి బట్టలు ఉతుకుట) చేసుకుంటూ వుండేవాడు. అతనిలోని భక్తి ప్రపత్తులు శ్రీస్వామివారి దయవలన దినదినాభివృద్ధి చెందినాయి. వైకుంఠ ఏకాదశీ పర్వదినమున గోకర్ణక్షేత్ర వాసులు తదితర భక్తులు రావడము శ్రీ స్వామివారిని దర్శించికొని వారంతా దివ్యానుభూతులు పొందడం, ఇదంతా వారు చెప్పుకొంటుంటే, విని ఎంతో ఆశ్చర్యపోయినాడు. శ్రీస్వామివారు యింత గొప్పవారు కాబట్టే వారిపట్ల తన మనస్సులో భక్తిభావం కలిగిందని సంతసించాడు.

వారి కయినట్టి దర్శనాలు తనకు కూడా లభించితే ఎంత బాగుంటుంది! అనుకొన్నాడు. వారందరూ ఉన్నన్నాళ్ళు వారికి తన చేతనైన సేవను, సహాయమును అందించాడు. ఘనంగా జరుపబడిన దత్త జయంతి ఉత్సవాలలలో అన్ని పనులు చేస్తూ, శ్రీ స్వామి బోధలు వింటూ శ్రీస్వామి వారికి దగ్గరైనాడు. ఆ వారం రోజులు తనలో "శ్రీస్వామి వారికి జీవితాంతం తన చేతనైన సేవ చేసుకొంటే తన జన్మ తరిస్తుం" దనుకున్నాడు. గోవిందభట్టు గారి రాకతో వారితో వచ్చిన యాత్రా బృందం వారికి కలిగిన అనుభూతులు అందర్నీ కదిలించినవి. అందర్ని సన్మార్గంలో నడిపినవి. రవిదాసులో భక్తిభావాన్ని మరింత దృఢపరిచింది. శ్రీపాద స్వామివారు చెప్పిన సత్సంగ వచనాలు గాఢంగా మనసులో నాటుకొన్నవి. గురుసేవా భాగ్యం అనేది అనేక యజ్ఞయాగాలు చేసినా లభించే పుణ్యంకన్న మిన్న అని తెలిసినది.

స్వామివారి దర్బారు ప్రాంగణం పరిశుభ్రము చేయుట, శ్రీ స్వామివారి వెంటనే వుండి, వారి బట్టలు ఉతికి ఆరవేయుట మొదలగు సేవలు తానుగా ఎంచుకొని చేయసాగాడు. ఇట్లా చేస్తూండగానే తనకు స్వామివారి మహత్తును కళ్ళారా చూపించడానికేనేమోనన్నట్లు బ్రాహ్మణ యువకుడు మరియు అతని తల్లి ఆత్మహత్యకు పూనుకొనుట, వారిని తన ద్వారా శ్రీ స్వామి దగ్గరకు రప్పించుకొనుట అను దివ్యలీల జరిగినది. శ్రీ స్వామి ఆ అమాయకునకు క్షణంలో సకల విద్యలు ప్రసాదించారంటే, వారి దివ్యశక్తి ఏమిటో తనకూ కొంత అర్థమైంది. వారికి చావు తప్పించారు శ్రీ స్వామి. జీవించడానికి కావలసిన మార్గమున్నూ చూపించారు. ఆ అంబికామాతకు వచ్చే జన్మకు కావలసిన పూజలు కూడా సూచించారు. గోవిందభట్టు గారి మిత్రబృందం చెప్పినట్లుగా ఈ స్వామి బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపమేనన్న విశ్వాసం వారిలో ఇంకా బాగా దృఢపడింది. దిగంబరా – దిగంబరా నామ స్మరణం విడువకుండా చేస్తూ గురుసేవతోపాటు తన వృత్తిని నిర్వహించుకొనుచు రోజులు గడుపుతున్నాడు రవిదాసు.

శ్రీస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు తగిన సూచనలిచ్చి, శ్రీ స్వామికి ధ్యానభంగం కాకుండా చూచేవాడు, జాగ్రత్తగా సేవించుకొనేవాడు.

## శ్రీ పాదుల దర్బారు

శ్రీ స్వామి వారు ప్రతిరోజు దర్బారుకు వచ్చేవారు. అచ్చట చేరిన భక్తుల సమస్యలను, మొరలను ఆలకించేవారు. (ఆ దర్బారు ప్రదేశమే నేటి శ్రీ క్షేత్ర శ్రీ వల్లభాపురం). వారికి అనునయ వాక్యాలు పలికి సమస్యలకు పరిష్కార మార్గాలు తెలిపేవారు. వారి వారి దుష్కర్మ నిర్మూలనకు, కోరికలు తీరడానికి, ఎక్కువగా అచ్చటికి వచ్చే భక్తులకు అన్నదానము చేయుటయే అన్ని కార్యములను సిద్ధింప చేయునని బోధించేవారు. కొన్ని సమస్యలకు యుక్తియుక్తముగా సమాధానపరచేవారు. శ్రీ స్వామివారి దర్శనంతోనే కొన్ని ఆధివ్యాధులు నిర్మూలింపబడేవి. ఇవన్నీ రవిదాసు సమక్షంలోనే జరిగేవి. కావున రవిదాసు కొత్తగా వచ్చిన భక్తులకు పాతభక్తుల అనుభవాలను బాగుగా గుర్తుపెట్టుకొని చెప్పేవాడు. వారిలో విశ్వాసాన్ని, భక్తిని మరింత పాదుకొలిపేవాడు. రవిదాసుకు గూడ స్వామి బోధలలోని జ్ఞానసారం కొద్దికొద్దిగా అవగతం కాసాగింది. శ్రీస్వామివారి దర్శనానికి సుదూర ప్రాంతాలవారు వస్తూండేవారు. అందులో ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు, జ్ఞానులు, పండితులు ఎన్నో రకాల వారు ఉండేవారు. వారి వారి స్థాయిలకు తగినట్లు శ్రీ స్వామి బోధించు విషయాలు నిదానంగా మనసులో నిలిచి రవిదాసులో మంచి మంచి విషయముల మననం నిరంతరము జరుగుచుండేది. కొద్ది రోజులలోనే అతని మాట, నడవడికలో మార్పు వచ్చింది. శ్రీపాదస్వామి వారు సంకల్పిస్తే ఈ ప్రపంచంలో కానిపనే లేదని, ఆంజనేయశర్మ ఉదంతాన్ని అందరికి చెప్పేవాడు. స్వామి మధ్యాహ్న వేళకు కురువపురం వెళ్ళేవారు. అప్పుడు రవిదాసు వారు వెళ్ళిన దిక్కుకు నమస్కరించుకొని, తన పనిని తాను చేసుకునేవాడు. నామస్మరణ మాత్రం ఏ మారక చేసేవాడు.

రవిదాసుకు మంచి జ్ఞాపకశక్తి ఉండేది.. అందుచేత స్వామి దర్శనానికి వచ్చిన వారందరినీ చక్కగా గుర్తించి, ప్రేమతో, గౌరవంతో పకలరించేవాడు. వారు కూడ అతనిని శ్రీ స్వామివారి సేవకునిగా గుర్తించి గౌరవించేవారు. క్రమంగా ఆధ్యాత్మిక విషయాల యందు మక్కువ ఏర్పడింది. ఆలోచనా శక్తి పెరిగింది. అందుకే అంటారు భగవత్కృపతో పొందలేనిదేదీ లేదని.

**"మూకం కరోతి వాచాలం - పంగుం లంఘయతే గిరిం**
**యత్కృపాతమహం వందే - పరమానంద మాధవం."**

మూగవాడు వక్తవుతాడు. కుంటివాడు కొండలెక్కుతాడు భగవంతుని కృప వుంటే అన్నట్లుగా రవిదాసులో తెలివి పెరిగింది.

**రవిదాసుపై కృపావృష్టి :** రవిదాసు చేయుచున్న సేవలను, అతని నిర్మల భక్తి ప్రపత్తులను శ్రీపాదస్వామివారు గమనించుచునే యున్నారు. రజకుని సేవకు మెచ్చుకొని శ్రీ స్వామి వారొకనాడు, "ఒరేయ్! నీవు రాజువై రాజ్యమేలుతావురా!" అని దీవించారు. అందులకాతడు "స్వామీ! నాకటువంటి కోరికేమి లేదు ప్రభూ! తమ పాదసేవకన్న రాజ్య భోగములు ఆనందదాయకములు కావు కదా! అయినా మీ వాక్కులు వృధా పోవని నేను గ్రహించుకొన్నాను, స్వామీ ! తమరే ఈశ్వరులు, సత్యసంకల్పులు" అంటూ సాష్టాంగ నమస్కారం చేశాడు.

**రవిదాసు వేడికోలు :** ఒకనాడు యథావిధిగా శ్రీపాద స్వామివారు తమ నిత్యకృత్యములను నిర్వర్తించుకొని దర్బారు ప్రదేశమునకు చేరగానే, శ్రీస్వామి వారికై ఎదురు చూచుచున్న రవిదాసు స్వామి వారిని సమీపించినాడు. ఆ రోజు ఇంకా ఏ భక్తులు దర్బారుకు రాలేదు. అందువలన శ్రీ స్వామివారు ప్రశాంతంగా కూర్చుండగానే, వాడు ఎప్పటి నుండో తన మనస్సులో వేధించుచున్న ప్రశ్నను శ్రీ స్వామి వారి ముందుంచాడు. "ఓ! దేవాదిదేవా! సద్గురుమూర్తి! అనేక రోజుల నుండి మీ వద్దకు వచ్చే భక్తులను చూచాక నాకు కలిగిన సందేహమిది. ఎందరో భక్తులు ఇది కావాలి, అది కావాలి, కష్టాలను, దోషాలను తీర్చమని కోరుతారు. ఎవరూ సద్గతి కావాలని కోరరు. చూస్తుంటే ఇదంతా మాయలాగ వున్నది.

ఓ సద్గురుమూర్తీ! మీరు సాక్షాత్ పరమ గురువులు. సకల లోకాలకు ఆచార్యులు. సర్వజగత్తు మీ ఆదీనంలో ఉండును. తండ్రీ! మీరు దయతో ఈ జీవులందరికీ సద్గతి కల్గించలేరా? ఎందుకు ఈ మాయా వినోదం. తండ్రీ! ప్రేమ స్వరూపా! దయతో ఈ జీవులందరికి ముక్తి కోరే బుద్ధిని ప్రసాదించాలని ప్రార్థించుచున్నాను.

రవిదాసు చేసిన వేడికోలుకు శ్రీ స్వామి వారికి నవ్వు వచ్చింది. ఆనందము కలిగినది. ఇతడు ఉత్తమ భావాలతో, జ్ఞానమార్గంలో దినదినాభివృద్ధి చెందుట ఎంతయో యోగ్యమనిపించింది. శ్రీ పాదులిట్లనిరి. "ఓయీ! నీవు ఎంతయో యోచించి చక్కని ప్రశ్న వేసినావు. సన్మార్గంనందు పురోగమించు వారికి ఇటువంటి విశ్వకల్యాణ భావనలు కలుగుట ఎంతయో శ్రేయస్కరము. పూర్వము శ్రీ కృష్ణునితో అతని మిత్రుడు, శిష్యుడు అయిన ఉద్ధవుడు ఇదే ప్రశ్న వేసినాడు. ఆ కథ నీకు యిప్పుడు వినిపిస్తాను విను!"

ఒకరోజు కృష్ణపరమాత్మను చేరి ఉద్ధవుడు "ఓ! దేవాదిదేవా! దీన దయాళా! సర్వతంత్ర స్వతంత్ర పారీణా! ఓ కృష్ణా! ఈ ప్రపంచంలో జీవులు జన్మించినది మొదలు మరణము వరకు

పడు అవస్థలకు, కష్టాలకు అంతే కనిపించుట లేదు. ప్రతి ప్రాణికి నిత్యం ఆకలికి ఆహారము తినుట తప్పని సరైయున్నది. అందుకై ఆహారము సంపాదించుట మొదలిడును. అదీ ఒక్కసారి తినిన సరిపోదు. మరల మరల దినమునకు రెండు మూడు సార్లు తినవలెను. వారి వారి స్తోమత ప్రకారము సామాన్య భోజనమో, రాజభోజనమో చేయుచున్నారు. దీనికై ఎక్కువ సమయము వ్యయమై పోవుచున్నది. భగవధ్యానమునకు, జపతపములకు సమయము లభించుట లేదు. అట్లు కష్టపడి సంపాదించనివాడు బిక్ష చేసుకొనియైన పొట్ట నింపుకొనవలసి యుంటుంది. అట్లు చేయునప్పుడు అనేకులచేత చీత్కారములు, నిందలు, అవమానములు భరించవలసి యుండును. ఇదీ మానవుల స్థితి. కానీ ఇతర జీవులు ఎట్లో ఆహార సముపార్జన చేసుకొనుచున్నవి. వీటికి కూడ ఆహారము సరిగా దొరకక పోయినప్పుడు అవి ఇతర జంతువులను చంపి తినుట వంటి క్రూరమైన కర్మలు చేయుచున్నవి. ఈ జీవుల పరిస్థితిని చూచి నామనసు అల్లకల్లోలమగుచున్నది. లోకోద్ధారకుడవైన నీతో సమకాలికులమైయున్న ఈ సమయంలోనైనా ఈ జీవులన్నింటినీ నీతో పాటుగ నీ నిజధామమునకు చేర్చుకొనరాదా! ఓ సచ్చిదానంద మూర్తీ! నీ చిద్విలాసమును మేము గ్రహించ లేకున్నాము. దయాసాగరా! తోటి జీవుల కష్టాలు నా మనస్సును కలచి వేస్తున్నవి. నీవులేశ మాత్రమైనా కరుణా దృష్టి ప్రసరింపజేసి మమ్మందరినీ ఉద్ధరించలేవా!" అని ప్రశ్నించాడు.

అప్పుడు కృష్ణ పరమాత్మ చిద్విలాసముగా నవ్వుచు ఇట్లనెను. "ఓ! మిత్రమా! ఉద్ధవా! నాకెంత దయ వున్నను ఏమి ప్రయోజనము. ఈ జీవులకు ఈ కష్టాలు, కన్నీళ్ళు, సుఖము, దుఃఖము, సంతోషము, బాధ అన్ని మిళితమైన ఈ ప్రాపంచిక వ్యవహారములే మిక్కిలి యిష్టము. వారికి ఈ జీవితమే రుచికరము. నీకు తెలియదా! ఎవరి రుచులు ఏమిటో! అని బదులు చెప్పగా ఉద్ధవుడు, "స్వామీ! నీవు చిన్నతనములో కొంటె పనులు చేసినావు. కొంటె మాటలు మాట్లాడినావు. కాని ఇప్పుడిట్లు మాట్లాడుట తగునా! నా ప్రార్థన విని దయచూపు కృష్ణా!" అంటూ మళ్లీ మొర పెట్టినాడు. కృష్ణ పరమాత్మ "ఏమి! ఉద్ధవా! నా మాటలయందు నీకు నమ్మకము లేదా? సరే! నీవే పరీక్షించి విషయమును తెలుసుకొని సరియైన నిర్ణయము చేయుము. నేను చెప్పినట్లు పోయి ఒక జీవిని విచారించి రమ్ము. ఆ జీవి వైకుంఠదామమునకు వచ్చుటకు సిద్ధముగా నున్నచో నీ మాట చెల్లించెదను. లేకున్న నీవు నా మాట నమ్ముదువు గాక!" అని దూరముగా పోవుచున్న సూకరము (పంది) నొక దానిని చూపించి, "ఉద్ధవా! ఆ పంది ఎంతో విచిత్ర జీవి గదా! దానిని ఉద్ధరించ గలమేమో? ప్రయత్నించు! అది వైకుంఠమునకు రావడానికి ఇష్టపడునేమో? విచారించి రమ్ము!" అని పంపెను.

ఉద్ధవుడా పంది వద్దకు పోయి "ఓ! సూకరమా! నీకు సమ్మతమైనచో పరమాత్మ నీకు తన సాయుజ్యము నిచ్చుటకు సిద్ధముగా ఉన్నాడు. "ఇదిగో! చూడు! వైకుంఠము అనగా సాక్షాత్ భగవానుని సన్నిధి. ఆ స్వామిని విడువకుండ కొలుచు కోవచ్చును. అచ్చట ఆనందమే కాని, దుఃఖానికి తావేలేదు. చెప్పు! నీకిష్టమేనా!" అని ప్రశ్నించాడు. సూకరము (పంది) ఉద్ధవుడ్ని అనుమానముగా చూచినది. దానికి లోలోపల పరమ కోపము, అసహ్యము కలిగాయి. ఉద్ధవునితో యిలా అన్నది. "ఏమయ్యా! నా కష్టాలేమైనా నీతో చెప్పుకొన్నానా? అసలు నాకు కష్టాలు ఏమున్నాయి. నీవే నన్ను ఎక్కడికో తీసుకొనిపోయి, కష్టాలలో పడవేసేందుకే ఇటువంటి మాటలు చెప్పి నన్ను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నావు. అయినా, ఎక్కడైతే నాకేమి గాని, నీవు ఏదో చోటు చెప్పావే, ఆ చోట ఇప్పుడు నేను తింటున్న, ఇంత రుచికరమైన మలము దొరుకుతుందా? ముందు నాకు దీనికి సమాధానం చెప్పు!" అన్నది. ఆ మాటలు వినంగానే ఉద్ధవునికి మతి పోయింది. "ఓ! సూకరమా! అచ్చట ఈ పాపిష్టి ఆహారమెందుకు? అమృతపానం చేస్తే ఒక్కసారి, ఆ పైన ఆకలి, దప్పికలే వుండవు" అని చెప్పాడు. అప్పుడా సూకరమిలాగన్నది. "పో! పోవయ్యా! నీ పరమాత్మ వద్దు, ఆయన సన్నిధానమూ వద్దు. అమృతమూ వద్దు, నాకిష్టమైన ఆహారం ఈ మలమే! ఇంత రుచికరమైన పదార్థము దొరకని చోటునకు నేనెట్లు రాగలను? నా గురించి నీవేమి శ్రమ పడవద్దు. పో!" అన్నది. చేయునది లేక ఉద్ధవుడు కృష్ణుని వద్దకు వచ్చి "నీవు చెప్పినదే సత్యం స్వామీ! ఈ జీవులకు నీ పరమధామము యొక్క రుచి యేమాత్రం తెలియదు. ఆ ప్రాపంచిక విషయాలలో చిక్కి విలవిల లాడుటయే వాటికి మహదానందముగా తోచుచున్నది. ఓ! లీలా మానుష రూపా! నీకు తెలియని విషయమున్నదా! నాకే ఒకింత సేపు మాయక్రమ్మినది. దానిని దూరం చేసి కనువిప్పు కలిగించావు. జగన్నాటక సూత్రదారీ! నీ లీలలెన్న నా తరమా!" అని స్తుతించి తన దారిన తాను పోయినాడు, అని ఈ కథను వివరించి, శ్రీపాద స్వామి, "రవిదాసూ! నీకు కలిగిన ఆలోచనము మంచిదే! కానీ ఈ జీవుల అభిరుచులు, కోరికల ప్రకారమే, భగవంతుడు వారి వారి కర్మాను సారముగా సుఖములు, దుఃఖములు మారి మారి వచ్చేటట్లు జీవిత చక్రాన్ని అమర్చి, వీరిని పుట్టిస్తాడు. ప్రతి జీవి పూర్వ కర్మలను అనుభవిస్తూ కొత్త కర్మలను చేస్తూ జీవితాన్ని సాగిస్తాడు. ఎవరి కర్మలు పూర్తిగా రహితం అయి పోతాయో, ఆ జీవుడు మోక్షానికి అర్హుడవుతాడు.

అవి రహితమవ్వాలంటే పూర్వకర్మలను వివేక వైరాగ్యాలతో అనుభవిస్తూ ఈ జన్మలో చేసిన కర్మల ఫలత్యాగము చేసి "నిష్కామ కర్మయోగము"నభ్యసించాలి. అప్పుడే అనుభవించాల్సిన

కర్మలుండవు. క్రమంగా జన్మరాహిత్యము, దైవ సాయుజ్యము లభిస్తుంది. తెలిసిందా! రవిదాసూ! తోటివారి హితము కోరుటయు, దయ గలిగి ప్రవర్తించుటయు, సర్వులు ఆనందంగా, శాంతిగా ఉండాలని కోరుటయు ఉత్తమ లక్షణము. నాయనా! నీవు ఎల్లప్పుడు ఇటువంటి సద్భావముతో వుండుము. భగవంతుని సంపూర్ణ కృప నీకు కలుగుతుంది" అని దీవించినారు. రవిదాసు సాష్టాంగ నమస్కారము చేసి, శ్రీ స్వామి వారి ఆదేశానుసారం ప్రవర్తించినాడు. ఆర్తులు, దీనులు, శ్రీస్వామి వారి దర్శనానికి వచ్చినప్పుడు వారికి అనునయ వాక్యాలు చెప్పుట, వారికి ధైర్యము చెప్పుట, ఆంజనేయశర్మ పొందిన జ్ఞాన విషయం చెప్పుట, స్వామి వారి లీలలు, మహిమలు వివరించుట, వారిని ఓదార్చుటలో తన జీవితాన్ని ధన్యము చేసుకొన్నాడు అని శ్రీ విఠల్‌బాబాజీ చెప్పి మరియు ఇట్లు కొనసాగించారు.

ఉత్తర కర్ణాటకలోని కార్వార్ ప్రాంతంలో ఒక దైవజ్ఞ బ్రాహ్మణ కుటుంబం వుండేది. వారి కుమార్తెకు ఒక విధమైన భయంకర గ్రహబాధ వుండేది. ఆ బాధానివారణకు గాను వారు చేయని ప్రయత్నం లేదు. చివరి ప్రయత్నంగా ఆమెను తీసుకొని గోకర్ణం చేరారు. ఆ సందర్భంలో వారు గోకర్ణమందున్న కలవగా ఆయన "చూడండి! సామాన్యమైన భూత, ప్రేత, పిశాచ బాధలకు, దోషములకు ఇచ్చట జరిపించు నారాయణ బలులు వంటి శాంతుల వలన పరిహారము లభించి నివారణ కల్గుతుంది. కానీ మీ కుమార్తె విషయం వేరు. ఆమెను ఆవహించినది బ్రహ్మారాక్షసి. అతి శక్తివంతమైనది. ఆమెను కర్నాటకలోని రాయచూరు వద్దగల కృష్ణానది మధ్యనున్న కురువపుర ద్వీపమునందుండే యతీశ్వరులు మాత్రమే బాగుచేయ గలరు. ఇతరులవలన సాధ్యంగాదు. మీరు సమయము వృధాచేయక వీలయినంత త్వరగా ఈమెను అచ్చటికి తీసుకొని పోవలసినది" అని సూచించాడు. ఆ మాటలను విని వారు "స్వామీ – ఆ ప్రదేశమునకు పోవుమార్గమును చెప్పవలసిన"దని ప్రార్థించారు. గోవిందభట్ గారు మరల వారితో "మీరు గుర్రపు బండ్లలో రాయచూరు చేరుకొని, అచ్చటనున్న గ్రామస్థుల సహాయముతో కురువపురము చేరుకొనండి! శ్రీ స్వామివారు ఉదయం అనుష్ఠానము కొరకు నది ఉత్తర తీరమునకు పోయి, మధ్యాహ్న భిక్ష అయిన తరువాత కురువపురమునకు వచ్చెదరు. అందుచేత మీరు మధ్యాహ్నము తరువాత అచ్చటికి చేరుకొంటే మంచిది" అని సెలవిచ్చాడు.

శ్రీ గోవింద భట్‌గారి సలహా మేరకు వారు శ్రీపాదస్వామివారిని దర్శించుటకు తగిన సన్నాహములు చేసుకొని అప్పటికప్పుడే కురువపుర ప్రయాణమునకు సిద్ధమయ్యారు.

గ్రహపీడితురాలైన ఆ బాలికను పట్టుకుని తీసుకొని వెళ్ళుటకు వాళ్ళకు సాధ్యము కాలేదు. తాళ్ళతో కట్టి గుర్రపు బండిలో వేసుకొని, ఇద్దరు ముగ్గురు బలిష్ఠులైన వారు ఆమెను పట్టుకొని ప్రయాణం సాగించారు. సుమారు 15 రోజుల ప్రయాణము తరువాత వారు రాయచూరు చేరినారు. అచ్చట విచారించగా ఆత్కూరు పోయి అట్నుండి కృష్ణానదిని దాటి కురువపురమును చేరవలెనని తెల్సుకొని కృష్ణానదీ తీరమును చేరినారు. ఆత్కూరు గ్రామ ప్రజల సహాయ సహకారములతో నది మధ్యలోగల ద్వీపమును చేరుకొన్నారు. వారంతా ఆ ప్రదేశమును ప్రవేశించిన వెంటనే ఆమెను ఆవహించిన బ్రహ్మరాక్షసుడు ఆమెను విడిచిపెట్టినాడు. ఆమె మామూలు మనిషివలె మాట్లాడడం ప్రారంభించినది. ఆ కుటుంబము వారికి ఈ మార్పువలన శ్రీ స్వామివారి ప్రభావంతో అచ్చటకు ప్రవేశించిన వెంటనే ఆ పిల్ల కుండే బాధ తగ్గి మామూలు మనిషి అయిందని తెలిసింది. ఈ ప్రదేశమునకే ఇంతటి శక్తియున్నయెడల మరి ఇచ్చటగల యతీశ్వరులు ఎంతటి శక్తిమంతులోకదా! అని తమలో తాము చర్చించుకుంటూ నదిలో స్నానాదికములను పూర్తి చేసుకొనినారు. తాము తెచ్చుకొనిన ఆహారమును భుజించి శ్రీ స్వామివారి రాకకై ఎదురు చూచుచున్నారు.

అదే సమయానికి దక్షిణ కర్ణాటక బ్రాహ్మణుడు శంకరభట్ అనే అతను అనేక పుణ్యక్షేత్రములను దర్శించుచు ఆయా దేవతల ఆదేశానుసారం కురువపురమును చేరినాడు.

ఆజానుబాహుడు, సుందర సుకుమారుడు, కాషాయవల్కలధారి, రుద్రాక్షలు ధరించిన జటాధారి అయినటువంటి శ్రీపాద శ్రీవల్లభులు ఆ ప్రదేశమందు ప్రత్యక్షమయ్యారు. ఆయన వచ్చిన వెంటనే అందరూ గౌరవ సూచకంగా లేచి నిల్చుని నమస్కారము చేసారు. వారందరిని కూర్చోమన్నట్లు సైగచేసి శ్రీపాదులవారు వటవృక్ష ఛాయలో సుఖాసీనులైనారు. శ్రీపాదస్వామి వచ్చిన వారి నుద్దేశించి "ఏ ఊరు నుండి వచ్చు చున్నారు? మీరెవరు? ఏమి కావలయును మీకు?" అని చిరునవ్వుతో ప్రశ్నించారు.

ఆ కుటుంబ పెద్ద లేచి నిలబడి మరొక్కసారి నమస్కరించి చేతులు జోడించి "స్వామీ! మేము చెప్పుకోలేనటువంటి భయంకరమైన బాధలో వున్నాము. మా అమ్మాయికి కొన్ని సంవత్సరాలుగా ఒక దుష్ట గ్రహ బాధ ప్రారంభమైనది. ఆమె బాధపడుటయేగాక మమ్ములను ఎంతో బాధ పెట్టినది. ఎన్నో తీర్థాలు, క్షేత్రాలు తిరుగుచూ చివరకు గోకర్ణయాత్ర చేయగా అచ్చటగల "గోవిందభట్" అనే శాస్త్రిగారు మీ గురించి చెప్పి మమ్ములను ఈ ప్రదేశమునకు పంపారు! అది ఏమి విచిత్రమో ఏమో!గాని అంతటి భయంకరమైన బాధ చేతితో తీసివేసినట్లుగా ఇచ్చట

కాలుపెట్టగానే మాయమైనది. మీరు సాక్షాత్ పరమేశ్వరులే! మా కుమార్తెకు దాపురించిన ఆ బ్రహ్మరాక్షస బాధనుండి ఈ పిల్లకు శాశ్వతముగా నివారణ కల్గించండి" అని ప్రార్థించాడు.

శ్రీపాదస్వామివారు తమ కుడిచేతిని పైకి ఎత్తి "ఇకపై ఈమెను బాధించరాదు.. ఫో!" అని అన్నారు.

ఆమెను ఆవహించిన బ్రహ్మరాక్షసుడు శ్రీ స్వామివారితో – "స్వామీ! ధన్యుడ్ని! ఇంతకాలమునకు నా నిరీక్షణ ఫలించినది. అలనాడు విష్ణుదత్తుల వారి గృహము ముందున్న వృక్షముపై నేను నాతోటి బ్రహ్మ రాక్షసుడు కలిసి వుండేవారము. శ్రీ విష్ణుదత్తుడు పెట్టు వైశ్వదేవ భక్షణ విషయములో మా ఇద్దరి మధ్య ఘర్షణ పెరిగి నేను దూరముగా పోయితిని. ఆ వైశ్వదేవమును భుజించి పరివర్తనము చెందిన తోటివాడు మీ అనుగ్రహము వలన శాశ్వత బ్రహ్మలోక ప్రాప్తిని పొందిన విషయము వినియుంటిని. నేను కూడ తర్వాత తమ దర్శనము కొరకు అనేక విధములుగా ప్రయత్నించి విఫలుడనైతిని. చివరకు విష్ణుదత్తులవారిని ప్రార్థించగా "కాలాంతరమున శ్రీదత్తాత్రేయులవారు భూమిపై మానవ రూపములో అవతరించెదరు. ఆ సమయంలో అర్హులైన వారందరకూ ఆయనను దర్శించుకొను భాగ్యము కలుగును. నీవు పశ్చాత్తాపము పొందినావు గనుక నీకు వారి దర్శనము లభించగలదు. వారు శరణాగతవత్సలులు. వారి అనుగ్రహముతో నీకు ఉద్ధారణ జరుగగల"దని వారు సూచన చేసినారు.

ఆనాటి నుండి తమ కొరకు ఎంతో ప్రార్థన చేస్తూ నిరీక్షిస్తున్నాను. ఒకప్పుడు మీ దర్శనం లభించకుంటే నాగతి ఏమిటని నిరాశా, నిస్పృహలకు గురియై విలపిస్తుంటే ఏదో వాణి తప్పక తమ దర్శనం లభిస్తుందని వినవచ్చినది. తిరిగి ధైర్య ఉత్సాహములతో మీ కొరకు నేను అన్వేషిస్తూ ఉన్నాను.

వైరభక్తి, వక్రబుద్ధి మా సాంప్రదాయం కదా స్వామీ! అందుకే తమ దృష్టిలో పడదానికని పిఠాపురంలోను కొన్ని ఆగడాలు చేశాను. తాంత్రిక వేషంతో కొన్ని చెడ్డ పనులు చేశాను. అయినా తమరు దర్శనమియ్యక దూరం నుండియే తరిమివేసినారు. తర్వాత ఈ బాలిక నావహించి, హింసించి ఎట్టకేలకు తమ సన్నిధికి చేరుకోగలిగాను. తమరు కరుణించి తప్పక నాకీ బ్రహ్మరాక్షసత్వము నుండి విముక్తిని ప్రసాదించండి స్వామీ! శరణం! శరణం!" అంటూ వేడుకొన్నాడు. అప్పుడు శ్రీస్వామివారిలా బోధించారు.

"ఎవరైనా సత్కార్యం చేస్తుంటే ఆటంకములు కల్పిస్తే దోషం. అటువంటి మహా దోషం వలన ప్రస్తుతం నీకు శాశ్వతంగా బ్రహ్మరాక్షసత్వము నుండి విముక్తి లభించదు. తాత్కాలికంగా

నీకు తీరని ఆకలి శమించు లాగుననూ, తపన తీరులాగుననూ అనుగ్రహించెదను. తద్వారా నీకు ఉపశాంతి కలుగుతుంది. ఇక మీదట శాకాహారివై జీవించు. ఇతరులకు బాధ కలిగించకుండా కొన్ని సంవత్సరాలు గాణ్గాపురంలో నిరీక్షించు. తిరిగి నేను ముందు జన్మలో నరసింహ సరస్వతిగా అవతరిస్తాను. నేను లోక కల్యాణకార్యంలో భాగంగా గాణగాపురం చేరినప్పుడు నా దర్శనంతోనే నీకు జ్ఞానం కలిగి గుర్తించగలవు. అప్పటికి నీ కర్మ పరిపక్వమై శాశ్వతంగా ఈ బ్రహ్మరాక్షసత్వము నుండి విముక్తి లభించి ఉత్తమ మానవ జన్మకు అర్హతను పొందుతావు" అని పలుకగానే ఆ బ్రహ్మరాక్షసుడు "ధన్యుడ్ని స్వామీ!" అన్నాడు. శ్రీ స్వామి "నీకు భవిష్య జన్మలలో గురుభక్తి కల్గి ఈ కురువ పురమందు నన్ను సేవిస్తావు" అని వరమిచ్చారు.

వీరంతా వచ్చిన సందర్భంలో శ్రీపాద స్వామివారు ఈ విధంగా బ్రహ్మరాక్షసునికి ఊరక అతడు పశ్చాత్తాపపడినందుకే ఇంతంత వరాలు ఇచ్చినారు. మరి బుద్ధి పూర్వకంగా గురుసేవ చేస్తే ఇంకెంత గొప్ప స్థితి కలుగుతుందో వాడికి ఆపై జన్మలో అని అందరూ అనుకొంటూ వారి వారి మనసులలోనే శ్రీ పాదుల వారికి నమస్సులర్పించారు.

శ్రీపాద స్వామి వారి దృష్టి అచ్చట కూర్చున్న ఒక వ్యక్తిపై ప్రసరించగా "ఏమయ్యా! శంకర భట్టూ! ప్రయాణం సుఖంగా సాగిందా! తిన్నగానే కురువపురం చేరుకొన్నావుగా!" అని ప్రశ్నించారు.

వెంటనే అందరి దృష్టి అతనిపై పడింది. అతడు లేచి నిలబడి "దేవాదిదేవా! దివ్య ప్రభావా! నీకు సర్వము తెలియును. నీ కృపాకటాక్షములే నన్నిక్కడికి నడిపించినవి. స్వామీ! ఎన్నెన్నో జన్మలలో చేసుకొన్న పాపాలన్నీ దారిపొడవునా అనేకమైన కర్మానుభవముల ద్వారా తొలగించుచూ మధ్య మధ్యన నీయొక్క అద్భుత లీలలను తిరుమలదాసాది భక్తుల ద్వారా నాకు వినిపింపజేయుచు నన్ను నీ సన్నిధానమునకు రప్పించుకొంటివి. తొలుత గురువాయూరులో శ్రీపాద శ్రీవల్లభుని దర్శించమని ఆదేశించితివి. తదుపరి జగజ్జనని వాసవి కన్యకా పరమేశ్వరీ దేవితో కురువపురము చేరమని ఆజ్ఞ యిప్పించితివి. ఎక్కడి కన్యాకుమారి క్షేత్రము. ఎక్కడి కురువపురము. శ్రీపాదా! నీపాదాలే శరణమని నమ్మి నడిచేవాడికి ముందు – వెనుకల నీవే వుండి సహాయము చేసెదవు. నీ నామస్మరణముతోనే ఎవరో ఒకరు తారసపడి దారి చూపగా నీవే సర్వత్రా నిండియున్నావని నమ్మి చివరకు నీపాద సన్నిధికి చేరితిని. ఇంకను పాప పంకిలం ఏదైనా వుంటే ఓ సద్గురుమూర్తీ! నీవు వేయదలచిన శిక్షలను ఇక్కడే విధించు. కానీ ఇంక నన్ను

నీకు దూరం చేయవద్దు స్వామీ!" అంటూ ఆ బ్రాహ్మణుడు ప్రార్థన చేస్తూవుంటే అందరూ కిమ్మనకుండా వింటున్నారు.

శ్రీపాద స్వామి వారు మాత్రం చిద్విలాసంగా చిరునవ్వులు చిందిస్తూ ప్రసన్నమైన చూపులను అతనిపై ప్రసరింపజేస్తూ వున్నారు. అతడు పడిన కష్టాలు, వేదన అంతా ఆ స్వామి చూపులతోనే తొలగించేశారు. అతనికి సమాధానంగా "శాంతి! శాంతి! ఓ బ్రాహ్మణోత్తమా! ఈ కురువపురము ఒక దివ్య క్షేత్రము. ఇచ్చట కాలుపెట్టినవారి పాపాలు భస్మం కాగలవు. ఇచ్చటచేసిన పుణ్యము కోటిరెట్లు ఫలమునిచ్చును. అట్లే ఇచ్చట చేయు పాపముగానీ, పాపపు తలంపుగానీ కోటి రెట్లు ఫలమునిచ్చును. ఇది మరచిపోవద్దు. ఈ క్షేత్రము అత్యంత పుణ్యభూమి. మహాత్ముల తపోభూమి. వారు చేసిన తపఃఫలమున పాపాత్ములకు పరిహారము లభించును. కానీ అపరాధములిక్కడ జరిగినచో మహాత్ముల దృష్టికి గోచరమవుతుంది. అందుచేత ఇక్కడ నివసించదలంచినచో తగు జాగ్రత్తతో జీవితమును నడుపుకొనవలె"నని శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారు సూచనాత్మకమైన బోధలను చేశారు.

శంకరభట్టు శ్రీస్వామివారి సేవలో తన జీవితం గడపాలని దృఢమైన నిర్ణయం చేసుకొన్నాడు. తర్వాత శ్రీపాదస్వామివారు అతనికి భూత, భవిష్యత్, వర్తమానములలో జరుగులీలలెన్నో ధ్యానంలో చూపించి అవన్నీ గ్రంథముగా రచించవలసినదిగా ఆజ్ఞాపించారు. ఆ మహాభక్తుని మూలంగానే శ్రీపాదులవారు జన్మించి నప్పటి నుండి చేసిన లీలలు, తరువాత వారి అవతార రహస్యములు అన్నీ సంస్కృతంలో గ్రంథస్థం చేయబడినవి. తర్వాత శ్రీపాదుల వారి మేనమామల యింట నిక్షిప్తం చేయబడి తెలుగులోనికి అనువదించబడినది. శ్రీపాదుల వారి సంకల్పానుసారంగా బాపనార్యుల (శ్రీ పాదులవారి తాతగారు) ముప్పది మూడవతరం వాడైన శ్రీమాన్ మల్లాది గోవింద దీక్షితుల వారి ద్వారా ఆది జన బాహుళ్యానికి అందించబడి శ్రీపాద స్వామివారి కృపాకటాక్షానికి పాత్రులగుటకు తోడ్పడుచున్నది.

శ్రీ స్వామివారు అతని భక్తి భావాలు చూచి అత్యంత ప్రసన్నులైనారు. మహాత్ములు సాధుపురుషులెప్పుడైనా ధన ధాన్యాలకు గాని, మణిభూషణాలకు గాని సంతోషించరు. సద్గుణ సంపత్తి ఎవరి యందుండునో వారియందు ప్రసన్నులగుదురు. భగవంతునికీ నిజమైన జ్ఞానికీ భేదము వుండదు. పంచదేవ పహాడ్‌లో "మాల దాసరయ్య సీతయ్య" అనువాడు పరమ భక్తుడు. అతడు భారత కథలు, భాగవత పద్యాలు పెద్దలతో చెప్పించుకొని కంఠస్థం చేసుకొని నిరంతరం

భగవంతుని ధ్యానంలో వుంటుంటాడు. మాల వారికి పెళ్ళిళ్ళు చేయించుతాడు. ధనుర్మాసంలో తెల్లవారుఝూమున నగర సంకీర్తన చేయుట తన విధిగా భావిస్తాడు. బహు కుటుంబీకుడు. అతడు శ్రీపాద స్వామిని దర్శించి అద్భుత దర్శనాన్ని పొంది పరవశిస్తాడు.

శ్రీ బాబావారు శ్రీపాదస్వామి వారి లీలలను ఈ విధంగా మనోదృష్టితో దర్శించి బోధించుతూ వున్నారు. అమృతఝరి వంటి వారి కథా విధానము మమ్ములను చిత్తరువులను చేసినది. విన్నారుగా శ్రీ పాదుల వారి మహత్తును, అర్థమైనదా? వారి గురించి తెలుసుకోవాలంటే ఒక్కటే మార్గము. నామస్మరణం నిరంతరం చేయాలి. ఈ ప్రదేశంలో ఏ కొద్ది సేవ చేసినా అది బ్రహ్మాండమైన ఫలితములనిస్తుంది.

శ్రీపాద శ్రీవల్లభుల సేవలో ప్రతిఫలాపేక్ష లేకుండా సేవ చేసే రజకుడిని శ్రీపాదులవారి అనుగ్రహం ఎంతవానిగా చేసిందో తెలుసుకొందాము.

రాజాధిరాజు యోగిరాజైన శ్రీపాదుల కృపాదృష్టితో అతడు ఎనలేని జ్ఞానాన్ని, సంపదను పొందాడు. వినండి. తర్వాతి జన్మలో అతడు రాజుగా పుట్టాడు.

ఒకనాడు రవిదాసు యథావిధిగా తన నిత్యకార్యక్రమమైన శ్రీ స్వామి వారి సేవలను పూర్తి చేసుకొన్నాడు. తదుపరి సభా స్థలమునంతయు శుభ్రము చేయుచుండగా నదీతీరంలో దిగువ ప్రదేశములో ఒక ఆకర్షణీయమైన దృశ్యము గోచరమైంది. తన పనిని త్వరత్వరగా ముగించి కృష్ణానది వద్దకు పోయి ఆ చిత్ర విషయమేమిటా? అని పూర్తిగా విచారించాడు. ఒక మహమ్మదీయరాజు (నవాబు) తన స్త్రీ జనంతో, పరివారంతోను వచ్చి అక్కడ గుడారాలు వేసుకొని విడిది చేశాడు. వారి మందీ మార్బలాన్ని చూచి రాజరికమంటే ఏమిటో ఎఱుగని రవిదాసుకు ఎనలేని ఆశ్చర్యము కలిగింది. ఏనుగులు, గుర్రాలు, సైనికులు, బాజాలు, భజంత్రీలు వెంటరాగా ఆ రాజు ఇక్కడ విహారానికై వచ్చినాడని భటుల ద్వారా తెలుసుకొన్నాడు. ఆ నవాబు తన స్త్రీ పరిజనం వీవనలు వీస్తుండగా బోటు నెక్కి నదిలో విహరిస్తున్న దృశ్యం రవిదాసు కంటబడగానే ఆతని మనసులో శ్రీపాద స్వామివారు తన కొసగిన దీవెన తళుక్కున మెఱిసింది. ఆహా! మహారాజ వైభవం అంటే ఇలాగే వుంటుంది కాబోలు! ఇంతటి భాగ్యాన్ని, సంతోషాన్ని పొందడానికి ఈ రాజు ఎటువంటి గురువును సేవించాడో! ఏ దేవునికి మ్రొక్కినాడో! ఎంతో పుణ్యాత్ముడైతేనే యింత వైభవం పొందడం సాధ్యం! అనుకొన్నాడు. అయినా స్వామి వారు తనకిచ్చిన దీవెన సఫలమైతే రాజరికం వస్తుంది. అది యిలాంటి వైభవం అవునో! కాదో! ఇలాంటి ఆలోచనలతోనే తిరిగి

గురు సన్నిధికి చేరుకొన్నాడు.

తర్వాత స్వామి వారికి సేవచేస్తూ వుండగా కూడ ఆతని మనసులో అవే ఆలోచనలు మెదలగా శ్రీపాదస్వామివారు వెంటనే వాని ఆలోచనలు గ్రహించి ఏమిరా! నీకు రాజవైభవం ఇప్పుడే కావాలా? నీ యభీష్టమును నిస్సంకోచంగా చెప్పు! ఈ క్షణంలోనే నిన్ను రాజును చేస్తాను!" అన్నారు. రజకుడు ఆశ్చర్యం, సిగ్గు, భయం, ఖంగారు మొదలైన భావాలు ఒక్కసారిగా ముంచెత్తగా "స్వామీ! నా వయస్సుడిగిపోయిన ఈ సమయంలో రాజునై ఏమి ప్రయోజనము! నేనేమి వైభవాన్ని అనుభవించగలను. మీ సేవలోనే సుఖం వుంది. అయినా మీరు సమర్థులేనని నాకు తెలుసు. నాయందు దయయుంచి వచ్చే జన్మలో రాజునయ్యేలాగున ఆశీర్వదించండి! అట్లయితే తనివితీరా రాజ్యభోగాలు అనుభవించగలుగుతాను అని ప్రార్థించాడు.

శ్రీపాద స్వామి నవ్వుచూ "సరే! నీ కోరిక ప్రకారమే వచ్చే జన్మలో నీవు యవన రాజువై వైఢూర్య నగరంలో (బీదరు) రాజ్యమేలుతా"వని దీవించారు. అది విని రజకుడు స్వామీ! తమరు నన్ను యవన రాజుగా పుట్టమన్నారు. నాకు హిందూ గురువులపట్ల, హిందూ మతం పట్ల ద్వేషం ఉండకుండా చూడండి! నాకు మీచరణ సేవను దూరం చేసేటట్లైతే ఆ రాజ్య పదవి, గీజ్యపదవీ ఏదీ వద్దు! స్వామీ!" అంటూ ప్రార్థించగా శ్రీ స్వామి నవ్వి "తప్పకుండా నా దర్శనం నీకు కలుగుతుంది. అప్పుడు నేను నరసింహ సరస్వతి అనే పేరుతో దర్శనమిస్తా"నని ఆశీర్వదించారు. ఈ సంఘటనతోనే అతనికి వరముగా రాజ్యభోగములున్నూ, మరుజన్మములో గూడ గురు సన్నిధియూ లభించినది. శ్రీస్వామి తన దర్శనాన్ని మరుజన్మమందు గాణుగాపురంలో అతనికి ప్రసాదించారు. ఈ విషయం శ్రీ స్వామి ఉండగానే అందరికీ ప్రచారం జరిగింది. అతనికి రాజ్యభోగాల వరమునిచ్చినది ఈ భాస్కర బండవున్న ప్రదేశమే! అదియే నేటి శ్రీక్షేత్ర శ్రీవల్లభాపురం. రవిదాసు యథావిధిగా గురుసేవలు చేసుకొంటూ వున్నాడు.

శ్రీ బాబాగారు ఈ విధంగా శ్రీపాదులవారి కృపా విశేషాన్ని రజకుని అదృష్టాన్ని కొనియాడగా నేను ఆత్రుతతో "గురుదేవా! రజకునికి రాజ్య ప్రదానము విషయం శ్రీగురుచరిత్ర ద్వారా తెలుసు కొన్నాము. కానీ ఈ ఒక్క జన్మలో అతడు చేసిన సేవకే స్వామి ఆ విధంగా రాజ్య సంపదలు ప్రసాదించినారా! లేక పూర్వజన్మలలో గూడ అతడు గురుభక్తి చేసినాడా? ఈ సందేహం నాకెప్పటి నుండియో గలదు. దయచేసి ఈ విషయం మాకు వివరంగా తెల్పండి స్వామీ!" అని ప్రార్థించాను.

శ్రీ విఠల్‌బాబాజీవారు చిరునవ్వులు నవ్వుచూ గడ్డు ప్రశ్నయే వేశావు. కానీ ఆ శ్రీపాదుడే దీనికి సమాధానంగా సత్యవచనములను పలికించునుగాక! అని క్షణం ధ్యానమగ్నులై

తలపంకించుచూ ఏదో దర్శించారు. తర్వాత ఇలా ప్రార్థించారు. హే! పరంథామా! పరాత్పరా! త్రిమూర్తి స్వరూపా! నీ లీలలు అమోఘములు. తృణమును మేరువుగాను, మేరువును తృణము గాను చేయగల సమర్థ సద్గురో! నీవు పలికించినదే పలికెద. వేరొండు పలుక నా వశమా!" అని ప్రార్థన చేసి ఇట్లు చెప్పినారు.

ధార్మికులారా! తల్లులారా! ఎక్కడి రజకుడు! రామాయణకాలంలో శ్రీరాముడు వెట్టివాడనీ, పది నెలలు పరాయివాడి చెఱలోనున్న భార్యను తెచ్చుకొని సంసారం చేస్తున్నాడనీ విమర్శించగా శ్రీరాముడు సీతమ్మను త్యజించి అడవులకు పంపుటకు కారణమైనవాడే ఈ రజకుడు. సీతాదేవి భూమాత ఒడిలోకి పోయిన తదుపరి సకల జనులు తనను నిందించగా ఆతడు పశ్చాత్తాపపడి శ్రీరామునితో తన తప్పు మన్నించమని వేడుకొన్నాడు. తన మూలంగా భార్యాభర్తలు విడిపోయినారు. పిల్లలకు పితృ ప్రేమ కరువైనది. చివరకు తండ్రి లభించగా తల్లి ప్రేమ కరువైనది. అన్ని విధాలా తాను పాపం చేసినానని తెలిసి తన పాపం ఎలా పోగొట్టుకోవాలో తెలియక తనకు ఏ శిక్షనైనా విధించమని శ్రీరాముని కోరగా ఆయన ఒప్పుకోలేదు. మరి నాకు పాప నిర్మూలనకు మార్గమేమిటి? అని ఏడ్చినాడు.


ఆతని బాధను చూచి శ్రీరాముడు అతనికి ప్రేమతో ఇట్లు చెప్పెను. "ఓయీ! జరిగినదేదో జరిగినది. ముందు ముందు ఎన్నో జన్మలలో కష్టనష్టాల ననుభవించి ఒకానొక కలియుగంలో అప్రయత్నంగా సద్గురు సేవాభాగ్యం లభిస్తుంది. సకలపాప ప్రక్షాళనమునకు గురుసేవయే ఉపాయం. ఆ గురుసేవతో నీ పాపం పూర్తిగా తొలగి పుణ్యం కలిగి తరువాతి జన్మలో గురుని కరుణతో నీవుగూడ రాజ్యభోగాల ననుభవించుతావు.

అప్పుడు గూడ భక్తిమార్గం విడువకుండా ఎట్టి పాపాలు చేయకుండా మెలిగితే ఆ జన్మలో గూడ శ్రీ గురుని దర్శనం లభిస్తుంది. ఆయనకు సేవచేసే భాగ్యం కలుగుతుంది అని దీవించారు.

అతడు ఆ విధంగా భగవదనుగ్రహము పొందియున్నందుననే శ్రీపాద స్వామివారి యందు ప్రగాఢ విశ్వాసములు పాదుకొన్నవి. అనేక జన్మలలో చుట్టుకొన్న కర్మలన్నీ వదిలించుకొన్నాడు. దీని రహస్యాన్ని త్వరగా జనులు గ్రహించలేరు. అతడు అందరి బట్టలకు పట్టిన మురికిని వదిలించు తాడనుకొంటారుకానీ తద్వారా తన పూర్వ కర్మలనే మైలను వదిలించుకొనుచున్నాడని ఎవరికీ తెలియదు. అట్లు వదిలించుకొంటూ గురుసేవ ద్వారా పరిశుద్ధుడై సత్సంగం ద్వారా పుణ్యాన్ని గడించుకొన్నాడు. జ్ఞాన విషయాలను ఆకళింపు చేసుకొని ఇతరులకు చెప్పగలిగినాడు. ఆ విధంగా గురు కృపకు పాత్రుడైనాడు. జన్మ జన్మాంతర కల్మషం కడుక్కుపోయింది. శ్రీ స్వామి వారి నోటిమీదగా

ఉత్తర జన్మలో నీవు యవనరాజుగా పుడతావు. రాజ్యమేలుతావని వరమియ్యగా వెంటనే బుద్ధిని ఉపయోగించి స్వామీ! తమరియందు భక్తి గూడ కావాలని ప్రార్థించి ఆ జన్మలో గూడ గురుదర్శనం అగుననే వరం పొందాడు. ఆహా! ఏమి అదృష్టం అతనిది. ఆ తర్వాత శ్రీ నరసింహ సరస్వతిస్వామి గురుదర్శనంతోనే అతనికి పూర్వజన్మ స్మృతి కలిగింది. శ్రీ గురుని పూర్వజన్మ శ్రీపాదస్వామియని అతని ద్వారానే ఆ రహస్యం బయటపడింది. చివరకు రాజ్యం వదలి శ్రీగురుని ఆజ్ఞానుసారం శ్రీశైలం చేరుకొన్నాడు. శ్రీగురుని మహాప్రస్థానం అనంతరం శ్రీశైలం నుండి శ్రీక్షేత్ర కురువపురం చేరుకొని తనకు ఇంతటి అనుగ్రహాన్ని ప్రసాదించిన శ్రీపాద శ్రీవల్లభస్వామి వారు తపస్సు చేసిన బండను అతిపవిత్రమైనదిగా అందరికీ తెలియజెప్పాడు. గురుదేవుని పేరనొక మందిరం కట్టించి ఆ బండ రాయినే (శిలనే) అచ్చట గురు రూపంగా ప్రతిష్ఠ చేయించాడు. దానికి నిత్య నైవేద్యములు ధూపదీపముల కొరకు కొంత భూమిని ఏర్పాటుచేసి పూజకై పూజారులను నియమించాడు. ఈ విధంగా శ్రీక్షేత్ర కురువపురంలోనే తన శేష జీవితాన్ని గడిపి శరీరాన్ని విడచి ధన్యుడైనాడు. తర్వాత జన్మలో మహల్సాపతిగా శ్రీ సాయిబాబాను కొలిచాడు. మరొక్క విశేషం ఏమిటంటే కాశీలోవలెనూ, పండరీపురంలోవలెనూ, శ్రీక్షేత్ర శ్రీకురువపురంలోను, శ్రీక్షేత్ర శ్రీవల్లభాపురంలోనూ ఎవరు శరీరం విడుస్తారో వారికి ఉత్తమగతులు, సద్గతులు, మోక్షము కలుగును. ఇది సత్యము" అని పరవశులై శ్రీ బాబాగారు వివరించారు.

ఈ విషయాలన్నీ వింటూ మేమందరమూ గూడ ఏదో లోకంలో విహరిస్తున్నట్లు కొంచెంసేపు తన్మయులై యుండిపోయాము. తదుపరి శ్రీబాబాగారిలా చెప్పినారు. "ఎచ్చట తీర్థము, దైవము, మహాత్ముల తపోశక్తి మిళితమైయుండునో అచ్చట సమస్త జీవులకున్నూ సద్గతి లభించునని పురాణ వాక్యమున్నది. ఇదే ఈ స్థల మహత్తు" అని బోధించగా ఆనందముతో మాకు గొంతు గద్గదమైనది. అందరం శ్రీపాద శ్రీవల్లభస్వామికి జయము జయము అని పలికాము.



# 16వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

శ్రీరామచంద్రుని పాదధూళి సోకి శిల ఒక స్త్రీమూర్తిగా మారినదన్న విషయం ఆనాడు చూచినవారు, అనుభవించినవారు చెప్పగా విన్నవారికి ఏమీ ఆశ్చర్యం కలగలేదు. ఇది సంభవమా? సాధ్యమా! అంటూ ఎవ్వరూ యోచించలేదు. సరికదా శ్రీరామునితో గుహుడు ఓ! రాజకుమారా! నీ పాద ధూళికి గొప్ప మహిమకలదంట! నేను విన్నాను. ఆ విధంగా నా పడవ గనుక స్త్రీయైనదనుకో నాకు జీవికపోతుందయ్యా! అని ఆ వంకతో ఆ రాముని పాదాలు కడిగే భాగ్యం కల్పించుకొన్నాడు. భగవంతునికి మహిమ వుండడం సహజం. దానిని శంకించడం అవివేకం. ఆ రోజులలో రాక్షసులకు మాయలు చేయుట తెలుసనీ, యోగులకు మంత్రాలు చేయడం తెలుసుననీ మామూలు ప్రజలకందరికీ తెలిసిన విషయమే. అందుకని వారు నమ్ముతారేగాని సందేహించరు. అది త్రేతాయుగం.

ఇప్పుడీ కలియుగంలో గూడ వస్తువులను సృష్టించి ఇవ్వగల యోగులు, సిద్ధులు గలరని అందరికీ తెలుసు. ఎవరికి వారికి అటువంటి శక్తి తమకు గూడ వుంటే బాగుండుననే కోరికలు గూడ వుంటాయి. కానీ కష్టపడి గురువును అన్వేషించి, ఆశ్రయించి, సేవించి, మెప్పించి, ఉపదేశం పొంది సాధించుకోవడంలో మాత్రం ఇష్టం వుండదు. అందువల్ల అలాంటి విద్యలన్నీ బూటకాలని ప్రచారం చేస్తూ తమ గౌరవాన్ని పెంచుకోజూస్తారు. మహాత్ములైన వారు ఈ గొడవలన్నీ మనకెందుకు? సకల మహిమలు భగవంతునివేనని చెప్పి భక్తి చేసుకోండి! చాలునని ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారు.

శ్రీపాద వల్లభులు ఏడువందల సంవత్సరాల క్రిందటి యోగి. అప్పుడున్నూ కలి ప్రభావంచేత సందేహించినారు. అంటే ఆశ్చర్యంగా వుంటుందని సత్సంగంలో మేమంతా మాట్లాడుకొను చుండగానే పూజ్యశ్రీ విఠల్ బాబాజీవారు వచ్చి ఆసీనులైనారు. అందరం లేచి నమస్కారములు చేసుకొన్నాము. మమ్ము ఆశీర్వదించి "సత్సంగంలో చర్చ ఏమి? టని ప్రశ్నించినారు. క్రిందటి దినం చెప్పుకొన్న ఆంజనేయశర్మపట్ల శ్రీపాదవల్లభుల దివ్యశక్తి ప్రసారం గురించేనని విన్నవించాను. తర్వాత ఆ పండితులందరూ ఈ మహాత్ముని దర్శించడానికి వచ్చినారా? వారి సందేహాలు తీర్చు

కొన్నారా ఆ వివరాలేమైనా మీ ముఖతః వినాలని కోరుచున్నాము బాబాగారండీ! దయతో మాకు ఆదర్శనాన్ని తెల్పండని ప్రార్థనా పూర్వకంగా అడిగాను.

అప్పుడు శ్రీ బాబాగారిలా ప్రార్థన చేశారు. "అనంతా! అనఘాప్రియా! దేవ దేవేశా! లీలావతారా! పాహిమాం పాహిపాహి!" అని కన్నులు తెరచియే దర్శిస్తూ వున్నారు. వారి ముఖంలో ఆనందం తాండవిస్తున్నది. వారు ఆ దృశ్యాన్ని పూర్తిగా దర్శించిన తర్వాత "హే! ప్రభో! నీ లీలలు వర్ణించలేక వేదాలే అవాక్కయినాయి. నేనెంత స్వామీ! నీ కృపాలేశంవలన మాత్రమే నీ లీలలు ప్రచారంలోనికి రాగల్గినవి" అని పలికి ఆ స్వామి వైభవం ఆనాడే ఎంతో గొప్పగా విలసిల్లినది. అప్పటి ప్రజలు అమాయకులు. పూర్ణభక్తి ప్రపత్తులు కలిగిన వారు, స్వార్థము, ద్వేషము లేనివారు.

పట్నంలో పండితులందరూ ఆంజనేయశర్మతో చర్చించి ఒక నిర్ణయం తీసుకొన్నారు. ఎలాగైనా శ్రీ స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు. తర్వాత ఆంజనేయశర్మ యొక్క సలహా మేరకు దగ్గరలో రాబోవు దత్తజయంతి పర్వదినానికి అత్యంత వైభవంగా శ్రీపాద స్వామి వారికి గురుపూజ జరిపించాలని అందరూ ఆ సమయానికి దర్బారు ప్రదేశానికి చేరుకోవాలని నిశ్చయం జరిగి ఆహ్వానం లభించింది. ఆంజనేయశర్మ గతంలో గోవిందభట్టు వారి మిత్రులున్నూ చేసిన పూజవలెనే తర్వాత నుండి ప్రతి సంవత్సరం శ్రీరామాచారితోపాటు చేస్తూ యున్నాడు గదా! మార్గశిర శుద్ధ చతుర్దశి నాటికే అందరినీ రమ్మని ఆహ్వానించాడు. గ్రామ పెద్దయైన రామాచారి గారికి మరి ఇతర పెద్ద మనుషులకు, తల్లికి, భార్యకు ఈ విషయం చెప్పాడు.

ఆ పర్వదినంనాడు జరగవలసిన కార్యక్రమములను, ఆ రోజునకు అన్నదానమునకు కావలసిన ఏర్పాట్లన్నీ రామాచారితో కలిసి నిర్వహించేటందుకు ఆంజనేయశర్మ సంకల్పించాడు. రజకుడైన రవి దాసుకు జ్ఞాపకశక్తి మెండు. ప్రతి సంవత్సరంకన్నా ఘనంగా పండుగ చేయాలన్నాడు. ఆ స్వామి వారికి మ్రొక్కి అందరం ముందుగానే అనుమతి పొందాలని సలహా చెప్పాడు. ఏకాదశిరోజున ఆంజనేయ శర్మ కుటుంబ సమేతంగా శ్రీ స్వామివారి దర్శనానికి వచ్చాడు. శ్రీపాదస్వామివారు రావడం గమనించి తాను ఎదురేగి దర్బారు ప్రదేశానికి తోడ్కొని వచ్చి యథాప్రకారం ఆసీనులను చేశాడు. ప్రవర చెప్పుకొని సాష్టాంగ నమస్కారం చేస్తుంటే ఆతని భార్య కూడ నమస్కరించినది. తర్వాత ఆతని తల్లి నమస్కరించగా శ్రీ స్వామి వారిని ఆశీర్వదించి "మాతా! ప్రదోషకాల పూజ చక్కగా జరుగుచున్నదా?యని ఆమెను ప్రశ్నించగా ఆమె "స్వామీ! నీఅనుగ్రహంతో అన్నీ బాగా జరుగుచున్నవి. నీవే మా పాలిట కల్పవృక్షము, కామధేనువు. నీ

అండ మాకుండగా కొదువంటూ ఏదీ వుండదు ప్రభూ!" అన్నది. శ్రీపాదస్వామివారు చిరునవ్వులు చిందిస్తూ ఆమె కుమారునివైపు చూచారు. ఆతని మనోభావాలన్నియు వారికి తెలిసినవి. శర్మ చేతులు జోడించి "దేవా! మా పూర్వ పుణ్యము పండినది. కాబట్టి నీ కృపతో శుభముల పరంపరను అనుభవిస్తున్నాము. తమ సన్నిధి నాకు లభించినది ఈ రోజుననే. మార్గశిర శుద్ధ ఏకాదశి. రేపు రాబోవు పున్నమి దత్తజయంతి పర్వదినము. ఈ సంవత్సరం పండితులందరూ తమ పాదపూజ చేసుకొని తరించాలని కోరుచున్నారు. నేను తమరి వద్ద అనుమతిపొంది ఏర్పాట్లు చేయ సంకల్పించినాను. చిన్నవాడిని తెలిసీ తెలియని వాడిని. పట్నంలోని పండితులందరూ తమరిని దర్శించాలని కోరగా ఈ పర్వదినమును పురస్కరించుకొని అందరినీ రమ్మని ఆహ్వానించితిని. నాయందు కృపచేసి తమరు అనుమతిని ప్రసాదించవలె"నని ప్రార్థనా పూర్వకంగా వేడుకొనెను.

శ్రీ స్వామి అతని వినయమునకు లోలోన సంతోషముతో ప్రసన్నత్వమును పొందినారు. ఆమోదముగా తలపంకించుచు పెద్దల సలహాతో చక్కగా నిర్వహించుమని ఆశీర్వదించారు. ఆ విధంగా స్వామి దీవెనపొంది, యింటికిపోయి తన పనిలో తాను నిమగ్నుడైనాడు. అందరు తమ యింటిలోనే పండుగ జరుగునట్లు భావించి సంభారములన్నియు తెప్పించి యుంచినారు. శుద్ధ చతుర్దశినాటికి దర్బారు ప్రదేశమంతయు పచ్చియాకుల పందిరితో మామిడిఆకుల తోరణాలతో అలంకరించబడింది. గోమయంతో నేలంతా అలికిముగ్గులు పెట్టినారు. స్త్రీలు పురుషులు కలిసి ఆ యేర్పాట్లు చేస్తున్నారు. వంటలు చేయుటకు వంటశాల, భోజనములకు ప్రత్యేక పందిళ్ళు వేయించినారు. వేదికనంతటినీ రంగుల రంగుల పూవులతో అలంకరించినారు. దూర దూర ప్రాంతాల నుండి వచ్చిన పండితులకు నివాస వసతులు కల్పించినారు. చతుర్దశి నాటికే అక్కడకు కొంతమందిపండితులు వచ్చి చేరుకొన్నారు. వారు వచ్చి శ్రీస్వామి వారిని దర్శించుకొను సమయానికి శ్రీ స్వామివారు మధ్యాహ్నిక భిక్ష పూర్తి చేసుకొని కురువపురం చేరుకొన్నారు.

శ్రీ స్వామివారు కురువపురం చేరిన మూడు సంవత్సరాలలో ఎందరో భక్తులు వచ్చి దర్శించుకొంటు న్నారని తెలిసినా, పంచదేవపహాడు గ్రామవాసులంతా వారిని దైవంగా కొలుస్తున్నారని తెలిసినా కూడ పసుపల గ్రామ నివాసి వాసుదేవరావు జోషి అను వాడు మాత్రం ఈ విషయాలను పట్టించుకొనలేదు. అతడు ఎంతో ఆచారవంతుడు. జ్యోతిష్య పండితుడు. నిష్ఠాగరిష్ఠుడు. నిత్యము పూజ, ధ్యానములు చేసేవాడు. ఆ ధ్యానంలో ఆయనకు చాలా కాలం నుండి ఒక యోగీశ్వరుని దర్శనం లభిస్తున్నది. జ్యోతిష్య శాస్త్రంలో తనకేదైనా క్లిష్ట మైన సమస్యలు

వస్తే ఆ యోగీశ్వరుడే పరిష్కారం సూచిస్తుండేవారు. "పాపాలు చేసేవారంతా గురువుల దగ్గరకు పోయి వాటిని పోగొట్టుకొనే ప్రయత్నం చేస్తారు. గురువులు మాత్రం నీ కర్మలు తీసేస్తారా! అన్నీ అనుభవిస్తేకానీ పోవు. గ్రహాలు పట్టి పీడిస్తుంటే గ్రహశాంతులు చేసుకోవాలి. గానీ ఊరికే పోమంటే కర్మలు పోతాయా" అని తనకు తెలిసిన విధంగా విమర్శలు చేసేవాడు. తన గురువు తనకున్నాడు. వేరే వాళ్ళతో తనకు పనిలేదన్నట్లు ప్రవర్తించేవాడు.

ఆ వూరి వారు గూడ ఇక్కడ ఉత్సవాలలో పాల్గొంటున్నారని అతనికి కొంత కక్షగా వుండేది. వ్యవసాయమునకు మంచి ముహూర్తములు ఎప్పటివలె సూచించమని వారిని చేరి అడిగే రైతులతో "వ్యవసాయం చేయడం, పంటలు పండించడం ఎందుకు? పోయి ఆ స్వామి దగ్గరే భజనలు చేస్తే భోజనం దొరుకుతుందిగా! పోండి! అని విమర్శలు చేసి వాళ్లపై విరుచుకుపడేవాడు.

చేసేదిలేక వారు వచ్చి శ్రీ స్వామివారినే ప్రార్థించి మంచి సమయం చెప్పమని కోరగా శ్రీపాదస్వామి వారు "నాయనా! మీలో లోక కల్యాణబుద్ధి కలిగితే ప్రతి సమయం మంచిదే! రైతు కష్టం చేస్తాడు. పండిస్తాడు. ఆ పండించిన దానిని ఎందరో తింటారు. ఆతనికి ఇందరికీ ఆహారం పెట్టిన పుణ్యం చేకూరుతుంది. ఎలాగంటే స్వార్థం వదలి పరమార్థభావన చేసినప్పుడు" అని బోధించేవారు. నిజంగానే శ్రీస్వామివారి మాట తీసుకొని వారిని ధ్యానించి అరకలు కట్టి భూమిని దున్నితే పంటలు ఇబ్బడి ముబ్బడిగా పండుటను కన్నులారా చూచి మనసారా శ్రీ స్వామిని అందరూ ధ్యానించడం ప్రారంభించారు.

ఇది వాసుదేవరావు జోషి యొక్క మనస్సుకు ఒక విఘాతము కల్పించినది. ఇక ఆయన వద్దకు జనులు పోవడం మానేశారు. ఆయన ధ్యానమును తీవ్రంగా చేస్తున్నాడు. ఆ ధ్యానంలో అతనికి శ్రీపాద వల్లభుడే దర్శనమిస్తున్నారు. కానీ ఆతనికి భౌతిక దర్శనం కానందువలన గుర్తింపు కలుగలేదు. ఇలాగ కొంతకాలం గడిచింది.

పసుపల వాసుదేవరావు స్నేహితుడు, గొప్ప పండితుడొకాయన ఆంజనేయశర్మచేత ఆహ్వానింపబడి బయల్దేరి వచ్చి సరాసరిన వాసుదేవరావు ఇంటికి చేరినాడు. తలవని తలంపుగా వచ్చిన స్నేహితునికి అతిథి మర్యాదలన్నీ చేసిన తర్వాత అసలైన విషయం తెలిసింది. ఆయన మరుసటిరోజు దత్తజయంతి ఉత్సవం జరుగనున్నదని అందు పాల్గొనుటకై వచ్చినట్లు తెల్పినారు.

వాసుదేవరావు నిర్లక్ష్యంగా "అలాగా! ఏదో కొందరు కొన్ని అద్భుతాలు చేస్తూ గొప్ప పేరు పొందాలని ప్రయత్నిస్తారు. అవన్నీ నాకిష్టం వుండదు" అన్నాడు. ఆతని స్నేహితుడు ఆయన

వాక్యాలను విని ఇలాగన్నారు. "నీవు పొరపాటుపడుతున్నావు. సాక్షాత్తు దత్తావతారుడైన సద్గురువు వచ్చి నీ సమీపాన నివసిస్తూవుంటే నీకు విశ్వాసం కుదరక పోవుట ఆశ్చర్యకరంగా వున్నది. నీవు ఇలా ఒక్కసారి గూడ దర్శించకుండా అవహేళన చేయుట మంచిది కాదు. రేపు నాతో వచ్చి దర్శించుకొని నీ సందేహాలేమైనా వుంటే తీర్చుకొని తర్వాతే నిర్ణయం తీసుకొనుట మంచిద"ని సలహాచెప్పగా వాసుదేవరావు మిన్నకుండెను.

శ్రీ దత్తజయంతిరోజు జరగవలసిన కార్యక్రమము గురించి ఆ రోజు ఆహ్వానితులందరి సమక్షంలో పంచదేవపహాడ్ గ్రామంలో రామాచారిగారి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. శ్రీ స్వామి వారిని సూర్యనమస్కార శిల వద్ద నుండి పండితులందరూ వేద ఘోషతో స్వాగతం చెప్పి ఆహ్వానించి వేదిక వద్దకు తోడ్కొని రావాలని తదుపరి పాదపూజ ఆంజనేయశర్మ దంపతులచే చేయించాలని నిర్ణయించబడింది. ఆ రోజు ప్రొద్దుపోయేదాకా పూలమాలలు కట్టుచూ స్త్రీలు, అనేక ఊహలతో పురుషులు నిద్రపోనేలేదు. తెల్లతెల్లవారుచుండగా ఆంజనేయశర్మ ఆహూతు లందరినీ కృష్ణా నదీ తీరానికి తీసుకొని పోగా అందరూ స్నానానుష్ఠానములు పూర్తి చేసుకొన్నారు. సూర్యోదయ వేళకు అందరూ ఉత్సవంగా శ్రీ స్వామివారు అనుష్ఠానము చేసుకొను ప్రదేశానికి పోయి నిశ్శబ్దంగా నిలిచియున్నారు. ఇంతలో పూజా ద్రవ్యాలు పాత్రలు అన్నీ పందిరి క్రిందకు చేర్చబడినవి.

శ్రీ స్వామివారు నది నుండి పైకి వచ్చుచుండగా పూర్వ దిశయందు సూర్య నారాయణ మూర్తి మంద్ర కిరణాలతో పైకి వచ్చాడు. ఆ కిరణములు శ్రీ స్వామి వారిపై ప్రతిఫలించి సప్తవర్ణములుగా కనిపిస్తునవి. అందరూ ఆ దృశ్యాన్ని చూచి సంతోషంతో ఉప్పొంగిపోయినారు. అందరూ సాష్టాంగ వందనములాచరించినారు. తదుపరి పూర్ణకుంభము చేతబూని బ్రాహ్మణు లందరూ ముక్తకంఠముతో సుస్వరంతో వేదఘోష చేస్తూ ఆసహస్ర శీర్షుని, సహస్రపాదుని సకల లాంఛనములతో శ్రీదత్త స్వామిగా భావించి ఆహ్వానిస్తూ తోడ్కొని వచ్చి ఆసనము స్వీకరించమని సూచన చేయగా దానిపై యథాప్రకారం వ్యాఘ్రాజినము (పులితోలు) ప్రత్యక్ష మైంది. శ్రీ స్వామివారు దానిపై ఆసీనులైనారు. పండితులు పారవశ్యంతో వేద మంత్రాలు చదువుచున్నారు. శ్రీ స్వామివారి ముఖమండలం దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్నది.

**పితాపుర పండితుల ఆగమనం**

అదే సమయంలో విచిత్రంగా పితాపుర వాసులైన వేద పండితుల బృందము తీర్థయాత్రలు

చేయుచు అనేక వేద పండిత సభలలో పాల్గొనుచు, కురువపురంలో శ్రీపాదవల్లభులను మహాత్ములున్నారని తెలుసుకున్నారు. గోకర్ణంలో మార్గం కూడ తెలుసుకొన్నారు. పిఠాపురంలో అప్పలరాజు శర్మ కుమారుని గురించి గుర్తు చేసుకున్నారు. ఆనాడు ఉపనయనం జరిగిన వెంటనే శ్రీపాదుడు వేదములు వల్లించినాడు. వేద పాఠములలోని రహస్యములకు వివరణ యిచ్చినాడు. ఆ విషయములు గుర్తు తెచ్చుకొని సంతోషాంతరంగులైనారు. శ్రీపాద స్వామి బాల్యంలో చేసిన లీలలు, చూపిన మహిమలు గోవింద భట్టుకు తెలిపారు. వారనేక మజిలీలు చేసి ప్రయాణించి పంచదేవ పహాడ్ చేరుకొని శ్రీపాదస్వామి వారిని గురించి విచారించారు. వారి దర్బారులో జరుగుచున్న ఉత్సవం గురించి గ్రామస్థులు చెప్పగా వారి సహాయంతో సభా ప్రాంగణమునకు చేరుకొన్నారు.

పండితులందరినీ శ్రీస్వామి వారు తమ అమృతదృష్టితో వీక్షించి ప్రేమానురాగాలు ఉట్టిపడుచుండగా మృదుమధుర స్వరంతో "పూజ్యులైన పిఠాపుర వాసులారా! అందరూ కుశలమేనా! "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అన్నట్లు మీ దర్శనంతో మాకు జన్మభూమి జ్ఞప్తికి వచ్చింది. **మా జననినీ, జన్మభూమినీ గుర్తుచేసిన పుణ్యాత్ములు మీరు.** ఆసీనులు కండి!" అని వారిని కూర్చుండచేసిరి. వారందరూ యువక యోగియైన శ్రీపాద స్వామికి వందనములొనర్చి కూర్చుండిరి. ఆయన జగద్గురుడైన దత్తాత్రేయుడేనని వారికి చిన్నప్పటి నుండియే తెలియును. ఈ రోజు దత్త జయంతి పర్వము. ఇప్పుడాయన ముఖతః జ్ఞానపూర్ణమైన బోధలు ఏమైనా వినవలెనని కుతూహలంతో వచ్చినారు.

వాసుదేవరావు, స్నేహితుడు కలసి ఏవోవిషయాలు చర్చించుకొంటూ దర్బారు ప్రదేశానికి చేరుసరికి శ్రీ స్వామివారు వేదిక నలంకరించియున్నారు. వాసుదేవరావు అంతదూరం నుండి శ్రీ స్వామిని చూడగానే పరుగు పరుగున వచ్చి శ్రీ స్వామివారి పాదాలపై వాలిపోయినాడు. అష్టసాత్విక భావాలు ఒక్కసారిగా ఆవరింపగా గొంతు గద్గదికమై, కన్నులానంద బాష్పాలుకార, శరీరం కంపించగా కొంతసేపటికి శ్రీ స్వామివారి ఆశ్వాసంతో శాంతిని పొంది "హే దత్తమూర్తీ! శ్రీపాద శ్రీవల్లభా! నేనెంత తెలివితక్కువ వాడిని! నిత్యము నా ధ్యానంలో ఎన్నో సంవత్సరాల నుండి దర్శించే యోగిరాజు నీవేనని తెలుసుకోలేని బుద్ధి హీనుడను. నన్ను మన్నించు స్వామీ! అవ్యాజకరుణామయా! వేలాది మంది నీ అనుగ్రహానికి పాత్రులవుతున్నారని వింటూ వున్నాను. ఎందరికో కోరికలు తీర్చే కల్పవృక్షము నీవేనని విని నిన్ను అవహేళన చేశాను. నా తప్పులన్నీ

క్షమించు. నన్ను రక్షించు!" అంటూ వెక్కివెక్కి ఏడ్చుచుండగా అందరూ విస్తుపోయి చూచుచున్నారు.

ఇంకా ఇలాగన్నాడు. "ఎంత పాండిత్యమున్ననూ, విద్యావంతులైనను సద్గురువులను దర్శించకుండా హుంకరించి విమర్శలు చేయరాదని నా నుండి ఎందరికో గుణపాఠము నేర్చుకొనుటకు నేనే ఉదాహరణమైయున్నాను. భగవంతుడు అపార దయామయుడనుటకు ఇంతకంటె గొప్ప నిదర్శనం ఏమికావాలి!" అని వాపోవుచుండగా శ్రీ స్వామివారు ప్రసన్నవాక్కులతో "వాసుదేవా! కూర్చుండుము. ఇందు నీ దోషమేమీ లేదు. దత్త సంకల్పమునకు మించినది లేదు. అందరము సర్వేశ్వరుని ఇచ్ఛానుసారం నడువవలసిన వారమే. ఇప్పుడు ఆయన ఆజ్ఞ అయినది. మనము కలుసుకొన్నాము" అని అతనికి ఆశ్వాసమిచ్చారు. అంతలో శ్రీ స్వామివారికి పాదపూజ ప్రారంభమయ్యెను.

శ్రీ స్వామివారి ఆజ్ఞ తీసుకొని ఆంజనేయశర్మ శ్రీపాదులవారి దివ్య పాదములను దత్త పాదములుగా భావించి విధి విధానముగా పూజ చేయుటకు ఉపక్రమించినాడు. తోటి పండితులందరూ సుస్వరంగా మంత్ర పఠనం చేస్తున్నారు. శర్మ శ్రీ స్వామివారికి అర్ఘ్య, పాద్యము లిచ్చి నమక చమకములతో పంచామృతములతో పాదముల నభిషేకించెను. తర్వాత శుద్ధ జలాభిషేకము చేసి శ్రీస్వామి వారి పాదములకు తడియొత్తి గంధముతోను, కుంకుమతోను అలంకరించెను. శ్రీ స్వామివారు ధ్యానమగ్నులై సమస్త పూజను స్వీకరించుచుండిరి. పుష్పమాలను శ్రీ స్వామి కంఠముననూ, శిఖకున్నూ అలంకరించెను. పాదములకు పుష్పార్చనచేసి దీప, ధూప నైవేద్యములను సమర్పించెను. తదుపరి ఆ విరాట్పురుషునికి నీరాజన సమర్పణ జేసెను. శ్రీ స్వామి పాదారవిందముల వద్ద వేదోక్త మంత్ర పుష్ప సమర్పణచేసి ఆ ప్రదేశమున నున్న సమస్తమైన వారున్నూ ఎవరికి వారు ఆ పూజ చేస్తున్నట్లున్నూ, వారి ముందు శ్రీ స్వామి ఆసీనులైయున్నట్లున్నూ ఒక అద్భుత దృశ్యము వారికి అనుభవంకాగా అందరూ తన్మయులైరి. పూజ పూర్తియైన పిదప శ్రీపాద శ్రీవల్లభస్వామివారికి జయము జయమని పలికి, శ్రీదత్తాత్రేయ స్వామివారికి జయము జయమని జయ జయ ధ్వానములు చేసిరి.

### ఆంజనేయశర్మకు సందేహ నివృత్తి

ఆ సభలోనే ఆంజనేయ శర్మ శ్రీపాదవల్లభులు ప్రసన్నులైయున్న సమయంలో చేతులు జోడించి ఇట్లు స్తుతించినాడు. "ఓ దివ్య స్వరూపా తండ్రీ! నీవు సర్వకాల సర్వావస్థలయందు మాకు రక్షకుడవు. నీవే సర్వత్ర నిండియున్నావు. ఓ యజ్ఞేశ్వరా! నీవు అద్వితీయుడవు.

మాయాతీతుడవు. మాయా మానుష రూపంలో మానవులను తరింపజేయ అవతరించిన సద్గురుడవు. నీవే బ్రహ్మ, విష్ణు, మహేశ్వర సమిష్టి స్వరూపానివి. సాక్షాత్పర బ్రహ్మవు. యథార్థానికి సకల విశ్వమంతా నీవేగాని అన్యంకాదు. ఓ పరబ్రహ్మ స్వరూపా! నీ చరణ కమల సన్నిధిని చేరి నా జీవితం ధన్యమైంది. నన్ను మీ కరుణా కటాక్షంతో ఒక మనిషిని చేశారు. సంఘంలో నాకొక ఉన్నతమైన స్థానం కల్పించారు. దయానిధీ! మమ్ము ఎల్లవేళలా ఇలాగే కాపాడుతూ వుండండి స్వామీ!" అంటూ నమస్కరించాడు.

శ్రీ స్వామి ప్రసన్నులై దరహాస వదనంతో "నాయనా! ఉత్తమ సంస్కారములు కలిగి వర్ధిల్లు"మని దీవించారు. అప్పుడు స్వామి వారితో అతడు "స్వామీ! మా తండ్రిగారి మిత్రుడు నన్ను ఒక సభలో సప్త విధ బుద్ధులు ఏకకాలంలో సంగ్రహించుకొన్న సద్గురు కృపా పాత్రుడవంటూ శ్లాఘించారు. నాకు చాలా సంతోషం కలిగింది. కానీ సప్త విధ బుద్ధులనగా ఏమిటో నాకేమీ అర్థం కాలేదు. స్వామీ! ఇటువంటి క్లిష్టమైన విషయాలకు వివరణ యిచ్చేటందుకు తమరే సమర్థులని భావించి తమరిని ప్రార్థిస్తున్నాను. సప్త విధ బుద్ధులనగానేమియో తెలిపి మమ్ము కృతార్థులను చేయ ప్రార్థించుచున్నా"ననెను.

**సప్త విధ బుద్ధి వివరణ**

శ్రీ స్వామివారు "వత్సా! ఆపండితుడాడిన మాట సత్యమే! మంచి ప్రశ్నయే వేశావు. బుద్ధి అనగా మానవుని పూర్వకర్మ ననుసరించి పనిచేసేది. మానవుడు కర్మ నుండి విముక్తి పొందడానికి గూడ బుద్ధియే కారణంగా వుంటుంది. నివృత్తి మార్గంలో నడిపించేటందుకుగాను యోచనల నివ్వగల ఏడు రకముల బుద్ధి విభాగములున్నవి. వాని వివరములు ఇట్లున్నవి.

"మానవుని బుద్ధి వికాసముననుసరించి వాని జీవితము సార్థకతను బడయును" అనునది శాస్త్రవాక్యము. ఎవ్వరికైనా జీవితం సార్థకమవ్వాలంటే బుద్ధి వికసించాలి. అది ఎలా సాధ్యపడుతుందో మన పెద్దలు చెప్పియున్నారు. బుద్ధి వికాసమునకు విద్య అన్ని విధములా తోడ్పడుతుంది. కావుననే ప్రతి మానవుడు. విద్యావంతుడు కావాలి అంటూ మహాత్ములు వచించినారు. పెద్దల దృష్టిలో విద్య యనగా జ్ఞానము, అవిద్య యనగా అజ్ఞానము. మన పూర్వ ఋషులు, మహాత్ములు ఆదేశించిన విద్య (జ్ఞానము) అనగా పరిసరాల జ్ఞానమొక్కటే కాదు. పరిపూర్ణ జ్ఞానము. పరిసరాల జ్ఞానంతో మొదలైన మానవ బుద్ధి వికసించి వికసించి ఎన్నో తెలుసుకొని ఎంతో నేర్చుకొని జీవితంలో ఎన్నో సమకూర్చుకొన్నా ఇంకా పొందవలసినది వుంటూనే వుంటుంది.

వ్యక్తి తన బుద్ధి వికాసంతో తాను మాత్రమే సుఖపడాలంటే కుదరదు. మానవుడు సంఘజీవి. కావున తన బుద్ధి వికాసంతో దేనిని ఆవిష్కరించినా, లేక సంపాదించినా దానిని అందరికీ సమానంగా పంచి తృప్తినీ, కీర్తినీ పొందుతాడు. అంతే కాదు. తను పొందిన జ్ఞానాన్ని ఇతరులకు తెలుపవలెను. అందులకు విషయములను గ్రహించుట యందు ఓర్పు, ఇతరులకు తెలుపుటయందు నేర్పు కలిగియుండవలెను.

మానవునికి ప్రతి విషయాన్ని తెలుసుకోవాలనే అభిలాష వుంటుంది. అది బుద్ధిలోని ఒక భాగం మాత్రమే. మానవుని బుద్ధి యనునది సప్త విధములుగా వున్నదని శాస్త్రం చెప్తున్నది. అనగా ఏడు భాగములుగా బుద్ధిని విభజన చేసి చెప్పారు శాస్త్రకారులు. ప్రతి వ్యక్తికినీ బుద్ధి తప్పక వుండును. కానీ అందు కొన్ని భాగములు మాత్రమే వికసించును (పని చేయును) కొన్ని భాగములు వికసించక నిర్జీవముగా (పనిచేయక) వుండును. అందువలన అందరి బుద్ధి ఒకేరంగా వుండదు. అందుకే పెద్దలు "పుట్టకొక బుద్ధి – జిహ్వకొక రుచి" అన్నారు. అనగా నానావిధ బుద్ధులు, నానా రుచులు కలిగి మానవులు ప్రవర్తిస్తారు. బుద్ధుల భేదమువల్ల వ్యక్తులలో మాట కలవక పోవుట, వ్యతిరేక భావాలతో కొట్లాడుట సంభవిస్తుంది.

అందువలన అందరూ గూడ బుద్ధి యొక్క తత్త్వమేది? అది ఎన్ని విధములుగా వున్నది. ఏ బుద్ధి తనకు ఇతరులకు ఉపకారం చేస్తుంది? అనేది తెలుసుకోవాలి. అందులకు సప్తవిధ బుద్ధులను ముందు వివరిస్తాను. దాని తత్త్వము తెలుసుకొంటే దాని పనితనము విశ్లేషించి తెలుసుకొనుటకు వీలగును. అంతేగాక బుద్ధి వికసించును. ఆయా బుద్ధులను తమకు అనుకూలంగా పని చేయించుకొని మానవుడు శక్తిమంతుడు కాగలడని ఆశిస్తూ సప్తవిధ బుద్ధి వివరణను ఈ క్రింది విధముగా ఋషులు తెలిపినారు.

**సప్త విధ బుద్ధులు :** 1) పండ 2) మేథ 3) చార్వి 4) చత్వ 5) గృహీతి 6) శ్రౌతి 7) ప్రతిభ తొలుత ప్రథమ స్థానమునున్న పండను గురించి తెలిపెదను.

**(1) పండ :** "పండ"యనగా బుద్ధి శక్తిలోని ప్రథమ విభాగమునకు సంకేతము. దీనిని సంపూర్ణంగా తెలుసుకొనవలెను. మన చుట్టూ వుండే విషయాలపై మన బుద్ధి ప్రసరిస్తుంది. విషయమును చూచి, విని ఊరకుండక ఆ విషయములోని తత్త్వమును పూర్తిగా తెలిసి కోవాలనే సంకల్పం కలిగి దానిని పూర్తిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే బుద్ధిని పండ అంటారు. విషయమును క్షుణ్ణముగా తెలుసుకొనుట యందు ఆసక్తి, తపన కలిగియుండు బుద్ధి. దీనిని

సంకల్ప బుద్ధి శక్తిగా కూడ వర్ణిస్తారు. జిజ్ఞాస అని అన్నా దీనినే. ఉదాహరణకు ఈ సంకల్పబుద్ధి శిశుప్రాయం నుండియే పనిచేయుట (వికసించుట) ప్రారంభిస్తుంది. ఈ విధమగు బుద్ధి శక్తి వికాసాన్నందు కోవడానికి కుటుంబమందుండు వ్యక్తులు పూర్తిగ సహకరిస్తే అతి చిన్న వయసులోనే ఎన్నో విషయాలను తెలుసుకొని బాగా వికసిస్తుంది. విషయ సేకరణయేగాక దానిని గుర్తు పెట్టుకొంటేనే బుద్ధి మరింత వికాసాన్నందుకొనే అవకాశం ఉంది. ఈ విధమైన విషయాసక్తికి కొలత బద్ధ ఏదీ లేదు. పరిసరాల పరిజ్ఞానంతో మొదలైన విషయ సేకరణ వ్యక్తి జీవితంతోపాటు వికాసాన్ని పొందుతుంది. మనిషి ఎదుగుతున్న కొద్దీ "పండ" ఎదుగుతుంది. బుద్ధిలోని మిగతా భాగములు వికసించేటందుకు ఇది దోహదకారిగ ఉంటుంది. ఇది సంకల్పశక్తికి మారుపేరు. విషయ గ్రహణముకాక వస్తుతత్త్వ గ్రహణమందు జిజ్ఞాస కలిగి యుంటుంది. ఈ విశాల విశ్వమంతా విస్తరించేటంత అవకాశం ఈ బుద్ధి శక్తికి వుంది. సహజంగా భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు, మేఘాలు,వర్షాలు, కొండలు, చెట్లు, నదులు మొదలగు ప్రకృతిని గురించి జిజ్ఞాసతో తెలుసుకొని వానితత్వాన్ని గ్రహించుట వాటివలన సుఖజీవనం పొందుటకు గల సాధనలో ప్రథమ స్థానం పండదైయున్నది.

అనగా విషయమును తెలుసుకొనుటయేగాక దాని తత్త్వమును తెలుసుకోవాలను సంకల్పము, జిజ్ఞాస. తెలిసికొన్న తర్వాత దానిని వినియోగించుకొనుటకై చేయు కృషి ఇవన్నీ బుద్ధి యొక్క చిత్కళలేయని ఇందుమూలంగా తెలుస్తున్నది.

**కొందరిలో పండ స్వార్థభావంతో నిండి బాహ్య విషయ గ్రహణమునందు తప్ప ఆధ్యాత్మిక, పారమార్థిక విషయమునందు విముఖత వహించును. అటువంటి వారు భౌతిక సుఖములకు దాసులై పరమాత్మజ్ఞానమునకు దూరమగుచున్నారు.**

**2) మేథ :** మేథాశక్తి యనునది బుద్ధిలోని రెండవ భాగమునకు పేరు. మేథయను భాగమును గురించి వివరంగా తెలిపెదను. మొదట చెప్పుకొన్న 'పండ' గ్రహించిన జ్ఞానమును, విషయములను యథాతథముగా స్వీకరించి తనయందు జాగ్రత్తగా నిక్షిప్తము చేసుకొను శక్తి మేథ. అనగా జ్ఞాపకశక్తియని గూడ దీనిని వ్యవహరింతురు. కొందరు విన్నది విన్నట్లు గ్రహించి జ్ఞాపకం పెట్టుకొంటారు. ఇది గూడ అతి చిన్న వయస్సు నుండి వికసిస్తుంది. కాని కొందరిలో మేథాశక్తి సరిగా పనిచేయకుంటే జ్ఞాపకశక్తి లోపించినదని అంటుంటారు. మేథ యొక్క సామర్థ్యమును బట్టి వ్యక్తి యొక్క గాని విద్యార్థి యొక్క గాని ముఖవర్చస్సు వుంటుంది. ఒక విషయమును

విన్నంతనే విన్నది విన్నట్లు చెప్పగలవారిని ఏకసంథాగ్రాహి అంటారు. రెండుసార్లు విన్నదాన్ని తిరిగి చెప్పగలిగిన వారిని ద్విసంథాగ్రాహి అంటారు. ఎన్నిసార్లు చదివినా బుర్రకెక్కక తికమకపడే వారిలో మేథాశక్తి వికసించలేదని తెలియాలి. ఈ మేథ అను బుద్ధి శక్తియొక్క సామర్థ్యముపూర్ణ వికాసమునందుకొన్నచో ఆ వ్యక్తిని "మేథావి" అంటారు. మేథాశక్తి ఎవరెవరిలో ఎంతెంత పనిచేస్తుందో అంతే బుద్ధి ఆయా వ్యక్తులకు జీవితంలో ఉపయోగపడుతుంది. మేథాశక్తి కూడ వయసుతోపాటు వృద్ధిపొందుచూ విద్యార్థి దశ నుండి సాధారణంగానే వికాసాన్నందు కొంటుంది. అందుకే వేదపాఠాలు బోధించే గురువులు పదేపదే వల్లె వేయించుట జరుగుతుంది. ఇది వ్యక్తికీ వ్యక్తికీ పోల్చేటందుకు వీలుపడదు. మేథ యొక్క వికాసం ఏ విధంగా జరుగుతుందీ అంటే సాహచర్యము, ప్రబోధముల ప్రభావంతో అది వికాసాన్నందుకొంటుంది. ఒక స్థాయిలో మేథాశక్తి యొక్క సామర్థ్యము ముఖవర్చస్సులో ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఆ వ్యక్తికి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను ప్రాప్తింప జేస్తుంది.

కావున మేథ యొక్క సంపూర్ణ వికాసమే వాంఛించదగియున్నది. వ్యక్తి తన యొక్క ఆధ్యాత్మిక వికాసము, సాధనా పురోగతి కోరుకొని జీవిత సార్థకతను పొందాలంటే మేథాశక్తిని వికసింప జేసుకొనే మార్గంలోనడవాలి. బుద్ధి శక్తి యొక్క అన్ని భాగాలు చక్కగా వికసించితేగాని సంపూర్ణ సార్థకత చేకూరదు. అట్లు కానప్పుడు జీవితమే నిరర్ధకమవుతుంది. శరీరము, దాని నిర్మాణము, తత్త్వము, విశ్వము, విశ్వాత్ముడైన పరమాత్మను గురించిన విజ్ఞానమును క్షుణ్ణంగా గ్రహించుకొని నిరంతరం జ్ఞప్తియందుంచుకొను వారి యొక్క"మేథ" చాలా యత్కృష్టమైనది. మేథాశక్తి సంపూర్ణ వికాసమువలన వ్యక్తి ఈ విశ్వములో సాధించలేనిది లేదని తెలుస్తున్నది. అందువలన "మేథ" గురించి సంపూర్ణంగా తెలుసుకోవాలి. తెలుసుకొంటే వారిలో బుద్ధి ప్రచోదనం ద్వారా విశ్వ కల్యాణానికి కారణభూతమైన మహా కార్యాలు జరుగుతాయి. వారిని "మేథావులు" అని ప్రపంచం కొనియాడుతుంది. వారి జీవితం సార్థకమవుతుంది. కీర్తియు లభిస్తుంది. ఇది అందరూ తెలుసుకొని పొందగలగాలి.

**(3) చార్వి:** బుద్ధిలో మూడవ భాగము "చార్వి" అనగా ఊహ – సోహలయందు నేర్పు అంటారు. మానవుడు తొలుత పండ ద్వారా విషయాన్ని గ్రహించుకొని మేథయందు నిక్షిప్తం చేసుకొంటాడు. ఈ నేర్చుకొన్న జ్ఞానమేదైతే ఉందో దాన్ని ఉపయోగించి అనేకమైన ఊహ–సోహలు చేయుట యందు నేర్పును చార్వి అంటారు. ఊహల ద్వారా తనకుగల విజ్ఞానమును, అనుభవమును

వ్యక్తపరచుట, పరోక్షంగా జరిగిన విషయాలలోని నిజానిజములను ఊహలతో బహిర్గతం చేయగల శక్తిని చార్వియంటారు. ఈ విధమైన బుద్ధితో తన సమస్యలకు గాని ఇతరుల సమస్యలకుగాని పరిష్కారములు సూచించగలిగిన శక్తిని పొందగలరు. ఎంత జ్ఞానాన్ని సంపాదించినవాడైనా దానిని ఇతరుల మేలుకొరకు వినియోగించితేనే జీవితం సార్ధకమవుతుంది. కీర్తి ప్రతిష్ఠలు ప్రాప్తిస్తాయి. భౌతిక విజ్ఞానం కానీ పరమాత్మ జ్ఞానం కానీ రెండూ పరులమేలు కొరకే వినియోగించాలి. తాను సంపాదించిన విజ్ఞానంవల్ల యితరులకు మేలు చేయని వ్యక్తికి తన విజ్ఞానం తనకే సమయానికి వినియోగించుకోలేని విధంగా వ్యర్ధమైపోతుంది. ఇంకా అహంకారంతోడైతే దురుపయోగమై పతనానికి కారణమవుతుంది. కావున బుద్ధిలోని భాగములను చక్కగా వినియోగించుకొని పరోపకార పారీణులుగ జీవితాలను మలచుకోవాలి. దీన్నికై నిరంతరమైన కృషి అవసరమైయున్నది.

**4) చత్వ :** చత్వ అనగా విషయములను చక్కగా అడిగి తెలుసుకోవాలనే కుతూహలం తోనూ, వినుటయందు ఓర్పును కలిగి, యున్నట్టి బుద్ధి. గురువుల వద్ద శిష్యులుగాని విద్యార్థులుగాని బోధనా సమయంలో ఏకాగ్ర చిత్తంతో వినువారు విన్నది విన్నట్లు గ్రహించుకొనగలరు. గుర్తు పెట్టుకోగలరు. విషయములను వినునప్పుడు సరిగా అర్థముకాని యెడల మరల మరల వివరణ యివ్వమని కోరికొందరు వింటారు. ఓర్పుతో విని దీనిని గుర్తు పెట్టుకొనే బుద్ధి ఎవరికైతే వుంటుందో వారికి చత్వ అనే బుద్ధిలోని నాలుగవ విభాగం చక్కగా పనిచేస్తున్నట్లు భావించాలి. ఆ విధంగా ఓర్పుతో వినేవారు చాలా తక్కువగా వుంటారు. ఎక్కువమంది గురువులను ఆధ్యాత్మిక విషయాలు చెప్పమని అడుగుతారు. కానీ వినడానికి ఓర్పు వుండదు. ముందువారితోనో వెనుక వారితోనో మాట్లాడుచుంటారు. కొందరైతే మొదటగా చెప్పినది విని ఏవో ఆలోచనలోపడి తర్వాత చెప్పేదంతా వినకుండా చివరికి చెప్పిన మాటలు వినబడినప్పుడు ఉలిక్కిపడి అయ్యో! ఏమి చెప్పారు? నేనేదో ఆలోచనలో వున్నాను. సరిగా వినలేదు. అంటూ ప్రక్కవారిని అడుగుతారు. విద్యార్థి దశలో వున్నవారి బుద్ధి చక్కగా క్రమవికాసాన్ని పొందకపోతే ఇలాంటి బుద్ధులే ఎదురౌతాయి.

ఇక ఆధ్యాత్మిక బోధల విషయంలో గురువు నష్టపోయేదేమీ వుండదు. శిష్యులే తమ సాధనాకాలాన్ని వృథా చేసుకోవడం జరుగుతుంది. మానవ జన్మ సాఫల్యాన్ని వారు పొందలేకపోతారు. అందువలన అందరూ తమకుతెలియని విషయాలను చక్కగా ఓర్పుగా వినుటకు అనగా చత్వ యను బుద్ధిని ప్రదీపనం చేసుకోవాలి.

**(5) గృహీతి :** గృహీతి అనేది బుద్ధి యొక్క పంచమభాగము. గృహీతి అనగా గ్రహణ బుద్ధియని అర్థము. “పంద” నుండి గృహీతి వరకు విషయ గ్రహణము అతి ముఖ్యమైయున్నది. గ్రహణ బుద్ధి అనగా విన్నదాని నుండి సూటిగా విషయమును గ్రహించుట. అనగా విన్న విషయమునకు తమ భావనను జోడించి యదార్థమును గ్రహించుట.

బుద్ధిలోని పంచమ భాగమైన గృహీతి ప్రకాశవంతమైన వారికి శాస్త్ర వాక్యములు చక్కగా బోధపడును. ఈ గ్రహణ బుద్ధి వికాసం విద్యార్థులకు ఎంతో అవసరము. గృహీతి బుద్ధితో ప్రకాశించు వ్యక్తి సమాజమునకు, దేశమునకు, ప్రపంచమునకు కూడ మేలు చేయగలడు.

**(6) శ్రౌతి :** శ్రౌతియనగా గురువులకు శుశ్రూష చేయుటలో సహనము కలిగిన బుద్ధి. పైన చెప్పిన ఐదు భాగములకుసంబంధములేనిది ఇది. దీనినే సహన బుద్ధియని అంటారు. ఆ ఐదు భాగములుప్రకాశవంతముగా పనిచేయకపోయినప్పటికీ వ్యక్తి ఎంత అమాయకుడైనప్పటికీ ఈ సహన బుద్ధి యొక్కటే ఇహమును పరమును సమకూర్చగలిగినంత శక్తివంతమైనది. అపార సహనము కలిగిన వ్యక్తులెందరో గురు శుశ్రూష ద్వారా, భగవదారాధన ద్వారా అనేక కష్టనష్టాల నధిగమించి వారిజీవితాలను పారమార్థికంగా వికసింపజేసుకొన్నవారు మన పురాణేతిహాసములలో దర్శనమిస్తారు. ఎన్ని సంపదలున్నా, ఎంత చదువుకున్నా ఎంతెంత పదవులున్నా సహనశక్తిలోపిస్తే అన్నీ వ్యర్థమేయగును. జీవితమును సార్థక మొందించుకోవాలంటే సహన బుద్ధి (శ్రౌతి) చాలా అవుసరమైయున్నది.

దీనిని స్వయం కృషితో పెంపొందించుకొనువారు ధన్యులు. పెద్దలకు, గురువులకు సేవలు, శుశ్రూషలు బుద్ధి పూర్వకముగా చేయ సంకల్పించుకొన్న మానవులకు భగవంతుని అనుగ్రహము సంపూర్ణముగా లభించును. భగవదనుగ్రహం అక్కరలేదనుకొనే వారెవరు? ప్రతివారికీ కావలసిందే. కావున దైవానుగ్రహం అంగట్లో దొరికే వస్తువుకాదు. తప్పనిసరిగా వ్యక్తులు తమలోని సహన బుద్ధిని పెంపొందించుకొన్నచో దైవానుగ్రహమునకు పాత్రతను సంపాదించుకొన్నట్లే.

**(7) ప్రతిభ :** ముందు చెప్పబడిన ఆరు భాగముల బుద్ధియొక్క ప్రకాశమే ప్రతిభయను సప్తమ బుద్ధి. మంచి వాక్చాతుర్యము కలిగి సత్య ప్రవచనము చేయునప్పుడు ఏదైనా విషయమును వివరించే సందర్భములో శ్రుతి, స్మృతి, పురాణ, ఇతిహాసములతో స్వానుభవమును క్రోడీకరించి పెక్కు ఉదాహరణలతో వినువారలు ప్రశ్నలు వేయుటకు అవకాశము లేకుండా విషయమును విశదపరచగల బుద్ధిశక్తి. అటువంటి ప్రతిభగలవాడినే ప్రతిభావంతుడని అందురు.

ప్రతిభావంతునియందు సప్తబుద్ధులు సంపూర్ణ వికాసమునంది ఆ పరిమళము సమాజోద్ధరణకై నలుదెసలా వ్యాపించును. వారి సర్వశక్తి యుక్తులూ పరోపకారమునకే వినియోగపడును. ఈ ప్రతిభను సంపాదించుటకు మానవుడు చాలా కష్టపడి సాధన చేయవలసి యున్నది. అనగా జిజ్ఞాస, జ్ఞాపకశక్తి, ఓర్పు, నేర్పు, గ్రహణబుద్ధి, శ్రౌతి, అన్నియు ప్రతిభగా రూపొందిన వ్యక్తి యొక్క కీర్తి ప్రతిష్ఠలు చిరస్థాయిగా భువిపైన విస్తరించి నెలకొనునని ప్రబోధించిరి.

అంతట ఆంజనేయ శర్మ సద్గురునికి చేతులు జోడించి నమస్కరిస్తూ ఓ! సద్గురు మూర్తీ! నీవు పరమ పురుషుడవు. మాయలో కప్పబడియున్న మాకు మీ దర్శనం కలిగించడమే మీ లీల. మీలోని దివ్యత్వాన్ని, అఖండతత్త్వాన్ని తెలుసుకొనేటందుకు నేనెంతటి వాడను. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడవు. మాబోటి వారి కొరకు మానవ రూపంలో వచ్చి మమ్ముద్ధరించితివి. తండ్రీ! నీవే ప్రకృతివి. నీవే పరమేశ్వరుడవు. నీవే వేద వేదాంగములసారమైయున్నావు. నీస్మరణ చేతనే సకల సంచితములు, ప్రారబ్ధ కర్మలు భస్మమై పోగలవు. మావంటి దీనులను దరిచేర్చు కొనుటయే మీ అవ్యాజకరుణకు నిదర్శనము. కల్పవృక్షమువలె మీరు అందుబాటులో వున్నప్పటికీ మూర్ఖులైన మాకు దాని విలువ తెలియదు. కష్టాల సుడి గుండాలలోపడినవాడు మాత్రమే మీ వద్దకు రాగలుగుతాడు. ఈ జగత్తంతా నీయొక్క లీలా విలాసముగ చెప్పబడినది. దేవా! నాలో కర్తవ్యనిష్ఠ నిలుపుము తండ్రీ! అని పరిపరివిధముల కీర్తించెను.

ఆంజనేయశర్మతో వచ్చిన పండితులలో ఒక నడివయస్కుడు లేచి "ప్రభూ! దత్త స్వరూపా! ఘటనా ఘటన సమర్థులని తెలిసి మీ దర్శనముకొరకు ఎంత ఆవేదన పడినామో నీ సన్నిధిని చేరగానే మా అంతరంగములు అమృతపానము చేసినట్లు సంతృప్తి చెందినవి. సదా సర్వదా మమ్ము ఎక్కడ వున్ననూ క్రీగంట జూచి రక్షించు"మని వేడుకొనెను.

అంతలో నూతనంగా వచ్చిన పిఠాపుర పండితులు శ్రీపాద శ్రీవల్లభా! నీవు ఆనాడు ఇల్లు వదలి తీర్థాటనకు బయల్దేరువేళ ఎట్లుంటివో అట్లేయున్నావు. గోకర్ణంలో గోవిందభట్టు అనువారు తమరి పేరు చెప్పగా విని మార్గం తెలుసుకొని నిన్ను దర్శించాలని కాంక్షతో వచ్చి చేరుకొనువేళ ఇక్కడ సాక్షాత్తు దత్తునికి పూజ జరుగుట ఎంతయో అదృష్టము అని పిఠాపురవాసులు సభకు పరిచయం చేసుకొని అందరికీ శ్రీపాదులు చిన్న నాడే అన్నలకు చేసిన మేలు గురించి మహిమ గురించి తెలిపిరి. మరియు ఈ రోజు సరికొత్త ప్రవచనాన్ని ఈ మహాత్ముని ద్వారా విన్నాము అని మురుసుకొనిరి. ఇంతలో ఆంజనేయశర్మ గురించి కొందరు వారికి తెలిపిరి.

అంతలో శ్రీ స్వామికి భిక్షయు, సర్వులకు సమారాధనకు సమయం అయ్యిందని కొందరు పెద్దలు వచ్చి తెలుపగా సంతోషాంతరంగులై అందరూ కోలాహలంగా భోజనములకు సిద్ధపడిరి. ఆ రోజు పంచభక్ష్య పరమాన్నములతో, నవకాయ పిండింటలు, నాలుగు కూరలతో షడ్రసోపేతమైన విందు శ్రీ స్వామి వారితో సహా అందరికీ వడ్డించినారు. నెయ్యి చేతినిండ ధారలుగా వడ్డించినారు. బ్రాహ్మణుల తర్వాత సర్వులకున్నూ భోజన ప్రసాదం వడ్డించబడినది. తదుపరి శ్రీ స్వామివారు సైగ చేయగా రజకుడు, పంచదేవపహాడ్ గ్రామస్థులు రామన్న, శంకరయ్య, బోయభీమన్న, మాల దాసరి సీతయ్య మున్నగు వారందరు భోజన ప్రసాదం తిన్నారు. ఇంకనూ మిగిలిన దానిని కృష్ణానదిలో సమర్పించినారు. తదుపరి శ్రీ పాదస్వామివారు కురువపురమునకు రమ్మని పిఠాపుర పండితులకు సూచనచేసి తాము బయల్దేరి వెళ్ళినారు.

తర్వాత గ్రామస్థుల సహాయంతో ఆ పండితులు కురువపురం చేరుకొన్నారు. నదిలో నీరు తక్కువగా యున్నందున ఎటువంటి ఇబ్బందియు కలుగలేదు.

ఈ విధంగా శ్రీపాద శ్రీవల్లభస్వామివారు తమ వద్దకు వచ్చిన వారికి అనేక విధములైన జ్ఞానబోధలు చేసేవారు. కల్పవృక్షము, కామధేనువు కోరుకొన్నవానిని మాత్రమే ప్రసాదిస్తాయి. కానీ సద్గురుదేవుడు తనను ఆశ్రయించిన భక్తునికి ఏది శ్రేయస్కరమో దానిని కోరకుండానే అనుగ్రహించుతారు అని శ్రీ బాబాగారు చెప్పినారు. అందరము దిగంబరా.. దిగంబరా .. శ్రీపాద వల్లభ దిగంబరా" అనే నామం చేసినాము.

"దిగంబరా" అని ఆయనను ఎందుకు సంబోధిస్తున్నామో ఆ విధంగా సంబోధించినందున ఆయనకేవిధమైన తృప్తి కలుగుతుందో శ్రీ బాబాగారు లోగడ ఒకసారి వివరించియున్నారు. దిగంబరుడంటే దిక్కులే తనకు హద్దుగా కలవాడు అనీ, బట్టలు కట్టుకోని వాడనీ, నగ్నంగా తిరుగుతాడని చాలామంది వర్ణిస్తారు. దిగంబరుడంటే అసలైన అర్థం చాలా వింతగా వుంటుంది. అచ్ఛాదనలేనివాడు. దాచియుంచని తత్త్వంగలవాడు. పూర్ణంగా దర్శనమిచ్చువాడు. అడ్డులేనివాడు. సర్వత్రా దిగంతాలవరకు వ్యాపించియున్న తత్త్వంకలవాడు. ఆయన యదార్థతత్త్వం దిగంబరతత్త్వం. అందువలన "దిగంబరా..దిగంబరా" అనగానే పొంగిపోయి ప్రేమతో కష్టాలు తీరుస్తాడు. బాధలు తీరుస్తాడు. కోరినవిస్తాడు. కర్మలు తొలగిస్తాడు. అనగా మన వల్లకాని పనులన్నీ ఆయన చేసిపెడతాడు అన్నమాట. ఆ విధంగానే ఆయన అనుగ్రహాన్ని అందరం పొందుదాము.

జైగురుదత్త!

# 17వ అధ్యాయము

## శ్రీపాద శ్రీవల్లభస్వామినే నమః

శ్రీపాదశ్రీవల్లభస్వామివారిని దర్శించుటకు దూర ప్రాంతముల నుండి గూడ భక్తులు రాసాగిరి. ఆ నోట ఆ నోట వారి మహిమలు అన్ని క్షేత్రాలలో కీర్తించబడుచున్నవి. యాత్రాస్థలముల వరుసలో శ్రీ క్షేత్ర కురువపురమునకు ప్రత్యేక స్థానము కల్పించబడెను. శ్రీ పాదులవారి కరుణ, ప్రేమ తత్వము అందరినీ ఆకర్షించుచున్నది. ఈతి బాధల నివారణకు, ఆధి వ్యాధుల నివారణకు ఎక్కువమంది శ్రీ స్వామి వారి దర్బారునకు వచ్చుచుండిరి. వారి వాక్కు ద్వారా, దృష్టి ద్వారా సర్వులకు బాధా నివారణ కలిగి సుఖముగా పోవుచుండిరి. తర్వాత ఏమి జరిగినదో వినండి.

ఆరోజు దత్తజయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కొందరు భక్తులు రాయచూరు నుండి దక్షిణతీరం నుండి నదిదాటి వచ్చి కురువపురం చేరుకొన్నారు. కృష్ణానదికి ఉత్తర తీరాన దత్తజయంతి వేడుకగా జరిగింది. సమారాధనలు జరిగాయి. శ్రీపాద స్వామివారు కురువపురమునకు చేరుసరికి అచ్చట యెంతో కోలాహలముతో దత్తజయంతి ఉత్సవం జరుపబడినది. శ్రీ స్వామివారిని దర్శించుకోవాలను సంకల్పంతో రాయచూరు నుండి రామచంద్రయ్య శెట్టి అను వైశ్య శ్రేష్ఠుడు వచ్చినాడు. అతడు అంతకుముందు రెండు మూడుసార్లు శ్రీ స్వామివారిని దర్శించుకొని ఆశీర్వాదము తీసుకొన్నాడు.

అతనితోపాటుగ సంతానము కొరకు శ్రీస్వామి వారిని ఆశ్రయించి కవల కుమారులను కన్నటువంటి లక్ష్మీనర్సయ్యగుప్త మరికొందరు బంధువులందరినీ కలుపుకొని దత్తజయంతి పర్వదినమున శ్రీపాద స్వామి వారిని అర్చించుకొనవలెనని నిర్ణయించుకొని వారు సకల యేర్పాట్లతోను వచ్చియుండిరి. శ్రీ స్వామివారు ఉత్తర తీరమున ఉన్నట్లు తెలిసికొనిరి. అయినను వారు యథావిధిగా శ్రీస్వామివారు ఆసీనులగు బండవద్ద శ్రీ స్వామివారున్నట్లే భావనచేసి పుష్పాలతో అలంకరించి ధూపదీప నైవేద్యములు సమర్పించి ఆ ప్రసాదమును అందరికీ వితరణ చేసినారు.

అగ్రహార వాసులందరికీ ఆనాడు ఘనమైన విందు జరిపించారు. శ్రీస్వామివారు సాయంకాలమునకు వచ్చుసరికి ఈ విషయమును తెలిపి నమస్కారము చేసికొన్నారు. శ్రీ స్వామివారు ఆ రోజు అనుష్ఠానానంతరం వారందరికీ ఆశీస్సులిచ్చుటకు యథాస్థానంలో ఆసీనులైనారు. పిఠాపురం నుండి వచ్చిన పండితులంతా గూడ చేరుకొన్నారు. శంకరభట్టు వారందరిచేత ప్రదోష సమయంలో శ్రీ స్వామివారికి యథావిధిగా పూజాదికములు చేయించినారు.

తర్వాత అందరి నుద్దేశించి శ్రీపాద స్వామివారు ఇట్లు బోధ చేశారు. ఆర్యులారా! ప్రతి వ్యక్తియు తన సంపాదనను ఐదు భాగములు చేసి తల్లిదండ్రులకు, సంసారమునకు, ఆశ్రితుల సంక్షేమమునకు, సమాజమునకు, గురుదైవ కార్యములకు వినియోగము చేయవలెను. అట్లు చేసిన వాని సంపద అభివృద్ధియగును. వంశమున్నూ వృద్ధి చెందును. కీర్తి ప్రతిష్ఠలు సమకూరును. జన్మ జన్మాంతరములందు ఉత్తమ జీవితము లభించును. అందులకే దీన రక్షణము, క్షేత్రములందు అన్నదానములు నిర్వహించుట, వివాహాది శుభ కార్యములకు సహాయపడుట సజ్జన లక్షణములు. మీ ఉదార భావనలను బట్టియే భగవంతుడు మీ మీ వ్యాపారములందు సహాయపడగలడు. "ధర్మో రక్షతి రక్షితః" అను ఆర్యోక్తి మీకందరకు తెలిసినదే. ధర్మాన్ని మీరు రక్షిస్తే (ఆచరిస్తే) ఆ ధర్మమే మిమ్ము రక్షిస్తుంది. ఇదే విధంగా దాన ధర్మకార్యాలు చేస్తూ మీరంతా ధన ధాన్య సమృద్ధితో వర్ధిల్లండి అని ఆశీర్వదించినారు. మరియు అట్లు ధర్మపరులుగావుననే ఆ కులమందు సోదరి వాసవి కన్యకగా ఉద్భవించి అఖండ ప్రఖ్యాతి కల్పించింది. ఆమె యొక్క ఆశీర్వాదములు పొంది సుఖపడండని దీవించారు.

ఆ రోజున కూడ కొందరు సంతానము లేని దంపతులు వచ్చి తమ కరుణా కటాక్షాల కొరకు వేచి యున్నారని రామచంద్రయ్య శెట్టి చెప్పి వారిని చూపి ప్రార్థించినారు. శ్రీపాదస్వామి వారు వారిని తమ కృపా దృష్టితో అవలోకించుచూ వారికి ప్రసాదముగా అచ్చటయున్న అరటి పండ్లను ఇచ్చి వెంటనే తినుమని ఆదేశించినారు. వారునట్లే చేసినారు.

శ్రీపాద స్వామివారి నామస్మరణతోనే ఎన్నో దుర్ఘటమైన కార్యములు సునాయాసంగా జరుగు చుండుటను వారు అనుభవపూర్వకంగా తెలుసుకొనియున్నారు.

తర్వాత శ్రీపాద శ్రీవల్లభులు పిఠాపుర బ్రాహ్మణ పండితులతో మాట్లాడినారు. ఆరోజు పిఠాపురం పండితుల బృందం అక్కడికి చేరిన వారందరికీ శ్రీపాదస్వామి వారి జననము, వారి మహిమలు వివరంగా చెప్పారు. అక్కడకు చేరిన వారికి ఈయనే సాక్షాత్తు దత్తుడని తెలిసి ఆనందపరవశులైనారన్నమాట విన్న తర్వాత శ్రీపాదస్వామి వారు తమ చిన్ననాటి పరిచయస్థులతో ఏమి చెప్పినారో తెల్పండని శ్రీబాబాగారిని మేము ప్రార్థించగా శ్రీ బాబాగారు శ్రీపాదస్వామివారిని ప్రార్థించుకొని కన్నులు మూసి ధ్యానించి వారికి గోచరించిన దృశ్యము నీ రీతిగా వర్ణింపసాగిరి.

"శ్రీపాద స్వామి ఆ పండితులతో ఇట్లు పలికిరి. ఆర్యులారా! మీ మనోభావములు అర్థమైనాయి. మానవ జన్మ యొక్క లక్ష్యమును సాధించుటను గురించే మీ ఆలోచన. సకల

జీవరాసులలో అతి దుర్లభమైనది మానవజన్మ. దీని పొందడం అనేక జన్మలలో చేసుకున్న పుణ్యఫలం వలననే సాధ్యమవుతుంది. ఇటువంటి మానవజన్మలో పరిపూర్ణమైన మానవత్వం అలవరచుకొనుట చాలా అవసరం. మానవత్వమనగా సర్వజీవ సమానత్వం. మానవజన్మను పొందినా మానవత్వం లేకుంటే ఆ జన్మ వృథా! మానవ జన్మను పొంది తనతో పాటు సర్వజీవులను ప్రేమించే ఈ మహత్తరమైన సుగుణములను సాధన చేత మాత్రమే పొందగలడు. అంతేకాదు మానవజన్మ యొక్క లక్ష్యమైన మోక్షాన్ని పొందటానికి సిద్ధపడుటయే ముముక్షుత్వం. సాధనచేత, ప్రయత్నం చేత, జన్మ జన్మాంతర పుణ్యఫలం చేత మాత్రమే ముముక్షుత్వం పొంది లక్ష్య సాధనలో మానవుడు పురోగమించుతాడు. దీనినే శ్రీమచ్ఛంకరాచార్యులు వారిలా ప్రబోధించారు.

**శ్లో॥ దుర్లభం త్రయమేవై తత్ దైవానుగ్రహహేతుకమ్ ।**
**మనుష్యత్వం, ముముక్షుత్వం, మహాపురుష సంశ్రయమ్ ॥**

"మానవజన్మ యెత్తుటయు, ముముక్షత్వము పొందుటయు, దాని లక్ష్య సిద్ధికై మహా పురుషులను ఆశ్రయించుటయు భగవదనుగ్రహం వలన కానీ లభించదు" అని నుడివియున్నారు. మనిషిగా జన్మించగానే సరిపోదు. మానవత్వంతో మెలగాలి. అప్పుడే సదాచరణతో సాధన చేయగలుగుతారు. అలా మోక్షగామియైన వ్యక్తి స్త్రీగాని, పురుషుడు గాని పురుషార్థ సాధన చేత పురుషుడనిపించుకొంటారు. తత్త్వజిజ్ఞాసులై మహాపురుషులను చేరి ఉపదేశమును పొంది పరతత్త్వ అన్వేషణ చేసి బ్రహ్మమును తెలిసికొనే ప్రయత్నం చేసే ప్రతివాడు బ్రహ్మణ్యత్వమును పొందుతాడు. మానవజన్మయే మోక్షద్వారం. మహాత్ముల సాంగత్యములో సందేహాలన్నీ విచ్ఛేదమవుతాయి. అప్పటి వరకు తనకున్న సమస్త జ్ఞానమును ప్రక్కకు నెట్టివేయాలి. అనగా శాస్త్రజ్ఞానము, లౌకిక జ్ఞానము మొదలగునవన్నీ అచ్చట పనికి రానివే. స్వానుభవ జ్ఞానమే శుద్ధ జ్ఞానమని తెలుస్తుంది.

జన్మపరంపరగా క్రమంగా ముక్తిని పొందాలంటే నూరువేల కోట్ల జన్మలు పడతాయి. కానీ శ్రద్ధ, ఓర్పు, పట్టుదల గలవాడు ఒకే జన్మలో మహాపురుషులను సమాశ్రయించి, సేవించి మోక్షాన్ని పొందవచ్చు. అందుకనే మనిషై పుట్టియు మానవత్వం లేనివాడు పశుప్రాయుడనియు, జీవించియు చనిపోయిన వాడనియూ తెలియవలెను. మానవుడు సాధన చేత మహనీయుడుగా మారి మాధవుడుగా మారుటకు ప్రేమ మార్గమే రాచబాట. సర్వ జీవుల పట్ల దయ, ప్రేమభావములు అత్యున్నత స్థితికి చేర్చు సోపానములు.

ఆర్యులారా! భగవానుడున్నూ, యోగులున్నూ పరమ ప్రేమ స్వరూపులు. కావుననే వారి

దృష్టిలో గుణము – దోషము రెండుగా గోచరించవు. అంతయు గుణముగానే కనిపించును. సాధకులైనవారు ముందుగా వారి వారి దృష్టి కోణములను మార్చుకొన్నచో ఈ ప్రపంచమందు సాధన చక్కగా సాగును. ఇదియే సర్వవేదసారమై యున్నది" అని మావనజన్మ లక్ష్యమును శ్రీపాదస్వామి వారు ఆ పండితులకు బోధించిరి.

పండితులందరునూ బోధనామృత లహరిలో జలకాలాడుచూ ఆ దివ్య సుందర స్వరూపుని దర్శించుచూ ఆనంద పారవవ్యములో ముగిని నిశ్చేష్టులై యుండిరి. శ్రీ స్వామివారు ప్రబోధమును ఆపిన కొద్ది క్షణముల తదుపరి వారు మామూలు స్థితికి వచ్చిరి. అందరూ ముక్త కంఠముతో ఒక్కసారిగా "సద్గురుదేవునికి జయము జయము జయము" అని ఎలుగెత్తి జయజయనాదములు చేసిరి. శ్రీ పాదస్వామి వారు వారందరినీ తమ అమృత దృష్టితో ఆశీర్వదించిరి.

ఆ రోజు వారందరూ అచ్చటనే గడిపిరి. తెల్లవారిన తర్వాత కాలకృత్యములు తీర్చుకొని అచ్చట గ్రామస్థులు ఇచ్చిన పాలు తీసుకొని తిరిగి స్వామిని దర్బారు నందు దర్శించిరి.

శ్రీస్వామి పండితులతో ఇట్లు పలికిరి. "ధార్మికులారా! వేదపండితులారా! అమితమైన శ్రమల కోర్చి తామెల్లరు తీర్థయాత్రలు చేయుచూ ఇచ్చటకు చేరి ధన్యత పొందినారు. ఈ ప్రదేశం అత్యంత పుణ్యప్రదమైనది. ఎందరో తాపసుల తపోభూమి ఇది. నది మధ్య మందున్న కురువపురము యొక్క మాహాత్మ్యము వర్ణింపనాదిశేషుని కైనా అలవికానిది. కోట్ల సంవత్సరాలు ఈ కృష్ణమ్మ తల్లి ఒడిలో నున్న అతి సుందరమైన, ప్రశాంతమైన తపోభూమి. సాక్షాత్ నారాయణుని కుమారునిగా పొందగోరి అదితి, దితి, వినుతి మాతలతో గూడి కశ్యప ప్రజాపతి తపమాచరించి జగతికి మూలకారకుడైన నారాయణునికి పితృదేవుడై ప్రఖ్యాతిగాంచెను. ఇప్పుడు మీరు నిలచిన ఈ ప్రదేశము కృష్ణానదికి ఉత్తర తీరము. ఇది వశిష్ఠ మహర్షి యొక్క తపోభూమి.

ఇచ్చట నదిలో సహజగణపతి విరాజమానమై యున్నాడు. యుగయుగాలుగా సర్వదేవతలు వారిని కొలుచుచున్నారు.

ఆర్యులారా! మీరు కూడ వారిని దర్శించి సకల శుభములను పొందండి! అని వారినందరినీ అభినందించి అచ్చట గల రజకునితో దాసూ! వీరిని తోడ్కొనిపోయి సహజ గణపతి దర్శనం చేయించి తిరిగి తీసుకొనిరా!" అని ఆశీర్వదించి పంపిరి. తరువాత తాను నిత్యం విశ్రమించు ఆసనం (పెద్దబండ) పైన ఆసీనులైరి.

వేదపండితులు ఆతని వెంట నదీతీరమునకు పోయిరి. ఒక శిలను జూపి అదియే సహజ

గణపతి దర్శించుకొనుమని పలికెను. వారందరూ సగము మాత్రమే గోచరిరించుచున్న ఆ సహజగణపతి శిలను రజకుడు చూపగా వారికి గణపతి యొక్క పూర్ణ స్వరూపము గోచరించగా సంభ్రమాశ్చర్యములను పొంది **"ఓం గణానాంత్వా గణపతి గ్ం హవామహే। కవిం కవీనాం ఉపమశ్రవస్తమం జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రాహ్మణస్పతః – ఆనశ్శృణ్వన్ నూతిభిః సీదసాధనం"** అని పరవశించి స్తోత్ర పాఠములతో స్తుతించిరి. తామున్న చోటనే ప్రదక్షిణములు చేసి సాష్టాంగ వందనములు ఆచరించిరి. మైమరపించిన ఆనంద ఉత్సాహములతో తిరిగి శ్రీపాదుల వారి వద్దకు వచ్చిరి. ఆ దర్శనముతో వారందరిలో ఏదో అలౌకికానందము, తృప్తి నెలకొన్నది. వారికి కలిగిన ఆ దివ్యానుభూతుల గురించి చర్చించుకొనుచు ఇట్టి అనుభూతి వలన ఇచ్చటి దివ్యత్వము మనకు బోధపడుచున్నది. కాని శ్రీ స్వామివారి ద్వారా గణపతి యొక్క తత్త్వమును గూడ మనము తెలిసికొన్న యెడల ఈనాటి దివ్యానుభూతి మన మనస్సులలో స్థిరముగా నిలువగలదు అని చెప్పుకొనుచూ వచ్చి శ్రీపాదస్వామి వారికి నమస్కరించి వారి ముందు కూర్చుండిరి.

శ్రీపాదవల్లభ స్వామివారు చిరుధరహాసముతో వారి మానసిక భావములను గుర్తించినట్లుగా వారితో "ఏమీ! పండితులారా! విజ్ఞాన స్వరూపుడున్నూ సకల విద్యలకు మూలమైన గణపతిని దర్శించు కొన్నారు గదా!" అని ప్రశ్నింప, వారిలో ఒకాయన శ్రీ స్వామికి నమస్కరించి "మహాత్మా! గోకర్ణక్షేత్రములో మీ గురించి విని యున్నాము. శ్రీ గణేశుడు ప్రతిష్ఠించిన ఆత్మలింగమును దర్శించితిమి. ఆ క్షేత్రమునకు మూలకారకుడు శ్రీ మహాగణపతియే గదా! ఆ క్షేత్రములో తాము అనేక లీలలు చూపినారట. అనేకమైన జ్ఞానబోధలు చేసినారట. అవన్నియూ విని తమరిచ్చట వున్నట్లు తెలిసికొని తమ దర్శనాభిలాషులమై ఇక్కడికి చేరుకొంటిమి. తాము అనుష్ఠానము చేసుకొనుచున్న ఈ ప్రదేశము గూడ శ్రీ గణేశుని దివ్య శక్తితోను, ఆయన అనుగ్రహ ప్రస్తారముతోను అత్యంత పవిత్రతను పొందినదని ఈ నదిలోని సహజ గణపతిని దర్శించగానే ప్రస్ఫుటంగా తెలుస్తున్నది. ఓ! దివ్యాత్మా! శ్రీ గణేశ తత్త్వమును సవివరంగా తెలిపి మమ్ము ధన్యుల చేయగలందులకై ప్రార్థించుచున్నామని కోరినాడు. పరిపూర్ణ కరుణా కటాక్ష దృక్కులు ఆ విప్రవర్యులపై ప్రసరింప జేయుచూ శ్రీ స్వామివారు ఇలా ప్రబోధించిరి.

ఆర్యా! మీరడుగక మునుపే మీ మనోగత ప్రశ్నము మాకు తెలిసినది. సకల వేద విద్యా ప్రవీణులైన మీకు సర్వము అవగతమే! అయిననూ అనంతమైన, నిగూఢమైన శ్రీ గణేశ తత్త్వము ఎంత తెలిసికొన్నా ఇంకా మిగిలే వుంటుంది. ఎంత వర్ణించినా తరగని ప్రభావం ఆయనది.

దానికి ఆద్యంతములు లేవు. ఆ తత్త్వమే అనాదియై యున్నది. అటువంటి దానిని తెలుసుకోవలెనను జిజ్ఞాస మీలో కలిగినందుకు వినయవిధేయతలతో మీరు ప్రశ్నించిన విధానమునకు చాలా ప్రసన్నుడనైతిని. అత్యంత రహస్యమైన శ్రీ గణేశుని తత్త్వమును తెలిసికొనుట ద్వారా గొప్ప విజ్ఞానము కలుగును. విజ్ఞానిని సుజ్ఞానిగా చేయ సమర్థవంతమైనదీ గణేశతత్త్వము. దీనిని సమాహిత మనస్సుతో, ఏకాగ్రతతో, చిత్తశుద్ధితో శ్రవణం చేయండి! అని శ్రీ స్వామివారు ఈ విధంగా చెప్పదొడంగిరి.

తొలుతగా శ్రీ స్వామివారు చేతులు జోడించి "ఓం గం గణపతయే నమః ఓ నమో వ్రాతపతయే గణపతయే నమః ప్రమధపతయే, నమస్తే అస్తు లంబోదరాయ, ఏకదంతాయ, విఘ్ననాశినే, శివసుతాయ వరదమూర్తయే నమః" అని స్తుతి ప్రారంభించిన తోడనే పండితులు అందరు స్వామితో స్వరము కలిపారు.

దివ్యాత్మ స్వరూపులారా! శ్రీ గణేశ తత్త్వమును వేదాలెంతగానో శ్లాఘించి యున్నవి. ఈ జగత్తు యొక్క మూల తత్త్వం గణపతి. మానవ శరీరంలో పంచ కర్మేంద్రియములు, పంచ జ్ఞానేంద్రియములు అంతః కరణ చతుష్టయము ఉన్నాయి. ఇవన్నీ కలసి 14. వానిపై అధికారము గలిగిన ఏ శక్తులున్నాయో వాటిని "చతుర్ధశ దేవతలు" అంటారు. వీరందరికీ ప్రేరణ కర్త గణేశ్వరుడు. ఇతడే 'ఓంకార' స్వరూపుడు. జగత్తులోని సర్వదేవతా గణములకు అధిపతి. అంతేగాక మానవ శరీరంలోని అన్ని కణములకు అధినాయకుడు ఇతడే. అందుకే వినాయకుడనే పేరు కలిగినది.

వినాయకుడనగా తానందరికీ నాయకత్వం వహిస్తాడు. తనను నడిపే నాయకుడు లేనివాడు. అనగా తానే సర్వ నియామకుడు, నియంత. మానవ శరీరంలో శ్రీ గణేశుని స్థానం మూలాధార చక్రం. మూలాధార క్షేత్రము నందుండు గణపతి గురుస్థానాధిపతిగాను, ఓంకార స్వరూపుడు గాను ప్రకాశిస్తూ వున్నాడు. మూలాధార చక్రం పృధ్వీతత్త్వమయం. ఇది పంచభూతాలలో ప్రధమ భూతం. దీనితోనే మన దేహాలు తయారైనవి. పృధ్వి అనగా మట్టి అనీ, భూమి అనీ అర్థం. అజ్ఞానమని గూడ అర్థం వుంది. ఈ స్థానంలో వుంటూ శ్రీ గణాధిపతి మానవ మేథస్సులోని డెబ్బది రెండు కోట్ల డెబ్బది రెండు లక్షల పదివేల రెండు వందల ఒక్క భావతరంగ ములకు ప్రేరకుడుగా వున్నాడు. మానవునిలోని గుణములన్నియు కొన్ని కొన్ని సముదాయములుగా ఏర్పడి యున్నందున వానినే గుణగణములని పేర్కొన్నారు. అనగా దైవీగుణములు కావచ్చు. ఆసురీ గుణములు కావచ్చును. అవి ఏవైనా ఆ గుణముల సముదాయములన్నింటికీ నాయకుడు

గణపతియే. లోకకల్యాణమే ఆయన లక్ష్యము. అనగా మూలాధారములో నున్న గణేశ్వరుని సంకల్పాలు జీవుని పూర్వ కర్మల నాధారంగా గుణములకు ప్రేరణ యిచ్చుచుండును. కనుక సకల దుష్కర్మలకు, సత్కర్మలకు ఫలప్రదాత ఈ గణేశుడేనని రూఢియగుచున్నది. జీవుని శ్రేయస్సు కొరకు దుష్కర్మలను క్షయింప చేయుటకై అనుభవములను కల్పించుటనే దుష్టశిక్షణగా వర్ణించిరి. అజ్ఞానభూయిష్టమైన జనన-మరణ సంసార చక్రము నుండి బయటపడవలయునను జిజ్ఞాసను, వివేకమును, విచారణమును ప్రేరేపించువాడు శ్రీ గణేశుడే!

ప్రకృతి, వికృతి రెండున్నూ ఈ దేవదేవుని తత్త్వములే. శ్రీ గణేశ్వరుడు నిర్వికారుడు, నిరంజనుడు, సృష్టికి పూర్వమున్నవాడు, సృష్టి నిర్మాణములో ఇమిడియున్నవాడు, సృష్టికి స్థితిని కల్పించువాడు, సృష్టి రూపముతో విలసిల్లినవాడు, సృష్టికి వికాసమునిచ్చువాడు, చివరకు సృష్టిని లయమొనర్చుకొన గలిగినవాడు అగుచూ శ్రీ గణేశుడు సర్వకాల సర్వావస్థలయందును సదానంద స్వరూపుడుగా వుండుట వలన సచ్చిదానందుడని పిలుస్తారు.

సర్వప్రమథ గణములు, భూతగణములు, సిద్ధ, సాధ్య, విద్యాధర, చారణ, కిన్నర, కింపురుషాది గణములున్నూ, గంధర్వ, యక్ష, రాక్షసాది గణములున్నూ శ్రీ గణనాయకుని అధీనములోనే వుండును. సకల విద్యలకున్నూ ఆయనే అధిపతి మరియు గురువు. గణేశునికి "కవింకవీనాం" అనే సార్థకనామమున్నది. అనగా ఆయనయే స్వయంగా కవి. అంతేగాక కవులలో కెల్లా గొప్ప కవి అని భావం. కవులలో కవిత్వరూపంగా భాసిల్లువాడు అని అర్థం.

కవి అనగా చక్కని సృష్టి రచన చేయగల సామర్థ్యం కలవాడు. మనసును రంజింప జేయువాడు. జీవితములను పుణ్యపథంలో నడపగలవాడు. పాపములను ప్రక్షాళన చేయగలవాడు. తద్వారా జీవుని ముముక్షువుగా మలచువాడు. అనగా మోక్షమార్గం వైపు ప్రయాణింపజేయువాడు. ప్రకృతిని చూచి పరవశించే జీవునికి దాని వికృతిని తెలియజేసి తద్వారా ముముక్షుత్వానికి అధికారిని చేస్తాడు. ప్రకృతి సిద్ధమైన ఈ దేహాన్ని ధరించిన జీవుడు మోహంలో పడి ఈ దేహమే తాననే భ్రమలో జీవితాన్ని వృథా చేసుకొంటాడు. అటువంటప్పుడు సద్గురుని రూపంలో దేహం యొక్క వికారాలను, వికృతంగా ఎదుర్కొనవలసిన భవిష్యత్తుని తెలియజెప్పి దేహభ్రాంతిని వదిలించి మోక్షమార్గం చూపువాడు గణేశ్వరుడే. అనగా సద్గురుని బోధలను శ్రద్ధతో ఆలకించాలన్నా శ్రీ గణేశ్వరుని అనుగ్రహం కావాలి. ఎందుకంటే బుద్ధిని ప్రచోదనం చేయువాడు, దానికి అధినాయకుడు గూడ గణపతియే! అజ్ఞానంతో వున్న శిష్యునిలో సద్బుద్ధిని ప్రేరేపించితేనే సద్గురుడు బోధించే

జ్ఞాన ప్రకాశంతో బుద్ధి గుహలోని చీకటి పూర్తిగా తొలగించబడుతుంది. కావున జ్ఞాన, విజ్ఞాన, సుజ్ఞానములను ప్రబోధించే వాడున్నూ (గురువు) తద్వారా ప్రభావితమయ్యే వాడున్నూ (శిష్యుడు) గణపతి యొక్క అనుగ్రహం కలిగితేనే ధన్యులౌతారు.

"తత్త్వమసి – అహంబ్రహ్మాస్మి – ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మా బ్రహ్మ" అను వాక్యములకు పూర్ణ మహా స్వరూపము, అర్ధము శ్రీ గణపతియే. ఆత్మ జ్ఞానం లభించాలంటే ఈ దేవుని కరుణ తప్పక లభించాలి. గురుదేవుని యందు విశ్వరూప తత్త్వముగా దాగియున్న గణేశుని గుర్తించి, భక్తియుక్తంగా సేవించిన శిష్యునికి ఈ తత్త్వము పూర్తిగా అవగతం కాగలదు.

మూలాధారస్థితుడైన గణపతియే సంకల్ప దేవతగా చెప్పబడియున్నాడు. ఏ పనియందైనా, ఏ సంకల్పమునైన గణపతియే ప్రచోదనం చేయవలెను. ఇది తెలుసుకొంటే మొత్తం శరీరానికి ఆయనే అధికారి కాబట్టి ఆయన ఓంకార స్వరూపుడు.

ఓంకారమనగా

అకార, ఉకార, మకారముల సంపుటి. అందువలన ఆయన యొక్క "అకార" తత్త్వము బ్రహ్మదేవునిగా స్వాధిష్ఠానమునందు విరాజిల్లుచున్నాడు. సృష్టి కార్య నిర్వహణకు ప్రేరణము మూలాధారమునందు గణపతి నుండియే సంకల్పించబడుచున్నది. ఆయన యొక్క "ఉకార" తత్త్వము మణిపూర చక్రము నందు విష్ణువుగా వెలసియున్నది. నిరంతరం ఆ రూపముతో స్థితి కార్యమును నిర్వహించువాడున్నూ గణపతియే. "మకార" స్వరూపుడైన మహేశ్వరుడుగా అనాహతమందు వశించి ప్రాణశక్తిచే జీవునికి ఉనికినిచ్చుచున్నట్లు తెలియవలెను. ఇక విశుద్ధి చక్రము నందు జీవరూపుడు తానై నిలచి వున్నాడు. వాక్పతిగా, శబ్దస్వరూపుడుగా, అక్షర స్వరూపుడుగా వున్నాడు. వ్యక్తి యొక్క కీర్తి – అపకీర్తులకు వాక్కే మూలమైయున్నది. జీవునకు వర్తమానమును, భవిష్యత్తును నిర్ణయించి అనగా పాపపుణ్యాల లెక్కలు చూచి వర్తింపజేయు వాడున్నూ భూతకాల కర్మల ఫలితాలను అనుభవింపజేస్తూ శుద్ధ మోక్షమార్గం (శ్రేయోమార్గం) లో నడిపేటందుకై జీవస్థాయి నుండి పై స్థాయికి కొని పోవువాడు గణపతియే. ఆ జీవుని స్థానమైన విశుద్ధి చక్రము పైననే ఆజ్ఞాచక్రము గలదు. అచ్చటనే జీవుని అజ్ఞాన విషయములు జ్ఞానవిషయముల మధ్యన సంఘర్షణ జరుగును. అచ్చట గణపతి దివ్యజ్ఞాన మూర్తిగా ఉన్నాడు. సాధకుడీ రహస్యమును తెలిసి సాధన చేస్తే అపార కరుణతో అజ్ఞానమును తొలగించుటకు గణపతి సర్వదా సిద్ధముగా వుంటాడు.

గురువు ద్వారా ధ్యానయోగ శిక్షణ పొందిన సాధకుడు ఈ సమస్త నాదులలోని భావములను, వాని తత్త్వములను తన అధీనమునందుంచుకొని సర్వకాల సర్వావస్థల యందును ధారణ చేయుచు "ఆజ్ఞాచక్రము" లేక "త్రిపురసంధి" ని ఛేదించుకొని జ్ఞాన ప్లావితుడు కాగలడు. అదే జ్ఞానసిద్ధి. ఆ సిద్ధిని ఇచ్చేవాడు సిద్ధ గణపతి. అక్కడ పరబ్రహ్మయు తానే. ముందుగా బుద్ధిని ప్రేరేపించువాడు గణపతే. కావున ఆయనను బుద్ధి గణపతిగా వర్ణించారు. చివరకు సాధకుడు దర్శించే పరబ్రహ్మ స్థితిలో గూడ ఆయననే కావున సిద్ధి గణపతి అన్నారు. ఈ విధమైన విరాట్ పురుషుని లక్ష్యముగా చేసుకొని ఆరాధించుటకు వీలు కుదరదు. కావున గణపతి యొక్క సాకారరూపము వేదము లందును, ఉపనిషత్తులందును ఈ విధంగా వర్ణించబడియున్నది.

ఏకదంతము కలిగి, నాలుగు చేతులందు పాశము, అంకుశము మోదకము, అభయముద్రలను ధరించి యున్నాడు. ఎఱ్ఱని మేని రంగుతో విశాలమైన లలాటము, సూక్ష్మదృష్టి కలిగిన చిన్న కన్నులు, చేటలంత చెవులు, పొడవైన తుండము కలిగి ఎఱ్ఱని వస్త్రధారణ, ఎఱ్ఱని గంధము పూత కలిగి, ఎఱ్ఱని పూవులతో అలంకరింపబడిన వాడుగను, భక్తుల యెడను ప్రసన్న దృష్టి కలిగి నిరంతరము మేలు చేయువాడున్నూ, వాత్సల్యము గలిగినవాడుగా వర్ణించినారు.

ఈ రకంగా ఆ గణపతిని తలంచి ఎవరు ఆరాధిస్తారో, ధ్యానిస్తారో వారు సకల శుభములు పొందుతారు. అందువలన అన్ని దేవతల కన్నా గణపతి దేవుడు సులభసాధ్యుడనీ, ఏ దేవత తృప్తిపడాలన్నా ముందు గణపతి ఆరాధన చేసిన తర్వాతనే వేరు దేవతారాధన చేయాలనే క్రమమును పెద్దలు నేర్పించినారు. సంపూర్ణమైన భక్తి విశ్వాసాలతో సమస్త జగత్తుకున్నూ మూలమైన వాడుగానూ, అఖండుడుగాను. నాశరహితుడుగానూ ప్రకృతి పురుషులకంటే పరమైన వాడుగాను, సృష్టికి పూర్వము, నిర్గుణ, సగుణ రూపముగానున్నవాడుగాను భావించి ఆ గణాధ్యక్షుని ఎవడు నిత్యము ధ్యానించునో వాడు యోగులలో శ్రేష్ఠుడైన యోగియగును" అని ఉపనిషద్వాక్యము అని ఆ తత్త్వ వివరమును తెలిపినారు.


ఈ విధమైన సమన్వయమును విని ఆ పండితులందరూ ఆనందాశ్చర్యములతో చిత్తరువుల వలె కూర్చుండినారు. శ్రీ స్వామివారు చిరునవ్వులతో వారిని తిరిగి ప్రశ్నించారు. గణపతి యొక్క తత్త్వము తమరికి బాగుగా బోధపడిందా అని అడుగగా తెప్పరిల్లుకొని ఓ! దత్తేశ్వరా! మా జన్మలు తరించినవి. నిన్ను కన్న వారు ధన్యులు. ఈ నేల ధన్యము. మా అదృష్టము వశమున ఇక్కడకు చేరుకొని దత్తజయంతి రోజు నీ ఉత్సవమును దర్శించుకొంటిమి. ఇక్కడ ప్రతిరోజు నిన్ను దర్శించు

కొనువారు ఎంత పుణ్యాత్ములో, నీవు క్షేత్రములన్నియు తిరిగి తిరిగి ఈ క్షేత్రమున నెలకొని యున్నావు. నీవు నివసించు కారణమున ఈ క్షేత్ర మహిమ మరింత ఇనుమడించగల"దని స్తోత్రించారు. ఆ తరువాత శ్రీ స్వామివారికి భిక్ష సమర్పించి తామున్నూ భుజించి వారు తమ తరువాతి యాత్ర కొనసాగించినారు అని శ్రీ బాబాగారు తెలిపిరి.

"వేదాధ్యయనము, అధ్యాపనములు వేరు. వేదార్థ పరిశోధనము వేరు. యోగము, యోగ రహస్యములు వేరు. ఎవరు ఏ విద్యయందు పరిశోధన చేసి పారమును చేరుదురో వారే దానిని బోధించడానికి అర్హులు. శ్రీ స్వామి యోగీశ్వరేశ్వరుడు. కాబట్టి యోగ రహస్యములను గోరుముద్దలు తినిపించినట్లుగా పండితులకు బోధించా"రని శ్రీ బాబాగారు చెప్పి "ఈ విషయాలు పండితులు గ్రహించుకొన్నారు. కానీ మామూలు వారికివి అంతగా మనసుకు పట్టవు." అని కొన్ని క్షణాలు ఆగి, "మీకు గూడ అంతేగా" అని అందరినీ నవ్వించారు. "ఓర్పుగా వుండాలి. సమన్వయం పాటించాలి. ఈ క్షేత్రంలో వున్నా మీ గృహంలో వున్నా సత్సంగము లేక సద్గ్రంథ పారాయణ, నామస్మరణ చేస్తూ వుంటేనే గురుకృపకు పాత్రులౌతారు" అని శ్రీ బాబాగారు సభ్యులందరికీ బోధించారు.

నిజమే! వారి స్థాయిని అర్థం చేసుకొనే శక్తి అందరికీ వుండదు. కానీ వినగా వినగా రజకుడైన రవిదాసుకు లభించినట్లు కొంతజ్ఞానం మనకు కూడ లభించగలదు. కానీ శ్రద్ధగా శ్రవణం చేయాలి. ఇనుము సూదంటు రాయిగా మారినట్లు రాపిడి పెట్టగా పెట్టగా మనమూ మారగలమేమో! ప్రయత్నించి చూడండి.

"శ్రీపాద శరణం మమ"



## 18వ అధ్యాయము

# శ్రీపాద శ్రీవల్లభస్వామినే నమః

పూర్వము ఏ క్షేత్రయాత్రకైనా కాలినడకనే వెళ్ళేవారు. ఏ గ్రామంలోనైనా గృహస్థులు వారిని ఆదరించి ఆహారమునకు అన్ని ఏర్పాట్లు చేస్తే వారికి ఎంతో పుణ్యం వస్తుందని ఆర్యోక్తి. వారికి ఆతిథ్యమిచ్చి వారు ఏ ఏ క్షేత్రాలు దర్శించారో అడిగి తెలుసుకొని దాని స్మరించినా, పుణ్యమేనని భావించేవారు. చెప్పిన వారు గూడ ఆ స్మరణ పదే పదే చేయుట పుణ్యదాయకమని ఆ విధంగానే చెప్పుచుండేవారు. ఇప్పుడు మనకు శ్రీ బాబాగారి ద్వారా వినిపించబడుచున్న విషయాలు గూడ మన చెవి ద్వారా మనసులోనికి చేరుకొని స్థిరపడితే పాప నిర్మూలనము జరిగి పుణ్యము ఒనగూడును. పూజ్యశ్రీ విఠల్ బాబాగారికి అందరూ నమస్కరించి "స్వామీజీ! తదుపరి శ్రీపాద స్వామివారిని ఏ పుణ్యాత్ములు దర్శించుకొన్నారు. వారి ప్రబోధామృతం ఎవరికి లభించినదని ప్రశ్నించగా శ్రీ బాబాగారు ఈ విధంగా ప్రార్థన చేసినారు.

"అహో! భగవంతా! నీ లీలావైభవము అనన్య సామాన్యమైనది. ఆది మధ్యాంతరహితా! అద్భుతానంద చరితా! సుమతీనందనా! నిన్ను దర్శింపవచ్చిన వారందరికీ జ్ఞాన భాండాగారము నుండి వారు మోయగలిగినంత ధనమును ప్రసాదించెదవు. ఎవరెవరికి ఎంత సాధ్యమో అంత గొనిపోయెదరు" అని స్తోత్రమును చేసి ఇట్లు చెప్పసాగిరి. ఆ విధంగా బయల్దేరిన పిఠాపుర పండితుల మనస్సులో సుప్రసిద్ధమైన దత్తక్షేత్రము మహెూర్‌గడ్‌ను (మాహూర్‌గడ్) దర్శించాలని సంకల్పం కలిగింది. ఇది శ్రీపాద స్వామివారి సంకల్పమని వారికి తర్వాత తెలిసింది. రండి! ఏమి జరిగిందో తెలుసుకొందాము.

మహోర్‌గడ్ అనబడుచున్న ప్రసిద్ధ దత్తక్షేత్రమే మాథా(తా)పూరు. పూర్వం విష్ణుదత్తుడను బ్రాహ్మణుడు అష్టకష్టాలు పడి శ్రీ దత్తదేవుని దర్శించుకొన్నది ఇచ్చటనే. తర్వాత విష్ణుదత్తునిపై తమ సంపూర్ణ కృపా దృష్టిని ప్రసరింపజేసిన దత్తస్వామికి నిత్యమూ విష్ణుదత్తుడున్నూ ఆయన భార్య సుశీలమ్మయున్నూ నిత్యపూజాదికములు చేసేవారు. అట్లు పూజలందుకొనుచున్న శ్రీదత్తాత్రేయునికి పూజాకార్యక్రమంలో భాగంగానే రాత్రిళ్ళు పవళింపుసేవను గూడ చేస్తుండేవారు. వారియొక్క నిర్మలప్రేమ, భక్తితత్పరతకి కట్టుబడిన శ్రీదత్తుడు ఆ సేవను గూడ స్వీకరించుట తన ధర్మంగా భావించాడు. ఎందుకనగా భక్తుని సంతృప్తి పరచడం భగవంతుని బాధ్యత, భక్తుని ఆనందమే భగవంతునికి తృప్తి.

ఆ విధంగా దత్తునికి ఆ ప్రదేశమే ఆనాటి నుండి విశ్రాంతి నిలయంగా మారినది. ఈనాటికీ అచ్చట ఆయన శయన మందిరంగా దత్తభక్తులు ఆ క్షేత్రాన్ని దర్శిస్తుంటారు. పైన "రేణుకా పహాడు" దానిపైన "దత్తపహాడు" ఆపైన "అనసూయా పహాడు" అని మూడు క్షేత్రాలున్నాయి. "పహాడ్" అంటే "గుట్ట"అని అర్థం. అందు దత్తపహాడునందు దత్తస్వామిని అనేక సంవత్సరాలుగా సేవించుచున్న యోగానంద బ్రహ్మచారి అను వానికి శ్రీదత్తుని దర్శనప్రాప్తి తనకు కలగలేదని అశాంతి, ఆందోళనము కలిగెను. ఆ తపనతో తీవ్రముగా సాధన చేయసాగెను. శ్రీ దత్తదర్శనమునకై అతని మానసము మరింత తొందరపడసాగెను. శ్రీ స్వామి వారి కరుణా ప్రసారము ఆతనిపై కలిగినది.

ఒకనాడు యోగానందుడు ధ్యానమునందుండగా దత్తస్వామి "వత్సా! నీవు కృష్ణానది మధ్యన్ను కురువపుర క్షేత్రమునకు రమ్ము! అచ్చట శ్రీపాద శ్రీ వల్లభుడను పేరున నేను దర్శనమివ్వగలను. నా ప్రస్తుత అవతారము అదియే!" నని తెలిపెను. ఆ సాధకుడు ధ్యానము నందుండి లేచి శ్రీ స్వామి వాక్కులను మరల మరల తలంచుకొని, మదిలో స్థిరపరచుకొని ఆనంద మొందినాడు. కానీ కృష్ణానదీ తీరములో ఆ గ్రామము ఎచ్చట నున్నదో ఎట్లా వెళ్ళాలో తెలియలేదు. ఆనాటి నుండి అచ్చటికి వచ్చే అనేకమంది భక్తులను ఈ విషయమై విచారించ మొదలిడెను. అతని అదృష్టవశాత్తు ఒకనాడు పిఠాపుర వాస్తవ్యులైన వేదపండితులు వారి యాత్రలో భాగంగా మహోర్‌గడ్ చేరి ఏకవీరమాతను (రేణుకను) దర్శించి శ్రీదత్తాత్రేయ సంస్థానమునకు వచ్చిరి.

వారిని చూడగానే యోగానందునికి శ్రీ దత్తస్వామి ధ్యానంలో తెలిపిన విషయం స్ఫురణకు వచ్చెను. అతను వారికి శ్రీదత్తస్వామి దర్శనం చేయించిన తర్వాత వారితో "ఆర్యా! మీ రాకతో నా మనసుకు ఎంతో సంతోషం కలిగింది. మీలో ఏదో విశేషం వున్నది అని వారిని ఆహ్వానించి ప్రసాదాలయమునకు గొనిపోయి వారికి పాలు, పండ్లుతో ఆతిథ్యమిచ్చినాడు. వారందరూ విశ్రాంతిగా కూర్చుండగానే ఆ బ్రహ్మచారి వారితో ఇట్లనెను. "అయ్యలారా! తమరెక్కడి నుండి వచ్చుచున్నారు? ఏ ఏ క్షేత్రములను దర్శించుకొన్నారు?" అని ప్రశ్నించగా వారిట్లు చెప్పిరి.

బంగాళాఖాతము దగ్గరలో గోదావరీ తీర ప్రాంతమైన శ్రీక్షేత్ర పిఠాపురవాసులము. దానినే "పీఠికాపురం" అంటారు. అష్టాదశ శక్తి పీఠములలో అది ఒకటి. అచ్చట పురుహూతికాదేవి గలదు. ఈ క్షేత్రం వలెనే ఆ దేవి గూడా మహా మహిమాన్వితమైనది. అచ్చటనే స్వయంభూదత్తున్నాడు. వేదపండితులము. తీర్థయాత్రలు చేస్తూ అనేక క్షేత్రములను దర్శించుచు ఇచ్చటికి వచ్చినాము.

సద్గురుదేవుని కృపతో నీ సన్నిధిలో ఈ పూట వున్నాము. నీ ఆదరము లభించినది. ప్రయాణపు బడలిక తీరినది.

"నాయనా! మేము పిఠాపురం నుండి బయల్దేరి పంచారామములలో శివ దర్శనం చేసుకొన్నాము" అని చెప్పగానే యోగానందుడు "ఆర్యా! పంచారామముల విశేషములను వివరంగా తెలపండి. క్షేత్ర దర్శనం చేయకున్నా ఆయా క్షేత్రములను దర్శించిన వారి ద్వారా క్షేత్ర విశేషములను, మహత్తులను విన్ననూ పుణ్యము కలుగునంటారు. నాకాభాగ్యం కలిగించం"దని కోరినాడు. అప్పుడా పండితులు "నాయనా! కుమారారామము, ద్రాక్షారామము, క్షీరారామము, సోమారామము, అమరారామము అనునవి పంచారామ క్షేత్రములందురు."

**మా యాత్రలో మొదటగా మాకు దగ్గరలో నున్న కుమారారామము (సామర్లకోట) చేరినాము. అచ్చట భీమేశ్వరుడని ఆ స్వామి వారి నామము.** బాలాత్రిపురసుందరి అమ్మవారి పేరు. ఈ లింగమును కుమారస్వామి ప్రతిష్ఠించినారు. కావున దీనికి కుమారారామమని పేరు కలిగినది. ఇచ్చట రెండతస్థులతో విశాలమైన ఆలయ ప్రాంగణం వుంటుంది. రెండవ అంతస్థు వరకు పెరిగిన స్ఫటిక లింగం పై భాగానికే పూజలు నిర్వహిస్తారు. ప్రధానాలయానికి పడమర దిశలో నూరు స్థంబాల మండపం ఉన్నది. వీనిలో ఏ స్తంభమునకా స్తంభమే నగిషీలు చెక్కబడి ఒకదానితో ఒకటి పోల్చుకొను వీలు లేకుండా విచిత్రముగా వుండును. ఇది 9వ శతాబ్దంలో నిర్మించబడినట్లు తెలుస్తుంది. దీనిని ఇంత ఘనంగా చాళుక్య రాజులు నిర్మించినారని శిలాశాసనాల వలన తెలుస్తుంది. ఊయల మండపంలోని రాతి ఊయలను మనం ఊపితే ఊగుతుంది. చైత్ర వైశాఖ మాసాలలో సూర్య కిరణాలు ఉదయాన శ్రీ స్వామివారి మీద పడడం అక్కడి విశేషం. ఇక్కడ భీమగుండం అనే పుష్కరిణి వుంది. ఇందులో స్నానమాచరించితే సర్వపాప నిర్మూలనం అవుతుంది. శ్రద్ధా భక్తి విశ్వాసాలతో శివుని సేవించి ఎందరో మహాత్ములై ఎన్నో మహిమలు చూపినారు.

తర్వాత ద్రాక్షారామ క్షేత్రమును చేరుకొన్నాము. ద్రాక్షారామంలో లింగము సూర్యుని ప్రతిష్ఠయని స్థల పురాణమందు చెప్పబడింది. ఇది గూడ విశేషమైన శివక్షేత్రము. ఇచ్చట శివుని పేరు "భీమేశ్వరుడు." అమ్మవారి పేరు "మాణిక్యాంబ." శ్రీ మాణిక్యాంబ పీఠము అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటిగా చెప్పబడింది. ఇది త్రిలింగములలో ఒకటిగా చెప్తుతారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి మరియు ద్రాక్షారామము మూడింటినీ త్రిలింగములంటారు. 12 ఎకరముల స్థలములో ఈ

ఆలయ నిర్మాణం జరిగింది. ఇక్కడ భీమేశ్వరస్వామి స్ఫటిక లింగం పదునాలుగు అడుగుల ఎత్తున ఉంటుంది. చాళుక్యభీముడనే రాజు ఈ ఆలయ నిర్మాణం చేయించినట్లు శిలాశాసనాల ద్వారా తెలుస్తుంది. రెండవ అంతస్థు పైకి వెళ్ళి లింగానికి అర్చనలు, అభిషేకములు చేస్తారు. సప్తర్షులు గోదావరీ జలాలను అంతర్వాహినిగా తీసుకొని వచ్చినందున "సప్తగోదావరి"యను పుష్కరిణి ఏర్పడినది. ఇందులో స్నానం చేస్తే కాశీలో గంగా స్నానం చేసిన పుణ్యము, భీమేశ్వరుని దర్శిస్తే కాశీ విశ్వేశ్వరుని దర్శించిన పుణ్యం వస్తుందని ప్రతీతి. అందుకే ఈ పట్టణాన్ని "దక్షిణ కాశీ"గా పేర్కొన్నారు. దక్షుడు యజ్ఞం చేసిన ప్రదేశం కావున దక్షారామం అని గూడా అంటారు. ఆ క్షేత్ర దర్శనం చేసుకొన్నాము.

అక్కడి నుండి బయల్దేరి పశ్చిమ గోదావరి జిల్లా యందు గల క్షీరారామము (పాలకొల్లు) నకు చేరుకొంటిమి. అచ్చట క్షీరలింగేశ్వర స్వామి లింగము విష్ణుమూర్తి యొక్క ప్రతిష్ఠ. అమ్మవారి పేరు పార్వతీదేవి ఇచ్చట ఎంతో వైభవంగా సమస్త పూజలు, యజ్ఞాలు, శివరాత్రి, నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. క్షీరారామలింగేశ్వరుడు కోరిన వరాలిచ్చే వాడని, ఆ స్వామి అపార దయామయుడని ప్రతీతి.

ఆ తర్వాత గునుపూడి (భీమవరం దగ్గర)లో వున్న సోమారామం (గునుపూడి) చేరు కొన్నాము. ఇచ్చట సోమేశ్వర లింగము చంద్రుని చేత ప్రతిష్ఠింపబడినది. కావున సోమేశ్వరుడని స్వామివారి పేరు. అమ్మవారి పేరు పార్వతీదేవి. చంద్రగమనానుసారంగా ఈ లింగకాంతులు మారుతాయి. ముఖ్యంగా అమావాస్య రోజున నలుపు వర్ణంగాను పౌర్ణమి రోజున ధవళ వర్ణంగాను మారుతుంది. క్రింద స్వామి వారి ఆలయము, రెండవ అంతస్థులో అన్నపూర్ణ అమ్మవారి ఆలయం దర్శనమిస్తాయి. ఆ దేవతామూర్తులు ఆశ్రిత కల్పవృక్షములే! ఆర్తుల పాలిటి కామధేనువులు. ఆ క్షేత్ర దర్శనం వలన పునర్జన్మ ఉండదని గూడ చెప్పబడింది.

అక్కడి నుండి గుంటూరు జిల్లా అమరావతిలో కృష్ణానదీ తీరంలో వెలసి యున్న క్షేత్రం అమరారామం చేరినాము. ఇక్కడ శివలింగము ఇంద్ర ప్రతిష్ఠితమని ప్రసిద్ధి. అందుకే ఇక్కడ శివుని పేరు "అమరలింగేశ్వరుడు." అమ్మవారి పేరు "బాలచాముండికాదేవి." శివలింగం 15 అడుగుల ఎత్తైనది. పై అంతస్థు నుండి శివలింగానికి అన్ని పూజలు నిర్వహిస్తుంటారు. నిత్యమూ దేవతల చేత ఇక్కడ శివుడు పూజింపబడతాడని స్థల పురాణంలో వుంది. ఇలాంటి గొప్ప గొప్ప పుణ్య క్షేత్రాలు ఇంకెన్నో దర్శించుకొని గోకర్ణము, శ్రీశైలము దర్శించుకొన్నాము. మధ్యలో

కృష్ణాతీరమునందున్న విజయవాటికలో (బెజవాడ) కనకదుర్గమ్మను, మంగళగిరిలో పానకాల నృసింహ స్వామిని దర్శించుకొన్నాము. మార్గమధ్యములో మాకు కురువపుర క్షేత్రము గురించి, శ్రీపాద శ్రీ వల్లభ స్వామి వారి గురించియు తెలియజేశారు. గోకర్ణ నివాసి గోవిందభట్టు గారి ద్వారా ఆ విషయమును విన్నాము. శ్రీపాద శ్రీ వల్లభుల వారంటే మా పిఠాపురంలో జన్మించిన శ్రీ దత్తమూర్తియే!

ఆ వార్త విన్నంతనే అత్యంతాసక్తితో ప్రయాణమై మార్గమధ్యములోని ఉమామహేశ్వరము, అలంపురం జోగులాంబ శక్తిపీఠమును దర్శించుకొని మేమందరమూ ఆ స్వామిని దర్శించుకోవాలని ఉత్సాహము ఉరకలు వేయగా శ్రీక్షేత్ర కురువపురము చేరుకొన్నాము. ప్రశాంత, గంభీర, సుందర, సుకుమారగాత్రుడైన శ్రీపాదస్వామిని చేరి వారిని దర్శించి ఆనందాబ్ధిలో ఓలలాడినాము.

ఆ స్వామి చిన్ననాడే ఉపనయనమైన మరుక్షణమే వేదవేదాంగాల నుండి సూక్ష్మార్థాలను వేదపండితులకు తెలిపి వారి నుండి నమస్కారములందుకొన్నారు. కానీ పదహారు సంవత్సరములు మాత్రమే పిఠాపురంలో నివసించారు. తదుపరి తల్లిదండ్రులను వదలి, అన్నల అంగవైకల్యము తొలగించి, తీర్థాటనము చేయుచూ ఇల్లువెడలి పోయినారు. కానీ వారే సకల తీర్థాలు తిరిగి శ్రీక్షేత్ర కురువపురం చేరి యున్నారని తెలిసినప్పుడు మరి మేము ఎంతగా సంతోషించామో వర్ణింప శక్యము కాదు. అక్కడకు చేరిన తర్వాత మాకు ఇంకనూ వింతైన విషయం తెలియ వచ్చింది. శ్రీస్వామి అనుగ్రహంతో ఒక మంద బుద్ధియైన బాలునికి సకల విద్యలు ప్రాప్తించిన వృత్తాంతము తెలిసినది. ఆహా! ఏమి మా అదృష్టము. మా జన్మలు ధన్యమైనవని యోగానందున కెఱిగించిరి.

ఆ వృత్తాంత మంతయూ శ్రద్ధతో ఆలకించిన యోగానందుడు శరీరం గగుర్పాటు నొందగా ఆనందాశ్రువులు స్రవించుచుండగా "స్వామీ! ఏమి చెప్పుచున్నారు. ఆ దత్తావతారమూర్తిని దర్శించు కొన్నారా! శ్రీ దత్త స్వామి నాకు ధ్యానమందు ఆదేశించినది ఆ స్వామిని దర్శించమనియే! తాము వారిని దర్శించి సేవించుకొన్న మహానుభావులు" అంటూ వారికి సాష్టాంగ వందనం చేసెను. "ఓ! పుణ్య పురుషులారా! నేను వెంటనే బయల్దేరి ఆ స్వామిని దర్శించవలెను. అప్పటి వరకు నా మనసునకు శాంతి లేదు. ఇచ్చట నుండి శ్రీ క్షేత్ర కురువపురం చేరుటకు మార్గం తెలుపుడు. ఆ స్వామి వద్దకు పోవుటకు దారి తెలియక నేను బాధపడుచున్నాను. తమ రాకతో నా వ్యధ తొలగినది. ఇది యంతయూ దత్తస్వామి యొక్క కృపయే! ఆహా! ఎక్కడి పిఠాపురం ! ఎక్కడి మహోర్‌గడ్. ఆయన ఆజ్ఞ చేతనే తమరిక్కడకు వచ్చుట జరిగినది. ఇది కేవలం సద్గురుని కృపతో మాత్రమే

సాధ్యమ"ని చేతులు జోడించగా వారిలో ఒక పండితుడిట్లు పలికెను.

"చిరంజీవా! నీ విచ్చటి నుండి దక్షిణంగా ప్రయాణం చేయి. నీవు భీమానది – కృష్ణానదీ సంగమమునకు చేరగలవు. అదియే నివృత్తి సంగమము. అచ్చట స్నానమాచరించినచో సకల శ్రేయస్సులు కలుగును. సకల సంశయములు నివృత్తియగును. అచ్చట విచారించిన నీకు కృష్ణానది మధ్యన గల కురువపురమును గురించి తెలియగలదు. నీవు "ముఖ్యస్థల" (ముఖ్తల్) అను గ్రామము మీదుగా పంచదేవపహాడ్‌కు చేరుము.

చేరువలోనే శ్రీ స్వామివారి దర్బారు స్థలము గలదు. శ్రీ స్వామివారు అచ్చటనే నీకు దర్శనమీయగలరు. లేదా నదిలో కురువపురంలో తప్పక దర్శనమిచ్చెద"రని తెలిపిరి. వారందరూ ఆ రాత్రి అచ్చటనే నిద్రించి ఉదయం సంధ్యావందనాది కార్యక్రమములు పూర్తి చేసుకొని బ్రహ్మచారిగారిచ్చిన భిక్ష స్వీకరించి తదుపరి ప్రయాణమును కొనసాగించినారు.

**పారేవుల వేద పాఠశాల విద్యార్థులు:**

పంచదేవపహాడ్‌కు అతి సమీపంలోనే పారేవుల అనే గ్రామం వున్నది. ఆ గ్రామంలో ఒక వేద పాఠశాల నిర్వహింపబడుచుండేది. అనేక దూర దూర ప్రాంతాల నుండి విద్యార్థులు వచ్చి అక్కడ పాఠశాలలో వేదవిద్యాపారంగతులై తమ ప్రాంతాలకు పోయి కీర్తి ప్రతిష్టలు గడించేవారు. పూర్వము నుండి వంశపారంపర్యంగా అచ్చట వేద విద్యాధ్యయనం చేయించే గురువులు నాలుగు వేదాలకు నలుగురుండేవారు. వారు విద్యార్థులను తమ సంతానముతో సమానంగా ప్రేమించి విద్య నేర్పించేవారు. వినయ, విధేయతలు, వేద ధర్మ పరిరక్షణ, వేద విద్యా ప్రచారము, యజ్ఞ యాగాది క్రతువులు జరిపించు విధానములు ముఖ్యంగా అక్కడ నేర్పించుచుండేవారు. ఆ పాఠశాలకు దేశ మందంతటా గొప్ప పేరు ప్రతిష్టలుండేవి. ఆ పాఠశాల కృష్ణానది తీరంలో ఉండుటవలన విద్యార్థులకు ఎంతో ఆహ్లాదకరంగా వుండి వేద విద్య చక్కగా అభ్యాసం చేసేవారు. అక్కడ గంగాధర దీక్షితులు, విశ్వనాథశాస్త్రి, బాలకృష్ణ భట్టు మరియు సోమనాథ శర్మయను నలుగురు గురువులు నిష్ఠగా విద్యాబోధనను చేస్తూ, విద్యార్థుల అభివృద్ధిని త్రికరణశుద్ధిగా కాంక్షిస్తూండేవారు. అందరూ వేద విద్యను ఆగమాది సకల శాస్త్రములను, ఉపనిషత్తులను ప్రబోధించే ఉత్తమ బోధకులు, పండితులుగ పేరుపొందినారు.

శ్రీపాద శ్రీవల్లభస్వామివారి కృపతో ఆంజనేయశర్మ సకల విద్యాపారంగతుడుగా అగుట చుట్టు ప్రక్కల గ్రామాలలో అందరికీ తెలిసినట్లే వేద పాఠశాల విద్యార్థులకు తెలిసి వారంతా గూడ ఆశ్చర్యంతో వారిలో వారిలా చర్చించుకొన్నారు.

మనమంతా వేద పాఠాలను వల్లిస్తూ నిత్యము ఇంత కష్టపడుచున్నాము. ఆంజనేయ శర్మకు గురువనుగ్రహంతో ఒక్క క్షణంలోనే వేదశాస్త్రాలన్నింటి సారము ఆకళింపునకు వచ్చినదట. అని ఒకరనగా అవును అది నిజంగా జరిగిందంటావా? ఆశ్చర్యంగా వుంది అని మరొక్కడు అన్నాడు. ఇలా చెప్పుకొన్నారు.

అందులో ఒక విద్యార్థి ధైర్యం చేసి సాయంకాలం సత్సంగ సమయంలో గురువుల సముఖంలో ఈ విధంగా విన్నవించుకొన్నాడు. "గురుదేవులారా! ఆంజనేయశర్మకు సంబంధించిన ఘటన అపూర్వము. అత్యాశ్చర్యకరము. పూర్వమెప్పుడైనా తాము ఇటువంటి ఘటనమును చూచి యున్నారా? లేక వినియున్నారా? ఇది యెట్లు సాధ్యపడినది? ఓంకారమునే ఉచ్చరించలేనివాడు వేద విజ్ఞానమునంతటినీ ఆకళింపు చేసుకోగలగడం వింత గాదా? హే! ధీమంతులారా! కొలది రోజులుగా ఈ విషయమే శిష్యులందరము చర్చించుకొనుచున్నాము. దయతో మాకు వివరించ కోరుచున్నా"మని ప్రార్థనా పూర్వకంగా నమస్కరించి కూర్చున్నాడు.

అందులకు గురువులు ఒకరినొకరు చూచుకొని సాలోచనముగా తలలూపినారు. అందుండి గంగాధర దీక్షితులు "అవును! మేము గూడ ఈ విషయము విన్నాము. ఇది ఆశ్చర్యకరమైన సంఘటనయే! ఇటువంటి సంఘటనలు జరిగినట్లు పురాణాలలోను, ఇతిహాసాలలోను చదువు కొన్నాము. కానీ ఈ అద్భుతమును కళ్ళారా ఇప్పుడు చూడగలిగాము. మానవ మస్తిష్కములో క్రిందటి ఏడు జన్మల జ్ఞానము సూక్ష్మరూపంగా నిక్షిప్తం చేయబడి వుంటుందని, వ్యక్తి స్వయం సాధనతో దానిని తెలుసుకొనవచ్చునని చదువుకొన్నాము. కానీ ఏ వ్యక్తియైనా గొప్ప సాధన చేసి గత జన్మల విషయాలు తెలుసుకొని ఏమి ప్రయోజనం! అదే సాధన ద్వారా పరమగతి, సద్గతిని పొందడానికి ప్రయత్నిస్తే మానవ జన్మ సాఫల్యం పొందుతాడని మా గురువులు చెప్పారు" అని తెలుపగానే విశ్వనాథశాస్త్రిగారు ఇలాగన్నారు. "మిత్రమా! ఈ స్వామివారి పద్ధతి ఏదో విశిష్టంగానే వున్నది. తనలో జ్ఞానాన్ని ప్రదీప్తం చేసుకొనేది సాధక దశ. యెదుటివానిలోని జ్ఞానాన్ని జాగృతం చేయడం అనేది సిద్ధుల ప్రభావం. ఈ స్వామి సామాన్య సాధకుడుకాదు. స్వయంగా సిద్ధుడే! అనిపిస్తున్నది.

సోమనాథశర్మయనే గురువుగారు "ఈ సంఘటన అతి విచిత్రంగానే వుంది. ఈ స్వామి సిద్ధుడైతే అష్టసిద్ధులను సిద్ధింపజేసుకొన్నప్పటికీ అజ్ఞానికి జ్ఞానము కలిగించడము సాధ్యం కాదు. స్పర్శచేతనే ఇట్టి జ్ఞానము ప్రసాదించగలిగిన శక్తి తాపసులకు, మహాయోగులకు మాత్రమే కలదని

ఇతిహాసములోని అనేక సంఘటనలు తెలుపుచున్నాయి. ఇతడు ఆ కోవకు చెందిన మహాత్ముడైనా కాని లేక అవతార పురుషుడైనా కావచ్చు" అని కన్నులు మూసుకొని ఆ స్వామి వున్న ప్రదేశంవైపు తిరిగి చేతులు జోడించి వందన మాచరించారు. ఇంతలో బాలకృష్ణ భట్టుగారు శిష్యులందరివైపున్నూ చూచి "ఏది ఏమైనా మనమందరము రేపు వేకువఝామున ఆ స్వామి ఉన్న ప్రదేశమునకు చేరి వారిని దర్శించుకొందాము. వారి దర్శనంతో మనకు ఏమి లభిస్తే అదే మహాప్రసాదము" అని పలికి మంగళవాచకములతో అందరూ సత్సంగమును చాలించిరి.

మర్నాడు వేకువఝామున వారందరూ నిత్య కృత్యములను అత్యంత ఉల్లాసముతో వేగంగా ముగించుకొని శ్రీ స్వామివారి స్మరణతోనే వారి దర్బారు ప్రదేశమునకు చేరిరి. అప్పటికి శ్రీ స్వామి వారింకను భాస్కరబండ వద్ద నుండి రాలేదు. అచ్చట అప్పటికే చేరిన రజకుడు ఇతర భక్తులు శ్రీ స్వామివారు రాబోవు సమయమాసన్నమైనదని తెలిపి వారిని కూర్చుండజేసిరి.

ఇంతలో శ్రీపాద శ్రీవల్లభులు యథావిధిగా తమ నిత్యానుష్ఠానమును ముగించుకొని తమలో తాము ఏదో మాట్లాడుకొనుచూ, ఇతరులకేదో ఆదేశము చేయునట్లుగా అభినయించుచూ దర్బారు ప్రదేశమునకు వచ్చుచుండిరి.

ఆనాటి ఉషోదయం ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నది. బాలభానుడు తమ కిరణములను శ్రీ స్వామిపైన వేడిలేక, చల్లదనములేక ప్రసరింపజేయుచుండెను. ఆ ప్రకాశమును చూచువారలకు తాము గూడ శ్రీ స్వామివారిని వినయముతో దర్శించుచున్నట్లుగా గోచరించసాగెను. ఆనాటి విద్యార్థుల వినయ విధేయతతో కూడిన, ప్రవర్తనకు ఈ దృశ్యము సమన్వయముగా అనిపించుచున్నది.

శ్రీ స్వామివారి రాక గమనించి అల్లంత దూరం నుండియే గంగాధర దీక్షితు వేద విద్యార్థులందరూ ఎదురేగి వేద ఘోషతో శ్రీ స్వామి వారిని తోడ్కొని వచ్చారు. శ్రీ స్వామి తమ ఆసనంపైన ఆశీనులు కాబోవుచుండగా ఆసనంపైన పులితోలు ప్రకటమైంది. వారు ఆసీనులైనారు. ప్రసన్నమైన దృష్టిని అందరిపైనా ప్రసరింపజేస్తూ వుండగా వేదపాఠశాల గురువుగారు నిలబడి "హే! మహాత్మా! మా ప్రాంతము, ఈ ప్రాంత ప్రజలు చేసుకొన్న పుణ్యము పండి తమరిక్కడకు వేంచేసినారు. ఎక్కడి పిఠాపురము! ఎక్కడి కురువపురము! మమ్ముద్ధరించుటకై దైవ నియోగమున ఏతెంచిన దివ్య పురుషుడవు! స్వామీ తమ కృపా దృష్టిచేత మూగవాడు మాట్లాడగలడు. కుంటివాడు కొండలెక్కగలడని తెలిసినది. దేవాదిదేవా! దివ్య ప్రభావా! మీ దర్శనాన్ని, అనుగ్రహాన్ని కోరి

మేమందరము నీ సన్నిధానమునకు చేరినాము అని చేతులు జోడించి గొంతు గద్గదముకాగా కన్నులానంద బాష్పములు కార అట్లే నిలబడి యుండెను. శ్రీ స్వామివారు మందహాసము చేస్తూ అందరివంకా చూచి నేత్రములతోనే వారికి స్వాగతమును ఆశీర్వచనమును ఒసగినారు. వారి అపార కృపా దృష్టిని అందరిపైనా సారించు చుండగా వారందరికీ శ్రీ స్వామివారి ముగ్ధమోహన రూపం చూడగానే మహానందం కలిగింది. విద్యార్థులందరూ శ్రీ స్వామివారిని చూడగానే తమ వలె విద్యార్థి వయస్సులోనే వున్నారు కానీ వారి ముఖము నందు వింత కాంతి ప్రకాశించుచు ఊహించనలవికానిదిగా వున్నది. ఈ భిన్నత్వం వారిని విస్మితులను చేయసాగింది. అందరూ అచేతనంగా ఉండిపోయినారు. ఇంతలో ఆ దివ్య దర్శనం నుండి తేరుకొని ఒక విద్యార్థి శ్రీ స్వామివారిని చేరి ఉచ్ఛైస్వరంతో "నకర్మణా..." అను మంత్రమును పఠించి ప్రవర చెప్పుకొని సాష్టాంగదండ ప్రణామమునాచెరించెను. అది చూచి వారి గురువులు, మిగతా విద్యార్థులు ఒక్కసారిగా లేచి అదే మంత్రమును పఠించి వారి వారి ప్రవర చెప్పుకొని ఎచ్చటి వారచ్చటనే సాష్టాంగ దండ ప్రణామము లాచరించినారు. దయార్ద్ర హృదయుడైన స్వామి వారందరి దండ ప్రణామములు స్వీకరించి శ్రీ గణేశుడు సిద్ధి, బుద్ధి సమేతుడై మీ సంకల్పములను సిద్ధింపజేయునుగాక యని దీవించి వారందరినీ కూర్చుండమని సైగ చేసినారు.

అప్పుడు శ్రీ స్వామివారు వేద విద్యార్థులారా! "విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణాః" అను రీతిన విద్య గడించడంతో అజ్ఞానం తొలగి జ్ఞానం ఉదయించగానే సకల గుణములకు మూలమైన "తితీక్ష" కలిగి వినయమును ఆచరణలో వుంచుకోవాలి. తద్వారా విద్యార్థి నిష్ఠను, నియమాలను పాటిస్తూ ఆచరణ ద్వారా ఉత్తమ ప్రవర్తకుడై, ఇతరులకు ఆదర్శవంతుడై, సత్ప్రవర్తనను నేర్పించాలి. ప్రథమ గురువైన తల్లి ద్వారా సత్య దర్శనాన్ని పొంది తండ్రియొక్క అండతో, హిత బోధతో ముందుకు సాగి విద్యార్థిగా గురుకులానికి చేరుకొంటాడు. గురువుల ప్రబోధంతో జన్మ జన్మాంతరములుగా తాను పొందుచున్న జ్ఞానాన్ని తిరిగి జాగృతం చేసుకొని గడుపబోవు జీవితమునకు ఆర్థిక స్థితిని, సంఘ గౌరవాన్ని పొందుతాడు. మీరు కూడ ఇలాగుననే విద్యార్థులై వచ్చినారు. మనకు అధ్యయన సమయంలో గురువులు ముందుగా శ్రవణం చేయించుతారు. తిరిగి దానినే మనతో పలికిస్తారు. దానిని పూర్తిగా అభ్యాసంచేసి తిరిగి అప్పగించమంటారు. తద్వారా శ్రవణము, మననము, నిధి ధ్యాసనము మూడు జరుగుతాయి. విద్య భుక్తి కొరకు గాక ముక్తి సాధించేదై యుండాలి. కనుక ప్రతి విద్యార్థి తాను భగవంతుడు ప్రసాదించిన ఈ ఉత్తమమైన

మానవ జన్మలో శాస్త్ర సమ్మతమైన జీవనము జీవించి, లోకకల్యాణముకొరకై పాటుపడి, సద్గురువుల సేవను చేసుకొనుచూ సర్వజనహితకారులై జీవించి ఉత్తమగతిని పొందాలి.

నాయనలారా! మీరు మీ పాఠశాలలో పరస్పర ప్రేమతో సమన్వయంతో కలసిమెలసి వేద విజ్ఞానాన్ని చర్చించి దానియందు దాగియున్న అఖండమైన జ్ఞానమును జాగృతి చేయ ప్రయత్నించండి! అని తెలిపినారు. మిమ్ములను నా వద్దకు చేర్చిన సంఘటనకు కారణమైన బాలుడు ఇతడే! జన్మ జన్మాంతరాలలో చేసుకొన్న కర్మల కారణంగా స్తబ్ధుడై తిరిగి ఆ జ్ఞానాన్ని జాగృతి చేసుకొన్నాడు. అది కేవలం సద్గురు కృప. ఈ మహత్తర ప్రదేశంలో అదృశ్యంగా తపస్సు చేస్తూ వున్న యోగుల మహత్తు అని శ్రీ స్వామివారు చెప్పగానే ఆంజనేయశర్మ లేచి శాస్త్రోక్తంగా సాష్టాంగ పడినాడు. అందరికీ ఇచ్చట స్థిరంగా వేంచేసియున్న సహజ గణపతి సిద్ధిని, బుద్ధిని ప్రసాదించునుగాక యని ఆశీర్వదించినారు.

తదుపరి బాలకృష్ణ భట్టు అను గురువుగారు లేచి మహాత్మా!

**శ్లో॥ కృతయుగే ధ్యాయతో విష్ణుః త్రేతాయాంయజ్ఞకర్మణః**
**ద్వాపరే యజనం, సేవాయాం - కలౌ నామ సంకీర్తనాత్॥**

అని చెప్తారు గదా! కేవలం నామసంకీర్తనముతో కలియుగంలో ముక్తి లభించునను వాక్యమున్నది. ఇది సాధ్యమేనా? అనిపిస్తుంది. దీనిని వివరించగా తమరే సమర్థులు. తమరి ముఖతః ఈ విషయమును విని మేము తరించగోరుచున్నామని ప్రార్థించెను.

శ్రీ స్వామివారిట్లు పలికారు. “పండిత శ్రేష్ఠులారా! కృతయుగమందు ధ్యానము, తపస్సులచేత భగవానుని కృపను పొందగలరని చెప్పినది వాస్తవమే. అప్పటి వాతావరణము ఆ ప్రయత్నాలకు అనుకూలంగా వుండినది. దానిని ఆధారంగా చేసుకొని భగవత్కృపను పొందిన వారు ఇహపర సౌఖ్యాలయందు అభిలాష కలిగించుకొని వరాలు పొంది సుఖించినారు. రాక్షసులు అదే విధంగా తపములు చేసి అమృతత్వము పొందాలని ప్రయత్నించి అనేకమైన వరాలు పొందారు. కాని అహంకారముతో సజ్జనులను బాధించినారు. ఆ క్లిష్ట పరిస్థితులను తపస్వులు గూడ ఎదుర్కొనలేక పోయినారు. అటువంటప్పుడు దీనికి సరియైన ఉపాయంగా శ్రీహరి ప్రేరణచేతనే నారద మహర్షి ప్రహ్లాదునికి తల్లి గర్భమందున్నప్పుడే నామోపదేశం గావించినాడు. ఆ విధంగా ఉపదేశించబడిన నామస్మరణ ఆపులేకుండా చేయగా అనేకమైన అద్భుతాలు ఆతని జీవితంలో చోటు చేసుకొన్నవి. నిరంతర నామస్మరణమే ఒక దివ్యమైన అవతారమునకు కారణమై నరసింహ

రూపముగా వచ్చి హిరణ్యకశ్యపుని చీల్చి చెండాడినది. అంతటి గొప్ప దుష్ట సంహారమునకు బలమిచ్చినది నామ సంకీర్తనమేనని ఋజువైనది. ఇది ఘోర తపస్సుకన్నా గొప్ప శక్తివంతమైనదని తెలియవస్తున్నది.

త్రేతాయుగమున యజ్ఞయాగాది క్రతువుల ద్వారా భగవంతుని ప్రసన్నం చేసికొనవలెనని యుగధర్మం చెప్పినప్పటికీ ఆ కాలములోని వారు స్వర్గాది సౌఖ్యములను, ఇంద్రాది పదవులను కాంక్షించుటయే జరిగినది. కానీ తపస్సుచేతగానీ, యజ్ఞయాగాది క్రతువులవలన గానీ రాక్షస సంహారం జరగకపోగా ఆటంకములే ఎక్కువైనాయి. అటువంటి రాక్షస సంహారమునకు శ్రీరామ నామమును నిరంతరం జపం చేసే హనుమంతుని బలము సహాయమైనదనునది అందరికీ తెలుసును.  నామస్మరణము సీతాదేవిగూడ నిరతము చేసినది.

ద్వాపరయుగమునందు పూజలు, సేవలు చేసి భగవంతుని ప్రసన్నుని గావించుకొన వచ్చునని యుగధర్మం చెప్పబడినప్పటికీ శ్రీ కృష్ణ పరమాత్ముని నామస్మరణమే దుష్ట నిర్మూలనకు, శిష్ట రక్షణకు తోడ్పడినది. కంసుడు ఎండుటాకు చప్పుడైనను కృష్ణుడు వచ్చి చంపునేమోయని భయంతో నిరంతర నామస్మరణము చేసెను. గోపికలు కృష్ణ నామామృతమును గ్రోలుచూ సకల కార్యాలను నిర్వహించుకొంటూ కృష్ణుడు తమ మధ్యన లేకున్నను ఆయనతో తాదాత్మ్య స్థితిని పొందగలిగినారు. రాధ నిరంతర కృష్ణ నామస్మరణములో మునిగి ఆత్మయందే కృష్ణుని అస్తిత్వమును పొంది తరించినది. కేవల నామస్మరణకు అంతశక్తియున్నదని ఆ యుగంలో గూడ నిశ్చయంగా తెలుస్తున్నది.

కలియుగంలో అటువంటి నామస్మరణయే ముఖ్య సాధనంగా అదే యుగ ధర్మంగా నిర్ణయించబడియున్నందున ఇది సాధ్యమేనని ఎందరో పుణ్యపురుషులు మహాత్ములు నిరూపించినారు. కలియుగంలో వకుళామాత గోవిందనామ స్మరణ నిరంతరం చేయుచుండేది. ఆ స్మరణ యొక్క శక్తి శ్రీహరిని వైకుంఠము నుండి భువిపైకి అవతరింపజేసి సుస్థిరంగా కలియుగ దైవంగా ఏడు కొండలపైన నిలిచేటట్లుగా చేసింది. నిరంతర గోవింద నామ స్మరణంతోనే కల్ప వృక్షమువలె అందరికీ ఆయన వరములు గుప్పిస్తున్నారు. ఇదియు అందరికీ విదితమే గదా!

ఈ నామస్మరణము విడువక చేసే దేవర్షి నారదులవారు మూడు లోకాలు సంచరిస్తూం టారు. నామస్మరణతోనే భక్తుల కష్టాలకు నివారణోపాయాలు సూచిస్తూ లోకకల్యాణం చేస్తూ వుంటారు.

దీనిని కేవలం కలియుగానికి మాత్రమే విధించినట్లు కొందరు చెప్పుకొన్నప్పటికీ అన్ని యుగాలలోను అతిశక్తివంతమైనదిగా ఋజువైనది. ఇదియొక మహారహస్యము. కావున దీనిని నర్మగర్భంగా ఆయా కాలాలలో సూచిస్తూ అవసరానికే అనగా దుష్ట సంహారానికే ఉపయోగపెట్టినారు. ఇది అమృతపానముతో సమానము.

మహాయుగము నందలి నాలుగు యుగములు మానవుని జీవితంలోని నాలుగు దశలుగా భావించవచ్చు. అట్లు పరిగణించినచో బాల్యము, కౌమారము, యౌవనము, వార్ధక్యము అని పోల్చుకొన్నచో బాల్యమందు నిరంతర కృషి, కఠోర సాధనగాను, కౌమారమునందు తెలివి నుపయోగించి, బలముతో చేయు సాధనలు, యౌవన దశయందు ఆలోచనతో సకలము సిద్ధింప జేసుకొను సాధనలు, వార్ధక్యమునందు తేలికగా శరీరమునకు అనుకూలముగా చేయగల సాధనలుగా దీనిని పోల్చుకొనుటయు కలదు.

దీనినే మరియొక విధముగాను అన్వయింపజేసుకొనవచ్చును. ఒక బలమైన వ్యక్తికి అజీర్ణ రుగ్మత కలిగినచో వ్యాయామము అతనికి నివారణకు ఉపయోగించును. అదే ఒక సాధారణ వ్యక్తికి కలిగినచో లంఖణము విధించబడును. అదియే అతని రుగ్మతను పోగొట్టును. ఒక బలహీనునకు అటువంటి రుగ్మత కలిగినచో ఆహారమునిచ్చి అది జీర్ణమగుటకు ఔషధములను ఇచ్చెదరు. పూర్తిగా బలహీనుడై ప్రాణాపాయ స్థితిలోనున్న వానికి ద్రవాహారమునిచ్చి ఔషధము నిచ్చెదరు. అదే అమృతంగా పనిచేసి వానికి ప్రాణనిచ్చి రక్షించును.

అదే విధంగా యుగ ధర్మాలు ముందుగానే అసలైన కీలకమును తెల్పలేదు. అయినను మహా భక్తులైనవారియందు భగవంతుడే ప్రేరణను కలిగించి ఈనామ సంకీర్తనామృతపానము చేయించెను. తమరందరూ పురాణ, శాస్త్ర, ఇతిహాసములను చదివి, చదివించుచున్న గురువర్యులే. కాస్త యోచించిన తమ సందేహములకు సమాధానము లభించగలదు. మార్గము సుగమము కాగలదని తెలియుడు. సృష్టికర్తయైన పరమేశ్వరుడు సమస్తమును వీక్షించుచు సాక్షీభూతమైయున్నాడను వార్త అందరెరుంగుదురు. కానీ ఆయన దుష్టశిక్షణ – శిష్టరక్షణ కార్యమునందు అప్రమత్తుడేనని దృఢముగా నమ్మియుండుట శ్రేయస్కరము.

ఆయన నిరంతరము ఈ సృష్టియొక్క వికాసమును, భూమియొక్క క్షేమమును కోరు చుండును. మహాత్ములందరున్నూ భూలోక కల్యాణమునకై కృషిచేయుచుందురు. ఇది సత్యమని సవిస్తరముగా శ్రీ స్వామి తెలుపుచుండగనే పండితులైన గురువులందరి అంతరంగమునందు

అద్భుతమైన భగవంతుని సంకల్పముల మహాశక్తి అవగతమై ఆనంద పరవశులై చేతులు జోడించి "హే! మహాత్మన్! మా జన్మములు తరించినవి. తమ వాగమృతమును గ్రోలి ధన్యులమైతిమి. మమ్ము సదా సర్వదా ఇదే విధమైన కృపా దృష్టితో రక్షింపుమ"ని ప్రార్థనలు చేసినారు. శ్రీ స్వామివారు తర్వాత కురువపురం చేరుకోగా గురువులు, విద్యార్థులునూ తమ తమ నివాసములకు పోయిరి" అని శ్రీ బాబాగారు తెలుపగా విని మేమందరమున్నూ ఆనందమును పొందితిమి.

జ్ఞానం అనగా తెలియుట. ఏ చిన్న విషయమైనా తెలియని విషయాన్ని ఎదుటి వారి వద్ద నుండి అడిగి తెలుసు కొంటేనే తెలుస్తుంది. తెలిసిన తర్వాత మరో విషయం తెలుసుకోవాలి. కానీ తెలిసిన దానిని ఎవరు కోరి చెప్పించుకొనరు అని శ్రీ బాబాగారు ప్రవచనాన్ని ముగించారు.

శ్రీపాద శ్రీవల్లభులకు జయము జయమని అందరము జయజయ ధ్వానములు చేసితిమి.



# 19వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

## వల్లభేశుని వివాహ వృత్తాంతము

శ్రీక్షేత్ర శ్రీవల్లభాపుర ఆలయ ప్రాంగణములో శ్రీశ్రీశ్రీ విఠల్‌బాబాజీ మహరాజ్ సాన్నిధ్యంలో అందరూ కూర్చుని వారి నుండి శ్రీపాద శ్రీవల్లభస్వామి వారి లీలలను శ్రవణము చేయుచున్నాము. వారి ముఖతః మరికొన్ని లీలలను వినవలెనని వారితో "స్వామీ! మహరాజ్! శ్రీపాదుల వారి దివ్యలీలలను ఎన్ని విన్నను ఇంకనూ వినవలెనని మా మనస్సు ఉవ్విళ్ళూరుచున్నది. మా యందు దయవుంచి మాకు శ్రీ స్వామివారి లీలలను వినిపించవలెనని ప్రార్థించాను. శ్రీ బాబాజీగారు అందరిని సావకాశముగా చూచుచు, ఈ విధంగా చెప్పనారంభించారు.

కలియుగ ప్రథమ దత్తావతారమైన శ్రీపాద శ్రీవల్లభుల గూర్చి ఎంత చెప్పినను, విన్నను అది లవలేశము మాత్రమే! శ్రీస్వామివారి లీలలు అనంతములు. వారి అమోఘ అమృతమయమైన దివ్యలీలలను చెప్పుటకు ఆ ఆదిశేషునకైనను సాధ్యముగాదు. అయినప్పటికీ ఆ స్వామి నాచేత ఎన్ని పలికించునో అంతవరకు చెప్పుటకు ప్రయత్నిస్తాను. అని ఒక్కసారి కన్నులు మూసుకొని ధ్యానస్థులై, శ్రీపాదస్వామిని మనస్సునందే ప్రార్థించి, వారి అంతర దృష్టికి గోచరమైన ఒక అద్భుతలీలను ఈ విధంగా చెప్పనారంభించిరి.

ప్రతిరోజూ ఉదయము శ్రీ స్వామి వారు నదిని దాటి ఈ వలి ఒడ్డుకు వచ్చి స్నాన అనుష్ఠాన సూర్య నమస్కారాది కార్యక్రమము లను పూర్తిచేసుకుని చుట్టూ పరికించి చూచి తమ రాకకై నిరీక్షించు (ప్రజలను) భక్తులను, ఆశ్రితులను, శిష్యులను కరుణించి అనుగ్రహించుటకై నిదానముగా తూర్పుగా నడిచి వచ్చి దర్బారులో ఆసీనులయ్యేవారు. అది ప్రస్తుతము దత్తాత్రేయ స్వామి ఆలయముగల ప్రదేశము అని లోగడ చెప్పానుగదా!

శ్రీ స్వామి వారు ఆసీనులగు ప్రదేశమును శ్రీపాదస్వామివారి దర్బారు అని అనేవారు. అది మాఘ మాసము. అందునా ఆ రోజు 'మహా మాఘి' మాఘమాస పూర్ణిమ కావడంవలన ఎంతోమంది భక్తులు కృష్ణానదీ పవిత్ర స్నానమాచరించుటకు, అటులనే సద్గురువుల దర్శనమును పొందుటకు అచ్చట సమావేశమయ్యారు. అప్పటికే శ్రీపాదస్వామి వారు ఆ ప్రాంతమునకు వచ్చి కొన్ని సం.లు అయింది. శ్రీ స్వామి వారి లీలలు, ఆ నోట ఆనోటా దేశము మొత్తము

తెల్సిపోయాయి. ఎటువంటి కోర్కెలతో వచ్చినా శ్రీ స్వామి వారి దర్బారు నందు వారికి "తదాస్తు" అనగానే వారి కోర్కెలు తీరుచుండేవి. అందులో ఆంజనేయ శర్మకు విద్యా దానము చేసిన లీల ఎంతయో ప్రాచుర్యము పొందినది. అటువంటి శ్రీ స్వామివారి కీర్తి విని ఆరోజు దర్బారుకు భారద్వాజ గోత్రికుడు, మహా పండితుడు, వృద్ధుడునైన విశ్వనాథ శర్మ తన కుమార్తెతో సహా ఆమె వివాహ విషయమై సద్గురువు, సమర్థులు అయిన శ్రీపాదుల వారిని దర్శించి వారి అనుగ్రహము పొందవలెనని వచ్చినాడు. అటులనే అచ్చటికి వచ్చిన వారిలో కాశ్యప గోత్రోద్భవుడైన వల్లభేశ శర్మ కూడా అతని కష్ట నివారణముకొరకై వచ్చివేచియున్నాడు.

అంతలో శ్రీపాదులవారు నది నుండి వచ్చు అలికిడి అయినది. విశ్వనాథ శర్మ ఒక్క ఉదుటన లేచి శ్రీ స్వామివారికెదురు వెళ్ళి ఈ విధంగా ప్రార్థించసాగారు.

"ఓం"

**"నకర్మణా! నప్రజయా! ధనేన త్యాగే నైకే అమృతత్వ మానశుః**
**పరేణ నాకం నిహితం గుహాయాం విభ్రాజదే తద్యతయో విశంతి**
**వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః**
**సన్యాస యోగా ధ్యత యశుద్ధ సత్వాః**
**తే బ్రహ్మలోకే తు పరాంత కాలే**
**పరామృతాత్ పరిముచ్యంతి సర్వే**
**ధ్రసం విపాపం పరమేష్మ భూతం**
**యత్ పుండరీకం పురమధ్య సగ్ఖం**
**తత్రాతి ధ్రసం గగనం విశోక తస్మిన్**
**యదంత తదు పాసి తవ్యమ్**
**యో వేదాదౌ స్వరప్రోక్తో వేదాంతేచ**
**ప్రతిష్ఠితః**
**తస్య ప్రకృతి లీనస్య యః పరస్వ మహేశ్వరః**

ఓం శాంతి శాంతి శాంతిః

పై శ్లోకములను పఠించిన పిదప యథాస్థానంలో శ్రీ స్వామివారు ఆశీనులైన తరువాత "అంగీరస అర్చనానస బార్హస్పత్య ప్రవరాన్విత భారధ్వాజ గోత్రోద్భవస్య విశ్వనాథ శర్మణాం

అహంభో అభివాదయే!" అని సాష్టాంగ నమస్కారము చేసి చేతులు జోడించి స్వామీ! శరణు! శరణు!దీనరక్షకా! దయాఘనా! పాహిమాం! ప్రభో! సంసార సాగరమున బడికొట్టు మిట్టాడుచు దరి కానరాక తలమునకలగు చున్నాము. మాకు వేరు దిక్కు లేదు. నీవే దిక్కని నమ్మి వచ్చితిమి. స్వామీ! ఎందరికో ఇష్ట కామ్యములిచ్చినావని, కష్టములను తొలగించినావని, తల వ్రాతలను మార్చగలిగిన సమర్థుడవని ఆంజనేయశర్మను సకల విద్యాపారంగతుని చేశావని వినియున్నాము. ఆర్తులపాలిటి భాంధవుడని పేరుగాంచిన దేవా! మా చిక్కులను తొలగించి మాకు సరియైన మార్గము జూపింప శరణు జొచ్చితిని.

నేను బహు కుటుంబీకుడను. ఈ బాలిక నా కుమార్తె. నా కడగొట్టు సంతానం. ఇక సంతానము వద్దు దేవుడా యని వరలక్ష్మియని పేరు పెట్టినాము. ఈ బాలికకు పెండ్లీడు వచ్చినది. ఈమెకు వరాన్వేషణలో చాలా ప్రయత్నములు చేసితిని. మా దురదృష్టము పోయిన చోటెల్లా మాకన్నా ముందుంటున్నది. ఈ కన్య యొక్క జాతకమునందుగల అంగారక దోషమువలన వరునికి ముప్పు అన్న విషయం అందరికీ విశదమైపోయింది. నాకేమో వృద్ధాప్య దశ వచ్చినది. ఈ బాలిక పట్ల నా కర్తవ్యమును నెరవేర్చక పోయిన లోకనింద తప్పదనిపిస్తూ వున్నది. గురుదర్శనం వలన అనేక పాపములు, దోషములు నివృత్తియగుననియు, గురుభక్తి కల్గిన వారికి జాతకమందలి గ్రహములు తమ తమ గతులను మార్చుకొని గురుని ఆజ్ఞానుసారం వర్తించునని పురాణవాక్యము. సమర్థ సద్గురూ! తమరు అఘటన ఘటన సమర్థులని దూర దూరముల నుండి, ఆర్తులు, దీనులు, వచ్చి తమ దర్శన భాగ్యముతోనే అనేక శుభములను పొందినారని తమ కీర్తి చంద్రికలు చాటి చెప్పుచున్నాయి. శ్రీపాద శ్రీవల్లభా! నీపాదాల వద్దకు శరణుకోరి వచ్చిన మాకు నీవే నీ అవ్యాజ కరుణతో పరిష్కారము సూచించుము. ఓ! సర్వజ్ఞా! నీకు తెలియనిదంటూ ఏమీ లేదు. అయిననూ నా పరిస్థితులను నీమ్రోల మొఱపెట్టుకొనుట ద్వారా నాకు బాధోపశమనము అగునని విన్నవించుకొంటిని" అని ప్రార్థించి శ్రీ స్వామివారు కూర్చోమని సంజ్ఞ చేయగా వారి పాదముల చెంత కూర్చునినాడు.

అంతలో అచ్చట కూర్చుని వున్న వారిలో పీఠికాపురము నుండి వచ్చిన కాశ్యప గోత్రీకుడు వల్లభేశ శర్మ అను బీద బ్రాహ్మణుడు శ్రీ స్వామి వారితో బాల్యంలో ఆడుకొన్న వాడు ఉన్నాడు. ఒక్కొక్క రోజు శ్రీపాద స్వామివారే సుమతీ మాతతో చెప్పి అతనికి కూడ వారింట్లో భోజనం పెట్టించేవారు. శ్రీ స్వామి తీర్థాటనకు పోయిన తదుపరి అతని బంధువులు రాబందులై ఆస్తియంతా

అపహరించి ఇంటి నుండి వెడలగొట్టినారు. అతడు ఎక్కడెక్కడో తిరుగుచుండగా శ్రీపాద స్వామి అనే నామం విని ఇక్కడకు చేరుకొన్నాడు. అతడు లేచి సాష్టాంగ దండప్రణామములను చేసి ఈ విధముగా ప్రార్థించసాగాడు.

"ఓ! దేవాదిదేవా! సద్గురుమూర్తీ! సచ్చిదానందా! పురాణుడా! పురుషోత్తముడా! నిర్మలుడా! నిశ్చలానందుడా! నీవే సంఖ్యా ప్రధాన శీలుడవు! చిత్ప్రకాశాత్మకుడవు! నిన్ను చేరి మ్రొక్కి ఈ సంసారమును దాటగలుగు నుపాయమును పొందకోరితిని. అత్రినందనా! గురువును, గురుతరుడును, గురు గమ్యుడునూ, గురోత్తముడున్నూ, గుణపారుడును, గుణకరుడును, దేవముని వంద్య సుచరణ సరోజుడును అగు నిన్ను నమశ్ఛతములతో అర్చింతును.

ఓ! కలియుగావతారుడా! నిఖిలేశ్వరుడా! నీ పాద పద్మములను దర్శించి నంత మాత్రముననే నాకు మహదానందము కల్గినది. కృతార్థుడను. సర్వహృదయ స్వరూపుడవైన నీకు నా మనోభావములు తెలిసియే వుండును. ఓ! సర్వజ్ఞా! మహానుభావా! వివిధ ప్రదేశముల నుండి వచ్చి నీ శరణుజొచ్చిన వారి బాధలను నివారించి ఆనందమును ప్రసాదించుచున్నావు. కర్ణాకర్ణిగా నీ లీలలను విన్న నేను నీ కరుణచేత నీ చెంతకు రాగల్గితిని. దయాసాగరా! నాకేమి కావలయునో నాకు తెలియకున్నది. నీకు తోచిన విధముగా నాకు హితమును కూర్చి ఆశీర్వదింపుము. అనుచు శ్రీచరణుల పాదములు పట్టి ప్రార్థించినాడు.

శ్రీ స్వామివారు చిరునవ్వు నవ్వుచూ "అదృష్టశాలీ! నీకు అనఘాలక్ష్మి సర్వశుభములు కల్గించును గాక!" అని పీఠికాపురమునందలి తన ఆత్మీయులను పేరు పేరునా కుశలము విచారించి తెల్సుకొనిరి.

తరువాత వారు విశ్వనాధ శర్మను చూచుచు "ఆర్యా! మీ సుపుత్రికను వీనికిచ్చి వివాహము జరిపించు"మని ఆదేశించి వారి పుత్రికను చూచిరి. శ్రీ స్వామివారి ఆదేశం వింటున్న ఆ యువతి ఆశ్చర్యంతో సంతోషంతో, తన జాతకములోని దోషం ఆ వ్యక్తిని ఏమి చేయునో అని భయం కలిగి సంశయాత్మకముగా లేచి నిలబడి శ్రీ స్వామివారి వద్దకు వచ్చి నమస్కరించి మోకాళ్లపై కూర్చుని ఈ విధంగా ప్రార్థించినది.

హే! కృష్ణా! జగదీశ్వరా! అచ్యుతా! నారాయణా! ప్రభువా! నీకు వందనములు. వాసుదేవా! అక్షయా! నిర్జరుడా! అనంతా! జనార్ధనా! శార్ఙ్గీ! చక్రపాణీ! నీచరణములకు నాదండ ప్రణామములు. భక్తాభయంకరుడా! విశ్వరూపుడా! అతి విశ్వుడా! విశ్వోద్భవ స్థితి నిలయుడా! సర్వసాక్షీభూతుడా!

సర్వాధ్యక్షుడా! యోగీశ్వరేశ్వరుడా! నీకు మా సహస్రాధిక ప్రణామములు. నీయాదేశమునకు తిరుగు లేదు. నీ వాక్కులే సర్వజగత్తుకు శృతి వాక్యములు. నన్నుబట్టి పీడించు ఈ జాతక గ్రహముల బాధను తప్పించి శుభములు కల్పింప సంకల్పించినారు. అయినా నేను అనుభవించవలసిన కర్మకు ఇతనిని బాధ్యుడ్ని చేసినచో అల్పాయుష్కుడగునేమో? అట్లని ఇతన్ని దీర్ఘాయుష్కుడిని చేసిన యెడల నా కర్మ మీ అనుగ్రహముతో వేరే జన్మములో అనుభవింపవలసి యున్నదా? తండ్రీ! మీరు కరుణించి నా మనో విచారమును గ్రహించి తగురీతిని ఆదేశమిచ్చిన నేను పాటించ గలను" అని తన ప్రార్థనను ముగించి మరొక్కమారు నమస్కరించి యధాస్థానమున కూర్చున్నది.

శ్రీ చరణుల వారు వీరి ముప్వురి ప్రార్థనలను సావధానంగా వింటూ సభలోని వారందరి ముఖ కవళికలనూ గమనిస్తూ వారి వారి మనోభావములను గ్రహిస్తూ వున్నారు. ఆమె ప్రార్థన ముగియగానే శ్రీపాదులవారిలా అభయప్రధానము చేశారు.

**ఓ! బాలికామణీ! చింతించకు! నీవు ఈ పవిత్ర ప్రదేశమున అడుగిడిన మరుక్షణమే నీ దుష్కర్మలు నశించిపోయినవి.** ఇది అనేకమంది మహర్షులు, యోగులు సంచరించి పునీతం చేసిన పుణ్యభూమి. అందుచేత నీ జాతకము మారిపోయినది. భయపడవద్దు. ఇక్కడికి వచ్చిన వారికి గ్రహములన్నియు అనుకూలించి దైవానుగ్రహమును కల్గించును. నీవు దైవముచేత అనుగ్రహింపబడినావు. సందేహము వద్దు. ధైర్యముతో నుండుము. సుఖీభవ" అని ఆశీర్వదించుచూ గురు పూజకై వేరొక్కరు తెచ్చిన పూజా ద్రవ్యములలో నుండి ఒక పసుపు కొమ్మును, దారమును వారి దివ్య హస్తములతో తీసి అభిమంత్రించి వల్లభేశుని లేచి రమ్మని సైగ చేయగా అతడు స్వామి సన్నిధిలో నిలువగా ఆతని చేతిలో వుంచుతూ వరలక్ష్మి (కన్య) వంకచూచి అమ్మా! నీ మాంగల్యమునకు సదారక్ష! అని ఆశీర్వదించి నారు. దర్బారులోని భక్తులందరూ ఆశ్చర్యపోయినారు. ఆహా! వీరెంతటి అదృష్టవంతులు. శ్రీ స్వామివారిచేత ఆశీర్వదింపబడినారు. శ్రీ స్వామి సర్వసమర్థులు గదా! ఇటువంటి లీల మన జన్మలో చూచి ఎరుగము అని చెప్పుకొన్నారు.

శ్రీపాద స్వామి అచ్చట చేరిన ఊరి పెద్ద శ్రీరామాచార్యులను చూచి వీరి వివాహమునకు తగిన ఏర్పాట్లు గావించమనిన్నీ, మన అంజప్పతో వివాహతంతు జరిపించమనిన్నీ, మరుసటి రోజు ఉదయమే వీరిరువురి వివాహమునకు శుభముహూర్తమనిన్నీ, ఇక్కడనే జరిపించమనిన్నీ, చెప్పారు. శ్రీస్వామి వారి ఆజ్ఞానుసారం మరుసటి రోజు అనగా మాఘ బ. పాడ్యమి దినమున వరలక్ష్మి వల్లభేశుల వివాహము శాస్త్రోక్తముగా జరిగినది.

వివాహము పూర్తయిన పిదప అచ్చటకు చేరిన పెద్దలందరూ వివాహ విందు భోజనమునకై

ప్రస్తావించగా విశ్వనాథశర్మ తను శ్రీ స్వామివారి అనుగ్రహం ఆశీర్వాదముల కొరకు మాత్రమే రావటంవలన తగిన ఏర్పాట్లు చేసుకొని రాలేకపోయానని అందువలన వారికి షడ్రసోపేతమైన విందు ఏర్పాటు చేయలేకపోతున్నానని విచారం వ్యక్తపరిచినాడు.

అదే సందర్భములో పెండ్లి కుమారుడైన వల్లభేశ శర్మ "నేను కడు బీదవాడిని. శ్రీ స్వామి వారి కీర్తివిని వారు నాకు ఏదైనా దారి చూపిస్తారని ఆశ్రయించుటకు వచ్చాను. నాకు జీవనాధారము కొరకు ఆశించగా ఆ స్వామి నాకు వివాహము జరిపించినారు. నా బరువు బాధ్యతలను మరింత పెంచినారు. వారి ఆశీర్వాదముతో, మీ అందరి ఆశీర్వాదముతో నేను కష్టపడి ఎట్లయినను ధనము సంపాదించి ఈ పవిత్ర ప్రదేశమున వేయి మంది బ్రాహ్మణులకు సమారాధన చేయగలవాడను. ఇది నా విన్నపము, ప్రార్థన మరియు వాగ్దానము అని వినయముతో అనుచుండగా శ్రీ స్వామివారు ప్రవేశించి "తథాస్తు!" అని ఆశీర్వదించినారు.

అంత నవ వధూవరులు శ్రీ చరణుల పాదములకు నమస్కరించి ఆశీస్సులు పొందిన తదుపరి పెద్దల ఆశీస్సులను పొందిరి.

ఆ రోజు దర్బారుకు వచ్చిన వారందరికీ శ్రీపాదులవారి సాన్నిధ్యమునందు శంకరభట్టు శ్రీరామాచార్యుల ఆధ్వర్యంలో అన్నదానం విశేషంగా జరిగినది.

తదుపరి శ్రీస్వామివారి అనుమతితో భక్తులు తమ బాధలు తీరి, కోరికలు నెఱవేరగా అందరూ వారి వారి స్వస్థానములకు వెళ్ళినారు.

మరొక రోజు దర్బారులో శ్రీపాదులవారు ఉన్నట్లుండి కన్నులు మూసుకుని ధ్యానస్థులయ్యారు. ఎచ్చట ఎవరికి ఏ ఆపదకల్గినదో స్వామి మౌనంలోకి వెళ్లిపోయారు అనుకుంటూ భక్తులంతా "దిగంబర" నామస్మరణ చేయసాగారు.

వారి వారి మనస్సులలో మాత్రం శ్రీపాదులవారి భక్త సంరక్షణ లీలలు మెదుల్తూ వున్నాయి. గజేంద్ర మోక్షం సందర్భములో మహా విష్ణువు బయల్దేరి వెళ్ళిన విధంగా, శ్రీపాదులవారు భౌతికముగా అచ్చటనే వున్నప్పటికీ ఆయన మరొక రూపముతోగాని వారి శక్తితో గాని ఏదో ఒక మహత్కార్యాచరణమునకు గాను సంకల్పించి వుండవచ్చును అని భావించి నామస్మరణ చేయుచుండిరి.

అంతలో ఒక అద్భుతమైన లీల జరిగినది. శ్రీ స్వామివారి వద్దకు కొన్ని బండ్లలో సుదూర ప్రాంతము నుండి జనం రావటం జరిగింది. ఆ బండ్లలో నుండి దిగుతున్న జనం అదేదో క్రొత్త

ప్రదేశము వలె నుండటాన్ని గమనిస్తూ "ఇది ఏవూరు?"అని ప్రశ్నించగా అది పంచదేవ పహాడ్ మరియు పసుపల గ్రామముల మధ్యగల కృష్ణానదీ తీర ప్రాంతము అని తెలిసినది. (ఇదే ప్రస్తుత కాలపు శ్రీక్షేత్ర శ్రీవల్లభాపురము) శ్రీపాదవల్లభుల దర్బారు ప్రదేశంగా తెల్సుకుని ఎంతో ఆతృతతో అందు ప్రవేశించారు. గంభీరముగా, చిరునవ్వులొలికిస్తూ ప్రసన్న వదనంతో ఆశీనులై వున్న స్వామిని చూచారు. ఆనందంతో హృదయం వుప్పొంగగా, కన్నుల నిండుగా నీరు నిండి మసక చూపుతో, గద్గదమైన గొంతుతో సుమతీమాత తనయుడ్ని కన్నార్పక చూస్తూ నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. ఇక అప్పలరాజు శర్మ, బాపనార్యులవారు శ్రీపాదుడ్ని చూస్తూ తమను తాము మర్చిపోయి పరవశులై వున్నారు. అంతలో శ్రీపాద స్వామి లేచి ఒక్క ఉదుటన వారికెదురు వెళ్ళి, తమ తల్లిదండ్రులకు, అమ్మమ్మ తాతలకు నమస్కరించి వారితో అమ్మా, అమ్మమ్మా, నాన్నా! తాతగారూ! అంటూ ఎంతో ప్రేమగా పలకరించి వారిని ఎంతో ఉల్లాసంగా తమదరి చేర్చుకున్నారు. అమ్మమ్మని తమకి ఎంతో ఇష్టమయిన గోధుమ హల్వా కావాలని అడిగారు. "చిన్న కన్నా! తెచ్చానురా! నీకోసం!" అంటూ ఆమె శ్రీపాదులవారికి హల్వా తినిపించసాగింది. అంతలో సుమతీ మాతకు తన చిన్ని శ్రీపాదుడు స్తన్యము తీసుకున్న భావన కల్గింది. అంతే! అద్భుతం! ఆమె వడిలో చిన్ని శ్రీపాదుడు తన చిట్టి చేతులతో తల్లి పమిటను తడుముతూ బుంగమూతి పెట్టుకొని తల్లిపాలకై తపిస్తున్నాడు. ఆమె తన చెంగును పైనుండి కప్పుకుని బిడ్డకు స్తన్యమివ్వసాగింది. ఆ తల్లి మనస్సు తృప్తి చెందినదో ఏమో ఒక్కసారి తల ఎత్తి ఎదురుగా చూచినది. రావి చెట్టు నీడలో నున్న బండపై శ్రీపాదులవారు కూర్చుని చిరునవ్వులు చిందిస్తూన్నారు. శ్రీపాదులవారి కుటుంబ సభ్యులు పీఠికాపురము నుండి వచ్చి తిరిగి వెళ్ళిన పండితుల ద్వారా శ్రీపాదులవారి విషయములు తెలుసుకొని వారిని చూడవలెననే కోరికతో అచ్చట నుండి ఆ రోజు ఉదయం కురుంగడ్డకు ప్రయాణమయ్యారు. సర్వ హృదయాంతర వర్తి అయిన ఆ స్వామికి తెలియని విషయమేమున్నది. వారు ప్రయాణమైన కొద్ది సమయానికి వారందరినీ తమ వద్దకు సునాయాసముగా చేర్చుకొన్నారు. సంకల్ప మాత్రంతో సృష్టి, స్థితి, లయల నాచరించే దత్తస్వామికి సాధ్యాసాధ్యములు ఏముంటాయి. ఆయన శక్తికి ఇదేమంత పెద్దపని? తృటిలో వారందరినీ తమవద్దకు చేర్చుకొని అందరికీ మనోల్లాసమును కల్గించి తృప్తిగా వారిని తిరిగి స్వస్థలమునకు చేర్చిరి. తల్లిదండ్రులు, తాతగారు, అమ్మమ్మ అందరూ కూడా ఎంతో తృప్తిగా వారి స్వగృహములకు నిక్షేపముగా చేరుకున్నారు.

## శ్రీపాదుల వారి దర్బారు మరియు వారి భవిష్యవాణి

ఆ సమయమందు దేశమందలి నలుమూలల నుండి, ఆర్తులు, అర్థార్తులు, జిజ్ఞాసులు, జ్ఞానులయిన అనేకమంది వారి వారి సమస్యలను తీర్చమని, వారి వారి కష్టములను నివారించమన్నీ ప్రార్థించుటకు వారి సన్నిధానమును చేరెడివారు.

శ్రీపాద స్వామి దర్బారనగా సర్వము లభించు ప్రదేశము. కోరికల తీరుటయే గాక వారికి మృష్టాన్న భోజనము కూడా ప్రసాదముగా లభించెడిది.

విశేషమేమనిన అన్నపురాశులు అక్షయముగా నుండెడివి. భోజనము అనిన శ్రీపాదుల వారి ప్రసాదం అనే భావన. అందరి భోజనము అయిన పిదప మిగిలిన భోజన పదార్థములను కృష్ణానదియందు పోయించెడివారు. ఆ విధముగా స్వామి వారి ప్రసాదము మానవులకే పరిమితము గాక జలచరములకు మరియు ఇతర ప్రాణులకు కూడా లభించెడిది.

శ్రీపాదులవారి దర్బారు నందు ప్రవేశించిన వారికి 'లేదు' అనే పదము 'లేదు'. వారి వారి కోరికలు తీరి సంతోషముగా వెళ్ళవలసినదే! అటువంటి మహత్తరమైన దర్బారుకు వచ్చిన వారిలో కొందరు స్వామితో..

"స్వామీ! ఇంతటి మహత్వ పూర్ణమైన మీ దర్బారు భవిష్యత్తులో ఏ విధంగా వుంటుంది? మీ అనుమతితో తెల్సుకోవాలని చాలా చాలా కుతూహలంగా వున్నది" అని ఎంతో వినయంగా ప్రశ్నించారు. అందుకు స్వామి వారు చిరునవ్వుతో..

"నాయనలారా! ఇదే ప్రదేశమందు పెద్ద పెద్ద భవనములు ఏర్పడును. ఎంతోమందికి నిత్యము అన్నదానము జరుగును. గోశాల వుండును" నా ఈ దర్బారుకు వేల లక్షల సంఖ్యలో భక్తులు విచ్చేయుదురు. ఇది ఒక ప్రసిద్ధ పుణ్యక్షేత్రముగా వెలయును"అని శలవిచ్చిరి.

శ్రీపాదులవారు తమ భవిష్యత్ ప్రణాళికలను అప్పటి దర్బారు విశేషములను ఈ విధంగా వివరిస్తున్నారు.

ఈ ప్రదేశము ఒక ప్రసిద్ధమైన దత్త క్షేత్రముగా విలసిల్లుతుంది. ఎందరెందరో దత్తాత్రేయ భక్తులు, సామాన్యులు, సాధు, సన్యాసులు, మహాత్ములు, దత్తావధూతలు తమ తమ ఇష్ట కామ్యార్థ సిద్ధికై ఇచ్చుటకు తరలివస్తారు. ఈ ప్రదేశమందు జరుగు లీలలు అసంఖ్యాకములుగా వుంటాయి. సంతానము, ఆరోగ్యము, ఆయుర్దాయము, అపమృత్యు నివారణ, నాగదోష నివారణ, దుష్టకర్మల

నుండి విముక్తి, ఈ విధముగా ఎవరెవరి కోర్కెలు ఏ విధమైనవైనను వాటిని తప్పక నెరవేర్చెదను. ఆధ్యాత్మికపరమైన కోర్కెలును తీర్చెదను.

నా అంశావతారులైన మహాత్ములు. ఈ నా ప్రణాళికను నిస్సందేహముగా నెరవేర్చెదరు. వారే ఆ కార్యములను నిర్వహించినను తామే నిర్వాహకులమన్న కర్తృత్వమును వహించక సర్వము శ్రీపాదుడనైన నా అనుగ్రహంకారణముననే జరుగుచున్నదని తెలియజేస్తూ దిగంబరా! దిగంబరా! శ్రీపాద వల్లభ దిగంబరా! దత్త దిగంబరా! అని నామ జపం సర్వదా చేయుస్తూ వుంటారు.



# 20వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభస్వామినే నమః

ఒకరోజున నేను శ్రీ బాబాగారి పాదపద్మాలకు నమస్కరించి వారి సన్నిధిలో కూర్చుండి "బాబాగారూ! శ్రీ పాదస్వామి వారి లీలా వైభవాన్ని దయతో వినిపించి మాకు పాప నిర్మూలనం చేస్తూ వున్నారు. వారిని తర్వాత ఏఏ భక్తులు దర్శించుకొని ఏఏ బోధలు పొందినారో వినాలనిపిస్తున్నది. మహాత్ములు లోకోద్ధరణ కొరకే జన్మించుతారు. వారి జగత్కల్యాణ కార్యం అనగా పాపులను పరిశుద్ధులను జేయుటయే గదా! వారి బోధలు మా చెవుల ద్వారా మనసుని చేరి మా అంతఃకరణములను శుద్ధి చేయగలవు. కావున మాయందు దయయుంచి వారి లీలామృతమును ప్రసాదించండి" అని వేడికోలుగా అన్నాను.

శ్రీబాబావారు ముందుగా శ్రీదత్తాత్రేయుల వారిని, శ్రీపాద శ్రీ వల్లభుల వారిని స్మరించుకొందమని ఇట్లు చెప్పారు. తరువాత కన్నులు మూసికొని హే! భగవంతా! దయావంతా! అనఘాద్భుత చరితా! కృష్ణా తీర నివాసా! కురువపుర నిలయా! నీ లీలలు అనన్యములు. నీ సంకల్పములు దివ్య సంకల్పములు. నిన్ను నమ్మిన భక్తులను చేరదీసి కాపాడుటలో అనేక పద్ధతులను, మార్గములను నిర్దేశించెదవు. దేవాదిదేవా! సకల జ్ఞాన సంపదలతో కూడిన నీ దివ్య దర్శనములను కలిగించి, నీ బోధలను లీలలను నా చేత పలికించుచున్నావు. కరుణించుము తండ్రీ! అని ప్రార్థించి ఇట్లు ప్రారంభించినారు. భక్తులారా! అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ దత్తాత్రేయుడే శ్రీపాదస్వామి. మన సంకల్పమునకు వారి సంకల్పము గూడ మిళితమైనచో ఈ ప్రకృతిలో ఏ కార్యమైనను నిర్విఘ్నంగా నెరవేరుతుంది. వారి అనుగ్రహం లేనిదే ఎవ్వరూ స్వప్రయత్నంతో కనీసం దత్తక్షేత్రానికి రాలేరు. శ్రీవారి దర్శనం పొందనూ లేరు.

సన్మార్గంలో ప్రవర్తించువారు ఎంతదూరాన వున్నా వారికి మార్గము తెలియజేసి తన ప్రేరణతోనే దగ్గరకు రప్పించుకొంటారు అని ఈ సంఘటన ద్వారా మనకు విశదమగుచున్నది. కావున ఎవరికైనా దర్శనం చేసుకోవాలని కోరిక కలిగినప్పుడు ఉన్న చోటనే వుండి తీవ్రముగా ప్రార్థించితే తప్పక ఆ స్వామి ఏదో ఒక విధంగా తన దగ్గరకు చేర్చుకుంటాడు. ఇది సత్యము.

ఒకసారి దత్తక్షేత్రమైన మహోర్‌గడ్‌లో తీవ్రంగా మనోవేదన పడుచున్న ఒక భక్తుని మొరలాలించి తమ దర్శనానికి వచ్చిన పిఠాపురం పండితులను యాత్రలోని భాగంగా మహోర్‌గడ్ వెళ్ళేలాగ సంకల్పించారు. వారి ద్వారా శ్రీపాద స్వామివారు దత్తావతారులనీ, వారు కురువపురంలో

వున్నారనీ తెలుసుకొని యోగానందుడనే బ్రహ్మచారి కొంతమంది సజ్జనులతో కలిసి బయల్దేరి శ్రీపాదులవారి పాద సన్నిధికి ఎట్లు చేరుకొన్నారో తెలుసుకొందాం!" అంటూ ప్రారంభించారు.

యోగానంద స్వామివారు కురువపురం చేరిన విధానం శ్రీ బాబావారిట్లు చెప్పసాగిరి.

**అంకిత భక్తులఎడ సద్గురుని పాత్ర:**

శ్రీపాద స్వామి వారి అనుగ్రహమునకు దూరము – దగ్గర అన్నది లేదు. ఈ విశ్వమంతయు వారి యిచ్చానుసారము వర్తించు చున్నది. నిరంతర నామస్మరణము చేయు భక్తుడెంత దూరమున ఉన్నప్పటికీ వారి దృష్టి అతనిపై కేంద్రీకరింపబడి యుండును. ఆయన అన్ని జీవులను సమముగా ప్రేమించుచున్నను తన అంకిత భక్తుని భారమంతయు తాను స్వయంగా వహించును. ఇందు సందేహములేదు. తల్లికి తనయునియందు అపార ప్రేమ యుండును. ఒక్కొక్కప్పుడు వాడు తప్పు చేసినను దండింపక సమర్థించును. తండ్రి తనయుని దండించినను అతను కోరినవి సమకూర్చును. కానీ గురువు అతనిని పెడమార్గమున పోనీయక నిరోధించును. అతడు కోరినవి ఇవ్వడు. తాను ఇవ్వదలచినవే వానికి శ్రేయస్కరమని తెలుపును. సద్గురువును నమ్మినవారికి తల్లి తండ్రి గురువు అన్నీ ఒకే గురు రూపమే కావున సద్గురునికే బాధ్యతలు మెండు. అంకిత భక్తునిపట్ల సద్గురుడు ప్రేమ,దండన, బోధన శిక్షణ అన్నీ నిర్వహించును. మరియు సంరక్షణా భారము కూడా వహించును. కాబట్టి శ్రీపాదస్వామి దర్శనానికై బయల్దేరిన యోగానంద బ్రహ్మచారి మరియు ఆ భక్త బృందాన్ని చక్కని మార్గంలో నడిపించి తన చెంతకు చేర్చుకున్నారు. వారికి మార్గమధ్యంలో ఎట్టి కష్టాలు, అనారోగ్యాలు దరి చేరకుండా కాపాడినారు.

మహోర్‌గడలో సహ్యాద్రి పర్వతంలోగల శ్రీ దత్తాత్రేయ స్వామి వారి దివ్య సన్నిధిలో నివసించే యోగానంద బ్రహ్మచారి అచ్చటగల వారందరికీ కురుపుర యాత్ర విషయము తెలుపగా అనేకమంది సజ్జనులు శ్రీపాద స్వామివారిని సందర్శించుటకు సంసిద్ధమైరి. అందరూ సుమారు యాభై మంది భక్తులు అయినారు. అందులో కొందరు సాధకులు, బిక్షకులు గూడ గలరు. వారిలో కొందరికి మార్గము సుపరిచితమే. వారు అనేకమైన క్షేత్రాలు దర్శించుకొంటూ అనేక దినములు ప్రయాణించి భీమా కృష్ణా సంగమం (నివృత్తి సంగమం) చేరి అచ్చట స్నానాది అనుష్ఠానములను చేసుకొన్నారు. వారికి అక్కడ "శ్రీదత్త భీమేశ్వరుల" దర్శనం అయ్యింది. వారు అక్కడి నుండి కృష్ణానదికి ఉత్తర తీరంలో ప్రయాణం సాగించి మరుసటి దినము యాత్రా బృందంవారు పంచదేవపహాడునకు చేరుకొన్నారు. ఆ సమయానికి ఆ గ్రామ పెద్ద మరియు ఉత్తమ బ్రాహ్మణుడునైన శ్రీ రామాచార్యుల తండ్రిగారి సంవత్సర తిథి కార్యక్రమం జరుగుచున్నది.

శ్రీరామాచార్యుల తండ్రి పేరు నారాయణాచార్యులు. ఆయన పండితుడు, దాత, ధార్మికుడు. వారి వలన లాభపడిన కుటుంబాలు ఆ పరిసర గ్రామాలలో ఎన్నియోగలవు. వారు పేద బ్రాహ్మణులకు, విద్యాదానము, వివాహములు, అన్నదానములెన్నో చేయించారు. మితభాషి, స్నేహశీలి. గ్రామంలో అన్ని వర్గాలవారితోనూ సమభావంతో ప్రవర్తించే వారు. వారి శరీరం చాలించి ఆ రోజుకు ఒక సంవత్సరమైనది.

అందువలన వారి కుమారులు శ్రీరామాచార్యులు, ఉలికుంతాచార్యులు, మనుమలు ముకుందాచార్యులు, సుదర్శనాచార్యులు అంతా కలిసి వారి బంధు మిత్రులందరినీ ఆహ్వానించి పితృతిథి చేయుచున్నారు. సరిగ్గా కర్మకు విచ్చేసిన బ్రాహ్మణుల భోజనం పూర్తయి బంధుమిత్రులు భోజనమునకు కూర్చుండబోవు సమయంలో మహర్‌గడ్ యాత్రా బృందము ఆ గ్రామమునకు చేరిరి. గ్రామస్థులు వారిని శ్రీరామాచార్యుల ఇంటికి తీసుకొని వచ్చిరి. ఈ విషయం తెలుసుకొని శ్రీరామాచార్యులు వెంటనే వారిని భోజనమునకు ఆహ్వానించిరి. యాత్రికులందరూ వారి ఆహ్వానమును మన్నించి వారింట భోజనము చేసినారు. తదుపరి యోగానంద బ్రహ్మచారి తమ రాకకు నిమిత్తం తెలుపగా, వారి బంధువులలో కొందరు అంతకు పూర్వమే ఈ విషయం విని యున్నారు. అటువంటి దివ్యశక్తి సంపూర్ణుడైన, దత్తావతారుడైన స్వామి ఇప్పుడు ఇక్కడే ఉన్నారని తెలిసింది. వారిని దర్శించాలని మేము కూడా అనుకుంటున్నాము. ఈ యాత్రా బృందముతో మనము కూడా కలిసి ఆ దివ్యమూర్తిని దర్శించుకుందాము పదండి అనగా స్త్రీలు కొందరు మేము కూడా వస్తామన్నారు. అంతా కలసి శ్రీ స్వామి దర్బారు ప్రదేశమునకు బయలుదేరిరి. శ్రీ స్వామివారు నిత్య కృత్యములు, బిక్షమున్నగునవి ముగించుకొని కురువపురము పోవుటకు బయలుదేరుచుండిరి. వీరి రాకను గమనించి శ్రీపాదస్వామి వారితో మీరందరు నేటికి కురువపురము రండి. అచ్చటనే కలుసుకొందుము అని ముందుకు సాగిరి.

అప్పుడు మహర్‌గఢ్ నుంచి వచ్చిన యోగానంద బ్రహ్మచారి యాత్రాబృందమును తోడ్కొని శ్రీరామాచార్యుల కుటుంబ సభ్యులు, బంధువులను తోడ్కొని నది దాటించి శ్రీస్వామి సన్నిధికి చేరుకొనిరి.

కృష్ణానదిలో స్నానములు ముగించుకొని వారందరు కురువపురంలో శ్రీ స్వామి సన్నిధానం చేరుకొని శ్రీపాద స్వామికి మ్రొక్కి సభలో కూర్చుండిరి. శ్రీస్వామి వటవృక్షం క్రింద కూర్చుని వారి నమస్కారములను స్వీకరించి అందరినీ ఆశీర్వదించిరి. అందరిపైనా అపార కరుణ వర్షించే

చల్లని చూపులను ప్రసరింపచేయుచున్న ఆదివ్య సుందర సుకుమార స్ఫురద్రూపియైన శ్రీ స్వామి వారి దర్శనమునకు పులకరించి వారిదివ్య తత్త్వమును వారి లీలలను తెలిసినంతవరకూ మనసులో స్మరించుకుంటూ నిశ్శబ్దంగా ఉన్న తరుణంలో శ్రీ స్వామి సమయస్ఫూర్తితో యోగానంద బ్రహ్మచారిని ఉద్దేశించి ఇట్లు ప్రశ్నించిరి. ఓ! సాధకా! నీ మనసులో ఏదో అడగాలని అనుకొనుచున్నట్లు తోచుచున్నది. శ్రీ దత్తాదేశము మేరకు ఎంతో ప్రయాసకోర్చి ఇంతదూరము వచ్చినావు. నీ సందేహములను తీర్చుకొను అవకాశమిప్పటికి కల్గినది కదా! చెప్పుము. నీవేమి అడగదలచితివో?" అనగానే యోగానంద బ్రహ్మచారి మనసు ఆనంద పరవశమైనది. ఆహా! స్వామి నిజముగా దత్తావతారుడని అన్నందుకిదే నిదర్శనము. నా అంతరంగము వారికి విశదమైనది. వారి పలకరింపునకు అతి సుందరమైన భావనలుప్పొంగి మనసు తన్మయత్వము నొంద గొంతు గద్గదముకాగా "స్వామీ! నా మనసు నెఱిగిన స్వామిని ప్రశ్నించుటకు నేనెంతటి వాడను. ప్రభో! అని ఇంకా నోరు విప్పక మనస్సులోనే తలంచు చున్నంతలో కృష్ణానదికి దక్షిణ తీరమున నున్న రాయచూరు మరియు పరిసర గ్రామవాసులు అదే సమయానికి శ్రీ స్వామి వారిని దర్శించుకోవాలని నదిదాటి కురువపురం చేరి వడివడిగా వచ్చి నిశ్శబ్దంగా సభలో సర్దుకొని కూర్చున్నారు.

శ్రీ స్వామి వటవృక్షం క్రింద కూర్చుని ఉండగా సభలోని వారంతా స్వామిని దర్శిస్తూ ఆనందంతో ఉప్పొంగిపోయారు. సభంతా నిశ్శబ్దంగా వుంది. స్వామి ఏమి చెప్తారో విందామని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. శ్రీ స్వామి చిరునవ్వుతో అందరినీ కలయచూశారు. శ్రీ యోగానంద బ్రహ్మచారి స్వామికి నమస్కరిస్తూ "దేవాది దేవా! దివ్య ప్రభావా! యోగీశ్వరరేశ్వరా! త్రిమూర్తి స్వరూపా! త్రిగుణాతీతా! మా మదిలో హృదిలో నీవే నివసించుచుండగా నీవద్ద మాకు సందేహములన్నవి ఏమి కలవు? కాని మీ వాగమృతము నాస్వాదించవలెనని మనసు ఉవ్విళ్ళూరుచున్నది. సద్గురు ముఖతః మేము తెలుసుకొనవలసినది ఎప్పుడూ వుంటుంది. నాతో వచ్చిన వారందరు శ్రీదత్త భక్తులు, సాధకులు. నిరంతరము ధ్యానముద్వారా సద్గురు యనుగ్రహం పొందకోరువారు అందుచేత సద్గురుని లక్షణములు మరియు సచ్ఛిష్యుల లక్షణములు తమ ముఖతః వినిపించిన యెడల మా సాధన పటిష్టమై మా జన్మ సార్థకత నొందగలదని ఆశపడుచున్నాను. స్వామీ! మాయందు దయతో అనుగ్రహించుడని వినయపూర్వకముగా విన్నవించగా అతని కోరిక ధర్మ సమ్మతమైనదని శ్రీపాదస్వామి ప్రసన్నులైనారు.

శ్రీపాదులందరిపైననూ సంపూర్ణమైన అనుగ్రహ వృష్టి కురిపించు దృక్కులను సారించుచూ చిరుదరహాస ముఖార విందముతో "భక్తులారా! సాధుపురుషులారా! ఈతడడిగిన ప్రశ్న చాలా

ఉదాత్తమైనది. అత్యంత విశిష్ఠమైనది. సద్గురుని లక్షణములు, సచ్ఛిష్యుని లక్షణములను తొలుతగా పరమేశ్వరుడు పార్వతీదేవికి వివరించియున్నాడు. అదియే గురుగీత. తర్వాత ఎందరో ఎన్నో విధముల దాని ప్రభావములను విశదీకరించియున్నారు.

శ్రీకృష్ణ పరమాత్మ తన చెలికాడు, భక్తుడునైన ఉద్ధవునకు చేసిన గీతాబోధ యందు దీనిని మరింత విశదముగా, విపులముగా వర్ణించి బోధించారు. అందరూ శ్రద్ధగా శ్రవణం చేయండి. ముందుగా మీకు సద్గురుని తత్త్వం అవగతమయ్యేలాగున వివరిస్తాను. శంకర భగవత్పాదులిట్లు సెలవిచ్చియున్నారు.

**శ్లో॥ పునరపిజననం - పునరపి మరణం**
**పునరపి జననీ - జఠరేశయనం**
**ఇహసంసారే - బహుదుస్తారే**
**కృపయాపారే - పాహి మురారే।**
**భజగోవిందం - భజగోవిందం**
**గోవిందం భజ - మూఢమతే ।**

మూర్ఖమైన మనసా పుట్టుట, గిట్టుట తిరిగి తిరిగి వస్తూనే వుంటుంది. పుట్టిన ప్రతి జీవి గిట్టకమానదు. తిరిగి తల్లి గర్భములో ప్రవేశించి పుట్టకమానదు. ఇది సకల జీవరాశులకు వర్తించు విషయము. కాని అన్ని జీవరాసులలోను ఉత్తమమైన మానవ జన్మనెత్తినవాడు ఈ విషయాన్ని విచారణచేత తెలిసికొని మానవ జన్మను సార్థకమొనరించుకొనవలెను. అది ఎట్లనగా జననమరణ సంసార చక్రము నుండి తప్పించుకొనుటయే. అనగా మరణము పొందకుండుట. అమృతత్వము సాధించుట. జీవితకాలములో వచ్చు కష్టనష్టములను అపార సహనముతో సహించుట. అది ఎట్లు సహించగలడనగా తనకు గలుగు బాధలకు కష్టాలకు తన పూర్వ కర్మ విశేషములే కారణమని గ్రహించినచో సహనశక్తి కలుగును. అట్లుగాక తన కష్టనష్టాలకు ఇతరులే కారకులని నిందించువారు మరింత పాప కూపములోబడి జనన మరణ చక్రములో తిరుగుచునే యుందురు. దీనికి ముగింపులేదు. కాబట్టి మానవుడు వివేకముతో జ్ఞానముతో తన అజ్ఞానాన్ని దూరం చేసుకోవాలి. తన లక్ష్యం మోక్షంవైపు మరలాలంటే సద్గురువును ఆశ్రయించాలి. తన క్షేమం కోరుకునేవాడు ఇతరులను హింసించరాదు. ద్రోహచింతన కలవానికి శాంతి లభించదు. నిరంతర భీతితో, అశాంతితో ఇంకనూ హింసామార్గములోనే ముందుకు పోతూ వుంటాడు. వివేకుడైన మానవుడు

ఉద్రేకమును ఉపశమింపజేసుకొన్ననాడు సత్పాత్రుడగును. సద్గురు అనుగ్రహంతో, బుద్ధిబలంతో, ఉపాయంతో కర్మ బంధాలనుండి బయల్పడవలెను. ముక్తియనునది ఒకరిచ్చునది కాదు. స్వయం కృషిచేత సాధనచేసి సాధించదగినది. సద్గురు బోధ శ్రవణం చేయనిదే కర్మతత్వము అవగతము కాదు. నిష్కామకర్మ ఎట్లు ఆచరించవలెనో సద్గురు సన్నిధిలోనే నేర్వవలెను. ఆమార్గ నిర్దేశకుడు, దేశికుడు సద్గురువే. ఆ గురుదేవుని ఇట్లు సంభావించదగును.

**గురుర్దేవో పరోధర్మో – గురురేవ పరాగతిః**

**యస్య దేవో పరాభక్తి – ర్యథాదేవో తథాగురు**

**"గురు సబ్రహ్మవిత్‌పరం ప్రేయాదితి వేదాను శాసనమ్"** (శాట్యాయనోపనిషత్)

గురువే శ్రేష్ఠమైన ధర్మము. గురువే శ్రేష్ఠమైన పరము (మోక్ష స్థానము) ఎవనికి దైవమందు అధిక భక్తియున్నదో అట్లే అధికమైన భక్తి, శ్రద్ధ గురువునందుండవలెను. ఇట్లు గురువే దైవమని భావించి భక్తిచేయువాడు (శిష్యుడు) బ్రహ్మము యొక్క నిరంతర భావనచేత తానే బ్రహ్మమగుచున్నాడు. ఇది వేదానుశాసనము. అనగా ఇది వేదముల యొక్క ఆజ్ఞ. సద్గురువునాశ్రయించని వానికి నూరుకోట్ల కల్పములైనను స్వరూప జ్ఞానము కలుగదు. గురూపదేశము పొంది గురుబోధను తలదాల్చి గురువును సేవించువానికి గురుకటాక్ష లేశమాత్రముచేత అతి శీఘ్రకాలములోనే తత్త్వజ్ఞానము అనగా పరబ్రహ్మజ్ఞానం కలుగుచున్నదని ఉపనిషత్ప్రమాణముచేత తెలియబడు చున్నది. కావున విధిగా శిష్యుడు సద్గురుని సేవించవలెను. గురుభక్తి నిరతుడైన వానికి జీవితలక్ష్యమైన మోక్షము కరతలామలకము.

నాయనలారా! సద్గురువు యొక్క అవసరమును పురాణములో చెప్పబడిన విధానమును చెప్పెదను వినుడు.

వేదవ్యాసమహర్షి కుమారుడు శ్రీశుకుడు. పూర్వజన్మ సంస్కార బలంవలన అతడు మాతృగర్భము నుండియే జ్ఞానమును పొంది విష్ణుమాయకు లొంగరాదని నిర్ణయించుకొనెను. తల్లి గర్భము నుండి బయటపడగానే మాయ బంధించును కావున బయల్వెడలక అట్లే వుండెను. కాని దైవసంకల్పము ఎల్లప్పుడు మానవ సంకల్పముకంటే మహత్తరమైనదే. అందువలన ఒక్క క్షణం విష్ణుమాయా విలాసమునకు లోనై నేను మాయ నుండి తప్పుకోగలిగాను అని భావించాడు. "నేను" అనుభావమే మాయ కనుక వెంటనే బయటపడ్డాడు. అతి చిన్నవయసులోనే దిగంబరుడుగ అడవిలోనికి పోయి తపస్సు చేసుకుంటానని తండ్రికి చెప్పి వెళ్ళిపోయాడు. పుణ్యపురుషుడు

కావున ధ్యానస్థితి అబ్బినది. అలా ధ్యానంలో ఉండగానే విష్ణుమూర్తిని దర్శించాలి. వైకుంఠానికి పోవాలి. అనే భావనలు తీవ్రరూపం ధరించాయి. పుట్టుకతోనే శుకునికి పదునాలుగు కళల జ్ఞానం సంప్రాప్తించినది. అంతటి శక్తి సంపూర్ణుడు గనుక తలచినంతనే వైకుంఠ ద్వారం వద్ద నిలిచాడు. ద్వారపాలకులు శ్రీ మహావిష్ణువుకు తమరాక నివేదించి అనుమతి వచ్చిన తదుపరి లోనికిపోనిచ్చెదమని అచ్చటనే ఆపి లోనికిపోయి శ్రీశుకుడు తమ దర్శనానికి వచ్చినారని తెలిపిరి. శ్రీవారి ఆజ్ఞకాలేదు. వారు తిరిగివచ్చి "అయ్యా! తమరు సద్గురువును ఆశ్రయించి, సేవించి, ఉపదేశము పొందని కారణంగా తమకు వైకుంఠ ప్రవేశము లభించదని శ్రీవారు తెల్పినా"రని చెప్పారు. శ్రీశుకుడు తిన్నగా తన తండ్రివద్దకు పోయి తన పరిస్థితిని చెప్పి "తండ్రీ! మీరింత ఘనులైయుండియు మీకడుపున పుట్టిన నాకు గురువు లేరన్న కారణమున వైకుంఠ ప్రవేశమునకు అర్హత లేదన్న విషయం యదార్థమేనా? ఈ విషయమై న్యాయము చెప్పుడని కోరెను.

అప్పుడు తండ్రి కుమారా! ప్రతి సజ్జనుడు సద్గురువును ఆశ్రయించి సేవించి తత్త్వజ్ఞానమును, బ్రహ్మజ్ఞానమును పొందవలెను. నీకు జ్ఞానము పరిపూర్ణముగా లేదు. పదునాలుగు కళలతో పుట్టినావు. మిగిలిన రెండు కళలు సద్గురుని సేవించి పొందుము నాయనా! అప్పుడు నీకోరిక నెరవేరగలదని తెల్పెను. శ్రీశుకుడు అశాంత మనస్కుడై "నాకిపుడు సద్గురువు ఎక్కడ లభించును?" అని ప్రశ్నించెను. తండ్రి "నాయనా! తత్త్వదర్శి, బ్రహ్మ జ్ఞానియైన జనక మహారాజు మిథిలా నగరమును పరిపాలించు చున్నాడు. వినయ సద్గుణ సంపన్నుడవై ఆయన నాశ్రయించి బ్రహ్మ జ్ఞాన ప్రపూర్ణుడవై తిరిగిరమ్ము!" అని ఆశీర్వదించెను.

కుమారుడు "తండ్రీ! ఇదిఏమి వైపరీత్యము! ఒక బ్రాహ్మణుడు, క్షత్రియుని గురువుగా వరించుట శ్రేయస్కరమా! ఆయన నాకు తగిన గురువని తమరు నిర్ణయించి సెలవిచ్చుట విచిత్రముగాను, నమ్మలేనట్లుగాను వున్నదే!" అని ఎదురు ప్రశ్నను వేసెను. తండ్రి "కుమారా! నీ హితముకోరియే ఈ సూచనచేసితిని. నీవాతనిని నిస్సంశయముగా సేవించి బ్రహ్మజ్ఞానము పొందుము. అతడే నీకు తగిన గురుడు. నా వాక్యమునకు తిరుగులేదు. పొమ్ము! అతనిని సేవించి శ్రేయస్సును పొందు"మని తీవ్రముగా పలికెను. శుకుడు చేయునది లేక క్షత్రియుడు బ్రాహ్మణునకు గురువెట్లు కాగలడను అనుమానముతోను అయిష్టతతోను అక్కడివరకు పోయి మనసు అంగీకరించక తిరిగివచ్చెను. తండ్రి మరల నచ్చజెప్పి, బుజ్జగించి, పుత్రుని సుముఖుని చేసి మిథిలకు పంపెను. శుకునికి మనసులో విశ్వాసము లేనందున ఆ రాజు గురించి కొన్ని విచారణలు

చేసి ఆరాజు భోగలాలసుడు, ఇంద్రియలోలుడు అని తెలుసుకొని నేను సర్వసంగ పరిత్యాగిని, నాకు గురువు కాదగిన లక్షణాలు అతనిలో ఏమున్నవి! అని తనలోతాను వితర్కించుకొని తిరిగివచ్చి తండ్రికి కనబడెను. తండ్రి "తప్పదు నాయనా! నీవు ఆయన నీశరణుపొందు"మనగ మిథిలకు పోయెను. రాజువేటకు పోయినాడని తెలిసి హింసా మార్గములోనున్నవాడు నాకెట్లు గురువని తిరిగి వచ్చెను. మరొకసారి రాజునృత్య వినోదములయందనురక్తి కల్గియున్నందున ఇతడు నాకు గురువుగ తగడని తిరిగివచ్చెను. మరియొకసారి ఒక వ్యక్తి రాజు న్యాయ విచారణలో అన్యాయ పక్షమున తీర్పు చెప్పినాడని దూషించగా విని తిరిగిపోయెను. ఇట్లు 12 పర్యాయములు జనక మహారాజును దర్శించకుండానే తిరిగి పోయెను. 13వ పర్యాయము మరల తండ్రి "వేరు గత్యంతరము లేదు. నీవచ్చుటికే పోవలె"నని నిర్బంధించగా మరలపోవుటకు సిద్ధపడెను. శ్రీమహావిష్ణువుయొక్క సందర్శనాభిలాష మెండుగా నున్నందున మనసును కుదుటపరచుకొని బయల్దేరెను.

దారిలో ఒక చిన్న వాగు వేగముగా ప్రవహించుచుండెను. అచ్చట ఒక వృద్ధ బ్రాహ్మణుని రూపంలో నారద మహర్షి శుకునకు ప్రబోధం చేయతలపెట్టి ఒక తట్టలో మట్టితెచ్చి ఆవాగులోపోయుచుండ అది వెంటనే నీటిలో కొట్టుకొని పోవుచుండెను. కొంతసేపు శుకుడు అట్లే చూచిచూచి "ఓ తాతా! ఈ విధంగా నీటికి అడ్డుకట్టవేసి ఆవలి ఒడ్డుకు చేరవలెనన్న ఈ జన్మంతా చాలదు. మొదట కొన్ని కట్టెలు, రాళ్ళు, చెత్తవేసి దానిపై మట్టిపోసిన యెడల కట్ట నిలబడును అని సలహా చెప్పెను. వేదవ్యాసుని ప్రార్థన ప్రకారమున్నూ, శ్రీ మహా విష్ణువుయొక్క ప్రేరణ చేతను శుకుని కార్యోన్ముఖుని చేయ సంకల్పించినాడు కావున నారదుడు (వృద్ధ బ్రాహ్మణుడు) ఇట్లు బదులిచ్చెను. నాయనా! నేను ఈ వ్యర్థమైన పనిలో ఒక్కరోజు కాలమునే వ్యర్థపరచినాను. నామిత్రుడైన వేదవ్యాసుని పుత్రుడు శుకుడనువాడు ఒకడు ఇప్పటికి 12సార్లు ప్రయత్నించి సద్గురు సమాగమం పొందలేక విఫలుడైనందున పుట్టుకతో తనకు సంప్రాప్తించిన 12 కళల జ్ఞాన సంపదను కోల్పోయినాడు. ఇంకా రెండు కళలే మిగిలివున్నాయి. ఇంకేమి ప్రయత్నించి ఫలితాన్ని పొందగలడు? వానికన్నా నేను తెలివి తక్కువవాడను కానని సంతోషిస్తున్నా"నని బదులిచ్చాడు. ఆ మాట విన్న శుకుడు స్పృహ కోల్పోయి కిందపడ్డాడు. కొంతసేపటికి తేరుకొని చూస్తే అక్కడ కాలువలేదు. వృద్ధుడు లేడు. ఆ బ్రాహ్మణుని మాటలు మాత్రం చెవులో గింగుర్లెత్తుతున్నాయి. తన తెలివి తక్కువకు పశ్చాత్తాపపడ్డాడు. సిగ్గుపడ్డాడు. ఈసారి ఎట్లైనా జనక మహారాజును శరణుపొంది గురువుగా వరించాలి అని దృఢ నిశ్చయం చేసుకొన్నాడు.

**పరమార్థ జ్ఞాన సంపాదనకై మనస్ఫూర్తిగ ప్రయత్నించువారలకు మహాత్ముల సహాయం అదృశ్యంగా ఇట్లే లభిస్తుంది.**

శుకుడు మిథిలానగరము చేరి రాజభటుల ద్వారా మహారాజుకు తన రాక తెలియ పరచమని చెప్పుచూ వేదవ్యాస మహర్షి పుత్రుడు శుకమహర్షి వచ్చినారని తెలుపమన్నారు. రాజాజ్ఞ అయ్యేవరకు వేచియుంటానని చెప్పమన్నాడు. తన తండ్రి పేరు చెప్పగానే తనకి రాజదర్శనం వెంటనే లభిస్తుందని భావించాడు. గాని ఎదురు చూడని విధంగా కొంత సమయం అక్కడనే వేచి వుండాలని రాజాజ్ఞయైనది. మామూలుగా తన భావపరంపరలు వెనుకకు మరలమని ప్రబోధిస్తున్నా దారిలో బ్రాహ్మణుడు చెప్పినట్లు ఇప్పుడీ రెండు కళల జ్ఞానమూ కూడా పోతే తాను పూర్తిగా అజ్ఞానియైపోతానని భయంతో అలాగే నిలబడినాడు. కఠోర దీక్షతో ఈసారి పూర్ణత్వాన్ని సాధించాలనుకొని నిర్ణయించుకొన్నాడు. ఆయన నిలబడిన చోటనే పైనుండి రాజప్రాసాదమంతా ఊడ్చి శుభ్రపరచేవారు చెత్తనంతా పోయుచున్నారు. ఇది కూడా లెక్కచేయక ఏకాగ్రదీక్షతో నాకు గురుదర్శనం కావాలని పట్టుదలతో నిలబడ్డాడు. కొన్ని రోజులకు చెత్త కసువులతో కప్పబడిపోయాడు. ఒకనాడు మహారాజు భటులను విచారించి అతడు దృఢ దీక్షతో అట్లేయున్న సంగతి తెలుసుకున్నాడు. అతనిని శుభ్రంగా స్నానం చేయించి నూతన వస్త్రములు కట్టించి తనవద్దకు తోడ్కొని రమ్మని ఆజ్ఞాపించారు. భటులట్లు శుకుని తోడ్కొని వచ్చు వేళకు మహారాజు తాను హంసతూలికా తల్పమున పరుండియుండెను. ఒక సుందర యువతి ఒక కాలు ఒత్తు చుండగా మరియొక కాలు మండుచున్న కుంపటిపై నుంచి దర్శనమిచ్చెను. శుకునికి ఈ దృశ్యము చాలా భరింపరానిదిగ కన్పించి మరలిపోవలెనను సంకల్పము కలిగెను. కానీ తనకు 12 కళల జ్ఞానము వృథాపోయిన సంగతి జ్ఞప్తికి వచ్చెను. అట్లే నిలబడియుండెను. జనకుడు శుకుని పలకరించి "బ్రాహ్మణోత్తమా! ఏమి కోరికతో వచ్చితివి? నిస్సంకోచముగా కోరుకొనుము! నీ కోరిక నెరవేర్చగలవాడ"నని అభయమిచ్చెను. శుకుడు నోరువిప్పకముందే ఒక భటుడు వచ్చి పట్టణమంతయు అగ్నికి ఆహుతియగుచున్నదని తెల్పెను. రాజు "కానిమ్ము! దైవసంకల్పమెట్లున్న అట్లే యగును!" అనెను. మరికొంతసేపట్లో ఒక భటుడు వచ్చి "రాజ ప్రాసాదము కూడ అగ్నికి ఆహుతి యగుచున్న"దని తెల్పెను. సరే! "దైవ సంకల్పము నెరవేరుగాక!" అని రాజనెను. ఈ వార్త విన్న శుకుడు వెంటనే మరలిపోవుటకు లేచెను. జనకుడాతని చేయిపట్టి ఆపి ఎక్కడకు పోయెదవు? అనెను. "ఓ! మహారాజా! ప్రజలను రక్షించవలసిన వాడవు ఇట్లు నీ భోగము నీకున్న చాలుననుకొని వారికేమాత్రము సాయము చేయలేదు. మరి నేను గూడ చనిపోవుచున్నా నీవు ఇట్లే పోనీయమందువని ముందుగానే తప్పుకొనుచున్నాను" అని సమాధానమిచ్చెను.

ఓయీ! శుకుడా! నా పట్టణము నా ప్రజలు రాజప్రసాదములు మండిపోయినా నేను ధైర్యముతోనున్నాను. నీకు ఆస్థి ఏమీ లేదు. నీ ప్రాణములుపోవునేమోనని భయపడుచున్నావు. నీవు త్యాగివా? నేను త్యాగినా? యని ప్రశ్నించగా శుకుడు సిగ్గుతో తలవంచుకొనెను. భటులను పిలిచి ఈ బ్రాహ్మణుడు మనకు అతిథియై వచ్చినాడు. కావున మన ఊరిలో గొప్ప ఉత్సవము నేర్పాటు చేయుడని ఆజ్ఞాపించెను. ఆ నగరము తగులబడుట అంతయూ వట్టిదేనని శుకునకు అప్పుడు తెలిసెను.

మహారాజు దండనాథుని పిలిచి శుకుని చేతికి ఒక నిండైన పాలపాత్రనిచ్చి అందుండి ఒక్క చుక్క పాలు క్రింద పడినను తక్షణమే అతని శిరస్సు ఖండించమని ఆజ్ఞాపించెను. శుకునితో యిట్లు పలికెను. ఈ పాలపాత్ర తీసుకొని నీవు నగరములో నీకొరకు చేయబడు ఉత్సవములు తిలకించి రమ్మని పంపెను. శుకుడు నరగమంతా తిరిగివచ్చిన పిదప మహారాజు ఇట్లు పలికెను. "ఓయీ బ్రాహ్మణోత్తమా! నీవంటే మాకు ఎనలేని గౌరవము. అందుకే ఈ ఉత్సవము ఏర్పాటు చేసితిమి. బాగుగా జరిగినదా! లోపమేమియూ లేదు కదా! మీకు సంతోషమైనదా?" అని ప్రశ్నించెను. అప్పుడు శుకుడు "రాజా! నీ ఉత్సవమేమైనదోగాని నా చేతిలోని పాల పాత్రనందుండి చుక్క పాలు చిందకుండా, నా తల ఎగిరిపోకుండా కాపాడుకొనుటయందే నా మనస్సు లగ్నమైనది. ఆ ఉత్సవమేమియు నేను చూడనే లే"దని సమాధానమిచ్చెను. మహారాజిట్లనెను. "ఓ! పుణ్యపురుషుడా! ఇన్ని వింతలూ నీ ఏకాగ్రతను చెరుపలేకపోయినవి కదా! అట్లే నేనెన్ని భోగముల మధ్యనున్నను, వీటియందు విరాగినై యున్నానని నీవెందుకు అంగీకరించలేవు? అని ప్రశ్నించెను. మృత్యువు నిరంతరము కాచుకొనియున్నది. మృత్యువును జయించిన అమృతత్వము సిద్ధించును. అహంకారమే మృత్యువు! దానిని విడనాడినచో దేనిని మృత్యువు కబళింపగలదు? ఉన్నదంతా అమృతత్వమే! అమృతపుత్రుడైన మానవుడు అహంకారమువలన మృతుడగుచున్నాడు" అని అతని మనస్సును శుద్ధపరచి బ్రహ్మవిద్యనుపదేశించెను. శుకుడు గురూపదిష్టమైన విద్యను ధారణచేసి పూర్ణజ్ఞానియై తండ్రిని దర్శించెను.

తండ్రి కుమారునితో "పుత్రా! గురువెట్లున్నాడ"ని ప్రశ్నించెను. కుమారుడేమియూ మాట్లాడలేదు. "సూర్యునివలె ప్రకాశించు చున్నాడా?" అని తండ్రి ప్రశ్నించెను. దానికి శుకుడు "తండ్రీ సూర్యునివలె ప్రకాశమున్నది కాని అందు వేడిమిలేద"ని తెల్పెను. అట్లయిన "చంద్రునివలె చల్లగానున్నాడా!" అని ప్రశ్నించెను. కుమారుడు "అవును. చల్లదనమున్నది కాని చంద్రునివలె మచ్చలేద"ని అన్నాడు. అట్లయిన "మరి గురుడెట్లున్నాడందువు"? అని తండ్రి ప్రశ్నించెను. అప్పుడు

శుకుడిట్లు అనెను. "తండ్రీ! గురువును దేనితోనూ పోల్చలేము. గురువుతో సమానమైనది ఈ ప్రపంచ సృష్టిలోనే లేదు. తండ్రీ! ఒక్క మాటలో చెప్పవలెనన్నచో గురువు గురువువలెనే ఉన్నాడు" అనెను. తండ్రి ఆశీర్వదించి "కుమారా! విష్ణు సందర్శనమునకే గురూపదిష్టమై యుండిన మాత్రమే అర్హత కలదన్నచో అంతకుపైన మోక్షమును సాధించుటకు సద్గురుని ఆవశ్యకత ఎంతయుండునో తెలియవచ్చెనా!" అనెను.

శ్రీపాదవల్లభులు ఈ విషయాన్ని చక్కగా ప్రబోధించి ఇట్లు పలికిరి. "సాధు సత్పురుషులారా! గురువును వరించాలన్నా, సేవించాలన్నా, ఆశ్రయించాలన్నా, గురు సన్నిధిలో వర్తించాలన్నా, వారి అనుగ్రహం పొందాలన్నా శిష్యుడైనవాడు ఎన్నో లక్షణములను సంపాదించుకోవాలి. ఈ విషయమును రేపు వివరించెదను.

నేటికి విశ్రాంతిని పొందండి!" అని తన వెంట ఉన్న సేవకులతో వారికి తగిన ఆహారం ఏమైనా ఏర్పాటు చేయమనగా అతడు భక్తులు స్వామివారికి సమర్పించిన ఫలములన్నింటిని అందరికీ అందజేసెను. ఆశ్చర్యముగా అవి అక్కడ ఉన్న భక్తులందరికి సరిపోయినవి. మరియు ఆప్రసాదము ఆరగించిన భక్తులకు అది లఘు ప్రమాణంతో ఉన్నప్పటికి కడుపునిండి తృప్తి అయినది. ఇది శ్రీగురు అనుగ్రహంతో మాత్రమే ఇట్లు జరిగినదని అందరూ అమ్మహిమను కొనియాడి నిదురించిరి.

పంచదేవ పహాడ్ గ్రామస్థులు స్త్రీలతో సహా తిరిగి వారి గ్రామమునకు చేరుకొనిరి. ఇతర గ్రామాల నుండి వచ్చిన భక్తులు అచ్చటనే నిద్రించి మరుసటి దినము తిరిగి వెళ్ళిరి అని వివరిస్తూ శ్రీస్వామి విఠలానంద సరస్వతీ మహరాజ్ వారు శ్రీపాద శ్రీవల్లభస్వామి వారికి జయజయ ధ్వానములు సలుపగా మేము కూడా శ్రీస్వామి వారికి జయకారము లొనర్చితిమి.

మహాత్ములు ఘటనా ఘటన సమర్థులనే నమ్మకం మనలను ఆధ్యాత్మికంగా ముందుకు తీసుకుపోతుంది. పిఠాపురవాసులనేకాదు మనందరం గూడ కురువపురం రావాలంటే ఒక మార్గ దర్శకుడు కావలసియే వుండును. శ్రీశ్రీశ్రీ విఠల్‌బాబాగారి ద్వారా శ్రీపాదుడు సంకల్పించి శ్రీక్షేత్ర శ్రీవల్లభపురం నిర్మాణం చేయించినందున ఇప్పుడు మార్గం సుగమం అయ్యిందని

శ్రీపాద చరణం – శరణం శరణం, సద్గురు చరణం శరణం శరణం.

శ్రీపాద చరణం శరణం శరణం.. శ్రీ విఠల్ చరణం శరణం శరణం"

అంటూ నామస్మరణం చేశాం.

# 21వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

## మహిమలు

శ్రీపాదస్వామివారి సన్నిధానంలో నిత్యమున్నూ సత్సంగములు, బోధలు, శాస్త్ర వివరణలు జరుగుచున్న, యోగ, ధ్యాన రహస్యముల ప్రబోధములు జరుగుచుండేవని శ్రీ విఠల్‌బాబాగారు వివరిస్తున్న అతి సులభమైన ధోరణి మాకందరకు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కల్గించి ఇంకనూ వినవలెనను కుతూహలమును పెంచుచున్నది. అదే విషయాన్ని తెలుపుకొని శ్రీబాబాగారి సన్నిధిలో ఒక రోజున చేతులు జోడించి నమస్కరించి స్వామీజీ! శ్రీపాద స్వామివారు సాక్షాత్ లోక కల్యాణం కొరకు అనగా జీవుల ఉద్ధారం కొరకు అవతరించినారు. మానవులేగాక ఇక్కడ పశు పక్ష్యాదులు క్రూర జంతువులు గూడ ఉద్ధరించబడిన వివరాలేమైనా దర్శనమిస్తే స్వామి లీలలు వినాలని కోరుచున్నాము" అని ప్రార్థించగా శ్రీ బాబాగారు చిరునవ్వులతో ఇట్లు వచించారు.

"ఎక్కడైనా మహాత్ములను ఆశ్రయించిన జంతువులు, పక్షులు వృక్షాలు గూడ తప్పక ఉద్ధరించబడతాయి" అని కన్నులు మూసికొని ఇట్లు ప్రార్థన చేయసాగినారు.

"దేవాదిదేవా! శ్రీకరా! శుభకరా! లోకకల్యాణమునకై ఈ భువిలో అవతరించిన శ్రీపాద శ్రీవల్లభా! దయాసాగరా! తమ అవ్యాజకరుణకు పాత్రులమైన మమ్ము ఉద్ధరించి బ్రోచే పరమాత్మా! నీ లీలలు ఊహింపనలవి కానివి. అతి చిత్రాతి చిత్రములు. సర్వాతీత గుణాత్మకా! మము అనుగ్రహించుమయ్యా దేవేశా!" అని ప్రార్థించి అట్లే కన్నులు మూసుకొని దర్శించుచూ ఆ విషయములను ఈ విధంగా ప్రవచించినారు.

### శ్రీపాదుల మహిమలు

శ్రీదత్తావతారులైన శ్రీపాదస్వామివారి దర్బారు సకల జీవజంతువులకు నిలయమే! మానవులు, పొరపాటున మహాత్ముల సన్నిధి, కృప మన కొరకేనని భావిస్తారు. అది పొరపాటు అని ఈ సంఘటన వలన తెలుస్తున్నది. వారి దృష్టిలో సకల జీవులు సమానమే!

ఒకరోజు శ్రీపాదస్వామివారు భక్తులెవ్వరూ ఇంకారాని సమయంలో ఒక్కరే అశ్వత్థవృక్షం క్రింద కూర్చుంటే రెండు నాగుపాములు వచ్చి నమస్కరించి వారికి ఏదో తమ బాధలు, విన్నపాలు గూడ వినిపించి ఆదేశాలు, ఆశీర్వాదాలు పొందుటకై వేచియున్నవి. దూరం నుండి ఈ దృశ్యాన్ని

దర్శించిన వారు ఆశ్చర్యపోతూ శ్రీ స్వామి వద్దకు రావడానికి భయపడుతు దూరంగా నిలబడినారు. శ్రీ స్వామి "మీరు పొండి!" అని ఆ నాగులను పంపివేశారు. తర్వాత భక్తులు దగ్గరకు వచ్చారు.

భక్తులను చూచి శ్రీ స్వామివారు ఇలా చెప్పినారు. "అన్ని జీవరాసులకు గూడ అనేక ఇబ్బందులు, కష్టాలు వుంటాయి. మానవులకే కాదు బాధలుండేది. అన్ని జీవరాశులయందు దయతో వుండుటయే అసలైన మానవత్వం. తమకు మాత్రమే సుఖం కావాలనుకొనే వారు స్వార్థపరులు. ఈ సృష్టిలోని జీవులన్నింటికీ అధినేత పరమాత్మయే. ఆయనే సర్వస్వతంత్రుడు. జీవులన్నీ పరతంత్ర జీవులే! భగవత్సంకల్పం లేనిదే ఒకరికొకరు అపకారంగానీ ఉపకారంగానీ చేయుటకుదరదు. తలలో మాత్రమే విషం కలిగిన సర్పాలను విష పురుగులంటారు. మానవ రూపంలో వుంటూ నిలువెల్ల విషం నింపుకొని ద్వేషంతో ఎదుటివారికి కీడును సంకల్పిస్తూ నిరంతరం దుష్టమైన ఆలోచనలతో వుండేవారు ఈ సర్పాలకన్నా హీనులే అని చెప్పవలెను. వాటికి ఎటువంటి హాని రాకుండా చూచుకొనేటందుకై ఆత్మరక్షణకై భగవంతుడు ఏర్పాటు చేసినదీ విషం. కావున ఏ జీవులనైనా శత్రుత్వ భావనతో చూడకుండా పరమ ప్రేమను పెంచుకొంటే విష జంతువులు గూడ హాని చెయ్యలేవు" అని బోధించారు.

యోగులు, మహాత్ములను ఆశ్రయించి సకల జంతువులు, పక్షులు గూడ లాభాన్ని పొందుతాయి అని ఈ సంఘటన ద్వారా మనకు విశదమగుచున్నది. ఎందుకంటే మానవునిలోని దివ్యత్వాన్ని మానవుడు గ్రహించేకన్నా ఇతర జీవులే త్వరగా గ్రహిస్తాయి. కారణం మనవలె మానవుడేగా అని మానవుడు భావిస్తాడు కాబట్టి గ్రహించలేడు. రెండు పెద్ద పులులలకు సద్గతి ప్రసాదించి మానవులుగా జన్మింపజేసిన దివ్యలీల మీరు వినియున్నారు గదా!

ఒకసారి శ్రీ స్వామివారు దర్బారు దీర్చి అనేకులకు బాధల నివారణకు ఉపాయములు బోధించుచున్న సమయంలో కిలకిలరావములతో పక్షుల సమూహము మూకుమ్మడిగా వచ్చి శ్రీ స్వామి వారి చుట్టున్నూ అక్కడున్న సభలోని వారి చుట్టూనూ తిరుగుచూ రొదచేయ నారంభించినవి. శ్రీ స్వామివారు ప్రసన్న దృక్కులతో వాటిని వీక్షించుచు చేతితో అభయ ముద్రను చూపుచూ "భయపడకండి.. అభయం" అని నోటితో వాటికి అభయమిచ్చారు. సభలోనివారు పక్షుల గోలకు మీరు భయపడవద్దని శ్రీ స్వామి మాకే చెప్పుచున్నారని భావించి ఆ పక్షుల గోలకు మేమెందుకు భయపడతాము అనుకొంటున్నారు. అంతలో ఆ పక్షులన్నీ ఒక్కసారిగా ఎగిరి దూరంగా పోయినవి. తర్వాత శ్రీ స్వామివారు సభలోనున్న ఇద్దరు వ్యక్తులను దగ్గఱకు పిలచి, దూరంగా కనబడే ఒక

అశ్వత్థ వృక్షాన్ని చూపి, ఆ చెట్టు క్రింద నున్న వ్యక్తులను నేను రమ్మన్నానని పిలుచుకు రమ్మని పంపించారు. వారుపోయి ఆ చెట్టును నఱికేటందుకు ప్రయత్నిస్తున్న ఆరుగురు వ్యక్తులను పిలుచుకొని వచ్చారు. వారు శ్రీ స్వామివారిని చూస్తూనే వచ్చి సాష్టాంగ నమస్కారం చేశారు.

వారితో స్వామి వారు “ఏమయ్యా! ఎందుకా వృక్షాన్ని నఱికే ప్రయత్నం చేస్తున్నా?”రని అడిగారు. వారు కాస్త భయంతోనే వంట చెఱకు కొరకు నఱికేస్తున్నామని చెప్పారు. అప్పుడు శ్రీ స్వామివారు వారికీ విధంగా నచ్చజెప్పారు. “నాయనలారా! వేలాది పక్షులకు ఆవాసమైనది, అనేక జనులకు నీడనిచ్చేది, సాక్షాత్తు నారాయణ రూపమైనది రావిచెట్టు. వంట చెఱకుకొరకు మరియే ఇతర ముళ్ళ చెట్లనో నరికి తెచ్చుకొనండి. కానీ దేవతా వృక్షాలను మాత్రం నఱకరాదు. మఱ్ఱి, మేడి, జువ్వి, రావి, వేప, జమ్మి, మామిడి, మారేడు, నేరేడు ఈ తొమ్మిది వృక్షాలకు కేవలం ఎండిపోయిన కొమ్మలను త్రుంచుకోవాలి కాని పచ్చని చెట్లను నఱికితే మీ వంశాంకురాలు నష్టపోతారు. ఆ పక్షుల నివాసాన్ని చెడగొట్టి పాపం మూటకట్టుకోవద్దు. మొక్కలు నాటి నీరుపోసి పెంచితే అవి ఎంత చక్కగా పెరుగుతుంటే మీకు ఆయురారోగ్య సంపదలు పెరుగుతాయి. ఈ రకంగా తప్పు చేయకుండా మంచి మార్గాన నడవండి. సుఖశాంతులతో జీవించం”డని వారికి హితవాక్యాలు పలికి వారిని కొంతసేపు అక్కడ కూర్చుండజేసినందులకు సభలోని వారందరికీ ఆశ్చర్యకరమైన ధర్మ ప్రబోధం చేయటం జరిగింది. అందరూ శ్రీ స్వామివారికి నమస్కరించి “దేవదేవా! మాపాలిటి భాగ్యమై తమరిక్కడకు వచ్చినారు. కన్నబిడ్డలకు చెప్పినట్లు మాకు హితము బోధించి”నారని స్వామివారిని స్తుతించి తిరిగి పోయినారు.

ఈ విధంగా శ్రీపాదుల ప్రబోధం విశదీకరించి శ్రీ విఠల్‌బాబాగారు పశు, పక్షి, జంతు సంతానము అంతా మాకు సమానమే. కానీ మానవుల దృష్టి స్వార్థ దృష్టి. భగవంతుడు మన కొరకే వృక్షాలను, ఆహార ధాన్యాలను, కూరగాయలను జలచరాలను సృష్టించాడని స్వార్థంతో వాటన్నింటినీ తిన్నంత తిని ఇంకా కూడబెట్టుకొంటాడు. ఇతర జీవులు అలాగాక ఆకలికి దొరికినదేదో కావలసినంత తిని రేపటి ఆలోచన అనేది లేక నిశ్చింతగా వుంటాయి. అందుకే వాటికి రోగాలు అతి తక్కువగా వస్తాయి. వస్తే పూర్వకర్మల ప్రభావమేగాని అవి ఈ జన్మలో ఏ విధమైన దుష్కర్మలను చేయవు. మానవునికి గల జ్ఞానాన్ని వినియోగించి వాటిని ప్రేమించి చక్కగా పోషించి సకల కార్యాలకు ఆ జంతువులను ఉపయోగించుకొనవచ్చును. ప్రేమ, విశ్వాసములతో అవి యజమానికి సేవలు చేస్తాయి” అని మరింత వివరంగా మాకు బోధించి “జై శ్రీపాద శ్రీవల్లభ

మహరాజ్‌కీ జై"అని ముగించారు.

మనం ఎవరికి వారమే జీవజంతువులపట్ల ప్రేమతో వున్నామా? లేదా? ఒకవేళ వాటిని మనం పోషించటం సాధ్యంకాకపోయినా, మనస్సులో సర్వజీవులు సుఖంగా వుండాలనే నిత్యం ప్రార్థిస్తున్నామా? లేదా? అని పరిశీలించుకొంటూ జీవకారుణ్యం కలిగి ఉంటే చాలు – అదే పది వేలు!"

## భక్తుల వెల్లువ

శ్రీపాద శ్రీవల్లభుల వారి దర్శనార్థం పండరీపురం నుండి ఒక దర్జీ పని చేయునతడు తన భార్య మరికొందరు బంధువులను కలుపుకొని యాత్ర చేయుచూ వచ్చి చేరుకొన్నారు. శ్రీ స్వామివారు దర్బారునకు చేరు సమయానికి వారందరూ వచ్చి మ్రొక్కి శ్రీవారు ఆసీనులైన తర్వాత వారందరినీ కూర్చుండమని సైగ చేయగా కూర్చుండిరి. ఎక్కడి నుండి వచ్చినారని శ్రీ స్వామివారు ప్రశ్నించగా వారిని శ్రీ పాండురంగ విఠల భట్టుగారు ప్రేరణచేసి పంపించినారని తెలిపినారు. అయ్యా! నా పేరు విజయుడు. ఈమె నా భార్య. మాకు సంతానము కలుగక చాలాకాలము నుండి వ్యధ పడుచున్నాము. ఆ సజ్జనుడు తమ వద్దకు పొమ్మని సూచన చేయగా మా బంధువులందరితో కలిసి వచ్చినామని తెలిపినాడు. శ్రీస్వామి వారు ప్రసన్నులై ఆతని భార్యను దగ్గరగా పిలచి వారి ముందు వున్న పండ్ల నుండి ఒక పండును ఆమె ఒడిలో వేసి ఇది ఇప్పుడే ఇక్కడే తిను. తర్వాత నీకు సంతానం కలుగుతుంది అని ఆశీర్వదించినారు. ఆపూట వారందరికీ భోజన వసతిని పంచదేవ పహాడు వాస్తవ్యులు కల్పించారు.

వారు శ్రీ స్వామి సన్నిధిలో నిత్యం సేవించుకొంటూ తర్వాత ప్రతిరోజు వారి వంటలు వారే చేసుకొంటూ వారు తినుటయే గాక వచ్చిన వారికి గూడ ఆదరించి ఆకలి తీర్చుచూ కొంతకాలం వున్నారు. వారుండగానే షోలాపూరు నివాసి వస్త్ర వ్యాపారి పద్మశాలీయుడైన ఏకనాథ సోమ అనువారు తన కుటుంబముతోను కొందరు బంధువులతోను శ్రీ స్వామి వారి దర్బారుకు చేరినారు. శ్రీ స్వామివారిని దర్శించుకొన్నాడు. తన బాధలన్నింటినీ శ్రీ స్వామి వారికి నివేదించుకొన్నాడు.

అతడు సజ్జనుడు మరియు నిష్ఠా నియమములతో భగవదారాధన చేయువాడు. అతనికి ఎనిమిది మంది సంతానం. నలుగురు ఆడపిల్లలు, నలుగురు మగ పిల్లలు. వారిలో ఇద్దరు ఆడపిల్లలకు, ఇద్దరు కొడుకులకు వివాహాలైనవి. కానీ వారి వ్యాపారము నందు నష్టము వాటిల్లినది. కుటుంబములో అందరికీ కడుపునిండా భోజనము లభించని పరిస్థితి యేర్పడి నిస్సహాయుడనై

పండరీ క్షేత్రమునకు పోయి పాండురంగ విఠలునికి విన్నవించుకొన్నాడు. ఆ దేవాలయమందుగల పూజారి శ్రీ రామానంద పూజారి అనువారు శ్రీవారి వద్దకు పొమ్మని సలహాను చెప్పుటయేగాక వారితో లోగడ ప్రయాణించిన శిష్యుని గూడ తోడుగ పంపి శ్రీ స్వామి దర్శనమునకు మార్గము జూపెను. "హే! దేవదేవా! సద్గురు దేవా! తమరే మాకు రక్ష. మేము పాపములే చేసితిమో పుణ్యములే చేసితిమో మాకేమీ ఎఱుకలేదు. ఈ సంసార సాగరమును ఈదలేని స్థితిలో తమ పాదాల చెంతకు చేరినాము. తమరే మాకు దారిజూపి కాపాడే దైవం" అని ప్రార్థించగా శ్రీ స్వామివారు అంతకు ముందుగానే అచ్చటికి చేరియున్న పండరీపురవాసి విజయునిచేత వీరందరికీ అన్న సమారాధన చేయించినారు.

రెండు రోజులు ఈ రకంగా వారంతా దర్బారు ప్రదేశంలోనే గడిపిన తదుపరి అందరికీ శ్రీస్వామివారు ఆశీస్సులు ప్రసాదించి మీరు మీ స్వస్థానములకు చేరుకొనుసరికి మీకుగల బాధలు తొలగిపోయి శుభములు చేకూరును. ఈ ప్రదేశము మహాత్ముల తపోభూమి. మీ పాపములన్నియు భస్మమైపోయినవి. ఇక మీరు ధర్మ మార్గావలంబులై పుణ్య సంపాదన చేసుకొమ్మని అందరికీ తిరుగు ప్రయాణమునకు అనుమతిని ప్రసాదించగా "దిగంబరా.. దిగంబరా.. శ్రీపాదవల్లభ దిగంబరా" అను మంత్రమును అందరూ స్మరించుచూ తిరుగు ప్రయాణమైనారు.

ఈ విధంగా సుదూర ప్రాంతములవారు వచ్చినారని, శ్రీ స్వామివారు కోరిన వారికి కోరినవి ప్రసాదిస్తున్నారని దగ్గర దగ్గర ఊర్లలోని వారికి అవగతమైనది. తొలుత స్వాములంటే గొప్ప గొప్ప బ్రాహ్మణ కులంవారు, లేక పండితులు మాత్రమే వారిని పూజిస్తారనే భావంతో ఇతర కులాలవారు దూరంగా వుండేవారు. క్రమంగా అందరికీ ఇక్కడ ఉండే స్వామి అందరు స్వాముల లాంటివాడు కాదనీ, అన్ని కులాలవారినీ ఆదరిస్తాడనీ, అందరికీ వరాలిస్తున్నాడనీ ఈ సంఘటనల ద్వారా తెలియవచ్చింది. ఆ తర్వాత జనులు తండోపతండాలుగా వచ్చి శ్రీ స్వామివారికి తమ కష్టాలు, ఇష్టాలు చెప్పుకొని వాటికి పరిష్కారం పొందుతుండేవారు. అందులో మంగలి, హరిజనులు, గౌడులు, రెడ్డి కులస్తులు, ముదిరాజులు, గిరిజనులు, వైశ్యులు, పల్లెకారులు, కుమ్మరివారు, వడ్రంగులు మొదలగు సకల కులములవారున్నూ వచ్చి శ్రీపాద స్వామివారి దర్బారులో నిండి యుండి ఒకరితో ఒకరు ప్రేమతో వ్యవహరించుటకు నేర్చుకొనిరి. ఒకరి నొకరు ద్వేషించుట, విమర్శించుటను పరిహసించుటను మానుకొని గౌరవించుట శ్రీ స్వామివారి ప్రబోధంలో నేర్చుకొన్న నూతన పద్ధతి. దీనివలన ప్రతి పల్లె యందును సుఖశాంతులు నెలకొన్నవి.

ఇట్లు దూరము, దగ్గర అన్నది లేక చుట్టుపట్టు గ్రామాల వారందరూ శ్రీ స్వామి సన్నిధానంలో గడిపి వెళ్లేవారు. శంకర భట్టు అనే కన్నడ బ్రాహ్మణుడు వచ్చి సద్గురు సన్నిధికి చేరిన తర్వాత స్వయంగా అతడు అందరూ తెచ్చిన బియ్యం పప్పులతో ఆహార పదార్థాలు తయారు చేయుట అందరూ తినగా మిగిలిన దానిని కృష్ణానదిలో జలచరములకు వేయుట జరుగుచుండెడిది.

శ్రీ స్వామివారు కురువపురంలో వున్నారని రాయచూరు చుట్టు ప్రక్కల ప్రాంతాలన్నింటికీ తెలిసింది. ఎక్కువగా నదిలోనీరు లేనప్పుడే వారికి వీలు కుదిరేది. అటువైపు నుండి భక్తులు ఎక్కువగా రాసాగినారు. శ్రీ స్వామివారు మధ్యాహ్నం వరకు దర్బారులో వుంటారు. కావున కురువపురంలో భక్తులు సాయం సంధ్యవేళల్లో దర్శించుకొనేవారు. శ్రీ స్వామివారికి తపోభంగం కలగకుండా ఆ గ్రామస్థుల సలహాప్రకారం దూరంగా వంటలు వార్పులు చేసుకొని భుజించేవారు.

అనేకమంది పక్షవాత రోగులు, కుష్ఠురోగులు గూడ వారిని దర్శించేవారు. శ్రీ స్వామివారి యొక్క దృష్టి సారించుటతోనే వారికి ఆరోగ బాధ తీవ్రతలు తగ్గేవి. వారిని కృష్ణానదిలో స్నానంచేసి మేడిచెట్టుకు ప్రదక్షిణలు చేసి పొమ్మని చెప్పి ఆజ్ఞాపించేవారు. వారంతా మరుసటి రోజుదయాన్నే శ్రీ స్వామి ఆజ్ఞను పాటించి స్నానాలు, ప్రదక్షిణలు చేసి తిరిగి పోవునప్పటికే రోగాలు మాయ మయ్యేవి. కురువపురంలో రాత్రివేళలందు ఎవరూ వుండరాదని తొలి రోజులలో శాశించారు. తదుపరి బదరీ క్షేత్రం నుండి వచ్చిన యాత్రా బృందంలోని ఒక బ్రహ్మచారి నిత్యానందుడను వాడున్నూ, మాహూర్‌గడ నుండి వచ్చిన బృందంలోని సత్యానందుడనువాడున్నూ శ్రీ స్వామివారికి సేవలు చేయు నిమిత్తం కురువపురమునకు చేరినారు. వారు సమయమునకు శ్రీ స్వామి వారికి కావలసిన సేవలు మాత్రమే అందిస్తూ వారి తపస్సుకేమాత్రం ఆటంకం లేకుండా దూరంగా వుంటూ గ్రామంలో భిక్షచేసి తెచ్చుకొని వండుకొని తింటూ వారి సాధనను వారు కొనసాగించు కొనేవారు.

భక్తులు దర్శనార్థం వేళగాని వేళల్లో వచ్చేవారికి హితవచనాలు చెప్పి వారిని ఓదార్చి ఎక్కడ వుండాలో అక్కడ వుంచుతూ శ్రీ స్వామికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూచేవారు. ఆ కృష్ణానదిలో నీరే అమృతంవలె రోగ నివారణ జరిగేది. ఆ మేడి చెట్టే కల్పవృక్షంవలె కోరికలు తీర్చేది.

ఇప్పుడు కూడ శ్రీక్షేత్ర కురువపురంలోను, శ్రీక్షేత్ర శ్రీవల్లభాపురంలోను శ్రీపాద స్వామివారు నదియందునూ, మేడిచెట్టు (ఔదుంబరం) నందునూ లీనమైయుండి కష్ట నివారణ, అభీష్ట పూరణ చేస్తున్నారనేది నిత్యసత్యము.

శ్రీపాద శ్రీవల్లభుల వారిని దర్శించుటకు నిత్యము అనేకమంది పండితులు పామరులు వచ్చేవారు గదా! శ్రీ స్వామివారు గహనాతిగహనమైన యోగ విషయాలుకాక అతి సులభంగా అర్థమయ్యేవిధంగా ఏమైనా బోధించినారా! దయతో వివరించండని మేము ఒకనాడు శ్రీ బాబాగారిని కోరగా వారు ఇట్లు వివరించారు. ఒకనాడు శ్రీపాదస్వామి సామాన్య భక్తులకు ఇలా భక్తి ప్రబోధం చేశారు.

ధార్మికులారా!

మానవులందరూ సహజంగానే దుఃఖాలు వద్దనుకొంటారు. సుఖాలను కావాలనుకొంటారు. ఎల్లప్పుడూ సుఖమే అనుభవించాలని కోరుకొంటారు. కానీ అసలు కిటుకు (కీలకము)ను తెలియలేకున్నారు. దుఃఖ కారణములను తెలుసుకొని వాటిని దూరం చేసుకొనే ప్రయత్నం చేయరు. వారు నిరంతరం పరనింద, దుష్టచింతన చేస్తూ, ఎవరి వలననో తమకు దుఃఖం కలిగించబడినదని వాపోవుచుంటారు. తమరియొక్క కర్మఫలానుభవమే దుఃఖమునకు కారణమని తెలిసి దానిని నివారించుకొనుటకై భగవత్ప్రార్థనతోపాటు సత్సంగము, సన్మార్గవర్తనము అలవరచు కోవాలి. సుఖాలు అని దేనినైతే భావిస్తూ అవి కావాలని కోరుకొంటున్నారో అవి అసలైన సుఖాలు కావు. అవి శరీరానికి, మనసుకి సుఖం వలె క్షణమాత్రం తోచి మరుక్షణంలో మాయమవుతాయి. కాబట్టి అసలైన సుఖాన్ని పొందడానికి సన్మార్గాన్ని అవలంభిస్తే నిత్య సుఖం లభిస్తుంది.

నిత్యానిత్యములను విచారించుకొని నిత్యమైన దానితో (పరమాత్మతో) సహవాసం అనగా చింతనం చేయుట చేత జీవుని శాశ్వతత్వం తెలియవస్తుంది. అనిత్యమైన, అసత్యమైన విషయాల సంగమే దుఃఖానికి మూలకారణం. పట్టు పరుపులు గూడ సుఖాన్ని ఇవ్వలేవు. సుఖం గాని దుః ఖంగానీ వాసనల వలననే ప్రాప్తిస్తాయని విచారణ చేత వివేకంచేత తెలుసుకొన్న వానికి సంసారం ఏవిధంగానూ బంధనం కానేరదు. కాబట్టి మనస్సును చెప్పు చేతలలో ఉంచుకొనేందుకు కష్టపడాలి. మనస్సును జయిస్తే (లొంగదీసుకొంటే) ఇంద్రియాలన్నీ స్వాధీనంలోనికి వస్తాయి.

"మన యేవ మనుష్యాణాం – కారణం బంధమోక్షయోః" అను సూత్రం ప్రకారం మానవుని బంధించడానికి గానీ విముక్తి కలిగించడానికి గానీ మనసే కారణం అని తెలుసుకోవాలి. మనసు చేసే వృత్తులను (ఆలోచనలను) కనిపెట్టాలి. అది అక్కరలేని ఆలోచనలు చేస్తుంటే నియంత్రించాలి. ఆలోచనల దారి మళ్ళించి భగవంతుని గురించియు, భగవద్భక్తుల గురించియు ఆలోచింపజేయుట ద్వారా సుఖ దుఃఖాలనబడు ద్వంద్వాల నుండి విముక్తి లభిస్తుంది. అదే బంధ విముక్తి అంటారు. ఇది చాలా సులభ మార్గమే. సంసారులు తమ బాధ్యతలను వదులుకొని అడవులకు పోవ పనిలేదు.

ఉన్నచోటనే వుండి ఈ సూత్రాలను పాటిస్తే బంధములు లేని జీవన విధానం మీకు అలవాటు పడుతుంది. భగవంతుని లీలలుగా ఈ సమస్తం దర్శించగలుగుతారు అంటూ సంసారులకు తరించే మార్గాన్ని శ్రీపాద శ్రీవల్లభులు బోధచేసి సన్మార్గం చూపించారు అని శ్రీ విఠల్‌బాబాగారు ఆ ప్రబోధాన్ని వివరించారు. తదుపరి మరియొక ప్రబోధం ఇలా చెప్పారు.

శ్రీవిఠల్‌బాబాగారు 'శ్రీపాద శ్రీవల్లభులకు జై' అని ప్రార్థనచేసి "తండ్రీ! నీ లీలలు అమోఘం. నీవే పలికించువాడవు. పలుకువాడవు" అంటూ చేతులు జోడించి ఇట్లు చెప్పసాగారు.

శ్రీపాద స్వామివారు చేసిన జ్ఞానబోధలు అనేకం వున్నాయి. అందులో కొన్నింటినైనా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాము. ధార్మికులారా! శ్రీపాదులవారు ఒకనాడు దర్బారులో చేరిన సమాన్యమైన భక్తులకీవిధంగా జ్ఞాన బోధను అతి సరళంగా అర్థమయ్యే లాగున చేశారు.

"నాయనలారా! భక్తులారా! వేదాంత బోధనలు ప్రతివారికీ ఒకే విధంగా మనసులోనికి జొరబడవు. కావున సులభమైన పద్ధతిలో మీకు భగవంతుడు దొరుకుటకు ఉపాయము తెలుపు తాను వినండి అని ఇలా చెప్పారు.

భగవంతుని నిరంతర చింతన చేత మీమీ పనులు సర్వము చేసుకొనుచునే భగవంతుని సన్నిధిని మీరు అనుభవించవచ్చును. నిరంతర స్మరణము చేసే వారి యొక్క యోగక్షేమములు నేను చూచుకొంటానని శ్రీ గీతాచార్యుడు భగవద్గీతలో అర్జునుని నిమిత్తంగా చేసుకొని అందరికీ బోధించారు. అది ఎట్లనగా

**"అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే।**

**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం॥ (భ.గీ)**

"అన్యచింతన లేక నన్నే చింతించువాని యొక్క యోగక్షేమములను నేను పరిరక్షిస్తాను" అన్నాడు భగవంతుడు. యోగమనగా దుర్లభమైనది లభించుట. క్షేమమనగా ఆ లభించిన వస్తువు చేయి జారిపోకుండ రక్షించుటయని భావము. దీనికి అనేక రకముల స్థాయిలలో అర్థం చెప్పు కొనవచ్చును. ధనము చేకూరుట యోగమే. విద్యలు లభించుట యోగమే. జ్ఞానము లభించుట యోగమే. ఇవన్నీ కష్టపడి సంపాదించుకోవలసినవే. అయితే కష్టపడి సంపాదించుట ఒక ఎత్తు. దానిని సంరక్షించుకొనుట మరీ కష్టమైన పని. సంపాదించిన దానిని పెంపొందించుకొనుట, రక్షించుకొనుటతోనే జీవితమంతా గడచిపోవును. మోక్షమార్గం లభించకుండానే జీవితం అంతమైపోయినచో మరల మానవ జన్మ లభించునన్న నమ్మకం లేదు అని పెద్దలు వచించినారు. శాస్త్రాలు చెప్పుచున్నాయి.

కావున అందరికీ ఒకే సూత్రము వర్తించు విధముగా భగవానుడీ విషయం విడమరచి సులభసూత్రంగా అందించాడు. ఏ చింతనము లేకుండా భగవచ్చింతనము సాధ్యమా? అని ప్రతి వారికి సందేహం వస్తుంది. అసలు చింతనము అంటే ఏమిటి? మనసు చేసే పని. మన మనసు నిరంతరం దేనినో చింతిస్తూనే వుంటుంది. దేనినీ చింతించకుండా ఒక్క క్షణం కూడ వుండదు. మరి అలాంటప్పుడు దేనిని చింతన చేస్తుంటుంది? అని ఎవరికి వారు మనసును గమనిస్తుంటే తెలుస్తుంది. అది చేసే పని (చింతన) అనేక విషయాలు భూత, భవిష్యత్, వర్తమాన కాలములలోని విషయాలనే అది చింతిస్తుంది. దాని చింతన ద్వారా మనకేమి లాభమా? నష్టమా? అనుకొంటే పొరపాటే. అది చేసే ఆలోచనల ఫలితమే మనకు పుణ్యకర్మ లేక పాపకర్మ అని రెండు విధాల కర్మలను సంపాదించి పెడుతుంది. దాని చింతనము క్షణక్షణం మారిపోతూవుంటే ఏ విషయానికీ బలం వుండదు. అన్నీ గాలిలో కలసిపోతాయి. కార్యరూపం ధరించవు. బలమైన ఆలోచనలు (దృఢ సంకల్పాలు) మాత్రమే కార్యరూపం ధరిస్తాయి. అక్కరకు పనికొస్తాయి. అటువంటప్పుడు ఈ పనికిరాని ఆలోచనలు ఎందుకు చెయ్యాలి. ఇతర చింతనలు వదిలేసి భగవంతునే నిరంతరం చింతించాలి. అట్లు భగవంతునే నిరంతరం చింతిస్తూ కూర్చుంటే మన పనులు కావద్దా? అనే ప్రశ్న వస్తుంది. ఈ సందేహం కలగడం సహజమే. మీ మనసులకు రెండు పనులు చేసే శక్తి వుంది. దీనికి ఒక ఉదాహరణ తెలుపుతాను. వినండి. అంటూ ఇలా చెప్పారు.

మీరు మీ యింట్లో నుండి బయల్దేరి ఒక నిర్ణీత సమయానికి ఒక పెళ్లికి వెళ్ళవలసి వుంటుంది. మీరు ఆ విషయమునే ఆలోచించుతూ మీ పట్టుచీర, నగలు అన్నీ పెట్టెలో నుండి బయటకు తీసి ఒక చోట పెట్టుకొని స్నానానికి వెళ్ళారు. తర్వాత వచ్చి చూస్తే ఆ ప్రదేశంలో అన్నీ వున్నాయిగానీ ఒక్క నగ మాత్రం కనిపించలేదు. తలుపులన్నీ వేసి వున్నాయి. ఎవ్వరూ లోనికి రాలేదు. అయినా ఒక్క నగ మాత్రమే కనిపించలేదంటే విచిత్రమే. కానీ ఏమి చేయవలె! అక్కడ వున్న వస్త్రాలు, నగలు ధరించుకొన్నారు. కనబడని నగ కొరకు గదంతా వెతికారు. మరలా ఒకసారి పెట్టెలోగూడ వెదికారు. పెట్టెలోవున్న వస్తువులన్నీ తీసి బయటపడవేసి మరలా సర్ది పెట్టారు. అయినా ఆ నగ కనిపించలేదు. నిరాశా, నిస్పృహలతో కూర్చుంటే ఏమి ప్రయోజనం? సమయానికి పెళ్ళికి అందుకోవాలి గదా! సరే వచ్చిన తర్వాత మరల తీరికగా వెదకుదామనుకొని లేచి పెళ్ళికి బయలుదేరినారు. నిర్ణీత సమయం మించిపోతే లగ్నానికి అందుకోలేరు. మీరు వెళ్ళకపోతే ఆ పెళ్ళి ఆగిపోయేటంత పరిస్థితి. అంత ముఖ్యమైన వ్యక్తి మీరు. అప్పుడేమిచేస్తారు. వెంటనే బయల్దేరి పెళ్ళికి లగ్న సమయానికి చేరుకొంటారు. కానీ వెళ్ళుచున్నంతసేపూ మీ మనసు

దేనిని చింతిస్తూ వుంటుందంటే ఆ కనబడని నగను గురించే చింతిస్తూ వుంటుంది. పెళ్ళి వద్దకు చేరినారు. పెళ్ళికూతురికి ఇవ్వవలసిన కట్నాలు, కానుకలు ఇచ్చారు. అక్కడ పలకరించిన వారితోనెల్లా మాట్లాడారు. అన్ని కార్యక్రమాలు కంటితో చూస్తూ మాటలు, మంత్రాలు చెవితో వింటూన్నారు. కానీ మనసులో మాత్రం ఆ "నగ" ఏమైయుంటుంది? కనబడకుండా ఏమైయ్యింది. నేను అక్కడే పెట్టాను గదా! ఇంతలో ఎవరూ రాలేదే! ఆ నగ ఎలా పోతుంది? ఎక్కడపోయింది? ఇంటికి త్వరగా వెళ్ళి మళ్ళీ జాగ్రత్తగా వెదకాలి. దానిని ఫలాని చోట చేయించాను. అనుకొంటూ మళ్ళీ మళ్ళీ చింతిస్తూనే వుంటారుగదా! ఇక నగ గురించిన ఆలోచన తప్ప వేరే ఆలోచన మనసుకు రాదు. ఎందుకంత ఆలోచన చేయాలి? అంటే అది చాలా విలువైనది. ఎంతో కష్టపడి సంపాదించు కొన్నది అంటారు. మళ్ళీ ఇంటికిపోయి దానికొరకు వెదుకుతారు. అది దొరకిందంటే ఎనలేని సంతోషం. ఒకవేళ నిజంగా అది దొరకలేదనుకోండి. తీరని దుఃఖం.

ఇందువలన మనకు తెలియవచ్చేదేమిటంటే మీ మనసుకు రెండు రకాల శక్తి యున్నది. అది ఒక విషయాన్ని చింతిస్తూనే ఎదురుగావున్న పనులను కూడ చక్కబెడుతుంది. 'నగ' ను చింతిస్తూ పెళ్ళిలో అందరికీ సమాధానం చెప్పివచ్చినట్లు. ఆ సమయంలో అది రెండు పనులు చేసినట్లు మనకు తెలుస్తుంది. అంతేగాక విలువైన వస్తువు దొరకకపోయినందున నిరంతర చింతన గూడ చేసింది. అంటే "అనన్య చింతన"మన్నది దానికి తెలుసు అనే సత్యాన్ని తెలుసు కోండి. ఆ చింతనతోనే భోజనం చేసిందీ మీరే! ప్రయాణించి ఇంటికి చేరిందీ మీరే! కావున భగవంతుడనే విలువైన వస్తువును మీకు కనబడని ఆ నిధిని లేక సన్నిధిని ఈ భౌతికమైన నగను ధ్యానించినట్లు ధ్యానించగలిగితే, చింతించగలిగితే అదే అనన్య చింతనం కాగలదు. మీమీ పనులు చేసుకోవచ్చు. నగను చింతించారు గానీ అది దొరకవచ్చును. దొరకకనూ పోవచ్చును. భగవంతుని చింతనం ఆ విధంగా చేయగలిగితే మీరు పోగొట్టుకున్న జ్ఞాన రత్నముతో సహా బాహ్యసంపదలన్నీ గూడ మీకు ఎంత ఇవ్వాలో ఎంత సమకూర్చాలో భగవానుడు సమకూర్చుతాననీ, సమకూర్చిన సంపదను సర్వదా సంరక్షిస్తాననీ మనకు సర్వకాలాలలోను అండగా నిలుస్తానని వాగ్దానం చేసి యున్నాడు.

దీనిని శోధించి సాధించండి. సఫలీకృతులుకండి. అదియే మానవ జన్మకు సార్థకత. ఈ భోగములు, భాగ్యములు భగవానుడే ఇచ్చినాడు. దీనిని తనివితీర అనుభవించండి. కానీ "ఇది నాది" అనే భావన వుంటే కర్మలు అంటుకొనును. నీది కాదనే భావనతోనైతే కర్మలు పరమార్థంగా మారి జన్మ జన్మల బంధాలను తొలగించి పరిశుద్ధులను చేస్తాయి. చేయు పనులన్నీ

(కర్మలన్నీ) భగవదార్పితంగా చేస్తే జీవుడు ముక్తుడౌతాడు అని ప్రబోధించారు స్వామి.

ఈ ప్రబోధము చేయుచున్నప్పుడే ఒక సాధువు అవధూత అయిన సిద్ధయోగి అనువాడు ఒక్కడే వచ్చినాడు. మధ్యలో మాట్లాడకూడదని దూరం నుండియే నమస్కరించుకొని కూర్చున్నాడు. తదుపరి కొంతమంది యాత్రికులు, సన్యాసులు, బ్రహ్మచారులు, అంతా కలసిన బృందం వారు వచ్చి నమస్కరించి కూర్చుండినారు. వారందరినీ కనుచూపులతోనే పలకరించుచూ శ్రీ స్వామి అందరినీ ఆశీర్వదించినారు. అంతలో శ్రీవారి ప్రవచనం సాధకులకు ఉపయోగకరంగా సచ్ఛిష్య లక్షణములను వివరిస్తూ వెలువడింది.

శ్రీపాద స్వామివారి అమృతవాక్కులు తనివి తీర విని భక్తులు, సామాన్య ప్రజలు అందరూ ముగ్ధులైనారు. ఇంత విపులంగా రసవత్తరమైన ఉదాహరణముతో నిత్య జీవన విధానమును పారమార్థిక మార్గంలో నడుపుకొను ఉపాయమును సరళంగా బోధించిన శ్రీపాద స్వామి వారిని చూచి చేతులు జోడించి "ఓ! సద్గురూ! దేవదేవా! ప్రణవ స్వరూపా! నీవు సామాన్య యతివి కావు. సాక్షాత్ పరబ్రహ్మవే! ఆకారముదాల్చిన సద్గురుడవు నీవు! నీ దర్శన, స్పర్శన, సంభాషణములతో మా జీవితము ధన్యమైనదని స్తుతించి సాష్టాంగ వందనములు చేశారు.

సభలోని వారందరూ "జయము జయము గురు రాజ మౌళీ"

"శ్రీపాద శ్రీవల్లభ స్వాముల వారికి జయము జయము" అని దిక్కులు పిక్కటిల్లేటట్లు కీర్తించిరి.

ఆ రోజు సభ ముగింపు జేయు సమయమునకు కొందరు భక్తులు వచ్చి అన్న సమారాధన చేసిరి. శ్రీ స్వామికిన్నీ అచ్చటనే భిక్ష సమర్పించుకొనిరి. శ్రీపాద స్వామివారు అతి స్వల్పముగా భిక్ష స్వీకరించి వారి విచిత్ర పద్ధతిలో కృష్ణానదిని దాటి కురువపురం చేరుకొనిరి. భక్తులంతా తమ తమ నివాసములకు పోయినారు. ఈ స్వామివారి ప్రతి ఉపన్యాసమున్నూ రవిదాసు అను రజకుడు తప్పకుండా శ్రవణం చేసేవాడు. అతనికి జ్ఞాపకశక్తి మెండు. శ్రీ స్వామి వారి బోధలన్నింటినీ మననం చేసుకొని జీర్ణించుకొనే వాడు. కొత్తవారికి తానే వినిపించేవాడు.

"శ్రీపాద రాజం శరణం పపద్యే" దిగంబరా.. దిగంబరా.. శ్రీపాదవల్లభ దిగంబరా అంటూ శ్రీ బాబాగారు నామం పలికి అందరితో పలికించారు. పెద్దలు మనలను ఉద్ధరించేటందుకు వారి అనుభవాలతో శాస్త్ర వాక్యాలను జోడించి రంగరించి మనకు అమృతపానం చేయిస్తారు. మెలకువ కలిగి జీవితాన్ని నడుపుకోమని బోధిస్తారు. వారి వాక్యాలను తలదాల్చి జీవితాలను పండించుకొందాము. **"జై గురుదత్తా"**

# 22వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభ స్వామినే నమః

## సచ్ఛిష్యుడే - సద్గురువు

ఒకనాటి సాయంకాలము శ్రీ విఠల్‌బాబాగారిని దర్శించడానికి చాలామంది భక్తులు వచ్చియున్నారు. అందరు వారికి నమస్కరించి కూర్చుండగానే శ్రీ బాబాగారిలాగన్నారు. శ్రీపాద శ్రీవల్లభస్వామి వారి దర్బారు ఇలాగే నిత్యమూ వచ్చి సేద దీర్చుకొని పోయే భక్త సమూహంతో కళకళలాడుచుండేది. "ఒక ఊరి మొత్తానికి ఒక్క సజ్జనుడున్నా చాలు. వాని కొరకు దేవుడు వర్షం కురిపిస్తాడు. ఊరిలోని వారందరి పొలాలు పండి ఊరి ప్రజలంతా సుఖసంతోషాలనుభవిస్తారు అని ఆర్యోక్తి గలదు. అలాగే శ్రీపాదస్వామి వారి బోధలు ఏ ఒక్క జిజ్ఞాసి కొరకో ప్రవచించబడినా అవి అక్కడ చేరిన భక్తులందరికీ ఎంతోకొంత అర్థమవుతాయి. జ్ఞానబీజాలు వారి మనస్సులో నాటబడతాయి. అవి ముందు జన్మకైనా మొలకెత్తుతాయని మహాత్ముల నమ్మకం. చాలామంది భక్తులీనాడు ఇక్కడకు వచ్చియున్నారు. ఎవరికి ఎంత ఉపయోగపడుతుందో ఈ రోజు ప్రబోధం జాగ్రత్తగా వినండి. అనేకమైన రత్నాలు, మణి, మాణిక్యాలు ఇక్కడ రాసులుగా పోయబడియున్నాయి. ఎవరికి ఏ రత్నం చిక్కుతుందో! ఏ మణి దొరుకుతుందో! దొరికించుకొనే వారి యోగ్యతపై ఆధారపడి వుంటుంది. వినండి! అని ఇట్లు ప్రార్థన చేశారు.

"శ్రీదత్తా! త్రిమూర్త్యాత్మకా! బాలోన్మత్త పిశాచరూపములతో మహా యోగులను గూడ మోహింప జేసెదవు. సామాన్యులకు నీ అనుగ్రహముతో ప్రసాదించు సౌమ్య దర్శనమునకై దేవతలు గూడ తహతహలాడెదరు. నీవు మహా నటుడవు. మాయనీ సహచరి. స్వకీయమైన మాయచేత రూపమును ధరించెదవు. ఈ జగత్తు నీకు క్రీడారంగము. ఎప్పటికి ఏ పాత్రను ఏ విధముగా పోషించవలెనో నీకు తప్ప ఎవ్వరికీ తెలియదు. దీనులమైన మాయందు కృపతో నీవు భక్తులకొసగిన జ్ఞానమును మాకు దర్శింపజేసి కృతార్థులను జేయుము" అని ప్రార్థనచేసి, కన్నులు మూసి, కొన్ని క్షణాలుండి తదుపరి ఇట్లు చెప్పసాగినారు.

ఆ రోజు గురువారము. గురుభక్తులైన వారికి పర్వదినము. యోగానంద బ్రహ్మచారియు ఆయనతోవచ్చిన యాత్రికులేగాక పంచదేవపహాడ్ గ్రామస్థులు కొందరు, శ్రీరామాచార్యులు, ఆంజనేయ శర్మ, మున్నగు వారందరూ వేకువనే లేచి కాలకృత్యాలు, స్నానాదులు ముగించుకొని

గురుదర్శనం కొరకు శ్రీపాదులవారి దర్బారు ప్రదేశమునకు చేరుకొని శ్రీ స్వామివారి రాక కొరకు ఎదురుజూచుచున్నారు. శ్రీ స్వామి వారి మహిమల గూర్చియు, వారి దయాగుణము, ధర్మనిరతి గూర్చియు ఒకరితో నొకరు పరస్పరం చెప్పుకొనుచూ వారి నామస్మరణము చేయుచూ వుండిరి. శ్రీ స్వామి వారు వచ్చి ఈ రోజు జ్ఞానబోధ చేయగలరని అందరూ చంద్రునికొరకు చకోరము వలె కాచి కొనియుండిరి.

ఆ సమయంలో శ్రీపాద శ్రీవల్లభస్వామి వారు తమ నిత్యానుష్ఠానము పూర్తిచేసుకొని అక్కడి నుండి తిన్నగా నడుచుకొనుచూ దర్బారు ప్రదేశమునకు వచ్చు చుండిరి. యోగానంద బ్రహ్మచారి లేచి ఎదురేగి సాష్టాంగ వందనమాచరించి "శ్రీపాద శ్రీవల్లభస్వామి వారికి జయము.. జయము" అని జయజయ నాదములు చేయగా అందరునూ శ్రుతి కలిపిరి. యోగానందుడు తమ వాగమృతముకొరకు వేచియున్నామని చేతులు జోడించెను. శ్రీపాద శ్రీవల్లభస్వామి చిరు నవ్వులు చిందిస్తూ వచ్చి తమ స్థానములో ఆసీనులై ఆర్యులారా! సాధువులారా! మీకిప్పుడు శిష్యులకుండవలసిన లక్షణములను శ్రీకృష్ణ పరమాత్మచేత ఉద్ధవునకు బోధింపబడిన వానిని వివరించెదను. ఆ నవ లక్షణములున్నూ నవరత్నములు. శిష్యుడుకష్టపడి ఆ నవరత్నములను సంపాదించి సమకూర్చుకొని మాలగా చేసి ధరించవలసియున్నది. జాగ్రత్తగా వానిని పరిశీలించి మీకు యే రత్నములభించునో దానిని భద్రపరచుకొనుడు. సాధనచేత సాధ్యము కానిదేమున్నది? కావున ఇప్పటి నుండియే సాధనను ప్రారంభించండి అని ఇట్లు చెప్పిరి.

గురుసేవ నాలుగు విధములుగా నుండును. (1) స్థాన శుశ్రూష (2) అంగ శుశ్రూష (3) భావ శుశ్రూష (4) ఆత్మ శుశ్రూష.

(1) స్థాన శుశ్రూష యనగా శ్రీగురుదేవుని యాశ్రమమునుగాని గృహారామములనుగాని పరిశుభ్రపరచి, భద్రపరచి రక్షించుట. గురుదేవులు ఏ ఏ ప్రదేశముల కరిగి భక్తులకు జ్ఞానబోధ చేయునో అట్లు తాను గూడ ఆయా ప్రదేశముల వారికి జ్ఞానబోధ చేయుచు గురుస్మరణలో సర్వులు తరించునట్లు ప్రబోధించుట.

(2) అంగ శుశ్రూషయనగా గురువు యొక్క దేహమును సేవించుట, రక్షించుట (తన ధనమును వారి సేవకుపయోగించుట). గురుమూర్తి ఎట్లు తన తపోధ్యానములచే పవిత్రీకరించు కొనిరో అట్లే శిష్యుడు గూడ తన శరీరమును పవిత్రీకరించుకొనుట.

(3) భావ శుశ్రూషయనగా గురుదేతల్లి, తండ్రి, సమస్తముయని భావించుట. శ్రీ గురుదెట్టి

భావముతో పరమేశ్వరుని సేవించునో తాను నట్టి భావముతో గురుని భావించుట.

(4) ఆత్మ శుశ్రూషయనగా శ్రీగురువున కిష్టమగు పదార్థములను కోరకయే తెచ్చి యిచ్చుట. గురుని భావమెఱిగి ప్రవర్తించుట. గురుదేవుడెట్లు పరబ్రహ్మ స్థితిలో స్థిరముగా ప్రకాశించుచున్నాడో తానును స్వస్వరూపమును సర్వాత్మ భావముతో భావించుచు బ్రహ్మ జిజ్ఞాస నలవరచుకొనుట.

ఇక సచ్ఛిష్య లక్షణములను వివరముగా తెలిపెదను శ్రద్ధాళువులై వినండి. ఇవి నవరత్నము లుగా చెప్పబడినవి. ఈ లక్షణములు తొమ్మిది:

| | | |
|---|---|---|
| ప్రథమ లక్షణం | : | అహంకార రాహిత్యము (అకించనత్వము) సన్మానములకు దూరముండుట. |
| ద్వితీయ లక్షణం | : | నిర్మత్సరత్వము (మత్సరము లేకుండుట) |
| తృతీయ లక్షణం | : | దక్షత (సోమరితనము లేకుండుట) |
| చతుర్థ లక్షణం | : | నిర్మమత్వం (మమకార రాహిత్యము) |
| పంచమ లక్షణం | : | గురుసేవా పరాయణత్వం (సర్వస్య శరణాగతి) |
| షష్ఠమ లక్షణం | : | నిశ్చలత్వము (చంచలం లేకుండుట) |
| సప్తమ లక్షణం | : | పరమార్థ జిజ్ఞాస (తనకున్న స్థితికన్నా ఉత్తమ స్థితిని పొందవలెనను అభిమతం) |
| అష్టమ లక్షణం | : | అనసూయత్వం (అసూయలేకుండుట) |
| నవమ లక్షణం | : | పవిత్ర సత్యభాషణం (ప్రతి వాక్కు పవిత్రమైన, సత్యమైనది, శుద్ధియైనదిగా వుండుట) |

1) అకించనత్వము : శిష్యుడు సంపాదించుకొనవలసిన నవరత్నములలో ఈ రత్నము మొదటిది. శిష్యుడనువాడు గౌరవము, సన్మానములకు తన మనసును ఆలోచనలను బహుదూరముగా నుంచవలెను. సన్మానమునకు మనసున తావిచ్చినచో దానివెంట అవమానములను గూడ భరించవలసి యుండునని వివేక జ్ఞానముతో తెలిసి ఎల్లప్పుడు మానావమానములపట్ల నిర్లిప్తుడై యుండవలెను. ఎట్టి గొప్పదనము అతనికి ఆపాదింపబడినను అతనిలో అహంభావము విజృంభించి గురుకృపకు దూరమొనరించునని పూర్తి నమ్మికతో తెలుసుకొని సన్మానమును దూరముగా ఉంచును. సన్మానము నందు ప్రీతి కలిగినచో దేహాభిమానము వృద్ధి చెందును. దానివలన శిష్యుడు పరమపద సోపాన పటమునందు పెద్దపాము నోటబడినట్లు తన స్థితిని పూర్ణముగా కోల్పోయి

ప్రథమ సోపానమునకు (అధమస్థితికి) చేరును. ఇది తెలిసినవాడు సన్మానములనినచో సంకటములని యెఱుగవలెను. తన నామ, రూపములకు ఏ మాత్రం విలువలేదని, ఉండరాదని నిశ్చితాభిప్రాయముకలిగి ఒక పిచ్చివానివలెగాని, అమాయకునివలెగాని వుండుటకిష్టపడును.

చోరులు వెంటపడగా శ్రీమంతుడు దాగినట్లు సన్మానములను జూచి సచ్ఛిష్యులు దాగుకొని తానంటూ ఒకడున్నాడని లోకులకు తెలియకుండ గుప్తంగా తన పనిని (సాధన) తాను నిర్వర్తించును. ఆ విధంగా సన్మానాపేక్షలేని వానికి అవమాన భయమున్నూ ఉండదు. "నేను – నాది" (అహంకార, మమకారములు) వదలవలసిన ముఖ్యమైన భావములు. గురుకృప పొందుటకు ఈ లక్షణం ఎంతో ముఖ్యమైనది.

దీనిని అభ్యసించలేనివాడు నిరంతరం ఆత్మస్తుతి చేసుకొంటూ అర్థ, స్వార్థ లోభ గుణాలన్నింటికీ లోనుకాగలడు. ఆ వెనుకనే అవమానములు, అపనిందలు వెన్నంటి ఎంతటి సాధకుడినైనా యోగభ్రష్టుని చేస్తాయి.

కావున సచ్ఛిష్యులు, సద్గురువులు గూడ సన్మానములను, ప్రశంసలను, పొగడ్తలను ప్రజా బాహుళ్యములో గుర్తింపును నిరసించెదరు. ఈ సృష్టియంతయూ భగవానుని లీలా విలాసమే కావున ఎవరు నమస్కరించినా అది పరమాత్మకే చెందుతుందనే దివ్య సంకల్పంతో ఉంటారు. తాను అతి చిన్న వాడినని, ఏమీ తెలియని వాడిననీ భావించుకొని గురు శుశ్రూషను మాత్రము చేయుచుండవలెను. ఈ విధంగా కష్టపడి ఈ అకించనత్వమను ప్రథమ రత్నమును సాధించవలెను.

**2) ద్వితీయ లక్షణం :** 2వ రత్నం : నిర్మత్సరత్వము (మత్సరము లేకుండుట) రెండవ లక్షణమైన నిర్మత్సరత్వము గూర్చి వినుడు. ప్రథమ లక్షణమైన అకించనత్వమును సాధించుచు రెండవ లక్షణమైన నిర్మత్సరత్వముతో సానపెట్టబడవలెను. జీవనరంగములో ఈ సాధనలో అనుకూలములకన్నా ప్రతి కూలములే ఎక్కువగా వుండును. ప్రతి కూలములను తన కుశాగ్ర బుద్ధితో (బుద్ధి కుశలతతో), గురుకృపతో దృఢ చిత్తముతో తనకు అనుకూలములుగా మార్చుకొన వలసియున్నది. శిష్యుడు తనకు గలిగిన జ్ఞానాన్ని పురస్కరించుకొని ఇతరులపట్ల వైరభావనలు పెంచుకొంటే పరస్పర వైరం పెచ్చుపెరిగి ఉన్నత స్థితి నుండి క్రిందకు త్రోసివేయ బడతాడు. ప్రథమ లక్షణంలో చెప్పిన అకించనత్వము పునాదిగా వుంటే రెండవ లక్షణమైన నిర్మత్సరత్వం అనే సౌధం నిర్మాణం కావించ బడుతుంది. సౌధము నిర్మించునప్పుడు అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. కొన్ని తొలగించాలి. కొన్ని సమకూర్చాలి అట్లే లక్ష్య సాధనలోగూడ తొలగించవలసిన,

వదలించుకొనవలసిన గుణములలో (1) దేహాభిమానము (2) జ్ఞానాభిమానము సాధకునికి లేక శిష్యునికి హృదయాంతర గుహలో సూక్ష్మ రూపములుగా నిలచియున్నను ప్రమాదకరమే. జ్ఞానాభిమానము మహాత్ములను, జ్ఞానులను గూడ లొంగదీసుకొనగా వారి తపశ్చర్య ఫలితమంతా బూడిదలో పోసిన పన్నీరువలె వ్యర్థమైన సందర్భములు పురాణములందు చాలగలవు. ఉదాహరణకు విశ్వామిత్రుడు తపస్సును వృథాపరచుకొన్నాడు. దుర్వాసుడు, అంబరీషుడు యందు దోషారోపణ చేసి శపించి తానే చిక్కులలో పడెను. కాని అంబరీషుని అంకిచనత్వము, నిర్మత్స రత్వమును సాధించిన వాడు గావున శాపముల నుండి రక్షించబడెను.

కావున మొదటి లక్షణము సంపూర్ణముగా సాధించబడెనో లేదో రెండవ లక్షణమును సాధించు వేళలో తెలియబడును. అకించనత్వముగలవారు కావుననే విష్ణుమూర్తి అంబరీషుని శాపము లన్నింటినీ భరించి చేప, తాబేలు, పంది వంటి నీచ జన్మలు ఎత్తుటకు సిద్ధపడెను.

కావున నిర్మత్సరత్వమును సంపూర్ణముగా సాధించాలంటే "మత్సరము" యొక్క నిజ స్వరూపము తెలియవలెను. మత్సరమనగా ఓర్వలేనితనం. దీనికి స్థాయీ భేదాన్నిబట్టి అసూయనీ, ద్వేషమనీ అనేక పేర్లున్నాయి. **ఎదుటివారికి లభించిన సంపద ప్రతీదీ తనకు కావాలనుకోవడం ఆశ. తనకున్నది ఎదుటివారికి ఉండగూడదనేది ద్వేషం. తనకు లేనిది ఇతరులకు ఉంటే ఓర్చలేకపోవడం అసూయ. ఈ గుణాల సముదాయమే మత్సరము. దీనిపై విజయం సాధించాలనుకొనేవారు ఇతరులు నిందా వాక్యాలతో వేధించునప్పుడు అపార సహనశక్తితో నిలబడాలి. సచ్ఛిష్యులు ఆ నిందలను హితవాక్యాలుగా స్వీకరించగలగాలి.**

**3) తృతీయ లక్షణం:** దక్షత (సోమరితనము లేకుండుట): ఏ శిష్యునికైనా వుండవలసిన లక్షణము దక్షత. సద్గురువు నాశ్రయించి ఆత్మోన్నతిని పొందగోరు శిష్యుడు దక్షతయను సల్లక్షణమును తప్పక పొందవలెను. (1) గురుప్రబోధితమైనయట్టిది గాని (2) గురువుకు హితమును, ప్రియమును కల్గించునట్టిదిగాని (3) గురువుచే నిర్దేశింపబడినట్టిదిగాని (4) గురువుకు సంతోషము కలిగించునట్టిది గాని (5) గురువనుగ్రహమును ప్రసాదింప సమర్థవంతమైనట్టిదిగాని (6) గురువు కోరి ఆజ్ఞాపించినట్టిదిగాని (7) గురువు యొక్క ఖ్యాతిని విస్తరింపజేయునట్టిదిగాని ఏ కార్యము నైనను చేయగలిగిన శిష్యుని దక్షత కొనియాడ దగియున్నది. గురువు యొక్క యశస్సు. శిష్యుని యొక్క యశస్సు వేరు కానట్టివి. కావున గురువేది ఆజ్ఞాపించినను వారిరువురకూ హితకరములై భాసించును. గురువు ఒక్కొక్కప్పుడు శిష్యునికి చేయతగని పనులు గూడ చేయమని ఆజ్ఞాపించి

అతని దక్షతను పరీక్షించవచ్చును. గురువాదేశము అతి కఠోరమైనప్పుడు దానిని పూనికతో చేయ తలపెట్టిన శిష్యుని యందు అపార కృపతో గురుని శక్తి ప్రవేశించి కార్యనిర్వహణలో సహకరించును. ఈ విషయములో ఎట్టి సందేహమునకు తావులేదు. శిష్యునికి ఉండవలసినది పట్టుదల మరియు బలవత్తరమైన, దృఢమైన, సునిశ్చితమైన, సుస్థిరమైన, ఏకాగ్రతతోకూడిన సదభిప్రాయము మాత్రమే. అందువలన ఎంతటి కఠోరమైన కార్యమునైనను చేయగల దక్షత ప్రాప్తించగలదు.

**ఈ లక్షణములకు తోడు సావధానత కలిగియుండాలి. అనగా జాగ్రత్త. మెలకువ కలిగి ప్రవర్తించాలి. బుద్ధి కుశలతయు చాలా ముఖ్యమైనది. ప్రతి మానవుడు పగలు మేల్కొనుట, రాత్రి నిద్రించుట జరుగును. కాని ఆధ్యాత్మిక విద్యా సముపార్జనలో సాధకుడు ఎప్పుడూ నిద్రించరాదు. ఎల్లవేళలా మెలకువ గలిగి జాగరూకతతో వర్తించాలి. సావధానుడై వర్తించాలి. అధ్యాస, నిద్ర, సోమరితనమును పూర్తిగా పారద్రోలాలి. అజ్ఞానమను చీకటిని ప్రయత్నపూర్వకంగా పారద్రోలేటందుకై జ్ఞాన సూర్యోదయమును ఆహ్వానించాలి. దానికై కొన్ని నియమములను విధిగా పాటించాలి. అనగా తాను చీకటిలో వున్నానన్న భావన నుండి విడిబడాలి. అప్పుడు "ధారణ" (గురుప్రబోధిత సాధన ఎడతెగక చేయగలగడం) అనే ఉదయం (రోజు) ప్రారంభమవుతుంది. ఆ సమయంకొరకు సోమరితనమును, బద్ధకమును దూరం చేసుకొనవలెను. అట్టివానికి "ధృతి" అను "మధ్యాహ్నం" ప్రసాదరూపంగా అందించబడును. శిష్యుని జీవితంలో అస్తమించని సూర్యుడు దయించగా (జ్ఞాన సూర్యుడు) శమ, దమాది షడ్విధ సాధనలు భక్తిమార్గంలో వేగాన్ని పుంజుకుంటాయి. ఒక్క క్షణం కూడ విశ్రమించవు. ప్రతి అడుగులోను నిజబోధ అనే చలివేంద్రం నుండి అమృతపానం అందుతుంది. దానితో అలసట అనేది వుండదు. అటువంటి సాధకునికి సంత్ మహాజనుల సహాయం అదృశ్యంగా లభిస్తుంది. గమ్యంవరకు మార్గదర్శకులై గురువులు తోడ్పడుతారు. గురుప్రబోధిత కార్యమును చేయుటకు పూనుకొన్న శిష్యునికి గురువే తోడ్పడుతాడన్న విషయం దక్షతగల శిష్యులు ఎందరో ఋజువు చేశారు.**

**4) చతుర్థ లక్షణం :** నిర్మమత్వము. ఇది నాలుగవ రత్నము (మమకారం లేక యుండుట) మమకారము అనగా దేనియందైనా గాని అపరిమితమైన ప్రీతి, ఇచ్ఛ కలిగియుండుట. ఈ నాలుగవ లక్షణమును సాధించు సాధకునకు దేనియందునూ ప్రీతి ఉండరాదు. మొదట అకించనత్వమును, నిర్మత్సరత్వమును, దక్షతయను మూడింటిని పూర్ణంగా సాధించుకొన్న సాధకునకు మమకారము దేని యందునూ వుండదు. కానీ ఒక్కొక్కప్పుడు తన శరీరముపై మమకారము కలిగే అవకాశం

వుంది. కావున దీనిని వుండగూడనిదని వర్జింపవలెనని చెప్తారు. దేహమనగా పాంచ భౌతికము, నాశవంతము అని తెలిసిన వానికి "అహం" బుద్ధిపోయి "సోహం" బుద్ధి కలుగును. బ్రహ్మ భావన దృఢపడును. అందువలన ఈ లక్షణము లక్ష్యసాధన కెంతయో ముఖ్యమైనది.

**5) పంచమ లక్షణం (5వ రత్నం) :** గురు సేవా పరాయణత్వము (సరస్య శరణాగతి) శిష్యుని ప్రయత్నము ఈ పంచమ రత్న సాధనలో సంకల్పమాత్రమేగాని **ముఖ్య సూత్రధారి గురువే. శిష్యుని హితమును మనసార కోరుకొను సద్గురువు తల్లి, తండ్రి, బంధువు, స్నేహితుడు, సాక్షాత్ పరబ్రహ్మ దైవతము.** గురుసేవలో నిమగ్నమైన శిష్యునికి అహంకార – మమకారములు రాలిపోయినవి. తదుపరి చేయబడు సేవ సంపూర్ణ శరణాగతియే. విశ్వమంతయూ గురు స్వరూపంగా భావించి ఆరాధించే శిష్యునికి అడుగడుగునా గురుకృప లభిస్తుంది. సద్గురుని ఆత్మీయతను పొందుటకు శిష్యుడు ఎట్లు ఆరాటపడుననగా గోమాత పొదుగునందున్న పాలకై లేగదూడ ఆరాటపడినట్లు ఆత్రుత పడును. అప్పుడే సేవాతత్పరత అలవడును.

సహజంగా మానవ రూపంలో వున్న గురువునారాధించుట చాలా కష్టము. గురుభక్తి స్థిరపడిన తర్వాత సాగించే సాధనమే అసలైన సాధన. శిష్య లక్షణములన్నీ ఎవడు పూర్తిగా అవగాహన చేసుకొని స్వయంగా పొందుతాడో ఆక్షణం నుండి అతనిలో పనిచేసేది గురుశక్తే కాని శిష్యునిదంటూ ఏమీ ఉండదు. ఇదే శిష్యుడు గురువుగా మారడం అంటే. కొందరీ విషయాన్ని మరచి కొన్నాళ్ళు గురుసేవ చేసి తామే గురువులమని ప్రకటించుకొని అహంకారంతో తమ భవితవ్యాన్ని తామే కాలదన్నుకొంటారు. నిజమైన శిష్యుడెన్నటికీ తాను శిష్యుడేననీ జగద్గురువే అందరికీ నిజ గురువనే భావన వీడకుండ గురుస్మరణ చేస్తూ తన్ను తాను గురువుకు అర్పణ చేసుకొంటారు.

**6) షష్ఠమ లక్షణం (6వ రత్నం):** నిశ్చలత్వము (చంచలము లేకుండుట) ఏ మార్గంలో నైనా తొలిమెట్టు, మలిమెట్టు ఎక్కడంలో కష్టం వుంటుంది. కానీ తర్వాత మెట్లు కష్టం వుండదు. సాధక దశలో శిష్యునకు మొదట కష్టాలుపడడం సహజం. కష్టపడి సాధిస్తేనే ఏ వస్తువుకైనా అపార విలువ వుంటుంది. ఎవరో కష్టపడి సంపాదించితే దాని విలువ ఇతరులకేమి తెలుస్తుంది. సాధనతో గొప్ప సహనము, పట్టుదల, ఏకాగ్రత, మత్సరము లేకుండట, సేవాభావము అను సల్లక్షణాలను గురుకృపతో పొందినాడు. ఇక చంచలము లేక నిశ్చలముగానుండుట అను ఆరవ లక్షణమును ఈ విధంగా సంపాదించ వలెను. స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణ అను నాలుగు

విధముల దేహ లక్షణాలను, కర్మేంద్రియ, జ్ఞానేంద్రియముల వ్యాపారములను పంచ ప్రాణములు, అంతఃకరణ చతుష్టయము యొక్క లక్షణములను తెలిసి మనో వికారములను అనగా మనసు చేయు పనులను చక్కగా తెలియవలెను. ప్రేయస్సు నుండి తన మనస్సు శ్రేయస్సు వైపునకు త్రిప్పుకొనుటకు దృఢ సంకల్పము గలిగియున్నచో చంచలము లేక మనస్సు నిశ్చల స్థితిని పొందును. గురుచరణాలపై నుండు అచంచల విశ్వాసమే అతని సంకల్పాలకు కార్యరూపాన్నిస్తుంది. అది పరమార్థ భావన గనుక విశ్వకల్యాణమునకు సద్గురువు, భగవానుడు సంపూర్ణంగా సహకరించి సఫలీకృతం చేస్తారు.

గురూపదేశంతో షడ్వికార రహితుడౌతాడు. (1) అస్తి (2) జాయతి (3) వర్ధతి (4) విపరిణమతి (5) క్షీయతి (6) నశ్యతి అన్నవి ఆరు వికారములు.

(1) అస్తియనగా ఉన్నది తర్వాత ఎప్పుడైనా పోవునది. **దేహము.**

(2) జాయతియనగా పుట్టినది. పుట్టినది ప్రతిదీ గిట్టక తప్పదు.

(3) వర్ధతి యనగా పెరుగునది.

(4) విపరిణమతియనగా పరిణామము చెందుచున్నది.

(5) క్షీయతి యనగా క్షీణించునది.

(6) నశ్యతి యనగా నశించునది.

ఈ లక్షణములు శరీరమునకున్నవని క్షుణ్ణంగా తెలిసినప్పుడు దానిపై మోహము నశించి నిశ్చలత్వము కలుగును. ఈ ఆరవ రత్నం అత్యంత విలువైనది.

**(7) సప్తమ లక్షణం :** పరమార్థ జిజ్ఞాస (7వ రత్నం) : జిజ్ఞాసయనగా ఆసక్తియని గూడ అర్థం. ఆసక్తిపరమార్థపరంగా వుంటే జిజ్ఞాస యంటారు. లౌకికపరంగా వుంటే ఆశ అంటారు. కావున సాధకునికి పరమార్థమందు ఆసక్తి వుంటేనే మొదట గురుసన్నిధికి చేరుతాడు. మొదటి రత్న సంపాదనకు ఈ ఏడవ లక్షణమే మూలకారణం. భగవంతుని యొక్క విభూతులను తెలుసు కోవడమేగాక అనుభూత మొనర్చుకొనుటకుగల ఆకాంక్షనే జిజ్ఞాస యందురు. అయితే భగవ తత్త్వము అనంతము, అగాధము గావున ఎంత తెలుసుకొన్నా ఇంకా తెలుసుకోవలసినది అనంతంగా వుండును. ఇది ఎల్లవారికి ఉండవలసిన రత్నంవంటి లక్షణం.

**(8) అష్టమ లక్షణం (8వ రత్నం) :** అనసూయత్వం (అసూయ లేకుండుట) ఈ లక్షణము సాధకునిలో మొదటి నుండీ వుండవలసిన లక్షణమే. మొదటి నుండి యేడు లక్షణాలను

సాధించిన వ్యక్తి సద్గురునకు ఇష్టుడౌతాడు. సద్గురువే తల్లి, తండ్రిగా భావించే శిష్యులు ఎందరో వుంటారు. సద్గురువు అందరిపట్లా సమానమైన ప్రేమను వ్యక్తీకరింపజేస్తారు. ఆ సందర్భంలో గురువుపట్లనే అసూయపడే అవకాశం అనగా గురువు యొక్క ప్రేమ తనకు మాత్రమే దక్కాలనే భావం, తాను మాత్రమే దానికి అర్హుడనే భావం ఇవన్నీ అసూయలోని భాగాలే. **ఇటువంటి వక్రభావనలు ప్రవేశిస్తే అప్పటి వరకూ సాధించిన రత్నాలన్నీ రాళ్ళుగా మారిపోతాయి.** సాధనంతా బూడిదలో పోసిన పన్నీరైపోతుంది. ఇంతేగాక ఉత్తమ గుణ సంపన్నుని పైగానీ లేక గురు ప్రేమను పొందిన వానిపైగాని మిధ్యారోపణలు చేసి వాని గుణములకు గురు ప్రేమకు విపరీతార్థాలు కల్పించి గురు ప్రేమకు వాడు పాత్రుడు కాడని నిందించేవారుంటారు. వారితో ఒక్క క్షణం సచ్ఛిష్యుని మనస్సు ఏకీభవించినా పతనమై అసూయత్వమునకు లొంగినట్లే. ఈ స్థితిలో జారిపోకుండా నిలబడగలగాలంటే సచ్ఛిష్యుడు **"తన గురువు సర్వజ్ఞుడు. ఆయన చేయు కార్యముల నధిక్షేపించుట కెవ్వరు తగరు"** అనే భావాన్ని పటిష్ఠం చేసుకోగలిగితే ఎనిమిదవ రత్నం చేజిక్కించుకొన్నట్లే.

అసూయ పిశాచం వంటిది. అది పట్టిందంటే సాధకుని గురువుకు దూరం చేస్తుంది. గురువు కూడ అటువంటి వారిని దూరంగా నెట్టివేస్తారు గాని దాన్ని పట్టుకొని వదిలించే ప్రయత్నం చేయరు. ఎందుకంటే ఆ దుర్గుణం చాప క్రింద నీరువలె శిష్యునిలో చేరుతుంది. భూతం ఆవేశించిన వ్యక్తికి ఆ సంగతి తెలియదు. ఎదుటి వారికి తెలుస్తుంది. భూతం పట్టిన మరో తోటి వ్యక్తికి గూడ ఈ విషయం తెలియదు.

అదే విధంగా అసూయ భూతం పట్టిన వ్యక్తులకు ఎవరిలోపాలు వారికి తెలియవు. ఇది కుశిష్యుల లక్షణం. తన్ను తాను పొగడుకొనుట, ఎదుటివారిని విమర్శించుట ఇవి వారిలో పెచ్చుపెరిగిపోయి అధోగతికి తీసుకొని పోతాయి. కావున సచ్ఛిష్యుడు ఈ దుర్గుణము యొక్క స్వభావాన్ని పూర్తిగా తెలుసుకొని మితభాషియై మెలగాలి. అందరికన్నా తాను తక్కువవాడినని (అకించనుడనని) భావించాలి. **ఎవరి స్థాయికి తగిన శిక్షణ వారికి సద్గురువే యిస్తారనే గట్టి నమ్మకం కలిగియుండాలి.** గురు సంకల్పంతో కొందరిలోని అవగుణాలు బయటపడి ఛేదించబడి సమసిపోతూ వుంటాయి. ఏ ప్రాణినీ హింసించ గూడదనే భావనయే అనసూయత్వము.

**9) నవమ లక్షణం (9వ రత్నం) :** పవిత్ర సత్యభాషణము : పవిత్రత, సత్యమును వచించుట యను లక్షణములు ప్రథమ లక్షణ సాధన ప్రారంభము నుండియూ అవసరమే అయి

వున్నది. గురువు చెప్పిన విషయమేదైనా నిస్సంశయముగా సత్యమని భావించే స్థితి దీని ప్రథమ సంకేతము. గురుదేవుడే విధముగా మృదుమధురంగా, ప్రేమాస్పదంగా మాట్లాడెదరో దానిని గ్రహించి అనుసరించాలి. కపటంతో కూడిన భాషణలు, మర్మగర్భమైన భాషణలు చేయరాదు. చాడీలు చెప్పరాదు. ఇతరులు చెప్పినా వినరాదు. నిందలను సహించితే కర్మలు తొలగి నిర్మలత్వం ప్రాప్తిస్తుంది. ఇతరులను నిందిస్తే వారి కర్మలన్నీ తనకు ప్రాప్తిస్తాయని జాగ్రత్తగా వుండి ప్రతి మాటకు విలువ తెలిసి మాట్లాడాలి. పరిహాసోక్తులు పలుకరాదు. వితండవాదములు చేయరాదు. కఠోర వచనములు పలుకరాదు. ఆడినమాట తప్పరాదు. సదా సర్వదా గురునామ స్మరణ చేయుచు తన తొమ్మిది రత్నాలను జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. సచ్ఛిష్యుడు **సత్యం అత్యంత మధురం, ఆహ్లాదకరం, ఆనందదాయకం, హితకరం అని నమ్మియుండును.** ఆత్మసుఖాన్ని పొందడానికి తప్ప మరే ఇతరమునకై తపన పొందడు.

ఇవియే సచ్ఛిష్యునికుండదగినవి. ఇవియే నవరత్నములు. ఇవి నవఖండ పృధ్వీ మండలానికి ప్రతీకలు. ఈ లక్షణములు కలిగియున్న శిష్యుని హృదయం సద్గురునికి నిలయ మవుతుంది. గురుకృపవల్లనే ఇవి సాధ్యమైనవన్న ఎఱుక ఎల్లవేళలా కలిగి ఇందు తన ప్రత్యేకత ఏదీ లేదని నిగర్విగ వుంటే ఆతడే సద్గురువుగ రూపొందును. ఈ లక్షణ సముదాయము జీవితాంతముండవలెను. ఆతడే సద్గురువు. సద్గురు లక్షణములను వేరుగ చెప్పబనిలేదు.

**ఈనాటి సచ్ఛిష్యుడే రేపటి సద్గురువు :** ఈ సద్గుణ సముపార్జన లేకుండ గురువులని పిలిపించుకొనువారు ఏనాటికైనా పతనం చెందవలసినదే.

భార్యా, పిల్లలు, ఇల్లూ, వాకిలీ, పొలము, ధనము, ధాన్యములన్నీగల వానికి కూడ ఈ లక్షణముల సాధన సాధ్యమే. గృహస్థులకు గూడ ఇవి అత్యుత్తమమైన ఆత్మప్రాప్తికి సోపానములై నిలుస్తాయి అని శ్రీపాదస్వామివారు అచ్చట చేరిన భక్తులకు అపార జ్ఞాన సముపార్జనా మార్గాన్ని బోధించినారు. యోగానంద బ్రహ్మచారి జ్ఞాన పూర్ణులైన శ్రీ స్వామివారి బోధామృత లహరిలో మునకలు వేస్తూ ఆనంద పారవశ్యంలో నుండి తేరుకొని ఒక్కసారిగా శ్రీపాద శ్రీవల్లభ మహరాజ్‌కీ జై" అని ముక్తకంఠంతో జయజయ నాదములు చేసినారు.

శ్రీపాద స్వామి వారు అందరికీ ఆశీస్సులు ప్రసాదించారు. తదుపరి అచ్చటి స్థానికుల చే భక్తులకు మరియూ శ్రీ స్వామివారికిన్నీ అన్న సమారాధన జరుపబడింది. మహోర్‌గడ్ నుండి వచ్చిన శ్రీ యోగానంద బ్రహ్మచారి మరియు యాత్రా బృందమువారు స్వామివద్ద సెలవు తీసుకొని తమ తిరుగు ప్రయాణమును కొనసాగించినారు అని శ్రీ బాబాగారు తెలిపినారు.

# 23వ అధ్యాయం

## శ్రీపాద శ్రీవల్లభస్వామినే నమః

## చరమాంకము - శ్రీపాదుల అంతిమ ప్రకటన

శ్రీపాద శ్రీవల్లభులు ఈ కలియుగ ప్రథమావతారమును గుప్తపరచవలెనని సంకల్పమును స్థిరపరచుకొన్నారు. వారు తమ గుప్త సంకల్పాన్ని ముందుగా దూరదూర ప్రాంతములలోని భక్తులైన గోవింద భట్టుకున్నూ, బదరి క్షేత్ర నివాసియైన సదానంద బ్రహ్మచారికి, మహూర్‌గడ్‌లో వుండే యోగా నందునికీ తమదైన దైవీ శక్తితో వారి అంతరంగము నందు తెలియజేసినారు. దగ్గర నున్న భక్తులకు నిత్యమూ అనేక విధములైన సమస్యలతో సతమతమవుతూ సన్నిధానమునకు వచ్చి దర్శించుకొను భక్తులందరకు వారికి తగిన సూచనలనిస్తూ బాధోపశమనం గావిస్తూ వున్నారు.

ఆశ్వీజ మాసం బహుళ దశమి రోజునకు దూరదూర ప్రాంత భక్తులైన సదానంద బ్రహ్మచారి తన శిష్య బృందముతో కూడ వచ్చి చేరెను. యోగానందుడు కూడ తన యాత్రా బృందము యొక్క దారి మళ్ళించి కురువపురమునకు తోడ్కొని వచ్చెను. గోకర్ణవాసి గోవింద భట్ వృద్ధాప్యము చేత దూర ప్రయాణము చేయలేని స్థితిలో వున్నాడు. కాబట్టి పూర్వము తనతో యాత్రకు వచ్చిన వారిలో యువకులైన వారిని ప్రేరేపణ చేసి కురువపురమునకు పోయి శ్రీపాద స్వామికి తమ అశక్తతను తెలిపి నమస్కారములను తెలుపవలసినదిగా కోరి పంపెను.

ఈ విధముగా పాత భక్తులంతా వచ్చి చేరులోపల పంచదేవపహాడ్ గ్రామపెద్ద శ్రీరామా చార్యులను, ఆంజనేయశర్మనూ మరికొందరు పెద్దలను ప్రత్యేకముగా దర్బారునకు రమ్మని కబురు చేయగా వారందరూ శ్రీ స్వామి సన్నిధానమునకు చేరుకొనిరి.

శ్రీపాద స్వామి వారు ఇట్లు పలికిరి. అందరికీ శుభాశీస్సులు. భగవంతుని కృపచేత ఈ గడ్డపైన నివసించుమని ఆదేశము లభించినది. మీ అందరి సహచర్యముతో 14 సంవత్సరములు ఈ పవిత్ర క్షేత్రమందు చక్కగా గడచిపోయినవి. మేమిక్కడ నిర్వహించవలసిన కార్యములు, సాధనలు పూర్ణమైనవి. లోక కళ్యాణమునకై ముందు కాలములో ఇక్కడ జరుగవలసిన అనేకమైన కార్యక్రమములన్నింటికినీ దివ్య సంకల్పముచేత సూక్ష్మ రూపముగా ఆదేశము లివ్వబడినవి. ఆయా కార్యములు కాలక్రమమున రూపము ధరించగలవు. ఈ పరమ పావనమైన కృష్ణానది యందు స్నానమాచరించి సహజ గణపతిని దర్శించువారికి సకల ఈప్సితములు సమకూరును.

మా ఇహలోక యాత్రను పూర్తిచేయు తరుణం ఆసన్నమైనది. ఆశ్వీజ బహుళ ద్వాదశీ తిథియందు మేము అంతర్ధానము అయ్యెదము. మీరు ఎక్కడ ఎప్పుడు మా నామము స్మరించెదరో అచ్చట మా శక్తి అదృశ్యముగా ఆయా కార్యమును నెఱవేర్చును. ఇది ముమ్మాటికీ సత్యము అని నమ్మండి!" అని శ్రీపాదస్వామి వారు దర్బారునందు సభాముఖంగా ప్రకటించెను.

అది విని అందరూ అదిరిపడిరి. అందుండి ఒక వృద్ధుడు లేచి "ఓ! దేవాది దేవా! దివ్య ప్రభావా! ఈ దీనులపై దయతో ఈ ప్రదేశమునకు వచ్చి మా యొక్క చీకటి బ్రతుకులలో వెలుగులు నింపి మమ్ముద్ధరించిన మహాత్మా! మేము అజ్ఞానులము. మా వలన యేదైనా అపచారము జరిగి వుండవచ్చు. మాకు నీవే తల్లివి.. తండ్రివి. గురువు, దైవం కూడా యని నమ్మియున్నాము. ఉదయం నీ నామస్మరణతో పొద్దు పొడుస్తుంది. మా వృత్తి ధర్మాలన్నీ నిన్ను దలంచుకొనుచూ చేసుకొని సుఖజీవనం చేస్తున్నాము. పుణ్యమేదో పాపమేదో తెలియని మూఢులము. మాకు నీవే దిక్కని నీపాదాలే శరణమని జీవితాలు గడుపుచున్నాము. పిల్లా పాపలతో సుఖంగా వుంటూ వున్న మమ్ము వదలిపోయెదమనుటకు నీకు మనస్సెట్లు వొప్పినది దేవా! మా తప్పులు ఏవైనా వున్నచో క్షమించవలసినదిగా ప్రార్థించుచున్నాము. నీ యాజ్ఞ మీరము. మీరెట్లు నడువమన్న అట్లు నడిచెదము. మీరు మమ్ము వదలిపోయిన యెడల ఏటి నుండి బయటపడిన చేప పిల్లలవలె మేము అల్లాడెదము. మాకు దైవమార్గము, ధర్మమార్గము ఇక ముందు చెప్పేవారెవరు? ఇంతటి కఠినాతికఠినమైన నిర్ణయం యేల తీసుకొంటివి నాయనా! ఇంత చిన్న వయస్సులో మా పుణ్యముల పంటగా మాకు లభించినావు. మేము ఏ తీర్థాలూ, ఏ క్షేత్రాలూ ఎరుగము. నీ పాదములందే సకల తీర్థాలూ, సకల క్షేత్రాలున్నవని ఎక్కడెక్కడి నుండియో మహాత్ములు నిన్ను దర్శింప వచ్చిన వారు చెప్పగా విని నీదరి చేరి సేదతీరితిమి. మా యందు ఎందుకింత నిర్దయ బూనినావు స్వామీ!" అంటూ వాపోయినాడు.

అంత శ్రీరామాచార్యులు లేచి స్వామీ! మీరింత త్వరలో ఇటువంటి నిర్ణయము తీసుకొనుట భావ్యమా! అజ్ఞాన కూపమున బడియున్న మాకు జ్ఞాన జ్యోతివలె లభించినారు. మీ సాన్నిధ్యంలో ఇప్పుడిప్పుడే మా బుద్ధియు వికాసము నొందుచున్నది. హే! ప్రభో! మీ కనుసన్నలలో నడుచుకొను అల్పులము, దీనులము. మీరే మాకు కొండంత అండగా వున్నారని ఈ సంసారపు బండిని లాగుచున్నాము.

ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి తిరిగి తిరిగి ఇక్కడకు వచ్చి మా జీవితాలలో నూతన

జ్యోతులు వెలిగించినావు. నిత్యము తమ దర్శనముతోనే తృప్తిని పొందియున్న మమ్ము విడిచి మాకు తమ దర్శన ప్రాప్తిలేకుండ చేయుట భావ్యమా స్వామీ! మేము తమకేమైనా అపచారము చేసి యున్నచో మా అజ్ఞానమును మన్నించుమని వేడుకొనుచున్నాము. తమరు చేయు నిర్ణయములు అప్రతిహతములని తెలియును" అని ప్రార్థించెను.

వాసుదేవరావు శ్రీ స్వామివారికి మ్రొక్కి "ఓ! స్వామీ! మమ్ముద్ధరించుటకే నీవు ప్రత్యేకముగా అవతరించినావని తెలిసి మా జన్మలు ధన్యమైనవని భావిస్తుండగా పిడుగుపాటువలె ఏమి ఈ వార్త యని అపారంగా దుఃఖించసాగెను. శ్రీ స్వామివారు అతనిని ఓదార్చుచు" నీవు తర్వాతి జన్మలో నరకేసరియను పేర కల్లేశ్వరునికి అంకిత భక్తుడవై తర్వాత నన్ను కలుస్తావు"అని వరమిచ్చారు.

ఆంజనేయశర్మ "తల్లిప్రేమ బిడ్డలకుగాక మరెవరికి దక్కును? మాయందు ఎల్లవేళలా ఇదే ప్రేమను వర్షింపజేయుము దేవదేవా! హే! సమర్థ సద్గురూ! పాహిమాం! పాహిమాం! పాహి అని ప్రార్థన సలిపి కూర్చుండగా సదానంద బ్రహ్మచారియు, యోగానందుడును వచ్చి శ్రీవారి పాదాలకు నమస్కరించి ఓ దేవాదిదేవా! ఏమి హఠాత్పరిణామము? మా అంతరంగముల యందు తామిచ్చిన సంకేతముల మేరకు తమ చరణకమల సన్నిధికి చేరితిమి. మహాత్ములైన తమరే ఇట్లు సెలవిచ్చిన యడల మాకు మార్గదర్శకులెవరు? ఓ త్రిమూర్తి స్వరూపా! మీ జగత్కల్యాణ కార్యము అంతలో ఎట్లు ముగియును? అని ప్రార్థింప దొడగెను.

శ్రీస్వామివారు చిరునవ్వు నవ్వుచూ "ఏమయ్యా! బ్రహ్మచారులూ, సన్యాసులు, సాధువులు భగవన్నిర్ణయాలను తలదాల్చవలసినదే! ఎవరైనా స్వయంగా ఏమియు చేయరు. చేయలేరు. కాలచక్రము ఈశ్వరాజ్ఞకు లోబడియే ఈ భువిపైన ఎవరెంత కాలముండవలెనో, ఏమేమి కార్యములు సలుపవలెనో, సమస్తము భూమిపై వుద్భవించక ముందే నిర్ణయము చేయబడునని మీరెరుగరా! అందరూ జాగరూకతతో కాలగమనాన్ని గమనించండి. ఏ ఒక్క క్షణమును ఎవరి కొరకును ఆగదు. రాజులకు, సేవకులకు, సాధువులకు, మరియు సన్యాసులకు వేరువేరు కాల ధర్మము లుండవు. ఆయా సమయములాసన్నమగుచో భూమిని వదల వలసినదే! ఇదియే బద్ధ శాసనము. మనము ఎన్నో జన్మలలో తిరిగి కలుసుకొందుము. దీనిని గురించి విచారము వలదు. గురుభక్తిని మరువకుడు" అని బోధించుచుండగానే శ్రీశైలంలో గురుభావంతో కొలిచిన నిర్మలానంద బ్రహ్మచారి గూడ వచ్చి శ్రీపాద స్వామివారి నిర్ణయం విని నిర్విణ్ణుడై వ్యధపడుచుండగా శ్రీపాద స్వామి వారు అతనిని మరుజన్మలో త్రివిక్రమానంద భారతిగా నా వద్దకే వస్తావని ఆశ్వాసమిచ్చారు. ఆంజనేయ

శర్మతో నీవున్నూ నందిశర్మగా నావద్దకే వచ్చి నా వద్ద శిష్యరికం చేస్తావు. తర్వాత నేను అక్కల్‌కోట స్వామిగా వస్తే నీవు పాండురంగ పురాణిక్ వస్తావులే. బాధపడ"వద్దని ఆశీర్వదిస్తారు. అంతేగాదు ఎవరు గురువును జీవితాంతం హృదయంలో పెట్టుకొంటారో వారు సన్నిధిని కోల్పోరు. ఎన్ని జన్మలైనా నాతోనే వుంటారు" అని వాగ్దానం చేశారు.

సామాన్యుల జీవితములు కర్మాధీనములు. మహాత్ముల జీవితములు దైవాధీనములుయని ఎఱుగుడు. అందరూ ధీరమతులై రేపు ఉదయమున వీడ్కోలు పలుకుటకు సిద్ధముగా యుండుడని పలికి ఆనాటి సభముగించి శ్రీపాదులు కురువపురమును చేరుకొనిరి. ఈ వార్త చుట్టు ప్రక్కల గ్రామములన్నింటికి తెలిసెను.

యాత్రికులందరికీ వలయు ఏర్పాట్లు గ్రామస్థులు సమకూర్చిరి. శ్రీక్షేత్ర కురువపురము నందు యథావిధిగా దేవతలు, మునులు, శ్రీస్వామివారి సన్నిధికి చేరి వారిని అర్చించుకొనిరి. మరుసటి దినము ఉదయముననే జరుగబోవు శ్రీపాదుల అంతర్థానమును ఎట్లు వీక్షింపగలమని అందరును వారిని మనసారా ప్రార్థనలు చేసుకొనిరి.

శ్రీపాదులవారు బ్రహ్మముహూర్తమున యథాప్రకారము నది దాటి సూర్యనమస్కారము లాచరించు శిలవద్దకు చేరి స్నానాదులాచరించిరి. వారి యనుష్ఠానానంతరము సూర్య నమస్కారము లాచరించిరి.

ఆ సమయమున వేలాదిగా ప్రజలు తరలివచ్చిరి. ఎవరు ఎవరిని పలుకరించుటకు ధైర్యము చాలని విధంగా అందరూ మౌనంగా నిశ్చేష్ఠులై నిలిచియుండిరి. నదీ తీరమంతయు ప్రజావాహిని నిండియుండెను. సాధుసంతులు, ప్రజలు నది గట్టుపైనను, నది యందును అనేక ఋషిగణములు దేవగణములు నిలిచియున్నట్లు కొందరికి దర్శనమైనది.

సూర్యుని ప్రకాశము ప్రతి దినము నాలుగు ఝాములలో నాలుగు విధములుగా మారు చుండును. ఆ విధముగానే ఉదయ సూర్యుని బాల భాస్కరుడందురు. తరువాత ఝాములో సూర్యుని మధ్యందిన భాస్కరుడని, మూడవ భాగములోని సూర్యుని ప్రచండ భాస్కరుడని, నాల్గవ భాగములోని సూర్యుని సౌమ్య భాస్కరుడని అంటారు. శ్రీపాద స్వామి రెండవ భాస్కరుని యందు తమ రూపమును లయం చేయ నిశ్చయించుకున్నారు. అనగా రెండవ ఝాము ప్రారంభంలో భక్తులందరినీ ఉద్దేశించి వారి తుది సందేశము ఆశీస్సులను ఈ విధంగా అందించినారు.

అందరకూ అభయ ముద్రతో వారి హస్తమును చూపుచూ ఇట్లు పలికిరి. జనులారా!

భక్తులారా! మీరు భక్తి శ్రద్ధలతో పత్రం, పుష్పం, తోయం ఏది సమర్పించినా వారికి సర్వ శుభాలను ఇచ్చెదను. భక్తియు, సమర్పణా భావము లేనిచో మీరిచ్చిన ధన, ధాన్య పుష్ప ఫలాదులను నేను స్వీకరింపను. భక్తితో బాటు శ్రద్ధ, ఓర్పు, విశ్వాసము, నమ్మకము కల్గియుండాలి. నావి నీకు సమర్పిస్తున్నాననే భావన లేకుండా నీది నీకే సమర్పిస్తున్నాననే భావం కలిగియుండాలి. నా యవతారము ధర్మము నుద్ధరించుటకు, అధర్మము రూపుమాపుటకు, దుష్టగుణ శిక్షణకు, నన్నాశ్రయించిన భక్త జన రక్షణకు నిరంతరం ఇచ్చోట పనిచేయుచునే యుండును. నేను గుప్త రూపంలో ఇచ్చుట సంచరించెదను. ఇది నా యొక్క ప్రేమాస్పదమైన పుణ్య క్షేత్రము. ఇక్కడ నాకు బదులు ఈ సహజ గణపతి ఎల్లప్పుడు మీకు దర్శనమిచ్చును. నా రూపము ఈ భాస్కరబండపై దర్శనమిచ్చును. ఇచ్చుట చేయు పుణ్యము లేశమైనను అక్షయఫలముల నిచ్చును. ఈ ప్రదేశమున చేయు సేవ, పూజ, గోపూజ, గోదానము, అన్నదానము విశేష ఫలములనిచ్చును. ఇది సత్యము. ఎవ్వరు మా వాక్కులనెన్నడునూ మరువక నడుచు కొందురో వారి వంశాలను కాపాడుచుందును. మా విభూతులు ఇచ్చుట విస్తారమై భక్తులకనుభవ మగునని నమ్ముడు. నామస్మరణ మాత్రముననే మాకు సంతోషము కల్గును. మీకు సకల శుభములు కలుగును. అని ఆశీర్వదించుచున్న శ్రీపాద స్వామి వారు అందరు చూచుచుండగనే ఒక జ్యోతి స్వరూపముగా మారి ఆకాశమార్గమున పైకెగసి పోవుట గోచరించెను.

కన్నుల నుండి అశ్రుధారలుకార అందరూ నామస్మరణ చేయుచుండిరి. మనమున్నూ నామస్మరణ చేద్దామని శ్రీవిఠల్ బాబాగారు ఉచ్చైస్వరంతో..

"దిగంబరా.. దిగంబరా.. శ్రీపాద వల్లభ దిగంబరా"

యనగా అందరమూ బాబాగారితో శృతి కలిపితిమి.

యోగానంద బ్రహ్మచారి భక్తులందరిని తేరిపార చూచెను. అందరూ బరువెక్కిన హృదయాలతో నోట మాటరాక స్తబ్ధులై యుండిరి.

భక్తాదులనుద్దేశించి చూచితిరా! మహాత్ముల లీల! వారి నిర్ణయాలు వజ్ర సదృశాలు. ఇదొక విచిత్రమైనటువంటి మాయ. ఈ మాయకు లోబడి సామాన్యులు వర్తించుచుందురు. కానీ శ్రీదత్త స్వామి లీల వేరు. తనను తానే సంకల్పించుకొన్న పరమాత్మ తత్త్వము నుండి దిగి మానుష తత్త్వములోనికి ఆవిర్భవించి తిరిగి తన మాయతో పరమాత్మలో లీనమగును. జననమే లేని స్వామి జన్మించినట్లుగా భావన కల్గిస్తాడు. శరీరమే లేని స్వామి శరీరంతో వున్నట్లుగా గోచరిస్తాడు.

సృష్టి స్థితి లయ కారకుడైన ఆ దేవదేవుని లీలా విలాసంలో ఇది యొక అద్భుతమైన విభూతి. హృదయ నిలయుడైన భగవానుడు తన ఉనికిని తెలుపుటకే మన అందరి హృదయాలలో స్థిరప్రతిష్ఠ నొందినాడని కొనియాడెను.

తదుపరి సదానందులు ఇట్లు పలికిరి. శుద్ధ జలములతో మలినములు పోగొట్టు రీతిన పరిశుద్ధ భావములతో మీ హృదయ కల్మషములను ప్రక్షాళన చేయండి. అప్పుడా హృదయాలయము శ్రీ స్వామికి ఆవాసము కాగలదు. ఆయనను శరణుపొంది ఆర్తితో, ఆవేదనతో, శ్రద్ధతో, ప్రేమతో పిలవండి. తక్షణమే ఆ శ్రీపాదవల్లభుడు మన కళ్ళముందు ప్రత్యక్షమవుతాడు అంటూ అందరినీ ఓదార్చారు.

విషణ్ణ వదనులైయున్న ఆ సమస్త జనావళి ఆతృతగా "దిగంబరా .. దిగంబరా.. శ్రీపాదవల్లభ దిగంబరా"యని దిక్కులు పిక్కటిల్లేలాగున పలుకుచూ ఆకాశంవైపు దృష్టినిలిపారు. వారందరిలో సద్భక్తులైన వారికి శ్రీపాదస్వామివారి వరప్రదానము అనుభవమైనది. వారికి లీలగా ఆజానుబాహుడైనటువంటి శ్రీపాదులవారి యొక్క దివ్యదర్శనము కల్గినది. అందరూ మరల జయజయ నాదములు చేసినారు" అని శ్రీ విఠల్ బాబాజీ గారు అందరితో "శ్రీపాద శ్రీవల్లభ మహారాజ్‌కీ జై"యని పలికించారు.

శ్రీపాదులవారు రెండు చేతులతో ఆశీర్వదిస్తున్న దృశ్యాన్ని చూచి శ్రీ బాబాజీగారు ముగ్ధులైనారు. ఆనంద బాష్పాలు కన్నుల నుండి స్రవించుచుండగా శ్రీపాద శ్రీవల్లభుడు నిత్య సత్యుదేనని నిరూపించుకొన్నాడు. ఇప్పటికీ ఎప్పటికీ ఆయన సత్యవాక్పాలకుడే! ఈ క్షేత్ర నిర్మాణమునకు సంకల్పించినవాడు ఆయనే గదా! ఆయన ఘటనాఘటన సమర్థుడని వచించినారు.

ఇన్ని రోజులు ఎంత ఉత్సాహంతో శ్రీపాద వల్లభ స్వామివారియొక్క దివ్య లీలలను, బోధలను వింటూ వున్నామో అంతకంత వారి అంతర్ధానము గురించి వినగానే మాలో నిరుత్సాహము, విహ్వలత్వము చోటు చేసుకొని అందరం స్తబ్ధుగా వుండిపోయాము.

శ్రీ బాబాగారు బిగ్గరగా అందరితో దిగంబరా.. దిగంబరా.. శ్రీపాదవల్లభ దిగంబరా! అని పలికించిన తర్వాత అందరికీ నీరసం పోయింది. శ్రీ బాబాగారిలా చెప్పారు. మహాత్ములు భక్తుల కొరకు భువిపైకి వచ్చినవారు కావున అందరికీ మార్గదర్శనం చేస్తూ ఈ మార్గంలో నడవండి! అందరూ సులభంగా మానవ జన్మ యొక్క లక్ష్యాన్ని చేరగలరని బోధించారు. ఆ బోధలను, మరియు వారి నామాన్ని, వారి వాగ్దానాలను ఎవ్వరు మరువకుండా తమ జీవితాలను పండించు

కొంటారో వారిని ఏనాటికీ వారు వదలిపెట్టరు. అవ్యక్తమైన దివ్యశక్తి మానవ రూపం ధరించి నందున దానికొక నామం ఏర్పడింది. రూపం మరుగైనప్పటికీ "నామం" యొక్క ప్రభావం సరాసరి అవ్యక్త రూపానిదే కావున అనుగ్రహ వృష్టి కురుస్తుందని బోధించారు.

నిజమే! వారు చెప్పేది అక్షర సత్యమే. పూర్వం నుండి భువిపైన శాశ్వతంగా ఎవ్వరూ శరీరంతో ఉండలేదు. శరీరంతో మంచి పనులు చేసి కీర్తి గడించారు. ఆ కీర్తి ఉన్నంతకాలం ఆ వ్యక్తి స్మరణ జరుగుతుంది. శ్రీ భాగవతమును మనకు తెలుగులో అందించిన "పోతనామాత్యుని" తెలుగు వారెన్నటికీ మరచిపోలేరు గదా! అదే విధంగా శ్రీపాద శ్రీవల్లభుల లీలల వైభవాన్ని మనకందించిన శ్రీ విఠల్‌బాబావారిని గూడ మనమూ, మన ముందు తరాల వారునూ ఎన్నటికీ మరువము, మరువలేము.

'జైగురుదత్త'



# 24వ అధ్యాయం

## శ్రీపాదశ్రీవల్లభస్వామినే నమః

## వల్లభేశ శర్మను పునర్జీవితుని చేయుట

శ్రీపాదస్వామివారి మహిమలకు, అనుగ్రహములకు అంతులేదు. ఆకాశములోని నక్షత్రములనైనా లెక్కించవచ్చునేమోగాని శ్రీ స్వామివారి మహిమలను లెక్కింపనెవరి తరము. శ్రీ విఠల్‌బాబాగారు తెల్పుచుండగా ఈ అద్భుతములు కొన్ని మనకు తెలియవచ్చినవి. ఇంకను ఎన్నో లీలలు తెలియబడవలసియున్నవి. మహాత్ముల లీలల ద్వారా మనము వారి సన్నిధిని అనుభవించెదము. తద్వారా పాప నిర్మూలనము జరుగును.

ఇదే లక్ష్యముతో శ్రీ గురుదేవులైన శ్రీ బాబాగారి సన్నిధికి చేరి ఇట్లు ప్రార్థించితిని. "స్వామీ! తమరు దయతో వినిపించుచున్న అనేక లీలలు విని ఎంతో మానసిక సంతృప్తి కలిగినది. వారు అంతర్ధానమైన తదుపరి వారు చూపిన లీలలు కూడా మాకు తెలిపి మమ్ము ధన్యుల చేయండి!" అని వేడుకొనగా శ్రీ బాబావారు "అమ్మా! ఆ స్వామి ఆజ్ఞాపించిన విధముగా నడుచుకొను చుండుటయే మన విధి. వారు చూపిన లీలను దర్శించి చెప్పెదను. మీకు ఏమి తెల్పమని ఆయన ఆదేశము వచ్చునో అదియే లభించును." అని వచించిరి.

శ్రీపాదస్వామి వారిని ప్రార్థిస్తూ చేతులు జోడించి "దత్తస్వరూపా! సకల ధర్మావతారా! దీనబంధూ! దయాసింధూ! ఆశ్రితరక్షకా! పాహిపాహి!" అని "ఒక అద్భుతమైన దృశ్యం దర్శనమైనది. ఏమి ఆ స్వామి కరుణ!" అంటూ ప్రారంభించి, వల్లభేశుడను బ్రాహ్మణుడు కురువపురం చేరిన విధానము మరియు నాలుగు వేలమందికి సమారాధన చేసిన విధానమునిట్లు వర్ణింపసాగిరి.

వల్లభశర్మ తన వివాహానంతరము ధర్మపత్నితోబాటు జీవనోపాధికై బయల్దేరి వెళ్ళినాడు. శ్రీపాదులవారి అనుగ్రహముతో పసుపు వ్యాపారము ప్రారంభించినాడు. శ్రీ స్వామి అనుగ్రహ విశేషము వలన అతని వ్యాపారము దినదిన ప్రవర్థమానము గాజొచ్చినది. అంచెలంచెలుగా అతను వ్యాపారాభివృద్ధి ద్వారా సంపన్నుడైనాడు. తన బీదరికపు ఛాయల నుండి క్రమక్రమముగా బయటపడినాడు.

వల్లభేశుడు అంతటి వ్యాపార వ్యవహారముల వత్తిడిలో వున్నప్పటికీ శ్రీ స్వామి వారి దివ్యనామమును ఎల్లవేళలా ఉచ్చరిస్తూ వుండేవాడు. దిగంబరా! దిగంబరా! శ్రీపాద వల్లభ

దిగంబరా! అనే నామమును సదా జపము, మననము చేసుకొనేవాడు. ఎటువంటి వ్యాపార కార్యకలాపములందు మునిగియున్నను, ఏ వూరు వెళ్ళినను నామస్మరణ, తనలోతాను గొణుగు చున్నట్లుగాని మానసికంగా గానీ చేస్తుండటంమాత్రం అలవాటైపోయిందతనికి.

ఈ విధమైన నామస్మరణతో అతను శ్రీపాదశ్రీవల్లభస్వామి అనన్యభక్తుడిగా మారి పోయాడు. సద్గురువు అనుగ్రహంవలన లభించనిదేముంటుంది? అనఘాలక్ష్మి అనుగ్రహ సిద్ధిరస్తు అనే ఆశీర్వాదం అక్షర సత్యమైంది.

వల్లభేశుడు తన వ్యాపార కార్యక్రమములలో మరియు ధన సంపాదనా వ్యవహారముల యందు తలమునకలుగా మునిగియుండుట చేత కురువపుర ప్రయాణమును పలుమార్లు వాయిదా వేసినాడు. ఒకరోజు ఏమైనాసరే తనకు సమర్ధ సద్గురువు శ్రీపాదులవారి అనుగ్రహమువలన ఇంతటి స్థితి కల్గినదని ఇక తన వాగ్దానమును పూర్తిచేయు సమయము ఇదేనని తలచి కురువపురమునకు బయల్దేరినాడు. అటుల బయల్దేరుటకు ముందు తనలో తాను ఈ విధంగా చర్చించుకో సాగాడు. శ్రీపాద స్వామిని ఆశ్రయించు సమయమునకు తను కడు బీవాడే! అప్పటి కాలమాన పరిస్థితుల దృష్ట్యా 1000 మంది బ్రాహ్మణులకు అన్నదానము చేయుటనునది తలకు మించిన పనే! కాని ప్రస్తుత పరిస్థితులను బేరీజు వేసిన తాను 4000 మందికి సునాయాసముగా అన్నదానము చేయగలడు. శ్రీ స్వామివారి దయవలన అంతటి సంపన్నుడయినాడు. అందువలన తాను నాలుగువేల మందికి అన్నదానము చేయదలచి అందుకు కావలసిన ధనమును తీసుకొని కురుంగడ్డకు ప్రయాణమైనాడు. కాలినడక ప్రయాణం. మార్గమధ్యంలో ఎవరో నల్గురు ఆగంతకులు పరిచయమై వారు తాము కూడా దత్త భక్తులమనిన్నీ, తామును కురువపురమునకే ప్రయాణమవు చున్నామని తెలిపి వల్లభేశునితో గూడ ప్రయాణమైరి. వల్లభేశుడు వారి మాటలు నిజమని నమ్మి తాను శ్రీ స్వామిని ఆశ్రయించి పొందిన లాభమున్నూ తన జీవితాశయమును వారితో చెప్పుచు దారిలో నడచెను. వల్లభేశుని వద్ద గల ధన విషయమును పసిగట్టి, తెలివిగా అతనితో సఖ్యము చేసి తోటి ప్రయాణికుల వలె నటించి, అతనిని వంచించిరి. వారంతా కలసి ప్రయాణము చేయుచు కురుంగడ్డకు 6 క్రోసుల దూరమునకు చేరగా రాత్రి అయినది. ఆ రాత్రి ఒక అడవి ప్రాంతమున విశ్రాంతి తీసుకొనిరి. ప్రయాణబడలిక చేత వల్లభేశుడు ఆదమరచి నిద్ర పోయాడు. కుట్ర కుతంత్రములతో అతనిని చేరిన తోటి వారికి మాత్రం నిద్ర ఎక్కడిది? వారంతా ఇటువంటి అవకాశముకొరకు ఎదురు చూచుచున్నారు. తక్షణమే వారంతా ఏకమై వల్లభేశుడి శిరస్సు

ఖండించారు. నిరంతర శ్రీపాద నామస్మరణ చేయు వల్లభేశుడు ఆ మరణ సమయంలో తనకు తెలియకుండానే "శ్రీపాదా! శ్రీవల్లభా!" అని గొంతెత్తి అరచినాడు. వెంటనే ప్రహ్లాదుని కాపాడుటకు ఆవిర్భవించిన నారసింహునివలె, గజరక్షణము చేయు శ్రీహరివలె అచ్చట త్రిశూల ధారియైన శ్రీపాదులవారు ప్రత్యక్షమైనారు. నల్గురిలో ముగ్గురిని శ్రీ స్వామి తమ త్రిశూలముతో సంహరించినారు. నాల్గవ వ్యక్తిని సంహరించులోగా అతను శ్రీ స్వామివారి పాదములపైబడి ఇలా ప్రార్థించాడు.

"స్వామీ! నేను వీరితో చేరిన మాట వాస్తవమే! కాని స్వతహాగా నేను చెడువర్తనము కల్గిన వాడిని గాను. మీరు సర్వము తెల్సినవారు. అందువలన దయవుంచి రక్షించిచ వలసినది" అని ప్రార్థించినాడు.

సర్వహృదయాంతర వర్తియైన శ్రీస్వామి అతనిని మన్నించి అతని చేతికి కొద్దిగా భస్మము నిచ్చి తలను మొండెమునకు అతికించమని, ఆ భస్మమును వల్లభేశుని నుదిటికి పెట్టి శరీరముపై జల్లమని చెప్పి, ఆయన తమ అమృత దృష్టిని ఒక్కసారి వల్లభేశునిపై సారించినారు. వల్లభేశుని ప్రాణవాయువులు తిరిగి అతని శరీరమందు ప్రవేశించిన వెంటనే శ్రీ స్వామి అంతర్ధానమయ్యారు.

వెంటనే మెలకువ వచ్చిన వల్లభేశుడు లేచి చుట్టూ కలయజూచి, ముగ్గురు మరణించి వుండటాన్ని చూచి, భయపడి ఏమి జరిగినదని అచ్చట వున్న తన తోటి ప్రయాణికుడ్ని ప్రశ్నించాడు. వల్లభేశుని ప్రశ్నవినిన అతను ఒక్కసారి శ్రీ స్వామి ప్రత్యక్షమైన ప్రదేశాన్ని చూడగా అచ్చట శ్రీ స్వామివారు అంతర్ధానమైనారు.

"మిత్రమా! ఇప్పుడొక అద్భుతం జరిగింది. మనతో వచ్చిన వారు నిజానికి ప్రయాణికులు కారు. వారు దారి దొంగలు. నిన్ను సంహరించి వారు పారిపోయే ప్రయత్నంలో వుండగా పరమశివునివలె త్రిశూలధారియైన ఒక యతి ప్రత్యక్షమై వారిని సంహరించి నా చేతికి విభూధినిచ్చి నీ తలను మొండెమును అతికించమని, ఆపై ఈ విభూధిని అందుంచమని చెప్పి నిన్ను జీవించునట్లు చేసి అదృశ్యులయ్యారు" అని తను చూచిన శ్రీ స్వామివారి రూపాన్ని మననం చేసుకొంటూ తనను తాను మర్చిపోసాగాడు. వల్లభేశుడు తనను కాపాడింది సాక్షాత్ శ్రీపాద స్వామియేనని తలచి తనకు స్వామిదర్శన భాగ్యము కలుగలేదని చింతిస్తూ ఈ విధంగా అనుకోసాగాడు. తన వివాహ సమయమందు శ్రీపాదుల వారు తన భార్యకు "నీ మాంగల్యమునకు సదారక్ష" అన్న వారి ఆశీర్వాదమును నిలబెట్టుకున్నారు. గ్రహదోష ఫలము కర్మను అనుభవింపచేసి, గురుభక్తులకు

గ్రహపీడ వుండదని నిరూపించుటకుగాను నన్ను పునర్జీవితుడ్ని చేశారు. ఆహా! సద్గురువుల కృప అపారము గదా! ఏమి నా పుణ్యఫలము? దత్త స్వరూపులైన శ్రీపాదులవారు నన్ను పరిపూర్ణముగా అనుగ్రహించినారు. శ్రీచరణులవారి ఆశీర్వాద ఫలముగా అనఘాలక్ష్మి అనుగ్రహమువలన నేను సంపన్నుడనైనాను. అర్థాయుష్కుడనైన నన్ను కాపాడి పూర్ణాయుష్కుడిగా చేసినారు. అని ఎన్నో విధములుగా తలచి శ్రీ స్వామి వారిని పరిపరి విధములుగా స్తోత్రములు చేసి కురువపురమునకు ప్రయాణమైనాడు. తనతోబాటు తోటి యాత్రికుడు కూడా బయల్దేరినాడు.

ఇరువురు కురువపురమును చేరుకున్నారు. శ్రీపాద శ్రీవల్లభుల అంతర్ధాన విషయం విని తనెంత అదృష్టవంతుడోయని తలచి, శ్రీ స్వామివారు అంతర్ధానమైన పిదపను ఆయన ప్రత్యక్షమై తనను కాపాడినారని తెల్సుకుని మరింత భక్తితో కృష్ణానదీ స్నానమాచరించి పంచదేవపహాడ్ గ్రామ పెద్దలయిన శ్రీరామాచారి వారిని కలసి తన వాగ్దానము ప్రకారము 1000 మందికి గాక 4000 మందికి సమారాధన జరిపించినాడు.

శ్రీవల్లభేశుని రక్షించిన లీలను వినిన పసుపల, పంచదేవ్‌పహాడ్ గ్రామస్థులు ఆశ్చర్యపోయి శ్రీ స్వామివారు అంతర్ధాన సమయమందు వక్కాణించిన విధముగా "ఎవరైనను ఆర్తితో తలచిన తక్షణమే ప్రత్యక్షమై కాపాడెదను" అనే శ్రీపాదస్వామి వాగ్దానమెంత సత్యమో!" అని వేనోళ్ళ శ్లాఘించినారు.

అంతేగాక రజకునకు రాజ్యసంపదలనిచ్చుటయేగాక ఉత్తర జన్మలో తమ దర్శనం శ్రీ నరసింహ సరస్వతిస్వామి రూపంగా ఇచ్చెదనని వాగ్దానము చేసినట్లున్నూ, అంబికా మాత గర్భమందు జన్మించగలరనియున్నూ వల్లభేశునకు వారు చెప్పు మహిమలను బట్టి తెలిసెను. వల్లభేశుడు శ్రీపాద శ్రీవల్లభస్వామివారి మహిమలను విని తనకు కూడ ఉత్తర జన్మమునందు శ్రీ నరసింహసరస్వతి స్వామివారి దర్శనము, సేవ లభించాలని అక్కడనే ప్రార్థన చేసికొని తిరిగి పోయినాడు.

ఆయనయే మరు జన్మలో భాస్కర శర్మయనుపేర శ్రీగురుని సన్నిధికి చేరి అనేకమందిచేత నిందలు, అవమానములు భరించెను. సద్గురు కృపాకటాక్షమువలన ముగ్గురికి సరిపడు వంటకముతో నాలుగు వేల మందికి సమారాధనము చేసి తరించెను. శ్రీపాద శ్రీవల్లభస్వామివారు నిత్య సత్య స్వరూపులనుటకు ఇదియు నిదర్శనమే.

శ్రీపాదస్వామి అపూర్వ లీలలు ఇప్పటికి ఎంతోమంది జనులకు అనుభవ పూర్వకముగా

జరుగుచున్నవి. ఈ దర్బారు ప్రదేశమునందు శ్రీ స్వామి వారి వాగ్దాన ప్రకారము అనేకమైన లీలలు దుష్కర్మ నివారణ, వారి వారి మనోరథములు తీరుట ఇత్యాదివి నేటికిని జరుగుచున్నవి. అర్హులైన భక్తులకు శ్రీ స్వామివారి దర్శన భాగ్యమునుకూడా కల్గుచున్నది. వారి ఆదేశ ప్రకారము ఈ రోజున (ఇది) శ్రీక్షేత్ర శ్రీవల్లభాపురము అను క్షేత్రముగా ప్రాచుర్యము పొంది దత్త భక్తుల కోర్కెలను తీర్చుచున్నది.

వల్లభేశుడిని రక్షించిన ప్రదేశము అటవీ ప్రాంతమునగల కొండగుట్ట. శ్రీపాదులవారు ఆ కొండపైన వధించబడిన వల్లభేశుని రక్షించుటకుగాను అచ్చట ప్రత్యక్షమై అతనిని కాపాడిన పిదప కొండ కింద గల గుహ యందు ప్రవేశించి అదృశ్యులైరి. ఆ గుహలో రాతిపై వారి ఆకారం ఏర్పడింది. అది ఒక దత్త క్షేత్రంగా పేరొందినది. తదుపరి దానికి దగ్గరలో “మంథెనగోడ్” అనే గ్రామము ఏర్పడినది.

ప్రస్తుతము ఇది కూడా ఒక దత్త క్షేత్రమే! అని బాబాగారు వివరించినారు.

తర్వాత శ్రీ బాబావారు ఇలా చెప్పారు.

సాధకులారా! సాధకునికి ఏ సమయంలోనైనా సాధనలో విఘాతాలు కలుగవచ్చును. అసలు విఘ్నాలంటే ఏమిటో, అవి ఎందుకు కలుగుతాయో గూడ సాధకుడు ఆవశ్యం తెలుసుకోవాలి. విఘ్నములు ఎవరో కలిగించేవి కాదు. సాధకుడైన వాడు తనలోని అవగుణములను తొలగించుకొంటే విఘ్నములు నివారించబడుతాయి. కానీ అవగుణములు తనలో వున్నాయని తెలిస్తేనే గదా వాటిని తొలగించుకొనే ప్రయత్నం చేయగలిగేది. మానవుడై పుట్టినా ముముక్షుత్వం కావాలనుకొని నిశ్చయించుకొని ప్రయత్నించే వానికి సద్గురుసమాగమం, సేవ తప్పనిసరిగా కావాలి. గురుసేవ చేస్తూ వుండే సమయంలోనే అగ్నిసాన్నిధ్యం చేత (బంగారమును కొలిమిలో కరిగించు విధంగా) సువర్ణం మెరుగు పెట్టబడినట్లు సాధకుడు క్రమంగా తనలోని అవగుణాలను తొలగించుకోవాలి. నిర్మలుడు కావాలి. అటువంటి అవగుణాలు ఒక లక్ష ఒకటి (1,00,001) పేర్కొన్నారు మన పూర్వ ఋషులు. వాటిలో ముఖ్యంగా కొన్నింటిని చెప్తాను.

అనవసర ప్రసంగములు చేయుట, ఏ వార్తైనా విన్నప్పుడు స్థిరత్వం లేకుండా దిగ్భ్రాంతి చూపడం, ఊరికినే ఉలిక్కిపడడం, ఇతరులలోని లోపాలను వెతికి బహిర్గతము చేయుట, తన లోపాలను తెలియకపోవుట, ఏదైనా వార్త వినగానే మూర్ఛనొందుట, ఇతరులను అనుకరణ చేసి వెక్కిరించుట, అపహాస్యం చేయాలని భావించుట, చౌకబారు విమర్శలు చేయుట, పరుష వాక్యాలు

మాట్లాడుట, వ్యంగ్యధోరణిలో సంభాషణ, ఏ సంకల్పమైనా దృఢముగా చేయకుండట, అనుమానించుట, తలచిన కార్యము నెరవేరుతుందో లేదోనని సందేహించుట ఇటువంటివన్నీ సాధకునిలో వుండకూడని గుణాలు. కానీ వీటిని తనలో ఉండకూడని గుణాలుగా గుర్తించలేడు. ఇవి అవలక్షణాలుగా తాను భావించడు. ఇది గురువుల చేత విశదీకరింపబడినప్పుడు మంచి సాధకుడైతే తనలో తాను విచారించుకొని ఇటువంటి అవలక్షణాలను విడిచిపెట్టేటందుకు ప్రయత్నం చేస్తాడు. ఈ విషయం తెలియనప్పుడు అజ్ఞానం చేత తెలియలేదనీ, తెలిసిన తర్వాత తనకీ జ్ఞానం కలిగిందనీ చెప్తాడు. ఆ జ్ఞాన స్వరూపమే మహాగణపతి. జ్ఞాన ప్రకాశంలో అజ్ఞానం లయం అవుతుంది. సూర్యోదయంతో చీకటి తొలగుతుందంటారు. అది తొలిగేటందుకు వేరుగా స్థలమెక్కడుంది. వెలుగులోనే లయమైపోతుంది. అదే విధంగానే జ్ఞానంలో అజ్ఞానం లయమవుతుంది. ఈ విషయాలు తెలుసుకొన్న సాధకుడు ఆచరణలో పెట్టడానికి సిద్ధమైతే విఘ్నాలు తొలుగుతాయి. మనసు ఎక్కడ వుంటే శరీరం అక్కడ వున్నట్లే. కాబట్టి మనసులోని అజ్ఞానం తొలగి జ్ఞానవంతుడైతే శరీరం గూడ జ్ఞానవంతం కాగలదు. ఈ ప్రక్రియ గురువనుగ్రహంతోనే జరగాలి. ఆ గురు స్వరూపమే గణేశుడు.

**శ్లో॥ గుకారంధకారస్య - రుకారస్తన్నిరోధకాత్।**
**అంధకారనిరోధత్వాత్ - గురురిత్యభిధీయతే ॥ (గు.గీ.)**

**శ్లో॥ తత్విద్ధిప్రణిపాతేన - పరిప్రశ్నేన సేవయా।**
**ఉపదేక్ష్యంతి తేజ్ఞానం - జ్ఞానినస్తత్త్వదర్శినః ॥ (భ.గీ.)**

గీతాచార్యుని బోధలో గూడ తత్త్వదర్శియైన సద్గురుని వరించి, సేవించి, జ్ఞానబోధను పొంది అజ్ఞానాన్ని దూరం చేసుకో అర్జునా! అని చెప్పబడినది. గురూపదేశము తీసుకోవాలి. అనగా ఉపన్యాసం వినాలి. ఉపవాసం చేయాలి. "ఉప" అనే పదానికి అనేక అర్థాలున్నాయి. కొన్ని, మరియొక, సమీప, తోడు, సహాయం, విభాగము, మరికొన్ని, మరల అని నానార్థాలు కలవు. న్యాసమనగా వదలుట, విడుదల చేయుట, వెలువరించుట యని అర్థాలు వర్తించుతాయి. "ఉపన్యాసము" ద్వారా కొన్ని విషయములు సద్గురువు వెలువరించును. మనసుపెట్టి వినువాడు వానిని స్వీకరించినచో విన్నటువంటి వానిలో అతనికి కొన్ని మనసుకు పట్టుబడును. అవియే "ఉపదేశము"లుగా నెంచి ఆచరణలో పెట్టినచో తప్పక తానున్న స్థితి నుండి ఉన్నతమైన స్థితి కలుగును. ఉపదేశము అనగా మరియొక ప్రదేశము (స్థితి). ఈ విధంగా సాధకుని స్థితి ఉత్తమ స్థాయిలో జరుగును.

అందుచేత శ్రవణము ముఖ్య సాధనము. విన్నదానిని మననము చేయుచూ ఆచరణము చేసినచో సద్విషయము చెప్పిన గురువు నిరంతర మననములో వున్నందున ఆయన సన్నిధిని మనసులోనే అనుభవమునకు వచ్చును. దీనిపేరే "ఉపవాసము" అని తెలుసుకొనండి. అనగా సమీపమందు నివాసము అని బోధించినారు.

**అంబిక పునర్జన్మ:**

జీవితాంతము అంబికా మాత ప్రదోష కాలంలో శివపూజ చేస్తూనే వుంది. ఆమె ఈ జీవితంలో సాధించాలనుకొన్నది (1) భగవంతుని దయ చేత తనకు దీర్ఘాయుష్మంతుడైన కొడుకు కావాలనుకొన్నది. అట్లే కుమారుడు కలిగాడు (2) ఓర్పుతో భగవంతుని మీద భారం వేసి జీవితంలో ఎదురైన కష్టాలను అనుభవించింది. తన నిరంతర భగవన్నామ స్మరణతో భగవత్కృపతో సద్గురు దర్శనం పొందింది. తద్వారా తన పుత్రుని విద్యావంతునిగా చూడగలిగింది. వివాహితునిగా చేసి వంశాభివృద్ధిని చూసింది. కొందరు తమ కష్టాలను సద్గురువుల సమక్షంలో చెప్పుకోవడానికి గూడ సంకోచిస్తారు. అలా కాకుండా అంబికా మాత తన కొచ్చిన ఇక్కట్లను శ్రీపాద స్వామివారికి ఏకరువుపెట్టి నివారణ చేయమని ప్రార్థించినది. ఆయన మనసు కరిగే విధంగా ఆయన కరుణామయ హృదయం ద్రవించేలాగ వేడుకొన్నది. కావుననే శ్రీపాద స్వామి వారు ఆమెకు రెండు వరాలు ఇచ్చారు. ఈ జన్మలో కొడుకు విద్వాంసుడయ్యేటట్లున్నూ, వచ్చే జన్మలో తన వంటి మహాజ్ఞాని పుత్రుడుగా పుట్టేటట్లుగానూ వరాలనిచ్చారు. శ్రీ స్వామి వంటి మహాపురుషులకు జన్మనివ్వడమంటే ఎంత పుణ్యం సంపాదించాలో! ఎంత శ్రద్ధతో భగవదారాధన చేయాలో దీనిని బట్టి మనం అర్థం చేసుకోవాలి. అందువలననే చేసుకొన్నవారికి చేసుకొన్నంత మహాదేవ" అనే నానుడి ఏర్పడినది. ఆమె చివరి రోజు అనగా ప్రాణాలు పోయే రోజు గూడ ప్రదోష సమయంలో శివ పూజ చేసింది. గురు వాక్యాన్ని తు.చ. తప్పక ఆచరించినందుకు సద్గురుడు సంప్రీతుడైనాడు. చివరి ఘడియలలో "శ్రీపాద శ్రీవల్లభా" అంటూ ప్రాణాలు వదిలింది. మరుసటి జన్మలో మహారాష్ట్రలోని కారంజా, నగరంలో ఒక సద్బ్రాహ్మణ వంశంలో పుట్టింది. మాధవశర్మయను సదాచార సంపన్నుడిని భర్తగా పొందినది. శ్రీ నరసింహ సరస్వతి స్వామికి తల్లి అయ్యింది. జన్మాంతంలో ముక్తి పొందినది.

శ్రీపాద స్వామివారు నిత్య సత్యస్వరూపుడని శ్రీ గురుచరిత్ర ద్వారా వెల్లడియగుచునే యున్నది. రజక సేవకుడు మరుజన్మలో యవన రాజై శ్రీగురుని దర్శించి ఆయనే శ్రీపాద శ్రీవల్లభులని అందరికీ తెలిపినాడు. అప్పటివరకు శ్రీ నరసింహ సరస్వతిస్వామివారి పూర్వజన్మ వృత్తాంతం

ఎవరికీ తెలియదు. శ్రీ గురుడు శ్రీశైలంలో పాతాళగంగలో పుష్పాసనంపై కదళీవనానికి వెళ్ళిన తర్వాత అక్కడకు చేరిన యవనరాజు, సాయందేవుడు, నందిశర్మ, నరహరిశర్మ, సిద్ధ సరస్వతి మరియు శ్రీగురునిచే ఆజ్ఞను పొంది తీర్థాటనముచేసి తిరిగి వచ్చిన సాధక భక్త బృందమును కలుపుకొని అందరూ శ్రీక్షేత్ర కురువపురం చేరుకొని శ్రీపాదవల్లభుని తపోస్థానమును గుర్తించినారు. యవనరాజు సహాయంతో మందిరం నిర్మించి కొందరు సాధన చేస్తూ శ్రీ స్వామివారిని ధ్యానిస్తూ, సేవిస్తూ అక్కడనే వుండిపోగా కొందరు తిరిగిపోయినారు. అప్పటికి శ్రీ స్వామివారు అదృశ్యమై ఒక శతాబ్దం గడిచిపోయి వారి లీలలన్నీ మరుగునపడినాయి. యవనరాజు ద్వారా బహిర్గతమైన అద్భుత లీలలు కొన్ని మాత్రం తెలుసుకొని కన్నడ భాషలో సాయందేవుడు గురుచరిత్రను ఏర్చి కూర్చి భక్తలోకానికి అందించాడు. ఆ సాయం దేవుడే శ్రీపాద శ్రీవల్లభుని భక్తితో కొలిచిన గోకర్ణవాసి "గోవిందభట్టు". అదే గుహ చరిత్రను సాయందేవుని మునిమనుమడైన గంగాధర సరస్వతికి సిద్ధ సరస్వతి అనే శ్రీగురుని శిష్యుడు వినిపిస్తారు. అద్దానినే ఆయన సిద్దనామధారక సంవాద రూపంగా మరాఠీలో లిఖించినాడు.

తదుపరి శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామివారు శ్రీదత్తుని ఆజ్ఞ మేరకు సంస్కృతంలో శ్రీ గురుచరిత్రను దర్శించి, విపులంగా వ్రాయటం జరిగింది. ఇటీవలికాలంలో అది అన్ని భాషలలో వెలువడింది.

తర్వాతనే వారు శ్రీక్షేత్ర కురువపుర దర్శనం ఎందరో మహాత్ములు చేసుకొంటున్నారని తెలిసి వారు కూడ వచ్చి దర్శించినట్లు వారి చరిత్ర ద్వారా తెలియవస్తున్నది.

శ్రీపాదులవారిని సేవించిన శంకరభట్టు రచించిన శ్రీపాద లీలలు (సంస్కృతం) గంధర్వులు కొనిపోయినారు. అందులోని కొన్ని అంశాలు అందినంతవరకు మల్లాది గోవింద దీక్షితులు ప్రచురించారు. ఇప్పుడు మనకు శ్రీ విఠల్‌బాబాగారు తాము దర్శించగా తెలిసినంత వరకు ఈ విధముగా నన్నొక ఉపకరణముగా జేసుకొని లోకంలో ప్రకాశింపజేశారు. బాబాగారి నిర్హేతుక జాయమాన కటాక్ష వీక్షణాలకు పాత్రమైన నా జన్మ ధన్యమైనదని సంభావిస్తూ గురుదేవులు శ్రీ విఠల్‌బాబావారి అరుణారుణ చరణ కమలాలకు హృదయపూర్వక సాష్టాంగదండ ప్రణామాలు సమర్పిస్తున్నాను.

## జన్మ జన్మాంతరములలో గురుసన్నిధి

సద్గురు సన్నిధి లభించుట, వారిని ఆశ్రయించి సేవించుట జన్మ జన్మాంతర పుణ్యఫలమని పెద్దలు చెప్పుచుంటారు మనం వింటాము. కానీ దానిని పొందాలనే దృఢమైన సంకల్పం కలగాలి. ఆశ్రయించాలి. నిలబడాలి. దీనికై పూర్వజన్మ పుణ్యం కావాలి. ఇంతవరకు బాగానేవుంది. వచ్చే జన్మకు ఈ జన్మలో చేసితే దానిఫలం వుంటుందని గూడ నమ్మకం చాలా అవసరం. ఈ విషయం శ్రీపాద శ్రీవల్లభ లీలా వైభవం ద్వారా కొంత అవగాహన అవుచున్నది. గోకర్ణంలో శ్రీపాద శ్రీవల్లభులను సేవించిన గోవిందభట్టు శ్రీ నరసింహసరస్వతి స్వామి(శ్రీగురు) వారి సన్నిధిలో సాయందేవుడుగా తర్వాతి శ్రీ సాయిబాబా వారి సన్నిధిలో అన్నా సాహెబ్ దబోల్కర్ (హేమాద్‌పంత్) గా జన్మించి సద్గురు చరిత్ర రచించి తరించాడు.

అంబికా మాత మరుజన్మలోనే శ్రీగురునికి తల్లియైనది. ఆయన అనుగ్రహంతో కాశీలో ముక్తి పొందింది.

ఆంజనేయశర్మ శ్రీగురుని సన్నిధికి చేరిన నందిశర్మగా జన్మించాడు. గురుసన్నిధిలో కవీశ్వరుడని బిరుదు పొందాడు. స్వామి సమర్థులు అక్కల్‌కోట చేరగా పాండురంగ పురాణిక్‌గా స్వామి సన్నిధిలో సేవించాడు. స్వామివారి లీలలు గానం చేశాడు.

రజకుడు శ్రీగురుని సన్నిధికి యవనరాజుగా చేరి పూర్వజన్మ జ్ఞానం పొందాడు. శ్రీపాదుల వారి లీలలన్నీ అందరికీ తెలియజెప్పాడు. వారి అంతర్ధానం తర్వాత శ్రీశైలం నుండి కురువపురం చేరి అచ్చుట శ్రీపాదులకు మందిర నిర్మాణం చేయించి తాను ఆ క్షేత్రంలోనే నివసిస్తూ శ్రీ సాయిబాబా సన్నిధిలో మహల్సాపతిగా నిలబడ్డాడు. 72 గంటల బాబా సమాధి సమయంలో ధైర్యంగా ఆయన శరీరాన్ని కాపాడియుండకపోతే తర్వాత శ్రీ బాబా లీలలు మనకు లభించేవేకాదు. కాబట్టి అంతటి ధైర్య సాహసాలు ఒక్క జన్మతో పొందేవి కావని తెలుస్తున్నది.

బ్రహ్మచారి నిర్మలానంద శ్రీశైలంలో శ్రీపాద స్వామి వారి సన్నిధిలో వర్తించి, శ్రీగురుని సన్నిధికి త్రివిక్రమానంద భారతిగా చేరినాడు. శ్రీ స్వామి సమర్థుల సన్నిధిలో వామన్ బువాగా చేరి ఆయన లీలలను మరాఠీలో గ్రంథస్థం చేశాడు.

వాసుదేవరావు శ్రీపాదులను ఉపాసించి శ్రీగురు సన్నిధిని మరుజన్మలో నరకేసరి (కల్లేశ్వర భక్తుడు) గా పొందాడు. శ్రీసాయినాధుని సన్నిధికి మాధవరావు దేశ్‌పాండే (శ్యామా) గా చేరి

కొలిచాడు. విశేషం ఏమిటంటే ప్రతి జన్మలోను మొదట వ్యతిరేకించుట, తర్వాత భక్తుడగుట కనబడుతున్నది. తద్వారా ఎవరైనా గురువులను వ్యతిరేకించినా మనం వారి యెడ అనన్యభావన చేయరాదని మనకర్థమవుతున్నది.

వల్లభేశుడు భక్తితో నిరంతర శ్రీపాద నామస్మరణ స్వామి కృపను పొంది చచ్చి బ్రతికాడు. శ్రీగురుని సన్నిధిలో అవమానపరంపరలను ఓర్చుకొన్న భాస్కరశర్మగా చేరి స్వామి అనుగ్రహాన్ని చూరగొన్నాడు. శ్రీసాయిబాబా సన్నిధికి కాకాదీక్షిత్‌గా చేరి ఆ బాబా సేవలోనే తన కావ్యాన్ని గడిపి బాబాలోనే ఐక్యమైనాడు.

సింగన్నదొర శ్రీపాదులను శ్రీశైలంలో కొలిచి వరంపొందాడు. మరుజన్మలో దళితుడుగా శ్రీగురుని చేరాడు. తనను బ్రాహ్మణులలో కలపమని పేచీ పెట్టుకొన్నాడు. శ్రీగురుని దగ్గర వరం పొందాడు. తర్వాతి జన్మలలో పరిశుద్ధుడై గురుసన్నిధికి చేరగలడని. అందుచేతనే శ్రీ సాయిబాబా మూడుసార్లు కబురు చేసి పిలిపించుకొన్నారు నానాసాహెబ్ చందోర్కర్‌ను. ఎందుకు రమ్మన్నావని డెప్యూటీ కలెక్టరు అడగగా శ్రీ బాబా మనయిద్దరికీ మూడు జన్మల బంధము. నిన్ను చూడాలని పిలిపించానంటారు. కానీ ఆయనతో శ్రీ బాబాకేమీ పనిలేదు. సాయిబాబా యొక్క రక్షణ ఆయనకు క్షణక్షణం కావలసియున్నదని చివరకు తెలుసుకొంటాడు. శ్రీ బాబా స్మరణతో బాబా సాయుజ్యాన్ని పొందుతాడు.

దీనినిబట్టి మనమంతా గూడ ఈ లభించిన మానవ జన్మను ఉద్ధరించుకొనే ప్రయత్నం బుద్ధిపూర్వకంగా చేయాలని తెలుస్తున్నది.



# సిద్ధ మంగళ స్తోత్రం

శ్రీమదనంత శ్రీవిభూషిత అప్పల లక్ష్మీనరసింహరాజా ।
జయ విజయీభవ దిగ్విజయీభవ శ్రీమదఖండ శ్రీవిజయీభవ ॥

శ్రీ విద్యాధరి రాధా సురేఖా శ్రీరాఖీధర శ్రీపాదా।
జయ విజయీభవ దిగ్విజయీభవ శ్రీమదఖండ శ్రీవిజయీభవ ॥

మాతాసుమతీ వాత్సల్యామృత పరిపోషిత జయ శ్రీపాదా ।
జయ విజయీభవ దిగ్విజయీభవ శ్రీమదఖండ శ్రీవిజయీభవ ॥

సత్యఋషీశ్వర దుహితానందన బాపనార్యనుత శ్రీచరణా।
జయ విజయీభవ దిగ్విజయీభవ శ్రీమదఖండ శ్రీవిజయీభవ ॥

సవితృకాఠకచయన పుణ్యఫల భరద్వాజ ఋషి గోత్రసంభవా।
జయ విజయీభవ దిగ్విజయీభవ శ్రీమదఖండ శ్రీవిజయీభవ ॥

దోచౌపాతీ దేవ్ లక్ష్మీఘన సంఖ్యాబోధిత శ్రీచరణా ।
జయ విజయీభవ దిగ్విజయీభవ శ్రీమదఖండ శ్రీవిజయీభవ ॥

పుణ్యరూపిణీ రాజమాంబ సుత గర్భపుణ్యఫల సంజాతా।
జయ విజయీభవ దిగ్విజయీభవ శ్రీమదఖండ శ్రీవిజయీభవ ॥

సుమతీనందన నరహరినందన దత్తదేవ ప్రభు శ్రీపాదా ।
జయ విజయీభవ దిగ్విజయీభవ శ్రీమదఖండ శ్రీవిజయీభవ ॥

పీఠికాపుర నిత్యవిహారా మధుమతి దత్తా మంగళరూపా!
జయ విజయీభవ దిగ్విజయీభవ శ్రీమదఖండ శ్రీవిజయీభవ ॥

శ్రీదత్తశ్శరణం మమ; శ్రీపాదరాజం శరణం ప్రపద్యే
దిగంబరా! దిగంబరా! శ్రీపాదవల్లభ దిగంబరా!!